# Devaraju Maharaju Rachanalu – Samagra Parisilana

(A thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy in Telugu)


**Researcher**

**Dheeravath Lakshman**

**Regd. No.14HTPH09**

**Supervisor**

**Prof. Pillalamarri Ramulu**

**Department of Telugu**

**School of Humanities**

**University of Hyderabad**

**Hyderabad – 500046**

**Telangana**



**December, 2020**

# దేవరాజు మహారాజు రచనలు – సమగ్ర పరిశీలన

(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)

Dēvarāju Mahārāju Rachanalu – Samagra Pariśīlana


పరిశోధన

ధీరావత్ లక్ష్మణ్

Regd. No.14HTPH09

పర్యవేక్షణ

ఆచార్య పిల్లలమర్రి రాములు

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్ – 500 046

తెలంగాణ


డిసెంబర్, 2020

# DECLARATION

I, Dheeravath Lakshman hereby declare that this thesis entitled "Devaraju Maharaju Rachanalu-Samagra Parisilana" submitted by me under the guidance and supervision of Prof. Pillalamarri Ramulu is a bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/INFLIBNET.

Date: 15/12/2020 DHEERAVATH LAKSHMAN

Place: Hyderabad Registration No.14HTPH09

## CERTIFICATE

This is to certify that the thesis entitled **“Devaraju Maharaju Rachanalu-Samagra Parisilana”** submitted by **Mr. Dheeravath Lakshman,** bearing **Regd. No. 14HTPH09** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bona fide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-1 of the thesis.

1. **“Devaraju Maharaju ‘Kadupu Kota’ Kathasamputi Vislesana”** (ISSN 2456-4702). Pg.No.60 - 61. “Bhava Veena” (International Journal of Telugu Literary, Culture & Language Study – November, 2019), Vol.:16, Issue No.11 (1). Edited by Pitta Santhi. Edited, printed, published, owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur – 522 002.

2. **“Devaraju Maharaju ‘Manisi Kathalu’ Vislesana”** (ISSN 2456-4702). Pg. No.8-9. “Bhava Veena” (International Journal of Telugu Literary, Culture & Language Study – January, 2020), Vol.:17, Issue No.1 (1). Edited by Pitta Santhi. Edited, printed, published, owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur – 522 002.

**A n d**

**B. Presented in the following conferences:**
(Issues presented in the following papers have been discussed elaborately in the thesis.)

1. Presented a paper titled **“Devaraju Maharaju Kathalu Vastu Vislesana”** in the National Seminar on “Adhunika Telangana Katha Sahityam Vastu Rupa Vikasalu”, conducted by Badruka Commerce & Arts College, in collaboration with Telangana Sahitya Academy at Badruka College, Kachiguda, Hyderabad on 29th February, 2020.

2. Presented a paper titled **“Devaraju Maharaju Kavitvam – Manavata Vadam”** in the National Seminar on “Adhunika Telugu, Sanskruta Vacana Kavita Rupalu”, conducted by Telugu mariyu Pracya Bhasa Vibhagam, Acharya Nagarjuna Visvavidyalayam in collaboration with the University Grants Commission during March 13 -14, 2020.

Further, the scholar has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D. Degree.

| Sl. No. | Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|---|
| 1. | HT700 | Research Methodology | 4.00 | PASS (B) |
| 2. | HT701 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3. | HT702 | Studies in Literature | 4.00 | PASS (A) |
| 4. | HT703 | Studies in Specialized Area | 4.00 | PASS (A) |

Prof. Pillalamarri Ramulu
**Research Supervisor**

Prof. G. Aruna Kumari
**Head, Telugu**

Prof. S. Sarat Jyothsna Rani
**Dean, Humanities**

## విషయసూచిక

**కృతజ్ఞతలు**

**ముందు మాట**

| | | |
|---|---|---|
| **అధ్యాయం – 1: దేవరాజు మహారాజు – కవి జీవిత విశేషాలు** | | **1 –13** |
| 1.1. | కవి పరిచయం | 1 |
| 1.2. | బాల్యం | 3 |
| 1.3. | విద్యాభ్యాసం | 3 |
| 1.4. | వివాహం, సంతానం | 4 |
| 1.5. | ఉద్యోగ ప్రస్థానం | 4 |
| 1.6. | సాహిత్య ప్రవేశం | 5 |
| 1.7. | దేవరాజు మహారాజు వ్యక్తిత్వం | 5 |
| 1.8. | వృత్తి – ప్రవృత్తి | 6 |
| 1.9. | అనువాద కృషి | 7 |
| 1.10. | కథా రచయితగా దేవరాజు మహారాజు | 7 |
| 1.11. | నాటక కర్తగా దేవరాజు మహారాజు | 8 |
| 1.12. | ప్రముఖుల ప్రశంసలు | 9 |
| 1.13. | దేవరాజు మహారాజును ప్రభావితం చేసిన పుస్తకాలు | 10 |
| 1.14. | అవార్డులు | 12 |
| **అధ్యాయం – 2: దేవరాజు మహారాజు రచనలు – పరిచయం** | | **14 – 130** |
| 2.1. | కవిత్వం | 16 |
| | 2.1.1. గుడిసె గుండె (1974) | 16 |
| | 2.1.2. గాయపడ్డ ఉదయం (1990) | 21 |
| | 2.1.3. కవితా భారతి (1991) | 24 |
| | 2.1.4. బయిరూపులోల్లం (1991) | 30 |
| | 2.1.5. మట్టి గుండె చప్పుళ్ళు (1996) | 31 |
| | 2.1.6. రాజముద్ర (2007) | 36 |

2.1.7. నీకు నాకు మధ్య ఒక రంగుల నది (2009) 38
2.1.8. మధుశాల (2010) 39
2.1.9. జీవితమే ఒక కవిత (2011) 43
2.1.10. కాలాన్ని వెనకేసిన మనిషి (2014) 44
2.2. కథలు 46
2.2.1. కడుపు కోత (1977) 46
2.2.2. పాలు ఎర్రబడ్డాయ్ (1991) 48
2.2.3. దేవరాజు మహారాజు కథలు (1993) 51
2.2.4. మనిషి కథలు (1993) 59
2.2.5. డాక్యుమెంటరీ స్టోరీస్ (1993) 61
2.2.6. అపూర్వ జానపద కథలు (2011) 63
2.2.7. భారతీయ కథా ప్రతిబింబం (2014) 67
2.3. నవల 70
2.3.1. మంచి ముత్యం (2008) 70
2.4. నాటకాలు 70
2.4.1. మూఢనమ్మకాల్ని వదిలిద్దాం (నాటిక సంపుటి) (2006) 70
2.4.2. లైఫ్ టానిక్ (2007) 71
2.5. **వ్యాస రచనలు** 71
2.5.1. ఆధునిక యుగంలో జానపద సాహిత్యం (1987) 71
2.5.2. స్మృతి సుగంధం (2008) (సాహితీవేత్తల పరిచయాలు) 73
2.5.3. స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం (2009) 75
2.5.4. ఆత్మ నుంచి అక్షరానికి (2010) 77
2.5.5. కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు (2014) 79
2.5.6. కొన్ని కలాలు – కొన్ని సమయాలు (2015) 86
2.6. సైన్స్ రచనలు 94
2.6.1. మూఢనమ్మకాలు – సైన్స్ (1991) 94

2.6.2. భారతీయ వైజ్ఞానిక వికాసం (2006) 97
2.6.3. విజ్ఞానపథంలో విజయ ఘట్టాలు (2010) 99
2.6.4. సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ (2015) 100
2.6.5. మానవ వాదం జీవన నినాదం (2017) 103
2.6.5.1. మనిషి – దేవుడు – సైన్స్ 103
2.6.5.1.1. మనిషి 103
2.6.5.1.2. దేవుడు 105
2.6.5.1.3. సైన్సు 107
2.6.6. నువ్వేమిటో నీ ఆహారం చెబుతుంది (2018) 108
2.6.7. నేనంటే ఏమిటి? (2019) 111
2.7. సినిమా 112
2.7.1. పథేర్ పాంచాలి (సత్యజిత్ రే సినిమా స్క్రిప్టు) (2009) 112
2.8. ఇతర రచనలు 112
2.8.1. భారతీయ వారసత్వం – సంస్కృతి విజ్ఞాన నాగరికతలు (2006) 112
2.8.1.1. హరప్పా నాగరికత 112
2.8.1.2. వైదిక సంస్కృతి 113
2.8.1.3. జైన, బౌద్ధ మతాలు 114
2.8.1.4 మౌర్య సామ్రాజ్యం 116
2.8.1.5. గుప్తుల యుగం 117
2.8.1.6. శాతవాహనులు 118
2.8.1.7 పల్లవులు 119
2.8.1.8 చోళులు 119
2.8.1.9. భారతదేశ సంస్కృతిపై ఇస్లాం మత ప్రభావం 120
2.8.1.10. విజయనగర సామ్రాజ్యం 121
2.8.2. తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు (2008) 123

**అధ్యాయం – 3: దేవరాజు మహారాజు రచనలు – వస్తు విశ్లేషణ** **131 – 186**

3.1. వస్తువు 131

3.2. కవిత్వం 132

3.3. కవిత్వంపై ప్రముఖుల వ్యాఖ్యలు (కవిత్వం నిర్వచనాలు) 132

3.4. కవిత్వం వస్తు పరిచయం 132

3.5. కవిత్వం – వస్తు విశ్లేషణ 133

3.5.1. స్మృతి 133

3.5.2. విద్యారంగం 135

3.5.3. నగర జీవిత చిత్రణ 137

3.5.4. విప్లవం 138

3.5.5. ప్రకృతి 142

3.5.6. దేశభక్తి 143

3.5.7. పల్లె జీవిత చిత్రణ 144

3.5.8. సామాజికం 145

3.5.9 రాజకీయం 150

3.5.10. స్త్రీవాదం 155

3.5.11. మానవతావాదం 158

3.6. కథ 160

3.7. కథా వస్తువు 162

3.8. ఎత్తుగడ 164

3.9. కథలు – వస్తు విశ్లేషణ 164

3.9.1. విద్యారంగం 164

3.9.2. రాజకీయం 165

3.9.3. కుటుంబ వ్యవస్థ 167

3.9.4. పర్యావరణ కథలు 167

3.9.5. ఆర్థిక సంబంధ కథలు 168

3.9.6. మానవ సంబంధ కథలు 168

| | | |
|---|---|---|
| 3.9.7. | అవినీతి కథ | 169 |
| 3.10. | నవలా వస్తువిశ్లేషణ | 170 |
| 3.10.1. | మంచి ముత్యం | 170 |
| 3.11. | నాటకం – వస్తు విశ్లేషణ | 171 |
| 3.11.1. | మూఢ నమ్మకాల్ని వదిలిద్దాం | 171 |
| 3.11.2. | లైఫ్ టానిక్ విశ్లేషణ | 177 |
| 3.12. | మూఢ నమ్మకాలు – సైన్స్, విశ్లేషణ | 179 |
| 3.13. | మానవ వాదం జీవన నినాదం – విశ్లేషణ | 180 |
| 3.14. | సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ – విశ్లేషణ | 184 |
| **అధ్యాయం – 4: దేవరాజు మహారాజు రచనలు – శిల్పం** | | **187 – 251** |
| 4.1. | శిల్పం | 187 |
| 4.2. | కవితా శిల్పం | 189 |
| 4.2.1. | భావ వైచిత్రి కవితలు | 191 |
| 4.2.2. | ప్రతీక వైచిత్రి కవితలు | 194 |
| 4.2.3. | వ్యక్తీకరణ వైచిత్రి కవితలు | 197 |
| 4.2.4. | శబ్ద వైచిత్రి కవితలు | 198 |
| 4.2.5. | ఆత్మాశ్రయ రీతి కవితలు | 200 |
| 4.2.6. | చైతన్య ప్రబోధ కవితలు | 201 |
| 4.2.7. | రూపవాద కవితలు | 203 |
| 4.2.8. | అలంకార ప్రయోగం | 206 |
| 4.2.9. | పద ప్రయోగం | 210 |
| 4.2.9.1. | ఆంగ్ల పదాలు | 211 |
| 4.2.9.2. | ఉర్దూ పదాలు | 212 |
| 4.2.9.3. | పోర్చుగీసు పదాలు | 212 |
| 4.2.9.4. | తుర్కి పదాలు | 212 |
| 4.2.9.5. | పారసిక పదాలు | 212 |
| 4.2.9.6. | పర్షియన్, అరబిక్ పదాలు | 212 |

4.2.10. ప్రాసల ప్రాభవం 212

4.2.11. మాండలిక పదాలు 218

4.3. కథా శిల్పం 220

4.3.1. దేవరాజు మహారాజు కథలు పాత్రచిత్రణ 220

4.3.2. పాత్ర చిత్రణ నిర్వచనాలు 220

4.3.3. పాత్రలు 221

4.3.3.1. రాములమ్మ (అంతరం కథ) 221

4.3.3.2. వెంకట్రాములు (ఓటు విలువ కథ) 222

4.3.3.3. మల్లేశు (పేరులేని కథ) 223

4.3.3.4. పోశాలు (పొడవని పొద్దు కథ) 224

4.3.3.5. విశ్వనాథం (బతుకు ఫ్యాను కథ) 224

4.3.3.6. యాదవరెడ్డి (జీవిత పోరాటం కథ) 225

4.3.3.7. సిద్ధార్థ (ఓటరు శరణం గచ్ఛామి కథ) 225

4.3.3.8. మల్లమ్మ (పాలు ఎర్రబడ్డాయి) 225

4.4. నవలా శిల్పం 226

4.4.1. నవల పద ఆవిర్భావం 226

4.4.2. నవల నిర్వచనం 227

4.4.3. సాహిత్యం – నవల 227

4.4.4. నవల పాత్రచిత్రణ – నిర్వచనాలు 228

4.4.5. మంచి ముత్యం 229

4.4.6. పాత్రలు 229

4.4.6.1. కినో 229

4.5. నాటక శిల్పం 230

4.5.1. నాటకం నిర్వచనాలు 230

4.5.2. లైఫ్ టానిక్ 230

4.5.3. నాటకం పాత్ర చిత్రణ 232

4.5.4. పాత్రలు 233

| | | |
|---|---|---|
| 4.5.4.1. | రంగారావు (లైఫ్ టానిక్) | 233 |
| 4.6. | అనువాద శిల్పం | 233 |
| 4.6.1. | అనువాద యుగం | 235 |
| 4.6.2. | అనువాద ప్రపంచంలో కవిత్వానువాదం | 236 |
| 4.6.3. | నీకు నాకు మధ్య ఒక రంగుల నది (2009) | 240 |
| 4.6.4. | విశ్వకథా సాహితి | 245 |
| 4.6.5. | భారతీయ కథా ప్రతిబంబం | 248 |
| 4.6.6. | భారతీయ భాషల్లో స్త్రీవాద కథలు | 249 |
| **అధ్యాయం – 5: భారతీయ సినిమా విశ్లేషణ** | | **252 – 289** |
| 5.1. | సినిమా పరిచయం | 252 |
| 5.2. | గ్రామీణ జీవిత చిత్రాలు | 253 |
| 5.3. | ఫిలిం సొసైటీ ఉద్యమం | 254 |
| 5.4. | సినిమాకు అంకితమైన రిత్విక్ ఘటక్ | 255 |
| 5.5. | సత్యజిత్ రే | 257 |
| 5.6. | పథేర్ పాంచాలి | 258 |
| 5.7. | భారతదేశంలో తొలి సినీ స్టూడియోలు | 261 |
| 5.8. | ప్రాంతీయ చలన చిత్రాలు | 263 |
| 5.9. | ఇండియన్ షార్ట్ ఫిలిం | 264 |
| 5.10. | తెలుగు సినిమా రంగం | 266 |
| 5.10.1. | తెరకెక్కిన తెలంగాణ | 266 |
| 5.10.2. | చిల్లర దేవుళ్ళు | 267 |
| 5.10.3. | శ్యాం బెనగళ్: అంకుర్ – నిషాంత్ | 267 |
| 5.10.4. | మా భూమి | 269 |
| 5.10.5. | మా భూమి – గౌతమ్ ఘోష్ | 269 |
| 5.10.6. | జోగినులు | 270 |
| 5.10.7. | మట్టి మనుషులు | 271 |
| 5.11. | తమిళ సినిమారంగం | 273 |

5.11.1. శివాజీ గణేశన్ 273
5.11.2. ప్రభుదేవా 274
5.12. కన్నడ సినిమారంగం 276
5.12.1. బి.వి. కారంత్ – చోమనదుడి 276
5.12.2. తబరన కథె 278
5.13. మలయాళ సినిమారంగం 279
5.13.1. పి.ఎ. బేకర్ – మునిముజహక్కం 279
5.13.2. మోహనన్ – పురుషార్థం 281
5.14. హిందీ సినిమారంగం 282
5.14.1. గోవింద్ నిహలానీ – ఆదివాసుల 'ఆక్రోశ్' 282
5.14.2. తమస్ – మత కలహాల చీకటి 284
5.14.3. ఆనంద్ పట్వర్ధన్ – హమారా షహర్ 287
**ముగింపు** 290 - 292
**పరిశోధన ఫలితాంశాలు** 293 – 294
**అనుబంధం – 1: తెలంగాణ కథా సాహిత్యంలో దేవరాజు మహారాజు స్థానం** 295 – 296
**అనుబంధం – 2: రచయితతో పరిశోధక విద్యార్థి ముఖాముఖి** 297 – 301
**ఉపయుక్త గ్రంథసూచి** 302 - 306
**ప్రచురితమైన పరిశోధన పత్రాలు**
**జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధృవ పత్రాలు**

## కృతజ్ఞతలు

నా పుట్టుకకు మూల కారకులై నిరంతరం నా కొరకు పరితపించే తల్లిదండ్రులు – ధీరావత్ సైది, తారాసింగ్ గార్లకు,

నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యతలను స్వీకరించి తగిన సలహాలు, సూచనలు అందించడమే కాక నిష్కల్మషమైన మనస్సుతో, చిరునవ్వుతో ఎల్లప్పుడు నాకు అమృతాశీస్సులు అందించిన మా గురువు ఆచార్య పిల్లలమర్రిరాములుగారికి,

ఈ పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు,

పి.జి.లో చేరినప్పటి నుండి ఉన్నత విద్యతో పాటు ఉన్నతాదర్శాలను బోధించి, పరిశోధనా రంగంలోనికి మార్గం సుగమం చేసిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యాపకులు – ప్రస్తుత శాఖాధ్యక్షులు ఆచార్య జి. అరుణ కుమారిగారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మిగారికి, ఆచార్య గోనా నాయక్గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్గారికి, డా॥ బాణాల భుజంగరెడ్డిగారికి, డా॥ విజయకుమారిగారికి మరియు విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మంగారికి, ఎన్.ఎస్. రాజుగారికి, ఆర్.వి. రామకృష్ణ శాస్త్రిగారికి పేరు పేరునా మనఃపూర్వక కృతజ్ఞతాంజలులు.

నా పరిశోధన సంబంధించిన పుస్తకాలను అందించడంతోపాటు, చిన్న చిన్న సందేహాలను కూడా పెద్ద మనసుతో తెలియచేసిన దేవరాజు మహారాజుగారికి, వారి కుటుంబ సభ్యులకు,

ఏ రకంగాను కడతేరని నా జీవితం ఈ రకంగా విశ్వవిద్యాలయపు ఒడి చేరిందంటే కారణం మా బాబాయి డి. హరి (టీచర్) గారికి,

నేను ఎప్పుడు అడిగినా లేదనకుండా నన్ను ఆర్థికంగా ఆదుకున్న మామగారు బి. భాష్యా నాయక్, బావలు యల్. బలరాం, ఇ. వాగ్యలకు,

నాకు ఏమీ తెలియని సమయంలో ఒక దారిని చూపించిన మా బావ డా॥ యల్. హరికృష్ణగారికి,

నా జీవన పయనంలో కడదాక తోడుగా నిలుస్తూ నా అభ్యున్నతికి ప్రత్యక్ష, పరోక్ష సహకారాన్ని అందిస్తున్న నా జీవిత భాగస్వామి శ్రీమతి లలితకు, నా చిన్నారులు ప్రజ్వల్ సాయి, ఉజ్వల్ సాయిలకు ఆశీస్సులు.

నన్ను అమితంగా అభిమానించే నాగమణి – రాము (తమ్ముడు), వారి చిన్నారులు భువన కృతి, భువన్ సాయిలకు ఆశీస్సులు మరియు మా బంధువులందరికీపేరుపేరునా నా శతకోటి వందనాలు.

ఎప్పటికప్పుడు తమ తమ సహాయ సహకారాలు అందించిన సీనియర్ అన్నలు –పానుగోత్ భగ్గునాయక్, జక్కుల రాయమల్లు, గౌడిచర్ల జనార్దన్, వెంకటేష్ భరత్, పలివెల చిరంజీవిలకు బావ లావుద్య సూరా నాయక్కు,

పి.జి. నుండి నా బాధలు, సంతోషాలను పాలు పంచుకొని నిరంతరం సలహాలిచ్చి ముందుకు ప్రోత్సహించి అండగా నిలిచిన మిత్రులు బొలుగాని శోభన్బాబు (చింటు), గోపాస్ శ్రీహరి, పెద్దింటి మల్లికార్జున్, గడ్డం లింగరాజు, చింతపల్లి దేవయ్య, భూక్య వెంకటేష్, అజ్మీరా కిషన్, ధనావత్ రవిలకు,

వివిధ గ్రంథాలయాల సిబ్బందికి, ఆయా గ్రంథకర్తలకు,

అక్షరాలు అందంగా టైపు చేసిన నాగబండి ఆనంద్గారికి,

పరిశోధన కాలంలో నాకు ఆర్థికంగా సహకరించిన యు.జి.సి. వారికి,

తెలుగు శాఖ బోధనేతర సిబ్బంది – బాలాజీ, రాజశేఖర్, కృష్ణ, మధు, సంజీవయ్య గార్లకు,

అలాగే నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఎందరెందరో మహానుభావులు అందరికి పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

**ధీరావత్ లక్ష్మణ్**

# ముందు మాట

వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వానికి అద్దం పట్టేలా రచనలు చేయగల నేర్పరితనం దేవరాజు మహారాజుగారి సొంతం. లోకంలో తమ గురించి మాత్రమే ఆలోచించేవారు కొంతమంది కాగా, బహు కొద్ది మంది మాత్రమే లోకం గురించి కూడా ఆలోచిస్తుంటారు. అటువంటి వారిలో దేవరాజు మహారాజుగారిని ప్రముఖులుగా పేర్కొనవచ్చు.

సమాజంలో రోజు చూసే సమస్యలకు, సన్నివేశాలకు, హృదయ స్పందనలకు సంబంధించినవి వీరి రచనలు. కావున వీరి రచనలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో "దేవరాజు మహారాజు రచనలు – సమగ్ర పరిశీలన" అనే అంశాన్ని నా పరిశోధనకు స్వీకరించడం జరిగింది. వీరి రచనల్లో వస్తువు ఎప్పుడు సమాజం వైపే మొగ్గు చూపుతుంది. ప్రధానంగా దేవరాజు మహారాజు రచనల్లో సమకాలీన సమస్యలు, దోపిడీ, పేదవారి జీవిత చిత్రణ, గురువు, విద్యార్థి, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక విధ్వంసం మొదలైనవి వస్తువులుగా కనిపిస్తాయి. వీటితో పాటు సమాజంలో ఉండే వివిధ అంశాలు వీరి రచనల్లో గూడుకట్టుకున్నాయి.

ఈ విధంగా సామాజికాంశాలతో పాటుగా ఆర్థిక, రాజకీయ, సాంఘికాంశాలు దేవరాజు మహారాజు రచనల్లో కనిపిస్తాయి. ఇటువంటి విస్తృత వస్తు పరిధి ఉన్న దేవరాజు మహారాజు రచనలని పరిశీలించాల్సిన అవసరం ఉందనిపించింది. అందుకే "దేవరాజు మహారాజు రచనలు – సమగ్ర పరిశీలన" అనే అంశాన్ని నా పరిశోధనగా ఎన్నుకున్నాను. నా పరిశోధన అంశాన్ని పరిశోధన సౌలభ్యం కోసం ఐదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

1) దేవరాజు మహారాజు – కవి జీవిత విశేషాలు.
2) దేవరాజు మహారాజు రచనలు – పరిచయం.
3) దేవరాజు మహారాజు రచనలు – వస్తు విశ్లేషణ.
4) దేవరాజు మహారాజు రచనలు – శిల్పం.
5) భారతీయ సినిమా విశ్లేషణ.

**మొదటి అధ్యాయం** "దేవరాజు మహారాజు – కవి జీవిత విశేషాలు"లో బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, ఉద్యోగ ప్రస్థానం, సాహిత్య ప్రవేశం, వృత్తి–ప్రవృత్తి, అనువాద కృషి, దేవరాజు మహారాజు వ్యక్తిత్వం, దేవరాజు మహారాజును ప్రభావితం చేసిన పుస్తకాలు. కథా రచయితగా దేవరాజు మహారాజు, నాటక కర్తగా దేవరాజు మహారాజు మరియు అవార్డులను పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం** "దేవరాజు మహారాజు రచనలు – పరిచయం"లో దేవరాజు మహారాజుగారి రచనలను పరిచయం చేశాను. గుడిసె గుండె, గాయపడ్డ ఉదయం, జీవితమే ఒక కవిత, కవితా భారతి, మట్టి గుండె చప్పుళ్ళు, రాజముద్ర, నీకూ నాకూ మధ్య ఓ రంగుల నది, కాలాన్ని వెనకేసిన మనిషి మొదలైన కవితా సంపుటాలను, కడుపు కోత, దేవరాజు మహారాజు కథలు, మనిషి కథలు, పాలు ఎర్రబడ్డాయి, భారతీయ కథా ప్రతిబింబం, ఆరుబయట ఆకాశం కోసం, డాక్యుమెంటరీ స్టోరీస్, అపూర్వ జానపద కథలు, విశ్వకథా సాహితీ మొదలైన కథాసంపుటాలను, మూఢనమ్మకాల్ని వదిలిద్దాం, లైఫ్టానిక్ నాటకాలను, మంచి ముత్యం నవలను, సైన్స్ రచనలు: మూఢనమ్మకాలు సైన్స్, భారతీయ వైజ్ఞానిక వికాసం, విజ్ఞాన పథంలో విజయ ఘట్టాలు, సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ, నేనంటే ఏమిటి, మానవవాదం జీవన నినాదం మొదలైన వాటిని స్థూలంగా పేర్కొన్నాను.

**మూడవ అధ్యాయం** "దేవరాజు మహారాజు రచనలు – వస్తు విశ్లేషణ"లో కవిత్వం, కథలు, నవల, నాటకాలలోని వస్తువును గూర్చి విశ్లేషించాను. 'కవిత్వం – వస్తు విశ్లేషణ'లో స్మృతి కవిత్వం, విద్యారంగం, రాజకీయం, విప్లవం, దేశభక్తి, స్త్రీవాదం, నగర జీవిత చిత్రణ, పల్లె జీవిత చిత్రణ, సామాజికాంశాల గురించి చర్చించాను. 'కథలు – వస్తు విశ్లేషణ'లో విద్యారంగ కథలు, రాజకీయ కథలు, కుటుంబ కథలు, ఆర్థిక సంబంధకథలు, పర్యావరణ కథలు, అవినీతి కథలు, మానవ సంబంధ కథలను గురించి పేర్కొన్నాను. 'నవల – వస్తు విశ్లేషణ'లో నవల పరిచయం, నవల వస్తువు, మంచి ముత్యం నవల విశ్లేషణల గురించి చర్చించాను. నాటకం వస్తు విశ్లేషణలో నాటక పరిచయం, నిర్వచనాలు, మూఢనమ్మకాల్ని వదిలిద్దాం, లైఫ్ టానిక్ నాటకాలను విశ్లేషించాను.

**నాల్గవ అధ్యాయం** "దేవరాజు మహారాజు రచనలు – శిల్పం"లో కవితా శిల్పం, కథా శిల్పం, నవలా శిల్పం, నాటక శిల్పం, అనువాద శిల్పంల గురించి పేర్కొన్నాను. కవితా శిల్పంలో భావవైచిత్రి కవితలు, ప్రతీక వైచిత్రి కవితలు, వ్యక్తీకరణ వైచిత్రి కవితలు, రూపవాద కవితలు, ఆత్మాశ్రయరీతి కవితలు, మానవతావాద కవితలు, విప్లవ కవితలు, చైతన్య ప్రబోధ కవితలు, స్త్రీవాద కవిత్వం, ప్రకృతి కవిత్వం మరియు అలంకారాలు, ప్రాసల ప్రాభవం, పద ప్రయోగం, మాండలికాలు గురించి, 'కథా శిల్పం'లో కథలు పాత్ర చిత్రణలో రాములమ్మ (అంతరం), మల్లేశు (పేరులేని కథ), పోశాలు (పొడవని పొద్దు), వెంకట్రాములు (ఓటు విలువ), విశ్వనాథం (బతుకు ఫ్యాను), యాదవరెడ్డి (జీవిత పోరాటం), సిద్దార్థ (ఓటరు శరణం గచ్ఛామి) పాత్రల గురించి

తెలియజేసాను. 'నవలా శిల్పం'లో నవలా పరిచయం, నిర్వచనాలు, సాహిత్యం – నవల, నవల పాత్ర చిత్రణ మంచిముత్యం, మంచిముత్యంలోని కినోనవల పాత్రల గురించి, నాటక శిల్పంలో నాటక నిర్వచనాలు, లైఫ్ టానిక్, నాటక పాత్ర చిత్రణ, రంగారావు (లైఫ్ టానిక్) గురించి, అనువాద శిల్పంలో అనువాద యుగం, అనువాద ప్రపంచంలో కవిత్వానువాదం, అనువాద రచనల గురించి పేర్కొన్నాను.

**ఐదవ అధ్యాయం** "భారతీయ సినిమా విశ్లేషణ"లో సినిమా పరిచయం, గ్రామీణ జీవిత చిత్రాలు, ఫిలిం సొసైటీ ఉద్యమం, రిత్విక్ ఘటక్, సత్యజిత్ రే, పథేర్ పాంచాలి, భారతదేశంలో తొలి సినీ స్టూడియోలు, ప్రాంతీయ చలన చిత్రాలు, ఇండియన్ షార్ట్ ఫిలిం, తెలుగు సినిమా రంగం, తమిళ సినిమా రంగం, కన్నడ సినిమా రంగం, మలయాళ సినిమా రంగం, హిందీ సినిమా రంగాల గురించి పేర్కొన్నాను. తెలుగు సినిమా రంగంలో తెరకెక్కిన తెలంగాణ, చిల్లర దేవుళ్ళు, మా భూమి, జోగినులు, మట్టి మనుషులు, మా భూమి గౌతమ్ఘోష్ల గురించి, తమిళ సినిమా రంగంలో శివాజీ గణేశన్, ప్రభుదేవాల గురించి, కన్నడ సినిమా రంగంలో బి.వి. కారంత్, తబరనకథేల గురించి, మళయాళ సినిమా రంగంలో పి.ఏ. బేకర్, మోహనన్ల గురించి, హిందీ సినిమా రంగంలో గోవింద్ నిహలాని, తమస్, ఆనంద్ పట్వర్ధన్ల గురించి వివరించాను.

★★★

# అధ్యాయం – 1

# దేవరాజు మహారాజు – కవి జీవిత విశేషాలు

# అధ్యాయం – 1

## దేవరాజు మహారాజు – కవి జీవిత విశేషాలు

### 1.1. కవి పరిచయం:

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నాటక కర్త, హేతువాది, అనువాదకుడు, కాలమిస్ట్ అన్నిటినీ మించి పాపులర్ సైన్స్ రచయిత, కవిగా అర్ధ శతాబ్ది (1960–2010) పూర్తి చేసుకున్న నిత్య కృషీవలుడు డా॥ దేవరాజు మహారాజు.

ఒక కవిగా, రచయితగా అప్రతిహతంగా అర్ధ శతాబ్ది కాలం పాటు అన్ని ప్రక్రియల్లో కృషి చేస్తూ, అన్నింటిలో తనదైన ముద్ర వేసుకుని, భాషా సాహిత్యాలకు సంబంధం లేని వృత్తిలో ఉండి, సారస్వత రంగంలో వేళ్ళూనుకుని వైవిధ్యం ప్రదర్శిస్తూ నిలబడినవారు దేవరాజు మహారాజు.

సామాజిక స్పృహతో, కవిత్వ క్లుప్తతతో, తీవ్రతతో బాంబులాంటి బహుకొద్ది కథలు రాసి, కథా సాహిత్యంలో గణనీయమైన స్థానం సంపాదించిన మహారాజు కథా రచయిత మాత్రమే కాదు. సామాజిక స్వరూపాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి తెలంగాణ మాండలిక జీవద్భాషతో కదం తొక్కిస్తూ, కవితా పద స్పందనల్ని మన ముందుంచిన బాధ్యతెరిగిన కవి, వాస్తవికతావాది.

కవితల్లో, కథల్లో తెలంగాణ మాండలిక భాషలో రచనలు రచిస్తున్న రచయితల్లో ప్రతిభావంతుడిగా ఒక విధంగా మకుటం లేని మహారాజు దేవరాజు మహారాజు. వీరి కవితలు, కథలు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, యువ, తరుణ, వేకువ, దర్పణం, కృష్ణాపత్రిక వంటి పత్రికలలో ప్రచురితమయ్యాయి.

తెలంగాణ ప్రజల భాషలో కవిత, కథ చెప్పి మెప్పించి కవిగా, కథకుడుగా స్థిరపడ్డాడు. భారతీయ భాషల కవిత్వాన్ని, కథల్ని తెలుగులోకి అనువదించి తెలుగు కళ్ళకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సినిమాను విశ్లేషించారు. ఆధునిక యుగ వైజ్ఞానిక స్పృహతో జానపద సాహిత్య పరిశీలన చేశారు. సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడానికి విజ్ఞాన శాస్త్ర గ్రంథాల్ని ప్రచురించారు.

తన రచనల పట్ల స్పష్టత, చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్న కవి దేవరాజు మహారాజు. తెలంగాణ ప్రజల భాషలో ఒక చెంప కవితను, మరొక చెంప కథను చెప్పి ఒప్పించిన ప్రతిభా సంపన్నుడు.

ఫ్రెంచ్ గడ్డంతో విలక్షణంగా కనిపించే ఈ ఏకైక తెలుగు కవికి అనేక ప్రత్యేకతలున్నాయి. వచన కవిత్వంలో తెలంగాణ జీవద్భాషను ప్రవేశపెట్టడం, తెలంగాణ ప్రజల భాషలో కథల సంపుటి

ప్రకటించడం, కవిత్వానువాదంలో విశేషంగా కృషి చేయడం, మూఢనమ్మకాల నిర్మూలనకు కలం పట్టడం మొదలైనవి ఈయన ప్రత్యేకతలు.

తెలంగాణ ప్రజల భాషలో అలవోకగా కవిత్వాన్ని కూర్చిన మహారాజుకి కథల్ని కూర్చడం కష్టమైన పని కాకపోవడం చేత కొండవాగు లాంటి శైలీ వేగం వీరి కథల్లో కనిపిస్తుంది. కథన శిల్పంపైన, ఇతివృత్తం మీద బలమైన పట్టు కలిగి ఉండటం చేత వారి కథలన్నీ వాస్తవ చిత్రీకరణకు సాక్ష్యాలుగా నిలిచాయి. దేవరాజు మహారాజు కవితల్లోనూ, కథల్లోనూ కనిపించే చిత్తశుద్ధి, నిరాడంబరతలు వారి జీవితంలోనూ కనిపించడం విశేషం.

జాన్ స్టెయిన్ బెక్ నవల "ద పెరల్" (*The Pearl* )ను తెలుగు పాఠకులకు "మంచి ముత్యం"గా అందించిన దేవరాజు మహారాజు అనువాద రంగంలో విశేషమైన కృషి చేశారు. నూటాయాభై మంది భారతీయ కవుల్ని "మట్టి గుండె చప్పుళ్ళు", యాభై మంది మరాఠీ దళిత కవుల్ని "కవితా భారతి" అనే కవితా సంకలనాల ద్వారా పరిచయం చేశారు. తెలుగు నాట "నీకు నాకు మధ్య ఓ రంగుల నది"గా కవితా ప్రపంచాన్ని ప్రవహింపజేశారు.

దేవరాజు మహారాజు బహుముఖ ప్రజ్ఞాశాలి. హేతువాది. సైన్సులో ఆచార్యులు. వీరు కథ, కవిత, సాహిత్య వ్యాసం, సైన్సు వ్యాసం, సంపాదకత్వం, అనువాదం, సినిమా స్క్రిప్టు మున్నగు వాటన్నింటిలోనూ కృషి చేసి గొప్ప ఉపజ్ఞను సాధించారు. జీవ శాస్త్రాన్ని, నవ జీవన శాస్త్రాన్ని, తెలుగు భాషా శాస్త్రాన్ని అధ్యయనం చేసిన పరిశోధకులు. ఇంచుమించు సాహిత్య ప్రక్రియలు అన్నింటిలోనూ తనదైన "రాజముద్ర"గా ప్రదర్శించారు.

దేవరాజు గుండెలోంచి మహారాజులా ఉదయించిన "గాయపడ్డ ఉదయం" కదిలించే వజ్రం లాంటి కవిత సంపుటి. ఆ ఒక్కటి చాలు, ఆయన కవితా ఖండికలు జన చైతన్య కవితా దీపికలనటానికి.

తెలంగాణ జీవద్భాషలో "గుడిసె గుండె" పేరిట వచన కవిత్వం రాసి, ఆ రంగంలో ప్రసిద్ధులైన రంధి సోమరాజును మెప్పించారు. అదే దారిలో ముందుకు సాగి, తెలంగాణ ప్రజల భాషలో కథానికలు రాశారు. సురవరం ప్రతాపరెడ్డి 1931లో బలోపేతం చేసిన తెలంగాణ మాండలిక కథానిక రచనా సంప్రదాయాన్ని కాళోజీ, పి.వి. నరసింహారావు, యశోదారెడ్డి, సురమౌళి, ఇల్లందుల సరస్వతీదేవి, గూడూరి సీతారాం వంటివారు కొనసాగించారు. మరుగున పడిపోతున్న దశలో మళ్ళీ ఆధారను జీవధారంగా పరుగులెత్తించిన వారిలో దేవరాజు మహారాజు ఒకరు.

దేవరాజు మహారాజు వామపక్ష భావాలతో కవిగా ఎదిగినా, వక్తగా రాణించినా మొట్టమొదట ఆయన మానవతావాది. సున్నిత మనస్కుడు. మంచి భావానికి తలవంచి నమస్కరించే సంస్కారి.

సాహిత్యం, సమాజ చైతన్యం, అధ్యాపకత్వం, శాస్త్రీయ దృక్పథం ఇలా ఏ రంగంలో చూసిన బహుముఖ సృజనశీలి. విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే ప్రతిభాశాలి. ఫ్రెంచి గడ్డంతో విలక్షణంగా కనిపించడం ఈయన ప్రత్యేకత.

దేవరాజు మహారాజుకి మానవ జీవితాలని మాత్రమే కాదు. ఏ అంశాలనైనా తీవ్రమైన నిశిత దృష్టితో పరిశీలించే తీక్షణ స్వభావి. సమాజంలోని కుళ్ళును ప్రజానీకానికి తెలియజేయాలని వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని నిరంతరం తపన పడేవారు.

దేవరాజు మహారాజు ఒకప్పుడు సితార్ వాయించేవారు. ఇప్పటికి హిందీ గజల్స్ పాడుతారు. ఒకప్పుడు వాటర్ కలర్ పెయింటింగ్స్ వేశారు. ఇప్పుడు నఖ చిత్రాలు గీస్తుంటారు.

సాహిత్య కృషి చేస్తూనే అకడమిక్గా విద్యార్థులను శాస్త్రీయ పరిశోధనల వైపు నడిపించారు. జంతుశాస్త్ర నిపుణునిగా మొక్కల్లో ఉండే "నిమటోడ్" అనే పరాన్న జీవులపై పరిశోధన చేశారు. కొత్తగా కనుగొన్న పరాన్న జీవులకు "తెలంగాణ, నిజామాబాద్" అని పేర్లు పెట్టారు.

## 1.2. బాల్యం:

దేవరాజు మహారాజుమాఘ పౌర్ణమి, బుధవారం తెల్లవారు జామున అమ్మమ్మ గారింట్లో ఫిబ్రవరి 21, 1951న వరంగల్లు జిల్లా కోదూరు గ్రామంలో నర్సింహారాజు, యశోదాదేవిలకు జన్మించారు. వీరి స్వగ్రామం నల్లగొండ జిల్లా భువనగిరి మండలం వడపర్తి గ్రామం. ఈయన నల్లగొండ జిల్లా చాడ గ్రామంలో పెరిగారు. వీరి బాల్యం అందరి పిల్లలలాగా ఆటపాటలతో గడిచింది.

దేవరాజు మహారాజును చిన్నప్పుడు వీరి తల్లిగారు గోపి అని పిలిచేవారు. ఆవిడ పేరు యశోద అవ్వటం వల్ల ఈయనను గోపి అని పిలిచేవారు. అప్పటి కవితలకి "గోపి గీతాలు" అని పేరు పెట్టుకున్నారు.

## 1.3. విద్యాభ్యాసం:

తాత దేవరాజు వెంకటరాజుగారు తమ స్వగ్రామం వడపర్తిలో వీరికి అక్షరాభ్యాసం చేయించారు. దేవరాజు మహారాజు నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకా చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి విద్య, హైద్రాబాద్లో నారాయణగూడ న్యూ సైన్స్ కాలేజీలో

పి.యు.సి. విద్యను 1968లో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి జంతు శాస్త్రంలో 1975లో ఎం.ఎస్సీ. పూర్తి చేశారు. Indian Council of Agricultural Research, New Delhi వారి ఫెలోషిప్తో జువాలజీలో 1979లో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పి.హెచ్డి. పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. వృక్ష పరాన్న జీవులపై పరిశోధనలు చేస్తూ, చేయిస్తూ పోస్ట్–గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు ముప్పై ఏళ్ళుగా మార్గ దర్శనం చేశారు.

దేవరాజు మహారాజు గారిది వ్యవసాయిక కుటుంబం. తండ్రి దేవరాజు నర్సింహారాజు నల్లగొండ జిల్లాలోని పదూళ్ళకు పట్వారి. తన కొడుకు డిగ్రీ పూర్తి చేసి రెవిన్యూ డిపార్ట్మెంట్లో తహశీల్దారు కావాలని కలలు గన్నారు. అంతకు మించి ఆయనకు ఏమీ తెలియలేదు. కాని దేవరాజు మహారాజు అప్పుడే తను అలాంటి ఉద్యోగంలో ఇమడలేనని, హైయ్యర్ డిగ్రీ సాధించాలన్న పట్టుదలతో డిగ్రీ నుండి పి.హెచ్డి. దాక స్కాలర్షిప్లు సాధించుకుంటూ చదువుకున్నారు. అంతే పట్టుదలతో సమాంతరంగా కవిగా, రచయితగా కూడా ఎదుగుతూ వచ్చారు.

### 1.4. వివాహం, సంతానం:

దేవరాజు మహారాజుగారికి 1979లో డి. కృష్ణకుమారితో వివాహం జరిగింది. వీరు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని నలుగురికి ఆదర్శంగా నిలబడ్డారు. వీరికి ఇద్దరు కొడుకులు. అఖిల్ దేవరాజు, సమీర్ దేవరాజు. కోడలు గీత అఖిల్ దేవరాజు భార్య. పిల్లలిద్దరూ కంప్యూటర్ రంగంలో స్థిరపడ్డారు.

### 1.5. ఉద్యోగ ప్రస్థానం:

దేవరాజు మహారాజు తాను చదువుకున్న హైదరాబాద్లోని నారాయణగూడ భవన్స్ న్యూ సైన్స్ కాలేజీలో పి.జి. శాఖలో అధ్యాపకుడిగా రంగ ప్రవేశం చేశారు. ముప్పయేళ్ళు యమ్మెస్సి విద్యార్థులకు బోధించారు. జీవశాస్త్రంలో ఒక ప్రత్యేకమైన శాఖ – వృక్ష పరాన్న జీవశాస్త్రం "Phyto nematology". వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉండే ఈ శాస్త్రాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం వంటి అకడమిక్ యూనివర్శిటీలో ప్రవేశ పెట్టడానికి ముఖ్య కారణం వీరే. ఆ కోర్సుకు సిలబస్ రూపొందించి, యమ్మెస్సి జంతు శాస్త్రంలో ఒక పేపర్గా తీసుకురావడానికి వీరి కృషి ఎంతో ఉంది.

విద్యార్థులతో ఆయన వ్యవహార శైలి ఒక స్నేహితుడిగా, తండ్రిలాగా ఉండేది. తన పిల్లలకు తను బాగా చెప్పుకోవాలన్న తాపత్రయం ఆయనలో ఉండేది. ఆయన తన యమ్మెస్సి విద్యార్థులకు

పూర్తిగా లీనమై పాఠం చెప్పేవారు. ఎంతో ఓపికగా ప్రాక్టికల్స్ చేయించేవారు. జీవశాస్త్ర కోణంలోంచి సమాజ స్థితిగతులను నిర్వచించడం ఆయన ప్రత్యేకత.

## 1.6. సాహిత్య ప్రవేశం:

బాల్యదశలోనే వీరిలోని రచయితను గుర్తించి ప్రోత్సహించినవారు తల్లి శ్రీమతి యశోదాదేవి. బంధువులు డి.ఎల్.యన్. రాజు. పి. మురళీధర్ రాజు, యస్. బాలంరాజు, ఎ. కృష్ణమరాజు గార్లు.

విద్యార్థిగా ఉన్న రోజుల్లో సాహిత్యంపై ఆసక్తి పెరగడానికి కారణం తమ ఉపాధ్యాయులే. హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు, వాటి ద్వారా శ్రీశ్రీ, పఠాభి, కాళోజీ, దాశరథి, ఆరుద్ర, పురిపండా లాంటి ప్రముఖ సాహితీవేత్తల పేర్లు పరిచయమయ్యాయి.

పెద్దగా చదువుల్లేని, సాహిత్య వాసనలు అసలే లేని, ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉన్న వ్యవసాయక కుటుంబంలోంచి వచ్చిన దేవరాజు మహారాజులో జ్ఞాన బీజాలు చల్లిన చాడ గ్రామంలోని నాటి పాఠశాల ఉపాధ్యాయులు శ్రీయుతులు యం. ప్రభాకరరావు, టి. స్వామినాథం, పి.వి. రాధాకృష్ణమూర్తి, బి. మల్లికార్జునరావు, టి. శ్రీనివాస్, కృష్ణారావు, బాలయ్య, రామనాథం, తిరునగరి వేంకటయ్య మొదలైన వారెందరో. కళాశాల స్థాయిలో (1969–72) సాహిత్య పిపాసను ఇనుమడింపజేసిన తెలుగు అధ్యాపకులు శ్రీయుతులు మంజుశ్రీ, అరిపిరాల విశ్వం, పోరంకి దక్షిణామూర్తి వంటివారు కొందరు దేవరాజు మహారాజులో సాహిత్య బీజాలు వేశారు.

పదహారవయేట కళాశాల వార్షిక సంచిక 'విజ్ఞాన్'లో మొదటి కవిత అచ్చయింది. పద్ధెనిమిదవ యేట ఆకాశవాణి (ఏ) కేంద్రం నుంచి తొలిసారి స్వీయ కవితా పఠనం ప్రసారమైంది. ఇరవయ్యవ యేట భారతిలో వ్యాసాలు అచ్చయ్యాయి. ఇరవై మూడవ యేట తెలంగాణ జీవద్భాషలో "గుడిసె గుండె" మొదటి కవితా సంపుటి వెలువరించారు.

## 1.7. దేవరాజు మహారాజు వ్యక్తిత్వం:

సమాజంలో భిన్నమైన మనస్తత్వాలు కలిగిన వారుంటారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన వ్యక్తిత్వం. సామాన్య ప్రజల కన్నా రచయితలు, కవులు సమాజం పట్ల, ప్రజానీకం పట్ల ప్రత్యేక దృష్టిని కలిగి ఉండి విశిష్టమైన వ్యక్తిత్వం కలిగి ఉంటారు. అందుకే వారు మిగతా వారి కంటే ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వారి రచనల ద్వారా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అలాంటి ఉత్తమ రచయితలలో దేవరాజు మహారాజు ఒకరు. వీరి జీవితాన్ని, కథలను చదివిన ప్రతి ఒక్కరం ఆయన రచనల ద్వారా ఆయన వ్యక్తిత్వాన్ని అంచనా వేయగలం.

చాలామంది రచయితలు తాము రాసే రచనలకూ, తమ జీవితాలను పొంతన లేకుండా రాస్తారు. ఒకవేళ తమకు బాగా పరిచయం లేని విషయాలను గురించి రాసినా, వారి బాహ్య జీవితంలోకి వచ్చేసరికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తారు. కాని దేవరాజు మహారాజు విషయంలో ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. తాను చిత్రించే జీవితం గురించి పూర్తి అవగాహన తెచ్చుకున్నాకే రాసే ప్రయత్నం చేస్తారు. అలా దేవరాజు మహారాజు సాధారణ మనిషిగా ఉండి అసాధారణ వ్యక్తిత్వం కలిగిన రచయితగా ఎదిగారు. సమాజంలో తాను జీవిస్తున్న క్రమంలో ఎదురైన అసాధారణ జీవితాలు, విలక్షణమైన వ్యక్తిత్వాలను, విభిన్న సంఘటనలను కథలుగా రాశారు. బాహ్య జీవితంలో, కార్యాచరణలో నిలిచిన వాస్తవికతను నిజాయితీతో కథల్లో ప్రవేశపెట్టారు. దేవరాజు మహారాజు ఉత్తమ వ్యక్తిత్వం కలిగినవారు. మృధు స్వభావి. అంతకు మించి నిజాయితీపరులు. అన్నింటిని మించి గొప్ప మానవతావాది. తన లక్ష్యం పట్ల, రచన పట్ల స్పష్టత, చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్న అరుదైన కవుల్లో దేవరాజు మహారాజు ఒకరుగా చెప్పవచ్చు.

దేవరాజు మహారాజు జీవితం పట్ల, ప్రేమ, గౌరవాలు కలిగిన వ్యక్తిగా, జీవితపు లోతుల్ని అధ్యయనం చేసిన రచయితగా, జీవితాన్ని ఉన్నతీకరించిన రచయితగా పాఠకుల ముందు నిలబడతారు. తన ప్రతి అక్షరంలోనూ, ఆలోచనలోనూ ప్రాణశక్తిని కవిత్వంగా నిలుపుకుంటూ, అభివ్యక్తిగా గాఢతతో ఆధునిక కవిత్వాన్ని ఆరోగ్యవంతంగా సుసంపన్నం చేస్తున్నవారు డా॥దేవరాజు మహారాజు.

అవిశ్రాంతంగా ఆలోచనలను అక్షరాల్లోకి అనువదిస్తూ సామాజిక విధ్వంసక మూలాలను ఎత్తి చూపుతూ కవితా చరణమై వినమ్రంగా పాఠక లోకానికి పరిచయస్తుడైన వినయశీలి దేవరాజు మహారాజు. ఈయన చేసిన సాహిత్య కృషికి గాను ఎన్నో అవార్డులు, పురస్కారాలు వరించాయి.

### 1.8. వృత్తి – ప్రవృత్తి:

శాస్త్రీయ దృక్పథాన్ని అక్షరాల్లో ఒంపి సమాజంలో ఆలోచనల్ని పంచుతున్న మానవతా సృజనకారుడు దేవరాజు మహారాజు. వృత్తిరీత్యా జంతు శాస్త్ర ఉపన్యాసకులైనా, ప్రవృత్తి రీత్యా సాహిత్యాధ్యయనం, లోతైన పరిశోధన దృక్పథం, అనుశీలనం ఈయనలోని ప్రత్యేకతలు.

దేవరాజు మహారాజు ఆచరణ వాది. రాసేది, చెప్పేది ఒక్కటే. తనకంటే పెద్దవారితో కలిసిమెలిసి ఉన్నట్లే చిన్నవారిలోనూ ఉంటారు. మంచి స్నేహ సౌజన్యం కలవారు కావడంవల్ల చాలామంది స్నేహితులుగా మారారు.

## 1.9. అనువాద కృషి:

సాహిత్య ప్రక్రియల్లో అనువాద ప్రక్రియ విలక్షణమైంది. కేవలం భాషలు తెలిసి పుస్తకాలను రాస్తూ పోయినంత మాత్రాన అయిపోయేది కాదు. అనువాదంలో రెండు రకాల భాషల జీవశక్తిని అర్థం చేసుకోవడంతో పాటు మూల భాష ఆ ప్రాంత ప్రజల జీవితాల్ని, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకొని ఉండాలి. మూల భాషా నుడికారాన్ని సులక్షణంగా అర్థం చేసుకొని ఉండాలి. రెండు భాషల జీవన స్థితిగతులు తెలిసి ఉండి అనువాదాన్ని మక్కికి మక్కిగా కాకుండా స్వీయ రచనగా చేసినప్పుడు అది మంచి అనువాదంగా మన్ననలు అందుకుంటుంది. ఇలాంటి అనుసృజనే శక్తివంతంగా చేసిన రచయిత దేవరాజు మహారాజు.

## 1.10. కథా రచయితగా దేవరాజు మహారాజు:

తెలుగులో సంపూర్ణమైన ఆధునిక కథాలక్షణాలు కలిగిన తొలి కథానికగా 1910లో గురజాడ అప్పారావురాసిన'దిద్దుబాటు' కథను గుర్తించారు. దాని కన్నా ముందు బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య' కథను నేటి విమర్శకులు, స్త్రీవాదులు తొలి తెలుగు కథానికగా గుర్తిస్తున్నారు. పై రెండింటిలో ఏ కథ ముందు అనే పదాన్ని పక్కన పెట్టి, తెలుగు కథను పరిశీలిస్తే ఎందరో రచయితల చేతుల్లో పడి రోజురోజుకు కొత్త రూపాలను దిద్దుకుంటూ ఎన్నో మార్పులతో ఎంతో ఎత్తుకు ఎదిగి అంతర్జాతీయ కీర్తిని అందుకుంది. తెలుగు కథా సాహిత్యాన్ని వస్తువు, ఇతివృత్తం దృష్ట్యా పరిశీలిస్తే సుమారు ఎనభై రకాల కథలుగా విమర్శకులు, పరిశోధకులు వర్గీకరించారు.

ప్రతి కథా రచయిత వెనుక ఒక కథ ఉంటుంది. ప్రతి కథ వెనుక మరో కథ ఉంటుంది. కథలకు ఆలంబమైన సన్నివేశాలు, పాత్రలు వాటి మధ్య సంఘర్షణలు మొదలైన అన్నింటినీ రచయిత ముందుగా ఊహించుకుని కథా నిర్మాణం చేస్తాడు. రచయిత జీవిత అనుభవాల నుండే కథలు వెలువడుతాయి. అవి సామాజిక స్పృహను కలిగి ఉండాలి. అలా సామాజిక స్పృహతో కథలు రాసే అతి కొద్దిమంది రచయితలలో దేవరాజు మహారాజు ఒకరు.

దేవరాజు మహారాజు సుమారు నూటికి పైచిలుకు (114) కథలు రాశారు. వారి కథలన్నీ జీవితానుభవం నుండే పుట్టాయి. 'నా కథలు కాలక్షేపం కోసం రాసినవి కావ'ని ఆయనే మనసు విప్పి చెప్పుకున్నారు. దీనిని బట్టి వారి కథలు ఒక లక్ష్యం, ఒక ప్రయోజనం కొరకే రాయబడినవని చెప్పవచ్చు. ప్రతి ఊరికి, నగరానికి, రాష్ట్రానికి, దేశానికి సరిహద్దులు, చుట్టు కొలతలు ఉన్నట్లు ప్రతి రచయితకు మానసికమైన పరిమితులతోపాటు, భౌగోళికమైన పరిధులు కూడా ఉంటాయి. ఆ

విధంగానే దేవరాజు మహారాజు కూడా నల్లగొండ జిల్లా మనిషి కాబట్టి వారి కథల్లో తెలంగాణ మాండలికం కనిపిస్తుంది.

దేవరాజు మహారాజు కథల్లోని వస్తువు, శిల్పం దృష్ట్యా ఏడు రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఆ కథల్లోని వస్తువు రచయిత వ్యక్తిత్వానికి ప్రత్యక్ష రూపాలు. ఇది నా పరిశోధన దృష్టితో చేసిన విభజన మాత్రమే. అవి 1) రాజకీయ కథలు, 2) విద్యారంగ కథలు, 3) కుటుంబ వ్యవస్థ కథలు, 4) పర్యావరణ కథలు, 5) ఆర్థిక సంబంధ కథలు, 6) మానవ సంబంధం కథలు, 7) అవినీతి కథలు.

**1) రాజకీయ కథలు**:

1) కిటుకు, 2) ఓటు విలువ, 3) శ్రద్ధాంజలి, 4) ఓటరు శరణం గచ్ఛామి, 5) అమృతం, 6) పాత గోడ, 7) తోసేయ్ తోసేయ్, 8) కోళ్ళ పందెం.

**2) విద్యారంగ కథలు**:

1) పొడవని పొద్దు, 2) కూడలి, 3) బతుకు ఫ్యాను, 4) కిస్సా కాపికా.

**3) కుటుంబ వ్యవస్థ కథలు**:

1) అంతరం, 2) చర్విత చరణం, 3) బెటర్ హాఫ్, 4) పాలు ఎర్రబడ్డాయి, 5) కొత్తఅల్లుడు.

**4) పర్యావరణ కథలు**:

1) ప్రకృతి, 2) మార్నింగ్ వాక్.

**5) ఆర్థిక సంబంధ కథలు**:

1) కింగ్ మేకర్.

**6) మానవ సంబంధ కథలు**:

1) అజ్ఞానోదయం, 2) పేరులేని కథ, 3) ఈగ.

**7) అవినీతి కథలు**:

1) సోదా.

### 1.11. నాటక కర్తగా దేవరాజు మహారాజు:

సాహిత్య ప్రక్రియలన్నింటిలోకి నాటకం అత్యంత శక్తివంతమైన సాధనం. ప్రజా హృదయాన్ని సూటిగా స్పందింపజేసే శక్తి ఒక్క నాటకానికే ఉంది. అలాంటి తెలుగు నాటకానికి మహోజ్వలమైన చరిత్ర ఉంది. ఎందరో నాటక కర్తలు తమ నాటక రచనల ద్వారా తెలుగు నాటక

సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. కాలానుగుణంగా తెలుగు నాటకం సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో మార్పులకు లోనై ఏకాంకికలు, నాటికలుగా రూపాంతరం చెందింది. నాటకాలను దృశ్యనాటకాలు, శ్రవ్యనాటకాలు అని రెండు రకాలుగా పిలుస్తారు. దృశ్యనాటకం ప్రదర్శింపబడేది, శ్రవ్య నాటకం అనగా వినేటివి.

కవిగా, కథా రచయితగానే కాకుండా నాటక కర్తగా కూడా దేవరాజు కనిపించును. 'లైఫ్ టానిక్' వీరిచే రచింపబడిన నాటకం. దీనితోపాటు 'మూఢనమ్మకాల్ని వదిలిద్దాం' అనే నాటికల సంపుటిని వెలువరించారు. ఇవి ప్రేక్షకుల మన్ననలు పొందాయి.

**1.12. ప్రముఖుల ప్రశంసలు:**

దేవరాజు మహారాజు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి గురించి తెలిసినవారు, వారి సాహిత్యాన్ని గురించి తెలిసిన సాహిత్యవేత్తలు, వారి సాహిత్యంపైన ఎన్నో అభిప్రాయాలను వెలిబుచ్చిన వాటిలో కొన్నింటిని చూద్దాం.

1. "పట్టు పాగపై మరియొక పట్టుపాగ చుట్టినట్టుగా నీ పేరు తట్టెనోయి"— పొట్లపల్లి రామారావు.
2. "భిన్న భిన్న ప్రక్రియల నిర్వహణాధ్యక్షుడు"— పోరంకి దక్షిణామూర్తి.
3. గుడిసె గుండె చదువుతుంటే మీలో ఒక ప్రామీసింగ్ పొయెట్ కనిపిస్తున్నాడు – ఆరుద్ర.
4. తెలంగాణ మాండలికంలో కథల సంపుటి రావడం ఇదే మొదలు (కడుపు కోత) – దాశరథి రంగాచార్య.
5. గుడిసె గుండె కవిత సంపుటి మొత్తం భావం, శిల్పం ప్రబలంగా అల్లుకున్న కవిత్వానికి ప్రతీక. కొన్ని కవితల్ని చదివి కదిలిపోయి, కొన్నింటిని చదివి నా దేవరాజు మహారాజు ఎంత మంచి కవిత్వం రాశాడని పొంగి పోయాను – సి. నారాయణ రెడ్డి (సినారె).
6. కంటికి కనబడతాంది యిశిత్రాల పేరు. ఆ పేరెన్క గుండెలో మండేటి యిశ్వాసాల హోరు – కాకరాల (నటుడు).
7. అక్షరాక్షరం మానవాభ్యుదయాన్నే ఆకాంక్షించిన దేవరాజు మహారాజు, కోటి రతనాల తెలంగాణ వీణ మోగించిన దాశరథికి నచ్చిన కవి. అచ్చమైన భారతీయ కవి – మిరియాల లక్ష్మీపతి.
8. మీదైనా శైలి, ధోరణి ఏర్పరచుకున్నారు. అది నాకు ముఖ్య విషయంగా కనిపిస్తోంది. మీ వ్యంగ్యం చాలా శక్తివంతమైనది – ఆర్.యస్. సుదర్శనం.

9. "You are fulfilling the expectations of all the downtrodden people" – శ్రీశ్రీ.

10. దేవరాజు మహారాజును దండిమూడి మహీధర్ అభినవ కోకు అని పిలిచేవారు.

**1.13. దేవరాజు మహారాజును ప్రభావితం చేసిన పుస్తకాలు**:

"వైజ్ఞానిక, సాహిత్య కళారంగాల్లో గుర్తింపు తెచ్చుకున్నవారు, సామాజిక సేవకులు, దార్శనికులు ఏదో ఒక పుస్తకంతో స్ఫూర్తి పొందుతారని నేననుకోను. ఎన్నో పుస్తకాలు, ఎన్నో కళలు, మరెన్నో జీవితాలు, ఎన్నెన్నో పరిస్థితులు మొత్తానికి మొత్తంగా వాటి సారమంతా కలిపి వారి ధ్యేయానికి రూపకల్పన చేసుకుంటారననుకుంటా. నేను వ్యక్తిగా, కవిగా ఎదుగుతున్న తొలి దశలో కొన్ని పుస్తకాలు నన్ను ప్రభావితం చేశాయి"[1] అని దేవరాజు మహారాజు పేర్కొనడంలో వారిలో నిరంతర అధ్యయన శీలి కన్పిస్తాడు.

దేవరాజు మహారాజు స్కూల్ విద్యార్థిగా ఉన్నప్పటి నుండే కవితలు, కథలు రాయటం మొదలుపెట్టారు. కాలేజీలో చేరినప్పటి నుండి రచనలు పత్రికల్లో ప్రచురితమవుతున్నాయి. డిగ్రీ విద్యార్థిగా 'భారతి'లో వ్యాసాలు రాశారు. రేడియోకి విరివిగా కథలు, నాటికలు రాస్తూ కథల పోటీలో బహుమతి కూడా గెల్చుకున్నారు (ఆంధ్రజ్యోతి – పాలు ఎర్రబడ్డాయి). అందువల్ల చాలామంది శ్రేయోభిలాషులు తనను బి.యస్.సి. తర్వాత ఎం.ఏ.లో చేరమన్నారు. భాష మీద, వ్యాకరణం మీద పట్టు సాధిస్తే మంచి కవిత్వం రాయడానికి వీలుంటుందన్నారు. కానీ తాను జీవశాస్త్ర సంబంధమైన అవగాహనే ముఖ్యమనుకుని ఎం.ఎస్.సి.లో చేరాడు. అక్కడ ఛార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తన గమ్యానికి ఒక కొత్త ద్వారాన్ని తెరిచింది. అతి కష్టం మీద "అరిజిన్ ఆఫ్ స్పీసిస్" (Origin of Species) పుస్తకం సంపాదించి అధ్యయనం చేయడం ప్రారంభించాడు. దాని సారాన్ని గ్రహించి స్ఫూర్తి పొందిన వారికి జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలుగుతుందని ప్రగాఢంగా విశ్వసించడం మొదలుపెట్టాడట. డార్విన్ గొప్పతనమేమిటంటే ఒక దిశలో నడుస్తున్న ప్రపంచ గమనాన్ని తన ఆలోచనలతో అడ్డుకుని, ఆపి, దాని దిశను మళ్లించగలిగిన మహా శాస్త్రవేత్త. ఒకరకంగా మనిషి ఔన్నత్యాన్ని కీర్తించిన మహానుభావుడు. ముప్పయేళ్ళు ఎం.ఎస్.సి. విద్యార్థులకు జీవశాస్త్రం బోధించినా, ఎప్పటికప్పుడు జీవితానికి అన్వయించుకునే కొత్త విషయాలు డార్విన్ సిద్ధాంతం నుండి లభిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఏ చదువు చదివినా, ఏ ఉద్యోగంలో ఉన్నా ప్రతివారికి శాస్త్రీయ దృక్పథం చాలా

[1] ప్రజా సాహితీ సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక, విజయవాడ, మే, 2013, పుట–21.

అవసరం. విచారించాల్సిన విషయం ఏమంటే ఉన్నత విద్యనభ్యసించినవారు, మేధావులుగా చలామణి అయ్యేవారు కూడా హేతుబద్ధంగా ఆలోచించకుండా మూఢనమ్మకాలలో పడి కొట్టుకుపోతుంటారని దేవరాజు మహారాజు అభిప్రాయం.

వృక్ష పరాన్న జీవుల మీద పరిశోధన చేస్తున్న దశలో ఒకరోజు పుస్తకాల షాపులో స్టీఫెన్ హాకింగ్ రాసిన పుస్తకం "ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్" (కాలం కథ) కనిపించిందట. కొని చదువుతూ ఉంటే ఎప్పటినుండో అతనిలో కొట్టుకుంటున్న అనేకానేక ప్రశ్నలకు ఆ పుస్తకం సమాధానాలీయగలిగింది. కాలం గురించి, స్థలం గురించి, వాటి మధ్య గల కార్యాకరణ సంబంధాల గురించి, వాటికి ఉన్న అనేక పార్శ్వాల గురించి, బిగ్ బ్యాంక్ నుండి బ్లాక్ హోల్ దాక ఎన్నెన్నో విషయాలను ఈ పుస్తకం చర్చించింది.

కొంతమంది చెబుతుంటారు కాలమంటే దేవుడే అని, కాలంలోనే దేవుడున్నాడని కానీ కాలం అనేది ఈ విశ్వాంతరాళానికున్న గుణగుణాల్లో ఒకటి కాదా? ఈ విశ్వమే దేవుడు సృష్టించిందని నమ్ముతున్నప్పుడు, దానిలో అంతర్భాగమైన, దాని గుణాల్లో ఒకటైన కాలంలో దేవుడుండడమేమిటి? అనేది ప్రశ్న. సృష్టికర్త తాను సృష్టించిన దానికన్నా ఉన్నతుడై ఉంటాడు కానీ, తాను సృష్టించిన దానిలోనే అంతర్భాగమై ఉండడు కదా?

"ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్" పుస్తకం కొన్ని సవాళ్లను మన ముందు ఉంచుతుంది. ఒక రకంగా అది దేవుడి గురించి చెప్పిన పుస్తకం. మరో రకంగా దేవుడనే శూన్యాన్ని విశ్లేషించిన పుస్తకం. అర్థం చేసుకొని అన్వయించుకునే దాన్ని బట్టి పాఠకుని అవగాహన పెరుగుతుంది. ఏదైనా పనిని మనం అనుకున్నది అనుకున్నట్టుగా చేయలేం. ఏవో కొద్దిపాటి అవకతవకలు తప్పవు. అవి ఎందుకు తప్పవూ అంటే అదే 'దైవేచ్ఛ' అని అంటున్నారు. నువ్వు చేయదలుచుకున్న దానికి, దైవాభీష్టానికి కొంత తేడా ఉంటుందంటున్నారు. ఆ తేడాల్ని "టైమ్ అండ్ స్పేస్"తో పాటు వాటి డైమెన్షన్స్ గురించి లోతుగా అధ్యయనం చేయగలిగినప్పుడు సమాధానాలు దొరుకుతాయి.

ఎందరో ఉన్నత స్థాయి సాహితీవేత్తలు మనకున్నారు. వారందరిలో ఒక చిన్నపాటి ప్రత్యేకతను నేను సంతరించుకోగలిగాను. ఎందుకంటే కేవలం అది నా వైజ్ఞానిక దృక్పథం వల్లనే అని అనుకుంటున్నాను. సాహిత్య–వైజ్ఞానిక రంగాల మధ్య వారధిగా నిలబడగలిగినందుకే అని తలుస్తున్నాను. జీవం గురించి, జీవ పరిణామం గురించి లోతుగా అధ్యయనం చేయగలిగే అవకాశం నాకు వచ్చింది కాబట్టి, ఆ విజ్ఞానం వృధా కాకుండా దాన్ని నా రచనలకు వెన్నెముకగా మలచుకోగలుగుతున్నాను. అందువల్ల నా రచనలు రొటీన్ కంటె కొంత భిన్నంగా ఉంటున్నాయి.

చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ (కాలం కథ) వంటి పుస్తకాలు దేవరాజు మహారాజును ప్రభావితం చేశాయి.

**1.14. అవార్డులు**:

1. పాలు ఎర్రబడ్డాయి కథకు ఆంధ్రజ్యోతి వారపత్రిక బహుమతి (1973).
2. జీవిత పోరాటం కథకు జ్యోతి మాసపత్రిక బహుమతి (1982).
3. తొలి ఎక్స్–రే కవిత్వం అవార్డు (1983).
4. జాతీయ సమావేశాలకు రెండుసార్లు భారత్ భవన్, భూపాల్ వారి ఆహ్వానం (1987, 1989).
5. రంజని రజతోత్సవాల సన్మానం (1989).
6. 'గాయపడ్డ ఉదయం' వచన కవితా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం (1991–92).
7. దాశరథి దంపతుల సత్కారం (1994).
8. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సత్కారం (1996).
9. జి.వి.యస్. కథా సత్కారం (1997).
10. ఆంధ్రా అసోసియేషన్, న్యూఢిల్లీ (ఎ.పి. భవన్) సన్మానం (1997).
11. మారసం – సురమౌళి కథా పురస్కారం (2002).
12. డా॥ పరుచూరి రాజారామ్ సాహితీ సత్కారం (2006).
13. మానస ఉగాది పురస్కారం (2007).
14. అనువాదానికి సాహితీ మేఖల జాతీయ అవార్డు (2009).
15. ఇందూరు భారతి వారి తొలి జీవన సాఫల్య పురస్కారం (2012).
16. వచన కవితకు నవ్య సాహితీ సమితి వారి వసంతోత్సవ పురస్కారం (2015).
17. సాహితీ మేఖల – నల్లగొండ వారి తొలి సాహితీ జీవన సాహిత్య పురస్కారం (2015).
18. దాశరథి పురస్కారం (2016).
19. జమ్మి కోనేటీరావు – తొలి వైజ్ఞానిక సారస్వత జీవన సాఫల్య పురస్కారం (2016).
20. వికాసం, బరంపురం (ఒడిశా) విశాఖ రచయితల సంఘం సంయుక్తంగా అందించిన ప్రప్రథమ "ఉప్పల లక్ష్మణరావు సాహితీ జీవన సాఫల్య" పురస్కారం (2017).
21. కిన్నెర – శ్రీశ్రీ సాహితీ పురస్కారం (2017).

22. పురిపండా అప్పలస్వామి జీవిత సాఫల్య పురస్కారం (2019).

వంటి అవార్డులను స్వీకరించారు. జీవ శాస్త్రానికి సంబంధించ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో తన పరిశోధక పత్రాలు సమర్పించారు. మరో వైపు కేంద్ర సాహిత్య అకాడమీ (2007), ఆకాశవాణి (2014), కుమార్ అసాన్ మెమోరియల్ (2015) జాతీయ కవి సమ్మేళనాలలో పాల్గొన్న సృజన శీలి, బహు గ్రంథకర్త. ప్రాంతీయ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఎన్నో పోటీలకు, అవార్డులకు న్యాయ నిర్ణేతలుగా, జ్యూరీ మెంబర్గా ఉన్నారు. ఒక దశాబ్ద కాలం పాటు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా, న్యూఢిల్లీ వారికి సలహా సంఘం సభ్యులుగా పనిచేసిన బహుముఖ ప్రజ్ఞాశీలి దేవరాజు మహారాజు.

★★★

# అధ్యాయం – 2

# దేవరాజు మహారాజు రచనలు – పరిచయం

## అధ్యాయం – 2

## దేవరాజు మహారాజు రచనలు – పరిచయం

ఈ అధ్యాయంలో దేవరాజు మహారాజు రచనలను పరిచయం చేస్తాను. వాటిలో –

### 2.1. కవిత్వం:

2.1.1. గుడిసె గుండె – 1974

2.1.2. గాయపడ్డ ఉదయం – 1990

2.1.3. కవితా భారతి – 1991

2.1.4. బయిరూపులోల్లం – 1991

2.1.5. మట్టి గుండె చప్పుళ్ళు – 1996

2.1.6. రాజముద్ర – 2007

2.1.7. నీకు నాకూ మధ్య ఓ రంగుల నది – 2009

2.1.8. మధుశాల – 2010

2.1.9. జీవితమే ఒక కవిత – 2011

2.1.10. కాలాన్ని వెనకేసిన మనిషి– 2014

### 2.2. కథలు:

2.2.1. కడుపు కోత – 1977

2.2.2. పాలు ఎర్రబడ్డాయి – 1991

2.2.3. దేవరాజు మహారాజు కథలు – 1993

2.2.4. మనిషి కథలు – 1993

2.2.5. డాక్యుమెంటరీ స్టోరీస్ – 1993

2.2.6. అపూర్వ జానపద కథలు – 2013

2.2.7. భారతీయ కథా ప్రతిబింబం – 2014

2.2.8. విశ్వకథాసాహితి – 2014

2.2.9. భారతీయ భాషల్లో స్త్రీవాద కథలు – 2015

### 2.3. నవల:

2.3.1. మంచి ముత్యం – 2008.

**2.4. నాటకాలు**:

2.4.1. మూఢనమ్మకాల్ని వదిలిద్దాం (నాటిక సంపుటి) – 2006

2.4.2. లైఫ్ టానిక్ (నాటకం) – 2007.

**2.5. వ్యాస రచనలు**:

2.5.1. ఆధునిక యుగంలో జానపద సాహిత్యం – 1987

2.5.2. స్మృతి సుగంధం – 2008

2.5.3. స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం – 2009

2.5.4. ఆత్మ నుంచి అక్షరానికి – 2010.

2.5.5. కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు – 2014

2.5.6. కొన్ని కలాలు – కొన్ని సమయాలు – 2015.

**2.6. సైన్స్ రచనలు**:

2.6.1. మూఢనమ్మకాలు సైన్స్ (1991):

2.6.2. భారతీయ వైజ్ఞానిక వికాసం – 2006

2.6.3. విజ్ఞానపథంలో విజయ ఘట్టాలు – 2010

2.6.4. సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ – 2015

2.6.5. మానవవాదం – జీవన నినాదం – 2017

2.6.6. నువ్వేమిటో నీ ఆహారం చెబుతుంది – 2018

2.6.7. నేనంటే ఏమిటి – 2019

**2.7. సినిమా**:

2.7.1. పథేర్ పాంచాలి – 2009 (సత్యజిత్ రే సినిమా స్క్రిప్టు)

**2.8. ఇతర రచనలు**:

2.8.1. భారతీయ వారసత్వం – సంస్కృతి విజ్ఞాన నాగరికతలు – 2006

2.8.2. తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీమూర్తులు – 2008.

## 2.1. కవిత్వం:

### 2.1.1. గుడిసె గుండె (1974):

"1974లో 'గుడిసె గుండె' నల్లగొండ జిల్లా మాండలికంలో ప్రచురించారు. తెలంగాణ ప్రజల భాషలో వచ్చిన తొలి కవితా సంపుటిగా 2015లో తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ ప్రజల భాషలో మొదటి కవిత రాసినవారు దేవరాజు మహారాజు"[2] వీరిని ఆదర్శంగా తీసుకొని చాలామంది కవులు వచన కవితలు రాశారు. వారిలో పంచరెడ్డి లక్ష్మణ (ఇసిత్రం), తెలిదేవర భానుమూర్తి (ఊరోల్లు), టి. కృష్ణమూర్తి యాదవ్ (తొక్కుడు బండ)లు మాత్రం తమ సంపుటాలుగా ప్రకటించారు.

చెరబండరాజు, శ్రీశ్రీ, జై సీతారాం, అల్లం నారాయణ, యస్. గోపి, మోతుకూరి అశోక్కుమార్, కౌమోదకి, రేడియం, లక్ష్మణాచార్య, పరమాత్మ, భాస్కర్ వంటి కొంతమంది ప్రముఖులు, యువకవులు ప్రజల భాషలో కొన్ని కొన్ని కవితలు ప్రకటించినవారే.

దేవరాజు మహారాజు "దీపాల పాపాలు" అనే కవితలో

**"పెంటల్నించి పొద్దుకొచ్చే**
**బలం గల మొక్క లెక్క**
**లోకమంత కాంతిచ్చే –సుక్క**
**మెర్సుకుంట ఒత్తది"** **(జీవితమే ఒక కవిత, పుట – 225)**

పెంటకుప్పల్లాంటి అనాథల, అభాగ్యుల బతుకుల్లో నుంచే దోపిడీ, దారిద్ర్యం అనే చీకటిని తొలిగించే సూర్యుడిలాంటి మనిషి పుట్టుకొస్తాడని కవి భావన.

ఇది తెలంగాణ మాండలికంలో రచింపబడిన వచన కవితా సంపుటి. ఈ కవితా సంపుటిలో పండుగల మీద, ఆర్థిక పరిస్థితుల మీద, రాజకీయాల మీద, నాయకత్వ లోపాల మీద, ఒక్కో చోట విద్యారంగం మీద ఎక్కువ భాగం తిరుగుబాటును ఆకాంక్షిస్తూ సాగాయి.

ఈ కవితా సంపుటిలో "నవ్వులు, బరివాతల, ఉగాదొచ్చింది, అడ్డమైనోళ్ళు, లొటపెట, బతుకు కోసం, పచ్చనవ్వు, తాగుబోతు, తెల్ల కమ్మలు, ఉగాది పచ్చడ, తిరుగుబాటు, దూడూ బసవన్నా, జండా కాదు గుండె ఎగిరేయ్, బంగార్నవ్వు, యిసిత్రాలు" మొదలైన కవితలు కలవు.

"ఉగాదొచ్చింది" అనే కవితలో –

**"ఊల్లె కుగా దొచ్చింది**

---

[2] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–49.

**ఉర్కి రాంఁడి ఉర్కిరాంఁడి**
**ఊపిర్లు బిగబట్కోని**
**లేకుంటే అరువద్కోని**
**ఉర్కిరాంఁడి! ఉర్కిరాంఁడి!**
**డొక్కల డొకడొకల డప్పులు గొట్టి**
**పేగుల పాటలు సొన్నాయి కుతికె గట్టి**
**ఉగాది నూరేగిద్దాం రాంఁడి"** **(జీవితమే ఒక కవిత, పుట – 219)**

అని ఆహ్వానించారు. ఆకలిలో డొక్కలు అల్లాడుతున్నా ఆ డొక్కలే డప్పులుగా కొడుతూ పేగుల సన్నాయి పాటలు పాడుతూ ఉగాదిని హుందాగా ఊరేగిద్దాం రాంఁడి అంటూ అధిక్షేప స్వరాన్ని వినిపించారు.

సుసంపన్నమైన భారతదేశ నిర్మాణాన్ని మరిచిపోయి, గాంధీ టోపీల ముసుగులో జనాన్ని దోచుకుంటున్నంత కాలం దేశం ఆర్థిక ప్రగతి సాధించదనే అంశాన్ని దేవరాజు మహారాజు "బరివాతల" అనే కవితలో ప్రకటించారు.

**"మన దేశం తీర్గ**
**దొరల గుంపుల దొంగలు దోస్కొంగ**
**మిగిల్న ఉట్టి – పెయ్యని (పెయ్యిని)**
**తలకాయ మీద మట్టి శిప్పను**
**ఊరంత తిప్పుకుంట, తిప్పుకుంట**
**అవ్ వ్ వ్ వ్వ**
**బట్ట లేకుంట ఆడపిల్ల!**
**పోతనే ఉంది! బరివాతల–**
**దేశమాత బీద తనమోలె"** **(జీవితమే ఒక కవిత, పుట – 221)**

అంటూ దొరల దోపిడితో పోల్చి చెప్పారు. ఉన్నోళ్ళ దోపిడిలో తలకాయ మీద మట్టి చిప్ప తప్ప ఏమీ మిగలని మూడేళ్ల బిచ్చపు పోరిని చూస్తూంటే తాకట్టులోని భారతదేశం గుర్తుకు వస్తుంది అని అంటాడు.

వంశపారంపర్యంగా వస్తున్న నాయకత్వంలో లోపాలున్నాయనే విషయాన్ని "జెండ కాదు గుండె ఎగిరేయ్" అన్న కవితలో ఎండగట్టారు.

**అన్నం సంగతిడిశి పెట్టు**

**అన్ని ఊల్లల్లకు సరింగ**

**మంచి నీలు దొర్కుతానయా?**

**అన్ని ఊల్లల్ల ఆడోల్లు మైల్ల దూరం నడ్శి**

**ఒక్కొక్క బిందెకు బిందెడు శెమ్టిడిశి**

**నీల్దెచ్చుకునే జాగలున్నయ్**

**గిట్ల జెప్తే ఎన్నో యిభాగాలున్నాయ్**

**ఆడామే పదాన మంత్రై ఏం జేస్తాంది**

**కమస్కం ఆడోల్ల బాధలు దీర్చంది"?** **(జీవితమే ఒక కవిత, పుట – 240)**

అని ప్రశిస్తారు. ఆకలి, దారిద్ర్యాలను పక్కన బెట్టి అన్ని గ్రామాలకు మంచినీళ్ళు సవ్యంగా లభించే ప్రయత్నం చేయడం లేదు అని ఇందిరాగాంధీని ఎద్దేవా చేశారు.

ఈతరం నాయకులలో నిబద్ధత, త్యాగనిరతి, క్రమశిక్షణ, నైతికత లాంటిది ఏవీ లేకుండా పోతున్నాయని తను చెందిన కలతని సహజసిద్ధమైన జనం భాషలో శక్తివంతంగా చిత్రించారు.

రాజకీయం మనిషిని ఎంతగా దిగజార్చుతుందో "లొటపెట" అనే కవితలో వివరించారు.

**"అసలది గాడిద**

**నిమ్మలంగ అనుకువగ ఓంద్ర పెట్టి**

**బత్కులన్ని తెల్లంగ జేయిస్తనని**

**అడ్డమైన ఓట్ల గుడ్డలన్నీ పోలింగు సెంటరు**

**సాకలి రేవు దాక మోస్కపోయింది**

**శభాష్ నువ్వే మా పెద్దవు – అనంటంది పెజ"**

**(జీవితమే ఒక కవిత, పుట – 223)**

అని జనం అమాయకత్వాన్ని తెలియజేస్తూనే వారి అమాయకత్వాన్ని సొమ్ముజేసుకునే రాజకీయ నాయకుల గూర్చి –

**"ఇప్పుడది గాడిద గానే గాదు – లొటపెట!**

**గాడిద లొటపెట అయితదా అని**

**అనుమానమే వద్దు**

**రాజకీయం మందుదింటె, ఏది ఏదన్న గావొచ్చు"**

**(జీవితమే ఒక కవిత, పుట – 223)**

అని వ్యంగ్యంగా ఎత్తి పొడిచారు. రాజకీయంలోకి దిగక ముందు, దిగిన తర్వాత మారిన జీవితాన్ని గాడిద (లొటపెట) ఒంటెల మధ్య నున్న అంతరంలో పోల్చి చూపారు.

దీపం ఎంత చిన్నదైనా చీకటి గుండెల్ని చీల్చి వెలుగు నింపడానికి ప్రయత్నిస్తుంది. దట్టమైన చీకటి మాత్రం ఆ దీపాన్ని ఆర్పేయాలనే ప్రయత్నంలో ఉంటుంది. గెలుపు ఓటములు ఎట్లా ఉన్నా ఒకదాని మీద మరోకటి తిరగబడక తప్పదు. అన్యాయం మీద సామాన్యుడి తిరుగుబాటును దేవరాజు మహారాజు ఈ విధంగా రాశారు.

**"ఆత్మ యిస్వాసం జ్యోతి**
**ఊపిరి పెంచుకుంటాంది**
**శీకటి మీద తిరగబడ్తాంది**
**శేతనైన కాడికి మర్ల వడ్తాంది"** **(ఆవరణం, పుట – 52)**

అన్యాయమనే చీకటిని సహించలేని సామాన్యుడు దీపంలా తిరుగుబాటు చేస్తున్నాడని, చట్టాలు పిస్తోళ్ళు ఎక్కుపెట్టి భయపెడుతున్నా, శక్తినంతా కూడదీసుకుని ప్రాణాలను తెగించి మర్లబడుతున్నాడనే విషయాన్ని కవి ఎంతో ఆత్మ విశ్వాసంతో చిత్రించారు. తిరుగుబాటు ఇప్పుడిప్పుడే మొదలైందన్న నిజాన్ని దోపిడి వర్గం దృష్టికి తీసుకువస్తుంది గుడిసె గుండె కవిత.

నోరులేని పశువు చెలకలో గడ్డి మేసిందని చావబాదే వాడివి నీ రెక్కల కష్టం దొర దోచుకుంటున్నా నోరు మెదపవేం? అని సూటిగా ప్రశ్నిస్తూ, రైతు కూలీలలో చైతన్యం వచ్చి తిరుగుబాటు చేయాలని కవి పశువును ప్రతీకగా తీసుకొని "దూ దూ దూ దూ బసవన్నా" అనే కవితను రాసినట్లు తెలుస్తుంది.

**"నీవు నీవోల్గె నిలబడు**
**రోషమున్న ఆ వోల్గె కలెబడు**
**ఎప్పుడు?**
**నువ్వు తినే గడ్డయినా సరింగ అందియ్యనప్పుడు**
**దూ దూ దూ దూ బసవన్నా అంటే తలూపకు**
**రంకేయ్! మెడకున్న లంకె దియ్**
**రోజులు మారినయ్"** **(జీవితమే ఒక కవిత, పుట – 238)**

అంటూ మారుతున్న కాలంలో తల ఊపుతూ కాలయాపన చేయక, నీవు నీవుగా, రోషమున్న పశువుగా ఎదురు తిరగాలని సూచించారు.

మన విద్యావిధానంలో ఎన్నో లోపాలున్నాయి. మార్పు సాధ్యం కావడం లేదు. "అందుకు ప్రభుత్వం యొక్క అసమర్థత, విద్యార్థుల, విద్యా సంస్థల క్రమ శిక్షణా రాహిత్యం" అనేవి ప్రధాన కారణాలు. విద్యారంగంలోని లోపాలను దేవరాజు మహారాజు "తెల్లకమ్మలు" అనే కవితలో సునిశితంగా చెప్పారు.

**"పతిక్సనం బోరు బోరు అనుకుంట**
**పరిచ్చలప్పుడు బొక్క బోర్ల బడితే**
**ఎవ్వడాదు? ఆద్కునేటోడు!"**

అని భావిభారత పౌరులైన విద్యార్థుల సోమరితనాన్ని గుర్తు చేశాడు. అంతే కాదు...

**"కత్తులు – సూశిరాతల**
**గమ్మత్తులు**
**సూస్తుంటే మీరంత నిజంగ**
**డాక్సర్లింజనీర్లు, జవాన్ల**
**య్యేది తెలిస్తనే ఉంది"** **(జీవితమే ఒక కవిత, పుట – 233)**

అని ప్రామాణిక విద్య మూలంగా భవిష్యత్తులో దేశం డాక్టర్లను, ఇంజనీర్లను, జవాన్లను తయారు చేసుకోలేక పోవచ్చుననే ఆవేదన వ్యక్తం చేశారు కవి.

"తాగుబోతు" అనే కవితలో తన రక్తం తానే తాగి, మరణానికి చేరువవుతున్న మనిషిని దీపంతో పోల్చి చెప్పారు.

"పారే యేరు" అనే కవితలో కవులు పండితుల్ని సంప్రదాయాల ముసుగులోంచి బయటికి వచ్చి, సమకాలీన వస్తువును వాస్తవికంగా చిత్రించడం నేర్చుకొండంటారు. భాష సాహిత్యాలు "పారే యేరు" లాంటివి.

**"నిద్రొచ్చేటట్టు**
**జోల పాట లేమొద్దు**
**మంచి ముడి గలిగిన**
**నాల్గు పొడి మాటలు సాలు"** **(జీవితమే ఒక కవిత, పుట – 245)**

అనే అర్థం అంతసూత్రంగా ఉండి మనల్ని ఆలోచింపజేస్తాయి. కవిత్వం రాసింది ప్రజల భాషలోనైనా కవి సృజనాత్మక శక్తి వల్ల, పదచిత్రాలు మాత్రం ఆ పరిధిని దాటి ఉన్నతంగా సాగాయి.

శ్రామికుల కష్టఫలంతో దేశం వెలుగు నింపుకున్న విధానాన్ని "గుడిసె గుండె" కవితలో ఇలా అన్నారు.

**"రాతిరంత**
**తొవ్వలపన్న జీవి కడుపు మంటలు**
**పొద్దుగాల**
**సూరీడై... పొద్దెక్కుతాంది"** **(ఆవరణం, పుట – 54)**

ఇందులో ఆకలి మంటలతో కాలుతున్న శ్రమ జీవులే లోకానికి వెలుగునిచ్చే సూర్యుళ్ళు అన్న అర్థం ధ్వనిస్తుంది.

దేవరాజు మహారాజు ఈ కవితా సంపుటిలో తెలంగాణ మాండలిక కవిత ద్వారా సమకాలీన తెలుగు సాహిత్య రంగంలో మరిచిపోలేని ముద్ర వేశారు. అలాగే ఇతర భారతీయ భాషల్లోని మాండలిక కవిత్వాన్ని తెలంగాణ మాండలికంలోకి అనువాదం చేసి అందించారు. అంతే కాదు, "గుడిసె గుండె"లో సామాజిక రుగ్మతలని వివిధ కోణాల్లోంచి ఎత్తి చూపారు. తెలంగాణలోని జమీందార్లు, భూ స్వాముల ప్రజల మీద సాగించిన దోపిడి, దౌర్జన్యాలు, వెట్టి, బానిసత్వానికి వీరి తెలంగాణ మాండలిక కవిత్వం అక్షర రూపమైంది.

### 2.1.2. గాయపడ్డ ఉదయం (1990):

"గాయపడ్డ ఉదయం" అనే కవితా సంపుటి 1990వ సంవత్సరంలో వెలువడింది. సమాజంలోని సమకాలీన సమస్యలు, రాజకీయాలు, దోపిడి, పేదవాని జీవిత చిత్రణ, చైతన్యం, గురువు, విద్యార్థి, స్త్రీ, అక్షరం మొదలైన వాటి గురించి వివరించబడ్డాయి.

గాయపడ్డ ఉదయం నిజానికి కవి హృదయానికి తగిలిన గాయం. ప్రతిరోజు ఏదో ఒక గాయం, గాయం తగలని రోజు అంటూ లేదు. ఈ కవితా సంపుటిలో మతం కింద రాజకీయం, ఆస్తి కింద, అంతస్తు కింద, కళల కింద, కలల కింద, రాజకీయ కుష్టు వ్యాధితో బాధపడుతున్న ఈ దేశం ఫొటోతో సహా పత్రికలుదయిస్తాయి. ఈ కవితా సంపుటికి 1991లో తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు లభించింది.

గాయపడ్డ ఉదయం కవితా సంపుటిలో "లైట్హౌజ్, మొక్క, భారతనారి, పారాణి, బాలచేష్ట, హత్య, ఎలిజీ, ప్రిస్క్రిప్షన్, శిక్ష, చనుబాలు, కరప్ట్, గడియారం, కేంపస్ కిటికీ లోంచి, అంతిమ సందేశం, ప్రెస్ రిపోర్ట్, కలర్ ఫుల్ బ్రౌన్ షుగర్ మొదలైన 63 మినీ కవితలు కలవు.

సంఘంలో గురువుల గురుతర బాధ్యత గురించి, వారి నిరాడంబరత గురించి "లైట్హౌజ్" కవితలో తెలియజేశారు కవి.

**"అతడు కేవలం క్లాసులో ఉపన్యసించడు**
**జీవన సౌందర్యాన్ని కూడా ఉపాసిస్తాడు**
**విద్యార్థుల్ని, స్నేహితుల్ని, అనుచరుల్ని వెంటేసుకుని**
**దారులన్నీ తిరుగుతుంటాడు**
**కొత్త దారులు వెతుకుతుంటాడు"** **(జీవితమే ఒక కవిత, పుట – 112)**

"మొక్క" అనే కవితలో కవి మనస్సులో కవిత ఎలా పుడుతుందో చాలా అద్భుతంగా చెప్పారు.

**"నల్లని కలల కింద**
**మంచం నిద్రపోతుంది**
**జీవధార కుళాయి నీటి సంగీతం కోసం**
**మాత్రమే కాదు ఈ మెలకువ!**
**రక్తాన్ని చెమట చేసిన పగటిని – దాటి**
**చెమటను సిరాగా మార్చే**
**ఈ రాత్రంతా నాలో మేల్కునే ఉంటుంది"** **(జీవితమే ఒక కవిత, పుట – 162)**

"పారాణి" అనే కవితలో కట్న సమస్యలకు బలైపోతున్న యువతులను గూర్చి, తన ఆవేదనను, భయాన్ని వ్యక్తీకరించారు కవి.

**"చదువుల తల్లే అయినా**
**లక్ష్మిలా నడిచి రాలేదని**
**మగ చూపులు బుసలు కొడితే**
**చార్మినారు మరణాలు, ముగ్గురక్క చెల్లెళ్ళ**
**మూకుమ్మడి ఆత్మహత్యలు**
**దిన పత్రికలో పతాక శీర్షికలై**

**ఎవరికి పట్టక..."** **(జీవితమే ఒక కవిత, పుట – 179)**

"బాలచేష్ట" అనే కవితలో పార్టీలు మార్చే రాజకీయ నాయకుల ధోరణిని కవి చాలా చక్కగా వివరించాడు.

తెలంగాణ జన జీవిత నేపథ్యం నుంచి రచించిన "హత్య" అనే కవితలో దొరల క్రూరకృత్యాలకూ, వర్షానికి పోలిక చూపించడం జరిగింది.

కేలండర్ను క్షుద్రమైన కలుషిత మానవ జీవితానికి ప్రతిబింబంగా "ఎలిజీ" కవిత ఎత్తి చూపుతుంది.

**"కేలండరు మీద పీనుగుల్ని**
**కేలండరు మీద రక్త ప్రవాహాల్ని**
**కేలండరు మీదే ఆ కళ్ళు, హత్యలు, శారీరక దోపిడులు**
**బాంబులు, యుద్ధాలు, రాజకీయాలు"** **(జీవితమే ఒక కవిత, పుట – 133)**

"శిక్ష" అనే కవితలో అత్యాశ ఏ విధంగా చివరకు శిక్ష అనుభవిస్తుందో వివరించడం జరిగింది.

"చనుబాలు" అనే కవితలో న్యాయస్థానాన్ని గొప్పవారికి అమ్ముడైపోయి, బీదలకు పాలివ్వని రిక్త స్తనాలుగా వర్ణించాడు.

**"గొప్పింటి డబ్బు పిల్లల సరదాకోసం**
**చీకట్లోనే స్తనాలు అమ్ముడైపోతున్నాయి**
**ఇక ఈ ప్రభుత్వపు 'న్యాయ స్తనాల్ని'**
**మండిపోయే కడుపుల్తో పీకుతూ చప్పరిస్తూ**
**జనం కూనలు..."** **(జీవితమే ఒక కవిత, పుట – 145)**

కుర్రాఫీసర్, అద్దుడు కాగితంలా అవినీతి సిరాలో నాని సల్లబడటం "కరప్ట్" అనే కవితలో చూపించారు.

**"నిన్నటి చీకటిని తుడిచే శాననుకున్న**
**కుర్రాఫీసరు లాంటి తెల్లని ఉదయపు బ్లాటింగ్ పేపర్**
**ఆవేశంతో పగటిని, సాయంత్రాన్ని, సంధ్యను**
**క్రమంగా కటిక చీకటిని పీల్చి పీల్చి**

**మెల్ల మెల్లగా నల్లబడి**

**తనూ రాత్రయ్యింది"** **(జీవితమే ఒక కవిత, పుట – 148)**

విశ్వవిద్యాలయాలలోని లోపభూయిష్టమైన విద్యావిధానాలను నానాటికీ పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను, స్వేచ్ఛ అనే పేరుతో యువతలో చెలరేగుతున్న విధ్వంసక శక్తులను, అత్యాచారాలను గురించి "కేంపస్ కిటికీ లోంచి" అనే కవితలో తెలియజేశారు.

నానాటికి సంఘంలో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం, కల్తీ సమస్యలు, దిగజారిపోతున్న ప్రమాణాలు కళ్ళకు కట్టినట్లుగా "ప్రెస్ రిపోర్ట్" అనే కవితలో చెప్పారు.

### 2.1.3. కవితా భారతి (1991):

కవుల పరంగా, ఖండికల పరంగా తనకు నచ్చిన కవితల్ని వివిధ భారతీయ భాషల్లోంచి సేకరించి, తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేసి దేవరాజు మహారాజు "కవితా భారతి"ని అందించారు.

ఇందులో అస్సామీ, ఇంగ్లీషు, ఉర్దూ, ఒరియా, డోగ్రి, కన్నడ, గుజరాతీ, తమిళ, పంజాబీ, బెంగాలీ, మణిపూరి, మరాఠి, మళయాళం, సింధీ, హిందీ మొదలైన భాషల కవితల నుంచి ప్రముఖ కవుల ఖండికల్ని సరళతరమైన తెలుగులోకి అనుసృజించడం జరిగింది.

ఈ సంకలనంలో (కవితాభారతి) కేకే దారువాలా కవిత "పేగు" హృద్యమైన కవిత. తన కూతురు రుక్జెన్ పై రాసిన కవితను తెలుగులో ఈవిధంగా అనువదించారు.

**"సుద్ద పొడిలాంటి మెత్తని**
**మృదువైన లేత ఎముకలు**
**పక్షిలాగా నిలకడలేని చూపు**
**వర్షం కడిగిన ఆకులా స్వచ్ఛమైన మనసు..."** **(ఆవరణం, పుట – 118)**

అంటూ "అక్షరారణ్యంలో మౌనంగా, ధైర్యంగా ముడుచుకు పడుతున్న" తన కూతుర్ని మృదువుగా స్పృశిస్తారు.

ఈ సంకలనంలో దళిత కవుల కవితలు ఎంతో విప్లవాత్మకంగా ఉన్నాయి. తమకి కూడా రిజర్వేషన్లు కావాలనే వాళ్ళకి సమాధానంగా రాసిన కవిత ఎంతో భావగర్భితంగా ఉంది. "దుఃఖాన్ని, దైన్యాన్ని, దాసీతనాన్ని మెళ్ళో వేసుకుని సమాజపు వీధుల్లో తిరగండి, అప్పుడు అడగండి మాకు రిజర్వేషన్లు కావాలి" అని కవి ఆవేదనగా అంటాడు. త్రయంబక్ సబ్కాలే కవిత

"మేడిపండు" మరో గొప్ప కవిత. ఈ కవితలు మన గుండెల్లో చురకత్తుల్లా దిగబడతాయి. "వర్గం – వర్గం" అన్న వినయ్ తుమ్రాం కవిత కూడా ఇలాంటి కవితే.

పెరిగిపోతున్న అవినీతినీ, అన్యాయాల్ని నిరసిస్తూ చాలా శక్తివంతమైన కవితలు ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.

"ఏదన్నా గింత నేరం మోపుండి" అనే కవితలో

**"అయ్యా దొరా**
**ఈనిమీద దయుంచుండి**
**ఈని మీదింత ఏదన్న నేరం మోపుండి**
**ఏమన్న జెయ్యుండి గాని**
**పూటకింత తిండి జూపుండి సాలు"** **(ఆవరణం, పుట – 111)**

అంటూ మాండలిక పదాల్లో ఒక పల్లెలో కరువొచ్చిన తీరుని, తల్లి వేదనగా చెప్పటాన్ని దేవరాజు మహారాజు తనదైన యాసలో తెలుగనువాదం చేశారు. దీనిలో తల్లి దైన్యతను కొడుకు బతికితే చాలు అన్న ఆశను అద్భుతంగా అక్షరీకరించారు.

"Bench in the Park" (బెంచ్ ఇన్ ద పార్క్) అన్న కవితలో

**"మూత్రశాల ఆచూకి కోసం**
**విసుక్కు చస్తున్నవాడు**
**ప్రశ్నలు కురిపిస్తున్నాడు**
**అకస్మాత్తుగా కాటేసి పోయిందొక దోమ**
**ఎలా ఈ పార్కోని బెంచ్ని కొలవగలం"** **(ఆవరణం, పుట – 112)**

అంటాడు. ఏ నగరంలోనైనా పార్కు బెంచి సంగతి ఇంతే కదా! పార్కు బెంచి ఎదిరించి జీవితాల్ని చూస్తుందో... ఒక్క పార్కు బెంచి గురించి ఉజ్వల స్పందనను పొందిన కవి భావాన్ని – అనువాదకులు మనసు పార్కులోకి ప్రవేశపెట్టి, మళయాళ కవితలో కాకుండా తెలుగు కవితలోనే నడిపిస్తున్నట్లుగా అనుభూతిని కలిగించాడు.

"రాజధాని" కవితలో

**"ఈ మహానగర జనసాగరంలో**
**ఒక ఆర్తనాదాన్ని మీరెలా వినగలరు?**
**నిశాచరులకు**

**పైశాచిక ప్రవృత్తిగల వానరులకు మాత్రం ఇది కేంద్రం**
**గాయపడ్డ హృదయమంటే**
**అదేమన్న అంతరిక్షంలోకి దూసుకెళ్లే**
**రాకెట్టు అనుకున్నావా"** **(ఆవరణం, పుట – 113)**

అనే భావాలు కన్పిస్తాయి. ఈ అనువాదంలో మనకు మన రాజధానే ప్రత్యక్షమవుతుంది. ఇక్కడి జన సందోహం కృత్రిమత్వం, కూలిన మానవత్వం, విశేషించి విశ్లేషించి కనిపిస్తుంది. కొత్తగా ఏదో చెబుతున్నట్లు గాక, మనం మన రాజధానిలో పడుతున్న అవస్థ గురించి వివరిస్తున్నట్టు ఉంటుంది.

పంజాబ్ సమస్యకు ఎంతగానో స్పందిస్తూ పంజాబీల ప్రత్యేక నృత్యమైన "భాంగ్డా" పేరుతో మత తత్త్వ రాబందులకు అన్వయించి ప్రముఖ పంజాబీ కవి ఇక్బాల్దీప్ బీభత్సాన్ని వర్ణిస్తూ రాసిన కవితను దేవరాజు మహారాజు తెలుగులో ఈవిధంగా అనువాదం చేశారు.

**"త్రిశూలాలు ఎగిరిపడ్డాయి**
**శత్రువులెవరో అంతు పట్టరు**
**మానవత్వం నిలువునా కుప్ప కూలింది**
**మాంసం ముద్దల మీద**
**గద్దలు రాజ్యం చేస్తున్నాయి"** **(ఆవరణం, పుట – 113)**

ఇలా ఈనాటి పంజాబ్, కాశ్మీరులను అల్లకల్లోలంగా విచలితపరిచే విషాద దృశ్యాలను తెలుగు పదాల్లోకి రూపాంతరం చేసి, బాధకు భాషాంతరం లేకుండా చేశారు దేవరాజు మహారాజు.

ఈ సంకలనంలో మరో సింబలిస్టు కవిత, "హనీమూన్"ఇది ప్రేమికుల అనురాగ బంధాన్ని అద్భుతంగా చిత్రించిన కవిత

**"సముద్రంలో స్నానిస్తున్న ఆ స్త్రీ**
**తన ఇంటి కిటికీ గుండా చూస్తున్నది**
**సముద్రంలో మునిగి తేలుతున్న మనిషి**
**కవిత్వం రాస్తూ కనిపించాడు"** **(ఆవరణం, పుట – 119)**

అన్న వాక్యాలు మనలో రకరకాల భావాల్ని కలిగిస్తాయి. ఒకరిలో ఒకరుగా కలిసిపోతున్న ప్రేమికులు ప్రేమ సముద్రంలో మునిగి తేలుతున్నారు. తన 'ఇంటి కిటికీ' తెరిచి చూస్తోంది ఆ స్త్రీ. ఆ హాయినంతటినీ గుండెల నిండా పీల్చుకుంటూ మనసు నిండా కవిత్వం రాసుకుంటున్నాడు ప్రేమికుడు, "నీళ్ళ మీద జారిపోయే నౌక కూడా అతనికి ఒక కాలిజోడే" అని చమత్కరిస్తాడు ఈ

కవి. అనురాగ సంగమంలో అలసిపోయిన జంట – "జంట శిలల వలె సగం ఇసుకలో కప్పబడి సగం వెన్నెల్లో మెరిసిపోతూ నిద్రపోయారట ఆ సముద్రపుటొడ్డున!

**"నింపాదిగా కదిలే నదిలాగా రెండు మెత్తని పెదవుల్ని**

**కలిసి ప్రవహించ నిద్దాం ప్రేమలో సరిహద్దుల్లేవు"**

అని అంటున్నది మన గుంటూరు శేషేంద్రశర్మ కాదు, అస్సామీ కవి సమీర్ తాంతి. కవితా సమరానికి భాష లేదు కదా!

ప్రసిద్ధ ఇండో–ఆంగ్ల కవి ఇజికియల్ అమ్మకు తేలు కుట్టిన రాత్రిపై రాసిన కవితను దేవరాజు మహారాజు అద్భుతంగా తెలుగు అనువాదం చేశారు.

**"నా కింకా జ్ఞాపకమే అమ్మకు తేలు కుట్టిన రాత్రి**

**భోరుమని తెరపిలేని వర్షం కురిసిన రాత్రి"**

ప్రసిద్ధ కవయిత్రి కమలాదాస్ "రాత్రికి మాత్రం మగడి పక్కలో చంటాణ్ణేసుకుని కలలు కంటూ ఉండు, కలల తల్లి ఒడిలో వాలిపో" అని ఫెమినిస్టు దృక్పథం వెలయిస్తున్నప్పుడు మన ఓల్గా తరంగాలు, జయప్రభ కెరటాలు గుర్తుకు వస్తాయి.

ఉర్దూలో 'అక్తరు లిమాన్'

**"ఈ మహా నగరాలు డబ్బుకన్న వాడి నగారాలు**

**నల్ల డబ్బు నయగరాలు"**

అనగానే తెలుగులోని మఖ్దూం మొహియుద్దీన్ సుప్రసిద్ధ గేయం స్ఫురిస్తుంది. చిత్రంగా రెండూ అనువాదాలే.

కన్నడంలో ఆడిగ గోపాలకృష్ణ "నదికి, చెరువుకి, బావికి, మురికి గుంటకి నీటిలో తేడా ఎక్కడుంది. కుల ప్రసక్తి ఎక్కడుంది, మీరు పెంచి పోషించిన కులం, నీటికి ఆపాదిస్తారే" అని అంటున్నారు.

**"చెట్లు తమలో తాము గొణుక్కుంటున్నాయి**

**ఈ మనుషులు మనల్ని నరికి ఎన్నో శిలువలు చేస్తున్నారు"**

అని అన్నది మన చెట్టు కవి ఇస్మాయిల్ కాదు. తమిళ కవి సౌందర రాజే.

**"హృదయం లేని మొరటు సాయంత్రం**

**రైలు వెళ్లిపోయిన ఆకాశంలో వేలాడుతున్న పొగ మేఘాలు...**

**కాలగమనంలో — మనవ హృదయంలో"** **(కవితా భారతి, పుట:78)**

అని స్పష్టంగా అన్నది మన వేగుంట మోహన ప్రసాద్ కాదు. కన్నడ కవి నిసార్ అహ్మద్.

**"సముద్రం ఆవిరై, మబ్బులై, వర్షమై**
**అతని రక్తం దేశమంతా కురిసింది**
**ఎవరు చంపారు? ఎందుకు చంపారు అతన్ని?**
**'అతడి' రక్తం మా అన్నంలో నీళ్ళలా కలిసిపోయింది"**

**(కవితా భారతి, పుట:114)**

అచ్చం తెలుగు విప్లవ కవి వరవరరావులా వినిపించినది బెంగాలీ విప్లవ కవి సాగర్ చక్రవర్తి.

**"నీళ్ళు నీళ్ళని దోసిళ్ళు చాపండి**
**మోట బావుల దగ్గర**
**వెలి వేయబడి, మండు టెండలో**
**మోకాళ్ల మీద వంగి మాలలై, మాదిగలై**
**చచ్చిన కుళ్ళు జంతువుల్ని లాగుతున్నాం"** **(కవితా భారతి, పుట:135)**

అని మన బోయి భీమన్నలా, జ్ఞానానంద కవిలా, గద్దర్ గానంలా, పద్మారావు కంఠంలా ప్రశ్నించింది మరాఠీ దళిత కవి రాం బసాఖాత్రే!

1964లో బొంబాయి నుంచి వెలువడే బ్లిట్జ్ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన హెచ్.యస్. ఛటోపాధ్యాయ కవితకు తెలుగు రూపం 'మిర్చి మసాలా'. నిత్యావసర వస్తువులతో మాట్లాడించి, ఈనాటికి మార్పు లేని కల్తీ ప్రహసనాన్ని ఎగతాళి చేస్తుంది. "స్పష్టమైన గొంతు శతాబ్దాల నుండి శతాబ్దాల దాకా ప్రయాణిస్తుంది" అని ఉమాశంకర్ జోషి "అన్వేషణ" అనే కవితలో చెబుతారు. పది లైన్ల పొట్టి కవిత "చెట్లు తమ నుంచి కనీసం ఒక్క క్రీస్తునైనా తయారు చేసుకోలేక పోతున్నారని చెట్లు తమలో తాము గొణుక్కుంటున్నాయి" అంటూ తమిళ కవి జి. సౌందర రాజ్ అద్భుత సత్యావిష్కరణకు పూనుకుంటారు.

భారతీయ భాషలన్నింటికీ ఘనమైన చరిత్ర ఔన్నత్యం ఉన్నాయి. ప్రతి భాషలోనూ సృజనాత్మక రచనలున్నాయి. అవి ఒక భాష నుంచి మరో భాషలోకి పరావర్తనం చెందుతున్నాయి. అందుకు కారణం అనువాదాలు.

దేవరాజు మహారాజు భారతీయ కవితని 'కవితా భారతి'గా అనువాద వారధిగా సమగ్రపరిచారు.

## 2.1.4. బయిరూపులోల్లం (1991):

విభిన్న సామాజిక సమూహాల జీవనశైలిని, బయటకు వ్యక్తీకరించ లేకపోతున్న వారి కష్టాలను, కన్నీళ్ళను కవితలుగా మార్చారు. దేవరాజు మహారాజు 1980వ సంవత్సరంలో ఆకాశవాణి కవి సమ్మేళనం కోసం రాసిన 'బయిరూపులోల్లం' అనే కవితకు చాలా మంచి పేరు వచ్చింది. మహాకవి దాశరథి కృష్ణమాచార్య ఆయనను వేదిక మీదే కౌగిలించుకుని అభినందించారు. ఎన్నో కవితా సంకలనాల్లో ఈ కవిత చోటు చేసుకుంది. భోపాల్ జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో ప్రశంసలందుకుంది. ఇతర భాషల్లోకి అనువదింపబడింది. రంగస్థలం మీద కూడా ఈ కవితని దాశరథి రంగాచార్య దక్కనీ ఉర్దూలోకి తర్జుమా చేసే ప్రముఖ పంజాబీ కవి ఇక్బాల్ దీప్ పంజాబీలోకి అనువదించారు. ఇంగ్లీషులోకి కూడా డా॥K.B. గోపాలం అనువదిస్తే దాని నుండి అది ఇంకా ఇతర భాషల్లోకి వెళ్ళింది.

**"మేం బయిరూపులోల్లం**
**మా తాత తండ్రుల కానుంచి లేని ఏషం**
**నేనేమన్న ఇయ్యాల్ల కొత్తగ గడితినా**
**..... బువ్వ కుండల మెత్కులెక్క**
**దేశమంత ఉడుకుతునే ఉంటిమీ**
**మా బతుకు మెతుకొకటి సూస్తే**
**తెల్వది నాయినా దేశం సంగతి?"** **(ఆవరణం, పుట – 53)**

అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా, ప్రణాళికలు రూపొందినా, ఆకలి, దారిద్ర్యం పెరిగిపోతూనే ఉన్నాయి. ఆకలిచావులు, దోపిడి, ఆర్థిక వ్యత్యాసాలు, వలసపోతున్న శ్రామికుల బాధలు, అయినవారి చేతుల్లో కీలుబొమ్మలవుతున్న బిచ్చగాళ్ల, వేశ్యల, నిమ్నజాతుల బతుకులు దేశం ఆర్థిక బలహీనతకు ప్రతిరూపాలని దేవరాజు మహారాజు ఈ కవితలో సవివరంగా చెప్పారు.

"బయిరూపులోల్లం" అనే కవిత బిక్షమెత్తి జీవించే జాతిని దృష్టిలో పెట్టుకుని రాసినదైనా, పరోక్షంగా అది రాజకీయ నాయకుల్ని, అధికారుల్ని, నిర్ణయాలు తీసుకునే పెద్ద మనుషుల్ని ఘాటుగా విమర్శించింది. సున్నితమైన హాస్యం, వ్యంగ్యంతో కవిత ఎంత సరదాగా సాగుతుందో తాకాల్సిన వాళ్ళకు అంతగా అది నషాళానికెక్కుతుంది. బయిరూపులవాడే మన ముందు తన గోడు వెళ్ళబోసుకుంటున్నాడనుకుంటాం కాని కవి ఎక్కడ ప్రత్యేకంగా కనబడదు. కవి కవితా నడకలోనే లీనమై ఉంటాడు.

## 2.1.5. మట్టి గుండె చప్పుళ్ళు (1996):

తెలుగునాట దళిత స్పృహ ఉధృతం కాకమునుపే 1988లో మరాఠీ దళిత కవిత్వాన్ని విరివిగా తెలుగు పత్రికల కెక్కించిన, సాహితీ ప్రక్రియలన్నింటిలో నిరంతరం కృషిచేస్తూ రచనే ఊపిరిగా బతుకుతున్న సాహిత్య జీవి దేవరాజు మహారాజు. మరాఠీ దళిత కవిత్వాన్ని తెలుగులోకి అనువదించి తనదైన ప్రత్యేకమైన శైలిని నిరూపించుకున్నారు. అందులో భాగమే "మట్టి గుండె చప్పుళ్ళు" దళిత కవిత.

19వ శతాబ్దంలో వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థలపై నిరసన భావం సమాజ పునరుద్ధరణోద్యమంలో భాగమై దళితవాద రచనలు ప్రారంభమయ్యాయి. హరిజనుల బాధలకు దర్పణంగా వెలువడ్డ కావ్యాలు, గ్రంథాలన్నీ బాపూజీ ప్రారంభించిన హరిజనోద్ధరణ తర్వాతనే తెలుగులో వెలువడ్డాయి. అందులో భాగంగా జాషువా గారి "గబ్బిలం", కాటూరి వేంకటేశ్వరరావు గారి "గుడిగంటలు" ఎన్నదగినవి. సాంఘికంగా దోపిడికి గురవుతున్నవారు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నారు. శారీరక శ్రమపై ఆధారపడి బతుకుతున్నవారు దళితులు. సాటి దళిత సోదరులను చైతన్యపరచడానికి సాహిత్యాన్ని ఆయుధంగా ప్రయోగించారు. వీరి సాహిత్యాన్ని "దళిత సాహిత్యం" అంటున్నాం. వీరి ఉద్యమాన్ని 'దళిత ఉద్యమం'గా పరిగణిస్తున్నాం. జ్యోతిబాపూలే (1827–1890) 'బానిసత్వం', 'పూజారితత్వం బయటపడింది' వంటి మరాఠీ భాష రచనల ద్వారా, ప్రత్యక్ష పోరాటం ద్వారా నిమ్న వర్గాల ఉద్ధరణ కోసం మహారాష్ట్రలో మొదటిసారిగా పోరాటం చేశారు. దళితుల సమస్యలను తెలుగు కవిత్వంలో ప్రతిబింబింప జేసిన గుర్రం జాషువా (1895–1947)ను తొలి తెలుగు దళిత కవిగా చెప్పవచ్చు.

దళిత కవిత "మట్టి గుండె చప్పుళ్ళు" దేవరాజు మహారాజు గారి తెలుగు అనువాదం. దళిత వాదానికి చేకూరిన మరింత బలం. మరాఠీలో దళితులు దళిత కవిత్వం రాస్తే, తెలుగులో దళితులు, దళితేతరులు రాశారు. ఈ కవితా సంకలనంలో కొన్ని మాత్రం దళితుల కష్టనష్టాలను తీవ్రంగా విమర్శించి, పోరాటానికి దళితులను సిద్ధం చేయడం జరిగింది.

నామ్దేవ్ లక్ష్మణ్ ధసాల్, వహరు సోనావనే, భీమ్సేన్ దితె, ప్రశాంత్ ఖరత్, దుధాల్కర్, కేశవ్ మేశ్రామ్, వామన్ కర్డక్, మీనా గజబియో, యల్. జ్యోతి, ఎఫ్.యం. షిండె, ఎల్.యస్. రొకాడె, బాబూరావ్ బుగుల్ వంటి ప్రముఖ దళిత కవులు అందరూ తెలుగు పాఠకులకు పరిచయమయ్యారు. వీరందరిలో కనిపించే సుగుణమేమంటే సాఫీగా, సరళంగా సాగుతూనే కవిత భావస్ఫోరకంగా, ధ్వని ప్రధానంగా ఉంటుంది.

నామ్దేవ్ లక్ష్మణ్ ధసాల్ నేతృత్వంలో దళిత పాంథర్స్ ఉద్యమం ఊపందుకుంది. ప్రశాంత్ ఖరత్ రాసిన "కళ్ళు మూసిన ఆకాశం" అనే కవితను ఇలా ముగిస్తాడు.

**"మరి ఈ ఆకాశాన్ని శవపేటికలో పెట్టిందెవరు?**
**ఈ ఆకాశం మీద మబ్బుల తెల్ల వస్త్రాన్ని కప్పిందెవరు?"**

సరికొత్త ఆలోచన, సరికొత్త ఇమేజరి. తెలుగులో విప్లవ కవిత్వం చాలా వచ్చింది. అది విషయాన్ని ప్రజలకు చేరవేసే కరపత్రంలా పనికొచ్చిందే కాని, ఒక ఉన్నత స్థాయిని సంతరించుకున్న కవిత్వంగా తన స్థానం సుస్థిరం చేసుకోలేదు. కేశవ్ మేష్రామ్ అనే కవి "మా గూడెం" శీర్షికతో ఎంత గొప్ప వర్ణన అందించాడో చూడండి.

**"మా గూడెంలో**
**పోస్ట్మ్యాన్ తోకరా తింటాడు**
**సుభాషితాల అర్థాలు తారుమారవుతాయి**
**నాగరికత గజ గజ వణుకుతుంది**
**సూర్యుడంతటివాడు కమిలి నల్లబడతాడు**
**బురదలో పశువుల కాలి గుర్తుల్లాగ మా ఇళ్ళు**
**వాటి మధ్య విద్యుత్తులా**
**ఈదుతూ పొగలా మా గుండె ధైర్యం**
**సంప్రదాయపు చట్రాల్లోంచి బయటపడి**
**భూమిలో ఇంకిపోతూ మా గూడెం**
**నల్లని వెంట్రుకలతో, నల్లని శరీరాలతో**
**గర్జిస్తూ మెలి తిరుగుతూ ఉవ్వెత్తున లేచిపడే**
**తిరుగుబాటు సముద్రం — ఇక్కడి ప్రజలు**
**దూది మూటల్ని భుజాల మీద మోస్తుంటారు**
**పీలగా గరుకుగా ఉన్న వాళ్ళ చేతి గాజుల్లో**
**పగిలిన ఆకాశం కనిపిస్తుంటుంది**
**ఉష్ణాన్ని పీల్చి వడగట్టడమే తమ పనైనట్లు**
**పిల్లలు అన్ని చోట్లా తిరుగుతుంటారు"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు—సంక్షోభాలు, పుట:28)**

అంటూ సాగుతుంది దీర్ఘ కవిత.

తల దాచుకోవడానికి కూడా సరైన గూడులేని నిర్భాగ్యులైన దళితుల గూర్చి ఉత్తమ్ కోల్గాంకర్ రాసిన "గృహముంటే కదా స్వర్గసీమ" అనే కవితను ఇలా అనువదించాడు.

**"అతడు ఇంట్లోకి పోయి తలుపు వేసుకుంటే**
**వెనక గోడ పూర్తిగా కూలిపోయే ఉంటుంది**
**భూమ్యాకాశాలు కలిసినట్టే ఉంటాయి**
**ఆకాశం ఆకాశమే వేల వేల కళ్ళతో**
**అతని ఇంటిమీద దాడి చేస్తున్నట్టే ఉంటుంది**
**ఆకాశం కూలి మీద పడుతున్నట్టే ఉంటుంది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు—సంక్షోభాలు, పుట:29)**

కేవలం దళితుల సమస్యల మీద మాత్రమే కాకుండా, దళిత కవులు దేశ పరిస్థితుల మీద కూడా వ్యాఖ్యానించారు. బాపూరావ్ — జగ్తాప్ అంటాడు —

**"ఈ దేశం వేయి ముక్కలయ్యింది**
**నగరాలుగా, మతాలుగా, కులాలుగా**
**ప్రజలూ, వాళ్ళ మెదళ్లూ అన్నీ ముక్కలయి పోయ్యాయి**
**తుత్తునియలయి పోయాయి**
**ఈ దేశంలోని ప్రతిరోజూ కాలిపోతోంది**
**మా జీవితపు ప్రతిక్షణాన్ని మాడ్చేస్తోంది**
**హృదయం లేని మతంలో ఈ దేశం నగ్నంగా నిలబడి ఉంది**
**ఇక్కడి నేతలు దొడ్డిదారి చట్టంతో ఖుషీ ఖుషీగా**
**జల్సాలకు అలవాటు పడ్డారు"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు—సంక్షోభాలు, పుట:29)**

ఈ విధంగా దళిత సాహిత్యం తెలుగులోకి అనువాదమయ్యింది.

ప్రకాశ్ చంద్ర కరుండికర్ "ఆ—మెన్" అనే కవితలో ఇలా అంటాడు.

**"మరట్వాడ భూకంపాలు, బొంబాయి బాంబు ప్రేలుళ్ళు**
**వేలమంది మరణం, వంద మంది బిచ్చగాళ్ల అరెస్ట్**
**మానవత్వాన్ని మంట గలిపి, సాగించిన**

**హరిజన స్త్రీ శారీరక దోపిడి**
**ఉద్యోగాల్లేని యువత, నిస్పృహలో నవత**
**కలగలిపి చేసుకున్న ఆత్మహత్యలు!**
**అరబ్ షేక్లకు  అమ్ముడయ్యే ఆడపిల్లలు..."**

**(కవిత్వంలో సమాంతర రేఖలు—సంక్షోభాలు, పుట:34)**

ఏ విషయాన్ని వదిలిపెట్టకుండా తమ కవితాక్రోశాన్ని వెళ్లగ్రక్కిన దళిత్ పాంథర్స్ ఆధునిక మరాఠీ సాహిత్య రంగంలో తమదైన ముద్ర వేశారు. బాపూరావ్ జగ్తాప్ తన "వలస పక్షులు" అనే కవితలో ఇలా అంటాడు —

**"ఈ దేశంలో ప్రతిరోజూ కాలిపోతుంది**
**మా జీవితపు ప్రతి క్షణాన్నీ మాడ్చేస్తోంది**
**అన్నీ భరిస్తూ బండలా పడి ఉండడం**
**ఇక మావల్ల కాదు**
**భరించడం ఒప్పుకోం**
**మా అరుపులు మా కేకలు —**
**ఈ దేశ చరిత్రను తిరగరాయడానికి చేసే ప్రయత్నాలే"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు—సంక్షోభాలు, పుట:34)**

అంటూ సాగే కవిత ఈ విధంగా ముగుస్తుంది.

**"పద పోదాం ఏ దేశానికైనా**
**బతికినంత కాలం ఇంత కూడు గుడ్డా దొరికే చోటికి**
**ఛస్తే నాలుగడుగుల ప్రశాంత స్థలం దొరికే చోటికి"**

అని చస్తే నాలుగడుగుల ప్రశాంత స్థలం దొరికే చోటికి అని అన్నప్పుడు —

**"దో గజ్ జమీన్ భి న మిలే**
**కూయెఁ యార్ మే"—**

అని విలపించిన భారతదేశపు చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ కవిత గుర్తుకొస్తుంది. ఇకపోతే ఈ ఉద్యమంలో పురుషులలో సమానంగా దళిత కవయిత్రులు కూడా తమ స్వరం పెంచారు. వారి భాగస్వామ్యం తక్కువది కాదు.

**"కొన్ని యుగాలుగా నేనీ కొండ చిలువతో**

**చుట్టి వేయబడి ఉన్నాను"**

అని అన్నారు దళిత కవయిత్రి మీనా గజభియే.

**"ఇప్పుడిక మానవ హక్కుల**
**నిప్పులకు గాలి విసరాలి"**

అని తక్షణ కర్తవ్యాన్ని సూచించారు మరో దళిత కవయిత్రి ఎల్. జ్యోతి. ఇంత దళిత చైతన్యం తెలుగు పాఠకులకు మొదట అందింది కేవలం అనువాదాల వల్లనే! దళిత్ పాంథర్స్ ద్వారా అందిన చైతన్యమే. ఆ తరువాత రాష్ట్రంలోని కారంచేడు, చుండూరు వంటి అనేక సంఘటనలు ప్రేరకాలయ్యాయి. అంతకు ముందు శతాబ్దాలుగా ఈ ప్రాంతంలో కూడా సాగుతున్న దళితుల అణచివేత అవలోకనంలోకి వచ్చింది. కొత్త నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడి దళిత విద్యావంతుల్లోంచి కవులు, రచయితలు పుట్టుకొచ్చారు. ఘనంగా తెలుగులో దళిత కవిత్వం ఉద్భవించింది. క్రమంగా పరిణతి సాధిస్తూ వస్తుంది.

"తప్పు సరిదిద్దుకో" అనే కవితలో అంటరానివారు ఎవరికి వారు గొప్పవారమని, దళితులే సాటి దళితులను అంటరానివారుగా చూడడం చాలా సిగ్గుచేటు అని 'బాబురావు బగుల్' కవి దళితులకు తెలియజేసి, దళితులు, దళితులను సరిదిద్దుకొని, దళితేతరులు చేస్తున్న దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని బోధించారు.

"అలవాటు" అనే కవిత ద్వారా ఎఫ్.ఎం. షిండె 'బాధలు అలవాటు చేసుకుంటే కష్టముండదు', 'ఎముకల నిండా బురద చిమ్మినా, ఎగిరిపడదు, ఎప్పుడో కలలో కనిపించే విషాదం కూడా' అని అంటారు. దళితులు బాధలను అనుభవిస్తున్నారు కాబట్టి బాధలు పెట్టేవారు పెడుతున్నారు అని, బాధలు భరించేవాడిని ఎద్దేవా చేసి రెచ్చగొట్టడం ద్వారా దళితులంతా ఏకమై తిరుగుబాటు చేయాలని కోరాడు షిండె. అట్లాగే "కవితా పఠనం" అనే కవిత ద్వారా ప్రజలను, దళితులను ఉత్తేజితులను చేయడం కోసం "దామోదర్ మోరె" ఈ కవిత రాశారు. తాను కవితలు చదువుతున్నప్పుడు వింటున్న వారిలో ఇద్దరు (షిండె, దామోదర్ మోరె) స్పందించారు. బోధించడం, సమీకరించడం ద్వారా పోరాటాలు చేయవచ్చనేది ఈ కవితలో (కవితా పఠనం) కన్పిస్తుంది. దళితులలో చాలామంది చదువు నేర్వలేదు. కాబట్టి నేర్చిన ఒక్కరైనా జరుగుతున్న అన్యాయాలను దళితులకు తెలియజేస్తే, దళితులందరు ప్రతిఘటించి దాడులను ఎదుర్కొంటారని కవి ఆలోచన. 'ఆ అదే నేను కావాలనుకున్నది పేలదేమో ననుకున్న డైనమెట్ అంటుకుని పేలబోతున్నది' అని దళితులపై దళితేతరులు చేస్తున్న దారుణ దమనకాండను గూర్చి, జరుగుతున్న

అన్యాయాల గూర్చి "కవిత పతనం" అనే కవితలో చెప్పారు. అన్యాయాలన్నీ దళితులందరికీ తెలిస్తే, వారంతా ఉప్పెనలా ఎగిసిపడితే, వారిని ఆపడం ఎవరి తరమూ కాదు. అదే కోరుకుంటున్నాను అని ఆవేశంగా దామోదర్ మోరె తెలియజేశాడు. మహారాష్ట్రలో బయలుదేరిన దళిత వాదాన్ని దేవరాజు మహారాజు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశింపజేశారు. ఇది క్రమక్రమంగా భారతదేశం అంతటా ఈ సాహిత్యం ప్రాచుర్యం పొందుతుంది.

### 2.1.6. రాజముద్ర (2007):

"రాజముద్ర"లోని కవితలు కవిత్వాన్ని నిర్వచించాయి. కలల్ని స్పృశించాయి. కహానీలను వెల్లడించాయి. మీదు మిక్కిలి అట్టడుగు వర్గాల ఆర్తిని, ఆర్ద్రతను, తెగిపోతున్న మానవ సంబంధాలను, పట్టణ సంస్కృతిని, పల్లెల పతనాన్ని, హైటెక్ కాలాన్ని అదురు బెదురు లేకుండా ఆరపోశాయి"[3].

రాజముద్రలో గాంధారి, ఒంటరి గూటి పక్షి, ఎగిరిపోయిన పక్షి చప్పుడు, వ్యూహం, రేప్ చేయబడ్డ నగరం, యుగపురుషుడు, విస్తరిస్తున్నా జీవకణాలు, చిదిమి దీపం పెట్టుకోవచ్చు మొదలైన కవితలు కలవు.

జీవిత దృశ్యాలను కళాఖండాలుగా రూపొందించడంలో దేవరాజు మహారాజు కౌశలం, కొనియాడదగినది. ఇతను రచించిన కవితా సంపుటాలలో ఈ "రాజముద్ర" విశిష్టమైనది. మనిషి ఉనికి మీద రాసిన 'రాజముద్ర' కవిత, కథా 'కమామీషు' కవిత, వేటాడుతున్న పాట వేటలో, స్త్రీల మీద రాసిన కొన్ని కవితలు, చాలా వినూత్నంగా ఉన్నాయి. మనిషికి తన ఉనికి చాలా ముఖ్యమన్న విషయాన్ని తేల్చి చెబుతున్నది రాజముద్ర కవిత. 'ప్రకృతి స్త్రీని ప్రేమిస్తున్న వేళ' అనే కవిత కొత్త తరహాలో ఉంది.

గాంధారి ఒక విలక్షణ గీతం. ధృతరాష్ట్రుడు గుడ్డివాడని తెలియగానే గాంధారి కలల ప్రపంచం కూలిపోయింది. అందరూ తనను మోసం చేశారని తలచి ఆమెలో ప్రతీకార జ్వాల రేగింది. స్త్రీని మనిషిగా, వ్యక్తిగా, జీవిత భాగస్వామిగా గుర్తించలేని గుడ్డి సమాజం పట్ల నిరసనే గాంధారి జీవితం అని రచయిత కళ్ళకు కట్టినట్లు చెప్పారు.

**"ఆమె కలల ప్రపంచం కూలిపోయింది**
**ధృతరాష్ట్రుడు పుట్టి గుడ్డి అన్న విషయం**
**ఎవరూ తనకు ముందుగా చెప్పలేదు**

[3] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట – 98.

**అందరూ తనను మోసం చేశారు"** **(జీవితమే ఒక కవిత, పుట – 86)**

పిల్లలు విదేశాలలో సుఖంగా ఉన్నారని ఒకపక్క సంతోషిస్తూ, మరోపక్క ఒంటరి జీవితాన్ని భరించలేకపోతున్న వారి మానసిక స్థితిని దేవరాజు మహారాజు "ఒంటరి గూటి పక్షి" అనే కవితలో ఆర్ద్రంగా చిత్రించారు.

**"చీకటిని మించిన చీకటి – ఒంటరితనం**
**మరణాన్ని మించిన మహావిషాదం**
**తోడు లేకపోవటం"** **(జీవితమే ఒక కవిత, పుట – 65)**

"యుగపురుషుడు" అనే కవిత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు అహంకారపు చేష్టల్ని ఎండగట్టింది.

**"వాడు సింహాల్ని లొంగి పొమ్మంటాడు**
**పులుల్ని దిగి రమ్మంటాడు**
**అరణ్యాల్ని తలవంచమని అగ్నిని ఆరిపొమ్మని శాసిస్తాడు**
**పిట్టలకు తుపాకులిస్తానంటాడు**
**గుట్టలకు పసుపురంగు పూస్తానంటాడు**
**రోడ్డు మీద పడకేసి శేషశాయి ననుకుంటాడు**
**తనను మించిన కామ్రేడ్ లేడని**
**స్వామీజీలా చేయి విసురుతాడు"** **(జీవితమే ఒక కవిత, పుట – 52)**

'వేటాడుతున్న పాట వేట'లో దేవరాజు మహారాజు హిందూస్తానీ సంగీతంపై మమకారం తేటతెల్లమవుతుంది.

'ఒంటరి గూటి పక్షి' అనే కవితలో

**"నిశ్శబ్దంలోంచి శబ్దంలోకి రావడం – పుట్టుక**
**శబ్దంలోంచి నిశ్శబ్దంలోకి పోవడం – చావు**
**కాలానికి అల్లుకుపోయిన కలే – జీవితం**
**ఆ కల కరిగిపోవడమే – కాలం చెయ్యడం**
**చీకటిని మించిన చీకటి – ఒంటరితనం**
**మరణాన్ని మించిన మహా విషాదం – తోడు లేకపోవడం"**

**(జీవితమే ఒక కవిత, పుట – 65)**

అని అంటారు.

"రేప్ చేయబడ్డ నగరం" అనే కవితలో నగర జీవితాన్ని వాస్తవ వర్ణనలతో కళ్ళకు కట్టించారు రచయిత.

**"నగరం కర్ఫ్యూలో కాల్చిన మాంసం నీకు**
**వెన్నుపోటు పొడిచే మిత్రుడి బాకు**
**అనుమానాల పుట్ట**
**మానవ కళేబరాల గుట్ట**
**..... ..... ..... ..... ..... .....**
**సామాన్యుడిక్కడ బలవుతాడు గానీ**
**అయోధ్య రాముడికేం**
**బతికొస్తాడు..." (జీవితమే ఒక కవిత, పుట – 49)**

ఖడ్గాల పెదాల మీద నవ్వులు వికసించడం వలన రక్త సముద్రపు చెలియలి కట్ట తెగడం, కాళ్ళు చేతులు కొట్టుకురావడం, కుళ్లిన మానవత్వం వాసనలతో గాలి బెదిరిపోవడం, భూమి అదిరిపోవడం వంటివి గుర్తించి చివర రేప్ చేయబడ్డ నగరం గూర్చి కాదు మన బాధ.../పుట్టబోయే బిడ్డ గూర్చి అంటూ ముగిస్తారు.

### 2.1.7. నీకు నాకు మధ్య ఒక రంగుల నది (2009):

అనువాదయుగం తెలుగు సాహిత్య చరిత్రలో మొదటి యుగం. కవిత్రయ భారతానికి అనుసృజన వ్యాసభారతమే. రవీంద్రనాథ్ సాహిత్యం, శరత్, ప్రేమ్చంద్ల సాహిత్యం తెలుగు ప్రజలకి అందించింది అనువాదమే.

పాశ్చాత్య సాహిత్యం పాఠకులకు పరిచయమైంది అనువాదం వలనే. అందుకే 'ప్రపంచ ప్రజలంతా నావాళ్ళు. ప్రపంచ సాహిత్యమంతా నాది అనే భావన అనువాదానికి తప్పనిసరి' అని స్పష్టంగా తెల్పి, "నీకూ నాకూ మధ్య ఓ రంగుల నది" అనే కవితా ప్రపంచాన్ని అనుసృజనగా వెలువరించారు దేవరాజు మహారాజు.

ఈ కవిత సంపుటిలో చిత్ర విచిత్రమైన రంగుల కవితలు ఉన్నాయి. అనుసృజనతో ప్రవహించే జీవనది ఉంది. ప్రపంచాన్ని అనుసృజన ద్వారా ఏకం చేశారు కవి. ఈ కవితా సంపుటిలో మొత్తం 93 కవితలు ఉన్నాయి. వీటిల్లో ఆరు ఖండాలలోని కవుల్ని, భారతదేశ కవుల్ని,

కవయిత్రుల్ని ఎన్నుకుని వారి వారి కవితల్ని అనుసృజనగా తెలుగులోకి తెచ్చారు రచయిత దేవరాజు మహారాజు.

అనువాదానికి గ్రామ్య దృష్టి, జాతీయ దృష్టి మాత్రమే సరిపోదు. అవి ఉంటూనే విశ్వ దృష్టి కూడా ఉండాలి.

అమ్మ చివరి క్షణాలను అమెరికాలోని తమ్ముడు అద్భుతమైన వీడియోగా తీసి పంపించమని ఫ్యాక్స్ పంపిన అయ్యప్ప ఫణిక్కర్ మళయాళ కవితను రచయిత లేఖగా అనువదించిన తీరు, మానవ సంబంధాల పరిణామాల తీరు హృదయాన్ని కలచివేస్తుంది.

ఈ సంపుటిలో ఉన్న కవితల్ని అనుసృజన ద్వారా తెలుగు పాఠక లోకానికి అందించిన గొప్ప సాహితీవేత్త దేవరాజు మహారాజు.

**2.1.8. మధుశాల (2010)**:

**"మట్టి ఈ కాయం**
**మనసే ఉల్లాసం**
**క్షణభంగురం జీవితం**
**అదే నా పరిచయం"** **(మధుశాల, పుట – 03)**

అని తనను తాను పరిచయం చేసుకునేవారు ప్రసిద్ధ హిందీ మహాకవి పద్మభూషణ్ డా॥ హరివంశ్ రాయ్ బచ్చన్. సమకాలీన తెలుగు సాహిత్య రంగంలో కవిత్వ స్వరూపం పూర్తిగా మారిపోయింది. వర్గ దృక్పథంలో, లింగ దృక్పథంలో సమస్యల్ని పెనవేసుకొంటూ ఆక్రోశాల్ని, ఆవేశాన్ని వెళ్ళగక్కుతోంది నేటి కవిత్వం. ఇది ఇంకా ఎన్ని రకాలుగా విభజింపబడుతుందో తెలియదు. కొంత మంది తమ ఆంతరంగిక పదచిత్రాల్ని కూడా ఆవిష్కరిస్తున్నారు. ఇకపోతే చదివి అర్థం చేసుకుని, నిశ్శబ్దంగా ఆనందించే కవిత్వం తప్ప, హాయిగా వింటూ ఆహ్లాదపడే కవిత్వం పూర్తిగా మరుగున పడుతోంది. తెలుగు సంస్కృతిలో ప్రధాన భాగమైన పద్యమే బలహీనపడుతుంది. సంగీతం లేని గీతాలు ముక్కలు ముక్కలుగా లెక్కలు తెగినట్టుగా శబ్ద కాలుష్యంలో వెలువడుతున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో హరివంశ్ రాయ్ "మధుశాల" హిందీ కావ్యానికి తెలుగు రూపమిచ్చారు దేవరాజు మహారాజు.

"మధుశాల" హిందీ నుండి నేరుగా చేసిన అనుసృజన. ఇంతవరకు "మధుశాల" తెలుగు అనువాదం వచ్చినట్టు లేదు. మధుశాల అంటే కేవలం మధుశాల కాదు. ఒక ధ్యేయానికి, ఒక గమ్యానికి అది సంకేతం. ధ్యేయాన్ని బట్టి ఒక్కొక్కరి మధుశాల మారుతూ ఉంటుంది.

**"నీ హృదయపు లోతెంతుందో మధుపాత్ర లోతంతుంటుంది**
**నీ మనసున మత్తెంతుందో మధువున మత్తంతుంటుంది**
**నీ భావుకత అందం ఎంతో సాకీ అంతటి సుందరము**
**ఎవ్వడెంతటి రసికుడు అయితె, అంతటి రసమయము మధుశాల"**

**(మధుశాల, పుట –50)**

మనిషి తనకు కావల్సిన దాన్ని వెతుక్కోవడంలోనే ఆనందం పొందుతూ ఉంటాడు. 'మధువు' అంటే మధువే కానక్కర లేదన్నది కవి చెప్పే అంతరార్థం. ఉమర్ ఖయ్యాం, గాలిబ్, జఫర్, మీర్, దౌగ్, కూలీ, వలీ వంటి ఉర్దూ మహాకవుల అడుగుజాడల్లో, వారి బాణీలో "మధువు, మధుపాత్ర, సాకీ, మధుశాల" వంటి పదాలను వాడుతూ వారికి భిన్నంగా సమకాలీన జీవితం, తాత్వికత, దేశభక్తి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక విషయాల గురించి కవి మధుశాలలో చెప్పారు.

డా॥ హరివంశరాయ్ బచ్చన్ 1907 – 2003 మధ్యకాలంలో తొంభై ఆరేళ్ల పాటు జీవించాడు. హరివంశరాయ్ నవంబర్ 27, 1907న అలహాబాద్ దగ్గరలోని ఒక చిన్న గ్రామంలో పుట్టాడు. వారిది ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబం. వారి వంశంలో కొనసాగుతూ వస్తున్న ఆచారం ప్రకారం కాయస్థ పాఠశాలలో ఉర్దూ చదువుకొని 1925లో మెట్రిక్యులేషన్, 1929లో ప్రథమ శ్రేణిలో బి.ఏ. (అలహాబాదు విశ్వవిద్యాలయం), తర్వాత బి.టి., మరికొంత కాలానికి ఎం.ఏ. (బనారస్ విశ్వవిద్యాలయం) పూర్తి చేశాడు. తర్వాత కాలంలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆ సమయంలోనే గాంధీజీ అనుచరుడిగా మారి, స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1941–52ల మధ్య అలహాబాద్ యూనివర్శిటీలో ఇంగ్లీషు బోధించాడు. తర్వాత రెండేళ్లు కేంబ్రిడ్జ్‌లోని సెంట్ కేథరిన్ కాలేజీలోని థామస్ రైస్టెన్ దగ్గర చేరి, ఐరిష్ కవి వై.బి. ఈట్స్ పై పరిశోధన సాగించి డాక్టరేట్ సాధించి, స్వదేశం తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వరుసగా మధుశాల, మధుబాల, మధుకలష్ వంటి సంపుటాలు వెలువరించారు.

బచ్చన్ వారి ఇంటి పేరు కాదు. వారి ఇంటిపేరు శ్రీవాత్సవ. హరివంశరాయ్ను బాల్యంలో అందరూ ముద్దుగా "బచ్చెన్" అని పిలిచేవారు. బచ్చన్ అంటే చంటాడు, కుర్రాడు, పసివాడు అని

అర్థం. కేంబ్రిడ్జ్ నుండి తిరిగొచ్చాక ఉధృతంగా కవిత్వం రాస్తున్నప్పుడు ఆయన సరదాగా తన చిన్నప్పటి ముద్దు పేరు తగిలించుకుని హరివంశరాయ్ బచ్చన్గా ప్రసిద్ధుడయ్యాడు. ప్రసిద్ధి పొందిన ఆ పేరును వదులుకోవడం ఇష్టంలేక కొడుకు, మనవడు అందరూ బచ్చన్లుగా ప్రకటించుకున్నారు. కుటుంబమే "బచ్చన్" కుటుంబమైపోయింది. అసలైన ఇంటి పేరు శ్రీవాత్సవ మరుగున పడింది.

హరివంశరాయ్ బచ్చన్ తన పందొమ్మిదో యేట, పద్నాలుగేళ్ల శ్యామను (1927) పెండ్లి చేసుకున్నాడు. కాని ఆమె టి.బి. వ్యాధితో బాధపడి, తన ఇరవై నాలుగవ యేట మరణించింది. మరో అయిదేళ్ళ తర్వాత 1941లో ఆయన 'తేజి సూరి' అనే సిక్కు యువతిని పెండ్లి చేసుకున్నాడు. ఆమెకు కలిగిన సంతానమే అమితాబ్, అజితాబ్లు. ఈయన భార్య తేజ్ సూరి, కోడలు జయా బాధురి, మనుమరాలు ఐశ్వర్యరాయ్ నటీమణులు. కొడుకు, అమితాబ్ మనవడు, అభిషేక్లు హిందీ సినీ హీరోలు.

హిందీ సాహిత్య రంగంలో హరివంశరాయ్ బచ్చన్ చేసిన కృషికి సాహిత్య అకాడమీ అవార్డు, సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, ఆఫ్రో ఆసియన్ రచయితల సమాఖ్య వారి లోటస్ అవార్డు, సరస్వతి సమ్మాన్ మొదలైన అత్యుత్తమ పురస్కారాలు స్వీకరించిన హరివంశరాయ్కి 1976 భారత ప్రభుత్వం "పద్మభూషణ్" ప్రకటించి గౌరవించింది. 2003లో భారత తపాల శాఖ పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. 1966లో రాజ్యసభకు నామినేట్ అయ్యాడు.

"నా కవిత్వం మోహంతో మొదలై, మోహబంధంతో ముగిసింది" అని చెప్పుకున్నాడు హరివంశరాయ్ తన ఆత్మకథలో. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడి జనవరి 18, 2003న హరివంశరాయ్ బచ్చన్ చివరి శ్వాస వదిలాడు. కవిత్వానికి చిరునామాగా మారాడు.

హిందీ సాహిత్య రంగంలో "హాలవాదాన్ని" (మధువాదాన్ని) ప్రతిపాదించి, పోషించినవాడిగా పేరు గడించాడు.

**"వర్థిల్లాలి మధువుల నిచ్చే ద్రాక్షాలతలు**
**వర్థిల్లాలి మధు పాత్రలు చేసే మట్టి పెళ్ళలు**
**మదిరా పిపాస వర్థిల్లాలి 'మదిరాసురులు' వర్థిల్లాలి**
**వర్థిల్లాలి వర్థిల్లాలి – వర్థిల్లాలి మధుశాల"** **(మధుశాల, పుట – 21)**

'హాలా' అంటే మధువు. మనిషి తనకు కావల్సిన దాన్ని వెతుక్కోవడంలోనే ఆనందం పొందుతూ ఉంటాడు. 'మధువు' అంటే మధువే కానక్కరలేదన్నది ఆయన చెప్పే అంతరార్థం.

మధుశాల చాలా ప్రత్యేకమైంది. ఉమర్ ఖయ్యాం, గాలిబ్, జఫర్, మీర్, దాగ్, కులీ, వలీ వంటి ఉర్దూ మహాకవుల అడుగుజాడల్లో, వారి బాణీలో 'మధువు—మధుపాత్ర—సాకీ—మధుశాల' వంటి పదాలనే వాడుతూ వారికి భిన్నంగా సమకాలీన జీవితం, తాత్వికత, దేశభక్తి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక విషయాలపై ఆయన కవితలల్లారు.

**"భావుకత ఒక ద్రాక్షలత, లాగు కల్పనల తీగ జత**
**కవియే సాకి యై వచ్చాడు నింపుకుని కవిత మధు పాత్ర**
**ఇసుమంతైనా ఖాళీ అవదు లక్ష తాగినా లక్ష ఆగినా**
**పాఠక జనమే తాగేవారు, పుస్తకమే నా మధుశాల"** **(మధుశాల, పుట – 12)**

'మధువు—మధుపాత్ర—సాకీ—మధుశాల' వంటి పదాలనే ఉపయోగించి, వాటికి సంబంధం లేని విషయాలు చెప్పడం ఇందులోని ప్రత్యేకత. కవియే సాకీగా తన కవితా మధుపాత్రను తీసుకువచ్చాడని, అది ఎంత మంది తాగినా, తాగడానికి ఎదురు చూస్తూ ఎంత మంది ఆగినా... అది ఖాళీ అవదని, పుస్తకం మధుశాల అయితే తాగేవాళ్ళంతా పాఠక జనమేనని హరివంశ్రాయ్ అభిప్రాయం.

మధుశాల – అంటే ఇక్కడ మధుశాల కాదని, మధుశాల ఒక ధ్యేయానికి సంకేతమని అర్థం చేసుకోవాలి. అందుకే ఒక కవితలో ఆయన వివరణ ఇచ్చారు.

"ధ్యేయపుదారి పట్టుకువెళితే గమ్యం కాదా మధుశాల" అని!

"కళ్ళకు కనబడునది ఏదైనా ఇక కళ్ళలో ఉన్నది మధుశాల" అని! కళ్ళకు ఎన్నో కనబడుతుంటాయి కాని మన ధ్యేయాన్ని మనం నిరంతరం కళ్ళల్లో నిలుపుకోవాలని కవి చెబుతున్నాడు. అంతేకాదు "అంతట కనబడు అన్ని వేళలా – విశ్వవ్యాప్తమిది మధుశాల" అని కూడా అన్నారు.

'పూజారి, మంత్రోచ్చారణ, తపోనిష్ఠ, శివలింగం' వగైరా – వీటిని మధుశాల వాతావరణానికి హరివంశ్రాయ్ బచ్చన్ ఎలా మలుచుకున్నారో చూడండి.

**"పూజారే మన ప్రియతమ సాకీ పవిత్ర గంగాజలమే మధువు**
**తపోనిష్ఠలో తిప్పుతు ఉండే జపమాలే మధుపాత్రలమాల**
**ఇంకా తాగు ఇంకా తాగు అన్నదే మంత్రోచ్చారణ కాగా**
**శివలింగం వలె శిలనవుతాలే మందిరమైనా మధుశాలయినా"**

**(మధుశాల, పుట – 18)**

ఇక్కడ ఒక సంఘటన చెప్పుకోవాలి. ఒకసారి హరివంశ్రాయ్ గాంధీజీని కలవడానికి వెళ్ళారు. మధువు మీద అంటే సారాయి మీద కవిత్వం రాసిన వ్యక్తిని తాను కలుసుకోదలుచుకోలేదని నిష్కర్షగా చెప్పేశారు గాంధీజీ. అయితే ఆయన అనుచరుల్లో ఒకరు వివరణ ఇచ్చారు. ఆయన ఏ సారాయి గురించి చెపుతున్నారో అది సారాయి కాదని, ప్రేమకు, ఆధ్యాత్మికతకు, జీవన గమ్యానికి, దేశభక్తికి సంకేతమని వివరణ ఇచ్చారు. అది తెలుసుకొని గాంధీజీ ఎంతగానో సంతోషించారు. సస్యశ్యామలమైన ఈ దేశం గురించి చెప్పిన పద్యం చూడండి. హిమాలయాలు కరిగి, నదులుగా ప్రవహించి, పంట పొలాలకు నీరందించని వైనమంతా నాలుగు చరణాల్లో హరివంశ్రాయ్ ఎలా వర్ణించారో, మాతృదేశం పట్ల ఎంత మక్కువ చూపించారో గమనించవచ్చు.

**"హిమశ్రేణులే ద్రాక్షాలతలు హిమజలమే ప్రవహించే మధువు**
**నదులన్నీ సాకీ హొయలవగా కెరటాలే మధుపాత్రలు కాగా**
**తాగిన మత్తులో పచ్చగ ఊగెను పంట పొలాలు కాలం గతిలో**
**ప్రపంచానికిది ఆదర్శం, వ్యవసాయ భారతం మధుశాల"**

**(మధుశాల, పుట – 26)**

నాటి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ప్రేమపాత్రుడైన హరివంశ్రాయ్, కొంతకాలం లెక్చరర్గా, మరికొంతకాలం ఆకాశవాణి ప్రోగ్రాం ప్రొడ్యూసర్గా పనిచేసిన అనుభవంతో భారత విదేశాంగ శాఖలో ఉన్నత పదవిని అలంకరించారు.

### 2.1.9. జీవితమే ఒక కవిత (2011):

జీవితాన్ని అద్భుతంగా వ్యాఖ్యానించిన కవుల్లో దేవరాజు మహారాజు ఒకరు. చదివించేది, బోధించేది, ఆలోచింపజేసేది, పరిశోధించేది సైన్స్ అయినా, నిరంతరం శాసించేది మాత్రం కవిత్వమే. వాక్యాల వేళ్ళు పట్టుకొని, మనల్ని జీవితం ముంగిట్లోకి తీసుకెళ్ళి, కష్టాలు, కన్నీళ్ళు, ఆశలు, నిరాశలు, ఆప్యాయతలు, అనురాగాలు అన్నీ ఈ కవితా సర్వస్వం (జీవితమే ఒక కవిత)లో చూపించారు.

**"పుప్పొడిని తుమ్మెద గుర్తించాలి**
**గాలిని పువ్వు గుర్తించాలి**
**వీటిని మనిషి గుర్తించాలి"** **(ఆవరణం, పుట – 106)**

ఇలా గుర్తించడం ద్వారా మనకు జీవితం లోతులు తెలుస్తాయి. బతుకు అంచులు తెలుస్తాయి. ఏదీ తెలియకుండా రాసే కవిత్వం పొడిగా ఉంటుంది. కవిత్వం ప్రాణకాంతితో తొణికిసలాడాలంటే అందులో ఆర్ద్రత, హృదయ స్పర్శ ఉండాలి.

**"ఈ దేశంలో విజ్ఞానమంతా**
**మెదళ్ల నిండి నశించడం తప్ప**
**చైతన్యవంతంగా గుండెల్లోకి చేతుల్లోకి**
**ప్రవహించినట్లు కన్పించదే?**
**ప్రణాళిక ప్రయోగాల్లో ఎదిగిన దేశం**
**పరిశీలనల్లో కన్పించదే?"** **(ఆవరణం, పుట – 107)**

అని నిర్భయంగా ప్రశ్నించే ఆత్మస్థైర్యం ఉండాలంటాడు కవి. దేశంలో నిరుద్యోగాన్ని, చీకటిలో కుమిలిపోతున్న మేథస్సును, నాయకులు చెబుతున్న ప్రగతి పగటికలగా మారిన తీరును ధ్వని గర్భితంగా, గొప్ప శిల్ప మర్యాదతో ఆవిష్కరించాడు కవి.

### 2.1.10. కాలాన్ని వెనకేసిన మనిషి (2014):

**"నేను కాలాన్ని**
**భూత, వర్తమాన, భవిష్యత్తులలో**
**ఆగకుండా సాగిపోయే శకటాన్ని**

**నేను దారాన్ని – జీవన పరిణామానికి ఆధారాన్ని**
**నేను కాలాన్ని – మనిషి మనుగడకు మూలాన్ని**
**నా అంచు మీదే మనిషి లేచి నిలబడ్డాడు**
**అడుగులు వేశాడు, గొంతు విప్పాడు**
**మాటలు నేర్చాడు అక్షరాలు కూర్చాడు అంకెలు పేర్చాడు**
**లెక్కలు కట్టాడు అజ్ఞానాన్ని పక్కకు నెట్టాడు**

**మనిషి కాలగమనంలో కొట్టుకుపోవడం ఒకప్పటి మాట!**
**మనిషి కాలాన్ని అధిగమించి నిలబడడం ఇప్పటి మాట!"**

కాలంతో పోటీ పడి ప్రకృతిపై విజయం సాధించిన మనిషి ప్రస్థానాన్ని పూర్తి స్థాయి వైజ్ఞానిక స్పృహతో సాధికారికంగా కవిత, కథ రూపంలో వివరించారు. కాలాన్ని వెనకేసిన మనిషి మానవ

జీవన పరిణామ చిత్రం కవిత, కథ, నాటకం, వ్యాసం వంటి అన్ని ప్రక్రియల్ని కలగలిపిన వినూత్న ప్రయోగం. కాలాన్ని ప్రకృతిని శ్లాఘిస్తూనే వాటిని తన ఆధీనంలోకి తీసుకున్న మానవుడి సాహసాన్ని, సంఘర్షణను, ఔన్నత్యాన్ని చిత్రించే యత్నం. ఇది కల్పనే. అయితే దీని మూలం ఊహల్లో తేలి వచ్చింది కాదు. వాస్తవంలో స్థిరంగా, దృఢంగా ఉన్నదే. మానవ జీవన పరిణామ ప్రయోగ పద చిత్రం. ఇది వైజ్ఞానిక సృజన. సృజనాత్మక విజ్ఞానం.

"కాలాన్ని వెనకేసిన మనిషి" జీవ పరిణామ సిద్ధాంతానికి సృజనాత్మక సాహితీ ప్రతిబింబం. ఈ భూమి మీద మానవుని పుట్టుక కాల ప్రభావం, మానవుని జయాపజయాలు అన్నీ ఒక కథా రూపంలో రచించారు. ఈ గోళం మీద మానవుడు కాలు ఆనిచ్చిన దగ్గర నుండి మానవుడు కాలాన్ని తన చేతిలోకి తీసుకున్న నేటి సైన్స్ యుగం వరకు వైజ్ఞానిక పరిణామం సృజనాత్మకంగా వాస్తవ పద చిత్రాలతో రూపొందించారు.

"నేను కాలాన్ని, భూత, వర్తమాన, భవిష్యత్తులలో ఆగకుండా సాగిపోయే శకటాన్ని" అంటూ కాలం తనను తాను పరిచయం చేసుకొని మొదట మనిషిని పలుకరిస్తుంది. మనిషి ఆవిర్భావం ఒక్క రోజులో జరగలేదు అంటూ మనిషికి పూర్వం ఈ భూమిపై నివసించిన చేపల యుగం నుంచి సరీసృపాల యుగం వరకు జరిగిన మార్పులను వివరించడం, అలాగే క్షీరదాలు అవతరించడం వాటి నుంచి ప్రైమైట్స్ క్షీరదాలు శాఖోపశాఖలుగా విస్తరించి ఓల్డ్ వరల్డ్ మంకీగా, న్యూ వరల్డ్ మంకీగా విభజించిన వైనాన్ని కాలం మనిషికి వివరించడం జరిగింది. మనిషి మెదడు పరిణామం మొదట ఎంత ఉండేది, ఇప్పుడు ఎలా ఉన్నది, అలాగే మనిషి మైదానాలు వదిలి గుహల్లోకి ఎందుకెళ్ళాడు, వెళ్ళాల్సిన పరిస్థితులు ఏమిటి, కాలం మనిషిని కృత యుగంలోకి తోస్తే గుహలలో తనలాంటి మరో మనిషితో పరిచయం పెంచుకొని సమూహాలుగా ఏర్పడటం తద్వారా తన జాతిని విస్తరించు కోవడం కాలం పాత్ర చెబుతుంది.

పరిణామ దశలో మనిషి భాషను సంతరించుకోవడానికి ఎంత సంఘర్షణకు గురి అయ్యాడో, అలాగే అప్పుడే పుట్టిన బిడ్డ కూడా అంతే సంఘర్షణకు గురి అవుతుంది. తన తల్లి, తండ్రిని అనుకరిస్తుంది. ఏవేవో ధ్వనులు చేస్తుంది. తర్వాత తాత – బాబా – కాక – మామ – నానా వంటి మాటలతో మాట్లాడటం మొదలు పెడుతుంది అంటూ నేర్చుకునే క్రమాన్ని వివరించారు.

వ్యవసాయం తెలియక ముందు జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని తినేవారు, అగ్నిని కనుక్కొని ఎప్పుడైతే మాంసాన్ని ఉడకబెట్టి రుచి చూశాడో అప్పటి నుంచి అతని ఆహార విధానం

మారిపోయింది. తల్లి, తండ్రి, పిల్లలు సహా ఆహారం కోసం వేటనే నమ్ముకుంటారు. పిల్లలు ఆడుకుంటూ వెదజల్లిన విత్తనాలు వర్షానికి మొలకెత్తడం వాటిని ఆ తల్లి గమనించి ఇతరులకు చెప్పడం, పిల్లలు కూడా అద్భుతమైన ఆలోచనలతో మొలకెత్తిన విత్తనాలను పంటగా ఎలా మార్చుకోవచ్చునో, దాని ద్వారా వ్యవసాయాన్ని  అభివృద్ధి చేసిన క్రమాన్ని గురించి చెప్పడం జరిగింది. పైథాగరస్తో సూత్రధారుని సంభాషణలో క్షేత్ర గణితం, రేఖా గణితం గురించి చర్చించడం, పురాతన ఈజిప్ట్ కాలంలో భూమిని దీర్ఘ చతురస్రాకారంగా పంచుకోవడం అది కూడా పన్నెండు యూనిట్ల తాడుతో కొలిచి 3, 4, 5 యూనిట్ల చొప్పున పంచుకొని దాని ప్రకారం పన్ను కట్టేవాళ్లని తెలిసినప్పుడు ఔరా అనిపిస్తుంది.

చివరలో తన పూర్వీకుల రక్తమే మరో మనిషి ప్రతిరూపంగా చూపుతూ ఆధునిక మానవుడు ప్రకృతిని ఆధీనంలోకి తెచ్చుకున్నాక జరిగిన పరిణామాలను తన పూర్వీకుడు, నేటి మానవుడు ఇద్దరికి ప్రకృతి సంభాషణల రూపంలో వివరించడం ఒక ఒరవడి. ఒకప్పుడు ప్రకృతి మనిషిని బిడ్డలా సాకి ఎదుగుదలకు సాయపడి అందలం ఎక్కిస్తే, మనిషి విజ్ఞానంతో వచ్చిన అహంకారంతో ప్రకృతిని ఎలా తన స్వార్థానికి వాడుకొని ప్రకృతి వనరులను నాశనం చేశాడో వారు ఇరువురికి కళ్ళకు కట్టినట్టుగా చూపించారు.

కాలాన్ని వెనకేసిన మనిషి ప్రకృతిని కాపాడుకుంటూ ముందుకు సాగుతాడో లేక అహంకారంతో ప్రకృతిని నాశనం చేసి తన జాతి మనుగడకు ముప్పు తెస్తాడో, రాబోయే తరాలకు ఏమివ్వగలడో నేటి పరిస్థితులను, పరిణామాలను చూస్తే భయమేస్తుంది అని అంటాడు కవి.

## 2.2. కథలు:

### 2.2.1. కడుపు కోత (1977):

తెలుగు సాహిత్యంలో మాండలికాన్ని మొదట ప్రవేశ పెట్టింది గురజాడ అప్పారావు. తొలిసారిగా మాండలికంలో కథలు రాసినవారు మాధవపెద్ది గోఖలే.

తెలంగాణ మాండలికంలో కథా సంపుటాలు రావడం 'కడుపు కోత' తోనే మొదలయ్యింది. తెలంగాణ మాండలికంలో కథలు రాయడానికి పూనుకున్న తొలి రచయిత వట్టికోట ఆళ్వార్ స్వామి. వీరు "జైలు లోపల" అనే కథా సంపుటిని ప్రచురించారు. ఆ కాలంలో గూడూరు సీతారాం, సురమౌళి, యశోదారెడ్డి మొదలైనవారు తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ఆ భాషలో కథలు రాశారు. తర్వాత అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.యస్. రాములు, రఘోత్తమ రెడ్డి, పడాల రాములు మొదలైనవారు ఈ కోవలోకి వస్తారు.

కడుపుకోతలో మొదటి కథ ఈ విధంగా మొదలవుతుంది. "కమలమ్మను దావాఖాన్ల శరీకు జేశింద్రు దానికి కడుపు నొప్పి. ఇయ్యాల్లనా నిన్ననా ఎన్నొద్దుల్నించి అగోరిస్తాంది. మంత్రాలు, తాయితులు ఎన్ని గట్టినా తక్వగాలె. ఎందరి వైద్యుల తాన మందు దిన్నా తక్వగాలె. ఆకాడికి అల్లుడు మంచోడు. నా బిడ్డ ఆగమ్మ పక్షోలె తల్లడిల్లుతుంటే కొంటవోయి ఉస్మానియాల ఏశిండు. పెద్ద డాక్టర్లు జూసి ఆపరేషను జెయ్యాలన్నరు"[4]. ఈ రకంగా కథంతా ఒక ముసలవ్వ అనుభవంలోంచి ఆమె మాటల్లోనే సాగిపోతుంది. బిడ్డ ఆపరేషను గురించి మొదటిసారిగా హాస్పిటల్కు వచ్చిన ముసలవ్వ అక్కడి అన్యాయాల్ని అసహ్యించుకుంటుంది. ఆపరేషను థియేటర్లోంచి బయటపడ్డ ఆమె కూతురు కమలమ్మ మెళ్ళో పుస్తెలతాడు మాయమవడం ఇందులోని ఇతివృత్తం.

ఈ కథలో ఇతివృత్తం కంటె శైలి గొప్పది. రచయిత ఎక్కడా కనబడకుండానే ముసలమ్మ మాటల్లో సమాజ స్వరూపాన్ని చక్కగా కళ్ళకు కట్టిస్తారు. "నాదేమో తెల్వని రోగమాయె. నాకే మెరుక?" అన్న అమాయకపు మాట వెనుక హాస్పిటల్లో పైస పైస పీడించే చెడ్డ సంప్రదాయాన్ని దుయ్యబడతారు. ఆగమ్మ పక్షి, అంగరంగ వైభవంగా పెండ్లి, సాయబాను వంటి ఎన్నో మాటలు ఉపయోగించి ముసలవ్వ పాత్రకు జీవం పోశారు.

వైద్య విధానం మీద దెబ్బ తీసిన రచన ఇదొక్కటే కాదు. ఈ సంకలనంలోని మరికొన్ని కథలు కూడా ఆ పని చేశాయి. "కడుపు కోత" కథ మహానగరంలోని ఆసుపత్రి వాతావరణంలో చిత్రిస్తే, "కండ్లు దెరిశిన నెత్తురు" కథ తాలూకా స్థాయిలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకుంటున్న దొంగ వైద్యుల మోసాల్ని వెల్లడించింది. "మంత్రం, చీకటి పడుతుంది" కథలు గ్రామ స్థాయిలో వైద్య విధానపు స్వరూప స్వభావాల్ని తెలియజేస్తాయి. అమాయక ప్రజలు మందుల ఖర్చులు భరించలేక మంత్రాలకు పోతే, మంత్రగాడు అంత కంటే ఎక్కువ అడుగుతాడు. వైద్యం చేసే బడి పంతులు ఫీజుగా డబ్బులు అడగడు. ఎప్పటి నుండో కన్నేసి ఉంచిన సోములు భార్యను కోరుకుంటాడు. ఈ విధంగా సమాజ రుగ్మతల్ని సరైన పంథాలో డయాగ్నైజ్ చేశారు దేవరాజు మహారాజు.

గోడ చాటున పెత్తనం చెలాయించే దొరలు, కూలీల మధ్య తగాదాలు సృష్టించి వాళ్ళు కొట్టుకుంటూ ఉంటే చూసి ఆనందించే పెత్తందార్లు ప్రాణం పోతుందన్నా వినిపించుకోక, తమ కారు మురికి అవుతుందని వెళ్ళిపోయే రాజకీయ నాయకులు కూడా ఉన్నారు ఈ కథలో.

---

4 దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–145.

"కోళ్ళ పందెం" కథలో దొరలు తమ రైతు కూలీలను కోళ్ళుగా భావించి, వారి మధ్య పోటీ పెట్టి ఆనందించడం జరుగుతుంది. కోళ్ళతో ఆడుకునేది సంవత్సరానికి ఒకసారి అయితే, వీరితో సంవత్సరం పొడుగునా ఆడుకోవచ్చని రచయిత సెటైర్. ఊరి సర్పంచు, కరణం రాజకీయాల మధ్య గ్రామంలోని మామూలు పేదజనం ఎలా నశించి పోతున్నారనేది వర్ణించబడింది.

నిజాం నీడలో, గ్రామాల్లో సాగిన భూస్వాముల ఆగడాలు మనకు చిల్లరదేవుళ్ళు వంటి నవలల్లో కనిపిస్తాయి. నిజాం పరిపాలన అంతమైపోయి, స్వాతంత్ర్యం లభించిన తర్వాత కూడా పల్లెలలో పెత్తందారుల జులుం నశించి పోలేదు. వెనకటిలా దొరలమని విర్రవీగలేరు. అట్లని మామూలు ప్రజలతో కలిసిపోనూలేరు. అలాంటి క్లిష్ట పరిస్థితిని "పాత గోడ" కథలో వర్ణించారు.

దొర బంగళాకు ఇతర గ్రామస్థులు ఇళ్లకు మధ్య ఎత్తుగా నిలబడి ఉన్న గడిగోడ కూలిపోవడం "పాత గోడ" కథలోని ఇతివృత్తం. దొరతనం కూలిపోయిందన్న అర్థం స్ఫురించేలా రాయబడ్డ ఈ కథలో గ్రామస్థులు రాత్రికి రాత్రే వర్షానికి తడిసి ఉన్న గడిగోడను గడీలోకి పడగొడతారు. అంటే దొరతనాన్ని పడగొట్టారని అర్థం.

జానపద వ్యక్తీకరణ గొప్పగా ఉన్న మరొక కథ "యెలుగు మింగిన శీకటి". ఇందులో ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోతే, గ్రామంలోని పటేలు ఇండ్లు కాలిన వారి దగ్గర చందాలు వసూలు చేసి ఫైరింజన్ వారికి మామూళ్ళు ఇవ్వదలచుకుంటాడు.

ఈ సంకలనం మొత్తంలో ప్రత్యేకమైన కథ "మూగ మోసం". ఈ కథంతా రైలు పెట్టెలో నడుస్తుంది. రైలు క్యారేజి సమాజానికి సంక్షిప్త స్వరూపం. సమాజంలో మోసం చెయ్యనిది ఎవరు? అందరూ ఎవరినో ఒకరిని ఏదో ఒకరకంగా మోసం చేస్తున్నవారే. జరుగుతున్న మోసాల్ని చూసి, తమకు పట్టనట్టు ఊరుకున్న వారు కూడా ఒక రకంగా మోసగాళ్ళే. ఈ విధంగా దేవరాజు మహారాజు కళ్ళెదుట ఉన్న సమాజంలోని అవకతవకల్ని తనదైన పద్ధతిలో కళాత్మకంగా చెప్పారు.

## 2.2.2. పాలు ఎర్రబడ్డాయ్ (1991):

బట్టల మూటల ప్రతిబింబాలు నీళ్ళలో స్పష్టంగా కనిపిస్తున్నాయి మల్లమ్మకు. ఆమె ప్రతిబింబాన్ని చూసుకుంటే ఆమెకు ఎందుకో చెప్పలేని అసహ్యం వేస్తోంది. ఆమెకు పదహారేళ్ళున్నప్పుడు ప్రపంచం చాలా బాగుండేది. ఇష్టమైతే ఇంట్లో పనిచేసేది, లేకపోతే లేదు. సినిమాలు మాత్రం బోలెడు చూసేది. అందులో ఆడుతూ, పాడుతూ ఎగిరే ఆడవాళ్ళని చూసి తనూ అలాగే ఉండాలనుకునేది. కష్టపడుతూ, ఏడుస్తూ ఉండేవాళ్ళను చూసి తన బ్రతుకు అలా అవుతుందని ఎన్నడూ ఊహించలేదు.

ఈశ్వరయ్యకు యాక్సిడెంట్ అయ్యింది. కాలు బాగా దెబ్బతింది. ప్రమాద స్థితిలో ఉన్నాడు. గవర్నమెంట్ హాస్పిటల్లో కట్టు కట్టారు. మందులు, ఇంజక్షన్సు రాసిచ్చారు. పాలు బ్రెడ్డు తినాలన్నారు. ఇంటికొచ్చాక ఏవీ ఆచరణలో పెట్టలేదు. పెట్టడానికి నిలువ డబ్బు లేదు. అంతకు పది రోజుల ముందు మల్లమ్మ ఆడబిడ్డను కన్నది. పాప ఎర్రగా బొద్దుగా లేదు. మల్లమ్మ మాతృ హృదయం పాపను దగ్గరికి తీసుకుని గుండెలకు హత్తుకునేట్లు చేయడం తప్పించి, వేరే ఆకర్షణ ఏవీ లేవు. చాలా బలహీనంగా ఉంది.

ఇంటిముందు చిన్న కూతురు నిల్చుని ఏడుస్తోంది. దానికో ఏడేళ్లు ఉంటాయి. అమ్మ కోసం ఎదురు చూస్తోంది. పెద్ద కూతురు ఇంటి పనులు చూసుకొంటుంది. దానికో పదకొండేళ్లు. నాలుగేళ్ల కిట్టుగాడు అన్నం పెట్టమని ఏడ్చి ఏడ్చి చాప మీద నిద్రపోయాడు. ఈశ్వరయ్య నిండా కప్పుకొని మూలుగుతున్నాడు. కొత్తగా పుట్టిన బిడ్డ ఏడ్చునే తాగేసి పడుకున్నట్లుగా ఉంది.

ఇంటికొచ్చి పరిస్థితి చూడగానే మల్లమ్మ కెలాగో అయ్యింది. కిట్టుగాడి ప్రక్కకు బొంతపరిచి వాణ్ణి అందులోకి బొర్లించింది. "అమ్మా, ఎట్పోయినవే? గింతసేపు? శెల్లె పాలకోసం ఏడ్చి ఏడ్చి పన్నది." పెద్ద కూతురు లోపలి గదిలోంచి వచ్చి అడిగింది. "ఉన్న మీరిద్దరు మబ్బుల పని శేశేటంద్కు పోతిరి. ఇగ సంటిది శీదర జేస్కోబట్టే, గుడ్డలుత్కొద్దామని పోయిన గాని శాతగాలే ఉత్తగానే వొచ్చినా" ఆయాసంగా చెప్పింది మల్లమ్మ.

అమ్మా "నేన్ పనిచేసేయింటి అమ్మగారికి కొడ్కు బుట్టిండు నీకెర్కెనానే?" అంది పెద్ద బిడ్డ. "అమ్మగారు నిన్ను రమ్మన్నరు." మల్లమ్మ విని కూర్చొంది.

భర్త తన ప్రాణం. అతను లేకుంటే తనుండలేదు. తన జీవితం వృధా. అతను కళ్లెదుటే ఉంటే గంజి తాగినా బతకొచ్చు. కనిపించకుండా పోతే గుండెల్ని పిండేసే భయం. అలా జరగకూడదు. మరి తన భర్తకు మందులు కావాలి. మందులకు డబ్బులు కావాలి. ఎలా? అని ఆలోచించసాగింది. ఎంత ఆలోచించిన లాభం లేదు. డబ్బు సంపాదించే మార్గం కనిపించడం లేదు. మెల్లగా రమణి ఇంటికి వెళ్ళింది మల్లమ్మ. ఏందమ్మా పిలిచినవట అని అడిగింది మల్లమ్మ. ఏమీ లేదు. నిన్నో విషయం అడగాలి. ఒప్పుకుంటావో లేదో అని అంది రమణి. మార్కెట్లో దొరికే డబ్బాపాలు పొయ్యొద్దన్నాడు డాక్టర్. తల్లి పాలు కావాలట. అందుకే నిన్ను పిలిచాను. నీ దగ్గరుంటాయి. కదా పాలు అని!

మల్లమ్మకు అర్థమైంది. యజమానురాలి మాటల తాత్పర్యం. ఎంత డబ్బైనా ఇస్తాను మల్లమ్మ. నీకు పుణ్యం ఉంటుంది. రోజు మూడు సార్లు నా చంటోడికి పాలిచ్చి వెళ్లు. అమ్మగారి

కొడుక్కి పాలిస్తే డబ్బు దొరుకుతుంది. డబ్బుతో మందులు, మందులతో ఆరోగ్యం చేకూరుతుంది. డబ్బుతో అవసరాలు తీరుతాయి. మరి నా చిట్టిదానికి పాలు? ఏదైనా తాపి బ్రతికించొచ్చు. మొండి ప్రాణాలు అంత తొందరగా పోవు అని ఆలోచిస్తూ అంది.

ఇదిగో మల్లమ్మ యాభై రూపాయలు ఉంచు. మీ ఈశ్వరయ్యకు మందులు కావాలిగా తీసుకో అశ్రద్ధ చేయకు. ఇంకా అవసరం పడినా అడుగు. ఇన్నేళ్లుగా మా ఇంట్లో పని చెయ్యడానికి ఇద్దరి బిడ్డల్ని తోలిస్తున్నావు. ఆ మాత్రం అడగడానికి నీకు స్వతంత్రం లేదా అంది రమణి.

తన భర్త కోసం రూపాయలు కావాలి. చూస్తూ చూస్తూ వద్దనే సాహసం లేదు. అందుకే చెయ్యి చాచింది. తన చంటిది బలహీనంగా ఉంది. దాని నోటి దగ్గరి పాలు అమ్ముతున్నానే అని తన స్థితి తనకే అసహ్యాన్ని కలిగిస్తోంది. ఈ ఒక్క పూటైన తన చంటిదాన్ని పాలిచ్చోద్దామనుకుంది. కాని డబ్బిచ్చిన అమ్మగారు వెళ్లమన్నట్టే అని, మళ్లీ పాలిచ్చి పొమ్మంది. ఈ ఒక్కసారి కూడా ఎందుకు పోవాలనుకందేమో. నిజానికి మల్లమ్మకు కష్టం కలిగింది. అయినా సరే ఇచ్చి వెళతానని వెళ్లింది. బాబు గబగబా పాలు తాగుతున్నాడు. ఆమె ఆత్మవిశ్వాసాన్ని, అసహ్యతను తాగుతున్నాడు.

ఆమె దగ్గర పాలెన్ని ఉన్నాయో అంతకు పది రేట్లు కన్నీళ్లున్నాయి. కాని కన్నీళ్లకు ఖరీదు కట్టి ఎవరు తీసుకోరు.

మల్లమ్మ బిడ్డలు యథాప్రకారం ఇంటి పని చేస్తున్నారు. మల్లమ్మ యజమానురాలు బాబుకు పాలిస్తోంది. యజమానురాలు డబ్బు ఇస్తోంది. డబ్బుల వల్ల మందులు దొరుకుతున్నాయి. ఈశ్వరయ్య ఆరోగ్యంతో పుంజుకుంటున్నాడు.

పెద్ద కూతురు ఎక్కడివో ఆ పాలు, ఈ పాలు తెచ్చిపోస్తుంది. కాని ఆ పసి ప్రాణానికి అవి పడవు. మల్లమ్మ బిడ్డను చూడ్డంలేదు. చూసే తీరికా లేదు. పెద్ద కూతురూ చిన్న కూతురూ చూస్తుంటారు. ప్రాణం ఆగక అప్పుడప్పుడు చేతిలోకి తీసుకుని పాలిద్దామని ఉపక్రమిస్తుంది. కాని డబ్బు తీసుకొని ద్రోహం తలపెడుతున్నానా అని భయం కలుగుతుంటుంది. బిడ్డను దూరం జరుపుతుంటుంది. ఆ కాసింతలోనైనా చంటిదాని నోట్లో కిన్ని పాలు వచ్చేవి కావు. ఉన్నవన్నీ అక్కడ అమ్ముకుని వచ్చాక ఇంకా ఏం మిగులుతాయి.

బొంతలో బిడ్డను అలా పడుకోబెట్టి, యజమానురాలి బాబుకు పాలిచ్చే వేళయిందనో లేక అక్కడ ఉండడానికి భయమేసిందో తెలియదు. మల్లమ్మ తక్షణం యజమానురాలి ఇంటికి బయలుదేరింది. మల్లమ్మ ఇల్లు చేరేసరికి రమణి ఎటో తయారయ్యింది. మల్లమ్మా అయ్యగారు బయట ఉన్నారు. ఇద్దరం బయటికి వెళ్తున్నాం. వచ్చేసరికి చాలా రాత్రవుతుంది. అందుకోసం

బాబును చూస్తుండాలి. మల్లమ్మ "ఒక్క రాత్రే యేంది ఎప్పటికి సూత్తం పొండి" అనుకొని మంచిదమ్మగారు అని అంది.

మల్లమ్మ బాబును తీసుకుని పైన బాల్కానీలో సోఫా మీద పడుకోబెట్టి లోపలికెళ్లి రొమ్ము బాగా కడుక్కుని వచ్చింది. ఆమె కళ్లలో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. ఆమె భరించలేకపోయింది. ఏదో భయంలోంచి మొస ఎగబోస్తుంది. బాబు నింపాదిగా ఇక నీ బిడ్డను నాలోనే చూస్కో అన్నట్లు గటగటా త్రాగుతున్నాడు.

కన్నీళ్లు మల్లమ్మ చెంపల్ని దాటిపోతున్నాయి. ఒక్కసారి తన బిడ్డను చూసుకోవాలనిపించింది. గబుక్కున బాబును పక్కకు పడుకోబెట్టి లేచి ఏదో ఆవేశం ముందుకు తోస్తుండగా పరుగెడుతున్నట్లు మెట్లు దిగుతూ ఉంటే పాత చీర కుచ్చిళ్లు కాళ్లను పెనవేసుకొన్నాయి.

"నన్ను అన్యాయం చేసిపోకు అన్నట్లు బాబు ఏడుపు. పై నుండి మల్లమ్మకు విన వస్తోంది. కళ్లు తెరిచి పైకి చూసే యత్నంలో, ఆ తొందరలో రవిక కట్టుకోలేదని తెలిసి చేతితో అదుముకుంది. పాలు కారిపోతున్నాయి. పాలు, చేతి రక్తము కలిసి సన్నని ధారగా ఆమె కడుపు మీదుగా పారుతున్నాయి.

## 2.2.3. దేవరాజు మహారాజు కథలు (1993):

తెలంగాణ మాండలిక భాషలో కవితకు, కథకు శ్రీకారం చుట్టి, ఆ ప్రాంత ప్రజల స్థితిగతులను, వ్యధలను, బీభత్సాలను వెలికితీసి, ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు దేవరాజు మహారాజు. వీరి కథలు తెలంగాణ మాండలిక భాషకి నిఘంటువులా ఉంటుంది.

ఈ కథా సంకలనంలో పొడవని పొద్దు, సోదా, అంతరం, ఓటు విలువ, కిటుకు, శ్రద్ధాంజలి, జీవిత పోరాటం, బతుకు ఫ్యాను, కూడలి, విముక్తి, మనిషి కథలు, లేతగడ్డి, కింగ్మేకర్, తోసెయ్ తోసెయ్, కిస్సా కాపీకా, నిరంతర సాధన, అజ్ఞానోదయం, బెటర్ హాఫ్ మొదలైన కథలు కలవు.

చదువుకునే అవకాశం లేని చిన్నారుల మెదడుకు చదువుకోవాలన్న ఆకాంక్ష ఎంత బలమైనదో వ్యక్తీకరించడమే కాక, ఆ చదువు కంటె బతుకు నేర్పే చదువు ఎంత గొప్పదో గుర్తింపజేసిన కథ "పొడవని పొద్దు". ఈ కథలోని పోశాలు ఎనిమిదేళ్లు నిండి నిండక ముందే అతని తండ్రి దొర దగ్గర చేసిన రెండు వందల రూపాయలు అప్పు తీర్చడం కోసం దొర పశువులు కాస్తుంటాడు. పచ్చమేడ వాళ్ళ పశువులు, తోలుకు రాను వెళ్ళగా కాన్వెంటులో చదువుతున్న దొర

వాళ్ళబ్బాయి శీను స్కూలు యూనిఫాంలో ముచ్చటగా కనిపిస్తాడు. శీను తన దగ్గరున్న బాల్పెన్ను ఎలా రాస్తుందో చూపించడంతో తాను కూడా దాన్ని ఒకసారి చూసిస్తానని అడుగుతాడు పోశాలు. కానీ శీను ఇవ్వకుండా ఇంట్లోకి పరుగెత్తి వాళ్ళ అమ్మకు పోశాలు పైన ఫిర్యాదు చేస్తాడు.

శీనును భయపెట్టడం తప్పు కదూ అంటే "భయపెట్లెదమ్మా గది పెన్నట! సూసిస్తనన్న గంతే" అంటాడు. చదువురాని వాడివి నీకవెందుకూ — ఛో ఛో దొడ్లోకి ఛో అంటుంది. ఆమె తనను తిట్టకుండానే తిట్టినట్లనిపిస్తుంది పోశాలుకు. శీను వయసే ఉన్న పోశాలు మాత్రం పశువులకు కుడితి తాగించమని, బర్రె గొడ్లను కడగమని పురమాయించబడతాడు. శీను స్కూలుకు పోయి చదువుకోవడం వల్లనే అతనికి విలువ పెరిగినట్లు అనిపిస్తుంది పోశాలుకు. దాంతో చదువు మీద మరింత మమకారం పెరుగుతుంది.

పశువులను కడిగినందుకు పోశాలు చేతిలో ఇరవై పైసలు పెడుతుంది శీను తల్లి. దాంతో బలపాలు కొని అఆ లు నేర్చుకుంటే బళ్ళోకి పోవచ్చనుకుంటాడు పోశాలు. చేతిలోని ఇరవై పైసలు గంజిలోకి ఉప్పు కారానికి వస్తుందని పోశాలు తల్లి సంతోషపడుతుంది. బలపాలు కొనుక్కుంటానన్న కొడుకు మాటలు విని, వినరాని మాట విన్నట్లుగా ఆశ్చర్యపోతుంది. "నీ రాతకు అదొక్కటే తక్కువయింది" అంటూ డబ్బులు లాక్కుంటుంది. పోశాలు కసితో, కోపంతో ఏడుస్తూ పడుకుంటాడు.

గొడ్లు కాసే ముసలి తాత చిన్న దొరకు వంగి వంగి దండాలు పెడుతుండటంతో ఆ పిల్లగాడెవరంటూ తాతను ప్రశ్నిస్తాడు పోశాలు. "ఓశీ నీయక్క పిలగాడంట వేంట్రా? కళ్ళు పోతయి మన చిన్నదొర. ఆయన కాడ జీతముండుకుంట పిలగాడంటావురా ముండాకొడ్క" అని అదమాయిస్తాడు. యజమాని తనకన్న చిన్నవాడయినా, దుర్మార్గుడైనా అతని దగ్గర పనిచేస్తున్నందుకు బానిసలుగా వ్యవహరించడం భూస్వామ్య వ్యవస్థ సహజ లక్షణం. అందులో ఆశ్చర్యం, అనుమానం పొందేంత పరిస్థితి, ఆ వ్యవస్థలో జీవించే తాతకు కొత్తగా లేదుగాని, పోశాలుకు మాత్రం ఓ పార్శ్వంలో విస్తరిల్లే భావజాలం, ఉద్యమాలు తనకన్నా చిన్న వయసులో ఉన్నవానికి అంత వంగిపోయి వ్యవహరించేదెందుకా అనే ప్రశ్న, రేపటి తరం ప్రతినిధి పోశాలులో కలుగుతుంది.

చిన్న దొర రూపం తెల్లగా, బొద్దుగా, అందంగా ఉండటంతో చదువుకోవడం వల్లనే అందం, ఆకర్షణ వచ్చిందని పోశాలు భావిస్తాడు. చదువుకోవడం వలన కలిగే ప్రయోజనం, ప్రాధాన్యత పోశాలు మెదడులో రెండవసారి బలపడుతుంది. ఎప్పటికైనా చదువుకుని పశువులు కాసేపని

నుంచి తప్పుకోవచ్చు అనుకుంటాడు. కానీ పశువులు కాసే తాత తనంత వయసు నుంచి దొరల దగ్గర రకరకాల పనులు చేస్తూ, జీవిత చరమాంకం సైతం దొరల పాదాల వద్దనే గడపటం తెలిసి భయపడతాడు. తను కూడా తాతలాగా జీవితాంతం దొరలకు బానిస చాకిరిలో మగ్గిపోకూడదని అనుకుంటాడు. దాన్ని తప్పించే తారకమంత్రం చదువే అనుకుంటాడు. అందుకే 'తాత – బడికి తోలమని మా అమ్మ నడుగుతనే' అనగానే "ఏం బుద్ధి పుట్టిందిరా పోరడ నీకు, మంచిగ దొరతానుండక తాబేదారువైతవా? తాలుక్ దారువైతవా? ఎన్కటికి మీ నాయిన దొరతాన తీసుకున్న రెండొందలు ఎవలు తీర్చాలనుకున్నావే" అంటూ హేళన చేస్తాడు.

దొరల దోపిడి స్వభావాన్ని గుర్తించని అమాయకత్వం వర్గస్పృహ లేకపోవడం వల్ల, తమ చాకిరి ఖరీదు తెలియని పాత భావాలే తాత చేత ఆ మాటలనిపించాయి. నిజానికి జీతంతో పనిచేస్తే రెండు వందల రూపాయలు కొంత కాలానికి తీరిపోతుంది. కాని దొరల పెత్తందారీతనానికి, ప్రజల అజ్ఞానం, నిరక్షరాస్యత, తోడై తమ శ్రమకు తగిన ప్రతిఫలం పొందటం అటుంచి, జీవితాంతం గొడ్డు చాకిరి చేసినా అప్పుతీరక తరతరాలు దొరల దగ్గర పనిచేస్తుంటారు.

దొరల పెత్తనం పోయి చాలా రోజులయ్యింది. వెట్టిచాకిరి పోయి చాలా ఏళ్ళయిందని, నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్తు వారిపైనే ఆధారపడి ఉందని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టే రాజకీయ నాయకులకు చురకలాంటిదీ కథ పొడవని పొద్దు.

పోలీసు వ్యవస్థలోని అరాచకత్వాన్ని, అమానుషత్వాన్ని, అవినీతిని బట్టబయలు చేసే కథ "సోదా". పోలీసులు సోదా చేయాలనే నెపంతో జరిపే దుశ్చర్యలను కళ్ళకు కట్టినట్లుగా రచయిత ఈ కథలో చిత్రీకరించారు. పోలీసులు అమాయకులపైన అక్రమ కేసులు బనాయింపునకు ఎలాంటి పద్ధతులను అవలంబిస్తారో, వ్యభిచారం కేసుల్లో, నక్సలైటు కేసుల్లో, ఎన్కౌంటర్లలో ఎలాంటి నీచమైన ఎత్తుగడలను పన్నుతారో వివరించిన గొప్ప కథ సోదా.

యస్.ఐ. అవినీతి ప్రవర్తన గురించి స్కూలు టీచర్ అయిన గుడిమెట్ల బుచ్చయ్య చిన్న కొడుకుపై అధికారులకు ఫిర్యాదు చేస్తాడు. ఆ కోపంతోయస్.ఐ.అతనిపైన ఎట్లైన దొంగ కేసు బనాయించి అవస్థ పెట్టాలని చూస్తుంటాడు. అతను రాడికల్ విద్యార్థి సంఘంలో తిరుగుతాడని తెలుసుకున్న యస్.ఐ.వాళ్ళ ఇల్లు 'సోదా' చేయాలనే పథకం తయారుచేస్తాడు. అందుకుగాను హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్ళు ఇస్మాయిల్, మధుసూదన్, లారీ డ్రైవర్ గంగారాంలకు మందు పార్టీ చేసుకోమని చెప్తాడు. మందు పడిన మరుక్షణం నుండి హెడ్ కానిస్టేబుల్, యస్.ఐ. అధికార భండారాన్ని బట్టబయలు చేస్తాడు. కొత్తగా ఉద్యోగంలో చేరిన

మధుసూదన్కు అయోమయంగా ఉంటుంది. టీచరింట్లో ఏ దొంగ సొమ్ముందని 'సోదా' చెయ్యాలని ప్రశ్నించి, హెడ్డుతో ఉత్త చవటవనిపించుకుంటాడు. "మన కాకీ బట్టల పవరు నీకింకా తెల్వకపాయా" అంటూ అవినీతి గీతోపదేశం చేస్తాడు లక్ష్మీనారాయణ.

"అర్ధరాత్రి ఇంటిమీద పడి మీ ఇంటికి వాడొస్తాడా? వీడొస్తాడా అని అగడాలె. తీవ్రవాదుల తోటి సంబంధమున్నదని బెదిరియ్యాలె. గౌర్నమెంటు ఖిలాఫ్ల పన్జేస్తున్నారని అదరగొట్టాలె. మీ కొడుకు అట్ల జేశిండు, ఇట్ల జేశిండు అని భయపెట్టాలె. సామానంత కల్లం కల్లం చెయ్యాలె. చిన్న కొడుకులు పుస్తకాలు దొరుకుతాయి. అన్నీ మూటగట్టుకోవలె" అంటూ పోలీసులు జరిపే 'సోదా' భాగోతాన్ని రచయిత అంచెలంచెలుగా వివరించారు.

న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న యువతను తీవ్రవాదం, దేశద్రోహం నేరాలు మోపి, దొంగకేసులు బనాయించే పోలీసుల నిజాయితీ ప్రజలెరుగనిదేం కాదు. పోలీసు వ్యవస్థలో పైకి కనిపించే అవినీతి నిరోధకత్వం, క్రమశిక్షణ, దేశరక్షణ లాంటి అందమైన ఉదాత్తమైన ముసుగును మాత్రమే చూసి, ఆ ఉద్యోగాల్లో చేరిన మధుసూదన్ లాంటి అమాయకులకు తప్ప. అంతే గాదు బుచ్చయ్య కొట్టంలో గల కొయ్య సామాను చీకట్లో తన ఇంటికి చేరవేయించుకుంటాడు అని హెడ్డు చెప్పడంతో, "అదెట్ల?" అని అడిగిన గంగారాంతో "యస్.ఐ.ఇన్వెస్టిగేషన్ల బద్దడు. ఎక్కడెక్కడి రూల్సు దీసి అడుగుతడు. సెక్షన్లు చెప్తడు. నానా హంగామా చేస్తాడు. "వాడో పతిత్తుగాడు. మమ్ముల సోదా చేయమంటాడు. మేం జేస్తం. రాత్రికి ఆ బజార్ల కరెంటు రాకుండ జేశినం. కొట్టం కోశిపెట్టిన చెక్కలు మా లుచ్చాగాండ్లు రొద్దు మీదికి మోస్తారని హెడ్డు వివరిస్తాడు. ఆ పథకం రూపొందించిన యస్.ఐ.ని, అతని అనుచరులను, గంగారాం బూతులతో పోలీసు వ్యవస్థను అందుకొని నీచత్వాన్ని తూర్పారబడతాడు.

ఎంత కష్టబడి కొన్నాడో ఏమో – ఇంటి చెక్కలు అని టీచరు పట్ల గంగారాం సానుభూతి వ్యక్తం చేస్తాడు. అతని చిన్న కొడుకు అడవుల్లో గోండ్లతో తిరుగుతాడని మాకు తెలీదా? వాళ్ళను మచ్చిక చేసుకొని వాళ్ళచేత టేకుచెట్లు కొట్టించాడని దబాయించే తెలివి మనకు లేదా? అంటాడు లక్ష్మీనారాయణ. ఏ మాత్రం మానవత్వం లేకుండా, ఏ సెక్షన్ వాళ్ళ ఖజానా నింపడానికి ఉపయోగపడుతుందో ఆ సెక్షన్ను విచ్చలవిడిగా ఉపయోగిస్తూ సామాన్యులను దోచుకునే దోపిడి దొంగలుగా మారిన వైనం మన పోలీసు యంత్రాంగంలో కనబడుతుంది.

హోటల్ సోదా చేయగా, పట్టుబడిన జంటలో మగవాడు తన దగ్గరున్న నాలుగు వందలు ఇచ్చి తప్పించుకుంటాడు. ఆమెను లాకప్లో పెట్టి రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలకు

అప్పజెప్పి వ్యాపారం సాగిస్తాడు. పొట్ట గడవక వ్యభిచరించిన వాళ్ళను పట్టుకొని శిక్షించిన న్యాయస్థానం, పోలీసులు లాకప్ సెల్లను వ్యభిచార గృహాలుగా మార్చినా, సామూహిక మానభంగాలు చేసినా చట్టం పరిధి చాలదు. ఏ న్యాయస్థానానికి ఇలాంటి కేసు విచారణకు రాదు. అమ్మాయిల శరీరాలతో వ్యాపారం చేసే దళారులుగా, తార్పుడుగాళ్ళుగా వ్యవహరిస్తున్న పోలీసు వ్యవస్థ నైతిక స్థితి ఎంత హీనాతి హీనస్థితికి దిగజార్చబడిందో అర్థమవుతుంది.

మారిన కాలంతోపాటు కుటుంబ వ్యవస్థలో ఏర్పడుతున్న నెర్రలను చూసి పాత తరం అనుభవిస్తున్న రంపపుకోతను "అంతరం" కథలో గాఢంగా స్మరించగలిగారు. ఒక ప్రాణంగా మెలిగిన అన్నదమ్ములు పెళ్ళి అయిన తరువాత తమ తమ సంసారాలు వేరుపడి ఆస్తిని పంచుకోవటమే కాక మమతలు, మమకారాలు కూడా చంపేసుకునే క్రమం అర్థం కాని రాములమ్మ లాంటి వాళ్ళు బాంధవ్యాలు నిలబెట్టలేని కుటుంబాన్ని తల్చుకొని, గుండె చెరువుగా మార్చుకున్న దృశ్యాన్ని సున్నితంగా శక్తివంతంగా రచయిత "అంతరం" కథలో చెప్పారు.

రాజకీయ నాయకుల మోసపూరిత మాటలను వాళ్ళ స్వార్థపూరిత ఆలోచనలను "కిటుకు, అమృతం, ఓటు విలువ, శ్రద్ధాంజలి, ఓటరు శరణం గచ్ఛామి" కథల్లో చెప్పారు రచయిత.

ఓటు అడిగేటప్పుడు చూపించిన వినయం, గౌరవం, ఓటు వేయగానే ఎలా అడుగంటి పోతాయో "ఓటు విలువ" కథ తెలియజేస్తుంది.

భారతదేశంలోని పౌరులు సగం సగం జీవితాలు బ్రతుకుతూ సగం సగమే ప్రగతిని సాధించడానికి వెనుక గల కారణాన్ని రాజకీయ నాయకులు అవలంభించి ఆచరించే సగం సగం వాగ్దానాల రహస్యాన్ని "కిటుకు" కథ చిత్రిస్తుంది.

బతికున్నప్పుడు పస్తులున్నా పట్టించుకోని ప్రభుత్వం, చనిపోయిన తరువాత బిరుదులు, అవార్డులిచ్చి గౌరవించే సాంప్రదాయాన్ని విమర్శించిన కథ "శ్రద్ధాంజలి".

యాదవ్ రెడ్డి అంతరంగ మధనంలో తనలోని బలహీనతల్ని జయించి, అతలాకుతలమవుతున్న సమాజం చేస్తున్న జీవన పోరాటంలో భాగస్వామి గావడం "జీవిత పోరాటం" కథలోని ఇతివృత్తం. యాదవరెడ్డి పత్రికాఫీసులో విలేకరిగా పనిచేస్తుంటాడు. ఉద్యోగ ధర్మం అంటూ పత్రికలు చిత్తశుద్ధి లేకుండా ఎవరేం చెబితే వాటిని ప్రచురించే దాకా పత్రికలుగా కాకుండా, ప్రజలకు నిజాలను వెల్లడించే నిజమైన పత్రికలుగా ఉండాలన్న సంకల్పంతో ఆత్మస్థైర్యంతో కర్తవ్య నిర్వహణ కోసం ముందడుగేస్తాడు.

ప్రజల తీర్పుకు హర్షం ప్రకటిస్తూ, "ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం" అని గెలిచిన అభ్యర్థి చేసిన ప్రకటన తానే (యాదవరెడ్డి) రాశాడు. "ఉచిత కల్లు, సారాయి కుళాయిలను నిరంతరం ప్రవహింపజేసి జనాన్ని మోసం చేసి, డబ్బుతో మభ్యపెట్టి గెలవడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధం" అని అన్న ఓడిపోయిన ప్రతిపక్ష ప్రత్యర్థి ప్రకటనను తానే రాశాడు. బస్టాండులో బస్సు కోసం ఎదురుచూస్తున్న యువతిని లాక్కొచ్చి డ్యూటీలో ఉన్న పోలీసులంతా కలిసి రేప్ చేశారని ప్రజలు చేసిన ఆందోళన గురించి తానే రాశాడు. జీతాలివ్వడం లేదని నిరహార దీక్ష జరుపుతున్న వృద్ధ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి మీద లాఠీ ఉపయోగించారన్న వార్త తనే ప్రకటించాడు. వృద్ధాప్యం వల్ల చలి భరించలేక జబ్బు పడ్డాడన్న ప్రభుత్వ ప్రకటనను తానే తెలియజేశాడు.

జరిగిన సంఘటనలను నిజాయితీగా ప్రచురించిన జర్నలిస్టుగాను, ఆ వార్తలను ఖండిస్తూ ప్రభుత్వ అధికారులు ఇచ్చిన ప్రకటనలను వార్తలుగా తానే ప్రచురించడంతో అతనిలో సంఘర్షణ మొదలవుతుంది. తాను ముందు ప్రచురించిన వార్తలు అసత్యాలైతేనే కదా ప్రభుత్వ అధికారుల ప్రకటనలను ప్రచురించగలిగేది అన్న అవగాహన కలగడం వల్ల, తన నిజాయితీ మీద తనకే కలిగిన శంక, అతనిలో చెలరేగిన సంఘర్షణ అతనికి పథక నిర్దేశం కలిగిస్తుంది.

ప్రభుత్వాలు ఎప్పుడు గద్దెలు కాపాడుకునే ప్రయత్నాలు చేస్తాయి. అందుకోసం తుపాకీ అధికారం కొమ్ము కాస్తుంది. అది చేసే దారుణాలను అబద్ధంగా చిత్రించే విధంగా పత్రికల ప్రచారం అవసరమవుతుంది. పత్రికా స్వేచ్ఛను నిలబెట్టుకుంటూ, ప్రజలకు హితం చెప్పే బాధ్యత పత్రికలపైన ఉంది. కానీ గద్దె లెక్కిన వాళ్ళకు హితం రుచించదు. అట్లని చెప్పేవారు కూడా తమ కర్తవ్యాన్ని విస్మరిస్తే జాతి భవిష్యత్తు ఉండదు.రోగికి శస్త్ర చికిత్స అవసరమో కాదో నిర్ణయించాల్సింది వైద్యుడు గాని రోగి కాదు. మన దౌర్భాగ్యమేమంటే రోగి కోరినట్లు ప్రవర్తించే వైద్య శిఖామణులు సంచరిస్తున్న సమాజం. అందుకే రోగగ్రస్తమైన సమాజ రుగ్మతలను బాగు చేయడానికి పత్రికలు, వైద్య సేవలందించాలి. అక్కడే సమాజం పట్ల వాటి బాధ్యత పూర్తిగా నిర్వర్తించినట్లు అవుతుంది.

పత్రికాఫీసు ఉద్యోగంలో అబద్ధాలకు పాలిష్ కొట్టి అమ్ముకునే పత్రికలకు విరుద్ధంగా జనానికి సరైన అవగాహన కలిగించే విధంగా, తను, తనతోటివాళ్ళు ప్రయత్నించడం కనీస కర్తవ్యంగా యాదవరెడ్డి భావిస్తాడు. తనలాగే ఆలోచించేవారు తనకు తోడు చాలా మందే ఉన్నారని గుర్తించగలుగుతాడు. సమాజాన్ని అద్దం పెట్టి చూపినట్లుగా పత్రికలు నిజాలు చెప్పాలనుకుంటాడు.

"బతుకు ఫ్యాను" కథలో విశ్వనాథం ప్రైవేట్ స్కూల్లో టీచరుగా పనిచేస్తుంటాడు. వాళ్ళు నాలుగు వందలు పైన సంతకం చేయించుకుని రెండు వందలు అతనికిస్తారు. రెండేళ్ళ నుంచి అదే

ఉద్యోగం చేస్తున్నా, ఎదుగూబొదుగూ లేని జీతం, చాలీ చాలని జీతంతో రోజులు వెళ్ళదీస్తుంటాడు. టేబుల్ ఫ్యానుతో తన జీవితాన్ని పోల్చి చూసుకొంటూంటే కొంతసేపటికి అది ఆగిపోతుంది. ఫ్యాను సమ్మె చేసిందని భావిస్తాడు. ఏదో సందేశం ఫ్యాను తనకందినట్లుగా దృఢ మనస్కుడవుతాడు.

తనలాంటి పరిస్థితి తనొక్కడికే కాదు. తనలాగా చాలామంది టీచర్లు, ఆఫీసు గుమాస్తాలు, ప్యూన్లు, స్వీపర్లు ఆ స్కూల్లో పనిచేసే అందరి పరిస్థితి అలాగే ఉంది. అలాంటప్పుడు పాఠశాల యాజమాన్యంపైన సిబ్బందంతా ఐక్యమత్యంగా కలిసి తిరగబడినప్పుడు యాజమాన్యం తమ డిమాండ్లను పట్టించుకోక తప్పదనే అవగాహన కలుగుతుంది. యంత్రమే పనిచేయనంటూ నిలిచి పోగలుగుతున్నప్పుడు మెదడుండి ఆలోచించగలిగిన తమకు సమ్మె చేసే శక్తి తప్పక ఉందని గ్రహిస్తాడు. బాధపడుతూ కూర్చోడం కంటే సమ్మె చేయాలనే సంకల్పంతో ముందుకు అడుగేస్తాడు.

యూనివర్శిటీ చదువులు బతుకు పోరాటంలో ఏమాత్రం ఉపయోగపడలేక కేవలం డిగ్రీ పట్టా కాగితాలుగా మిగిలిపోతున్న స్థితికి నిరసనగా "కూడలి" కథలో వర్ణింపబడింది. యూనివర్శిటీ లెక్చరరుగా పనికిరాని పాఠాలు చెప్పడం కంటే యువతకు అవసరమైన చదువు చెప్పాలని ప్రొఫెసరు ఆలోచిస్తాడు. తాను అందరు ప్రొఫెసర్లలాగా కులాల, మతాల పిచ్చితో రాసిన సిద్ధాంత గ్రంథాల్ని అట్టేపెట్టే మకిలి రాజకీయాలు తనకు వద్దని భావిస్తాడు. "యువజనాన్ని చైతన్యవంతులుగా చేసేవాడినవ్వాలి. వారికి దారి చూపించే వాడిలాగా కావాలి. కూడలిలో ఎలక్ట్రిక్ సిగ్నల్ స్తంభాలుగా పక్షపాతం లేకుండా ఉండాలి. అందుకోసం ఈ యూనివర్శిటీ సిలబస్లు చదవడం అనవసరమని అనుకుంటాడు.

మానవ నైజంలోని అసహజత్వాన్ని, అమానవీయ లక్షణాన్ని వ్యంగ్యంగా రాసిన కథలు "మనిషి కథలు". ఈ కథల్లో మనిషిలోని బలహీనతలు, వ్యక్తిగత చింతనలు, స్వార్థం, రాజకీయం, సోవియట్ రష్యాలో వచ్చిన రాజకీయ పరిణామం, స్త్రీవాద ఉద్యమం పట్ల గల అసంతృప్తి వ్యక్తమవుతాయి. మనిషిలో మరుగవుతున్న మనిషి తత్వాన్ని పునర్జీవింపజేసే ప్రయత్నం మనిషి కథలు.

పై అంతస్థుకు చేరగలిగిన మనిషి ఎంత గడ్డి కరచి ఉంటే అంత ఎత్తుకు ఎదిగినాడో అన్నటువంటి ఆరాధనతో గడ్డైనా సరే సందేహించకుండా తిన్న మూర్ఖత్వం "లేత గడ్డి" కథలో ప్రతిబింబిస్తుంది.

ఈ సమాజంలో చెలామణి అవుతున్న విలువలన్నీ తారుమారైన విలువలు. డబ్బుమీద వ్యామోహం ఉన్నవాడు చేసే పనులు తెలివైన పనులు. తన డబ్బు ఎంత వీలైతే అంత ఎక్కువ

పెంచగలిగిన వాడే సమర్థుడు. అందుకుగాను చట్టపరిధిలోనే అతి సునాయాసంగా ఆర్జన చేయవచ్చు. ఉన్నత విలువలతో బతికేవారికి డబ్బు సంపాదన గగనమే గాని, మనిషి దిగజారిన తర్వాత డబ్బు సంపాదించడానికి సవాలక్ష మార్గాలున్నాయి. డబ్బు తప్ప మనిషికి విలువలేని సమాజంలో డబ్బే సర్వసత్తాక అధికారాలను హస్తగతం చేసుకుంటుంది. రాజకీయ నాయకులను తన పాదాక్రాంతం చేసుకుంటుంది. డబ్బుతో ముడిపడిన మానవ విలువల్ని "కింగ్మేకర్" కథలో చెప్పారు రచయిత.

సోవియట్ రష్యాలో గోర్బచెవ్ ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యంలో నుంచి "తోసెయ్, తోసెయ్" అన్న కథను రాశారు. రష్యా అధినేత గోర్బచెవ్ ప్రవేశపెట్టిన పెరిస్త్రోయికా, గ్లాస్నాస్త్ ప్రభావాలు రష్యా ప్రభుత్వాన్ని ఎలా అతలాకుతలం చేసి వదిలిందో ఈ కథలో వివరించారు. స్వేచ్ఛ కన్నా అన్నమే ప్రధానమని, ఆ తర్వాత గుర్తించిన ప్రజలు 'అన్నం పెట్టకుండా స్వేచ్ఛనిచ్చిన వాడెవడా' అని ప్రశ్నిస్తూ తమకు స్వేచ్ఛ మాత్రమే ప్రసాదించినవాణ్ణి గద్దె దింపి, తమ కోపం చల్లార్చుకుంటారు.

కాపీ కొట్టే కళను అవపోసన పట్టిన కాపీ బ్రహ్మల గురించి "కిస్సా కాపీకా" కథను, సభల్లో సొల్లువాగుడు వాగందే బతకలేని 'మైక్–బ్రహ్మ'ల గురించి "నిరంతర సాధన" కథలోనూ మనిషి స్వభావంలోని బలహీనతలు ఎంత హేయమైనవో సున్నితంగా చెప్పారు.

మనిషి తనెవరో మరిచిపోయేంతగా మనుషుల్లో అంతరించిన మానవత్వాన్ని "అజ్ఞానోదయం" కథలో వివరించారు. ఎందర్ని ప్రశ్నించినా 'నువ్వొక మనిషివి' అన్న స్పృహ అతనికి కలుగజేయరు. రాజకీయ నాయకుడికి ఓటరుగా, క్రికెట్ ఆటగానికి అభిమానిగా, విజ్ఞాన శాస్త్రవేత్తకు 'బి' పాజిటివ్ బ్లడ్ గ్రూప్గా అనిపిస్తాడు. "ఈగ కథ"లో పేరు మరిచిన ఈగ తన పేరు కనుక్కోవడం కోసం తిరిగినట్లుగా మనిషి తిరుగుతాడు. ఒక కవి నువ్వు మానవత్వం గల 'మనిషి' వంటూ గుర్తు చేస్తాడు రచయిత.

"బెటర్ హాఫ్" ఈనాడు తెలుగు సాహిత్యంలో వస్తున్న స్త్రీవాద చైతన్య ధోరణిని విమర్శిస్తూ వ్యంగ్యంగా చెప్పిన కథ.

భాషా ప్రయోగం, జీవిత వాస్తవికతలో ఒక ప్రధానమైన అంశం. ఏ ప్రాంతపు జీవితాన్ని ఆ ప్రాంతీయ భాషలో రాయకపోతే కథా జీవితానికి నిండుతనం, స్వాభావికత చేకూరదు. తెలంగాణ జిల్లాల మాండలిక భాష దేవరాజు మహారాజు కథల్లోని పాత్రలకు ప్రాణం పోసింది. నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడే పాత్రలు, తమ బాధలు విముక్తమయ్యే మార్గంలోకి మళ్ళిన దృఢ

మనస్కులుగా నిలుస్తాయి. 'జీవిత పోరాటం'లోని యాదవరెడ్డి, 'బ్రతుకు ఫ్యాను'లోని విశ్వనాథం, 'కూడలి' లోని యూనివర్శిటీ ప్రొఫెసరు అందరూ నిజాయితీతో, లక్ష్య సిద్ధితో తమ గమ్యం వైపు పయనిస్తారు.

### 2.2.4. మనిషి కథలు (1993):

విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసిసాహితీ స్వర్ణోత్సవం జరుపుకున్న దేవరాజు మహారాజు గారి రచనల్లో విభిన్నత రాజసంలా కనిపిస్తుంది. భిన్నమైన ఆలోచనలతో రచనలు చేసే దేవరాజు మహారాజు రచించిన కథల సంపుటే "మనిషి కతలు". మనిషిలోని భిన్న కోణాలను, ఆలోచనలను, సామాజిక సమస్యలను సరికొత్త రీతిలో అందించారు. సమస్యలతో పాటు దాని చెప్పే క్రమంలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని జోడించారు.

"మనిషి కథలు" అన్నింటికీ శతక పద్యానికి మకుటంలాగా ఓ ముగింపు వాక్యం ఉంటుంది. "మనిషి దేని కోసమో అన్వేషిస్తూ దేని కోసమో బతుకుతున్నాడు". అయితే ఈ మకుటానికి ఆ మకుటానికి తేడా ఏమిటంటే శతక మకుటం సంబోధన వరకే పరిమితమైతే ఇది కథకు ప్రతిపాదకంగా నిలుస్తుంది. మనిషి కథలన్నీ మానవ స్వభావాల చిత్రణలుగా రూపొందిన కథలు.

"మనిషి కథలు"లో ఒక స్పష్టమైన ప్రయోగ ప్రత్యేకత కనిపిస్తుంది. శతక పద్యాలకు ఒక మకుటం ఉన్నట్లు, కథలను కూడా మకుటం లాంటి వాక్యంలో ముగించడం వీటిలో కనిపించే కొత్త గుణం. కొంత కథనం, కొంత వ్యంగ్యం, మరికొంత హాస్యం, ఇంకొంత కార్టూనిజం అన్నీ కలిపి వచన పాకాన్ని కథా మకుటంతో వడ్డించారు. "మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ దేని కోసమో బతుకుతూనే ఉన్నాడు" అన్న వాక్యం ఈ కథకు మకుటం. ఈ కథల నాయకుడు ఎవరో ఒక పాత్ర కాదు. సాధారణీకరించబడ్డ మనిషి. అందుకే "మనిషి కథలు" అని పేరు పెట్టారు.

మనిషి కథలుగా పేర్కొన్న కథలు గల్పికల లాంటి రచనలు. కింగ్ మేకర్ కథ, లేతగడి, శుభోదయం, కిస్సాకాపీకా, సయోధ్యరాముడేడి, చర్విత చరణం, మార్నింగ్ వాక్ మొదలైన కథలు ఈ సంపుటిలో కలవు.

ఇందలి కథలన్నీ 1992–2015 మధ్యకాలంలో రాసినవిగా పేర్కొన్నారు. ప్రతి కథ చివరలో "మనిషి జీవితం దేన్నో అన్వేషిస్తూ, దేని కోసమో బతుకుతూనే ఉన్నాడు" అంటూ ముగింపు నివ్వడం కొత్తదనం.

"శుభోదయం" కథలో ఇల్లు ఒక అద్భుతమైతే, కిటికీ పరమాద్భుతం. అది తెరిస్తే కన్ను తెరిచినట్టు ప్రపంచం అంతా కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది అంటారు. నిజమే 'కిటికీ' రేపటి ఆశల్ని, సందేహాల్ని, సమస్యల్ని, ఆలోచనల్ని, ఆనందాన్ని మనసులో కలిగించేలా చేసే చిన్న ద్వారం లాంటిది. ఉదయం లేచింది మొదలు ఆఫీసుకు వెళ్ళేలోపు జరిగిన, మెదలిన ఆలోచనల మేళవింపు ఈ కథ. ఇందులో బ్రష్ చేసుకోవడానికి బాత్రూమ్కు వెళ్ళి వాడుకుంటున్న నీళ్ళను చూసి ఎక్కడో ఉండే నీళ్ళు మన అవసరాలకు పంపులోకి రావడం వంటివి సౌకర్యాల గురించి, కొడుకు రిమోట్తో టి.వి. ఆన్ చేయడం, రేడియోలో షహనాలు వింటూ అనుభూతిని కొలిచే సాధనం లేదనడం వంటి వాటి గురించి ఆసక్తికర అంశాల క్లుప్తతలోనే విస్తృత సందేహాలను కలిగించి సమాధానమిస్తారు. ఇవి మనిషికి ఉపయోగపడుతున్న వైనాన్ని చెబుతూ మనిషి కథల్లో ఎన్నో మలుపులు, ఎన్నో విజయాలు అంటూ ముగిస్తారు.

'చర్విత చరణం' కథలో భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. పెండ్లినాడు ఆ జంట గురించి పెద్దలన్న మాటలకు భర్తలోని మరో మనిషి బయటకు వస్తాడు. అది భార్యపై ఆధిపత్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఆఫీసు మొదలు అన్నింటా బయట మాటలు, అవమానాలు ఏమీ చేయలేని భర్తలోని మరో మనిషి భార్య పై ప్రతాపం చూపిస్తాడు. ఫలితం పెళ్ళినాడు "అమ్మాయి చక్కగా ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అన్న పెద్దల మాటలే నిజం అవుతాయి. దీపమే మిగులుతుంది. ఈ చిరుకథలో భార్యాభర్తల మధ్య అనుబంధాన్ని చెబుతారు. ఎదుట మనిషిని అంటూ ఆనందించే మనుషులను చూపుతారు.

పర్యావరణాన్ని నాశనం చేసుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుందో చూపుతారు "మార్నింగ్ వాక్" కథలో. ఇది రేపటి కథ. విదేశాల నుండి హైదరాబాద్కు వచ్చిన మనవడు తాత, బామ్మలతో 'మార్నింగ్ వాక్' చేస్తుంటాడు. నాటి రోజుల్ని తలచుకుంటూ ట్యాంక్ బండు మీద కూర్చుని నీళ్ళల్లోకి చూస్తూ మాట్లాడుకునే వారి మాటలకు మనవడు ట్యాంక్ బండు ఎక్కడ అంటాడు కనిపిస్తున్న ప్లే గ్రౌండ్ను చూస్తూ.

దాన్ని మేమే పూడ్చేసాములే. వినాయక విగ్రహాలు వేసి వేసి హుస్సేన్ సాగర్ను పూడ్చేసి వినాయక సాగర్ చేశామని వ్యంగ్యంగా మాట్లాడినా నేడు సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో జరిగేది అదేనని సుతారంగా హెచ్చరిస్తారు ఈ కథలో. అంతే కాదు మనవడు వాకింగ్ గ్రౌండ్స్లో సిటీ అపార్ట్మెంట్స్ కడితే హాట్ కేక్స్లా అమ్ముడైపోతాయి అంటూ తన ఐడియా కూడా చెబుతాడు. నేడు మనిషి వ్యాపార ధోరణి కొంతైన వదిలి పర్యావరణం, కుటుంబం, సామాజిక

భద్రత, బాధ్యతల గురించి ఆలోచిస్తే రేపటి తరంలో పర్యావరణ పరంగా, పిల్లల పరంగా మంచి చేసిన వారమవుతామని చిన్న హెచ్చరిక చేస్తారు.

"లేతగడ్డి" కథలో పెద్ద తలకాయను చూసి చిన్న తలకాయ గడ్డి కరవడం మొదలు పెడుతుంది. అంటే మనిషి ఎప్పుడు దేన్నో అనుకరిస్తూనే ఉన్నాడన్న సామాజిక వాస్తవాన్ని తెలిపారు.

ప్రస్తుత పరిస్థితులలో పరిశోధకుల నుండి పరీక్షలు రాసే విద్యార్థుల దాక కాపీలు కొట్టడం మాములైపోయింది. విద్యా విధానం కుళ్ళిపోతూ, వస్తున్న మార్పులను వివరించే కథ "కిస్సాకాపీకా".

సంక్షోభం నుంచి సంక్షోభానికి సాగుతున్న రష్యా ప్రస్థానంలో అక్కడి ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యం లోంచి రాసిన కథ "తోసెయ్ తోసెయ్".

"దేవుడి పేరు మీద ఒకరినొకరు పొడుచుకోవడం కొనసాగింది. శివాలయం కూలి మసీదయ్యింది. మసీదు కూలి రామాలయం అయ్యింది. కరసేవలు, పాదసేవలు, అర్చనలు, భజనలు, ప్రేయర్లు, గుళ్ళో లేని దేవుణ్ణి నిలబెట్టడానికి లక్షన్నర ఉపాయాలు! మనిషి తనను తానే కూలగొట్టుకునే యత్నాలు![5]" అంటూ భారతదేశం తలవంచుకునే విధంగా 1992 డిసెంబర్ 6 నాటి సంఘటన నుండి "సయోధ్య రాముడేడి" అనే కథకు రూపకల్పన చేశారు దేవరాజు మహారాజు. ఇలా సమకాలీన సమస్యలకు స్పందించిన తీరు, మనిషి కథలలో స్పష్టంగా కనిపిస్తుంది.

### 2.2.5. డాక్యుమెంటరీ స్టోరీస్ (1993):

'డాక్యుమెంటరీ స్టోరీస్' అనే ప్రయోగంలో ఎనిమిది కథలు ఉన్నాయి.

"కనిపించిన వాటిని కనిపించినట్టుగా, వినిపించిన వాటిని వినిపించినట్టుగా, స్ఫురించిన వాటిని స్ఫురించినట్టుగా రికార్డు చేయడమే డాక్యుమెంటరీ కథా లక్షణం ఏమో అనిపిస్తుంది. ఇవి కొన్ని చోట్ల వాస్తవానికి కవితల్లాగా, మరికొన్ని చోట్ల స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్నెస్ రచనలా కూడా కనిపిస్తాయి"[6].

డాక్యుమెంటరీ కథల్లో నిజానికి కథ ఉండదు. వాస్తవ దృశ్యాలు, సాక్ష్యాలు చూపించే మిషతో కథ నడుస్తుంది. జీవిత పోరాటం, కూడలి (సామాజిక కాలుష్యం), విముక్తి (సామాజిక విచికిత్స), జెండా వందనం (సెటైర్), ప్రకృతి వంటి మొదలైన కథలు ఇందులో కలవు.

---

[5] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–185.

[6] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–154.

డాక్యుమెంటరీ స్టోరీస్లో మేథోపరమైన కథలు అబ్స్ట్రాక్టుగా,అది వాస్తవిక ధోరణిలో కొనసాగుతాయి. ఈ కథలు పాత్రల కన్నా పరిసరాలు, వాతావరణం (బహుశా అందుకు డాక్యుమెంటరీ స్టోరీస్ అని పేరు పెట్టి ఉంటారు)ప్రాణంగా కొనసాగుతాయి. కొన్ని కథలు ఉత్తమ పురుషలో కొనసాగుతాయి. డోలు కథ మంచి సెటైర్. విముక్తి కథలో సామాజిక పరిణామం సంఘర్షణ అదివాస్తవిక పద్ధతిలో చిత్రిస్తారు. కథలన్నీ సెటైరికల్గానే ఉంటాయి. డాక్యుమెంటరీ కథల్లో అన్నిటి కంటే 'ప్రకృతి' అనే కథా ఇతివృత్తం, కథనం, శైలి దృష్ట్యా భిన్నమైంది. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఈ కథ నొక్కి చెబుతుంది. నాటకీయమైన పద్ధతిలో కొనసాగే ఈ కథ ప్రకృతికి మనిషి చేసే హానిపై వ్యంగ్యాత్మకమైన చిత్రణ కలది.

ప్రకృతిని రోజు రోజుకు ఏదో ప్రయోగం పేరిట మనిషి విధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతిని జయించాలనే తపనతో తన సమాధికి తానే గొయ్యి తవ్వుకుంటున్నాడు. "మానవ జీవితాలు భయానకం చేసుకుంటున్నది. ప్రకృతిని చిత్రహింసలు పెట్టి బీభత్సం చేస్తున్నది, భూమి చుట్టు ఉన్న స్ట్రాటో ఆవరణంలోని ఓజోన్ పొరను కావల్సిన చోట తగ్గించి, శత్రుదేశాల వాతావరణంలో హానికరమైన మార్పులు చేయడానికి కూడా వెనకాడనిదీ ఆధునిక మానవుడే![7]" అంటూ ప్రకృతి విలువల్ని వైజ్ఞానికంగా ఆలోచింపజేసే విధంగా 'ప్రకృతి' కథ ఉంది.

డాక్యుమెంటరీ కథకు అసలు సిసలైన నిర్వచనంలా కథ మొత్తం ఒకే కోవలో చిత్రించబడిన దృశ్య కావ్యంలాగా "విముక్తి" కథ రచించబడింది. "పాదాలు, రకరకాల పాదాలు ముందు నడిచిన పాదాలను అనుసరించి నడుస్తాయి. పాదాలు – మనుషులకు ప్రతీకలు. స్వేచ్ఛ కోసం, విముక్తి కోసం తపించే వాళ్ళు ముందు నడవగా, తమ బ్రతుకుల బాగు కోసం ఆ పాదాల అడుగుజాడల్లో ఆ బాటలోకి క్రమంగా వచ్చి చేరే వాళ్ళూ వందలు, వేలు, లక్షల మంది. కందరాలు నలిగిన వాళ్ళూ, అడుగు తీసి అడుగేయలేని వాళ్ళూ, రక్త నాళాలు పైకి తేలిన వాళ్ళూ, అరిగిన మట్టెలున్న వాళ్ళూ, యువ రక్తం పారుతున్న వాళ్ళూ, కాళ్ళకు చెప్పుల్లేని వాళ్ళూ, అరిగిన చెప్పులున్న వాళ్ళూ, కాయలు గాచిన పాదాల వాళ్ళూ, సుకుమారమైన పాదాలు గలవారు, పొలాల్లో తిరిగే పాదాల వాళ్ళూ, బురదలో పనిచేసే మట్టి పాదాల వాళ్ళూ, నాగరికత నేర్చిన వాళ్ళూ, పట్టా గొలుసులు, కడియాలతో బరువెక్కిన పాదాలు గల స్త్రీలు, పురుషులు, యువకులు, విద్యార్థులు, కర్షకులు, కార్మికులు, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు సమస్త జనులు" విముక్తి మార్గంలో నడిచే దృశ్యాన్ని అద్భుతంగా చిత్రీకరించారు.

---

7 దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–183.

సమాజంలో అట్టడుగు జాతులు అణచివేతకు గురికావడానికి, పురోగతి లేక అడుగడుగునా అవరోధాలు ఎదుర్కొంటూ వెనుకబడి ఉండడానికి గల కారణాలను, సామాజిక కోణాల నుంచి తర్కించి, శోధించి రాసిన కథ "విముక్తి". రచ్చబండ ఒక వ్యవస్థకు సంకేతం. ఊరి నడిబొడ్డు స్వేచ్ఛ కోసం ముందుకు పడుతున్న కొద్దీ అడుగులు క్రమంగా బలం పుంజుకున్నాయి. రోడ్డు వేయబడుతుంది. ఆ రోడ్డు అక్కడి నుండి ఊరి నడిబొడ్డు దాకా వేయబడుతోంది. గానుగ నుండి, బానిసత్వం నుండి జనం బయట పడటానికోసం, అందరి కోసం కొందరి చేత వేయబడుతుంది అంటూ స్వేచ్ఛ లేక బానిసత్వంలో మగ్గిపోతూ చక్రంలా తిరుగుతున్న వారి జీవిత క్రమాన్ని నిజాయితీగా ఆవిష్కరించారు.

యూనివర్శిటీ చదువులు బతుకు పోరాటంలో ఏ మాత్రం ఉపయోగపడలేక కేవలం డిగ్రీ పట్టా కాగితాలుగా మిగిలిపోతున్న స్థితికి నిరసనగా "కూడలి" కథ వర్ణింపబడింది. యూనివర్శిటీ లెక్చరర్గా పనికి రాని పాఠాలు చెప్పడం కంటే యువతకు అవసరమైన చదువు చెప్పాలని ప్రొఫెసర్ ఆలోచిస్తాడు. తాను అందరు ప్రొఫెసర్లలాగా కులాల, మతాల పిచ్చితో రాసిన సిద్ధాంత గ్రంథాల్ని అట్టే పెట్టే మకిలి రాజకీయాలు తనకు వద్దని భావిస్తాడు. యువ జనాన్ని చైతన్యవంతులుగా చేసేవాడినవ్వాలి. వారికి దారి చూపించే వాడిలాగా కావాలి. కూడలిలో ఎలక్ట్రిక్ సిగ్నల్ స్తంభాలుగా పక్షపాతం లేకుండా ఉండాలి. అందుకోసం ఈ యూనివర్శిటీ సిలబస్లు చదవడం అనవసరమని జీవిత సమరం కోసం సన్నద్ధమవుతాడు.

### 2.2.6. అపూర్వ జానపద కథలు (2011):

దేవరాజు మహారాజుచే అనుసృజింపబడిన జానపద కథాప్రతిబాలు 'అపూర్వ జానపద కథలు'. విలువలు నశించిపోతూ, నిజాయితీ కృశించిపోతూ డబ్బుకు, సంపదకూ తప్ప, మానవీయ విలువలకు చోటు లేకుండాపోతున్న నేటి సమాజానికి ఈ కథాసంపుటి ఒక దిక్సూచి కాకలదు. ఈ తరం బాలబాలికలకు, యువకులకు సరైన దిశానిర్దేశం చేయగలవన్న ప్రగాఢ విశ్వాసంతో 'ఎమెస్కో' వీటిని వెలువరించింది. ఇందులో మొత్తం 30 కథలున్నాయి. కొన్ని కథల్లోని ఇతివృత్తాన్ని సంగ్రహంగా పరిచయం చేయబడును.

ఇందులోని మొదటి కథ 'వీరాధివీరుడు'. పిరికివాడైన ఒక చాకలి ప్రజలందరిచేత, రాజు చేత ప్రశంసింపబడటం ఇందులోని కథ. తాగిన మైకంలో ఉన్న చాకలి తన గాడిద అనుకొని ఒక పెద్దపులిని తన ఇంటి ముందు కట్టివేయడం ఈ కథలో చూడవచ్చు. అది చూసిన రాజు తన ఆస్థానంలో సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తాడు. అనుచరుల కోరిక మేరకు సైన్యాధ్యక్షుణ్ణి చేస్తాడు.

పొరుగు దేశపు రాజు యుద్ధం ప్రకటిస్తాడు. యుద్ధ వ్యూహం తెలియని ఆ సైన్యాధ్యక్షుడు శత్రుసైన్యాన్ని అంచనా వేయడానికి గుర్రంపై వెళ్ళటం, భయంతో ఒక చెట్టుకొమ్మను గట్టిగా పట్టుకోవడం, అది వేరులతో సహా ఊడిరావడం, దానిని చూసి శత్రువులు భయపడి పారిపోవడం మొదలైన సన్నివేశాలు నవ్వు తెప్పించును. మొత్తానికి – అర్హతకు మించి గౌరవాలు పొందే ప్రబుద్ధులు ఆ కాలంలోనే కాదు, ఈ కాలంలో కూడా ఉన్నారని వ్యంగ్య సుందరంగా, హాస్యభరితంగా తెలియజేశారు రచయిత ఈ కథ ద్వారా.

రెండవ కథ 'నీతి తప్పని నిజాయితీ'. ఒక నిరుపేద బ్రాహ్మణుడు ఒక చైనా వర్తకుడికి ఒకరోజు భోజనం పెడతాడు. తర్వాత ఆ వర్తకుడు తన దగ్గరున్న నాలుగు జాడీలను సంరక్షింపుమని వేడుకొని వాటిని బ్రాహ్మణుడికి అప్పచెప్పి వెళ్ళిపోతాడు. పరిస్థితుల ప్రభావం వల్ల వాటిని తెరచి చూస్తాడు బ్రాహ్మణుడు. అందులోని బంగారు నాణాలతో వ్యాపారం చేసి మిక్కిలి ధనవంతుడు అవుతాడు. తిరిగి వచ్చిన వర్తకుడికి తానిచ్చిన జాడీలతోపాటు వడ్డీ కింద మరో రెండు నాణాలు నింపిన జాడీలను ఇస్తాడు బ్రాహ్మణుడు. వర్తకుడు బ్రాహ్మణుడి నిజాయితీకి మెచ్చి మూడు జాడీలతో తిరుగుముఖం పట్టడం ఈ కథలోని కొసమెరుపు.

అన్ని విషయాల్లో అందరూ గొప్పవాళ్లు కాలేరు. ప్రతివాడిలోనూ ఏదో ఒక ప్రత్యేకత, ఏదో ఒక గొప్పతనం తప్పక ఉంటుంది. దాన్ని గుర్తించడమే అసలైన తెలివి. ఇందుకు మంచి ఉదాహరణ 'వినోదాల వీరయ్య' కథ. ఒక సాధారణ ముదుసలి రైతు వీరయ్య. అతని కంటే తెలివిగలవాడిననిపించుకోవాలనుకుంటాడు ఒక రాజు. ఆ రాజు వినోదాలు వీరయ్యను ముఖాముఖీ కలుసుకుంటాడు. అతనితో పోటీకి తలపడతాడు. వీరయ్య తన 'తమాషాల సంచీ' తెచ్చుకుంటానని రాజుగారి గుర్రమెక్కి ఇంటికెళతాడు. 'తమాషాల సంచీ' పేరుతో వినోదాల వీరయ్య తన గుర్రం తీసుకుపోయాడని రాజుకు ఆలస్యంగా అర్థమవుతుంది.

తమ కళల్ని వ్యాపారంగా మార్చుకునేవారు డబ్బు సంపాదించుకుంటారేమో గానీ, విలువ కోల్పోయి పరాభవాల పాలవుతారని తెలియచేసే కథ 'తగిన సన్మానం'. ప్రఖ్యాత నాట్యగత్తె తారామణికి గణపతి దేవ మహారాజు ఆస్థానంలో ఇటువంటి పరాభవమే ఎదురవుతుంది. ఈ కథలో మహామంత్రి చతురత కొనియాడతగినది. ప్రజల నుండి శిస్తుల రూపేణ వసూలు చేసిన ధనాన్ని దుర్వినియోగపరచరాదని ఈ కథ మనకు బోధించే నీతి. అహంభావం పనికిరాదనేది మరో నీతి.

ఒక మూర్ఖ శిఖామణి. అతనికి పన్నెండు మంది శిష్యులు. అందరూ కలిసి తీర్థయాత్రలకు బయలుదేరారు. పరమానంద శిష్యుల గురించి మనం విన్నాం. మూర్ఖులైన శిష్యులతో ఆ గురువుగారు ఎన్ని అగచాట్ల పాలయ్యారో మనకు తెలుసు. దారిలో ఏరు దాటాల్సి వస్తుంది. ఏరు నిద్రపోయేటప్పుడు దాటాలనుకుంటారు. ఈ విధంగా హాస్యభరితంగా సాగుతుంది ఈ కథ.

ముగ్గురు ముస్లిం సోదరుల దగ్గర పనిచేసే బంట్రోతు తెలివితేటలను గురించి తెలియచేసే కథ 'ఇంగితం'. ఈ కథ కూడా హాస్యభరితమైనదే. సోదరుల తెలివితక్కువతనాన్ని ఉపయోగించుకొని, బంట్రోతు ఎప్పటికప్పుడు తన పొట్టపూజ కానిస్తూ ఉండేవాడు. ఇలా ఈ కథ తిండి చుట్టూరా సాగుతుంది.

ఒక ఊళ్ళోగల ధనికుడు, ఒక పేదవాని వ్యక్తిత్వాలకు సంబంధించిన కథ 'వేలేడంత మనిషి'. మహతోజి ధనికుడు. భర్బిట్నా పేదవాడు. భర్బిట్నా చిటికెన వేలంత మనిషి. మంచివారికెప్పుడూ మంచే జరుగుతుంది. చెడ్డవారికెప్పుడూ చెడే కలుగుతుంది అనడానికి ఈ కథ నిదర్శనం. ధనికుడైన మహతోజి వేలెడంత మనిషి గేదెను చంపుతాడు, అతని ఇంటిని తగులబెడతాడు. ఐనా కూడా వేలెడంతమనిషి ధనవంతుడవడం ఈ కథలో చూడవచ్చు. అదే విధంగా ధనవంతుడు బీదవాడవుతాడు తనకున్న అత్యాశతో చివరలో తనకు తాను మరణాన్ని కొనితెచ్చుకుంటాడు.

ఇతరులకు సహాయం చేయడం వల్ల మనకు కావాల్సింది దక్కుతుంది చెప్పడానికి 'డోలు ఎట్లా దొరికిందంటే...' అనే మంచి ఉదాహరణ. ఒక పిల్లవాడికి డోలు అంటే చాలా ఇష్టం. అతని తల్లి చాలా పేదరాలు. డోలు కొనివ్వలేని పేదరికం ఆమెది. దారిలో ఒక చెక్కముక్క కనబడితే ఆడుకొమ్మని కొడుకుకు ఇస్తుంది. ఆ చెక్క ముక్కను ఒక ముసలవ్వకిస్తాడు. ఆమె రొట్టెలు ఇస్తుంది. రొట్టె ముక్కలు ఒక చంటి పిల్లాడికిస్తాడు. అందుకు ప్రతిఫలంగా ఆమె ఒక కుండనిస్తుంది. ఈ విధంగా కుండకు బదులుగా కోటు, కోటుకు బదులుగా గుర్రం, గుర్రానికి బదులుగా డోలు అతనికి వస్తాయి.

రాజు, మంత్రి మూర్ఖులైతే ఆ రాజ్యంలోని ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో 'పిచ్చిమాలోకం' అనే కథ తెలియచేస్తుంది. గురువు మాట వినని శిష్యునికి ఎటువంటి కష్టాలు వస్తాయో ఈ కథలో చూడవచ్చు. ఆ రాజ్యంలోని ప్రజలు పగలు నిద్రపోతారు, రాత్రులు మేల్కొంటారు వంటి సన్నివేశాలు మనకు నవ్వు తెప్పించును.

మరో హాస్య కథ 'అతి సున్నిత హృదయుడు'. చావు కబురు చల్లగా చెప్పడమంటే ఎలాగుంటుందో ఈ కథలో చూడవచ్చు. ఒక ఊళ్ళోని జమీందారు సున్నిత హృదయుడు. అతనికి ఒక వార్తాహరుడు ఊళ్ళోని విషయాలను చాలా సున్నితంగా చేరవేస్తాడు. ఒకసారి ఆ వార్తాహరుడు 'నల్లకుక్క మరణంతో మొదలుపెట్టి జమీందారిణి మరణం దాకా' సంభాషణను కొనసాగించడం ఈ కథలోని ప్రత్యేకత.

బీర్బల్, తెనాలి రామకృష్ణుని వలె బెంగాలీ జానపద సాహిత్యంలో గోపాల్ధర్ ప్రముఖంగా కనిపిస్తూ ఉంటాడు. అటువంటి గోపాల్ధర్ తెలివితేటలు మహత్యాన్ని తెలియచేసే కథ 'గోపాల్ధర్ గొప్పతనం'. ఒకసారి ఢిల్లీ నవాబుగారికి భూమి పొడవు, వెడల్పులు, ఆకాశంలోని నక్షత్రాల సంఖ్య తెలుసుకోవాలనిపించింది. అందుకోసం ఎంత ధనమైనా వెచ్చించాలనుకుంటాడు. తన సామంతరాజు కృష్ణచంద్ర మహారాజును ఆదేశించాడు. కృష్ణచంద్ర మహారాజు ఆస్థాన విదూషకుడు తెలివిగా నవాబునుండి డబ్బు రాబట్టుకొని, తన కృష్ణచంద్ర మహారాజు పరువును నిలబెట్టడం ఇందులోని కథ.

'విధాతనే గుటుక్కుమన్నవాడు' మరొక విచిత్రమైన కథ. అర్థాకలితో అలమటించే ఒక పేద బ్రాహ్మణుడు తెలివిగా కప్ప రూపంలో వచ్చిన బ్రహ్మను మింగడం ఇందులోని కథ.

'బతికి చచ్చిన చావు' మరొక తమాషా కథ. తాను కూర్చున్న కొమ్మనే నరికేటంతటి అమాయకపు గొర్రెల కాపరి కథ ఇది. అతడు ఒకసారి చనిపోయాడనుకుంటాడు. ఊరి జనం అతన్ని పూడ్చి పెడతారు. బొందలోంచి బయటికి వస్తాడు. తను చనిపోలేదని ఎంత చెప్పినా జనం నమ్మరు. పైగా దెయ్యమని భయపడుతారు. దెయ్యాల పట్ల మనుషులకుండే భయాన్ని హాస్యభరితంగా తెలియచేస్తుంది ఈ కథ.

ఒక పేద రైతు, షావుకారుల సంభాషణల సమాహారం 'అబద్ధాల పోటీ' కథ. తమ తమ పూర్వీకుల గురించి వారిద్దరూ గొప్పలు చెప్పుకోవడం ఇందులోని కథ. అయితే అవన్నీ అబద్ధాలు కావడం విశేషం. తాను చెప్పిన అబద్ధాన్ని ఎదుటి వ్యక్తి ఖండిస్తే ఎదుటి వ్యక్తి వెయ్యి రూపాయలు వదులుకోవాలి. రైతు గెలవడం ఈ కథలోని కొసమెరుపు.

ఇలా చెప్పుకుంటూపోతే ఈ కథాసంపుటిలోని కథలలోని విశేషాలెన్నో. అన్ని కథల్లోనూ ఏదో ఒక నీతి బోధించబడింది. కొన్ని కథలు హాస్యభరితాలు, మరికొన్ని అద్భుతమయాలు, ఇంకొన్ని ఉత్సాహమయాలు. మొత్తానికి ఆలోచనామృతాలు. మూర్ఖులు, అమాయకులు, వీరులు,

అహంకారులు, పేదవారు, ధనికులు, మిక్కిలి తెలివైనవారు, నిజాయితీపరులు మొదలైన పాత్రలెన్నో ఈ కథలలో కనిపించును.

### 2.2.7. భారతీయ కథా ప్రతిబింబం (2014):

"భారతదేశంలో రచనా వ్యాసంగం సుమారు మూడు వేల ఐదు వందల సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. ఈనాడు వివిధ భాషలలో ఎడతెరిపి లేకుండా ఇరవై ప్రధాన భాషలలో రచనలు సాగుతున్నాయంటే, ఆయా భాష సాహిత్య సంస్కృతులు వెల్లివిరుస్తున్నాయంటే కారణం ఇక్కడి భాషలు వేరైనా, అంతస్సూత్రం ఒకటే"[8].

దేశంలో రాజకీయ చైతన్యం పెరిగింది. కేవలం ఆర్థిక కారణాలే కాక జీవితాలపై రాజకీయాలు కూడా ప్రభావం చూపుతున్నాయని స్పష్టమైంది. సాహిత్యంలో ఈ రెండిటి ప్రాధాన్యం పెరిగింది. క్రమక్రమంగా భారతీయ రచయితలపై పాశ్చాత్య రచయితల ప్రభావం తగ్గిపోయింది. పాశ్చాత్య రచయితలలో చెప్పుకోదగ్గ సమకాలీనులు లేకపోవడం ఒక కారణం అయితే, మన ఆధునిక భారతీయ భాషా సాహిత్యాలన్నీ పరిణతి చెందడం మరో కారణం కావచ్చు. సాహిత్య రంగంలో ప్రజాస్వామ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

భారతీయ రచయితలు తమ తమ అవగాహనను బట్టి, ఆలోచనా ధోరణిని బట్టి, సామాజిక ఆవశ్యకతను బట్టి రచనలు చేస్తున్నారు. సంప్రదాయ రీతిలో, మతాల నీడలో, ఆధునిక రీతిలో, అత్యాధునిక రీతిలో, ప్రగతివాదంలో, విప్లవ చైతన్యంలో ఒక్కోసారి మళ్ళీ అనుభూతుల్ని తిరగతోడుకుని భారతీయ భాషలన్నింటా రచనలు పుంఖానుపుంఖంగా వెలువడుతూనే ఉన్నాయి.

భారతీయ కథా సాహిత్యంలో దేవరాజు మహారాజు కొన్ని కథల్ని ఈ సంపుటిలో అందించారు. వాటిలో కొన్ని:

1) రవీంద్రనాథ్ ఠాగూర్ (బెంగాలీ) – వినూత్న సృష్టి
2) R.K. నారాయణ్ (ఇంగ్లీష్) – తుపాను రాత్రి
3) ముల్క్రాజ్ ఆనంద్ (ఇంగ్లీష్) – భయం! భయం!!
4) ప్రేమ్చంద్ (హిందీ) – మరీచిక మొదలైనవి.

పై వాటిలో మచ్చుకు ఒక కథ → భయం! భయం!! మిగతా వాటిని గురించి మరో అధ్యాయంలో చర్చిస్తాను.

---

8 దేవరాజు మహారాజు, భారతీయ కథా ప్రతిబింబం, పుట–03.

**భయం! భయం!! – ముల్క్‌రాజ్ ఆనంద్**:

మట్టిలో పొర్లుతూ, కాళ్ళు చేతులు కొట్టుకుంటూ, తల్లిదండ్రుల మీద నిరసన ప్రకటిస్తుందు చంద్రు. గుడిసె బయట గుమ్మంలో పడ్డప్పుడు పెదాల చివర్లో చొల్లు మట్టితో కలిసి, బురద బురదగా అయ్యింది. చెంపలు వాచాయి. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బాయి. చిట్టిలాగు చెమటలో తడిసిపోయి ఉంది. వెక్కిళ్లూ, గునుపూ సాగుతూనే ఉన్నాయి. ఎవరి అడుగుల చప్పుడైనా వినబడితే, చంద్రు ఏడుపును పొడిగించి పెద్దగా చేస్తున్నాడు. తనను గుర్తించి, తన కోరికలు తీర్చడం లేదని వాడి బాధ! తండ్రి తనను గారాబం చేయడం లేదని దిగులు! తండ్రి అంటేనే భయం – భయానికి మరో రూపమే తండ్రి!

నాన్న చిట్టి తండ్రి! రామ్మా! అన్నం తిందువు గాని రారా! బంగారు తండ్రివి కదూ! వాడి తల్లి కుంతి అప్పటికి అయిదారు సార్లు బుజ్జగించింది. ఇప్పుడు మళ్ళీ మరోసారి వచ్చింది. "నీ కిష్టమని పప్పు చేశారా. ఉల్లిపాయలు ఎక్కువేసి నూనెలో బాగా వేయించి నీకోసం చక్కగా చేశానురా నాన్నా!"

చంద్రు మొరాయిస్తున్నట్లుగా తల అడ్డంగా తిప్పాడు. "ఎప్పుడు పప్పే. నాకేమీ వద్దు పో. రోజు పప్పు – పప్పే. పప్పు తప్ప ఇంకేమీ వండవ్. అది ఆ పెంట దిబ్బమీద పడెయ్. నాకేం వద్దు".

ఆ సమయానికే తండ్రి దయారాం అటు నుంచి వెళ్ళాడు. కొడుకు మారం చేయడం కళ్ళారా చూశాడు. తల్లి ఎంత బతిమిలాడుతున్నా మంకుపట్టు వదలకుండా వాడు మొండికేయడం అతను భరించలేక పోయాడు.

"ఏయ్ లేచి సరిగా కూచో! నోరు మూసుకుని అన్నం తిను. వేళకింత పప్పు, అన్నం దొరకడమంటే సామాన్యం అనుకుంటున్నావా? కుర్రకుంకకు వెధవ రుచులు కావాల్సి వచ్చినయ్. నా సంగతి తెలియదు నీకు. ఎక్కడి కక్కడ తాట ఒలిచేస్తా!"[9] హుంకరించాడు తండ్రి.

తల్లి ఓదార్చి అనునయంగా సర్ది చెప్పడం, చెప్పినట్లు వినకపోతే, ప్రాణాలు తీస్తానని తండ్రి భయంకరంగా గర్జించడం...

పగటికి ఈ నాటకం మళ్ళీ ఇలాగే సాగింది. ఏడ్చి ఏడ్చి చంద్రు మూలకు ఒరిగాడు. సాయంత్రానికి వాడి కడుపులో ఎలుకలు పరిగెత్తసాగాయి. భయపెట్టిన తండ్రిని లోలోన శతవిధాల తిట్టుకున్నాడు. ఎలుగుబంటీ, ఎద్దు, దున్నపోతు వంటి జంతువులతో పోల్చాడు. అదిసరే,

9 దేవరాజు మహారాజు, భారతీయ కథా ప్రతిబింబం, పుట – 62.

ఈ అమ్మకే మొచ్చిందీ? అడిగింది వండిపెట్టి, అన్నం తినిపించొద్దూ?' — అని బాధపడ్డాడు. చంద్రుకు దుఃఖం ఆగింది కాదు. కాని ఎంతసేపని ఏడవడం? దినమంతా ఏడుపే!

గోధూళి వేళ పశువులు అడవి నుంచి ఊళ్ళోకి వస్తున్న చప్పుడును, చంద్రు ఎలుగుబంట్లు నడిచి వస్తున్న చప్పుడులా భావించాడు. బయటికి వెళ్ళాలంటే భయం. ఇతరులతో మాట్లాడాలంటే భయం. భయం వల్ల భయం. అంతా భయం భయం! భయం అణువణువున నిండింది గనుక, తండ్రి బెత్తాన్ని చూసిన మౌనం. వికృతమైన అరుపులు విన్న మౌనం. భయంలోంచి పుట్టిన మౌనం. నరాలు మండిపోయి కాలినట్టి మౌనం. మనసులో ప్రతీకారజ్వాల లేచి పడినప్పటి మౌనం. వాడి కళ్ళలో ఎప్పుడో గుళ్ళో చూసిన మాత విగ్రహం కదిలింది. 'మాతా అన్నం పెట్టు' అని మనసులోనే దేవతను ప్రార్థించుకున్నాడు. తల్లి లేపడానికి వచ్చినా లేవలేదు. ఆమె ఏడుస్తూ వెళ్ళిపోయినా పట్టించుకోలేదు. వాడికి తండ్రి రూపం భయ స్వరూపంగా తిరుగుతుంది. రౌద్ర స్వరూపం. భయంకరమైన అరుపు. బలంగా మీదికొస్తున్న బెత్తం...

తల్లి పిలవగా పిలవగా ఎప్పుడో లేచి మొహం కడుక్కుంటున్న చంద్రుకు తండ్రి అలికిడి వినిపించింది. మౌనంతో వణికిపోతున్న చంద్రులో ఏదో తెగింపు కట్టలు తెంచుకుంది. సముద్రాలు ఘోషించినట్టు దుఃఖం పొంగి పొర్లింది. అగ్ని ఎగిసిపడినట్టు కసి, పగ లేచిపడింది. అడవి మేక పులి మీదికి రోషంతో లంఘించినట్టు చంద్రు తండ్రి మీదికి లంఘించాడు. తండ్రి ముఖంలోకి గోళ్ళు గుచ్చాడు. ఛాతీ మీద దబదబా గుద్దాడు. భయాన్ని జయించాడు. వాటిలోంచి మౌనం పారిపోయింది. ఏడుపు గొంతుతో పెద్దగా అరిచాడు. విజయం సాధించినట్టు ఆనందంతో భోరుమన్నాడు.

"అబ్బా! అబ్బా! ఛీ ఛీ, దయ్యం పోరదు!" అంటూ ఊహించినది జరిగినందుకు తండ్రి బెదిరిపోయాడు.

పక్కింటి వాళ్ళంతా గుమిగూడారు. చంద్రును లాగి గుంజుకుపోయారు. గాలిని తంతున్నట్టు — భూతాల్ని శపిస్తున్నట్టు వాడు నానా రభసా చేశాడు. వాళ్ళు వాణ్ణి తీసుకుపోయి వాళ్లమ్మ కాళ్ళమీద పడేసి వెళ్ళిపోయారు. ఆమె విషయం తెలుసుకుంది. దగ్గరకు తీసుకుంది. పసిగుడ్డును లాలించినట్టు ఒళ్ళో పడుకోబెట్టుకుంది. గుండెలకు హత్తుకుని ఒళ్ళంత నిమిరింది. ముద్దులు పెట్టింది. భయం నెమ్మదిగా కుదురుకుంది. కొంతసేపటికి ఏడ్పులోనే గాఢంగా నిద్రపోయాడు చంద్రు.

విశ్వకథా సాహితీ, భారతీయ భాషలలో స్త్రీవాద కథల గురించి మరొక అధ్యాయంలో చర్చిస్తాను.

## 2.3. నవల:

### 2.3.1. మంచి ముత్యం (2008):

సాగర గర్భంలో మంచి ముత్యాలు, పగడాలు వంటి విలువైన వాటితో పాటు భయంకర జలచరాలు, సాధారణ జీవులు ఉంటాయి. తమ ప్రాణాలను కాపాడుకుంటూ అవి సముద్రంలో జీవిస్తున్నట్లే సమాజంలో సాటి మనిషిని దోచుకుని విలాసంగా గడిపే దోపిడి వ్యక్తుల నుండి తమను తాము రక్షించుకుంటూ తమ ఉనికిని సగటు మనుషులు కాపాడుకుంటూనే ఉన్నారు. అందమైన మాటల మాటున వికృతమైన మనసు గల సమాజంలోని వ్యక్తుల పోకడను కళ్ళకు కట్టినట్లుగా “మంచి ముత్యం” నవలలో వివరించిన తీరు ఆమోఘం అని చెప్పవచ్చు.

## 2.4. నాటకాలు:

### 2.4.1. మూఢనమ్మకాల్ని వదిలిద్దాం (నాటిక సంపుటి) (2006):

ఈనాడు మనలో అనేక మందికి మూఢవిశ్వాసాలు విపరీతంగా పాతుకుపోయాయి. అభివృద్ధి ఆకాశాన్నంటుతున్న దశలో కూడా మన చేతకానితనాన్ని, బలహీనతల్ని సమర్థించుకోడానికి మూఢనమ్మకాలను నమ్ముకోవడం అత్యంత విచారకరం. అయితే వాటిని అడ్డుపెట్టుకొని ఇతరులను మోసం చేస్తూ, మనల్ని మనమే ఆత్మవంచన చేసుకోవడం అసమంజసం.

చదువు, విజ్ఞానం, ఆధునికత, శాస్త్రీయ అభివృద్ధి వంటి మాటలేవి ఈతరం విశ్వాసాలకు అడ్డు తగలడం లేదు. లేకపోతే ఆధునికత, సాంకేతికతకు నిదర్శమైన కంప్యూటర్ని కొని కొబ్బరికాయ కొట్టి, బొట్టు పెట్టి ఆన్ చేస్తారు. సమాచార విప్లవాన్ని తెచ్చిన E-mailని SMSలో ఈ సమాచారాన్ని మరో ఇద్దరికి పంపితే ఫలానా దేవుడు మేలు చేస్తాడు. లేకపోతే ఫలానా వారికి నష్టాలు వచ్చినట్టు మీకు వస్తాయి.

పాములు, పూజలు, గత జన్మలు, గుళ్ళలో మహత్యాలు, మంత్రగత్తెలు, బాల భగవాన్లు, పూనకాలు, జాతకాలు, ముహూర్తాలు, జీవ పరిణామం ఇలా నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక అంశాలపై అందరికి అర్థమయ్యేలా వివరించారు.

మూఢ విశ్వాసాల బారిన పడకుండా ఉండటానికి వాటికి వ్యతిరేకంగా వాస్తవాలతో అవగాహన కల్గించడానికి బలమైన వ్యక్తిత్వం అవసరం. ఒక రకమైన దీక్ష అవసరం, బాధ్యత

అవసరం. అటువంటి బాధ్యతను భుజాన వేసుకున్న వారిలో దేవరాజు మహారాజుగారు ఒకరు. మూఢనమ్మకాల గురించి మరో అధ్యాయంలో చర్చిస్తాను.

### 2.4.2. లైఫ్ టానిక్ (2007):

సంస్కృతంలో ప్రాచీన కాలం నుండి నాటక ప్రక్రియ ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. తెలుగులో ఉన్నవి యక్షగానములు, వీధి నాటకములు. ఇవి ఆధునిక నాటకముల వంటివి కావు. ఇంగ్లీషు భాషాభ్యాసం తర్వాతనే నాటికలు, ఏకాంకికలు విరివిగా వచ్చాయి. ముఖ్యంగా రేడియో శ్రవ్య నాటికలు, TVల కోసం సంక్షిప్త దృశ్య నాటికలు వ్రాయడం మొదలయ్యింది.

దేవరాజు మహారాజు రచించిన "లైఫ్టానిక్" ఒక నాటకాల సంపుటి. ఇందులో ఆకాశవాణి ప్రసారాలు ఉన్నాయి. కొద్ది మార్పులతో వేదికపై కూడా ప్రదర్శించబడ్డాయి. ఇందులో మొదటి శ్రవ్య నాటిక పేరు లైఫ్టానిక్. అమృతం ఔషధం ఉందా? మనిషి చిరంజీవి కాగలడా? రామాయణంలో సంజీవని వల్ల జీవన ప్రమాణం పెంచబడిందే కాని శాశ్వతంగా జీవించేటట్లు చేయబడిందా? పుట్టినవారు గిట్టక మానరు – మృత్యువు భిక్షాపాత్రతో వస్తే రిక్తహస్తాలతో పంపించను అనే రవీంద్రుడి సందేశం వంటివి ఈ నాటకంలో ఉదహరించారు. దీని గురించి మరో అధ్యాయంలో విపులంగా చర్చిస్తాను.

## 2.5. వ్యాస రచనలు :

### 2.5.1. ఆధునిక యుగంలో జానపద సాహిత్యం (1987):

పల్లె ప్రజల అనుభవాల్ని, ఆలోచనల్ని, ఆశల్ని, అడియాసల్ని, అనుభూతులను, అనురాగాలను, బాధల గాథలను అచ్చ తెలుగు ప్రజల భాషలో మౌఖికంగా సజీవ రూపకల్పన చేస్తూ వచ్చింది జానపద సాహిత్యం. ఈ కోవకు చెందిన సాహిత్య రంగంలో అభివృద్ధి సాధించి భక్తిరసమయ పదాలు గానం చేసినవారు వాగ్గేయకారులు. వాగ్గేయకారులు మతం చాటున, రాజరికం చాటున, భగవంతుని చాటున గుర్తింపు పొందారు. కాని జానపదులు మాత్రం వృత్తిపరమైన కార్మికులుగా, యాచకులుగా ఎక్కడ సాహిత్య సృష్టి చేశారో అక్కడే బతుకు ఈడుస్తున్నారు.

చతుష్షష్టి కళల ఆధారంగా వివిధ వృత్తులలో జీవిస్తున్నవారు జానపదులు. వారు జన్మించిన పరిసరాలలోని ప్రకృతి, భాష, ఆచారాలు, ఆశలు, అడియాసలు వారు పాటలతో నేర్చుకుంటూ, తమ శ్రమ కాలపు అలుపు సొలుపులను మరుస్తూ హృదయాలను అలరిస్తూ పదం అల్లగలిగారు.

అందుకని పాడగలవారు అందరూ కలగలసి సృష్టించిన మానవ శ్రమ విలువలే జానపద సాహిత్యపు విలువలు.

"జానపద సాహిత్యం అంతరించి పోదని, కొత్త కొత్త (జన) సమూహాలు ఏర్పడుతున్న కొద్ది కొత్త విజ్ఞానం ఏర్పడుతుందని" అలెన్ డండెస్ (Alan Dundes) అన్నారు. "నాగరికత పెరిగి కార్లు, కెమెరాలు, సినిమాలు వచ్చినా మానవుడు నడవడం, చిత్రాలు గీయడం, కథలు చదవడం మాననట్లే, జానపద సాహిత్యం నశించదు" అని పీటి సీగర్ అన్నారు. "జానపద సాహిత్యం గతానికి సంబంధించిన ప్రతిధ్వని అయితే, అది వర్తమానానికి సంబంధించిన పొలికేక" అని రిచర్డ్ యం. డార్సన్ అన్నారు. ఈ ముగ్గురి అభిప్రాయాలను ఏకీభవిస్తూ దేవరాజు మహారాజు "ఆధునిక యుగంలో జానపద సాహిత్యం"ను రచించారు.

"'జానపద గేయాలు – పరిణామం' అనే వ్యాసంలో "ఇప్పుడున్న మానవుడు వెనక్కి దృష్టి సారిస్తే, జీవకోటి పరిణామమంతా కనిపిస్తుంది. ఇప్పటి మానవ జీవిత కథనాన్ని తవ్వుకుంటూ పోతే, గత జీవిత అవశేషాలన్ని బయటపడతాయి. ఇప్పటి సాహిత్యాన్ని వెనక్కి చదివితే ప్రాథమిక సాహిత్యం లేక ప్రాచీన సాహిత్యం తెలుస్తుంది"[10] అని అన్నారు రచయిత.

ఆధునిక యుగంలో జానపద సాహిత్యంలో తెలుగు జానపద సాహిత్యం నశించకుండా ఏ రకంగా పరిణామం చెందుతున్నదో వివరంగా పేర్కొన్నాడు. ప్రజల జీవితంలోని ఉత్పత్తి సంబంధాల్లోని మార్పులు, వారి సాహిత్యంలో ఏ విధంగా చోటు చేసుకున్నది వివరించారు. కొత్త రూపాల్లో జానపద పాటలను ఏ రకంగా ఉపయోగించుకుంటున్నది వివరించారు. సమాజంలోని రెండు వర్గాలు దోపిడి చేస్తున్నవారు, దోపిడికి గురవుతున్నవారు, దోపిడి చేస్తున్న పాలక వర్గాలు ప్రజలను నిర్వీర్య పరచడానికి సినిమాల్లో జానపద బాణీలను, గేయాలను వాడుకుంటున్న తీరును, ఎలక్షన్లలో తమ ప్రభుత్వాలు చేసిన "అభివృద్ధి" కార్యక్రమాలను ప్రచారం చేసుకోవడానికి ఉపయోగిస్తున్న పద్ధతిని వివరించారు.

జానపదుల నిరాడంబరత, సూటిగా చెప్పే పద్ధతి, అమాయకత, ప్రేమ, మమత, ఆచార వ్యవహారాలు ఒక్క మాటలో చెప్పాలంటే వారి సమస్త జీవితం పాటల్లో ఏ విధంగా రూపుదాల్చిందీ విశ్లేషించి రాశారు. స్త్రీలపై పురుషులు చలాయిస్తున్న ఆధిపత్యం, దోపిడి పాటల్లో ఎంత విస్తృతంగా జానపద సాహిత్యంలో చోటు చేసుకున్నది వివరించారు.

[10] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–202.

## 2.5.2. స్మృతి సుగంధం (2008) (సాహితీవేత్తల పరిచయాలు):

తెలుగు సాహిత్యంలోకి అడుగిడి అక్షరాన్ని నమ్ముకొని అహర్నిశలు అక్షర యజ్ఞం కావించిన సాహితీ సోమయాజులెందరో! అలాంటి తెలుగు మహానుభావులలో కొందరిని స్పృశిస్తూ విఖ్యాత సాహితీవేత్త దేవరాజు మహారాజు అపురూపంగా రూపొందించిన పరిమళ నివాళి, స్మృతి సుగంధ పరిచయాల సుగంధ గ్రంథం స్మృతి సుగంధం.

ఒక్కో రచయిత సాహితీ మూర్తిమత్వాన్ని ఆయా వ్యాసాల్లో విశ్లేషణాత్మకంగా తెలిపారు. చాసో, రంధి సోమరాజు, తొలి తెలుగు జానపద సాహిత్య పరిశోధకుడు హరి ఆదిశేషువు, తెలంగాణ ప్రజల భాషలో తొలి నాటకం రాసిన వెల్దుర్తి మాణిక్యరావు, ప్రజా పోరాటాన్ని గేయాలుగా మలిచిన సుద్దాల హనుమంతు, దాశరథి కృష్ణమాచార్య, రంగాచార్య, శార్వరి, డి. రామలింగం, పొట్లపల్లి రామారావు, కాళోజీ, సోదుం జయరాం, మధురాంతకం రాజారాం, మరింగంటి, గూడూరి సీతారాం, కోదాటి నారాయణరావు, శీలా వీర్రాజు మొదలైన మహనీయుల వ్యక్తిత్వాల్ని, సాహిత్యాన్ని స్పష్టంగా సంక్షిప్తంగా తెలియజేశారు దేవరాజు మహారాజు.

'కోటి రత్నాల వీణ' మోగించిన మహాకవి కళాప్రపూర్ణ దాశరథి గారి రజాకార్ల నాటి అనుభవాల్ని, రచనే ప్రాణంగా బతికిన తెలుగు కథానిక సమీక్షకులు డి. రామలింగం గారి వేదనామయ జీవన వాస్తవాలని దేవరాజు మహారాజు నేటి తరానికి తెలియజేశారు.

"పల్లెటూరి పిల్లగాడా... పసులగాసే మొనగాడా" పాట బి. నరసింగరావు 'మా భూమి' సినిమాలోని ఈ పాట ఎంతటి జనాదరణ పొందిందో అందరికి తెలుసు. ఆ పాట రచయిత సుద్దాల హనుమంతుగారి గురించి దేవరాజు మహారాజు సోదాహరణంగా చెప్పారు.

మనిషిలో పుట్టిన దురాశ, ఆ మనిషిని ఎలా పతనం చేస్తుందో చెప్పే "దయ్యాల పన్డగ" తెలంగాణ ప్రజల భాషలో వెలువడిన తొలి నాటకం అని, తొలుత 'మధ్యపాన నిరోధక' మాసపత్రిక నడిపి, తర్వాత గోలకొండ పత్రికకు సహాయ సంపాదకులుగా పనిచేసి, ఆ తర్వాత 'అణాగ్రంథమాల'కు పర్యాయపదంగా మారిన వెల్దుర్తి మాణిక్యరావు రచన ఇదని తెలిసినప్పుడు ఆశ్చర్యానందాలకు లోనవుతాము అని దేవరాజు మహారాజు వెల్దుర్తి గురించి చెప్పారు.

"నీళ్ళు లేవని ఊరేగింపులు చేసినంత సహజంగా అక్షరాలు కావాలని ఉద్యమించాలి" అని నమ్మిన హరి ఆదిశేషువు గారి జీవితాంశాలను స్ఫూర్తిదాయకంగా అందించారు రచయిత. జానపద సాహిత్యంలో తొలి పరిశోధన గ్రంథాన్ని ముద్రించినవారు, మద్రాసు కళాశాలలో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్గా ఉంటూనే, క్లిష్టమైన శాస్త్రీయాంశాలను సరళమైన తెలుగులో

అనువదించినవారు, 1950 ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టిన వయోజన విద్యా పథకం ద్వారా అవిభక్త మద్రాసు రాష్ట్రంలో మారుమూల జనులకు అక్షర భిక్ష పెట్టినవారు, వయోజన విద్య వ్యాప్తికై ఎన్నో పుస్తకాలను, వ్రాసినవారు, సంఘ సేవకులు హరి ఆదిశేషువు గారని, మనం మరిచిపోయిన ఎన్నో చారిత్రకాంశాలను గుర్తు చేశారు రచయిత.

**"గతం గతించిపోదు**
**ఒక జ్ఞాపకంగా స్మృతి పథంలో**
**ప్రతి క్షణం ప్రారంభమౌతుంది"** **(ఆవరణం, పుట – 215)**

అంటూ "జ్ఞాపకం సజీవ చేతనకు ప్రతీక" అని విశ్వసించే దేవరాజు మహారాజు తమ స్మృతి పథంలో సజీవమై ఉన్న జ్ఞాపకాలకు ఇచ్చిన అక్షర రూపం 'స్మృతి సుగంధం'.

"జీవితానికి దగ్గరగా ఉన్న 'చాసో' కథలను అర్థం చేసుకోవాలంటే, ఆనాటి భూస్వామ్య వర్గ విధానాలు, గ్రామీణ ప్రజల సమస్యలు, ఆ రెండింటికి గల ఆర్థిక సంబంధాలను పరిశీలించాలన్నది వీరి నమ్మకం. తన ముందు తరం వారి కన్న ఒకడుగు ముందుకెళ్ళి, జీవితంలోని ఎగుడుదిగుళ్ల వ్యత్యాసాల్ని పట్టుకోవడం వల్లనే 'చాసో' కథలకు, సమాజంతో సామీప్యం కుదిరిందని చెప్తూ, ఆర్థిక అసమానతల నేపథ్యంలో ఛిద్రమైన సమకాలీన వర్గ చరిత్రను 'చాసో' నమోదు చేసిన అంశాల్ని గుర్తుచేశారు"[11].

"గొప్ప విమర్శకుడిగా మాత్రమే అందరూ గుర్తు పెట్టుకున్న రాచమల్లు రామచంద్రారెడ్డి గారి కథ "కావ్యచిత్ర"ను పరిచయం చేస్తూ "తాగడం అపరాధం కాదు, తాగుడికి బానిస కావడం అపరాధం" అన్న కథలోని అంతస్సూత్రాన్ని గుర్తించారు"[12].

"తెల్ల చొక్క, పంచెలో సాదాసీదాగా ఒక స్కూల్ టీచర్లా ఉండే మహా కథకులు మధురాంతకం రాజారాంగారి మరణం తెలిసాక రచయితకు కలిగిన తీవ్ర మనోవేదన, తెలుగు కథకు పెద్ద దిక్కు కరువైందన్న భయం, మంచి మనిషికి మహా రచయితకు నివాళి అర్పిస్తూ "ఇంక అతడిని అతడి కథలలోనే కలుసుకోవాలి ఆయన ఆశయాలను అందులోనే వెతుక్కోవాలి" అంటూ "కథాయాత్రలో మధురాంతకం సాగిపోయేవారే కాని, ఆగిపోయేవారు కాదని చెప్పారు"[13].

---

[11] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట – 216.

[12] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట – 217.

[13] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట – 213.

"సోదుం జయరాం గురించి "ఆయన తన పరిధిలో లేని జీవితాన్ని గురించి రాయరు. ఆయనకు అనుభవంలో లేని విషయాల జోలికి పోరు"[14] అని చెప్పారు.

ఈ 'స్మృతి సుగంధం'లో స్ఫూర్తిని కలిగించే మరొక అంశం, మహీధర నళినీ మోహన్ గారి గురించిన వివరాలు. భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ చేసి దేశ విదేశాలలో జరిగిన పరిశోధనల్లో పాలు పంచుకోవడమే గాక, భారతదేశం ప్రయోగించిన రోదసి యాత్రా సంబంధిత ప్రయోగాల్లో పదహారు సార్లు భాగస్వామి అయిన నళినీ మోహన్ గారు తెలుగులో పాపులర్ సైన్స్ గ్రంథాలు, బాల సాహిత్యం, స్వీయ కవితా సంపుటాలు ప్రచురించారని గుర్తు చేశారు.

"పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంతా దేశానిది" అంటూ అందరి గొడవను 'నా గొడవ' అంటూ మానవ హక్కుల పరిరక్షణకై పోరాడిన కాళోజీ, పాటల్ని ఈటలుగా విసిరిన పోరాట కవి సుద్దాల హనుమంతు, తెలంగాణ జీవ ధాతువు దాశరథి రంగాచార్య, గోదావరి ప్రవాహం మరింగంటి పురుషోత్తమాచార్యులు, తొలితరం రచయిత గూడూరి సీతారం, వెన్నెలవాడ కవితలల్లిన జనపరెడ్డి సత్యనారాయణ, మానవ సంబంధాలు సంక్లిష్టమౌతున్న తరుణంలో ప్రేమ ఒక సజీవమైన భావన అని నమ్మిన శార్వరి, రచనే ప్రాణంగా జీవిత చరిత్రల రచయితగా ప్రఖ్యాతి నార్జించి తన జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకున్న కథా తపస్వి డి. రామలింగం, మార్క్సిజం అంటే పేదరిక సిద్ధాంతం గాదనీ, పేదరికాన్ని నిర్మూలించే సిద్ధాంతమని నమ్మి కపర్థి, వచనాన్ని కవిత్వంలో ముంచి రేఖలకు ప్రాణం పోసే శీలా వీర్రాజు, తిరుపతి మావోగా పిలువబడే త్రిపురనేని మధుసూదనరావు ఇలా ఎందరో మహానుభావుల జ్ఞాపకాలను – "స్మృతి సుగంధం"లో తెలియజేశారు.

### 2.5.3. స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం (2009):

20వ శతాబ్దం ఆధునిక సమాజంలో స్త్రీపరమైన ఆలోచనలకు బలమైన వాదాన్ని వినిపించింది. స్త్రీ పురుషుల మధ్య సమానమైన ప్రతిపత్తిని ఆశించింది. అన్ని రంగాల్లో స్త్రీ ప్రతిభను విస్తరిస్తూ నూతన ప్రస్థానానికి శ్రీకారం చుట్టింది. అయితే సాంద్రమైన ఈ శతాబ్దంపై 16వ శతాబ్దం నుంచి ప్రభావ రేఖలున్నాయి. వీటన్నింటిని భారతీయ జీవిత కథల నేపథ్యంలో "స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం"గా అందించారు.

ఈ గ్రంథంలో స్త్రీ పుట్టు పూర్వోత్తరాలు, సామాజిక, ఆర్థిక నేపథ్యం, వారిని ప్రోత్సహించిన పరిస్థితులు, వ్యక్తులు వారి వారి జీవితాలను మలుపు తిప్పిన సంఘటనలు, వివిధ రంగాలలో వారి

---

[14] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట – 216

కృషి, పట్టుదల, సామాజిక కార్యకర్తలుగా, రచయితలుగా సాధించిన ప్రగతిని భాషాపరంగా వెలువరించడం జరిగింది.

నేటి నగరీకరణ ధోరణుల గురించి ప్రస్తావిస్తూ "నగరాల్లో మరొక దుర్మార్గం జరుగుతోంది. స్త్రీ పురుష స్వేచ్ఛ కట్టలు తెంచుకుంటోంది. వివాహ బంధం లేకుండానే స్త్రీ పురుషులు కలిసి ఉండడాలు ఒక్కోచోట వివాహేతర సంబంధాలు చలామణి అవుతున్నాయి. వివాహ సంబంధాలు విచ్ఛిన్నమైన వారిలో కొందరు స్త్రీ వాద రచనలు చేయడానికి పూనుకున్నారు. పురుష ద్వేషాన్ని వెళ్ళగక్కారు. జీవశాస్త్ర సంబంధమైన అంశాలు, ప్రకృతికి సంబంధించిన విషయాలు, చారిత్రక సామాజిక విషయాలు పూర్తిగా అవగాహన చేసుకోకుండానే రచనలు చేసిన కొంతమంది స్త్రీవాద రచయిత్రుల మనోభావాల్ని సానుభూతితో అర్థం చేసుకుంటూ వారి ఆలోచనల్ని సరిదిద్దాల్సిన అవసరం ఉంది"[15] అని అంటారు దేవరాజు మహారాజు.

బేబీ కాంబ్లే అనే మరాఠీ రచయిత్రి బాబా సాహెబ్ అంబేద్కర్ చేపట్టిన ఉద్యమాల వల్ల ప్రభావితమైంది. ఉద్యమం ఉధృతంగా ఉన్న రోజుల్లో బాల్యదశలో ఉన్న బేబీ కాంబ్లే, ఉద్యమ రూపంగా పెరుగుతూ వచ్చింది. తాను పోరాడవల్సినవేమిటో తెలుసుకొంది. చాలా చిన్న వయస్సులోనే బాల వితంతువుగా మిగిలిన తిరుమలాంబను ఆమె తండ్రి ప్రోత్సహించి చదవడం, రాయడం నేర్పించారు. ఈ విధంగా స్త్రీ జీవితాలను సున్నితంగా స్పృశిస్తూ, వారి విజయ గాథల వెనుక ఉన్న ప్రధాన నేపథ్యాలను వర్ణించారు.

యుగాలు మారినా స్త్రీల తలరాత మారలేదనేది ఎంత సత్యమైనా ఆయా యుగాలలో స్త్రీల జీవన వ్యక్తిత్వాలు మారుతూ వచ్చాయనేది అంతే సత్యం. 16వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు, రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలన వరకు, మధ్యయుగం నుంచి ఆధునిక యుగం వరకు స్త్రీ తన జీవితాన్ని సవాలుగా స్వీకరించిందని ఈ గ్రంథం తెలియజేస్తుంది. దేవరాజు మహారాజు ఈ గ్రంథంలో ప్రాంతీయ వైవిధ్యం ప్రదర్శించారు. ఆయా యుగాలకు, భాషలకు చెందిన పరిస్థితులనే గాక భౌగోళిక నేపథ్యాలను కూడా విశదీకరించారు. ప్రాంతీయ అస్తిత్వానికి అత్యధిక ప్రాముఖ్యతను ఇస్తూ భారతదేశంలోని పంజాబ్ నుంచి మొదలుకొని తమిళనాడు వరకు విభిన్న భౌగోళిక వాతావరణ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు అవి స్త్రీ జీవితంలో చూపిన ప్రభావాన్ని వివరించారు. ఆర్థికంగా వృద్ధి పొందిన ప్రాంతాల నుంచి మారుమూల ప్రాంతాల వరకు మహిళల

---

[15] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–238.

చైతన్యం, దళితుల ప్రగతి, వారికి కావల్సిన ప్రాథమిక సదుపాయాల కోసం సంఘర్షణ, సాగుతున్న ఉద్యమాలన్నింటిని గురించి వివరించారు.

ఈ గ్రంథంలో స్త్రీల జీవితాలే గాక, సమకాలీన స్త్రీల జీవన ప్రతిబింబం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఆయా కాలాల్లోని స్త్రీల దైనందిన జీవితం చాలా స్పష్టంగా తెలుస్తుంది.

### 2.5.4. ఆత్మ నుంచి అక్షరానికి (2010):

తొలి అనుభవానికి మలి అనుభవానికి ఏళ్ళకేళ్ళ అనుభవానికి తేడాయే లేదు. ఎప్పటికప్పుడు పరగడుపే, ఎప్పటికప్పుడు తప్పటడుగులే, ఎప్పటికప్పుడు దేవులాటే. నిత్య నూతనం ఈ యాత్ర నిత్య యవ్వనం ఈ మాత్ర. దూరమవుతున్న కొద్ది ఇంకొంత దూరం ఉండిపోయేది ఉట్టి ప్రేమో ఉట్టి దాంపత్యమూ కాదు గాక కాదు. ఆ రెండూ కలిసిన గుళిక. పెనవేసుకొన్న జీవిత DNA–RNAల మెలిక.

**"ఒకరినొకరు అన్వేషించుకునే యాత్ర**
**ఒకనాడు ముగిసేది కాదుగదా**
**ఎంత సంఘర్షిస్తే ఒక కలయిక**
**ఎన్ని సార్లు కలిస్తే ఒక ఆనందం**
**ఎంత ఆనందమైతే ఒక శాశ్వతత్వం**
**శాశ్వత ఆనందం కోసం తపించి, తల్లడిల్లి కొట్టుకునే**
**నిత్య శోధన యాత్రగాక మరేమిటి?**
**యాత్రంటే పాదయాత్రో, తీర్థయాత్రో అయితే కావొచ్చుగాని,**
**మనసుల్లో యాత్ర, కన్నుల్లో యాత్ర**
**ఊహల్లో యాత్ర, ఊపిర్లో యాత్ర**
**అయితే ఎంత బావుంటుంది?**
**ఒక సగం జీవితాన్నిచ్చి**
**మరో సగాన్ని తెచ్చుకుని పరిపూర్ణమయ్యే యాత్ర**
**అర్పణలో బంధం బలపడే యాత్ర**
**నాగరిక పొరల్లోంచి తన్నుకొచ్చిన**
**జీవన సౌందర్యాన్ని నిలుపుకుంటూ**
**పెంచుకుంటూ ముందుకు పోయేదే యాత్ర**

**అడుగు తీసి అడుగేయడమే కాదు**
**ఊపిరి పీల్చి వదిలేయడం కూడా యాత్రే**
**కాగితం మీద కలం చేసే యాత్ర**
**పొలంలో హలం చేసే యాత్ర**
**కంప్యూటర్లో ఇ–మెయిల్**
**సెల్ఫోన్ ఎస్సెమ్మెస్ యాత్రకు భిన్న రూపాలు**
**లోక కళ్యాణం ఒక ప్రేమ యాత్ర**
**లోక వినాశనం ఒక శవయాత్ర**

**ఒక సుదూర జీవ కణానికి**
**రక్తం అందించడమే యాత్రయితే**
**ఒక చెట్టు వేరు దూరంలో ఉన్న**
**ఖనిజాల్ని శోధించడమే యాత్రయితే**
**ఆత్మ నుంచి అక్షరానికి చేరిన మానవ ఇతిహాసం కూడా**
**ఒక మహాయాత్రే కదా!"** **(జీవితమే ఒక కవిత, పుట–10)**

ఆత్మ నుంచి అక్షరానికి చేరిన మానవ ఇతిహాసం కూడా ఒక మహాయాత్రే కదా! ముందు మన ఇళ్ళలో మనం స్వచ్ఛమైన తీయదనాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నామా? అనేది ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఒక సామాన్యుడు సాహిత్యకారుడిగా మారి తన రచనల మీద తాను నిలబడి ఎదగాలంటే ఎంతో కష్టం. ప్రయోగాలు శాస్త్రవేత్తలే కాదు. సాహితీవేత్తలు కూడా చేస్తారు. సాహితీవేత్తలకు సమాజమే ఒక ప్రయోగశాల.

సమకాలీన తెలుగు కవిత్వాన్ని నిష్పక్షపాతంగా సమీక్షించే వాళ్ళు గాని, విమర్శించే వాళ్ళు గాని, విడమరిచి చెప్పేవాళ్ళు గాని మనకు ఎక్కువగా లేరు. అందువల్లనే అనేక రకాల ప్రశ్నలు పెరిగిపోతున్నాయి. కొంతమంది సులభంగా రాయగల కొన్ని కవితా రూపాల పట్ల ఆకర్షితులై రాస్తున్నారు. కాని తాము రాసింది కవిత్వమవునా కాదా అని తనిఖీ చేసుకునే తీరిక ఎవరికి లేకుండా పోతుంది. కవితాంశ ఏ ఒక్క అక్షరంలోను లేక తడి, లేని పొడి అక్షరాలు ఏ పేరుతో వెలువడినా అది కవిత్వం కాదు.

సాహిత్య రంగంలో ఒక స్థానం ఏర్పరచుకున్న కవికి, తొలి ముద్రణలో రంగం మీదికొచ్చిన కవికి సమీక్షకు పాపం ఏ మాత్రం తేడా చూపరు. ఇద్దరిని సమంగా ఆదరిస్తారు. అవే వాక్యాలు

ఇటు తిప్పి, అటు తిప్పి రాసేస్తారు. కవిని అంచనా వేయగల సామర్థ్యం లేదా కవికి దారి చూపగల స్థాయి విమర్శకుడికి లేకపోయినప్పుడు ఈ పరిస్థితి దాపురిస్తుంది. అందరిని ఒకే కట్టలా కట్టేయడం జరుగుతుంది. ఒక బాధ్యత, ఒక నిబద్ధత కవులకే కాదు, విమర్శకులకు సైతం అవసరం! అయితే విచక్షణా జ్ఞానం విమర్శకులకు తప్పనిసరి. ఎక్కువ అవసరం కూడా! సృజనాత్మక రచయితలకు మొత్తానికి మొత్తంగా సాహిత్యంపై ఒక అవగాహన లేకపోయినా పరవాలేదేమో! ఉంటే మంచిదే కాని, సమీక్షకులకు, విమర్శకులకు ఆ అవగాహన తప్పనిసరి.

### 2.5.5. కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు (2014):

"మూలం అనువాదం – సమాంతరంగా సాగే రెండు సరళరేఖల వంటివి. మూలం ఎలా సాగితే అనువాదం అలా సాగాలి. మూలం ఏ మలుపు తీసుకుంటే అనువాదం అదే మలుపు తీసుకోవాలి. అప్పుడే సాహిత్యపు రైలు ప్రయాణికుడు రెండు భాషల మీద ఒడిదుడుకులు లేకుండా సుఖంగా, సాఫీగా ప్రయాణించగలడు. ఇందులోని చాలా వ్యాసాలు అనువాద ప్రక్రియ గురించి ఉన్నాయి గనుక "సమాంతర రేఖలు" అని కొత్తగా నామకరణం చేశారు. అలాగే తెలుగు సాహిత్యంలో అనారోగ్య ధోరణులనుకున్న కొన్నిటిని వివరించారు. అందుకే వాటిని "సంక్షోభాలు"[16] అని అన్నారు. ఒక రకంగా ఈ వ్యాసాలు భారతీయ కవిత్వంలో అలాగే ప్రపంచ కవిత్వంలో చిన్నపాటి పరిచయం చేయగలుగుతాయి.

అనువాదానికి గ్రామ్యదృష్టి, జాతీయ దృష్టి మాత్రమే సరిపోదు. అవి ఉంటూనే విశ్వదృష్టి కూడా ఉండాలి. విశ్వమంతా నాది అనే భావనకి ఎదిగినవాడే అనువాదానికి పూనుకుంటాడు. ప్రపంచ ప్రజలంతా నావాళ్ళు, ప్రపంచ సాహిత్యమంతా నాది అనే భావన అనువాదానికి తప్పనిసరి. కవిత్వం, కథ మొదలైన సృజనాత్మక ప్రక్రియలన్నీ ఎగిసిపడ్డ మనిషి చైతన్యానికి ప్రతీకలు. దాన్ని నిలుపుకోవాలనుకునే వారే అనువాదాల వైపు ఆకర్షితులవుతారు. కవిత్వం చిక్కనైంది, లోతైంది, గాఢమైంది. ధ్వని ప్రధానమైంది గనుక, అది అనువదించడంలో అనువాదకుడికి ఎక్కువ ఒత్తిడులుంటాయి. మూల కవితలో ఉన్న Resonance అనువాదంలో Reverberate కావాలి. ఆత్మ నుంచి అక్షరానికి సృజనాత్మకత దూకినప్పుడు అనువాదం తయారవుతుంది. కవిత్వాన్ని నిర్వచిస్తూ ఏ దేశపు కవి ఏమి చెప్పాడో చూడండి.

"కవిత్వాన్ని కవిత్వంలో ప్రేమించకపోతే, ఇక నువ్వు కవిత్వంతో దేన్ని ప్రేమించగలవ్" అని అంటాడు దక్షిణ కొరియా కవి చోంగ్ హ్యాన్–జోంగ్.

---

[16] దేవరాజు మహారాజు, కవిత్వంలో సమాంతర రేఖలు–సంక్షోభాలు, పుట–03.

"చావనైనా ఛస్తాను గానీ, కవితలల్లకుండా ఉండలేను" అని అంటాడు మెక్సికన్ కవి ఆక్టేవియో పాజ్.

"కవిత్వం ప్రజల మానసిక ఆహార్యమని గట్టిగా నమ్మినవాణ్ణి" అని ప్రకటించుకున్నాడు సిరియా కవి నిజర్ – ఖబ్బానీ.

"పదాలన్నీ విఫలమైన తర్వాత కూడా మిగిలి ఉండేదే కవిత్వం" అని అన్నాడు భారతీయ ఒరియా కవి సీతాకాంత్ మహాపాత్ర.

కవిత్వాన్ని కవిత్వీకరించి చెప్పిన వివిధ కవుల అభిప్రాయాలకు అనువాదాలకు సంబంధం ఏమిటి అని అనుకోవచ్చు. కాని గ్రహించాల్సిన విషయమేమంటే అనువాదాలు రావడం వల్లనే కదా! ఏ భాషలో ఏ దేశపు కవి ఏమన్నాడన్నది తెలుసుకోగలిగింది.

ఒక భాషలో ఉన్న మాటల్ని మరో భాషలోకి మార్చడమే అనువాదం కాదు. మాటల్లో అంతర్గతంగా దాగిన స్పర్శను, స్పృహను, స్ఫూర్తిని, ఆర్తిని, అనుభూతిని మార్చగలగాలి.

అనువాదం, మూల భాషలోంచి ఉద్దేశించిన భాషలోకి జరుగుతుంది. అంటే ఉద్దేశించిన పాఠకులెవరో నిర్ధారణ జరిగిన తర్వాత అనువాదం రెండు భాషల మధ్య జరుగుతుంది. కవిత, కథ, నవల, నాటకం, వ్యాసం వంటి ఏ ప్రక్రియ అయినా ఒక భాషలోంచి మరో భాషలోకి అనువదించబడుతుంది. ఉద్దేశించిన పాఠకులు వేరు వేరు భాషలలో ఉన్నప్పుడు అనువాదం కూడా వేరు వేరు భాషలలో జరుగుతుంది. మూలం ఒకటే, అనువాదాలు అనేకం. అనేక అనువాదాల్లో అనేక ఛాయలు. మూలానికి అనువాదానికి మధ్య ఎన్నో ఛాయలు కదిలిపోతుంటాయి. వాటిలో మనం సరైన అనువాదాన్ని నిర్ధారించుకోవాలి.

ఉదాహరణకు రామాయణాన్ని తీసుకుంటే భారతదేశపు అనువాదాలకు, శ్రీలంక అనువాదాలకు తేడా ఉంది. మనదేశంలో రామాయణం తెలుగు, తమిళ, కన్నడ, మళయాళీ, హిందీ, బెంగాలీ వంటి ఎన్నో భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఒక్కో భాషలో ఒక్కోరకంగా అనువాదమైంది. అంతే కాదు, ఒక భాషలోనే అనేక రకాల అనువాదాలొచ్చాయి. అందుకే అనువాదాల్లో అనేక ఛాయలు ఉంటాయి. మూలానికి, అనువాదానికి మధ్య ఎన్నో ఛాయలు కదిలిపోతుంటాయని చెప్పుకుంటాం.

నోబెల్ గ్రహీత పాబ్లో నెరుడ కవితను పరిశీలిస్తే – చీలీలో పుట్టిన లాటిన్ అమెరికన్ కవి పాబ్లో నెరుడ 1904 – 1973 మధ్య కాలంలో జీవించాడు. కవిత్వం ఏదో కొద్దిమంది ఉన్నత వర్గాల కోసం కాదని, మానవ ఇతిహాసంలోంచి మానవ సమైక్యతను సాధిస్తూ అశేష జనవాహిని

కోసం ముందుకు సాగాల్సిన ఒక జీవనధార అని గుర్తెరిగాడు. కవిగా, చరిత్రకారుడిగా నిలబడ్డాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరిన నెరుడ తన దృక్పథంలో వచ్చిన మార్పులన్నీ కవిత్వంలో ప్రతిఫలింపజేశాడు. ఒక 'పదం' శీర్షికతో రాసిన నెరుడ కవితకు తెలుగు అనువాదం ఇలా ఉంది.

**"పదం అర్థంతో నిండిపోయింది**
**జీవితంతో పరిపక్వమయింది**
**ప్రతిదీ పుట్టుకతో శబ్దాలతో, స్పష్టతతో**
**చేయాల్సి ఉంటుంది**
**ఒక్కోసారి నడిపించడంతో, కూల్చడంతో**
**చావుతో కూడా చేయాల్సి ఉంటుంది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట – 07)**

హిందీ నుండి తెలుగులోకి అనువదింపబడిన కవులలో మనకు కవి అజ్ఞేయ, రఘువీర్ సహాయ్ గుర్తు కొస్తారు. హరివంశ్రాయ్ బచ్చన్, బాబా నాగార్జున్, ఆలోక్ ధన్వా, అశోక్ వాజ్పాయ్, రాజాశ్ జోషి వంటి అగ్ర శ్రేణి హిందీ కవులెందరో గుర్తు కొస్తారు. ఎంతో మంది హిందీ కవుల కవిత్వం తెలుగులో వెలుగులోకి వచ్చింది. ఆలోక్ ధన్వా "బుడగలు – గాలి పడగలు" కవితలో కొన్ని చరణాలు చూడండి –

**"ప్రపంచంలోకెల్లా అతి పలుచనైన కాగితం ఎగరడానికి**
**ప్రపంచంలోకెల్లా అతి అందమైన రంగుల ఆటవస్తువు కదలడానికి**
**సన్నని రెండు వెదురు పుల్లలు ఆకాశం అంచులు తాకడానికి**
**ఈలలు, చప్పట్లు, కేరింతలు, తుళ్ళింతలతో**
**చిన్నారుల ఒక సున్నిత ప్రపంచం మేల్కొనడానికి**
**సీతాకోకచిలుకల రంగుల ప్రపంచం ఆవరించడానికి**
**పూలను దాటేస్తూ శరదృతువు వచ్చేసింది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట – 37)**

ఇది చిన్న పిల్లల మనస్తత్వం, గాలిపటాలు ఎగరేయడంలో వారి ఉత్సాహాల, కోలాహలాలతో హిందీ కవి ఆలోక్ ధన్వా తయారుచేసి, సాహిత్యాకాశంలో ఎగరేసిన ఒక గొప్ప గాలిపటం! తెలుగు పాఠకులు కూడా ఈ అనువాదాన్ని ఎంతగానో ఆదరించారు.

మహాకవి దాశరథి ఉర్దూ కవిత్వాన్ని తెలుగులోకి తేవడానికి నడుం బిగించారు. అందులో "గాలిబ్ గీతాలు" ఒక అద్భుతమైన అనువాదం. దీపం, దీపం పురుగు, చూపుల బాణం, హృదయాన్ని చీల్చడం, సాకీ వంటివి ఉర్దూ సాహిత్యంలో అంతర్భాగమైపోయిన పదాలు, పదబంధాలు, సంప్రదాయాలు, ఉపమానాలు. వీటిని తెలుగు వాతావరణానికి సరిపోయే విధంగా వాడి శభాష్ అనిపించుకున్నారు దాశరథి. కవిత్వం ఒక ప్రత్యేక పరిభాష అని, అది భాషా భేదాల వల్ల, భాష తెలిసినవారికి అర్థమై, భాష తెలియని వారికి అర్థం కాకుండా పోకూడదని అనువాదానికి పూనుకున్నారు దాశరథి.

**"వేరునందుండి కొమ్మలు వెలిసినట్లు**
**అన్ని శబ్దాలు నిశ్శబ్దమందు పుట్టె"**

పైకి అగుపడని వేరులోంచి చెట్టు మొలుచుకొస్తుంది. అలాగే శబ్దాలన్నీ వినిపించని నిశ్శబ్దంలో నుంచేనట! ఇంత చక్కని ఉపమానాలు కాళిదాసు తప్ప వేరేవారు చెప్పలేరని దాశరథి చెప్పారు.

**"నన్ను గూర్చి వార్త నాకే అందని చోట**
**నేను వాసముండినాను నేడు"**

అతని బాధను, దౌర్భాగ్యాన్ని, ఒంటరితనాన్ని ఇంతకంటే బాగా ఏ కవి చెప్పలేడేమో!

**"బాధలో నాకు రుచి కనుపట్టగానె**
**చాన నన్ను బాధించుట మానుకొనియె"**

ఇందులో వేదన వ్యంగ్యంగా, సున్నిత హాస్యరూపంలో దర్శనమిస్తుంది. మరో చోట గాలిబ్ మనసు దాశరథి అక్షరాల్లో ఈ విధంగా దర్శనమిస్తుంది.

**"తరుణి దీర్ఘకేశములు సౌందర్య ఖనుల**
**వెలసినవి నేడు నన్నురి పెట్టు కొరకు"**

ఇక్కడ బాధ కసిగా మారిపోయింది.

**"స్వర్గమును గూర్చి నాకు సర్వమ్ము తెలియు**
**మనసు సంతస పడుటకు మంచి ఊహ"**

ఎంత వాస్తవం ఉందీ కవితలో ——

**"శస్త్రవైద్యు కత్తి సైతము రక్తా శ్రు**
**కణము లొలికె, నీవు కరగవేమె?"**

విరహ బాధ వల్ల ఏర్పడిన గాయం బాగుపడడానికి శస్త్ర చికిత్స చేయించుకోబోతే, కత్తి సైతం గుండె ప్రణాన్ని చూసి నెత్తుటి కన్నీరు కార్చిందట. ప్రియురాలు మాత్రం కరుగలేదట. అబ్బ ఎంత బాధ.

> **"చావు గోరెడి వానికి చావురాని**
> **ఘోర దుర్గతి నిక చూచి తీరవలయు"**

గాలిబ్ గీతాలు అనువాద గ్రంథమైనా దాశరథికి అనువాదకుడిగా ముద్ర పడలేదు. స్వతంత్ర రచనకు లభించిన సాహిత్య గౌరవం, గుర్తింపు లభించాయి. అంటే అనువాదం ఎంత ఉన్నత స్థాయిని అందుకుందో, ఎంతటి స్వీయ సృజనాత్మక స్థాయికి ఎదిగిందో మనమిక్కడ అర్థం చేసుకోవాలి.

**సంక్షోభాలు**:

ప్రయోగాలు శాస్త్రవేత్తలే కాదు, సాహితీవేత్తలు కూడా చేస్తారు. సాహితీవేత్తలకు సమాజమే ఒక ప్రయోగశాల. సమాజ శ్రేయస్సుకు అతడక్కడ ఏ సాహితీ ప్రక్రియలోనైనా ప్రయోగాలు చేస్తాడు. ఇతర ప్రక్రియల్లో కంటే కవిత్వంలో జరిగిన ప్రయోగాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో వచన కవిత్వంలో ప్రయోగాలు ఎక్కువగా జరిగాయి. స్థూలంగా చూస్తే వచన కవిత్వం రెండు రకాలుగా ఉంది. ప్రజల పాటకు దగ్గరగా ఉంటూ, స్పష్టతతో సగటు మనిషికి సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండేది ఒక రకం. ప్రజలకు దూరమైన శిల్పం, వస్తువులతో మెదడుకు పని కల్పిస్తూ మేధావులుగా ఎదిగిన పాఠకులకు మాత్రమే పనికొచ్చేది రెండవ రకం. పాటలాగే వచన కవితకు స్ఫూర్తి ప్రజలే. పాట ప్రజల నుండి ప్రజలకు చేరే క్రమంలో పనిచేస్తోంది. కాని వచన కవిత్వం ప్రజల చుట్టూ తిరుగుతోందే గాని, నిజంగా నిరక్షరాస్యులైన ప్రజలకు అందడం లేదు. అది మధ్య తరగతి అక్షరాస్యుల కవిత్వం.

మోదుగు పూలు, గులాబి పూలు, బంతి పూలు అని రాసినంతవరకు అది అన్ని రకాల ప్రజలకు అర్థమవుతుంది. కాని ఆ పూల రంగులను, సున్నితత్వాన్ని ప్రతీకలుగా వాడుకుని రాసినప్పుడు అది చాలామంది అర్థం కాకుండా పోయి, కొద్ది మందికి మాత్రమే సంతోషాన్నిస్తుంది. ఈ విధంగా మధ్య తరగతి విద్యావంతులు మాత్రమే వచన కవిత్వాన్ని పోషించారు.

స్ఫూర్తిని పొందడానికి కవులు మధ్య తరగతి పాఠకుల దగ్గరికి వెళుతున్నారు. ఉదాహరణకు తెలంగాణ సాయుధ పోరాట ప్రభావంతో ఎంతో మంది రచనలు చేశారు. కాని లబ్ద ప్రతిష్టులైన వారి కావ్యాలు కొన్నే ఉన్నాయి. ఇందులో గమనించాల్సింది ఏమిటంటే వారు రాసింది

ఛందోబద్ధమైన కవిత్వమైనా, గేయ కవిత్వమైనా, వచన కవిత్వమైన అందులో ప్రజల సొత్తయిన మౌఖిక రూపచ్ఛాయలు ప్రస్ఫూటంగా ఉన్నాయి.

కొప్పరపు సుబ్బారావు 'ఎరుకల లచ్చిమి', ఆరుద్ర 'త్వమేవాహం', కె.వి. రమణారెడ్డి 'భువన ఘోష', సోమసుందర్ 'వజ్రాయుధం', గంగినేని 'ఉదయిని', కుందుర్తి 'తెలంగాణ', దాశరథి 'అగ్నిధార' మొదలైనవారు పూర్తిగా ప్రజల కళారూపమైన బుర్రకథను, ఇతర ప్రజల బాణీలను వచన కవిత్వంలో వాడుకున్నారు. టెక్నిక్ లేకుండా కవిత్వాన్ని ఊహించలేనటువంటి ఆరుద్ర, స్వీయ కల్పిత మానసిక సంఘర్షణలోంచి

**"భళానోయి భాయి తమ్ముడూ**
**భళానోయి భాయి దాదానా"**

అంటూ ప్రజల దగ్గరకి దిగి రావాల్సి వచ్చింది. ఆయన పల్లకి మోసేప్పుడు పాడే పాటను కూడా వచన కవిత్వంలో వాడుకున్నారు. గంగినేని కవిత్వంలో పడవ నడిపేటప్పుడు పాడే పాట బాణీలున్నాయి. వచన కవిత పితామహుడుగా ప్రసిద్ధుడైన కుందుర్తి కూడా ప్రజల పాటల ప్రభావంలోంచి తప్పించుకోలేకపోయారు. ప్రజల పాటల ముఖ్య లక్షణమైన పదాల (పునఃచ్చరణ) పునశ్చరణ దాశరథి కవిత్వంలో సర్వ సాధారణం.

**"ఖబడ్దార్**
**ఖబర్దార్**
**నైజాం పాదుషాహీ"**

అనే సోమసుందర్ కవిత పోరాట కాలంలో ప్రజలదైపోయింది. అది ఆయన ప్రత్యేకంగా రాయలేదు. వచన కవితే అయినా, పునశ్చరణ పదాల వల్ల అది పాటలాగా అయి ప్రజల నుండి ప్రజలకు అనే పరిధిలో పని చేసింది. శిల్పానికి ప్రాధాన్యతనిస్తూ తిలక్, శ్రీరంగం నారాయణబాబు లాంటి అనేకమంది కవులు కొత్త ప్రయోగాలు చేశారు. వచన కవితా రూపాన్ని మార్చి మార్చి ఇష్టం వచ్చిన విధంగా ఆడుకోగలిగిన వారిలో ప్రథముడు పఠాభి.

**"నారీ చర్మ కర్ణాలలో శర్కర స్వరంతో**
**మాట్లాడగలట్టి నాకీ, రిసివర్ లోహంపుటియర్ లోనన్**
**మాట్లాడుటకు భయమేలా"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట – 65)**

అంటాడు. తెలుగు గ్రాంథిక భాషను, ఇంగ్లీషు పదాలను మిళితం చేసి వచన కవిత్వానికి కొత్త రూపం ఇవ్వడంతో పాటు దాన్ని వెర్రితలలు వేస్తున్న నవ నాగరిక సమాజానికి ప్రతీకగా వాడారు. దానిలోనే ఆ సమాజాన్ని అపహేళన కూడా చేశారు. కుందుర్తి ఆచార్ల గారమ్మాయి, త్వమేవాహంలో ఆరుద్ర నాటిక, వచన కవిత్వంలో వచ్చాయి. కాని అవి ప్రదర్శింపబడలేదు. జనాదరణ పొందలేదు. వచన కవిత్వంలో కథలు రాసి, ఆత్మకథను రాసుకుని ప్రత్యేకతను సంతరించుకున్నారు శీలా వీర్రాజు. సౌందర్యారాధన, ప్రేమతత్వం ప్రధానంగా ఉన్నా, అంతర్లీనంగా, సామాజిక స్పృహ కూడా ఉంది. 'హృదయం దొరికింది', 'కొడి గట్టిన సూర్యుడు' కావ్యాలలో

**"గట్టిగా చేతుల్ని పెనవేసుకుని**
**వ్యక్తి నుంచి కుటుంబంలోకి**
**అడుగు తీసి అడుగేస్తూ**
**పరస్పరాభిరుచుల కలనేతగా**
**జీవితాన్ని నేయడానికి**
**శ్రీకారం చుట్టుకున్నాం"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట – 66)**

అంటూ తన జీవిత గాథకు వచన కవిత్వపు సొగసుల్ని అద్దారు శీలా వీర్రాజు తన "పడుగు పేకల మధ్య జీవితం" అనే కావ్యంలో. "గొద్దళ్ళు తేవాలా" నృత్య సంగీత రూపకం రాశారు దేవీప్రియ. అయితే ఇవి కేవలం ప్రయోగాలుగానే మిగిలిపోయాయి.

ఎవరి కోసమైతే కవిత్వం రాయబడుతుందో, ఆ కవిత్వం ఆ అట్టడుగు ప్రజానీకానికి అర్థం కావాలన్న దృక్పథం ఏర్పడ్డ తర్వాత, వచన కవిత్వంలో ప్రజల భాష చోటు చేసుకుంది. కోస్తా జిల్లాల ప్రజల భాషలో రంధి సోమరాజు "ఎదగండి, రోజీ" వంటి సంపుటాలు ప్రచురించారు. తెలంగాణ భాషలో దేవరాజు మహారాజు "గుడిసె గుండె" ప్రకటించారు. వీరి 'ఊల్లెకుగాది', 'బయిరూపులోల్లం' కవితలకు బహుళ ప్రచారం లభించింది. ఆ తరువాత కృష్ణమూర్తి యాదవ్, పంచరెడ్డి, భానుమూర్తి వంటివారు కూడా తెలంగాణ ప్రజల భాషలో కవితలు రాశారు.

1980వ దశాబ్దంలో 'మినీ కవిత' బాగా ప్రజాదరణ పొందింది. కొంతమంది దాన్ని 'ఉద్యమం' అని కూడా అన్నారు. నిజానికి ఒక ప్రక్రియను ఉద్యమంగా భావించడం హాస్యాస్పదంగా ఉంటుంది. కొంతమంది యువకవుల చేతుల్లో 'మినీ కవిత' సాహిత్య బాంబులాగా పేలింది. తక్కువ

మాటలతో, తక్కువ వ్యవధిలో ఎక్కువ విషయాన్ని అర్థవంతంగా చెప్పడానికి మినీ కవిత ఉపయోగపడింది. అలిశెట్టి ప్రభాకర్, అను రాజేంద్ర లాంటివారు ఆ ప్రక్రియతో గుర్తింపు పొందారు. పదేళ్ళలో ఆ ప్రక్రియ మూలపడింది. దానికే కొత్త పేర్లు పెట్టి చలామణి చేద్దామని కొందరు తాపత్రయ పడుతున్నారు. జపాన్ కవిత ప్రక్రియలైన 'హైకూ'లను తెలుగు నాట ప్రచారం చేసి వచన కవితకు కొత్త పార్శ్వాన్ని చూపించారు ఇస్మాయిల్. గాలి నాసర రెడ్డి, బి.వి.వి. ప్రసాద్, లలితానంద్, తలతోటి పృధ్వీరాజ్ ఇంకా అనేకమంది కవులు ఆ రంగంలో కృషి చేస్తున్నారు. తర్వాత కాలంలో కవిత్వ వైఖరి మారింది. కవులు దీర్ఘ కవితల వైపు మళ్లారు. వచన కవితా కావ్యాలు వెలువరించారు. ప్రక్రియలో ఎన్నెన్ని మార్పులు జరిగినా అంతర్లీనంగా, అంతస్సూత్రంగా భాసించేది కవిత్వమే.

## 2.5.6. కొన్ని కలలు – కొన్ని సమయాలు (2015):

ప్రపంచంలో ముఖ్యంగా మనదేశంలో భిన్నమైన భౌగోళిక పరిస్థితులున్నాయి. భిన్నమైన వాతావరణ పరిస్థితులున్నాయి. సామాజిక అసమానతలు, ఆర్థిక అసమానతలు సరేసరి. వర్షాలు, వరదలు ఒకచోట కరువులు, కాటకాలు మరోచోట. ఆకలి తెలియనిదొకచోట, అన్నం చూడనిదొక చోట. అంతా సుభిక్షమని ఒకరంటే, బతుకు దుర్భరమన్నది మరొకరు. దేవుడు, దయ్యం ఒకరంటే, ఏదీ లేదని మరొకరు. ఇలా వైవిధ్య భరితమైంది ఇక్కడి జీవితం. ఏ కోణంలోంచి చూస్తే సమాజ స్వరూపం ఆ కోణంలోనే కనిపిస్తుంది. ఆధ్యాత్మికంలో మునిగిన వాడికి ఉద్యమాలు, విప్లవాలు కనపడవు. తప్పులెన్నడమే ధ్యేయమైతే ప్రపంచమే ఒక తప్పుల తడక. సంతోషాలు, సరదాలు, అసహనాలు, ఆగ్రహాలు, భావోద్వేగాలు అన్ని రకాల భావనలు భారతదేశంలోని అన్ని భాషా సాహిత్యాలలో ఉన్నాయి.

సమాజంలో అవకతవకల్ని ఎత్తి చూపుతున్నవారు, వ్యవస్థలో అమలవుతున్న విధానాల్ని విమర్శిస్తున్నవారు, తీక్షణమైన వ్యంగ్య బాణాల్ని సంధిస్తున్నవారు, గొంతెత్తి విప్లవ గీతాలాలపిస్తున్న వాళ్ళు దేశద్రోహులు కారు. దేశానికి కావల్సిన వాళ్ళు. బండి గాడితప్పుతున్నప్పుడు దాన్ని గాడిలోకి తెచ్చే తండ్రిలాంటి వాళ్ళు. వాళ్ళు దేశభక్తులే! ప్రపంచంలో తమ దేశం తలెత్తుకుని నిలబడాలని కోరుకునేవాళ్ళే. తమ దేశపు సార్వభౌమాధికారం పరిఢవిల్లాలని పరితపించే వాళ్ళే. తమ స్వరంలో అసమ్మతి, ధిక్కారం వినిపించినంత మాత్రానా వాళ్ళు దేశానికి అనవసరమైన వాళ్ళు కారు. తప్పనిసరిగా కావాల్సిన వాళ్ళు. వాళ్ళున్నందువల్లే వివిధ కోణాల్లోంచి మనం జీవితాన్ని దర్శించగల్గుతున్నాం. మంచి విమర్శకులు ఉన్నప్పుడే సాహిత్యం ఉన్నత శిఖరాలందుకుంటుంది.

చెప్పేవాడు లేక సమాజం దెబ్బ తినకూడదు. ఒక్కసారి ప్రపంచ భాషల్లోకి ముఖ్యంగా భారతీయ భాషల్లోకి తొంగిచూస్తే ధిక్కార స్వరాలు అన్ని భాషా సాహిత్యాల్లో ప్రబలంగా కనిపిస్తాయి.

బెంగాలీ కవి బీరేంద్ర చటోపాధ్యాయ కవితా చరణాలు గమనిస్తే మన తెలుగు విప్లవ కవులు చెప్పినట్లుగానే అనిపిస్తుంది.

**"ఈ దేశంలో ప్రజాస్వామ్యముందంటే భ్రమ పడకు**
**చదువు, సభ్యత, సంస్కారం ఉన్నాయంటే నమ్మకు**
**మనిషి, మానవత్వాన్ని అవమానించడం సహించకు"**

అని! అదే తీవ్రతతో, అంతే అసహనంతో ఒరియా కవి రవీంద్రసింగ్ తన గళం విప్పుతాడు –

**"నా నుదుట**
**అణచబడజాలని తిరుగుబాటు ఎర్రజెండా!**
**మానవత్వం మంటగలిస్తే**
**సృష్టి కారకుడైన దుష్టుడెవరో వాడు చావాల్సిందే!"**

అని కసిగా తీర్మానిస్తాడు. ఇతర భాషల్లో విప్లవ చైతన్యం ఎంతగా పెల్లుబికిందో మన తెలుగులో కూడా అంతగానే వెల్లివిరిసింది. చెరబండరాజు –

**"బొట్టు బొట్టుగా నా నెత్తుటిని**
**ఈ నేల విముక్తి కోసం విత్తనంగా చల్లుతాను**
**బందీనైనా బానిసను కాదు"**

అంటూ విప్లవకారుల దృఢ దీక్షను తెలియజేశాడు.

ఈ విధంగా ధిక్కార స్వరాలు వినిపించిన వారే కాదు. సాదాసీదాగా జీవితపు లోతుల్ని తరచి చూసిన వారు ఉన్నారు. మనిషిని మనిషిగా నిలబెట్టే యత్నంలో కవులు, రచయితలు ఎప్పుడు ముందే ఉంటారు.

సమాజంలో ఎక్కడ ఏ కొద్దిపాటి అవకతవకలు జరిగినా ముందు కవులు, రచయితలు స్పందిస్తారు. తమ స్వరాన్ని వినిపిస్తారు. వారి వల్ల, వారి అక్షరాల వల్ల విప్లవాలు, సంస్కరణల మేలు నేరుగా జరగకపోవచ్చు. కాని జనాన్ని చైతన్యవంతుల్ని చేయడంలో వారు ముందుంటారు. వారి అక్షరాలు ముందుంటాయి. సృజనకారులకు అడ్డుగోడలు పనికిరావు. వారు విశ్వమానవులు!

మానవీయ విలువల్ని కాపాడుతూ వచ్చిన కొంతమంది సాహితీ మహనీయుల జీవితాల్ని, వారి సృజనాత్మక కృషిని దీనిలో పరిచయం చేసుకోవడం జరిగింది.

"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్న మహాకవి దాశరథి సినిమా పాటల్లో ఎక్కువగా 'వీణ' పదాన్ని ఉపయోగించారు. ఆ పదం సహజ సుందరంగా ఆ భావంలో ఇమిడింది. ఇందుకు ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. అందువల్ల వీరిని మనం 'వీణ కవి' అని అనుకున్నా తప్పులేదు అని రచయిత తెలియజేశారు.

- తీగలు తెగిన వీణియపై – ఇక తీయని రాగం పలికేనా (మంటలు రేపే నెలరాజా).
- నడిచే వీణియపై – పలికే దీపకవై (విరిసిన వెన్నెలవో).
- వేయి వేణువులు మ్రోగే వేళ (నను పాలింపగ నడిచి వచ్చితివా).
- మదిలో వీణలు మ్రోగే – ఆశలెన్నో చెలరేగే.
- బ్రతుకు వీణపై ప్రణయ రాగములు (ఏ దివిలో విసిరిన పారిజాతమో).
- కనరాని నీవె కనిపించినావె – అనురాగ వీణ పలికించి నావే.
- కలిసిన హృదయాలలోనే – పలికేను అనురాగ వీణ.

వీణ మాత్రమే కాక, దాశరథి తన పాటల్లో సన్నాయి, మురళి వంటి వాయిద్యాల పేర్లు కూడా బాగా వాడుకున్నారు. అంతే కాదు ముత్యాలు, రతనాలు, మల్లెపూలు, సిరిమల్లె, సన్నజాజులు, పారిజాతం, పొన్నపూలు వంటి పుష్పాలను కూడా బాగా వాడుకున్నారు.

1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడడానికి ముందు తెలంగాణ గ్రామీణ ప్రజల జీవన పోరాటం చిత్రించిన వట్టికోట ఆళ్వారుస్వామి "ప్రజల మనిషి" నవలను 1955లో వెలువరించారు. ఇందులో కంఠీరవం, కొమురయ్య కుటుంబాల కథ ప్రధానాంశంగా సాగుతుంది. ఏదో ఒక సమయంలో ఒక గ్రామంలో జరిగిన సంఘటనల సమాహారం కాదు ఈ నవల. వాటి మధ్య గల కార్యకారణ సంబంధాల్ని విశ్లేషించి, ఒక విశ్వజనీనతను సాధించిన రచన. కంఠీరవం నవల ప్రారంభంలో భయస్థుడైన గృహస్థుడు, సమయం గడుస్తున్న కొద్దీ, పరిస్థితులు అర్థం చేసుకుంటున్న కొద్దీ, చైతన్యంతో పరిణతి సాధిస్తున్న కొద్దీ అతను సింహంగా మారతాడు. కంఠీరవం అంటే గర్జించే సింహం అని అర్థం.

శ్రమదోపిడితో మొదలైన నవల రాజకీయ చైతన్యంతో పరిష్కారాన్ని కనుగొని, నిరంకుశ పాలనకు చరమగీతం పాడే దిశలో సాగుతుంది. "మంచి ప్రభుత్వం ఇతరుల ఆస్తులు ఆక్రమించదు. అందరూ ఆప్తులుగా బతుకుతారు" అని కంఠీరవం ప్రకటించడంలో నవల

ముగుస్తుంది. ఇతివృత్తాన్ని సామూహికంగా ముందు తీసుకుపోయాయి. "ప్రజల మనిషి" నవలలోని ముఖ్య పాత్ర కంఠీరవం అంటే మరెవరో కాదు. నవలా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామే అని రచయిత చెప్పగలిగారు.

నాటి తెలంగాణ జీవితాన్ని యథాతథంగా చిత్రించి, చారిత్రక సత్యాల్ని తర్వాత తరాల వారికి తెలియజేసింది.

స్వయంగా పోరాటంలో పాల్గొని జైలుకెళ్ళిన మహాకవి దాశరథి వలె, జీవించిన నలభై ఏళ్ళ కాలంలో తొలుత వంటవాడిగా సేవ చేశారు. తర్వాత యాచక వృత్తిలో గడిపారు. ఆ బీదతనంలోనే మగ్గిపోకుండా అందులోంచి బయటపడి, బెజవాడలో గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్గా మారారు. తను చైతన్యవంతుడై గ్రంథాలయోద్యమంతో ఇతరుల్లో చైతన్యం తెచ్చినవాడు. ఇతరుల గ్రంథాలెన్నో ప్రచురించి, తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ఎన్నో చారిత్రక వివరాల్ని 'తెలంగాణ' సంపుటాల ద్వారా వెలుగులోకి తెచ్చిన సాధకుడు, మహనీయుడు, వైతాళికుడు ఆళ్వారుస్వామి.

సామాజిక దురాచారాన్ని తీసుకుని "వితంతు బాలిక" రాశారు వానమామలై వరదాచార్యులు. ఇదీ గొప్ప కవితే. గురజాడ అప్పారావు "పుత్తడి బొమ్మ పూర్ణమ్మ" కవిత్వ స్థాయి దీనికి ఉంది. అంతటి గుర్తింపు దీనికి రావాల్సింది. బాల్య వివాహాల్ని నిరసిస్తూ, బాల్య వితంతువుల దుర్భరమైన జీవితాన్ని కళ్ళకు కట్టించారు. అది మంగళసూత్రమూ, ఉరితాడో తెలియని వయసు. వారు బ్రాహ్మణులో, దొంగలో తెలియదు. అవి మంత్రాలో, తిట్లో తెలియదు. ఏదీ తెలియని ఆ చంటిపాపకు "ముండా" అని ముద్ర వేసి ఎందుకు చంపుతారు? అని ఆక్రోశించాడు కవి.

**"బట్ట విడిచివైచి బరిమేన తిరిగెడి**
**చంటి పోరికేమి సకల శాస్త్ర**
**సారవేత్తలైన మీరలు పెండిలి**
**సేయుటేమి చాల సిగ్గు సిగ్గు"** **(కొన్ని కలాలు – కొన్ని సమయాలు, పుట –16)**

అని ఆగ్రహించారు. అక్రమ సంతానాన్ని ఫుట్పాత్లపై విడిచి వెళ్లడం, పసికూనల్ని పెంటదిబ్బలపై పారవేసి పోవడం ఈ రోజుల్లో చూస్తున్నాం కానీ ఈ కవి ఒక అర్థ శతాబ్ది క్రితమే ఈ పద్యం చెప్పారు.

**"కొందఱో అంకుటాండ్రయి కులములోనె**
**బయట పడకుండా చాటు గర్భములనెన్నో**
**కడకు దిగద్రావియో లేక కన్నబిడ్డల**

**పిసికి పాతి పెట్టుటలేని వినబడవొకొ?"**

**(కొన్ని కలాలు – కొన్ని సమయాలు, పుట:16)**

భక్తి భావనకు, ఆధ్యాత్మిక చింతనకు, సంప్రదాయానికి, పద్య నిర్వహణాదక్షతకు వానమామలై రచనలు పెద్ద పీట వేశాయి. భక్తి భావనలో పూర్తిగా మునిగిపోయిన కవి, సంప్రదాయవాది, ఆచారాలు బాగా పాటించే కుటుంబ నేపథ్యంలోంచి ఎదిగి, తెలుగు భాషపై పట్టు సాధించి, పద్య కవితను పరుగులు పెట్టించినవారు వరదాచార్యులు. తన చట్రంలోంచి ఒక్కసారిగా బయటపడి ప్రగతిశీల భావజాలంతో సామాజిక, వైజ్ఞానిక, ఆరోగ్య విషయాలు తడుముతూ కవిత చెప్పారు. పోతనపై కావ్యరచన చేసినందుకు ఆయన "అభినవ పోతన" అయ్యారు.

నిజాం పాలన నాటి రోజుల్ని, ఆ తర్వాత స్వతంత్ర భారతంలోని రోజుల్ని, కాలక్రమంగా మారుతూ వచ్చిన పరిస్థితుల్ని స్వయంగా చూసిన వ్యక్తి నెల్లూరి కేశవస్వామి. 13–17 సెప్టెంబర్ 1948న యూనియన్ సైన్యాలు హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టి ఆక్రమించుకోవడం, నిజాం లొంగిపోయి, తన స్వతంత్ర రాజ్యాన్ని ఇండియన్ యూనియన్లో విలీనం చేయడం, ఆ క్రమంలో వచ్చిన మార్పుల్ని స్వయంగా చూసి, అనుభవించి వాటిని పూస గుచ్చినట్టు "యుగాంతం" కథలో అక్షరీకరించిన రచయిత, ఫ్యూడల్ రాజ్యానికి చరమగీతం పాడిన సృజనకారుడు. నెల్లూరి కేశవస్వామి కథల్లో నాటి కట్టడాలు, భవనాలు, తినుబండారాలు, దుస్తులు ప్రత్యేకంగా కనిపిస్తాయి.

'షరీఫా కథ' అద్భుతమైన కథ. రాత్రి మందు పార్టీలో పాల్గొన్న ఒకతను ఇంటికి వెళుతూ ఉంటే రిక్షావాడు ఆపి, రిక్షాలో ఉన్న వేశ్యను చూపిస్తాడు. ఆమె అతన్ని తన గదికి తీసుకెళ్ళి, బట్టలిప్పుకొని పక్కన కూర్చొంటుంది. అతను ఆమె వక్షోజం తాకుతాడు. అతని ముఖం మీద పాలు చిమ్ముతాయి. ఆమె అతనికి క్షమాపణ చెప్పి, పరదా వెనుక ఏడుస్తున్న చంటివాడికి పాలు కుడుపుతుంది. అతను తన జేబులోని డబ్బంతా తీసి ఆమె చేతిలో కుక్కి, పడివడిగా బయటపడతాడు. బయట ఉన్న రిక్షావాడు "వెళ్లొద్దు సాబ్! నా భార్య మొండి ముండ సాబ్, నేను సర్ది చెబుతాన్ సాబ్! అని ప్రాధేయపడతాడు.

"నేనెవరి దగ్గర భిక్షం తీసుకొను" అని బయటికి వచ్చిన షరీఫా క్రోధంగా కేకలేస్తుంది. ఆ ఇచ్చిన డబ్బు తనకు కాదని, 'చంటి బాబుకు కానుక' అని చెప్పి విటుడు చీకటిలో మాయమవుతాడు. చిన్న కథలో ఒక పూర్తి జీవితాన్ని చిత్రించిన తీరు ఒక అద్భుతమైతే, ఒక మలుపులో ఉత్కంఠభరితంగా రాయడం మరో ఎత్తు. బీదరికం, ఆకలి, చెప్పకుండానే చెప్పడం,

సెక్స్ కథలా నడిపించి దాన్ని మాతృత్వంలోకి మళ్లించడం, భర్త అనుమతితో వ్యభిచరించి డబ్బు గడిస్తున్న స్త్రీకి కూడా ఒక నీతి ఉండడం, చివరగా వారి పరిస్థితి అర్థం చేసుకుని ఆ విటుడు డబ్బిచ్చి చంటి బాలుడికి కానుక అనడం వల్ల, రచయిత ఉదాత్తంగా హుందాగా కథను ముగించినట్లయ్యింది.

ఇది హైదరాబాద్ పాతబస్తీలోని సందుల్లోంచి తీసుకున్న ఇతివృత్తమైనా ఇందులో విశ్వజనీనత ఉంది. మానవ జీవితంలోని దైన్యం, విషాదం ఉన్నాయి. మనం మనుషులమని గర్వంగా చెప్పుకోగలిగే అంశమూ ఉంది. ఇలాంటివి పరిణతి చెందిన కథకులు మాత్రమే రాయగలరు. హైదరాబాద్ సాంస్కృతిక చిహ్నంగా 'చార్మినార్' నిలబడితే, కేశవస్వామి కథల సంపుటి "చార్మినార్" కూడా అలాగే నిలబడింది. ఇందులో హైదరాబాద్ తెలుగు భాష ఒక మినార్, సంస్కృతి ఒక మినార్, రాజకీయ నేపథ్యం ఒక మినార్ అయితే, సామాజికాంశాలు మరో మినార్. ఈ విధంగా నాలుగు మినార్లతో కూడినదే నెల్లూరి కేశవస్వామి – చార్మినార్.

ఒక చారిత్రక నేపథ్యాన్ని ఒక సాంస్కృతిక నేపథ్యాన్ని తన కథల్లో నిక్షిప్తం చేస్తూనే ఒక మహా రచయిత ఎదగాల్సిన స్థాయికి ఎదిగారు నెల్లూరి కేశవస్వామి.

కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన 1946–51 మధ్య అర్థ దశాబ్ద కాలం పాటు తెలంగాణ రైతులు సాయుధులై దోపిడి వర్గాలపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటులో కవులు, రచయితలు, కళాకారులు ఎంతోమంది భాగస్వామ్యులయ్యారు. యాదగిరి, సుద్దాల, తిరునగరి, నాజర్, సుంకర, వాసిరెడ్డి, కాళోజీ, దాశరథి, కుందుర్తి, సోమసుందర్, గంగినేని వంటి కవులు తమ అక్షరాయుధాలతో ముందు నిలిచారు. తెలంగాణ పోరాటం ప్రారంభమైన ఒక సంవత్సరానికి బొల్లిముంత శివరామకృష్ణ "మృత్యుంజయులు" నవల 1947 అక్టోబర్ 25న విడుదల చేశారు. ఒక రకంగా కవులకంటే కూడా తన నవలాయుధంలో ఆయన ముందు నిలిచారు. ఆ తర్వాత గంగినేని "ఎర్రజెండాలు", తిరునగరి "సంగం", వట్టికోట "ప్రజల మనిషి", "గంగు", మహీధర రామ్మోహనరావు "ఓనమాలు", "మృత్యుసీడల్లో" వంటి నవలలు వెలువడ్డాయి. అయితే అవన్నీ పోరాటం విరమించిన తర్వాత వెలువడ్డాయి. పోరాట విరమణకు ముందు, బొల్లిముంత నవల తర్వాత వెలువడింది లక్ష్మీకాంత మోహన్ "సింహగర్జన."

దేశంలోని ఇతర ప్రాంతాల్లో రైతులు పంటలు పండించుకున్నందుకు శిస్తులు కడతారు. కాని నాటి తెలంగాణలో శిస్తులు కట్టడానికి మాత్రమే పంటలు పండించాల్సి వచ్చేది. అంతటి దుర్భర స్థితిని సహజంగా చిత్రించింది "మృత్యుంజయులు" నవల. చచ్చేవాడికి రెండు చావులు

ఉండవని, దినదిన గండంగా ప్రతిరోజు చస్తూ బతకడం కన్నా, భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాటంలో చావడమే మేలని జెండా పట్టి పోరాటంలో నేలకొరిగిన వీరులే ఈ మృత్యుంజయులు. నవలలోని ముఖ్య పాత్రలన్నీ పోరాటంలో మరణిస్తాయి. అంటే వీర మరణం పొందుతాయి. నవలా రచయిత దృష్టిలో వారంతా చావును జయించినవారు, మృత్యుంజయులు అని అర్థం. తెలంగాణ పోరాట కాలంలో వెలువడిన తొలి నవలగా, ఒక చారిత్రక అవసరాన్ని గుర్తించి, ప్రజా పోరాటాన్ని నమోదు చేసిన నవలగా తెలుగు సాహిత్యంలో "మృత్యుంజయులు" నవలకు సుస్థిర స్థానం ఉంటుంది.

కమ్యూనిస్టు కార్యకర్తగా ఆయన తన అనుభవంలోకి వచ్చిన విషయాల్ని కథలుగా మలచడం తప్ప, పనికట్టుకుని కథలు రాయాలని రాయలేదు. వ్యవసాయ కూలీలు, ఇతర నిరుపేదలపై దృష్టి సారించి, కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రతిబింబిస్తూ రాసేవారు బొల్లిముంత శివరామకృష్ణ.

"జీవన పోరాటాలు" నవలా రచయిత లెక్కల మల్లారెడ్డి. ఇందులో ఆయన పుట్టి పెరిగిన సైదాపురం, యాదగిరిగుట్ట (నల్లగొండ జిల్లా) ప్రాంతాలు కనిపిస్తాయి. రాయగిరి, భువనగిరి గుట్టల్లో ఘోషిస్తున్న జనఘోష వినిపిస్తుంది. ముఖ్యంగా 1940 నుండి ఇప్పటిదాక ఏడు దశాబ్దాల తెలంగాణ జీవితం కళ్ళముందు కదలాడుతుంది.

నిజాం పాలనలో రజాకార్ల అఘాయిత్యాలు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు రాకపోవడం, నిజాం గుప్పిట్లో ఉండిపోవడం, సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య జరిపించి నిజాంను లొంగదీసుకోవడం, అప్పటికే కొంతమంది ఆంధ్ర ప్రాంతానికి వలసవెళ్ళి స్థిరపడటం, భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటం, ఆంధ్రప్రదేశ్ అవతరణ, పెద్ద మనుషుల ఒప్పందం, మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజాసమితి ఏర్పాటు, ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకుని అసెంబ్లీ సీట్లన్నీ ప్రజాసమితి గెల్చుకోవడం, అది కాంగ్రెస్లో విలీనం కావడం, పెట్టుబడిదారులు నక్సలైట్ల మధ్య ఘర్షణ, అధికారుల్ని కిడ్నాప్ చేయడం, మళ్లీ తర్వాతి కాలంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం, మళ్ళీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, యువకుల ఆత్మాహుతి అన్నీ అలవోకగా ఈ నవలలో (జీవన పోరాటాలు) కదిలిపోయాయి.

చరిత్ర నేపథ్యంలో నడిచే ఈ కథలో ఒక ప్రవాహ గుణముంది. నవల చదివే పాఠకులు సీనియర్ సిటిజన్లు అయితే వారు తమ బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటారు. నేటి తరం యువ

పాఠకులైతే తమ తాత తండ్రుల జీవితాల్ని ఇందులో చూసుకుంటారు. పాత తరానికి ఇదొక జ్ఞాపకం. నేటి తరానికి ఇదొక చరిత్ర.

"గజల్" కవిత చెప్పడంలో మిర్జా అసదుల్లాఖాన్ గాలిబ్ అగ్రగణ్యుడు. మానవ జీవితాన్ని సమగ్రంగా తన కావ్యదర్పణంలో ప్రతిఫలింపజేశాడు. తొలి రోజుల్లో గాలిబ్ తన రచనలను 'అసర్' అనే పేరుతో ప్రకటించేవాడు. పద్నాలుగేళ్లకే గాలిబ్ ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించి, సాహితీ సామ్రాజ్యంలో అడుగుపెట్టాడు. అప్పటి నుండి అనర్గళంగా కవితా వాహిని అతని కలం వెంట పరవళ్ళు తొక్కింది.

సంగీతకారుడు సంగీత స్రవంతిలో లీనమై వాయిద్యాలు వాయిస్తున్నప్పుడు చేతులు రక్తసిక్తమైన సంఘటనలు మనం విన్నాం. కానీ, బాధను రాస్తూ రాస్తూ చేతి వేళ్ళు రక్తమయం చేసుకుని ఆమెకు (అతని ప్రేయసికి) చూయించాలనుకుంటాడు గాలిబ్. నాశనంలో కూడా సౌఖ్యమున్నదని ఓ గజల్ చెప్తాడు. గోరు ఊడిపోవడం వినాశనం. అది ఊడిపోక అలాగే ఉంటే బాధ. ఊడిపోతేనే కదా హాయి. అలాగే మృత్యువులో కూడా రుచి ఉండదంటాడు. ఎంత గొప్ప భావన? అసలు మృత్యువు లేకపోతే జీవితపు విలువ మనిషికి తెలియదు. మృత్యువనేది ఒకటున్నదని తెలిసినప్పుడే మనిషి తన బతుకును బాగుపరుచుకోవడం కోసం ప్రయత్నిస్తాడు.

**"క్యాతంగ్ హం సితమ్ జద్గాంకా జహాఁ హై**
**జిస్మ్ కె ఎక్ బై జెయెమోర్ అస్మాహై"**

వేదనతో రగిలిపోతున్న గాలిబ్కు ఈ ధరణి ఎంత స్వల్పంగా కనిపిస్తుందో చూడండి. ఆకాశమే చీమ గుడ్డంతా కనిపిస్తుంటే ఇక ఈ భూమండలం సంగతి యేం చెప్పాలి? అన్నది పై గజల్ భావం!

గజల్ అంటే అసలు సిసలైన శృంగారాత్మక భావన. గజల్ రాసేవాడికి కల్పనా శక్తి, అనుభూతులు, ఊహలు కావలసి వస్తాయి. వాటికి కొంత రహస్య భావనను, మరికొంత వ్యంగ్యాన్ని, శృంగారాన్ని జోడించి జీవం పోస్తాడు. గజల్ సంప్రదాయంలో రెండు తరగతులున్నాయి. "మజాజీ", "హకీకి." నాయికా నాయకులు వ్యక్తం చేసుకునే ప్రేమ కవిత్వం 'మజాజీ' అయితే, దైవ భావనను వ్యక్తం చేసేది హకీకి. గాలిబ్తో సహా ఉర్దూ గజల్ రాసిన కవులందరూ 'మజాజీ' వైపు మొగ్గు చూపారు. అక్కడక్కడ 'హకీకి' వెల్లడించారు. చాలా నిశితంగా చూస్తే గాలిబ్ కవిత్వంలో ఆంతరంగికానుభూతి ఉంటుంది.

గాలిబ్ గజల్లోంచి కొన్ని మంచి షేర్లను ఎన్నుకుని తెలుగులోకి అనువదించిన మహాకవి దాశరథి. గాలిబ్ కవిత్వతత్వాన్ని తెలుగువారికి అందించిన ఘనత ఆయనదే. ఆయన తెలుగు

అనువాదాలకు 'బాపు' వేసిన రేఖాచిత్రాలు సార్థకమయ్యాయి. మిర్జా గాలిబ్ వాడే సాధారణ శబ్దాలు సాధారణ అర్థాన్ని దాటి విస్తృతార్థాన్నిస్తాయి. "కరెన్సీ నోటు సాధారణమైన కాగితంతో చేయబడిందైనా దాని విలువ సాధారణ కాగితం కన్నా అనేక రెట్లు అధికం – అలాగే, గాలిబ్ కవిత్వం"[17] అని చమత్కరించారు దాశరథి!

భారత ప్రభుత్వం గాలిబ్ను "విశ్వకవి"గా ప్రకటిస్తూ ఒక మంచి స్మారక చిహ్నం నిర్మించింది. తాను ఏర్పాటు చేసుకున్న కొత్త కవితా రీతులతో తనకు తానై నిర్భయంగా నిలిచిన మహాకవి గాలిబ్. 'గాలిబ్ చరిత్ర' రాసిన 'అలీ' వంటి రచయిత ఉత్తమ శ్రేణి రచయితగా సాహిత్యరంగంలో నిలిచిపోయాడు.

## 2.6. సైన్స్ రచనలు:

### 2.6.1. మూఢనమ్మకాలు – సైన్స్ (1991):

ప్రతి సమాజానికి ఒక ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయి. ఆ ప్రత్యేకత సమాజంలోని మనుషుల అవగాహన స్థాయిని బట్టి, మూఢనమ్మకాలను బట్టి, వాళ్ళు జీవించే కాలాన్ని బట్టి, ప్రకృతి ధర్మాలను, వాళ్ళు అన్వయించుకునే తీరును బట్టి ఉంటాయి. ఆదిమానవుడికి సూర్యోదయం, సూర్యాస్తమయం అంతుపట్టని రహస్యాలుగా ఉండేవి. పట్టపగలు సూర్యగ్రహణం సృష్టించే తాత్కాలిక అంధకారాన్ని చూసి, ప్రళయం వచ్చిందని బెంబేలు పడేవాడు. ప్రశ్నించడం తెలియని రోజుల్లో, శాస్త్ర విజ్ఞానం వికసించని రోజుల్లో మనిషి తనకు అర్థమయ్యీ అర్థంకాని రీతిలో కొన్ని జీవితపు విలువల్ని రూపొందించుకున్నాడు. కాలం గడుస్తున్న కొద్దీ మనిషి తనను తాను చూసుకోవడం మొదలుపెట్టాడు. ప్రకృతిని అర్థం చేసుకోవడం మొదలుపెట్టాడు. ఉత్సుకత మొదలవడంతో ప్రశ్నించడం మొదలుపెట్టాడు. ఆ విధంగా ప్రశ్నించడంతోనే విజ్ఞాన శాస్త్ర పురోగమనం జరుగుతూ వస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో అనూహ్యమైన ప్రగతి గత రెండు శతాబ్దాలలో జరుగుతూ వచ్చిందని మనందరికి తెలుసు. అంతులేని రహస్యాలుగా భ్రమించిన ఎన్నో విషయాల్ని విజ్ఞాన శాస్త్రం తేటతెల్లం చేసింది.

ప్రపంచంలోని ఎన్నో ఇతర సమాజాల్లాగనే మన భారతీయ సమాజం కూడా ఎన్నో నమ్మకాలతో, సంస్కృతీ సంప్రదాయాలతో విలసిల్లింది. మనది అతిపురాతనమైన నాగరికత. మన పూర్వీకులు అన్ని రంగాలలో అమోఘమైన ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. నిజమే! అయితే అందులో కొంత స్వార్థ చింతన చేరింది. అశాస్త్రీయమైన సిద్ధాంతాలు ఎక్కువగా

[17] దేవరాజు మహారాజు, కొన్ని కలలు – కొన్ని సమయాలు, పుట–90.

రూపుదిద్దుకున్నాయి. సమాజ పురోగమనాన్ని దారి మళ్లించాయి. మూఢనమ్మకాలు విశ్వరూపం దాల్చాయి. కుల వ్యవస్థ సమాజాన్ని ముక్కలు చేసింది. అందువల్ల ప్రపంచ వైజ్ఞానిక ప్రగతి ఒక దిశలో కొనసాగుతూ ఉంటే, మన భారతీయ సమాజం మరో దిశకు ప్రయాణించింది. మనం మన సంస్కృతీ నాగరికతల గూర్చి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా, చాలా విషయాల్లో చాలా వెనకబడి ఉన్నామన్న సంగతి తప్పక ఒప్పుకోవాల్సిందే. రక్తకణ నిర్మాణం, జన్యు సంబంధమైన వివరాలు క్షుణ్ణంగా తెల్సిన తర్వాత కూడా కులాలు, మతాలు వర్థిల్లుతూ దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలపై బలమైన ప్రభావం చూపుతున్నాయంటే, మొత్తంగా సమాజాన్నే ఛిన్నాభిన్నం చేస్తూన్నాయంటే దాని అర్థం ఏమిటి?

"అన్నీ మన వేదాల్లో ఉన్నాయట!" అని పలికే వాళ్ళున్నారు. "వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు వేదాల్లో, పురాణాల్లో వైజ్ఞానిక విషయాలన్నీ రాసి పెట్టారు" అని చెప్పేవాళ్ళున్నారు. మూఢ నమ్మకాలకు, మత మౌఢ్యానికి 'శాస్త్రీయ' వివరణలు ఇవ్వచూపే మహాత్ములున్నారు. కొన్ని శతాబ్దాల క్రితమే మనకు విమానాలున్నాయని (అందులో తాము ప్రయాణించి వచ్చిన వాళ్ళలాగా) నొక్కి వక్కాణించే వాళ్ళున్నారు. ఇలాంటి వారితో సమాజానికి జరిగేది కీడే తప్ప, మేలు కాదు. ఇలాంటి కీడు మన సమాజానికి శతాబ్దాలుగా జరుగుతూ వస్తోంది. వేదాల్ని కూలంకషంగా అధ్యయనం చేసినవారు చెబుతున్న యథార్థ మేమంటే – వేదాల్లో కనీసం నీటి యొక్క విశ్లేషణ (Water Analysis) కూడా లేదు. హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్–డై–ఆక్సైడ్ల ప్రసక్తి లేదు. ఆ పేర్లు కాకపోయినా వాటికి సమానార్థకంగా వాడిన ఇతర పేర్లేవీ లేవు! ఇలాంటి అతి ప్రాథమికమైన రసాయనిక శాస్త్ర వివరణలే లేనప్పుడు ఇక విమానాల తయారీ ఏముంటుంది? బెంగుళూరు విశ్వవిద్యాలయానికి వైస్–ఛాన్సలర్గా పని చేసిన ప్రొఫెసర్ హెచ్. నరసింహయ్య లోగడ ఇలాంటి ఎన్నో ప్రశ్నల్ని లేవనెత్తారు. సరైన దాఖలాలు చూపగల వాళ్ళను ముందుకు రమ్మనమని పిలుపునిచ్చారు కూడా!

ఆధ్యాత్మిక, తాత్విక, ధార్మిక, సాహిత్య, సంగీత, కళారంగాలలో మనం ప్రపంచానికి వెలుగును చూపామని వెన్ను చరచుకుంటు ఉంటాం. కొంతవరకు నిజమే కావచ్చు. అయినా జపాన్ వంటి ఒక చిన్న దేశం సాధించిన పురోగతి ముందు మనం నిలబడగలుగుతున్నామా? మన సమాజంలో శాస్త్ర దృక్పథం గల జనాభా ఎంత? మన ప్రార్థనల్ని, యాగాల్ని, బలుల్ని విమర్శించే ప్రపంచ మేధావులకు మనం ఇవ్వగల సమాధానమేమిటి? బ్రిటన్లోని లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ లార్డ్ ఫన్నర్ బ్రూక్లే ఒక ప్రపంచ మహాసభలో అభివృద్ధి చెందుతున్న ఆసియా దేశాలను

ఉద్దేశించి బాహాటంగా విమర్శించలేదా? "మీరు ప్రార్థనలు చేస్తూ, పూజలు చేస్తూ, తీర్థయాత్రలకు తిరుగుతూ సమాధిలో ఉంటూ కాలాన్ని వృథా చేస్తూ — మేము చమటోడ్చి తాయారుచేసిన మా ఉత్పత్తుల్లో మీకు భాగం ఇస్తూ ఉండాలని ఎట్లా కోరుకుంటున్నారయ్యా" అని సూటిగా స్పష్టంగా ప్రశ్నించినప్పుడు మన దగ్గర సమాధానం లేకపోయిందే! దేవుడి ప్రసాదాలతో కడుపు నిండిన దాఖలాలు, బాబాల మహిమలతో పంటలు పండిన దాఖలాలు ఇంతవరకు లేవు. వ్యవసాయం నుంచి అంతరిక్షం దాకా ఆధునిక జీవితమంతా సైన్స్ పెట్టిన భిక్షే.

'చదువురాని నిరక్షరాస్యులు మూఢనమ్మకాలలో మూలుగుతుంటారని' — ఒక అభిప్రాయం ఉంది. మరి వారిని అలా తయారుచేసిన పండిత శిఖామణులైన అజ్ఞానుల మాటేమిటి? ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ చెప్పుకుందాం. వరాహమిహిరుని "బృహత్ సంహిత"లో ఇలా ఉందని పరిశోధకులు చెబుతున్నారు. "పురుషుడి జననాంగం చిన్నదిగా ఉంటే పిల్లలు పుట్టరు. కానీ ధనవంతుడవుతాడు! పెద్దదిగా ఉంటే, పేదవాడవుతాడు! ఎడమవైపు వంగి ఉంటే పిల్లలు పుట్టరు. డబ్బు ఉండదు. కుడివైపు వంగి ఉంటే కొడుకులు పుడతారు" అలాగే పిల్లి ఎదురు కాకూడదనడం, తుమ్మినప్పుడు బయలుదేరకూడదనడం, భర్త బయటకు వెళ్ళిన తర్వాత భార్య తలంటుకోకూడదనడం, బల్లి వంటిపై పడకూడదనడం, ప్రొద్దున్నే ఎడమవైపు నుండి లేవకూడదనడం వంటి నమ్మకాలు ఎన్నెన్నో రోజు చూస్తూనే ఉన్నాం.

హాస్యాస్పదమైన నమ్మకాలు పాశ్చాత్య సమాజాల్లోనూ ఉన్నాయి. వారికి 13వ నెంబరు మంచిది కాదట. అంటే 26, 52 వంటివి రెండింతలుగా మంచివి కాకూడదు కదా! మనకిక్కడ కాకి అరిస్తే చుట్టాలోస్తారట! అక్కడ వారికి పాత్రలు తుడుస్తున్న గుడ్డ చేతిలోంచి జారిపడితే వస్తారట! ఒక చిన్న పెట్టెలో మత గురువు తల వెంట్రుకలు కాని, అస్థికలు కాని ఉంచి పూజిస్తే మేలు జరుగుతుందట! ఈ విధంగా ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇంతెందుకు మనదేశంలో ఒక మతం వారి పంచాంగం ప్రకారం తిథివార నక్షత్రాలు బాగు లేనప్పుడే మరో మతం వారు దాన్నే పవిత్రమైన దినంగా భావించి పెళ్ళిళ్ళు చేసుకుంటూ ఉంటారు కదా! ఇందులో ఏది ప్రామాణికం? భారతీయ సమాజంలో ఇలాంటి వివాదాస్పదమైన అంశాలెన్ని?

ఆల్బర్ట్ ఐన్స్టీయిన్ ఇలా అన్నారు — "వైజ్ఞానిక పరిశోధనలు మూఢనమ్మకాల్ని తగ్గించాలి. ప్రజలు కారణాల్ని అన్వేషించుకునే దిశలో ఆలోచించగలగాలి. హేతువాదపు నేపథ్యంలో ఎదిగిన మేథోసంపత్తి — ఉన్నత ప్రమాణాలు గల వైజ్ఞానిక దృక్పథాన్ని కలిగించాలి!" అని.

పాశ్చాత్య దేశాల్లో మూఢనమ్మకాలు లేవని కాదు. మన దేశంలో శాస్త్రీయ పరిశోధనలు జరగడం లేదనీ కాదు. కాకపోతే వాళ్ళు వాటిని అధిగమించి, ప్రపంచ వైజ్ఞానిక ప్రగతికి కృషి చేసింది ఎంతో ఘనంగా కనిపిస్తూ ఉంటే, మనం మన ఘనకీర్తిని చాటుకోవడం మాత్రమే ఘనంగా కనిపిస్తోంది.

## 2.6.2. భారతీయ వైజ్ఞానిక వికాసం (2006):

వైజ్ఞానిక రంగంలో విశిష్ట కృషి చేసి, సమాజ సంక్షేమానికి తోడ్పడిన నలభై మందికి పైగా భారతీయ శాస్త్రజ్ఞుల వైజ్ఞానిక కృషి, జీవిత చిత్రణ దీనిలో ఉన్నాయి. లేజర్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ వంటి అత్యాధునిక విజ్ఞానంలో ఉరకలు వేస్తున్న నేటి వైద్య రంగానికి ప్రాతిపదిక నేర్పించిన మన ప్రాచీన వైద్య శాస్త్ర మూలాలను రచయిత ప్రస్తావించారు. శస్త్ర చికిత్సలకు పునాది వేసిన సుశ్రుతుడు, ఆయుర్వేదానికి ఆద్యుడైన చరకుడు, అనితర సాధ్యమైన వారి కృషిని సులువైన పద్ధతిలో మనసుకు హత్తుకునేలా ఒక కథలాగా చెప్పారు.

ప్రాచీనుల నుండి ఆధునికుల వరకూ, ఖగోళం నుండి పరమాణు విజ్ఞానం వరకు గల అన్ని శాఖల గురించి రచయిత పేర్కొన్నారు. కఠోరమైన బీదరికాన్ని, అనారోగ్యాన్ని లెక్క చేయకుండా "రామానుజన్ నోట్ బుక్స్" అందించిన మహా మేధావి రామానుజన్ జీవితం నేటికి స్ఫూర్తిదాయకం. ఆధునిక గణిత శాస్త్రవేత్త హరీష్ చంద్ర కృషి వల్ల రూపొందిన 'ఇన్ఫినిట్ డైమెన్షనల్ గ్రూప్ రెప్రజెంటేషన్ థియరీ' నేడు గణిత శాస్త్రంలో ప్రత్యేక శాఖగా అభివృద్ధి చెందడాన్ని కూడా రచయిత వదల్లేదు. సాంఖ్యాక శాస్త్రానికొక స్థాయిని ప్రాశస్త్యాన్నీ తీసుకొచ్చిన ప్రశాంత చంద్ర మహలనోబిస్ నుండి ఇటీవలి సి.ఆర్. రావు వరకూ సాంఖ్యాక శాస్త్ర పురోగతిని వివరించారు. ఖగోళ శాస్త్ర పితామహుడు అనదగ్గ ఆర్యభట్ట నుండి నార్లేకర్ వరకూ ఆ రంగంలో నిష్ణాతులైన వారి జీవిత చరిత్రలను గురించి సమగ్రంగా వివరించారు.

భారత, వైజ్ఞానిక రంగంలో మహిళలు అనే ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చారు. తొలి ఖగోళ శాస్త్రజ్ఞురాలు ఖన జీవిత విశేషాలు, నక్షత్రాల సంఖ్య లెక్కగట్టడంలో ఆమె చూపిన నేర్పు, విక్రమాదిత్యుని ఆస్థానంలో అప్పటి వరకూ ఉన్న 'నవరత్నాలను' ఆమెతో కలిసి 'దశరత్నాలుగా' మార్చుకోవడం ఆకట్టుకునే విధంగా చెప్పారు.

జంతువుల్లాగే మొక్కలు కూడా స్పందించగలవని చెప్పి, ప్రపంచ ఖ్యాతి పొందిన జగదీశ్ చంద్రబోస్ నిజానికి భౌతిక శాస్త్రవేత్త. భౌతిక శాస్త్రవేత్తగా ఆయన చేసిన పరిశోధనలు అసాధారణమైనవి. వైర్లెస్ ద్వారా సమాచారాన్ని పంపే పద్ధతికి శ్రీకారం చుట్టినాడు. మార్కోనికి,

బోసుకి మధ్య ఎంతో తేడా ఉంది. బోస్ విజ్ఞానం ప్రజలందరి సొత్తని నమ్మినవాడు. మార్కోని దీనితో వ్యాపారం చేసినవాడు. ఇలాంటి ఎన్నెన్నో విశేషాలు 'భారతీయ వైజ్ఞానిక వికాసం'లో కన్పిస్తాయి. ఇలా శాస్త్రజ్ఞుల జీవితాల్లోంచి కేవలం శాస్త్ర విషయాలే కాకుండా, జీవితంలో వారు పాటించిన విలువలు, నిబద్ధత, త్యాగనిరతిని ప్రస్తావించి, భావి తరాలు వారినుండి ఏం నేర్చుకోవాలో తెలియజేయడం జరిగింది.

కేవలం శాస్త్రవేత్తగానే కాక, తన సర్వస్వాన్ని దేశానికి అర్పించిన త్యాగశీలి, ప్రముఖ రసాయన శాస్త్రవేత్త ప్రఫుల్ల చంద్రరాయ్. 1986లోనే మెర్క్యురస్ నైట్రేట్ గురించి పరిశోధించి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. మహాత్మ గాంధీనే ఆశ్చర్యపరచిన తొలి తరం పి.సి.రే. నుండి నేటి సియన్నార్ రావు వరకూ ఎందరో శాస్త్రజ్ఞుల జీవితాల్లోని ఉజ్జ్వల ఘట్టాలను స్ఫూర్తిదాయకంగా వివరించారు. భారతదేశంలో చేసిన పరిశోధనలకు నోబెల్ పురస్కారాన్ని అందుకున్న తొలి శాస్త్రవేత్త సి.వి. రామన్. ఆయన జీవితంలో అంతగా వెలుగు చూడని పలు అంశాలు కనబడతాయి. సంగీతం పట్ల ఆయన ప్రేమ, ధ్వని తరంగాలను విశ్లేషించడానికి ఎలా ప్రేరేపించిందో వెల్లడించడం, మొన్నటి సి.వి. రామన్ నుంచి నిన్నటి రాజా రామన్న వరకూ వారి విజయ రహస్యాలను గురించి వివరించారు.

మన దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చడానికి ముందే, దేశానికవసరమైన ప్రయోగశాలలకు బ్లూప్రింటునిచ్చిన వైజ్ఞానిక శిల్పి మేఘనాథ్ సాహా అయితే, భారతీయ పరిశోధనలకు దిశా నిర్దేశం చేసినవాడు శాంతి స్వరూప్ భట్నాగర్. ఈనాడు దేశం గర్వించదగిన సి.ఎస్.ఐ.ఆర్. (CSIR) పరిశోధనా సంస్థలకు రూపశిల్పి ఆయనే. భట్నాగర్ సమయ స్ఫూర్తి, సమస్యల పరిష్కారానికి సైన్సును ఎంత సులువుగా వాడుకోవచ్చో చూపించిన వాడాయన. ఆయిలు కంపెనీ వారి తవ్వకాల్లో ఉప్పునీరు, బంక మన్నుతో కలిసి సిమెంటులా బిగుసుకుపోతున్న సమస్యకు ఆయనిచ్చిన పరిష్కారం ఇందుకు మంచి ఉదాహరణ.

అణు శక్తి రంగంలో ప్రపంచ దేశాలకు ధీటుగా భారతదేశాన్ని నిలబెట్టి, పరమాణు విజ్ఞానాన్ని శాంతియుత ప్రయోజనాలకు ఎలా వాడుకోవాలో చూపించిన ఘనుడు హోమీ జహంగీర్ బాబా. ఆయన ముందుచూపు, దార్శనికత నేడు మనం ఆ రంగంలో స్వావలంబన సాధించడానికి దోహదం చేశాయి. ఆధునిక వైజ్ఞానికుల్లో పేరెన్నిక గన్న హరగోవింద్ ఖురానా నుండి జీవశాస్త్రంలో నోబెల్ బహుమతి తృటిలో తప్పిపోయిన జి.ఎన్. రామచంద్రన్ వరకూ ఎందరో శాస్త్రజ్ఞుల వైజ్ఞానిక కృషి "భారతీయ వైజ్ఞానిక వికాసం"లో కనిపిస్తుంది.

ప్రయోగశాలల్లో విజయాలు సాధించడం ఒక ఎత్తయితే దానిని ప్రజల వద్దకు చేర్చటం, వారిలో అవగాహన కల్పించడం మరింత క్లిష్ట సమస్య. జన సామాన్యానికి చిన్న చిన్న ప్రయోగాలు చేసి చూపడం ద్వారా సైన్సు ప్రచారానికి శ్రీకారం చుట్టినవాడు రుచీరాం సాహ్నీ. ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కలిగించడం ఎంత అవసరమో గుర్తించి, ఆచరించి చూపినవాడు సాహ్నీ. ఈ విధంగా స్థూలంగా "భారతీయ వైజ్ఞానిక వికాస" క్రమంలో శాస్త్రజ్ఞుల కృషిని వివరించారు.

### 2.6.3. విజ్ఞానపథంలో విజయ ఘట్టాలు (2010):

పరిణామ క్రమంలో మనిషి ఎన్నో విజయాలను సాధించాడు. విశ్వ రహస్యాలను తెలుసుకున్నాడు. సాంకేతిక రంగంలో కొన్ని విషయాలు యాదృచ్ఛికంగా, మరికొన్ని జిజ్ఞాసతో కనుగొన్నాడు. కొందరు తమ కోసం మరికొందరు సమాజ సంక్షేమం కోసం పరిశోధనలు చేశారు. కొందరు శాస్త్రవేత్తలు మధ్యలో వదిలేసిన పరిశోధనలను, ఆలోచనలను తరువాతి తరం వారు కొనసాగించి ఫలితాలు సాధించారు. ఒక అంశంపై పరిశోధన చేసి, మరెన్నో అంశాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో కొందరు మేధావులు, శాస్త్రవేత్తలు కనుగొన్న వాస్తవాలు మత విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉండటంలో మతాధిపతులు (మఠాధిపతులు) వారిని బహిష్కరించారు. సజీవంగా దహనం చేశారు. గెలిలీయో అంతటి వాడిని కూడా చిత్రహింసలకు గురి చేశారు. దానితో శాస్త్ర విజ్ఞాన ప్రగతి వందల సంవత్సరాలు కుంటుపడింది. ఈ వైనాలను "విజ్ఞాన పథంలో విజయ ఘట్టాలు" అనే వ్యాసంలో దేవరాజు మహారాజు చక్కగా వివరించారు. క్రీస్తు పూర్వం నాలుగు వేల సంవత్సరాల నుంచి సుమేరియన్లు, బాబిలోనియన్లు, ఎసైరియన్లు, గ్రీకులు, ఈజిప్షియన్లు, ఫొనిసీయన్లు ఈ కృషిలో ప్రధాన పాత్ర పోషించారు. మనిషి మొదట మాట్లాడటం నేర్చుకున్నాడు. తరువాత లెక్కగట్టడం నేర్చుకున్నాడు. మాటకు లిపి తోడుచేసుకున్న మనిషి, మొదట రాగిని, తరువాత ఇనుమును కనుగొన్నాడు. భాషలు, అనువాదాలతో విజ్ఞానం విస్తరించింది. విజ్ఞాన ఫలితాలను వినియోగించుకున్న జాతులే నాగరిక జాతులుగా వెలుగొందాయి. మానవ జీవనయానం ఎలా సాగుతూ వచ్చిందో "విజ్ఞాన పథంలో విజయ ఘట్టాలు" అనే వ్యాసంలో దేవరాజు మహారాజు తెలియజేశారు.

"అసలు లెక్కలనేవి లేకపోతే!" అనే వ్యాసంలో మొట్టమొదట మనిషి సాధించినవి రెండే రెండు విజయాలు. 1) మాట్లాడటం, 2) లెక్కలు కట్టడం. ఒక భాష ఏర్పరచుకుని, మాట్లాడుకోవడం సాధ్యమైన చాలా కాలానికి మనిషి అంకెలు ఏర్పాటు చేసుకున్నాడు. మాటలతో

సామాజిక జీవనంలోని మానవ సంబంధాలు బలపడ్డాయి. అంకెలతో మనిషి మేధస్సు దినదినాభివృద్ధి చెందింది. చిన్న చిన్న సమూహాలు పెద్దవయ్యాయి.

మాట్లాడే భాషకు లిపి తయారైంది. రాయడం వచ్చింది. రాత వల్ల మానవ సంబంధాలు దూర దూర ప్రాంతాలకు ప్రాకిపోయాయి. రాత వల్ల మానవ విజ్ఞానం గ్రంథస్థమవుతూ వచ్చింది. చిన్న సమూహాలు పెద్దవయ్యాయి. పల్లెలు పట్టణాలయ్యాయి. నాగరికత, సభ్యత, సంస్కృతి, ఆచారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు మనిషి జీవితంలో అంతర్భాగాలయ్యాయి.

మనం ఈనాడు వాడుతున్న "సైన్స్" అనే దానికి పునాదులు తవ్వినవారు గ్రీకులు. వారికి స్ఫూర్తిని ఇచ్చినవారు ఈజిప్షియన్లు. ఇంతకు సైన్స్ అంటే ఏమిటి? స్కూల్లో, కాలేజీలలో వినే సైన్స్ పాఠాలా? ఏదైన ఒక అంశాన్ని క్రమ పద్ధతిలో అధ్యయనం చేయడమా? అని ప్రశ్నలు వేసుకుంటే, క్రీ.పూ. ఈజిప్టియన్ల కాలం నుండి నేటి వరకు మనిషి సాధిస్తున్న విజయాలన్నీ సైన్సే. శాటిలైట్, కంప్యూటర్ మాత్రమే సైన్స్ కాదు. మనం గాలి ఎలా పీల్చుకుంటున్నాం? ఎలా బతుకుతున్నాం? ఎలా ఆలోచిస్తున్నాం? కవితో, కథో ఎలా రాస్తున్నాం? లోతుగా తెలుసుకుంటే అంతా సైన్సే. తెల్ల కాగితాలు, ఇంకు, పెన్నూ అన్నీ సైన్స్ సాధించిన వస్తువులే. ఆలోచిస్తే సైన్స్ కానిది ఏది లేదు. భూమి కొలుచుకోవడం సైన్సే. పళ్ళు బ్రష్ చేసుకోవడం సైన్సే. సంగీతం వినడం సైన్సే. సినిమా చూడడం సైన్సే లాంటి విషయాలను ఇందులో ప్రస్తావించారు రచయిత.

### 2.6.4. సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ (2015):

ప్రతి సమాజానికి ఒక ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయి. ఆ ప్రత్యేకత ఆ సమాజంలోని మనుషుల అవగాహన స్థాయిని బట్టి, నమ్మకాలను బట్టి, వాళ్లు జీవించే కాలాన్ని బట్టి, ప్రకృతి ధర్మాలను వాళ్లు అన్వయించుకునే తీరును బట్టి ఉంటాయి. ఆదిమానవుడికి సూర్యోదయం, సూర్యాస్తమయం అంతుపట్టని రహస్యాలుగా ఉండేవి. పట్టపగలు సూర్యగ్రహణం సృష్టించే తాత్కాలిక అంధకారాన్ని చూసి, ప్రళయం వచ్చిందని బెంబేలు పడేవాడు. ప్రశ్నించడం తెలియని రోజుల్లో, శాస్త్ర విజ్ఞానం వికసించని రోజుల్లో మనిషి తనకు అర్థమై, అర్థం కాని రీతిలో కొన్ని జీవితపు విలువల్ని రూపొందించుకున్నాడు. కాలం గడుస్తున్న కొద్ది మనిషి తనను తాను చూసుకోవడం మొదలుపెట్టాడు. ఉత్సుకత మొదలవడంతో ప్రశ్నించడం మొదలుపెట్టాడు. ఆ విధంగా ప్రశ్నించడంతోనే విజ్ఞాన శాస్త్ర పురోగమనం జరుగుతూ వస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో అనూహ్యమైన ప్రగతి గత రెండు శతాబ్దాలలో జరుగుతూ వచ్చిందని మనందరికీ

తెలుసు. అంతు తెలియని రహస్యాలుగా భ్రమించిన ఎన్నో విషయాల్ని విజ్ఞాన శాస్త్రం తేటతెల్లం చేసింది.

ప్రపంచంలోని ఎన్నో ఇతర సమాజాల్లాగానే మన భారతీయ సమాజం కూడా ఎన్నో నమ్మకాలతో, సంస్కృతి, సంప్రదాయాలతో విలసిల్లింది. మనది అతి పురాతనమైన నాగరికత. మన పూర్వీకులు అన్ని రంగాలలో అమోఘమైన ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. అయితే అందులో కొంత స్వార్థ చింతన చేరింది. అశాస్త్రీయమైన సిద్ధాంతాలు ఎక్కువగా రూపుదిద్దుకున్నాయి. సమాజ పురోగమనాన్ని దారి మళ్లించాయి. మూఢనమ్మకాలు విశ్వరూపం దాల్చాయి. కుల వ్యవస్థ సమాజాన్ని ముక్కలు చేసింది. అందువల్ల ప్రపంచ వైజ్ఞానిక ప్రగతి ఒక దిశలో కొనసాగుతూ ఉంటే, మన భారతీయ సమాజం మరో దిశకు ప్రయాణించింది. మనం మన సంస్కృతి, నాగరికతల గూర్చి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా చాలా విషయాల్లో చాలా వెనకబడి ఉన్నామన్న సంగతి తప్పక ఒప్పుకోవాల్సిందే. రక్త కణ నిర్మాణం, జన్యు సంబంధమైన వివరాలు క్షుణ్ణంగా తెలిసిన తర్వాత కూడా కులాలు, మతాలు, వర్ధిల్లుతూ దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలపై బలమైన ప్రభావం చూపుతున్నాయంటే, మొత్తానికి మొత్తంగా సమాజాన్నే చిన్నాభిన్నం చేస్తున్నాయంటే దాని అర్థం ఏమిటి?

'చదువురాని నిరక్షరాస్యులు మూఢనమ్మకాలలో మూలుగుతుంటారని' ఒక అభిప్రాయం ఉంది. మరి వారిని అలా తయారు చేసిన పండిత శిఖామణులైన అజ్ఞానుల మాటేమిటి? ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ వరాహమిహిరుని "బృహత్ సంహిత" (68-7)లో ఇలా ఉంది "పురుషుడి జననాంగం చిన్నదిగా ఉంటే పిల్లలు పుట్టరు. కాని ధనవంతుడౌతాడు. పెద్దదిగా ఉంటే పేదవాడవుతాడు. ఎడమవైపు వంగి ఉంటే పిల్లలు పుట్టరు. డబ్బు ఉండదు. కుడివైపు వంగి ఉంటే కొడుకులు పుడతారు" అలాగే పిల్లి ఎదురు కాకూడదనడం, తుమ్మినప్పుడు బయలుదేరకూడదనడం, బల్లి ఒంటిపై పడకూడదనడం, పొద్దున్నే ఎడమవైపు నుండి లేవకూడదనడం వంటి నమ్మకాలు ఎన్నో ఎన్నెన్నో రోజూ చూస్తూనే ఉన్నాం.

హాస్యాస్పదమైన నమ్మకాలు పాశ్చాత్య సమాజంలోనూ ఉన్నాయి. వారికి 13వ నెంబరు మంచిది కాదట! అంటే 26, 52 వంటివి రెండింతలుగా మంచివి కాకూడదు కదా. మనకిక్కడ కాకి అరిస్తే చుట్టాలొస్తారట. అక్కడ వారికి పాత్రలు తుడుస్తున్న గుడ్డ చేతిలోంచి జారిపడితే వస్తారట. ఒక చిన్న పెట్టెలో మత గురువు తలవెంట్రుకలు కాని, అస్థిక కాని ఉంచి, పూజిస్తే మేలు జరుగుతుందట. ఈ విధంగా ఎన్నైనా చెప్పుకోవచ్చు. అంతెందుకు మనదేశంలో ఒక మతం వారి

పంచాంగం ప్రకారం తిథి, వార, నక్షత్రాలు బాగులేనప్పుడే మరో మతం వారు దాన్నే పవిత్రమైన దినంగా భావించి పెళ్ళిళ్లు చేసుకుంటూ ఉంటారు.

ఆల్బర్ట్ ఐన్స్టెయిన్ ఇలా అన్నారు "వైజ్ఞానిక పరిశోధనలు మూఢనమ్మకాల్ని తగ్గించాలి. ప్రజలు కారణాల్ని అన్వేషించుకునే దిశలో ఆలోచించగలగాలి. హేతువాదపు నేపథ్యంలో ఎదిగిన మేథోసంపత్తి – ఉన్నత ప్రమాణాలు గల వైజ్ఞానిక దృక్పథాన్ని కలిగించాలి."

పాశ్చాత్య దేశాల్లో మూఢనమ్మకాలు లేవని కాదు. మనదేశంలో శాస్త్రీయ అవగాహన పెరగడం లేదని కాదు. కాకపోతే వాళ్ళు వాటిని అధిగమించి ప్రపంచ వైజ్ఞానిక ప్రగతికి కృషి చేస్తారు. కాని మనం మన ఘన కీర్తిని చాటుకోవడం మాత్రమే ఘనంగా చేస్తున్నాం. విజ్ఞాన శాస్త్రం అందించే లాభాల్ని అందరూ అందుకుంటూ ఉంటారు. కాని దాని గూర్చి తెలుసుకోవాలంటే చాలా మందిలో భయం, విముఖత కనిపిస్తూ ఉంటుంది. అందుకే సైన్స్ రచయితలు పుట్టుకొచ్చారు. అటు శాస్త్రజ్ఞుడికి, ఇటు సామాన్యుడికి మధ్య వారధిలా నిలిచారు.

విజ్ఞానశాస్త్రం జీవితాన్ని పొడిగించింది. బాధను తుడిపేసింది. రోగాన్ని రూపు మాపింది. భూమి సారాన్ని పెంచింది. యోధుడికి కొత్త ఆయుధాన్నిచ్చింది. పూర్వీకులకు తెలియని కొత్త ప్రదేశాల్ని చూపింది. నదుల్ని వంతెనలతో దాటించింది. సముద్రగర్భంలో ప్రయాణించడం నేర్పించి, చీకటిని పగటిలా మార్చింది. మానవుడి చూపు పరిధిని పెంచింది. మనిషి భుజబలాన్ని రెట్టింపు చేసింది. బుద్ధి బలానికి ఎల్లలు లేకుండా చేసింది. వేగాన్ని పెంచింది. దూరాన్ని దగ్గరకు తెచ్చింది. అభివ్యక్తికి అడ్డంకులు లేకుండా చేసింది. స్నేహాన్ని, అనురాగాన్ని, ఆత్మీయతల్ని పెంచింది. ఆఫీసుని, వ్యాపారాన్ని సమర్థవంతంగా నడిపించింది. మనిషికి విహంగయానాన్నే కాదు, గ్రహాంతరయానాన్నే ప్రసాదించింది. కొత్త రుచుల్ని చూపించింది. కొత్త దిశల్ని సృష్టించింది. కూర్చొన్న చోట ప్రపంచాన్ని కళ్ళముందు తిప్పింది. గతాన్ని భద్రపరిచింది. భవిష్యత్తును ఊహించింది. వర్తమానాన్ని తన గతిలో నడిపించింది. సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగింది.

ఇంతా చేస్తే అది పరిపూర్ణమేమీ కాదు, అదొక పురోగమన సూత్రం. ఇంతా చేస్తే అది స్థిరమైనదేమీ కాదు, నిరంతరం సాగే ప్రవాహం, మార్పు దాని సహజ లక్షణం. దాని మీద ఆధారపడ్డ ఈ సమాజాన్ని కూడా మార్చడం దాని ధ్యేయం.

ఇలా ఎల్లలూ పెంచుకుంటున్న శాస్త్ర విజ్ఞానాన్ని అర్థం చేసుకోవడం మాత్రమే సరిపోదు – ప్రతివారు శాస్త్రీయ దృక్పథాన్ని తమ వ్యక్తిత్వంలో భాగంగా చేసుకోవాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుంది.

## 2.6.5. మానవ వాదం జీవన నినాదం (2017):

### 2.6.5.1. మనిషి – దేవుడు – సైన్స్:

#### 2.6.5.1.1. మనిషి:

చెడు పనులు చేసేవారు ఎవరైనా భయంతో బతకాల్సిందే. ఆ భయంలోంచి బయటపడటానికి వారు దేవుణ్ణి, పాపాల్ని, పుణ్యాల్ని, పునర్జన్మల్ని, వాస్తుని, జాతకాల్ని, రంగురాళ్ళని, అల్లా గొలుసుల్ని, దైవ ప్రార్థనల్ని, కీర్తనల్ని ఇంకా ఎన్నింటినో నమ్ముతూ ఉంటారు. ఆ నమ్మకాల్ని మతబోధకులు వారి స్వార్థం కోసం రెచ్చగొట్టి జనాన్ని మరింత బలహీనులుగా తయారుచేస్తుంటారు. ఈ విషయాలు గ్రహించి, జనం తమని తాము తెలుసుకుని, చైతన్యవంతులై ప్రవర్తిస్తే బావుంటుంది. నువ్వు ఎంత మాత్రమూ పాపాత్ముడివి కావు. అలా అని నీకు ఎవరైనా హితబోధ చేస్తే, ఆత్మ విశ్వాసంతో తిప్పికొట్టి అతన్ని, అతడి ప్రవర్తనను, ఆలోచనా విధానాన్ని సరిచేసుకోమని హెచ్చరించు. అంతే కాని, ఎవరి మాయ మాటలో నమ్మి మనిషి స్థానం నుండి కిందికి దిగజారకుండా, నీకు దొరికిన ఈ అందమైన బాధ్యత గల నాగరిక జీవితాన్ని హాయిగా జీవించు. ఇతరులను కూడా అలా జీవించనివ్వు.

హిందూ తత్త్వశాస్త్ర ప్రకారం ఆస్తిక, నాస్తిక భావజాలాలు రెండున్నాయి. ఇందులో మొదటిది వేదాల నుంచి, దేవుడి నుంచి బల్లి శాస్త్రం దాక అన్నింటినీ నమ్మే ఈ ఆస్తికత్వం విపరీతంగా విజృంభించి ప్రపంచమంతా వ్యాపించింది. సంఖ్య, యోగ, న్యాయ, వైశాఖ, మీమాంస, వేదాంత శాఖలుగా పరిఢవిల్లింది. ఇక రెండో రకం నాస్తికత్వం. ముక్తిని, స్వర్గాన్ని, ఆత్మల్ని నమ్మలేదు. ఈ కోవలోని వారు కూడా శాఖోపశాఖలుగా విస్తరిల్లారు. జైన, బౌద్ధ, చార్వాక, అజ్వీక శాఖలుగా ఆయా కాలాలలో వర్థిల్లుతూ వచ్చారు. వీరు ఆస్తికుల భావాలకు వ్యతిరేకమైన అంశాల్ని ప్రవేశపెట్టారు. ఎవరి భావజాలం వారిదైనా, చార్వాకులు మాత్రం వీరిలో ప్రత్యేకంగా నిలిచారు. పైగా క్రీస్తు పూర్వమే ఉద్భవించారు. దేవుణ్ణి, ఆత్మలను నిరసించారు. ప్రత్యక్ష ప్రమాణాలు కావాలని నిలదీశారు. భూమి, నీరు, గాలి, అగ్ని అనే నాలుగు మూలకాలతోనే అన్నీ రూపొందాయని చెప్పారు. దైవ భావనను పక్కకు నెట్టి, తొలిసారిగా ఒక వైజ్ఞానిక విశేషాన్ని అప్పుడే చెప్పగలిగారు. ప్రవచనాలు చెప్పేవారు చెబుతున్నట్లు దేవుణ్ణి నిరసించేవారు ఇటీవల ఆధునిక కాలంలో పుట్టుకు రాలేదు. ఆస్తికత్వంతో పాటే నాస్తికత్వమూ పుట్టింది. అదేమీ విశృంఖలత్వం కాదు, సంఘ విద్రోహ శక్తి కాదు. పాపమూ కాదు. ఇదంతా ఆస్తికులు ప్రచారం చేసిన అబద్ధం. నాస్తికత్వం ఒక విచార

ధార. ఆలోచన సరళి! జీవన విధానం. ఓపికగా నిజానిజాలు విశ్లేషించుకునేవారికి సత్యం బోధపడుతుంది.

చార్వాకుల మూల పురుషులు వెలువరించిన "బృహస్పతి సూత్ర" ఇతర చార్వాక గ్రంథాలు కాలగర్భంలో కలిసి పోయాయి. ఆ తర్వాత రెండు వందల ఏండ్లకు అంటే ఎనిమిదో శతాబ్దంలో జయరాసిభా "తత్వో పప్లవ సింహ" అనే గ్రంథం ప్రకటించారు. 14వ శతాబ్దపు మధ్వాచార్లు "సర్వ దర్శన సంగ్రహ" రాశాడు. ఇది భారతదేశంలో తత్వశాస్త్రాల సారాంశం. ఇందులో ఆయన చార్వాకుల గురించి రాశాడు. అది కూడా మొదటి అధ్యాయంలో ప్రముఖంగా రాశాడు. 8, 14 శతాబ్దాల్లో వెలువడిన ఈ రెండు గ్రంథాలు రెండో తరం చార్వాకులు ప్రకటించినవి. వాటిలో కొన్ని విషయాలు తరువాత తరాలకు అందుతూ వచ్చాయి. ఇవి ప్రశ్నించడాన్ని నేర్పాయి. ప్రత్యక్ష సాక్ష్యాలను, రుజువులను కోరాయి.

20వ శతాబ్దంలో వినాయక్ దామోదర్ సావర్కర్ (1883–1966) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, హిందూ జాతీయ నాయకుడు. ఆయన గోపూజను తీవ్రంగా నిరసించాడు. తన రాజకీయ నేపథ్యాన్ని పక్కన పెట్టి గొప్ప హేతువాదిగా, నిరీశ్వరవాదిగా వినతికెక్కాడు. సత్యేంద్రనాథ్ బోస్ (1894–1974) గణిత – భౌతిక శాస్త్రవేత్త మాత్రమే కాదు. నిరీశ్వరవాది కూడా! క్వాంటం మెకానిక్స్కు వెలుగులోకి తెచ్చాడు. అదే తర్వాతి కాలంలో బోస్ – ఐన్స్టీన్ స్టాటిస్టిక్స్కు ఆధారమైంది. సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ (1910–1995) కూడా నక్షత్ర పరిణామంపై కృషిచేసి, 1983లో నోబెల్ బహుమతి సాధించాడు. ఆయన కూడా నిరీశ్వరవాదే! నాస్తికుడే. తొలి భారత ప్రధాని పండిత్ జవహర్లాల్ నెహ్రూ (1889–1964) ఏ దేవుణ్ణి విశ్వసించలేదు. మూఢ నమ్మకాల్ని తీవ్రంగా నిరసించారు. మతం కారణంగా జరిగే అనర్థాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన గోరా (1902–1975) గోపరాజు రామచంద్రరావు కులమతాల్ని దుయ్యబట్టిన సామాజిక కార్యకర్త. ఆయనతో పాటు ఆయన భార్య సరస్వతీ గోరా (1912–2007) కూడా హేతువాద ఉద్యమంలో పాలుపంచుకున్నారు. 1940లో హేతువాద కేంద్రం స్థాపించి సమాజంలో మార్పు కోసం కృషి చేశారు.

గోరా రచనలు తెలుగు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. 1972లో ఆయన ప్రపంచ హేతువాద సభలు తొలిసారిగా ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించారు. ఫలితంగా 1997లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ ప్రారంభమైంది. భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ అమర్త్యసేన్ నిరీశ్వరవాది. హిందూమతంలో నిరీశ్వరవాదాన్ని

"లోకాయత" పేరుతో ఒక విభాగం గుర్తించాలన్నాడు. 2008లో "నిర్మక్త" వెబ్సైట్ (www.huganatheist.org) ఏర్పాటైంది. అది స్వేచ్ఛాలోచన కోసం, ప్రజాస్వామ్య మానవతావాదం కోసం కృషి చేస్తోంది. 2009లో మీరానందా "ద గాడ్ మార్కెట్" (దేవతల సంత) అనే పుస్తకం ప్రచురించారు. అది భారతీయ మధ్య తరగతి జనుల్లో గ్లోబలైజేషన్ ప్రభావం ఎలా పడుతూ ఉందో చర్చించింది. వీరందరినీ గుర్తు చేసుకోవడమెందుకంటే, దైవభీతి, దైవ భావన లేకుండానే వీరంతా సమాజ శ్రేయస్సుకు జీవితాలు ధారపోసినవారు కాబట్టి. విశ్వశాంతి కోసం, మానవీయ విలువల కోసం నిరంతరం శ్రమించారు కాబట్టి.

2009లో హేతువాదాన్ని ప్రోత్సహించే రాజకీయ పార్టీలకు ఓటు వేయొద్దని "కాథలిక్ బిషప్ కౌన్సిల్"లో ఒక ఉత్తర్వు జారీ అయింది. 2012లో కూడా సనల్ ఎడ్మరు విల్లిపార్లే మోసాన్ని బట్టబయలు చేశాడు. క్రీస్తు విగ్రహం ఏడవడం ఒక బూటకం అని, అది డ్రైనేజీ సమస్యల వల్ల విగ్రహం నుంచి నీరు కారిందని రుజువు చేశాడు.

**2.6.5.1.2. దేవుడు**:

ఏ దేశం వారైనా, ఏ మతస్థులైనా, ఏ వయసులో ఉన్నా, ఏ భాష మాట్లాడినా దాదాపు అందరూ తమ జీవితాల్లోని వైరుధ్యాలలో పడి కొట్టుకుంటూ ఉంటారు. తరతరాల్నించి వస్తున్న ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాలకు, విశ్వాసాలకు ఉన్న ఫళంగా అతీతులైపోరు. వాటన్నింటిని జీర్ణించుకొని పెరుగుతారు గనుక. అదే పద్ధతిలో తమ తరువాతి తరాన్ని పెంచుతారు. ఆ క్రమంలోనే దేవుణ్ణి నమ్మడం, పూర్వీకులు నిర్వహించిన విధంగా సంప్రదాయాలను కొనసాగిస్తూ ఉంటారు.

ఏ రోజు వార్తాపత్రికలు తిరగేసినా, ఏ పూట టీ.వీ. వార్తలు చూసినా ఘోరమైన వార్తలు తెలుస్తూ ఉంటాయి. ఉపాధ్యాయుడు విద్యార్థిని మానభంగం చేశాడని లేదా తండ్రి కూతురికి కడుపు చేశాడని, అక్రమ సంబంధాలతో కాపురాలు కూలిపోయాయని అంటూ ఇలాంటి సంఘటనలకు ఆర్థిక, సామాజిక తారతమ్యాలు కూడా ఉండవు. అయితే ఆధునిక మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసే ఇలాంటి సంఘటనలకు స్ఫూర్తి ఎవరు అని తీవ్రంగా ఆలోచిస్తే దేవతల పేరుతో, గంధర్వ, కిన్నెర, కింపురుషుల పేరుతో, పురాణాల పేరుతో, పవిత్ర మత గ్రంథాల పేరుతో యుగయుగాలుగా జనం అనైతికత వైపు మరలుతున్నారన్నది నిజం. జనావళిలో సత్ప్రవర్తన కోసం దేవుడి భయం, భక్తి ప్రవేశపెట్టిన పురాణాలు, అనైతికమైన అంశాలు కూడా ప్రచారం చేశాయి. మనిషి బలహీనత ఏమిటంటే, మంచి కొద్దిగా చెవికెక్కించుకుంటాడు. చెడును

విస్తారంగా స్వీకరిస్తాడు. ఫలితంగా ఎన్ని శతాబ్దాలు వెనక్కెళ్ళి చూసినా, ఆటవిక యుగంలోంచి రాజులు, జమీందారుల కాలంలోంచి నేటి అత్యాధునిక యుగందాక... ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

మానభంగాలు, అక్రమ సంబంధాలు, అక్రమ సంతానాలు మన పవిత్ర హిందు పురాణాలలో కోకొల్లలుగా ఉన్నాయి. మహాభారతంలోని విషయం చూడండి. దేవగురువు బృహస్పతి తన అన్న ఉతద్యుని భార్య 'మమత'ను నిండు గర్భిణిగా ఉన్నప్పుడు మానభంగం చేశాడు. రామాయణంలో దేవేంద్రుడు గౌతమ మహర్షి భార్య 'అహల్య'ను అనుభవించాడు. అలాగే శివపురాణంలో విష్ణువు జలంధరుణ్ణి చంపేందుకు ముందు అతని భార్యను మానభంగం చేశాడు. మరి శివుడేం చేశాడో బ్రహ్మవైవర్త పురాణం తిరగెస్తే తెలుస్తుంది. శంఖచూడుని భార్య 'తులసి'ని శారీరకంగా దోపిడీ చేశాడు. ఇందులో వేటిని కాదనలేం. అన్ని పురాణాల్లో ఉన్నవే. ఇప్పుడు సినిమాల్లో గుండాలు, రౌడీలు చేస్తున్న పనులన్నీ పురాణాల్లో దేవతలు చేసేవారు.

మనుషుల గుణాల్ని దేవతలకు ఆపాదించి రాశారు పూర్వీకులు. అలాగే దేవతల లక్షణాలు మనుషులకు ఆపాదించడం జరిగింది. దేవతలకు మనుషుల గుణాల్ని ఆపాదించి రాయడాన్ని "ఆంథ్రోపోమోర్ఫిజం" (Anthropomorphism) అని అంటారు. మనిషి మానసిక స్థితిగతుల్లోంచి కథలు, గాథలు వెలువడ్డాయి. జంతువులకు, పక్షులకు కూడా మనిషి తన భాషను, ఆలోచనల్ని ఆపాదించి రాసుకున్న కథలు ఉన్నాయి. పంచతంత్రం కథలు చదివినవారికి ఆ విషయాలు తెలుస్తాయి. మనిషి చపలబుద్ధి, నీచ బుద్ధి, కుటిల బుద్ధి ఆనాటి ఆటవిక న్యాయం అన్ని కలగలిపి, ఆయా దేశకాల పరిస్థితులను బట్టి ఆచార వ్యవహారాలను బట్టి కథలు, గాథలు రాయబడ్డాయి.

మనిషి తన ప్రయాణాన్ని విశ్వాసంలోంచే ప్రారంభిస్తాడు. ఏదో ఓ శక్తిని, దేవుణ్ణి, దేవతను, దేవదూతను, చివరకు ఎదురుగా కనిపించే మఠాధిపతినో, సన్యాసినో, బాబానో, గురూజినో, మాతాజీనో నమ్ముతుంటాడు. తన మీద తనకున్న నమ్మకాన్ని వదిలేసి, తోటివాడి తోడును వదిలేసి, జీవిస్తున్న సమాజాన్ని వదిలేసి, అనుభవిస్తున్న ఆధునిక సౌకర్యాలను గుర్తించకుండా, ఎక్కడ, ఎప్పుడు ఎవరికి కనబడని ఒక శక్తిని గూర్చి మాట్లాడుతుంటాడు. జన్మలు, పునర్జన్మలు, పాపపుణ్యాలు, జాతకాలు, వాస్తు, బల్లి శాస్త్రం మొదలైన అభూత కల్పనల్లో, భ్రమల్లో రూపుదిద్దుకున్న అనేకానేక అంశాల మీద దృష్టి పెట్టి భక్తి పారవశ్యంలో తెలిపోతాడు.

**2.6.5.1.3. సైన్సు**:

సైన్సు జనానికి ప్రశ్న ఇచ్చింది. అన్వేషణకు దారులు వేసింది. సంకుచితత్వపు చీకట్లు బద్దలు కొట్టి, విశాలత్వపు వెలుగులను పంచింది. రహస్యాల్ని చేధించింది. జీవం పుట్టుకను విప్పి చెప్పింది. భూమి, సూర్యుడు, చంద్రుడు వంటి గ్రహాలు ఏవేమిటో అర్థం చేస్తూ వచ్చింది. మతాన్నే కాదు, అన్ని మతాలకు మూలాధారమైన దేవుణ్ణే ప్రశ్నించింది. సైన్సు శోధనలో దేవుడెక్కడ కనబడలేదు. ఉండి ఉంటే ఆయన ధైర్యంగా వచ్చి ముందు నిలబడనూ లేదు. మనిషి తన అమాయకత్వాన్ని అజ్ఞానాన్ని రంగరించి దేవుణ్ణి చేసుకున్నాడని అనుకుంటే, దేవుడనే ఊహని, భ్రమని, కల్పనని నిలుపుకోవడానికి మనిషికి ఓ మతం అవసరమైంది. మళ్ళీ మనుషులు తమ తమ స్వార్థచింతనతో తమ ప్రత్యేకతని కాపాడుకోవడానికి, తమ అస్తిత్వాన్ని ప్రకటించుకోవడానికి వందల వేల సంఖ్యలో దేవుళ్ళని ఏర్పరచుకున్నారు. ఆ దేవుళ్ళ చుట్టూ మతాల్ని వృద్ధి చేసుకుని వ్యాపింపజేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు.

మానవ జాతికి కావాల్సిన మహిమాన్వితమైన ఆలోచనలన్ని మన పూర్వీకులే చేశారు. వాటిని ఏ విధంగానూ మార్చడానికి లేదు. వాటిని యథాతథంగా కళ్ళు మూసుకుని అనుసరిస్తూ ఉండడమే మన విద్యుక్తధర్మం అని అంటారు. మత బోధకులు, భక్తులు, దైవాన్ని, మతాన్ని నమ్మేవారు. కాలానికి సరిపడని ఆచారాల్ని కూడా బలవంతంగా ఆచరింపజేస్తుంటారు. సైన్సును నమ్మేవారు అందుకు ఒప్పుకోరు. 'సైన్సు రంగ ప్రవేశం చేయక ముందు, మానసిక వికాసం జరగక ముందు, మతం పేరిట ఏర్పడ్డ ఆచారాలన్నీ, నీతి సూత్రాలన్నీ చాలా ప్రాథమికమైనవని, వాటిని పక్కన పెట్టి నూతన ఆవిష్కరణలలో కొత్తగా ఆలోచిద్దాం' అని అంటారు.

సైన్సు ప్రకారం సత్యం అనేది ఒక వాస్తవంగా ఉండాలి. నిరూపణకు నిలబడాలి. కాలక్రమంలో పరిశీలనలు, పరిశోధనలు జరుగుతున్న కొద్దీ, నిన్నటిదాక సత్యం అనుకున్నది మారిపోవచ్చు. రూపాంతరం చెందొచ్చు. మార్పు దాని సహజ లక్షణం. సైన్సు అంటే సత్యం కోసం జరిపే నిరంతర అన్వేషణే. అందువల్ల భ్రమకు, వాస్తవానికి ఎలాగైతే పొత్తు కుదరదో, మతానికి, సైన్సుకు కూడా కుదరదు. రెండు వేర్వేరు విషయాలు ఎంతటి మేథోసంపద గలవాడైనా ఎంత పెద్ద పదవిలో ఉన్నా, ఎంత అధికారం ఉన్నా హేతుబద్ధతలేని మాట మాట్లాడితే అది నిలువదు. దేవుడి ఆశీస్సులతో శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేయాలని చెప్పడం మూర్ఖత్వానికి పరాకాష్ఠ.

సైన్సు ప్రపంచ పౌరులందరి ఉమ్మడి ఆస్తి. అది ఒక దేశానిదో, ఒక మతానిదో, ఒక జాతిదో కాదు. ప్రాంతీయ దురాభిమానాలకు, భాషా విద్వేషాలకు అతీతమైంది. ధనిక, పేద భేదాలు, అగ్ర–నిమ్న తేడాలు లేనిది ప్రపంచ పౌరుల సమిష్టి కృషికి దక్కిన ఫలితం సైన్సు.

ఏ వైజ్ఞానికుడు, ఏ సాంకేతిక నిపుణుడు ఏయే ఆవిష్కరణలు చేసినా అవి సర్వ ప్రపంచ మానవాళి కోసం చేస్తున్నాడు. కేవలం తన కోసమో, తన వారి కోసమో లేక తన దేశం కోసం మాత్రమో కాదు. అంటే ఆ ఆలోచనలోనే మానవసేవ ఉంది. మానవత్వం ఉంది. మానవతా దృక్పథానికి సైన్సు ఎప్పుడూ వెన్నముకగా నిలబడుతూ వస్తోంది. సైన్సు అవసరం లేని మానవత్వం, మానవత్వం అవసరం లేని సైన్స్ ఊహించలేం. సమాజాన్ని గతి తప్పించడం, నాశనం చేయడం సైన్స్ ఎప్పుడూ తన ధ్యేయం చేసుకోలేదు. నిర్మాణం మీద, పునర్నిర్మాణం మీదే సైన్స్ ఎప్పుడూ దృష్టి పెడుతూ వస్తుంది.

### 2.6.6. నువ్వేమిటో నీ ఆహారం చెబుతుంది (2018):

బాగా చదువుకున్న వారికి సైతం ఆహారం గురించి సరైన అవగాహన ఉండటం లేదు. అందుకు కారణం వారు దాని పట్ల శ్రద్ధ చూపకపోవడమే. కొందరు ఆకలికి ఆగలేక ఏదో ఒకటి తింటూనే ఉంటారు. మరి కొందరు పనిలో పడి ఆకలి మరచి, తిండిని అశ్రద్ధ చేస్తారు. వేగవంతమైన జీవితం, పని ఒత్తిడి ఆధునికుల్ని స్థిమితంగా ఆహారం తీసుకోనివ్వడం లేదు. గంటల తరబడి కష్టపడి ఇల్లాలు వంట చేస్తే, రెండు నిమిషాల్లో నాలుగు మెతుకులు గతికి బయటపడే ఉద్యోగస్థులే ఎక్కువ. ఇది సరికాదు. టి.వి.ల ముందు కూర్చొనే సమయాన్ని తగ్గించి, ఆహారానికి కొద్దిపాటి సమయాన్ని కేటాయిస్తే, మన ఆరోగ్యాన్ని చాలావరకు కాపాడుకోవచ్చు. నువ్వేమిటన్నది నువ్వు తినే ఆహారమే నిర్ణయిస్తుంది అని తెలియజేశారు దేవరాజు మహారాజు.

ప్రతిరోజు మనం ఉదయం నుండి రాత్రి వరకు ఏ ఆహారం తీసుకోవాలి? అనే విషయంపై ఆహార నిపుణులు మంచి వివరణ ఇస్తున్నారు. కొంచెం సమయం కేటాయించి, ఓపికగా అలవాటు చేసుకుంటే రోగాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి. ఆయుర్వేద శాస్త్ర ప్రకారం రోజుకు రెండు సార్లు భోజనం చేస్తే చాలు.

మనం తీసుకునే ఆహారంలో అన్నం, చపాతీ మాత్రమే ఉండాలి. చాలామంది చేసే పొరపాటేమిటంటే నాన్–వెజిటేరియన్ ఉంది కదా అని రోజు తినే దానికన్నా ఎక్కువ అన్నం తింటారు. మాంసాహారంలో మనకు అవసరమైన పోషకాలు లభిస్తున్నాయి కాబట్టి, పిండి

పదార్థాలు తగ్గించాలన్న మాట. తినాలన్న కోరిక ఎక్కువగా ఉన్నప్పుడు సోయాబీన్స్తో చేసిన ఆహారం తీసుకోవడం మేలు. కడుపు నిండుతుంది.

రాత్రి వేళల్లో ఆహారం ఎప్పుడూ తక్కువగా తీసుకోవాలి. మాంసాహారం తీసుకోకపోవడమే మంచిది. తీసుకున్నా చాలా తక్కువ తీసుకోవాలి. రాత్రి భోజనానికి ముందు వెజిటేబుల్ సూప్ గానీ, రసం గానీ తీసుకుంటే మంచిది. దానివల్ల వేపుడు కూరలు, చపాతీ, అన్నం తగ్గించొచ్చు. ఉడికించిన గుడ్డు, ఏదైనా పండు, ఆమ్లెట్, ఒకటి రెండు పుల్కాలు తీసుకోవడం మేలు. మాంసాహారం తీసుకునేవారు ముఖ్యంగా కోడి మాంసం తినేవారు దాని చర్మం వదిలేసి తినాలి. కోడి గుడ్డయితే తెల్లని భాగం ఎంత తిన్నా ప్రమాదం ఉండదు. మటన్, చేప, బీఫ్ ఎప్పుడైనా ఓ సారితినాలి. ప్రతిరోజు తింటే ప్రమాదమే. ఎందుకంటే అందులో కొలెస్టరాల్ ఎక్కువగా ఉంటుంది. శాఖాహారులు మాత్రం ఎగ్వోక్ తినడం మంచిది. బాగా లావెక్కిపోవడం, చక్కెర వ్యాధి ఇంకా కొలెస్టరాల్ సమస్యలన్నీ మితమైన ఆహారం తీసుకోవడంతో పరిష్కారమవుతాయి.

ఆహారం విషయంలో మన దృక్పథం మారాల్సి ఉంది. మందులు, విటమిన్, టాబ్లెట్లు తీసుకోవడం కన్నా, ప్రకృతిసిద్ధంగా లభించే మంచి ఆహారం తీసుకోవడమే మేలు. అయితే ఏది మంచి, ఏది చెడు, ఏది ఎంతవరకు తీసుకోవాలి అనే అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం.

కొవ్వు పదార్థాలు శరీరానికి హాని చేస్తాయనే ఒక నమ్మకం జనంలో బాగా పాతుకుపోయింది. కాని ఇది తప్పు. ఎందుకంటే ఆహారంలో కొవ్వు పదార్థాల్ని పూర్తిగా విస్మరిస్తే, శరీరానికి అత్యవసరంగా కావాల్సిన ఫాటీ యాసిడ్స్ లభించవు. శరీరంలో ఈ ఆమ్లాలు లేకపోతే శరీరం A, D, K విటమిన్లను స్వీకరించదు. పర్యవసానంగా విటమిన్ లోపం ఏర్పడుతుంది. విటమిన్లు లోపిస్తే శరీర ధర్మ రీత్యా జీవన క్రియలు సరిగా సాగవు. తగు మోతాదులో కొవ్వు పదార్థాలు శరీరానికి అందాలి.

పచ్చి మిరప, ఎండు మిరప ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని కొంతమంది చెబుతుంటారు. నారింజ పండులో మాదిరిగా మిరపకాయలో C విటమిన్ ఎక్కువగా ఉంటుంది. అదీగాక మిరపకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండి, కాన్సర్ నిరోధంగా పనిచేస్తాయి. అందువల్ల మిరపకాయల్ని నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఆహారం తగ్గించి పండ్లు, రసాలు తీసుకోవడం వల్ల సన్నబడి నాజూకుగా తయారవుతారనే అభిప్రాయం కూడా ధనిక వర్గాల నుంచే వచ్చింది. రసం ఎన్నో పండ్లు పిండితే కాని రాదు. దాంతో పాటు చక్కెర కలుస్తుంది. దీని వల్ల శరీరంలో చక్కెర నిల్వలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. మామూలుగా సమతుల్య ఆహారం తీసుకునేవారు ప్రత్యేకించి

పండ్ల రసాలు తీసుకోనవసరం లేదు. పండ్లు తింటే చాలు. పండ్లు తినలేనివారు, ఆహారం తీసుకోలేనివారు పండ్ల రసాల మీద ఆధారపడటం తప్పనిసరి అవుతుంది.

పెద్దవారు పాలు తాగడంవల్ల ఉపయోగమేమీ లేదనే అభిప్రాయం సరికాదు. పాల గురించి సరైన అవగాహన లేనివారు ఈ అభిప్రాయాన్ని ప్రచారం చేస్తుంటారు. పాలు తాగడం అన్ని వయస్సుల వారికి మంచిదే. పాల వల్ల హైపర్ టెన్షన్ నివారించవచ్చు. రక్తపోటు పెరగకుండా చూసుకోవచ్చు. విటమిన్ 'B' ప్రోటీనులు ఎక్కువగా ఉన్న పాలు తీసుకోవడం వల్ల, శరీరంలో గాయల్ని మాన్పగల శక్తి అధికమవుతుంది. పిల్లలు ఎక్కువ పాలు తాగాలి. వయస్సు పెరుగుతున్న కొద్ది తగ్గించాలి. బాగా వయసు పైబడినవారు పాలు కొద్దిగా తీసుకుంటే చాలు.

నెయ్యి శరీరానికి హాని చేస్తుందనే అభిప్రాయం సరైంది కాదు. వయస్సును బట్టి, నూనెల్ని జీర్ణించుకోగల శక్తిని బట్టి, తగు మోతాదులో నెయ్యి తీసుకుంటే చాలా మంచిది. అందులో విటమిన్ 'A' పుష్కలంగా ఉంటుంది. ప్రత్యేకమైన ఫాటీ యాసిడ్ కూడా ఉంటుంది. నూనెల కంపెనీల వారు డాబుగా ప్రచారం చేసుకోవడమే కాని, ఏ బ్రాండ్ రిఫైన్డ్ ఆయిల్లోనూ కొవ్వు పదార్థం ఉండకుండా ఉండదు. రిఫైన్డ్ అంటే శుభ్రపరచిన నూనె అని మాత్రమే అర్థం చేసుకోవాలి. అంతే కాని "ఫాటీ ఫ్రీ" అనగానే కొవ్వు లేదని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు వేరుశనగ నూనెలో సాచ్యురేటెడ్ ఫాటీ యాసిడ్స్ ఉంటాయి. పొద్దు తిరుగుడు పూవు నూనెలో పాలి అన్సాచురేటెడ్ ఫాటీ యాసిడ్స్ ఉంటాయి. అన్ని రకాల నూనెలు కలిపి వాడటం వల్ల కొంత మేలు కలుగుతుందని ఆహార నిపుణులు సిఫారసు చేస్తున్నారు.

శరీరంలో ఉప్పు తగ్గితే కండరాలు పట్టేస్తాయని కొందరు భావిస్తుంటారు. కండరాలు పట్టేయడానికి అనేక కారణాలు ఉంటాయి. కేవలం ఉప్పు తగ్గడం వల్ల కాదు. శరీరంలో ద్రవాలు తగ్గడం వల్ల అలా అవుతుంటాయి. నీళ్ళు ఎక్కువగా తాగడం వల్ల సమస్య చాలావరకు పరిష్కారమవుతుంది.

ఆరోగ్య సూత్రాలు పాటించేవారు శనగలు, పెసలు, ఉలవలు, కందులు, వేరుశనగ, బొబ్బర్లు, చిక్కుళ్ళు, సోయాచిక్కుళ్ళ వంటి ఎన్నో గింజల్ని నానబెట్టి తింటుంటారు. రాత్రిపూట నానబెట్టి పొద్దున్నే తినడం వీరికి అలవాటు. ఇది చాలా మంచి అలవాటు. అయితే నానబెట్టిన గింజల కంటే మొలకెత్తిన గింజలు తింటే ఆరోగ్యానికి ఇంకా మంచిది. ఇనుము, కాల్షియం, జింక్, పీచు పదార్థం వంటి ఖనిజాలన్నీ మామూలు గింజల్లో కన్నా మొలకెత్తిన గింజల్లో ఎక్కువ. మామూలు గింజల్లో లేని క్లోరోఫిల్ మొలకెత్తిన గింజల్లో ఉంటుంది. నీటిని, సూర్యరశ్మిని,

ఆక్సిజన్ను గ్రహించిన గింజలు మొలకెత్తే దశల క్లోరోఫిల్ తయారు చేసుకోవడంవల్ల, ఆ క్లోరోఫిల్ మనకు అదనంగా దొరుకుతుంది. ఇవి తినడం వల్ల గ్యాస్ట్రబుల్ రాదు. పొట్ట ఉబ్బరింపు ఉండదు.

## 2.6.7. నేనంటే ఏమిటి? (2019):

విష్ణుశర్మ మూర్ఖులైన రాజకుమారులను పంచతంత్రంలోని జంతువుల పాత్ర ద్వారా తెలివితేటల్ని, విద్యాబుద్ధుల్ని నేర్పించారు. అదే పంథాను అనుసరించి సామాన్య మానవులకు ఆధ్యాత్మికతను జోడిస్తూ ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని కుటుంబ సభ్యుల సంభాషణలో సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియచెబుతూ 'నేను అంటే ఏమిటి?' అనే గ్రంథాన్ని మన ముందుకు తెచ్చారు. దీనిలో రెండు భాగాలు ఉన్నాయి.

మొదటి విభాగంలో వైజ్ఞానిక వివరణలో పది రంగములు పొందుపరిచారు. వీటిలో మానవ శరీరంలోని వివిధ భాగముల, అంగముల నిర్మాణము పనిచేయు విధములు, వాటికి వచ్చే కష్టాలు, వాటిని ఎలా నివారించాలో సోదాహరణంగా వివరించారు. మానవ శరీర నిర్మాణ ప్రక్రియను సుఖవంతమైన జీవనానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యే రీతిలో వివరించారు.

రెండవ భాగంలో సామాజిక వివరణ చేశారు. దీనిలో ఏడు భాగాలు ఉన్నాయి. మహాత్మ గాంధీ దక్షిణాఫ్రికాలో ఎదుర్కొన్న జాతి వివక్షతో మొదలుపెట్టి ప్రపంచంలో జటిలమవుతున్న జాతి సమస్యలు, వాటి ద్వారా పుట్టే ఉద్యమాలు, మానవీయ కోణంలో పరిష్కార మార్గాలు తెలియజెప్పారు.

ఇక విచ్ఛిన్నమవుతున్న సామాజిక బంధాలు, సంబంధాలు వాటి వలన ఏర్పడే ఒంటరి కుటుంబాలు, వాటి దుష్పరిణామాలను చిత్రీకరించారు. మన సనాతన ఉమ్మడి కుటుంబ వ్యవస్థను నిలుపుకోవాల్సిన అగత్యాన్ని దాని ద్వారా సమాజంలో విద్వేషాల్ని రూపుమాపి అందరూ కలిసి సహజీవనం చేస్తూ ప్రపంచానికి ఆశాజ్యోతులుగా వెలగాలి అని తన ఉద్దేశ్యాన్ని తెలియజేశారు.

ఇక ఆఖరుగా బొమ్మలతో సహా మానవ శరీరంలోని సెల్, బాడీ టిష్యుస్, త్రీ టైప్స్ ఆఫ్ నిరోస్, మానవ మెదడు దాని పనితీరు, కేటాగిరైజేషన్ ఆఫ్ డెత్ మొదలగు అంశాలు ఇంగ్లీషులో అందించారు. మన భారతీయ పురాతన ప్రముఖ వైద్య శాస్త్రవేత్తలైన చరకుడు, శుశ్రుతుని గురించి కూడా సోదాహరణంగా వివరించారు. ఒక మానవ శరీర నిర్మాణ వ్యవస్థ సంగ్రహ చరిత్ర.

## 2.7. సినిమా:

### 2.7.1. పథేర్ పాంచాలి (2009) (సత్యజిత్ రే సినిమా స్క్రిప్టు):

భారతీయ చలన చిత్ర రంగాన్ని కుదుపు కుదిపి, కొత్త మలుపు తిప్పిన 'పథేర్ పాంచాలి' స్క్రీన్–ప్లే ఇప్పుడు తెలుగులో మొదటిసారిగా వెలుగు చూస్తోంది. ఇందులో మనకు మానవ సంబంధాలు కనిపిస్తాయి. హరిహర్ రే కుటుంబ సభ్యుల మధ్య, వారికి సమాజంలో ఇతర వ్యక్తుల మధ్య గల సంబంధ బాంధవ్యాల స్వరూపం ఇందులో ప్రధానంగా కనిపిస్తాయి.

జీవితమే ఇందులోని హీరో. జీవితమే ఇందులోని హీరోయిన్. జీవితమే విలన్. జీవితమే కమెడియన్. హరిహర్ రే ఇంటికి రెండే రెండు పొరుగిల్లు ఉంటాయి. ఒకరు ముఖర్జీ కుటుంబం, రెండు నీలమణి కుటుంబం. ముఖర్జీలది సిరిసంపద గల కుటుంబం. వీరు హరిహర్ రేకు రక్తసంబంధీకులు. సినిమాలో కనిపించే ముఖర్జీ కుటుంబ సభ్యులుగా సెజ్ బో, రానూ, టును పాత్రలు పోషించారు.

చారిత్రకంగా 'పథేర్ పాంచాలి' సినిమాలో 1910–20 నాటికి గ్రామీణ పరిస్థితులు చిత్రితమయ్యాయి. బెంగాల్లోని ఒక మారుమూల గ్రామం నిశ్చిందిపూర్. తరతరాలుగా ఆ ఊళ్లో ప్రజలు తమ ప్రపంచంలో తాము బతుకుతూ ఉంటారు. దేశంలో వస్తున్న సామాజిక, ఆర్థిక, సాంకేతిక మార్పులు వారికి అంతగా తెలియవు. వీటినే చిత్రంగా మలిచి మన ముందుంచారు సత్యజిత్ రే. సినిమాలో వేరు వేరు సన్నివేశాలలో అనేకమంది గ్రామస్తులు కనిపిస్తుంటారు. దీని గురించి మరో అధ్యాయంలో చర్చిస్తాను.

ప్రయోజన సినిమా గురించి భారతీయ సినిమాలో విశ్లేషిస్తాను.

## 2.8. ఇతర రచనలు:

### 2.8.1. భారతీయ వారసత్వం – సంస్కృతి విజ్ఞాన నాగరికతలు (2006):

#### 2.8.1.1. హరప్పా నాగరికత:

20వ శతాబ్దం తొలినాళ్ళలోను, చివరికాలంలోను ఇరవై ఒకటో శతాబ్దం ప్రారంభంలోను జరిగిన చారిత్రక–పురావస్తు, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు భారతదేశ చరిత్ర, నాగరికతా సంస్కృతుల స్థితిగతులను సంపూర్ణంగా మార్చివేశాయి.

భారతదేశంలో నాగరికత వేదయుగం నుంచే ప్రారంభమైందని చరిత్రకారులు విశ్వసించారు. కానీ 1922–1924 మధ్యకాలంలో భారత పురావస్తు శాస్త్ర ఉన్నతాధికారైన సర్ జాన్ మార్షల్ పరిశోధన తవ్వకాల ఫలితంగా ప్రపంచంలోని మెసపటోమియా, ఈజిప్టు,

సుమేరియా, గ్రీసు, చైనా దేశ నాగరికతలతో సరి పోల్చదగిన నాగరికత వెలుగులోకి వచ్చింది. ఈ నాగరికతనే చరిత్రకారులు సింధూ నాగరికత, లేదా మొహెంజుదారో, హరప్పా నాగరికతలని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్ర పుస్తకాలలోను, భారతదేశ చరిత్ర పుస్తకాలలోను సింధూ లోయ నాగరికత అనే ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది.

సింధూ సంస్కృతికి పూర్వయుగం నాటివిగా భావించిన అనేక స్థావరాలు చరిత్ర గతమైన తరువాత సుమారుగా క్రీ.పూ.3500–1800 ఆరంభంలో సింధూ లోయ నాగరికత లేదా హరప్పా నాగరికత అని పిలుస్తున్న నాగరికత ఆరంభమైంది. ఇది ముఖ్యంగా పట్టణ నాగరికత. ఈ నాగరికతలో సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధిని సాధించి రాగి, కంచు మొదలైన లోహాలను వాడటం జరిగింది. 1922లో జరిగిన తవ్వకాల వల్ల పంజాబ్ రాష్ట్రంలోని మాంట్ గోమరి జిల్లాలోని హరప్పాలో ఈ నాగరికత స్థావరాలు మొట్ట మొదటిసారిగా బయలుపడటం వల్ల దీనిని "హరప్పా నాగరికత" అని పిలవడం జరిగింది. ఈ నాగరికత పంజాబ్ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోనే కాకుండా, సింధ్, బెలూచిస్తాన్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్లోని వందల ప్రాంతాలలో కూడా బయలుపడింది. హరప్పా నాగరికతను పోలిన అనేక స్థావరాలు సింధూ నది, దాని ఉప నదుల ప్రాంతాలలో విరివిగా విస్తరించినందువల్ల దీనిని చరిత్రకారులు 'సింధూలోయ నాగరికత'గా పరిగణించారు.

హరప్పా నాగరికతను మొట్టమొదటగా కనుగొన్నప్పుడు అప్పటి పురావస్తు శాస్త్రజ్ఞులు ఈ నాగరికత క్రీ.పూ.3250–2750 సంవత్సరాల మధ్యకాలంలో విలసిల్లిందని అభిప్రాయపడ్డారు. హరప్పా నాగరికత పట్టణ నాగరికత. దాని పూర్వయుగం నాగరికత గ్రామీణ నాగరికత. హరప్పా సంస్కృతి విస్తారంగా విస్తరించింది. అయినా ఈ రెండింటి మధ్య సాంస్కృతిక ఐకమత్యం నెలకొని ఉండటం ఒక విశిష్టమైన లక్షణం.

### 2.8.1.2. వైదిక సంస్కృతి:

మహోన్నతమైన సింధూ నాగరికత పతనం చెందిన తరువాత క్రీ.పూ.1500లో పంజాబ్లో నూతన నాగరికత ఆవిర్భవించింది. ఇది ఇండో–యూరోపియన్ తెగలలో ఒకటైన ఇండో–ఇరానియన్ శాఖకు చెందిందని అనేక మంది చరిత్రకారుల అభిప్రాయం. ఈ తెగను ఆర్యులు అని పిలిచారు. 'ఆర్య' అనేది జాతి నామం కాదు. వాస్తవానికి ఆర్య అనే పేరుగల జాతి లేనే లేదు. 'ఆర్య' అంటే 'పూజ్యనీయులైన' అని అర్థం. ఈ పదాన్ని ఆనాటి సాహిత్యంలో వాడారు. దీనితో వారి భాషను ఆర్యభాష గాను, ఆ భాషను మాట్లాడే ప్రజలను ఆర్యులుగాను, వారు నిర్మించిన

నాగరికతను 'ఆర్య నాగరికత'గాను పేర్కొన్నారు. ఈ నాగరికత గురించిన ముఖ్య సమాచారం వేద సాహిత్యం నుంచి లభ్యమవుతున్నందువల్ల దీనిని 'వేద నాగరికత' అని అంటున్నారు.

అనేక మంది పండితులు, ఆర్యుల జన్మస్థానం ఆర్కిటిక్ ప్రాంతమని, జర్మనీ, మధ్య ఆసియా, దక్షిణ రష్యా ప్రాంతాలని రకరకాలుగా గుర్తించారు. ప్రముఖ సంస్కృత విద్వాంసుడు, జాతీయ నాయకుడైన బాలగంగాధర్ తిలక్ 'ఆర్యులు' ఉత్తర ధ్రువ నివాసులని ప్రతిపాదించారు.

వేదకాలం నాటి సంస్కృతిని తెలుసుకోవడానికి వేద సాహిత్యమే ఏకైక ఆధారం. ఈ సాహిత్యంతోనే మనకు ఆర్యుల సమాచారం లభ్యమవుతుంది.

'వేదాలు' నాలుగు. అవి 1) ఋగ్వేదం, 2) సామవేదం, 3) యజుర్వేదం, 4) అధర్వణవేదం. ప్రతి దేశంలో సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఉన్నాయి. 'వేదా' అనే పదం 'విద్' అనే ధాతువు నుంచి ఉద్భవించింది. వేదమనగా 'జ్ఞానమని' అర్థం. జ్ఞానమనగా ఈశ్వర జ్ఞానమని తాత్పర్యం. ఈశ్వర జ్ఞానం సకల విజ్ఞానానికి పర్యాయ పదం. వీటిని శ్రుతులు (వినబడినవి) అని కూడా అంటారు. ఎందుకంటే వేదాభ్యాసం గురుముఖతా జరుగుతూ ఉండేది. ఆధ్యాత్మిక విషయాలతోపాటు, లౌకిక విషయాలను కూడా వేదాలలో వర్ణించడమైంది.

ఛందస్సుతో కూడిన మంత్రాలను ఋగ్వేదంగా, గద్యరూపంలోనున్న మంత్రాల తోపాటు, కొన్ని ఛందస్సులో ఉన్న పద్య మంత్రాలను యజుర్వేదంగాను, గేయ రూపంలో ఉన్న మంత్రాలను సామవేదంగాను, ఈ మూడింటికి భిన్నమైన మంత్రాలన్నిటినీ పొందుపరచినదాన్ని అధర్వణవేదం గాను గుర్తించారు. వీటిలో ఋగ్వేదం అతి ప్రాచీనమైంది. ఇందులో 1028 మంత్రాలు ప్రకృతి దైవరాధనకు ఉద్దేశించినవి. వీటిని కర్మకాండలు నిర్వహించే సమయంలో పఠించేవాళ్లు. యజుర్వేదంలోని మంత్రాలు క్రతులు జరిగే సమయంలో చదివేవాళ్లు. సామ, అధర్వణ వేదాలలో మంత్రతంత్రాలు ఇతరత్రా ఉన్నాయి.

భారతీయ సంస్కృతులకు వేద సాహిత్యం పునాది రాయి. భారతీయుల జీవన విధానాలకు ఇది ఆదర్శం. భారతీయ భాషా సాహిత్యాలకు మణిపూస. షడాంగాలైన శిక్ష, కల్ప, వ్యాకరణ, నిరుక్త, ఛందస్సు, జ్యోతిష్యాలు వేదాల అర్థ వివరణలకు యజ్ఞయాగాది కార్యక్రమ నిర్వహణకు ఉపయోగపడే ఆరు విషయాలను బోధిస్తున్నాయి.

### 2.8.1.3. జైన, బౌద్ధ మతాలు:

ప్రపంచంలోని ప్రముఖ నాగరికతా కేంద్రాలన్నిటిలో క్రీ.పూ.6వ శతాబ్దంలో సాంఘిక, మతపరమైన అనేక మార్పులు సంభవించాయి. ఆనాటి మత విశ్వాసాలపై, ఆచార వ్యవహారాలపై

అసంతృప్తి అధికమై నూతన తాత్విక విచారం జరిగింది. గ్రీస్ దేశంలో సోక్రటీస్ విప్లవాత్మకమైన సంస్కరణలు బోధించాడు. పర్షియాలో జొరాస్టర్ మానవునిలోని మంచికి విజయం కలుగుతుందని ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించాడు. అతని బోధనలు జొరాస్ట్రియన్ మతంగా ప్రసిద్ధి చెందింది. చైనాలో కన్ఫ్యూషియస్, లావొత్సి అనే మేధావులు అనేక సాంఘిక సమస్యలను చర్చించి, సామాజిక నీతిని ప్రబోధించే కొన్ని ధర్మ సూత్రాలను సూచించారు. ఈ రకమైన మౌలిక మార్పులు జరుగుతున్న సమయంలో భారతదేశంలో కూడా ఆనాడు ఉన్న సామాజిక, మతపరమైన సిద్ధాంతాలకు విసుగు చెందిన మేధావులు సులభమైన జీవితానికి కొత్త మార్గాలను అన్వేషించసాగారు. తత్ఫలితంగా మహావీరుడు బుద్ధుడు స్థాపించిన నూతన జైన, బౌద్ధ మతాలు ఉద్భవించాయి.

ఉత్తర భారతదేశంలో బుద్ధుడు మత సిద్ధాంతాలను ప్రచారం చేసేనాటికి 62 మత తెగలు ఉన్నాయని పాలి గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఆ కాలంలో వెలుగొందిన భిన్న మత శాఖల్లో కేవలం జైన, బౌద్ధ మతాలు మాత్రమే స్వతంత్ర మతాలుగా నిలబడగలిగాయి. నాటి మత బోధకుల్లో గౌతమబుద్ధుడు అందరికంటే ఎక్కువగా ప్రసిద్ధి పొందాడు.

క్రీ.పూ.6వ శతాబ్దంలో ఆవిర్భవించిన జైన, బౌద్ధ మతాల గురించి ఆ మతాల పుట్టుకకు కారణమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితుల గురించి మనకు జైన, బౌద్ధ సాహిత్యాలు పురావస్తు అవశేషాలు ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయి. ఆ కాలం నాటి సంఘటనలు సాంప్రదాయాల గురించి "త్రిపీటకాలు", "జాతక కథలు", "పంచనికాయములు", "అకరనాగ", "సూత్రకృతాంగులు" మొదలైనవి చెబుతున్నాయి.

**జైన మతం**:

జైన మతం అత్యంత ప్రాచీనమైంది. ఋగ్వేద మంత్రాలలో ఋషభనాథుడు, అరిష్టనేమి తీర్థంకరుల గురించిన ప్రస్తావన ఉంది. జైన సిద్ధాంతాలు ఋగ్వేదకాలం నుంచే ప్రచారంలో ఉన్నట్లుగా తెలుస్తుంది. జైనుల శ్రుతి ప్రకారం 24 మంది తీర్థంకరులు ఉన్నారు. వీరందరూ క్షత్రియులే. 'తీర్థంకరుడు' అంటే 'జీవన వాహినిని దాటడానికి వారధిని నిర్మించినవాడు' అని అర్థం. చారిత్రకంగా 'పార్శ్వనాథుడే' జైనమత స్థాపకుడు.

మానవుడు మోక్షాన్ని పొందటానికి పార్శ్వనాథుడు నియమాలు పాటించాలన్నాడు. నియమాలు కర్మను ఆపుతాయి. అంటే మనం చేసే చెడు పనులను చేయనియ్యవు. దీనిని పొందటానికి తపస్సును సూచించాడు. ఇతడు నాలుగు సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. అవి 1)

అహింస, 2) సత్యం, 3) అస్తేయం (దొంగతనం చేయరాదు), 4) అపరిగ్రహం (ఆస్తిపాస్తులుండరాదు).

వర్ధమాన మహావీరుడు తన శిష్యులకు జైన మతానికి చెందిన 5 ప్రధాన సూత్రాలను బోధించాడు. అవి 1) అహింస, 2) సత్యం పలకడం, 3) దొంగతనం చేయరాదు, 4) ఆస్తిపాస్తులు లేకుండా ఉండటం, 5) బ్రహ్మచర్యం.

జైనమతంలో 1) సమ్యక్ చరితం, 2) సమ్యక్ జ్ఞానం, 3) సమ్యక్ దర్శనం అన్నవి "త్రిరత్నాలు". అవే మోక్షానికి మార్గాలు. జైనులు త్రిరత్నాలను పవిత్రంగా స్వీకరిస్తారు.

**బౌద్ధ మతం**:

ప్రపంచంలో విలసిల్లిన 11 మతాలలో బౌద్ధమతం ఒకటి. దీనిని బుద్ధుడు స్థాపించాడు. బుద్ధుడు అంటే జ్ఞాని అని అర్థం. ఇతడు వర్ధమాన మహావీరుని సమకాలీకుడు. బుద్ధుడు ఎనిమిది నీతి సూత్రాలను బోధించాడు. 1) సమ్యక్ దృష్టి, 2) సమ్యక్ సంకల్పం, 3) సమ్యక్ వచనం, 4) సమ్యక్ కర్మ, 5) సమ్యక్ జీవనం, 6) సమ్యక్ స్మృతి, 7) సమ్యక్ వ్యాయామం, 8) సమ్యక్ సమాధి.

బుద్ధుని బోధనలలో ముఖ్యమైంది అహింసా సిద్ధాంతం. యజ్ఞ యాగాదుల్లో జంతు బలిని నిరసించాడు. ప్రేమ గుణం అలవరచుకొని ప్రతిప్రాణి దయతో చూడవలెనన్నాడు. అహింసా సిద్ధాంతాన్ని పాటించి, విశ్వంలోని సమస్త ప్రాణులపై ప్రేమను చాటి తాను చెప్పింది ఆచరించి, ప్రజలకు మార్గదర్శకుడై, విశ్వమానవ నిర్మాణానికి దోహదపడ్డాడు.

బౌద్ధమతాన్ని అవలంభించడానికి కాషాయ వస్త్రాలు ధరించి బిక్షువుకు నమస్కరించి "బుద్ధం శరణం గచ్ఛామి", "ధర్మం శరణం గచ్ఛామి", "సంఘం శరణం గచ్ఛామి" అని మంత్రం చదవాలి.

బౌద్ధ మతంలో రెండు శాఖలు కలవు. అవి 1) మహాయానం, 2) హీనయానం. మహాయానం అంటే పెద్ద వాహనమని, హీనయానం అంటే చిన్న వాహనం అని అర్థం. మహాయాన శాఖ వల్ల బౌద్ధమతం భారతదేశం అంతటా, చైనా, టిబెట్, బర్మా, సిలోన్, ఇండోనేషియా, కొరియా, జపాన్, ఈజిప్టు వంటి అనేక ప్రాంతాలకు వ్యాపించింది.

**2.8.1.4. మౌర్య సామ్రాజ్యం**:

ప్రాచీన భారతదేశ చరిత్రలో మౌర్య సామ్రాజ్యానికి చాలా ప్రాముఖ్యం ఉంది. మౌర్యవంశ రాజులు సువిశాలమైన సామ్రాజ్యాన్ని నిర్మించి దేశంలో సామ్రాజ్యాల యుగాన్ని ప్రారంభించాడు. వీరు రాజకీయ సమైక్యతను సాధించడమే కాకుండా పాలన, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అనేక

విశిష్టతలను పొందారు. విశ్వ మానవ కళ్యాణం, సోదర సౌభ్రాతృత్వం, శాంతి, అహింస, పర మత సహనం వంటి ఉదాత్త అగ్రగణ్యుడుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న అశోకుడిది మౌర్య వంశమే.

మౌర్యుల చరిత్రకు అనేక ఆధారాలు లభ్యమవుతున్నాయి. మెగస్తనీస్ రచించిన "ఇండికా", కౌటిల్యుడి "అర్థశాస్త్రం", విశాఖదత్తుడి "ముద్రారాక్షసం" మొదలైన గ్రంథాలు ముఖ్యమైనవి.

మౌర్య సామ్రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. చంద్రగుప్త మౌర్యుడు భారతదేశపు మొదటి చారిత్రక చక్రవర్తి అని, గొప్ప పరిపాలకుడని, ఇతడి కాలంలోనే మౌర్య పరిపాలనా వ్యవస్థ అభివృద్ధి చెందిందని ఆర్.కె. ముఖర్జీ అనే చరిత్రకారుడు తెలియజేశాడు.

సంక్షేమ రాజ్య ఆదర్శాన్ని అశోకుడు అమలు పరిచాడు. అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు పరిచాడు. మానవులకే కాకుండా జంతువులకు కూడా ఆసుపత్రులు నిర్మించాడు. రహదారుల నిర్మాణం, వాటి పక్కన పండ్ల చెట్లను నాటడం, బావులు తవ్వించడం, భోజన శాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు భౌతిక, మానసిక వికాసాలను తీర్చి దిద్దాడు.

భారతీయ వస్తు శిల్పకళలకు శాశ్వత రూపురేఖలు దిద్దినవారు మౌర్యులు. సింధూ నాగరికత అంతరించిన తర్వాత మనకు గోచరించే మొదటి వస్తు శిల్పం మౌర్యుల కాలం నాటిదే.

**2.8.1.5. గుప్తుల యుగం**:

క్రీ.శ.4వ శతాబ్ది ప్రథమార్థంలో 'మగధ'లో గుప్త సామ్రాజ్య స్థాపన జరిగింది. ఆనాటి వరకున్న చిన్న చిన్న రాజ్యాలను రాజకీయంగా ఐక్యం చేసి, సాంస్కృతికంగా అన్ని రంగాలను అభివృద్ధిపరిచి గుప్తరాజులు క్రీ.శ.6వ శతాబ్దం వరకు పరిపాలించారు. వీరి యుగాన్ని ప్రాచీన భారతదేశంలో "స్వర్ణయుగం"గా పేర్కొన్నారు.

గుప్త రాజులలో ప్రథముడు శ్రీగుప్తుడు. ఇతడు చైనా యాత్రికుల సౌకర్యార్థం ఒక దేవాలయాన్ని నిర్మించి, దాని పోషణకు 24 గ్రామాలను ఇచ్చాడని చైనా యాత్రికుడు ఇత్సింగ్ పేర్కొన్నాడు.

ఒక దేశం స్వర్ణయుగం సాధించింది అనడానికి ఆ దేశం అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించాలి. అట్టి అభివృద్ధి గుప్తుల కాలంలో సాధ్యమైంది. గుప్తుల కాలం ప్రాచీన భారతదేశ స్వర్ణ యుగంగా చరిత్రలో నిలిచిపోయింది. గుప్త చక్రవర్తులు క్రీ.శ.320 నుంచి క్రీ.శ.480 వరకు 160 సంవత్సరాలు పరిపాలించారు. ఈ కాలంలో చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు, స్కందగుప్తులు కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్రకారులు వర్ణించారు. దీనిని ప్రాచీన

గ్రీకు చరిత్రలోని 'పెరిక్లియన్' యుగంతోను, రోమన్ చరిత్రలోని "అగస్టన్" యుగంలోను పోల్చడం జరిగింది.

గుప్తుల యుగంలో విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలలో అద్భుతమైన అభివృద్ధి జరిగింది. ఆర్యభట్టు గణితశాస్త్రం నుంచి ఖగోళశాస్త్రాన్ని విడదీసి ఒక ప్రత్యేక శాస్త్రంగా రూపొందించాడు. ఆర్యభట్టీయం అనే గ్రంథంలో భమి తన కక్ష్యలో తాను తిరుగుతూ ఉందని దాని నీడ చంద్రుని మీద పడటం వల్ల గ్రహణాలు ఏర్పడతాయని పేర్కొన్నాడు. అందులో గణితం, రేఖాగణితం, బీజగణితాలను వివరించడమైంది.

బ్రహ్మగుప్తుడు, వరాహమిహిరుడు ఆనాటి మహనీయ ఖగోళ, గణిత పండితులు. బ్రహ్మగుప్తుడు భూమికి గల ఆకర్షణ శక్తిని వివరించాడు. పరావర్తనం చెందిన కాంతివల్ల ఖగోళంలోని వస్తువులు ప్రకాశవంతంగా కనిపిస్తాయని పేర్కొన్నాడు. వరాహమిహిరుడు తన "బృహత్ సంహిత"లో ఖగోళ, భూగోళ, వృక్ష శాస్త్రాలు వివరించాడు. ఇది ఒక విజ్ఞాన సర్వస్వంగా ప్రసిద్ధికెక్కింది.

**2.8.1.6. శాతవాహనులు**:

అశోక చక్రవర్తి మరణానంతరం మౌర్య సామ్రాజ్యం క్షీణ దశకు చేరుకోవడంతో ఆంధ్ర శాతవాహనులు స్వతంత్రులై దక్షిణాపథంలో ఒక పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించారు. భారతదేశానికి చెందిన అతి ప్రాచీనులలో ఆంధ్రులు ఒకరు. ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో వీరి ప్రసక్తి ఉంది. పురాణాలు వీరిని ఆంధ్రులు గాను, శాసనాలు, నాణాలు శాతవాహనులు గాను పేర్కొంటున్నాయి. శాతవాహనుల కాలం నాటి ప్రాకృత భాషారచన 'బృహత్కథ' ఆధారంగా రచించిన 'కథాసరిత్సాగరం', హాలుని 'గాథా సప్తశతి', వాత్సాయనుడి కామసూత్రాలు, పురావస్తు ఆధారాలైన నానేఘాట్, హథిగుంప శాసనాలు, నాణేలు, శిల్పాలు, స్థూపాలు ఆ కాలం నాటి సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులను తెలియజేస్తున్నాయి. శ్రీముఖుడు శాతవాహన వంశ స్థాపకుడు. అమరావతి, ప్రతిష్టానపురం వీరి రాజధానులు.

ప్రాకృత భాషను రాజభాషగా చేసుకున్నారు. ఆనాటి శాసనాలన్నీ ప్రాకృత భాషలో, బ్రాహ్మి లిపిలో ఉన్నాయి. ప్రాకృత భాషలో కవిత్వం చెప్పగల కవులు, కవయిత్రులు అనేక మంది ఉండేవారు. వారు రాసిన పద్య రూపకంలోని గాథలనే హాలుడు 'గాథాసప్తశతి'గా తీర్చి దిద్దాడు. కుతూహలుడు 'లీలావతి' కావ్యాన్ని ప్రాకృతంలోను, గుణాఢ్యుడు 'బృహత్కథ'ను పైశాచిక ప్రాకృతంలోను రాశారు.

ఆంధ్రదేశంలో శాతవాహనుల కాలంలో వందలాది స్థూపాల నిర్మాణం జరిగింది. అందులో ప్రసిద్ధమైనవి అమరావతి, భట్టిప్రోలు, జగ్గయ్యపేట, గుడివాడ, ఘంటసాల, గోలి, అల్లూరు, రామతీర్థం, శాలిహుండం, ఫణిగిరి, గాజులబండ, కొండాపురం ప్రసిద్ధమైనవి. అందులో అమరావతి, సాంచీ విశ్వ ప్రసిద్ధమైనవి.

భారతదేశంలోని ప్రాచీన కళా సాంప్రదాయాలైన మధుర, గాంధార శిల్ప సాంప్రదాయాల తోబాటుగా ఆంధ్రుల సాంప్రదాయం కూడా (అమరావతి కళ) ఒక ప్రత్యేకతను సంతరించుకొంది.

### 2.8.1.7. పల్లవులు:

శాతవాహనుల పతనానంతరం దక్షిణాపథంలో ఎక్కువ భూభాగాల మీద ఆధిపత్యం సంపాదించి ప్రసిద్ధి చెందినవారు పల్లవులు. ప్రాకృత శాసనాల ప్రకారం తొలి పల్లవుల రాజ్యం కాంచీపురం నుంచి వేంగి పట్టణం వరకు విస్తరించింది. పల్లవుల చరిత్రలో రాజకీయంగా, సాంస్కృతికంగా అత్యంత వైభవోపేతమైన కాలం మహాపల్లవులది. వీరినే నవీన పల్లవులని కూడా అంటారు. పల్లవ వంశ స్థాపకులు సింహశర్మ.

మొదటి నరసింహవర్మ సారస్వత, వస్తు శిల్ప, లలిత కళలను పోషించాడు. మహాబలిపురంలో ఏకశిలా రథాలనే దేవాలయాలను నిర్మింపజేశాడు. ఇతని కాలంలో చైనా యాత్రికుడు హుయన్త్సాంగ్ కంచిని సందర్శించాడు. అక్కడ నూరు సంఘారామాలు ఉన్నాయని పేర్కొన్నాడు.

పల్లవుల కాలంలో సంస్కృతం, తమిళం రెండు భాషలు ప్రజాదరణ పొందాయి. రెండింటిలో వాఙ్మయాభివృద్ధి జరిగింది. వీరి పరిపాలనా కాలం దక్షిణదేశంలో సంస్కృత భాషకు స్వర్ణయుగమని చెప్పవచ్చు. భారవి రచించిన "కిరాతార్జునీయం", దండి రచించిన "దశకుమార చరిత్ర" ప్రసిద్ధమైనవి. మొదటి మహేంద్రవర్మ స్వయంగా కవి. ఇతడు "మత్తవిలాస ప్రహసనం" రచించాడు.

### 2.8.1.8. చోళులు:

తమిళ సారస్వతాన్ని బట్టి చోళులు అతి ప్రాచీనులని చెప్పవచ్చు. సంగమ యుగంలో కరికాల చోళుని నాయకత్వం ద్వారా తమిళ దేశంలో సార్వభౌమత్వాన్ని నెలకొల్పారు. విజయాలయ చోళుడు తంజావూరులో చోళ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. చోళ రాజులందరూ పరిపాలనా దక్షకులుగా పేరు తెచ్చుకున్నారు. వీరు తంజావూరు, గంగైకొండ చోళపురంలను రాజధానులుగా చేసి పరిపాలించారు.

చోళుల గ్రామ పరిపాలనను "స్థానిక స్వపరిపాలన" అని అంటారు. ఈ విధంగా దక్షిణ భారతదేశ చరిత్రలో అత్యంత ప్రసిద్ధి పొందింది. ప్రతి గ్రామంలో గ్రామ పెద్దలు గ్రామ సభగా ఏర్పడేవారు. ఈ సభల స్వరూపం గ్రామ గ్రామానికి మారుతుండేది.

చోళుల కాలాన్ని తమిళ సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణిస్తున్నారు. శైవ, నయనార్ల "తేవారం, తిరువాచకం" పాటలు, వైష్ణవుల "నాయిలార్ ప్రబంధం" అత్యంత ప్రజాదరణ పొందాయి. రాజులు తమిళ కవులకు ప్రోత్సాహమిచ్చారు. సంస్కృత భాషలోని రామాయణ, మహాభారతాలు, పురాణాలు, వేదాంత సూత్రాలు, అలంకార ఛందోశాస్త్రాలను తమిళ భాషలో రాశారు.

దేవాలయాలలో పంచలోహ విగ్రహాలుంచడం చోళుల కాలంలో ప్రారంభమైంది. శివ, విష్ణు సంబంధమైన అనేక పంచలోహ విగ్రహాలను చోళరాజులు తయారుచేయించారు. అద్భుత కళాఖండాలైన అనేక నటరాజ విగ్రహాలు ఈ కాలం నాటివే. చోళయుగంలో చిత్రకళ కూడా వైభవ స్థితికి చేరుకుంది. తంజావూరులోని బృహదీశ్వరాలయంలోని గర్భ గృహం ప్రదక్షిణాపథంలో అనేక చిత్రలేఖనాలను మనోహరంగా చిత్రించడమైంది.

### 2.8.1.9. భారతదేశ సంస్కృతిపై ఇస్లాం మత ప్రభావం:

ప్రాచీన కాలంలో భారతదేశం పైకి గ్రీకులు, శకులు, యవనులు, హూణులు, కుషాణులు వంటి అనేక జాతులు దండెత్తి వచ్చి కొన్ని భూభాగాలను ఆక్రమించి, పరిపాలించి చివరకు భారతీయ సమాజంలో కలిసిపోయారు. కాని ముస్లింల రాకతో భారతీయ సాంఘిక, సాంస్కృతిక చరిత్రలో విప్లవాత్మకమైన అనేక పరిణామాలు సంభవించాయి.

ముస్లింలకు నిర్దిష్టమైన మతాచారాలు, నాగరికత, సంస్కృతులు ఉన్నందువల్ల వారు భారతీయ ప్రజానీకంలో కలిసిపోక, తమ ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. అంతే కాకుండా వీరు తమ జన్మభూమి ప్రాంతాలలో, దృఢమైన సంబంధాన్ని కొనసాగించారు. తద్వారా భారతీయ ముస్లింలకు పశ్చిమ ఆసియా ముస్లింలతో సన్నిహిత సంబంధం ఏర్పడి సాంస్కృతిక భావాల ప్రవాహం కొనసాగింది. ఈ సంబంధం సజీవంగా నిలవడానికి భాష ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడింది. అరబ్బీ, పారశీక భాషలను వాడుతూ వారి మతం, సారస్వతం, వస్తు శిల్ప కళలలో కొత్త సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను, భారత దేశంలో ప్రవేశపెట్టారు. హిందూ సమాజంలో సంలీనం కాకుండా, తమ ప్రత్యేకతను నిలుపుకొని వారి మత సంస్కృతులను విస్తృత పరచుకున్నారు.

శతాబ్దాల రాజకీయ, సాంఘిక పరిణామ క్రమంలో హిందూ, ముస్లింల వర్గాలు వైరం వీడనాడి కొంతవరకు సన్నిహితమయ్యాయి. ముస్లింలను భారతీయులుగా పరిగణించడం మొదలుపెట్టారు. అనేక హిందూ ఆచార వ్యవహారాలను ముస్లింలు అనుకరించారు. జాతకాలు, లగ్నాలు, శకునాలలో వీరికి నమ్మకం పెరిగింది. మృత్యువు కబళించిన వారిని భూమిలో పాతిపెట్టడం, చనిపోయిన వారి గౌరవ సూచకంగా జుట్టు తీసేయడం, విధవరాండ్ల సొమ్ములు తీసేయడం, తెల్లని వస్త్రాలు ధరించడం మొదలైన ఆచారాలు ముస్లిం సమాజంలో ప్రవేశించాయి. హిందూ సాధువుల మాదిరిగా ముస్లింలో కూడా బైరాగులు బయలుదేరారు. సూఫీ మత ప్రచారకులు హిందూ సన్యాసుల ఆచార వ్యవహారాలను అనుకరించారు. ముస్లిం సంపర్కం వల్ల హిందూ సమాజంలో కూడా కొన్ని మార్పులు జరిగాయి.

చైనా, మధ్య ఆసియా ద్వారా ముస్లింలు తుపాకి మందు ప్రయోగం తోపాటు కాగితం తయారీ విద్యను నేర్చుకొని తిరిగి భారతదేశంలో ప్రవేశపెట్టారు. గణిత శాస్త్రం, భూగోళశాస్త్రం యునాని వైద్యం వంటివి ముస్లింల సంస్కృతి ద్వారా భారతదేశానికి లభించినవే. మొత్తానికి ఇస్లాం మతం, భారతీయ సంస్కృతిపైన గొప్ప ప్రభావాన్ని చూపింది.

## 2.8.1.10. విజయనగర సామ్రాజ్యం:

మధ్యయుగం నాటి దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్యం ఒక మహోజ్జ్వల అధ్యాయం. క్రీ.శ.1336 నుంచి క్రీ.శ.1650 వరకు దక్షిణ భారత ప్రజలను అన్ని రంగాలలో తీర్చిదిద్దిన చిట్ట చివరి హిందూ రాజ్యమిదే. క్రీ.శ.1336 సంవత్సరంలో విద్యారణ్యస్వామి ఆ దేశంపైన హరిహరరాయలు, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరు సంగముని పుత్రులు అవడంవల్ల సంగమ రాజవంశమని పేరు వచ్చింది. హరిహర, బుక్కవారి ఇతర వంశీకులు క్రీ.శ.1485 వరకు విజయనగరాన్ని పరిపాలించారు.

విజయనగర సామ్రాజ్యాధీశులందరిలో శ్రీకృష్ణ దేవరాయలు అగ్రగణ్యుడు. విజయనగర చరిత్రలోనే కాకుండా భారతదేశ చరిత్రలోనే మహోన్నత స్థానాన్ని పొందిన చక్రవర్తులలో ఒకడిగా విశిష్ట స్థానాన్ని సంపాదించుకొన్నాడు. రాజనీతి యుద్ధాలలో సమర్థుడు, ప్రతిభాశాలి, బహుభాషా కోవిదుడు. సామ్రాజ్యాన్ని విస్తరిస్తూనే, తన మంత్రి హితుడైన సాళువ తిమ్మరుసుతో సుస్థిర పరిపాలనకు అవసరమైన అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు.

విజయనగరాన్ని సందర్శించిన విదేశీ యాత్రికులు సంఘంలో బ్రాహ్మణులకు గల విశేష గౌరవాలను ప్రత్యేకించి పేర్కొన్నారు. అబ్దుల్ రజాక్, డామింగో పేస్లు శ్రీకృష్ణదేవరాయలు బ్రాహ్మణుల పట్ల చూపిన భక్తి గౌరవాలను పేర్కొన్నారు.

దక్షిణ భారతదేశానికి, హైందవ సంస్కృతికి విజయనగర సామ్రాజ్యం ఒక స్వర్ణయుగం. ఈ యుగంలో జరిగినంత సాహిత్య సృష్టి మరే యుగంలోను జరగలేదు. విజయనగరాధీశులు, వారి సామంతులు ప్రతిభావంతులైన కవులను ఆదరించి, పోషించి అనేక కావ్య రచనలు చేయించారు. వీరు సంస్కృత విద్యను పోషిస్తూనే దేశీయ భాషలైన తెలుగు, కన్నడ, తమిళ భాషలను కూడా పోషించి ఆయా భాషా సాహిత్యాలను ప్రోత్సహించారు.

తెలుగు సాహిత్య చరిత్రలో విజయనగర యుగాన్ని ప్రత్యేకించి చెప్పవచ్చు. మొదటి బుక్కరాయలు "ఉత్తర హరివంశాన్ని" రచించిన నాచన సోముని పోషకుడు. నంది మల్లయ్య – ఘంట సింగయ్య అనే జంట కవులు తుళువ నరస నాయకుని కాలం వారు. వీరు "వరాహ పురాణం, నరసింహ పురాణం, ప్రబోధచంద్రోదయం" అనే కావ్యాలను రాశారు.

'సాహితీ సమరాంగణ సార్వభౌమ' అనే బిరుదు ధరించి, ఆంధ్ర భోజుడు అని పిలిపించుకున్న శ్రీకృష్ణదేవరాయలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ప్రకటించి 'ఆముక్తమాల్యద' అనే మహా ప్రబంధాన్ని రచించాడు. ఇతని ఆస్థానంలో అష్టదిగ్గజాలు ఉండేవారు. ఆంధ్ర కవిత పితామహుడు అల్లసాని పెద్దన 'మను చరిత్ర'ను రాయల వారికి అంకితం ఇచ్చాడు. నంది తిమ్మన 'పారిజాతాపహరణం', ధూర్జటి 'శ్రీకాళహస్తి మాహాత్మ్యం', మల్లన 'రాజశేఖర చరిత్ర' వంటి ప్రసిద్ధ కావ్యాలన్నీ ఈ కాలంలో అష్టదిగ్గజాలు సృష్టించినవే.

సంకుసాల నృసింహ కవి "కవి కర్ణరసాయనం", అయ్యలరాజు రామభద్రుని "రామాభ్యుదయం", రామరాజ భూషణుని "నరస భూపాలీయం", తెనాలి రామకృష్ణుని "పాండురంగ మాహాత్మ్యం" మొదలైన కావ్యాలన్నీ కూడా ఆనాటివే.

విజయనగర ప్రభువుల కాలంలో నిర్మించిన దేవాలయాలు రాయలసీమలోని లేపాక్షి, పెనుగొండ, కదిరి, గోరంట్ల, తాడిపత్రి, పుష్పగిరి, మార్కాపురం, సోమపాలెం, నాగులాపురం మొదలైన గ్రామాలలోను, తెలంగాణ ప్రాంతంలోని జటప్రోలు, మంచాలకట్ట మొదలైన గ్రామాలలోను ఉన్నాయి.

## 2.8.2. తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు (2008):

ఆంధ్రులకు పవిత్రమైన భూమి, ఆవేశమిచ్చే ప్రదేశము తెలంగాణ. ఇట్టి పుణ్యభూమిని ఇచ్చటి కవులు తీరు తీరులుగా దర్శించి ఇక్కడ వెలసిన శిల్పకళా లక్ష్మికి నీరాజనములిచ్చి, ఇచ్చటి ప్రాచీన వైభవాన్ని సగర్వంగా కీర్తించారు. "రామప్ప గుళ్ళలో రవణించు మూర్తుల, యందచందంబుల నాకళించి! పాకాల చెరువులో బాలనురుగులతేట, సరస మాధుర్యంబు సంగ్రహించి" అని ఈ ప్రాంతం కవులు వైతాళిక గీతాలు పాడారు.

తెలంగాణ ప్రప్రథమ ప్రజాకవి అని పలువురి ప్రశంసలకు పాత్రుడైన కాళోజీ నారాయణరావు ఓరుగల్లు నగరంలో జరిగిన దశమాంధ్ర మహాసభ స్థాయిసంఘ సమావేశానికి విచ్చేసిన ప్రతినిధులకు స్వాగతం చెబుతున్న సందర్భం గురించి

**"పోతన నాగలి చాలుబారినా**
**పుణ్యక్షేత్ర మిద్దీ,**
**ఖ్యాత చరిత్రుని విద్యానాథుని**
**గాంచిన దేశంబూ,**
**ప్రతాపరుద్రుడు పరిపాలించిన**
**పట్టణరాజంబూ,**
**తొమ్మిది లక్షల ధనుర్ధరులకు**
**దొరయై వెలిగాడూ,**
**కొమ్మలు తిరిగిన యోధులెందరో**
**కొల్చుచుండి రతని,**
**పతాకమెత్తి ఆంధ్ర చరిత్రము**
**ప్రకటించే నతడూ,**
**పూతచరిత్రులు, ధీరుల వీరులు**
**పుట్టిన చోటిద్దీ**
**పాడిపంటలకు పెట్టినపేరై**
**వర్ధిల్లిన పుడమి" (తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:07)**

అని సభాసదులకు తెలంగాణ గోదు విన్నవించుకొన్నారు.

ప్రాచీనాంధ్ర నగరాలలో ఒకటియై, ఆంధ్రులకు శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టిన కాకతీయ సామ్రాజ్యానికి రాజధానియైన ఓరుగల్లు నగరం చరిత్ర ప్రసిద్ధికెక్కిన నగరాలలో ముఖ్య స్థానాన్ని అలంకరిస్తుంది. ఈ నగరాన్ని చూచి, దీని కథలు, గాథలు విని తన హృదయావేదనను ప్రకటించని కవి లేదు. తెలంగాణ సారస్వత రంగంలో ప్రముఖులైన దేవులపల్లి రామానుజరావు ఈ నగరాన్ని వర్ణించిన సందర్భం గురించి

**"ఆంధ్ర నగరీయని అల్లారుముద్దుగా**
**పిలిచె విద్యానాథ డెలమి నీమె**
**అల్లుని స్వేచ్ఛకై నెల్లూరి నెరజాణ**
**పఠియించే నిచటనే భారతంబు**
**జానుతెనుంగున శైవప్రబంధము**
**లోర్మలకెత్తి యిచటనే మొగ్గ దొడగె**
**సుందరమందార సుమదామ మొక్కటి**
**పోతన గ్రుచ్చె నీ పొలమునందు**
**ఆర్ద్ర హృదయాన నెందరో ఆంధ్ర కవులు**
**ఆలపించిరి యిచటనే ఆత్మగీతి**
**తలచతెంచినంతనె మేనెల్ల పులకరించు**
**అక్కటా నాటి శోభ యేమాయె నేడు!"**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:08)**

అని వితర్కించుకొని తెలంగాణ దుస్థితికి కారణాల నెరసి మాతృభాషా వ్యాప్తికి సేవచేయ నుత్సహించి తదాదిగా అదే కృషిలో నిమగ్నులైనారు.

ఓరుగల్లు శిల్ప సంపద అనన్య సామాన్యమైనది. చారిత్రకంగా ఈ నగరానికి ఎంతటి ప్రశస్తి కలదో దీని శిల్ప కళాసంపద కూడా అంతే ప్రశస్తి కాంచినది. ఈ శిల్ప సంపదను గూర్చి శేషాద్రి రమణ కవులు వ్రాసిన పద్యం చూడండి:

**చెదరి వీధులబడ్డ సింహవిగ్రహములు**
**గజరాజముల మేగలిపి కొమ్ము**
**బల్లెంబుగొని క్రొచ్చవచ్చు రాహుతుమేను**
**థిలాశ్వ తనువులో జేర్చుకొమ్ము**

కూలిపోయిన శిలాకుంభముల మహోన్న

త ద్వార శిఖరముల దార్చుకొమ్ము

విరిగిన రమణీయ విగ్రహావళి దేవ

నిలయ సీమలలోన నిలుపుకొమ్ము

అవల కనుదోయి మూసి మహేంద్ర నగర

దివ్యతర రూపరేశ చిత్రించుకొమ్ము

ఆంధ్ర సోదర నీకు మహేంద్ర నగర

గురుతర మహస్సు మదిలోన గోచరించు

(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:09)

ఓరుగల్లు కోట ఆంధ్ర దేశములోని ప్రఖ్యాత దుర్గములలో ఒకటి. ఇది 12వ శతాబ్దంలో గణపతిదేవునిచే నిర్మించబడింది. గణపతిదేవుని అనంతరం ఆయన కుమార్తె రుద్రాంబ ఓరుగల్లు కోటను బాగా దృఢ పరిచి శత్రు దుర్భేద్యంగా చేసింది. "పోతన చరిత్ర" కావ్యకర్త వానమామలై వరదాచార్యులు ఓరుగల్లు కోటను గూర్చి ప్రస్తావిస్తూ

కుక్కలు జింపు విస్తరిగ గూలిన ఓర్గల్లు కోట గంటివే

ముక్కున బ్రాణముండియును మూతికి మీసముగల్గ నాంధ్రుడా

తక్కిన మాట లేమిటికి తన్నిన వెన్నున చప్పుడాయె ని

ప్పెక్కడనో యటంచు వెనకేనియు చూడని సోమరుల్ నృపుల్

దిక్కయి దీని కింత గతి దెచ్చిరి! కాకతి బెబ్బులుల్ రుసల్

గ్రక్కెడి చోట గర్జలెడి గడ్డపుమేకలు గూబమూక లిం

దొక్కకరంబు ఫాలమున నుంచెదు నా బహుపాపమంచు ఆ

చుక్కల చందమామ తలనూపడ తిరిగి ప్రతాపరుద్రుడై

(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:09)

అన్నారు.

కాకతీయ రుద్రదేవ చక్రవర్తి లలిత కళాభిమాని. ఇతడు రాజధానియైన హనుమకొండలో వెయ్యి స్తంభాల గుడి అని వ్యవహరించబడుతూ ఉన్న దేవాలయాన్ని అతి రమణీయంగా నిర్మించాడు. క్రీ.శ.1163లో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. వెయ్యి స్తంభాల దేవాలయంలో

మండపముపై జీవకళ లుట్టిపడు దేవతామూర్తుల శిల్పం వర్ణనాతీతం. ఈ శిల్పాన్ని వానమామలై వరదాచార్యులవారిలా ప్రస్తుతించారు.

**నీలపు రాలదంతములు నీడలు కన్పడ చెక్కినట్టి దే**
**వాలయమూర్తులం వడియవైచిన తుమ్మెద వన్నియలే కలా**
**శాలలు గట్టుకొన్న విటు, చేయడ చప్పున జారు శిల్ప ఖం**
**డాలనవత్కలాధనుల నాట్యములాడుట నేత్రపద్మముల్**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:10)**

వెయ్యి స్తంభాల దేవాలయంలో వాసుదేవరకు అభిముఖంగా ఉన్న నంది చూడవలసిన శిల్పాలలో ఒకటి. ఇది పడుకున్నట్లుగా ఆరడుగుల ఎత్తున చెక్కబడింది. ఆంధ్ర దేశ ప్రాచీన పశుసంపదకిది తార్కాణమేమో అనిపిస్తుంది. వెయ్యి స్తంభాల గుడి కాకతీయుల శిల్ప కళా సంపదకు ఒరవడి. దేవాలయాల ద్వారా శాఖలపై రమణీయ శిల్ప విన్యాసాల వెలయించుట కాకతీయ శిల్పమునందలి వైశిష్ట్యం.

తెలంగాణలో ఆలంపూరు సుప్రసిద్ధ యాత్రా స్థలం. ఇది తుంగభద్రా నదీ తీరాన ఉన్నది. శ్రీశైల పశ్చిమ ద్వారమని, దక్షిణ కాశియని ఖ్యాతిగాంచినది. ఇక్కడ భారత వర్షములోని మత శాఖలన్నిటికీ సంబంధించిన దేవతా మూర్తులుండడం ఒక విశేషం. కేశవపంతుల నృసింహశాస్త్రి ఈ క్షేత్రాన్ని గూర్చి వ్రాస్తూ

**తలప శ్రీశైల పశ్చిమద్వారమగుచు**
**వరలి బ్రహ్మే శ్వరాఖ్యాన పరమ శివుని**
**కాపురంబున దక్షిణ కాశి యగుచు**
**బొలుపు మీరును మా యలంపురము సతము**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:11)**

అన్నారు. ఇచ్చట ప్రాచీన చాళుక్య, పశ్చిమ చాళుక్య, కాలచుర్య, కాకతీయ, తెలుగు, చోళ, విజయనగర సార్వభౌముల కాలం నాటి శాసనాలెన్నో ఉన్నవి.

తెలంగాణ కవులలో దాశరథి అగ్రగణ్యుడు. తెలంగాణ పేరు చెప్పగానే కవులలో చప్పున దాశరథి స్ఫురణకు వస్తాడు. తెలంగాణయే దాశరథి, దాశరథియే తెలంగాణ అన్నట్లుగా ఈయన రచనలు చేశాడు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని ఈయన గొంతెత్తి చాటాడు. ఎక్కడ కవి

సమ్మేళనంలో పాల్గొన్నా మొదట తాను వ్రాసిన ఈ పద్యాలు చదివిన తరువాత ఇతర రచనలు చదివేవాడు.

**"కోటి తెలుగుల బంగారు కొండ క్రింద**
**పరచుకొన్నట్టి సరసు లోపలవసించి**
**ప్రొద్దుప్రొద్దున అందాల పూలుపూయు**
**నా తెలంగాణ తల్లి కంజాతవల్లి"**

**"వేయిస్తంభాలగుడి నుండి చేయిసాచి**
**ఎల్లోరా గుహలందున పల్లవించి**
**శిల్పి ఉలిముక్కులో వికసించినట్టి**
**నా తెలంగాణ కోటి పుణ్యాల జాణ"**

**"మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితాజవమ్ము కూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడిపినట్టి**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ"**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:11)**

చిరుప్రాయం నుంచే కవితా రచన చేస్తూ వచ్చిన ఈయన తెలంగాణలోనే గాక యావదాంధ్రమునకు సంబంధించిన సంఘటనలను, చారిత్రక విశేషాలను ఇతివృత్తాలుగా తీసుకొని ప్రౌఢమైన రచనలు చేశాడు. హైదరాబాద్ ప్రజా పోరాటంలో బందీయై నిజామాబాద్ జైలులో శిక్ష అనుభవించాడు. అది అసలు కారాగారము కాదు. ఇందుపుర దుర్గమని మహారాష్ట్ర వీరుడు ఛత్రపతి శివాజీ అనుచరుడైన రఘునాథరాయలు కట్టించిన కోట. దానినే నిజాం నిరంకుశ ప్రభుత్వ హయాంలో జైలుగా మార్చారు అనే ఒకప్పటి సంగతి తెలిసి దాశరథి ఇలా రాశాడు.

**"నశియించెన్ రఘునాథయోధుని దివాణమ్ముల్, మహారాష్ట్ర వీ**
**ర శివాజీ గురురామదాస రసనాగ్రవ్యగ్రమంత్రౌఘముల్**
**నశియించెన్ రఘునాథ దేవళము లీనాడీ నిజాంరాక్షసీ**
**నిశిరాసిన్ బడి బందిఖానయయి కన్పించెన్ వికారమ్ముగా"**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:12)**

తెలంగాణలో మంజీరా నది ప్రవహిస్తుంది. ఈ నది బాలగిరి కనుమల్లో ఉద్భవించి తెలుగింటికి జారివచ్చిన తెలంగాణ ముద్దు బిడ్డ. దీనికి నిజామాబాద్ జిల్లాలో ప్రాజెక్టు కట్టబడింది. అదే నిజాంసాగర్ ప్రాజెక్టు. మంజీర నదిని గూర్చి దాశరథి చక్కని ఖండకావ్యం వ్రాశాడు. మంజీరలో ఈయన ఇలా అంటాడు.

**"ఎవరి గజ్జెల రవళివే నీవు! మంజీర**
**ఎవరి కజ్జెల భాష్పధారవే! మంజీర"**
**"నీవు పారిన దారిలో పెక్కు దండాలు**
**నీవు జారిన జాడలో అమృత భాండాలు**
**నీవు దూకిన నేల మాకు విద్యున్మాల**
**నీలు ప్రాకిన పథము మాకు చైత్రరథమ్ము**
**ఎవరికొరకయి పరుగులెత్తి వచ్చితివి?**
**ఎవరి జూచి తటాకమై నిల్చిపోతివి?**
**నా తెలుగునింగి నీడల నడచి నడచి**
**తెలుగు నడతలు నేర్చుకోగలిగినావు"**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:13)**

మెదకు మండలంలో ఒకచోట మంజీరా నది ఏడు పాయలుగా చీలుతుంది. ఏడు పాయలుగా మంజీర చీలిన చోట "ఏడు పాయల దుర్గాదేవి" వెలిసింది. అక్కడ ఏటేటా జాతర జరుగుతుంది. కవి మంజీరను ప్రదర్శిస్తాడు.

**ఎవ్వరే యెదురొచ్చి ఏడుపాయలు చేసి**
**రవ్వల్ల వీణగా రాగమెత్తిరి నిన్ను?**
**"ఏడుపాయల దుర్గ" ఏమన్నదే నిన్ను?**
**యేమన్నదే నిన్ను యేడుపాయల దుర్గ?**
**"మంజీరామ తల్లి**
**తెలంగాణ రైతుల కల్పవల్లి"**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:13)**

కృష్ణ, గోదావరి, తుంగభద్ర, కిన్నెరసాని నదులు ఇటు తెలంగాణలోను, అటు ఆంధ్రదేశంలోను ప్రవహిస్తున్నాయి. ఇవి కొన్నిచోట్ల ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలకు ఎల్లలుగా కూడా ఉన్నవి. ఈ నదీ మార్గాలలో ఒక ఒడ్డు వైపు ఉండే ఆంధ్రులు ఒక రాష్ట్రంలోను, అదే నది అవతల ఒడ్డున ఉన్న ఆంధ్రులు మరో రాష్ట్రంలోను ఉండడం అసహజంగా కనబడింది దాశరథికి. ఆ నదుల చెంత నిలబడి అటూ ఇటూ ఒడ్డులను పరికిస్తే రెండు ప్రాంతాలు ఏకం అయ్యేటట్లే కన్పించాయి. కనుకనే మహాంధ్రోదయం కొరకై మాతృభూమితో ఇలా అన్నాడు.

**తుంగభద్రానదీ భంగమ్ము లిరుకేల**
**లొరసిపారుచు రుచు లరయుచుండ**
**కృష్ణవేణీ తరంగిణి నాలుకలు సాచి**
**దరుల రెండిట మజాలరసిపోవ**
**గోదావరీ వీచికా దివ్య హస్తమ్ము**
**లిరుకెలంకుల మన్ను తరచుచుండ**
**బోటి కిన్నెరసాని మాటిమాటికి పొంగి**
**రెండు క్రేవల దరులండ గొనగ**
**ఇటునటును తెల్గునేల లారటముఱెంది**
**కలిసిపోజూచుచున్న యట్టులనె తోచు,**
**కలిపివేయుము నా తెలంగాణ తల్లి**
**మూడు కోటుల నొక్కటే ముడి బిగించి!**

**(తెలంగాణ సాహిత్యం – తెలుగు సాహితీ మూర్తులు, పుట:14)**

కవిగా దాశరథికి అద్దం పట్టేది "అగ్నిధార" కావ్య సంపుటి. అందులో పరపీడనను దహించివేసే అగ్నిధార లేక, అమృతధారలు ఉన్నాయి. "రైతుదే, తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే", "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" వంటి పద్య పంక్తులతో తెలంగాణ ప్రజానీకం హృదయాలను చూరగొన్నాడు. 1948 జనవరి 11వ తేదీ రాత్రి రజాకారు మూకలు నిజామాబాద్ జైలులో రాజకీయ ఖైదీలపై మారణాయుధాలతో దాడిచేశారు. వట్టికోట ఆళ్వారు స్వామి, శ్రీనివాస లాహోటి, దాశరథి ఆ జైలులోనే ఉన్నారు. "కవిని చంపండి" అంటూ మూకలు బీభత్సం చేసాయి. దెబ్బలకు దాశరథి స్పృహ తప్పి పడిపోయాడు. మిత్రులు తక్షణమే సురక్షిత స్థలానికి చేర్చారు. దాశరథి రచించిన "తెలంగాణోపాఖ్యానం" జైలులో పోయింది. పోలీసు

చర్య తరువాతనే ఈయన జైలు నుంచి బైటపడ్డాడు. నిజాం నిరంకుశ పరిపాలనను తుదముట్టించడంలో రాజకీయ పార్టీలకే కాక కాళోజీ నారాయణరావు, దాశరథి వంటి కవుల పాత్ర విస్మరింపరానిది.

దాశరథి, సి. నారాయణరెడ్డిని కవిగా ప్రోత్సహించి పైకి తేవడం జరిగింది. ఆ విషయాన్ని సినారె ఒక పద్యంలో ఇట్లా చెప్పారు. "నా తరుణ కావ్య లతికలా నాడు పైకి ప్రాకులేక దిక్కులు సూడ నీకరాలు, సాచి లేత రేకులకు కెంజాయలద్ది, మించు పందిళ్ళ పైకి ప్రాకించినావు" అంతే కాదు దాశరథి కవితా శక్తిని ప్రస్తుతిస్తూ "నీ కలమందునన్ మహోగ్రా శనిపాతముల్ వెలయు స్నిగ్ధ స్నేహ బంధాల బద్ధులమై యుందుము. విన్పింతమాంధ్రుల చైతన్య విపంచికావళులు" అంటూ తమ మైత్రి శాశ్వతం కావాలని కాంక్షించారు.

దాశరథి అభ్యుదయ కవిగానే గాక నియో క్లాసికల్ కవిగా, శృంగారమును చక్కని పద్యాలలో వ్యక్తం చేసిన కవిగా కూడా కవితా లోకంలో పేరు పొందాడు. వీటిలో చక్కని పదబంధములు, శబ్ద చిత్రణములు, భావ చిత్రాలు రసజ్ఞులను ఆకట్టుకొంటాయి.

దాశరథి ఆంగ్లకవి టెన్నిసన్ వలె నవాబ్ద కవి. దాదాపు ప్రతి ఉగాదికీ స్వాగతం పలుకుతూ పద్యాలు గేయాలు రచించాడు. ఉగాది రాకడను గూర్చి చెబుతూ "గోరంటల చాటు నుండి ఒక యవ్వని నవ్వినయట్లు వచ్చెడిన్" అన్నాడు. వసంత ఋతువుల రాకతో ప్రకృతిలో వచ్చే మార్పులను కడు రమణీయమైన పదజాలంతో పద్యాలలో బంధించాడు. నవాబ్దమును నాతితో పోల్చుతూ నూతన సంవత్సరమనే సఖీ రాగానే ఆమె ముఖరాగమున కౌగిలిని, చరణాహతిని, ప్రహారమున నందిన దివ్యవాటిలోని చంపక, కురంటక, అశోక, పున్నాగ, భూజములు పూచినవట. మరొక పద్యంలో మోదుగు పూల వర్ణ శోభలోకి, మోదుగు పూలంటే ఏ మాత్రం ఎన్నడు మోజు చూపనట్టు అప్సరసలకు తేవడం ఈయన నవ్యతా ప్రీతికి నిదర్శనంగా ఉంది.

దాశరథి ఆంధ్రప్రభలో సహాయ సంపాదకుడిగా వ్యాసాలు రాశాడు. రేడియోలో ప్రొడ్యుసర్గా, కార్యక్రమ నిర్వాహకుడుగా ఉన్నాడు. సినిమాలకు పాటలు రచించాడు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన కవిగా పదవి అధిష్టించాడు. ఉర్దూ కవులు పలువురు ఈయనకు సన్నిహిత మిత్రులు. మఖ్దూం మొహియుద్దీన్, సాహిర్ లూథియాన్వి, షకీల్ బదాయాని వంటి కవుల రచనలంటే ఇష్టంగా మననం చేసుకునేవాడు.

★★★

# అధ్యాయం – 3

# దేవరాజు మహారాజు రచనలు – వస్తు విశ్లేషణ

# అధ్యాయం – 3

# దేవరాజు మహారాజు రచనలు – వస్తు విశ్లేషణ

## 3.1. వస్తువు:

ఏ కవికైన కవితా వస్తువు తన చుట్టూ ఉన్న సమాజమే. తాను చూసినవి, విన్నవి, అనుభవించేవి అన్ని కవిత్వంలో భాగమైపోతాయి. "కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల కాదేది కవిత కనర్హం" అని శ్రీ శ్రీ అన్నట్లే కవికి అన్నీ కవితా వస్తువులే. కవితా వస్తువు కానిది బహుశ ఈ సృష్టిలో ఏమి మిగలదేమో. కవియైన వాడి ప్రధాన గుణం స్పందన. ప్రతి సూక్ష్మాంశాన్ని కూడా స్పందించి కవితావేశానికి లోనవుతుంటాడు. తనదైనా కాకపోయినా, తనవారైనా కాకపోయినా, తనకు సంబంధం ఉన్న లేకపోయినా ప్రపంచంలో నలుమూలల ఏమి జరిగిన వెంటనే స్పందిస్తాడు కవి. కవిని ప్రభావితం చేసే ప్రతి సన్నివేశం, ప్రతి సంఘటన, ప్రతి దృశ్యం, ప్రతి మాట, ప్రతి స్పర్శ వెంటనే కవిత్వమై కూర్చొంటుంది. అంటే కవికి భావావేశం అంత గొప్పదన్నమాట.

సమాజానికి వెలుపల లేదా సమాజానికి సంబంధం లేని సృష్టికి అతీతమైన కవితా వస్తువు ఎవర్ని కదిలించలేదు. సమాజంతో సంబంధం లేని ఏ వస్తువు కవిత్వీకరించబడినప్పటికీ ప్రజాదరణ పొందలేదు. ముందు సమాజం, మానవులు, వారి ఆలోచనలు, ప్రవర్తన, కార్యకలాపాలు మనిషి జీవితంతో ముడిపడి ఉన్న ప్రకృతి, పరిసరాలు వాటి తీరుతెన్నులు ఇవే కవికి కవితా వస్తువులు.

దేవరాజు మహారాజు కవిగా వీటన్నింటినీ స్పృశించినవాడే. సమాజం అందులోని వ్యక్తుల యొక్క బాహ్యాంశాలు, ఆంతరంగిక అంశాలు రెండు వీరి కవిత్వంలో ప్రధాన వస్తువు.

వస్తు సౌందర్యం కంటే వస్త్వాత్మకతకు ప్రాధాన్యం ఇస్తాడు ఈ కవి. ఆంతరంగిక అంశాల పరిశీలనపై ఈ కవికి మక్కువ ఎక్కువ. ఈ కవి వాస్తవికుడు, అనుభవజ్ఞుడు. అందుకే బాహ్య, అంతరాత్మను దర్శిస్తూ వాస్తవికతను కవిత్వీకరిస్తాడు.

తన చుట్టూ ఉన్న మనుషులు, వారి స్వభావాలు, ఆలోచనలు, ప్రవర్తన, వైఖరులు, పోకడలు, ఆశయాలు, అనుభవాలు, చింతన, కోరికలు, అలవాట్లు, సమకాలీన సమస్యలు, ఆర్థికం, రాజకీయం, దోపిడి, బీదవాని జీవిత చిత్రణ, చైతన్యం, గురువు, విద్యార్థి, స్త్రీ, అక్షరం మొదలైనవన్నీ ఈ కవికి కవితా వస్తువులు. ప్రతి అంశాన్ని లోపలికంటూ తొంగిచూడడం ప్రత్యేక లక్షణంగా గమనించవచ్చు. దేనిని పైపైన చూస్తూపోడు. తెలిసి తెలియనట్లు మాట్లాడడు. తొందరపాటు

తత్వాన్ని చూపించడు. చెప్పవలసిన విషయాలను సూటిగా చెప్పడం వీరి ప్రత్యేకత. ఈ కవి యొక్క కవితావస్తువులను గమనిస్తే ఇన్ని నిగూఢ భావాలు అర్థమవుతాయి.

సందర్భం వచ్చినప్పుడల్లా సందర్భం కల్పించుకుని మరీ సందర్భోచితంగా ఆయా విషయాల తీరుతెన్నులు, సాధకబాధకాలు తన కవితలో పేర్కొంటాడు ఈ కవి.

అక్షరం, కవిత్వం, తనకు కవిత్వంపై గల అభిమానం, తన కవితారీతి, రచయితపై తన అభిప్రాయం తన కవితల్లో అంతర్లీనంగా గాక బాహ్యంగానే ప్రకటింపచేస్తాడు. చెప్పవలసిన విషయాలు సూటిగా చెప్పడం ఈ కవి ప్రత్యేకత. కవిత వస్తువు స్వతంత్రం రోజు దినపత్రికలలో వచ్చే వివిధ రకాల వార్తలు, సమకాలీన సామాజిక అంశాలు వీరికి ఇంకా ప్రేరణ కలిగించి ఉండవచ్చు.

### 3.2. కవిత్వం:

నిగూఢతను కలిగి, సాధారణ వాక్యానికి భిన్నంగా ఉండి మనసును రంజింపజేసే, ఆలోచింపజేసే రచనను కవిత్వం అంటారు. కవిత్వం ఒక సృజనాత్మక సాహితీ ప్రక్రియ. కవిత్వం ఒక నిరంతర సాధన. సాధన ద్వారా కవిత్వాన్ని మెరుగు పరచుకోవచ్చు. కవిత్వం అంటే అక్షర హింస కాదు. కవిత్వం అంటే అక్షర తాండవం. కవిత్వం అంటే ఒక అన్వేషణ, ఒక తీరని వేదన. కవిత్వం ఒక పరిశీలన.

### 3.3. కవిత్వంపై ప్రముఖుల వ్యాఖ్యలు (కవిత్వం నిర్వచనాలు):

1. "కవిత్వమొక తీరని దాహం" – శ్రీశ్రీ.
2. "వడగాడ్పు నా జీవితం. వెన్నెల నా కవిత్వం" – గుర్రం జాషువా.
3. "అబద్ధాలాడడమంత సులభం అవదు సుమా! కవిత అల్లడం" – దాశరథి కృష్ణమాచార్య.
4. "ఆధునిక కవిత్వం అర్థం కాలేదంటే, ఆధునిక జీవితం అర్థం కాలేదన్న మాటే" – శ్రీశ్రీ.

### 3.4. కవిత్వం వస్తు పరిచయం:

ప్రాచీన కాలం నుండి మానవుడు తన జీవితంలో వివిధ పార్శ్వాలను, వాటి భావాలను వ్యక్తం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాడు భావాల అభివ్యక్తీకరణకు ప్రధాన సాధనం భాష. అయితే మానవుడు తన అనుభవాల్ని, అనుభూతుల్ని రమణీయంగా, రసాత్మకంగా

అభివ్యక్తీకరించే ప్రయత్నాన్ని 'కవిత్వం'గా పిలవడం జరుగుతుంది. ఈ ప్రయత్నం చేసేవాడిని కవి అనే అంటున్నాం.

ఆధునిక జీవితంలోని విభిన్న అంశాలన్నీ ఆధునిక కవిత్వంలో వస్తువులే. వాస్తవికత ఆధారమైన సాహిత్యంలో వస్తువుకు ప్రాధాన్యం ఉంటుంది. కవి ప్రాపంచిక అనుభవం నుండి కొన్ని అంశాల్ని ఎంచుకొని వాటిని ఇతరులకు అనుభూతమయ్యేటట్లు రచన సాగిస్తాడు. ఆ విధంగా కవి దేనినైతే అందించ దల్చుకున్నాడో దానినే వస్తువుగా పరిగణించాలి. ప్రాచీన కవిత్వంలో వస్తువు పురాణాల చుట్టూ, ఇతిహాసాల చుట్టూ తిరుగుతూ ఉండేది. రాజుల్ని కీర్తించడం, రాజ వంశాల్ని కీర్తించడం, ప్రకృతి వర్ణనలు, స్త్రీ వర్ణనలు, శృంగారం ఇవే వస్తువులుగా సుమారు 19 వందల ఏళ్ళు కనిపించాయి. అయితే ఆధునిక భావన కవిత్వ వస్తువులో గణనీయమైన మార్పుల్ని తీసుకొచ్చింది. జీవితంలోని ఏ అంశాన్నైనా వస్తువుగా స్వీకరించగలిగే స్థైర్యం కవికి అలవడింది.

ఆధునిక కవిత్వంలో ప్రబంధ సాహిత్యంలో వలె చల్లని వెన్నెల పుష్ప సౌరభాలు, మంచు చల్లదనం, స్త్రీల అంగాంగ వర్ణనలు మొదలైనవి కనిపించవు. ప్రపంచీకరణ ప్రమాదంలోని నేటి లోకం తీరు శ్రామికుల బాధలు, నేటి రాజకీయ పరిస్థితులు, భ్రష్టుపట్టిపోతున్న సినిమాలు, ప్రజలపై వాటి ప్రభావం, స్త్రీల బాధల గాథలే కవిత్వ వస్తువులుగా కనిపిస్తున్నాయి. సాహిత్యానికి, సమాజానికి ఎంతో దగ్గరి సంబంధం ఉంటుంది. ఈ మారుతున్న సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని తన సాహిత్యాన్ని ముందుకు నడిపించేవాడే నిజమైన కవిగా గుర్తింపు పొందుతాడు.

## 3.5. కవిత్వం – వస్తు విశ్లేషణ:

### 3.5.1. స్మృతి:

'Elegy' అనే ఆంగ్ల పదానికి తెలుగులో స్మృతి గీతాలు అని పేరు. ఎలిజీ ప్రధానంగా ఆంగ్ల సాహిత్యానికి చెందింది. ఎలిజీ మరణించిన వారి మీద రాసే శోక గీతం.

"ఒక ప్రాణి మరణం వల్ల ఉద్విగ్నుడైన కవి తన హృదయాంతరంలో పరాకాష్ఠ పొందిన భావ తీవ్రతని ఒక రచనలో ఇమిడ్చి చూపిస్తే అది స్మృతిగీతం"[18].

దేవరాజు మహారాజు కవిత్వంలో ఇష్టజన వియోగ ఫలితమైన స్మృతి కవిత్వం కూడా సముచితంగా ఉందని చెప్పవచ్చు. మహా జ్యోతి, అంతిమ సందేశం, గ్రేట్వాల్, సయోనారా, ఎలిజీ వంటి కవితలు ఈ కోవకు చెందినవి.

[18] లక్ష్మీనారాయణాచార్యులు, వాడపల్లి, వ్యాస సంకలనాలు, పుట–13.

దక్షిణాఫ్రికాలో ఉరి తీయబడ్డ "బెంజమన్ మొలోయిస్"ను తలచుకొని విప్లవ స్ఫూర్తిని పొంది, నీగ్రోలతో తాదాత్మ్యం చెందాడు కవి 'అంతిమ సందేశం' కవితలో

**"ఇక్కడొక గొంతు, అక్కడొక గొంతు**
**పిసికేసినంత మాత్రానా**
**మార్చింగ్ సాంగ్ ఆగదు**
**మీ తెల్ల ప్రభుత్వపు కాగితాల మీద**
**మా నల్ల కవిత్వం ముద్రించక తప్పదు"** **(జీవతమే ఒక కవిత, పుట:185)**

దక్షిణాఫ్రికా ప్రభుత్వం జాతీయ కవి "బెంజమిన్ మొలోయిస్"ను ప్రిటోరియా సెంట్రల్ జైలులో 1985 అక్టోబర్ 18న ఉరి తీసింది. ఒక పోలీసును హత్య చేశాడన్న నేరం ఆపాదించి, బలవంతంగా నేరాంగీకార వాంగ్మూలం ఇప్పించి ఉరి తీసింది.

దేవరాజు మహారాజు మహాకవి శ్రీశ్రీ చనిపోతే అనుభూతి చెందాడు "మహాజ్యోతి" అనే కవితలో.

**"కోట కొల్లగొట్టబడుతుంది**
**ఆశయాల ఆయుధాలు బీభత్సంగా పేలుతున్నాయి**
**అంతటా విప్లవ స్ఫూర్తి నిండింది**
**యుద్ధం కొనసాగుతోంది**
**అకస్మాత్తుగా మహానాయకుని మహాప్రస్థానం**
**సాహితీ సైనికుల్ని కలత పరిచింది**
**అనంత చైతన్యం కుప్పకూలి పోయింది**
..... ..... ..... ..... ..... .....
**ఒక మహాజ్యోతి అరిపోయింది**
**కాలం ఆగినట్లయింది"** **(జీవితమే ఒక కవిత, పుట–186)**

శ్రీశ్రీ మరణాన్ని ఉద్దేశిస్తూ ఈ కవిత రాశారు. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వానికి శంఖం పూరించినవాడు. చైతన్య రథచక్రాలను నడిపించినవాడు. అధివాస్తవికతను పుణికిపుచ్చుకున్నవాడు. ఈ కవిత ఆరంభమే ఆలోచింపచేస్తుంది. 'కోటకొల్లగొట్టబడుతోంది' అని ప్రయోగించుటలో శ్రీశ్రీ పేర్కొన్న 'పరపీడన పరాయణత్వం' స్ఫురించును. శ్రీశ్రీ కవిత్వంలోని 'దాడాయిజం' ఈ కవితలోని రెండవ పాదం వ్యంజింపచేయును. ఈ విధంగా ఈ కవితలోని వస్తుశిల్పమెంతో.

### 3.5.2. విద్యారంగం:

విద్య అనగా బోధన, నిర్దిష్ట నైపుణ్యాల అభ్యసనాల సమీకరణం. విద్య యొక్క ప్రాథమిక ఉద్దేశం సంస్కృతిని వారసత్వాలకు అందిస్తూ సామాజకీయం చేయడం. లైట్ హౌస్, గురవేనమః, కేంపస్ కిటికిలోంచి, తెల్ల కమ్మలు, పారే యేరు వంటి కవితలు విద్యారంగానికి సంబంధించిన కవితలు.

సంఘంలో గురువుల బాధ్యత గురించి, వారి నిరాడంబరత గురించి లైట్ హౌస్ కవితలో తెలియజేశారు.

**"అతడు కేవలం క్లాసులో ఉపన్యసించడు**
**జీవన సౌందర్యాన్ని కూడా ఉపాసిస్తాడు**
**విద్యార్థుల్ని, స్నేహితుల్ని, అనుచరుల్ని**
**వెంటేసుకుని దారులన్నీ తిరుగుతుంటాడు**
**కొత్త దారులు వెతుకుతుంటాడు**
**ఒక్కోసారి పథికుడు, ఒక్కోసారి పథ నిర్దేశకుడు**
**పిల్లల జీవితాల్లోకే చొచ్చుకు వెళ్ళి**
**చూసి, ఆలోచించి, చర్చించి, తర్కించి**
**పరిష్కారాలతో సమస్యాపూరణం చేస్తుంటాడు**
**ఎంత మంది కుర్రవాళ్ల బరువుల బాధ్యతల్ని**
**మోసుకు వెళ్తుంటాడో తెలియదు"** **(జీవితమే ఒక కవిత, పుట – 112)**

ఏ కాలంలోనైనా, ఏ యుగంలోనైనా గురువు బాధ్యత ఇంతింత అనరానిది. గురువుకు కేవలం పుస్తక పరజ్ఞానం ఉంటే సరిపోదు. లోక పరిజ్ఞానం కూడా ఉండాలి. మొత్తానికి గురువు 'నిరంతర విద్యార్థి' కావాలనే సందేశం ఇందులో ఉంది.

"గురవేనమః"కవితలోతను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తనకు ఎదురైన కష్టాలను గురించి వివరించడం జరిగింది.

**"దేవరవారు క్షమించాలి!**
**ఈ నెల్రోజుల్నుండే కాదండి**
**నేనీ ఉద్యోగంలో చేరిన్నాటి నుండి**
**మా ఇంట్లో రిలే నిరాహార దీక్షలే సార్**

**వారం రోజులా పది రోజులా అని**
**లెక్కలేస్తున్నారు గానీ...**
**జీతాలొస్తాయో లేదో**
**వస్తే ఎప్పుడొస్తాయో ఏమో తెలియని అయోమయంలో**
**ప్రతినెలా మావి ఆమరణ నిరాహార దీక్షలే గద సార్?"**

**(జీవితమే ఒక కవిత, పుట – 115)**

విశ్వవిద్యాలయాలలోని లోపభూయిష్టమైన విద్యావిధానాలను నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను, స్వేచ్ఛ అనే పేరుతో యువతలో చెలరేగుతున్న విధ్వంసక శక్తులను, అత్యాచారాలను గురించి "కేంపస్ కిటికి లోంచి" అనే కవితలో తెలియజేశారు.

**"సాలెగూటిలో చిక్కుకుని, తన్నుకు చస్తూ**
**బాక్సాఫీసు బద్దలు కొట్టే నిరుద్యోగ సినిమా కోసం**
**అర్రులు చాస్తూ అప్లికేషన్ల టికెట్ల కోసం**
**ఎగబడే యువ అమాయకత్వం**
**ఎక్కడో దూరంగా**
**కట్టని హాస్టల్ బిల్డింగ్స్ వెనక**
**జీన్స్లోంచి ఛామ్స్ లాగిన**
**సన్నని నాజూకు వేళ్ళు**
**విశృంఖలత్వాన్ని లిప్స్టిక్ పెదాలమీద**
**కాలుస్తూ ఆనందిస్తాయి**

**డబ్బుతో తలపండిన ప్రొఫెసర్ చిన్న మారుతీ**
**చెడిపోయిన విద్యావిధానపు రోడ్లమీద**
**దభీలుమని గోతుల్లో పడుతూ, లేచి పరుగెడుతూ**
**అక్కడక్కడే మెలికలు తిరుగుతూ వుంటుంది"**

**(జీవితమే ఒక కవిత, పుట – 182)**

మన విద్యావిధానంలో ఎన్నో లోపాలున్నాయి. మార్పు సాధ్యం కావడం లేదు. అందుకు ప్రభుత్వం యొక్క అసమర్థత, విద్యార్థుల, విద్య సంస్థల క్రమశిక్షణారాహిత్యం ప్రధాన కారణాలు. విద్యా రంగంలోని లోపాలను దేవరాజు మహారాజు "తెల్ల కమ్మలు" అనే కవితలో సునిశితంగా చెప్పారు.

"పతిక్షనం బోరు బోరు అనుకుంట
పరిచ్ఛలప్పుడు బొక్క బోర్ల బడితె
ఎవ్వడాడు ఆదుకునేటోడు?" (ఆవరణం, పుట–53)

అని భావి భారత పౌరులైన విద్యార్థుల సోమరితనాన్ని గుర్తు చేస్తున్నారు అంతేకాదు

"కత్తులు – సూశిరాతల గమ్మత్తులు
సూస్తుంటే మీరంతా నిజంగ
డాక్టర్లింజనీర్లు
జవాన్లయ్యేది తెలుస్తనే ఉంది" (ఆవరణం, పుట–53)

అని అప్రామాణిక విద్య మూలంగా భవిష్యత్లో దేశం డాక్టర్లను, ఇంజనీర్లను, జవాన్లను తయారు చేసుకోలేక పోవచ్చుననే ఆవేదన వ్యక్తం చేశారు.

### 3.5.3. నగర జీవిత చిత్రణ:

నగరం అంటే విస్తారమైన ప్రజలు నివసించే ప్రదేశం. జన సాంద్రత చాలా అధికంగా కలిగిన ప్రదేశం. ఇది చారిత్రక ప్రాధాన్యత కలిగి ప్రత్యేక అధికారం కలిగిన పెద్ద పట్టణం. ఆధునిక నాగరికత వలన నైతిక స్థాయి కోల్పోయిన నగర జీవితమును చిత్రించిన వారిలో ఇంగ్లీషు కవిత్వమున ఎజ్రాపౌండ్, ఇలియట్ ముఖ్యులు. ఇలియట్ ప్రభావంతో తెలుగులో పఠాభి, నారాయణబాబు, ఆరుద్ర, అనిసెట్టి, నాగరపరెడ్డి మొదలగువారు నగర జీవిత చిత్రణము ప్రారంభించారు.

"రేప్ చేయబడ్డ నగరం" అనే కవితలో నగర జీవితాన్ని వాస్తవ వర్ణనలతో కళ్ళకు కట్టించారు రచయిత.

"నగరం కర్ఫ్యూలో కాల్చిన మాంసం సీకు
నగరం వెన్నుపోటు పొడిచే మిత్రుడి బాకు
నగరం అనుమానాల పుట్ట
నగరం మానవ కళేబరాల గుట్ట
..... ..... ..... ..... ..... .....
సామాన్యుడిక్కడ బలవుతాడు గానీ
అయోధ్య రాముడికేం?
బతికొస్తాడు" (జీవితమే ఒక కవిత, పుట–49)

ఖడ్గాల పెదాల మీద నవ్వులు వికసించడం వలన రక్త సముద్రపు చెలియలి కట్ట తెగడం, కాళ్ళు చేతులు కొట్టుకు రావడం, కుళ్ళిన మానవత్వం వాసనలతో గాలి బెదిరిపోవడం, భూమి అదిరిపోవడం వంటివి గుర్తించి చివరకు రేప్ చేయబడ్డ నగరం గూర్చి కాదు మన బాధ.../పుట్టబోయే బిడ్డ గూర్చి అంటూ ముగిస్తారు.

'నగరంలో నల్లా' అనే కవితలో నగరంలో నీళ్ళు లేక, నల్లా రాక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నీటి సమస్యల గురించి వివరించారు రచయిత.

**"ఒక శుభోదయాన**
**గంగా ప్రవాహం ఆగిపోయింది**
**తండ్రి ముఖం మీది సబ్బు ఆరిపోయింది**
**తల్లి ఖాళీ బిందెతోనే లోనికెళ్ళింది**
**కొడుకు నోటిలోన బ్రష్షు నిలిచిపోయింది**
**తోమి పెట్టిన కాఫీ గిన్నె ఎండిపోయింది**
**నీరు లేకనే బాయిలర్ మండిపోయింది"** **(జీవితమే ఒక కవిత, పుట –304)**

### 3.5.4. విప్లవం:

మానవ చైతన్యంలో సాహిత్యం భాగం కావడంతో సమాజానికి, సాహిత్యానికి విడదీయరాని సంబంధం ఉంటుంది. సమాజంలో ఏర్పడే అవసరాలకు, మార్పులకు అనుగుణంగా సాహిత్యం కొత్త రూపాలను ఏర్పరుచుకుంటుంది. అందులో భాగంగా వచ్చిందే విప్లవ కవిత్వం. అభ్యుదయ కవిత్వం మార్క్సిస్టు నిబద్ధతను వదిలివేసిన తర్వాత దాని స్థానంలో విప్లవ కవిత్వం వచ్చింది. విప్లవం అనే మాటను ఇంగ్లీషులో 'Revolution' అంటారు.

"విప్లవ వాదం అంటే ప్రస్తుతం ఉన్న వ్యవస్థను బలప్రయోగం ద్వారా మార్చాలనే రాజకీయ సిద్ధాంతానికి అనుకూలమైన సాహిత్య సిద్ధాంతం"[19]. విప్లవ పోరాటాల్ని గూర్చి రాసిన కవిత్వమే విప్లవ కవిత్వం.

"విప్లవాన్ని సమర్థిస్తూ, విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తూ, విప్లవ భావాలను ప్రచారం చేస్తూ రాసే సాహిత్యం విప్లవ సాహిత్యం, రాసే కవిత్వం విప్లవ కవిత్వం. అస్తిత్వంలో ఉన్న సామాజిక ధర్మాన్ని తోసిరాజని కొత్త ధర్మాన్ని స్థాపించడానికి జరిగే క్రియా కలాపమే విప్లవం"[20].

---

[19] కె.కె. రంగానాథాచార్యులు (సంపా.), ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట:190.

[20] తెలుగులో కవితోద్యమాలు, తెలుగు అకాడమీ, పుట:151.

విప్లవ కవిత్వం 1970 నుండి 1980 వరకు తెలుగులో ఎక్కువగా రావడం జరిగింది. సామాన్యుల కోసం, పీడితుల కోసం పుట్టే కవిత్వం విప్లవ కవిత్వం.

శ్రీశ్రీ, వరవరరావు, శివసాగర్, కె.జి. సత్యమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి, కె.వి. రమణారెడ్డి, గద్దర్, వంగపండు, నగ్నముని వంటి కవులు విప్లవ కవిత్వాన్ని వెలిగింపచేశారు. వీరి మార్గంలోనే దేవరాజు మహారాజు కవిత్వంలోను విప్లవ పంథాకు కొదవలేదు.

తెలంగాణ జన జీవితం నేపథ్యంగా రచించిన 'హత్య' అనే కవితలో దొరల క్రూరకృత్యాలకూ, వర్షానికీ పోలిక చూపించడం జరిగింది. దోపిడీ, హింస కొత్త తరహాలో వర్ణించడం జరిగింది.

"ముడుచుకుని కూచున్న బక్క ప్రాణి వీపుమీద బలమైన చినుకుల చెప్పుల దెబ్బలు – ఒంటి నిండా దెబ్బల చారలు" అని అంటారు. కవి ఇదే కవితలో మరోచోట 'వాడి వేడి మోసపు టీ' తన చివరి ఊపిరి, అరెకరపు భూమి చెక్కను, బిస్కట్లా ముంచుకు తిన్నప్పుడైనా పిడికిళ్ళు బిగించడం తెలిస్తేగా" అని కూడా ఉంది. ఇందులో అమానుష చర్యలకు బలైపోయిన నిరుపేదను వరదలో కొట్టుకుపోయే శవంతో పోల్చడం కవి భావ సాంద్రతను, ఉద్వేగాన్నీ వ్యక్తపరుస్తుంది.

"వ్యూహం" అనే కవితలో నక్సలైట్లతో ప్రభుత్వం జరిపిన చర్చలు వ్యంగ్యంగా ప్రస్తావించబడింది. "నక్సలైట్లతో ప్రభుత్వం నడిపేడి చర్చలు, వీగిపోవు గాని సాగవెపుడు, నిప్పు తోడ చెలిమి నీటికి కుదురునా?" అన్నట్లు ఈ కవితలో

**"అడవి సింహాన్ని చర్చలకు పిలిచాను**
**పంజా ముడుచుకుని కూర్చొంటేనే మాట్లాడతానన్నాను**
**వచ్చింది – అలానే కూర్చొంది...**
**దాన్ని ఇక్కడే కూర్చొబెట్టి, అక్కడ అడవిలో**
**దాని స్థావరాలన్నీ గాలింపు చేయించాను**
**వైరంతో పొడవలేని పోట్లు**
**స్నేహంతో పొడవవచ్చని నాకు తెలుసు"** **(ఆవరణం, పుట–100)**

అంటూ వాస్తవాన్ని వ్యక్తీకరించారు కవి.

"క్షుద్ర సంస్కృతి, మూగి, మహా జ్యోతి, సాయునారా" (గుడ్బై) వంటి కవితలు దోపిడీ వ్యవస్థను మార్చడం కోసం ప్రజలు తిరగబడాలి అని చెప్పే కవితలు.

"క్షుద్ర సంస్కృతి" అనే కవితలో

"నాలో మంటల నాలికలు తెరుచుకుంటున్నయ్
రక్తనాళాల్లో సముద్రం తిరగబడుతోంది
మెదడులో అగ్నిపర్వతాలు బద్దలౌతున్నయ్
సమస్యల చితుల మీద సజీవంగా కాలిపోతున్న
శవాల మధ్య నుండి నడుస్తున్నట్లుగా ఉంది
..... ..... ..... ..... ..... .....
నిర్జీవపు పెంటమీద మొలచిన మొక్క నిర్జీవి కాదు
క్షుద్ర సమాజంలో పెరుగుతున్నంత మాత్రాన
జనమంతా క్షుద్రమైపోదు
నేను నా జనం వెంటే నడుస్తున్నాను
మా రక్తనాళాల్లో సముద్రం తిరగబడుతోంది
మా మెదళ్ళలో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి
మా ముఖాల్లోని సాగర ప్రశాంతతను చూసి,
క్షుద్ర వ్యవస్థా సంరక్షకులంతా
పాపం... మోసపోతున్నట్లుంది!

**(జీవితమే ఒక కవిత, పుట –119)**

ఈ క్షుద్ర సంస్కృతిని నాశనం చేయడానికి, ఈ జీవన స్తబ్దతతో సంఘర్షించడానికి విప్లవం తప్ప వేరే మార్గం లేదంటారు రచయిత. సాహిత్యం విప్లవ ప్రబోధం చేయాలి. అప్పుడు ప్రతి అక్షరం ఒక వీరుడు అవుతుంది. వీరుడికి మరణం లేదు. అతడు సూర్యుడు లాంటి వాడు. అందుకే "సూర్యుడు చావలేదన్నట్టుగా మళ్లీ తెల్లవారింది" అంటాడు కవి. రకరకాలుగా దోపిడీ చేయబడి అణగదొక్కబడుతున్న జనం తిరగబడతారు. విత్తనాల వంటి విద్యార్థుల్ని రాజకీయవేత్తలు అణగదొక్కితే, వాళ్లు మొలకెత్తి మహా వృక్షాలుగా పెరుగుతారు. కూలి రాళ్లు ఆయుధాలుగా మారుతాయి. అందరి తలరాతలు పరిశీలించే జ్యోతిష్యుడు తన తలరాత తలచుకొని, రాతలు మాని చేతల్లోకి దిగుతున్నాడు. ఈ కవి తాను విద్యుత్తులోంచి వెలుతురులాగా, కలంలోంచి దూకుతున్నానంటున్నాడు. ప్రభాతాన్ని, ఈ చీకటి మీద తన ఎరుపు కళ్లు రాస్తున్న గీతంగా భావిస్తున్నాడు.

నిరంతరం బీభత్సం సృష్టిస్తున్న క్షుద్ర సాహిత్య విషతాండవంలో – దేశం హృదయ దౌర్బల్యంతో కొట్టుమిట్టాడుతుంది. "నిర్జీవపు పెంట మీద మొలచిన మొక్క నిర్జీవి కాదు. క్షుద్ర సమాజంలో పెరుగుతున్నంత మాత్రాన జనమంతా క్షుద్రమైపోదు!"[21] వంటి ఆశావహ సత్యాలనెన్నిటినో అందించారు దేవరాజు మహారాజు.

**"ఖరీదైన బలిసిన**
**అచ్చు పుస్తకం కింద**
**నోరు లేని బక్క – నోటుబుక్కు**
**అణిగిపోతుంది"** **(ఆవరణం, పుట –70)**

అని ఆ నోటుబుక్కుకి అచ్చు పుస్తకాన్ని కొల్లగొట్టి, నోట్సు రాసే చేతులొస్తాయని హెచ్చరిస్తున్నాడు.

దక్షిణాఫ్రికాలో ఉరి తీయబడ్డ విప్లవ కవి "బెంజిమన్ మొలోయిస్"ను తలచుకొని విప్లవ స్ఫూర్తిని పొంది, నీగ్రోలతో తాదాత్మ్యం చెందాడు కవి "అంతిమ సందేశం" అనే కవితలో:

**"ఇక్కడొక గొంతు, అక్కడొక గొంతు**
**పిసికేసినంత మాత్రాన**
**మార్చింగ్ సాంగ్ ఆగదు**
**మీ తెల్ల ప్రభుత్వపు కాగితాల మీద**
**మా నల్ల కవిత్వం ముద్రించక తప్పదు"** **(ఆవరణం, పుట –70)**

యావత్ ప్రపంచం విజ్ఞప్తి చేసినా వినిపించుకోకుండా దక్షిణాఫ్రికా శ్వేత ప్రభుత్వం జాతీయ కవి 'మలెసెల బెంజమిన్ మొలోయిస్'ను ప్రిటోరియా సెంట్రల్ జైలులో 1985 అక్టోబర్ 18న ఉరి తీసింది. ఒక పోలీసును హత్య చేశాడన్న నేరం ఆపాదించి, బలవంతంగా నేరాంగీకార వాంగ్మూలం ఇప్పించి ఉరి తీసింది.

ప్రభుత్వాసుపత్రి క్షుద్ర వైద్య సంస్కృతి నిర్లక్ష్యానికి బలైపోయిన కవి మిత్రుడు సలంద్రా గురించి "సాయనారా" అనే కవితలో ఆవేదన పడ్డారు.

**"ఓ ప్రభుత్వాసుపత్రీ!**
**ఓ నవనాగరిక అధునాతన మృత్యుమందిరమా!**
**నువ్వీ భయంకర నీచ రాక్షస వ్యవస్థకు**
**నిరంతరం రసికారుతున్న రాచపుండువి**

[21] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–61.

అసంఖ్యాక అమాయకుల్ని మింగుతున్న
నిర్లక్ష్యానికి – విశ్వరూపానివి
అసలు నీకే శస్త్ర చికిత్స అవసరం
మనుషుల్ని రోగులుగా
రోగుల్ని శవాలుగా
శవాల్ని సైతం కస్టమర్లుగా
పీక్కుతినే క్షుద్ర వైద్య సంస్కృతి
అవకతవకల్ని రిపోర్టు చేసినందుకు కాబోలు
సలంద్రా – అది నిన్నే కబళించింది" (జీవితమే ఒక కవిత, పుట –188)

**3.5.5. ప్రకృతి**:

ప్రపంచానికి మూల కారణం ప్రకృతి. మానవుడు ప్రకృతి అంశ. ప్రకృతిలో చూసినప్పుడే పరిపూర్ణంగా కనిపిస్తాడు. వెన్నెల, వర్షం, పూలు, తీగలు, చెట్లు, గుట్టలు, కోకిలలు, తుమ్మెదలు, నదులు, మెరుపులు, ఉరుములు మొదలైనవాటి గురించి వర్ణించి రాయడం ప్రకృతి కవిత్వం కిందికి వస్తుంది. పంచ భూతాలతో కూడిందే ప్రకృతి. ప్రకృతి మానవుని జీవనానికి అన్ని విధాలుగా సహకరిస్తుందని, కానీ మనిషే ప్రకృతిని నాశనం చేసే పనులను చేస్తున్నాడు. చెట్లను నరకడం, నీటి కాలుష్యం, వాయు కాలుష్యాన్ని పెంచి భూ తాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) పెంచుతున్నాడు.

ప్రకృతి పచ్చగా ఉండాలంటే చెట్టు అవసరం. రోడ్డు విస్తరణకై చెట్లను నరికివేస్తున్న ఈ రోజుల్లో చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలిసి అశోకుడు రోడ్ల వెంట చెట్లను నాటించారు. దానినే దేవరాజు మహారాజు "రేప్ చేయబడ్డ నగరం" అనే కవితలో ఇలా తెలియజేశారు.

"ఈ రోడ్ల వెంట చెట్లన్నీ
అశోకుడు నాటించినవే
ఈ దారిన బావులన్నీ బాబర్ కాలం నాటివే" (జీవితమే ఒక కవిత, పుట – 51)

దేవరాజు మహారాజు గారిలో మంచి ప్రకృతి ప్రేమికుడు కన్పిస్తాడు.

"అది ప్రకృతి పురుషుల తన్మయత్వం
స్త్రీ పురుషుల సహజీవనానందాన్ని
కావ్యాలు, గజళ్లు, మృదంగనాదాలు

**గీత బద్ధమూ, సంగీత బద్ధమూ చేశాయి**
**ఆరాధించాను, తపించాను, ప్రేమించాను, ద్వేషించాను**
**ప్రకృతి స్త్రీ ఒడిలో నేనెప్పుడు పసిపిల్లవాణ్ణే**
**ఎగిరాను, గెంతాను, ఆడాను, పాడాను**
**తప్పులు చేశాను బుద్ధిమంతుణ్నయ్యాను**
**సముద్రాల అగాధాల్ని కొలిచాను**
**సౌరశక్తిని లెక్కగట్టాను,**
**కానీ ప్రకృతి స్త్రీని మాత్రం అర్థం చేసుకోలేకపోయాను**

**(జీవితమే ఒక కవిత, పుట – 75)**

పై కవిత్వాన్ని బట్టి దేవరాజు మహారాజు ప్రకృతిని ఏ విధంగా ఆరాధించారో అర్థం చేసుకోవచ్చు.

### 3.5.6. దేశభక్తి:

దేశభక్తి ప్రజలకు వారు జన్మించిన దేశం మీద గల మక్కువ. ఇది ఒక ప్రాంతం లేదా పట్టణం లేదా గ్రామం కూడా కావచ్చును. ఇలాంటి దేశభక్తులు వారి దేశం సాధించిన ప్రగతి, సంప్రదాయాలు మొదలైనా వాటిని గర్వంగా భావిస్తారు. దేశభక్తి, జాతీయతా భావం ఒకటే. దేశభక్తిలో వ్యక్తి కంటే దేశానికే ప్రాధాన్యత ఎక్కువ. ఇది ముఖ్యంగా జాతీయ రక్షణ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాణాన్ని కూడా త్యాగం చేయడానికి వీరు గర్వంగా భావిస్తారు.

**"ఈ దేశంలో విజ్ఞానమంతా మెదళ్లు నిండి నశించడం తప్ప**
**చైతన్యవంతంగా గుండెల్లోకి చేతుల్లోకి**
**ప్రవహించినట్లు కనిపించదే?**
**ప్రణాళిక ప్రయోగాల్లో ఎదిగిన దేశం**
**పరిశీలనల్లో కన్పించదే?"** **(ఆవరణం, పుట–107)**

అని నిర్భయంగా ప్రశ్నిస్తున్నాడు కవి. దేశంలో నిరుద్యోగాన్ని, చీకటిలో కుమిలిపోతున్న మేధస్సును, నాయకులు చెబుతున్న ప్రగతి పగటికలగా మారిన తీరును ధ్వని గర్భితంగా, గొప్ప శిల్ప మర్యాదతో ఆవిష్కరించారు కవి. కాలాన్ని గమనిస్తూ, కలాన్ని కదిలిస్తూ జనం గుండె చప్పుడును అక్షరీకరించేవాడే అసలైన కవి.

"వీరుడా!" అనే కవితలో సైనికులు శత్రువులను ఏ విధంగా తుద ముట్టించాలో, సరిహద్దున వారు చేసే ధైర్య సాహసాలను గురించి వివరించారు.

"తుపాకి చేత బట్టరా శత్రువులను తరమరా
సరిహద్దులు దాటొచ్చిన దుండగులను గెంటరా
కాశ్మీరాన్నపహరింప వచ్చుచుండె నదిగోరా
దురాక్రమణదారునిపై గుండ్లను కురిపించరా" (జీవితమే ఒక కవిత, పుట–319)

### 3.5.7. పల్లె జీవిత చిత్రణ:

పల్లె అనేది కొన్ని నివాసాల సముదాయం. మనిషి సంఘజీవి కనుక ఇతరులతో అవసరాలను అనుసరించి దగ్గరగా జీవించుటకు కొందరు ఒకేచోట లేదా ఒకే ప్రాంతమును కేంద్రముగా చేసుకొని వారి వారి నివాసాలను ఏర్పాటు చేసుకోగా ఏర్పడినది పల్లె. పల్లెలో జీవించడమంటే పరమాత్మునిలో లీనమైనట్లే.

పల్లెటూళ్ళలోని పైరుపచ్చలను, చెట్లు చేమలను, గోవులను, ప్రకృతి దృశ్యములను వర్ణించే ప్రయత్నం చేశారు దేవరాజు మహారాజు.

పల్లెటూర్లలో అక్షర జ్ఞానం లేని ప్రజలు ఏ విధంగా మాట్లాడుతారో వారి మాటలను దేవరాజు మహారాజు తన కవిత్వంలో ఈ విధంగా పేర్కొన్నారు.

"మాకు సద్వులేవని పత్యాకం జెప్పొల్నా
మా మాట జెప్తనే వుండె
మీద మొగుల్ని కింద బూదేవిని
శెర్ల నీలను, నీల్లల్ల శాపను
చెట్ల పూలను, పూలసుట్టు పురుగుల్ను
సూశి పెరిగినం
గందుకే మీ కండ్లకు పురుగులైనం గాదుండి
శీమను జూశి, కుక్కను జూశి పన్నేర్శినం
మేం జ్జేశిన పనేద బోయిందో గని
మీ కండ్లకు మేం శీమలయినం, కుక్కలయినం

నల్గా పైపులకెల్లి చారవడ్డట్టు – మీరు
మంచిగ, పొంకంగ సన్న సన్నగ మాట్లాడ్తారు నాయ్నా
మా దేంది గొర్రెదాటు – బగ్గదేషం!
ఈదులకెల్లి, పానాదులకెల్లి, వొర్రెలకెల్లి,

**వొంపులకెల్లి**
**యేరు – యేరు కొట్కొచ్చినట్టు**
**మానోటి మాట బత్కంత పారుకుంటొస్తది.**
**మాయి శాని శాని మాటలు గావు – మోటు మాటలు**
**కని, జూట మాటలు గావు నాయినా"** **(జీవితమే ఒక కవిత, పుట – 208)**

**3.5.8. సామాజికం:**

సామాజిక దృక్పథం కలవారంటే సమాజంలో ప్రజలకు ఉపయోగపడే అంశాలను కులమతాలకు అతీతంగా, ఏదీ ఆశించకుండా తాను పొందిన జ్ఞానాన్ని నిష్పక్షపాతంగా పంచి పెట్టే గుణంగలవారని చెప్పవచ్చు. ఇలాంటి సహృదయత లోకంలో కొందరికే ఉంటుంది. సాధారణంగా సాహితీవేత్తలు, కవులు, రచయితలు అందరూ సృష్టించే సాహిత్యం సమాజ హితం కోసమే. కానీ ఈ హితాన్ని ఎవరికి ఇవ్వాలి. ఎలా పంచాలనే ఆలోచనతో చేసే కృషే రచయితలను గాని, కవులను గాని ఉన్నతస్థాయిలో నిలబెడుతుంది. అటువంటి స్థానంలో చెప్పుకోదగిన వ్యక్తి దేవరాజు మహారాజు. ఈయన రాసిన రచనలను సునిశితంగా పరిశీలిస్తే ఆ సామాజిక దృక్పథం ఏ విధంగా పరిఢవిల్లిందన్న విషయం తెలుస్తుంది.

కవిత్వం అంటే క్లుప్తత, గుప్తత, వక్రత అను లక్షణాలను కల్గిందని విమర్శకుల అభిప్రాయం. కవి తాను రాసిన కవిత్వంపై సమకాలీన సమాజ ప్రభావం తప్పక ఉంటుంది. కాబట్టి దేవరాజు మహారాజు రాసినటువంటి జీవితమే ఒక కవిత సంపుటిలో సామాజికాంశాలను చర్చించి తనదైన ధోరణిలో సమాజానికి సందేశాన్నిచ్చారు. వీరి కవిత్వంలో వస్తు వైవిధ్యం, వస్తు విస్తృతి ఉన్నాయి. జీవితమే ఒక కవిత సంపుటిలో ఒకే విషయాన్ని కాకుండా పలు విషయాలను వస్తు వైవిధ్యంతో వివిధ కోణాల నుండి చిత్రించి కవిత్వాన్ని సృజించారు. వీరి కవిత్వంలో ముఖ్యంగా వివిధ వృత్తులలో ఉండే సాధకబాధకాలను, ప్రవృత్తి యొక్క సహజత్వం మొదలైన విషయాల చర్చ కనిపిస్తుంది.

సమాజం పరిణామశీలమైంది. ఆ పరిణామక్రమంలో, ప్రతి సంఘటనలో సమాజం తన ఉనికిని, పురోగతికి అవసరమైన నిబంధనల్ని అది మార్చుకుంటుంది. దీనినే మహీధర రామమోహనరావు "ప్రతి ఒక్కటీ పరిణామ శీలం, ప్రతి పరిణామ దశ అంత క్రితపు దశలోంచి పుట్టి, తరువాత దశకు జన్మనిస్తుంది. ఇది ఆర్థిక, రాజకీయ, సామాజిక, సంస్కృతీ రంగాలన్నిటికీ

వర్తిస్తుందనే అవగాహన ఈ ప్రపంచ దృక్పథమూ, కవికీ, రచయితకీ ఉండాలంటున్నాం"[22] దీనినే సామాజిక స్పృహ అంటున్నాం అని తెలియజేశారు.

సాహిత్యంలో సామాజికతకు తిరుపతి వేంకట కవుల కాలంలోనే అంకురార్పణ జరిగిందని కుందుర్తి తన వ్యాసాలలో ఈ విధంగా తెలిపారు. "ఆశు కవిత్వంలో చాలా భాగం సరళంగా ఉండటం చేతనూ, అవధాన ప్రదర్శనలలో పృచ్ఛకులు సాధారణంగా తాత్కాల సాంఘిక పరిస్థితులకు సంబంధించిన ప్రశ్నలే అడిగే ఆచారం ఏర్పడినందువల్లనూ తిరుపతి వేంకట కవులు ఆంధ్రదేశంలో చేసిన కవిత జైత్రయాత్ర వల్ల ప్రజాకవిత్వం అనే దానికి అంకురార్పణ జరిగింది"[23].

సాహిత్యానికి కావాల్సిన వస్తువును సమాజం సమకూర్చుతుందని, సమాజంలో ఆనాటి పరిస్థితులే సాహిత్యానికి ఉపయోగపడతాయని దివాకర్ల వెంకటావధాని ఈ క్రింది వాక్యాలలో తెలిపారు. "సంఘం సాహిత్యమునకు వస్తువును సమకూర్చి, దానికి వైశాల్య వైవిధ్యములు కలిగించును. సాహిత్యము సంఘ పరిస్థితులకాదర్శము వంటిదై, యవసరమైనప్పుడు దానిని సంస్కరించి సన్మార్గమునకు దిప్పుటకు యత్నించును"[24].

"'సమాజం' అనేది పది మంది ఉన్నతాశయాలు గల వాళ్ళ సమిష్టి ఆత్మ కాదు. పది మంది స్వలాభపరులు, ఆత్మలేని వాళ్ళు మిగతా పది మందిలో ఒకడి కష్టసుఖాల మీద చేస్తే అర్థం లేని విమర్శకు మిగతా తొమ్మిది మంది చేసేది లేక తలూపి పొందే భయం యొక్క కనపడని స్వరూపం మాత్రమే"[25] అని సమాజాన్ని నిర్వచించాడు.

దేవరాజు మహారాజు రచనల్లో సామాజిక స్పృహ కావలసినంతగా ఉంది. నాటి సామాజిక పరిస్థితులనే వస్తువులుగా స్వీకరించారు. ఈయన రచనల్లో దొరల పాలన, భూస్వామ్య వ్యవస్థ, పేద ప్రజల స్థితిగతులు, నగర ప్రజల జీవనం, నాటి రాజకీయ పరిస్థితి, రాజకీయనాయకుల అవినీతి, పల్లె వాతావరణం, విద్యాలయాలు, అధ్యాపకులు, విద్యార్థులు, సమస్యలను వివరిస్తూ తన రచనల్లో సామాజిక స్పృహను పాఠకుల్లో చైతన్యాన్ని కలిగించడానికి ప్రయత్నించారు.

కళాహృదయం, సౌందర్యం దృష్టి కవికి ఉండే సహజ గుణాలు. కళ, సౌందర్యాలతోపాటు సామాజిక చిత్రణకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిన ఆధునిక కవి దేవరాజు మహారాజు.

---

[22] ఆచార్య తిరుమల, ఆధునిక కవిత అభిప్రాయ వేదిక, పుట–16, 17.

[23] ఐ.కె. సత్యమూర్తి, కుందుర్తి వ్యాసాలు, పుట–67.

[24] దివాకర్ల వెంకటావధాని, సాహిత్య సోపానములు, పుట–48.

[25] మునిపల్లెరాజు, దివోస్వప్నాలతో ముఖాముఖి, తృతీయ సంపుటి, పుట–110.

"తన చుట్టూ కనిపించే సమాజంలోని పరిస్థితులు, సంఘటనలు, కార్యకలాపాలు, వ్యక్తులు వారి ప్రవర్తనలు, ఆలోచనలు, వారి మధ్య ఉండే సంబంధాలు మొదలైనవి వీరి కవిత్వంలో ప్రధాన వస్తువులు!" తన చుట్టూ ఉన్న పరిస్థితులను, తన కళ్ళ ముందు జరుగుతున్న సంఘటనలకు స్పందించి వెంటనే వాటికి అక్షర రూపం కల్పించిన సామాజికుడు దేవరాజు మహారాజు.

విశ్వమానవ కళ్యాణమే ఈ కవి ధ్యేయం. కుల, మత వర్గాలకు అతీతంగా కవిత్వం ఉండాలనేది ఈ కవితత్వం. సమాజానికి ఏదో చెప్పాలి, ఏమైనా చేయాలి, సమాజాన్ని ప్రగతిపథంలో నడపాలి అనేటటువంటి తపన వీరి కవిత్వం చదివితే అర్థమవుతుంది.

వీరిలో లోక పరిశీలనారీతి, ప్రపంచంలో జరిగే సంఘటనలకు ప్రభావితులై తపన, వేదన, అనురాగం, ఆనందం, అనుభవించడం ఒక విధమైన వేదాంతంముఖ్యంగా మానవ జీవితం బుద్బుదప్రాయం అనే పరిపక్వమైన భావన వీరి కవితలలో అడుగడుగునా కొట్టక వచ్చినట్లు కన్పిస్తుంది.

దేవరాజు మహారాజు కవిత్వంలోని సామాజికాంశాల పాత్ర చాలా ముఖ్యమైనది. తన చుట్టూ ఉన్న సమాజంలో క్షణం క్షణం సంభవించే పరిణామాలకు త్వరగా స్పందించిన తీరు వీరి కవిత్వంలో కన్పిస్తుంది.

"సమాజంలో జరిగే అరాచకాలు, దోపిడీ, పేదవాళ్ళకు జరిగే అన్యాయం, మూఢనమ్మకాలు, మొదలైన సామాజింకాంశాలు వీరి రచనల్లో ఎక్కువగా కనిపిస్తాయి".

**"చేతనైతే శుభ్రమైన గాలి**
**ఓ అన్నం మెతుకు**
**చిత్రించండి**
**ఈ దేశపు దేహానికి కావల్సిన గుక్కెడు నీళ్ళు**
**చిత్రించండి"** **(ఆవరణం, పుట–90)**

ఇలాంటి పంక్తులు కవి సామాజిక స్పందన తీరునూ వ్యక్తం చేస్తాయి అని చెప్పవచ్చు.

"మొక్క" అనే కవితలో కవి మనస్సులో కవిత ఎలా పుడుతుందో అద్భుతంగా చెప్పారు. సమాజపు చీకటిలో త్యాగం వెలుగులో మండుతూ మెలకువగా ఉండే దీపం కవి. సూర్య బీజం రాత్రంతా చీకటి మట్టి పొరల్ని చీల్చుకొని ఉదయం వెలుతురు మొక్కగా మొదలవడమే కవిత్వం" అని అంటాడు కవి. ఈ కవిత శ్రీశ్రీ "కవితా ఓ కవిత" అనే గేయాన్ని, తిలక్ "నేను కాని నేను" అనే కవితను జ్ఞాపకం చేస్తుంది.

కవితలో కల్పన కన్నా వాస్తవికత ఉండాలి. సామాజిక స్పృహ కూడా ఉండాలి. ఒకచోట రచయిత మేఘం లాంటి వాడు అని అంటారు. "మేఘం" కవితలో –

**"జనం ఆలోచనల పంట పండించడానికి**
**ఎంతో తపనతో, వేదనతో, బాధ్యతతో**
**పరిష్కారాల వర్షం కురిపిస్తున్నాడు (వాడు)**
**రచయిత –**
**భూమీద నీటి చుక్కవలే**
**ప్రతి మెదడులోనూ ఇంకిపోతున్నవాడు**

**(గాయపడ్డ ఉదయం, పుట –10)**

"లైట్ హౌజ్" అనే కవితలో సంఘంలో గురువుల గురుతర బాధ్యత గురించి, వాటి నిరాడంబరత గురించి ఈ కవితలో చక్కని వాస్తవాల్ని తెలియజేశారు.

**"ఒక్కోసారి పథికుడు**
**ఒక్కోసారి పథనిర్దేశకుడు**
**పిల్లల జీవితాల్లోకి చొచ్చుకు వెళ్ళి**
**చూసి, ఆలోచించి, చర్చించి, తర్కించి**
**పరిష్కారాలతో సమస్యాపూరణం చేస్తుంటాడు"**

**(జీవితమే ఒక కవిత, పుట – 112)**

తెలంగాణ జన జీవితం నేపథ్యంగా రచించిన "హత్య" అనే కవితలో దొరల క్రూరకృత్యాలకూ, వర్షానికి గల పోలికను చూపించడం జరిగింది. దోపిడీ, హింస కొత్త తరహాలో వర్ణించడం జరిగింది ఈ కవితలో –

"ముడుచుకు కూర్చొన్న ఒక్క ప్రాణి వీపు మీద బలమైన చినుకుల చెప్పుల దెబ్బలు – ఒంటి నిండా దెబ్బల చారలు" అనీ, అదే కవితలో మరొక చోట "వాడివేడి మోసపు టీలో తన చివరి ఊపిరి, అరెకరపు భూమి చెక్కనూ, బిస్కట్లా ముంచుకు తిన్నప్పుడైనా పిడికిళ్ళు బిగించడం తెలిస్తేగా" అని కూడా ఉంది. ఇందులో అమానుష చర్యలకు బలైపోయిన నిరుపేదనూ వరదలో కొట్టుకుపోయే శవంతో పోల్చడం కవి యొక్క భావసాంద్రతను, ఉద్వేగాన్నీ వ్యక్తపరుస్తుంది.

"గారడీ" అనే కవితలో అవినీతిలో మగ్గిన అధికారి తను అనుభవించలేక విసిగి వేసారి, విసిరేసిన విరాళం చూసి, అతని చెవిలో ఉన్న నల్ల టెలిఫోన్ రిసీవర్ తెల్లబడిందని వ్యంగ్యంగా చెప్పడం జరిగింది.

**"ఆ హలో హలో**
**పొద్దున్నే ఫోనులో పెద్దమనిషి నమస్కారం**
**విరాళమా? దానికేముంది**
**ఇరవై వేలు తీసుకో"** **(జీవితమే ఒక కవిత, పుట – 127)**

చిన్న కవితలు రాయడంలో కూడా దేవరాజు మహారాజు తన ప్రతిభను, వ్యంగ్య ధోరణిని, సామాజిక స్పృహను ప్రదర్శించారు. జన సామాన్యానికి సుపరిచితమైన వస్తువులను ఉపమానాలుగా, పదచిత్రాలుగా గ్రహించి క్లుప్తంగా వ్యక్తపరిచారు.

"కంగారు" అనే కవితలో పుత్ర వ్యామోహితుడైన రాజకీయ నాయకుడు కంగారు జంతువు వంటివాడని, రక్తం పీల్చే రాజకీయ నాయకుడు దోమ కన్నా హీనమైనవాడని చాలా స్పష్టంగా చెప్పారు.

**"పుత్ర రత్నాన్ని తన**
**రాజకీయ కోశంలో దోపుకుని**
**సిగ్గొదిలేసి, దేశమంతా తన మైదానమే అనుకుని**
**పెద్ద పెద్ద అంగల్తో గెంతిన**
**గెంతుతున్న వింత జంతువు"** **(జీవితమే ఒక కవిత, పుట – 128)**

విశ్వవిద్యాలయాలలోని లోపభూయిష్టమైన విద్యా విధానాలను, నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను, స్వేచ్ఛ అనే పేరుతో యువతలో చెలరేగుతున్న విధ్వంసక శక్తులను, అత్యాచారాలను గురించి "కేంపస్ కిటికిలోంచి" అనే కవితలో చెప్పారు.

"ప్రెస్ రిపోర్ట్" అనే కవితలో నానాటికి సంఘంలో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం, కల్తీ సమస్యలు, దిగజారిపోతున్న ప్రమాణాల గురించి రచయిత కళ్ళకు కట్టినట్లు చెప్పారు.

**"మానవుడి రక్తాన్ని మానవుడే రుచి చూస్తున్నాడు**
**మానవుడి విజయాన్ని మానవుడే దెబ్బ తీస్తున్నాడు**
**హింస కేతనాల్ని ఎగరేస్తోంది**
**ఇవి కవిత్వం కాదు, యథార్థం"** **(జీవితమే ఒక కవిత, పుట – 190)**

"కృతజ్ఞత" అనే కవితలో "నా లోతైన భావనకు బంగారు పూత" అని అంటాడు రచయిత.

సామాజిక జీవనంలో కనిపించే అంశాలు, సంఘర్షణలు, సమన్వయాలు, ప్రభావాలు, జీవితంలో ఎదురయ్యే సాధారణ, అసాధారణ సంఘటనలు, సమస్యలు మానవుని జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రభావం వల్ల మానవ సంబంధాలు కూడా మార్పులు పొందుతాయి. దేవరాజు మహారాజు సామాజిక సమస్యలను వస్తువుగా తీసుకొని రచనలు రాయడం జరిగింది.

### 3.5.9. రాజకీయం:

స్వాతంత్ర్యం తర్వాత కూడా కుళ్ళు కుతంత్రాలతో కూడిన రాజకీయ వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. ఈనాడు అనేక కారణాలతో అస్తవ్యస్తమై పోయిన సమాజాన్ని చూస్తూనే ఉన్నాం. ఏ రంగంలో చూసినా చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేకుండా పోయింది. ఈ విషయాలు రాజకీయ రంగానికి అతికినట్లుగా ఉంటాయి. నిజాయితీ కొరవడిన దృశ్యాలు అడుగడుగునా తేటతెల్లం అవుతూనే ఉన్నాయి.

రాజకీయ నేతల ప్రవర్తనలోని అసంబద్ధతను ఎత్తిచూపే విద్యావంతులు, కవులు లేరంటే అతిశయోక్తి లేదు.

ఈ తరం నాయకులలో నిబద్ధత, త్యాగనిరతి, క్రమశిక్షణ, నైతికత లాంటిది ఏవీ లేకుండా పోతున్నాయని కవి చెందిన కలతని సహజసిద్ధమైన జనం భాషలో శక్తివంతంగా చిత్రించారు.

రాజకీయం మనిషిని ఎంతగా దిగజార్చుతుందో 'లొటపెట' అనే కవితలో వివరించారు.

**"అసలది గాడిద**
**నిమ్మలంగ అనుకువగ ఓంద్ర పెట్టి**
**బత్కులన్ని తెల్లంగా జేయిస్తనని**
**అడ్డమైన ఓట్ల గుడ్డలన్నీ పోలింగు సెంటరు**
**సాకలి రేవు దాకా మోస్కపోయింది**
**'శబాష్ నువ్వే మా పెద్దవు' — అనంటది పెజ"**

**(జీవితమే ఒక కవిత, పుట–223)**

అని జనం అమాయకత్వాన్ని తెలియజేస్తూనే వారి అమాయకత్వాన్ని సొమ్ము జేసుకునే రాజకీయ నాయకుల గూర్చి —

**"ఇప్పుడది గాడిద గానే గాదు — లొటపెట**
**గాడిద లొటపెట అయితదా అని**

**అనుమానమే వద్దు**
**రాజకీయం మందుదింటే, ఏది ఏదన్న గావోచ్చు"**

**(జీవితమే ఒక కవిత, పుట–224)**

అని వ్యంగ్యంగా ఎత్తి పొడిచారు. రాజకీయంలోకి దిగక ముందు, దిగిన తర్వాత మారిన జీవితాన్ని గాడిద (లొటపెట) ఒంటెల మధ్యనున్న అంతరంలో పోల్చి చూపారు.

"మెలకువ" అనే కవితలో నాయకుల పాత ఉపన్యాసాలు కొత్తగా ప్రారంభమై ఓటర్లను కొత్త ఎరతో కొత్త గాలం వేసి వేట ప్రారంభిస్తున్నారని అంటాడు కవి.

**"నాయకుల పాత ఉపన్యాసాలు**
**కొత్తగా మొదలవుతున్నాయి**
**కొత్త ఎరతో కొత్త గాలం వేయబడింది**
**వేట ప్రారంభమైంది"** **(జీవితమే ఒక కవిత, పుట – 108)**

"అంగ వైకల్యం" అనే కవితలో ఎందుకు పనికిరాని రాజకీయవేత్తలు ఈ దేశాన్ని శాసిస్తున్నారు. వాళ్ళ మెదళ్లు లేని తలలు ఉపన్యసిస్తున్నాయి. తలల్లేని మొండాలు కుర్చీలు ఎక్కుతున్నాయి. వాళ్ళు తమ మొండి చేతులతో మనకు దారి చూపుతున్నారు. వీళ్ళని నాశనం చేస్తే కాని కొత్త వ్యవస్థ పుట్టదు అని రచయిత చాలా బాగా విశదీకరించారు.

**"ఈ దేశంలో మెదడు లేని తలలు**
**ఉపన్యసిస్తయ్**
**తలల్లేని మొండాలు కుర్చీలెక్కుతయి**
**మోచేతులు దారులు చూపుతయి**
..... ..... ..... ..... .....
**మొండి తలల్ని, మొండితనాల్ని**
**మొండి అవయవాల్ని, మొండితనాన్ని**
**మొండి నిర్ణయాల్ని, మొండి ఆజ్ఞల్ని**
**మొండిగానే ఖండించాలి"** **(జీవితమే ఒక కవిత, పుట – 117)**

"హెలికాప్టర్ చూపు" అనే కవితలో వరదల్లో చిక్కిన ప్రజలు శవాలుగా తేలే వరకు ప్రభుత్వ సహాయం అందదు. రాజకీయవేత్తలు హెలికాప్టర్ చూపులతో చూస్తూ, ఫుడ్ ప్యాకెట్లు దొర్లించమంటారు. అవి కాలుతున్న శవాల మంటల్లో పడతాయి అని అంటాడు కవి.

**"చావు కేకలు గావు కేకలు**

**పెడుతున్న వాళ్ళు**

**గూడు కూలిన పక్షి పిల్లల్లా**

**అయ్యో పాపం**

**భలే తమాషాగున్నారు**

**ఫుడ్ పాకెట్స్ దొర్లించు**

**శవాలు కాలుతున్న మంటల్లో**

**ఫుడ్ పాకెట్స్ భస్మం**

**(జీవితమే ఒక కవిత, పుట – 126)**

"కడుపు కొట్టి" కవితలో ప్రజల రక్తాన్ని దోమలకు కూడా మిగుల్చకుండా అంతా రాజకీయ వేత్తలే పీల్చి వేస్తున్నారని చెప్పడం జరిగింది.

**"ఛీ ఛీ ఏమిటింత చప్పగా**

**ఈ రక్తమేం బాగు లేదమ్మా**

**హుష్ – గోల చేయకండ్రా**

**ఈ రోజుల్లో ఎవరి దగ్గరైనా అంతే**

**కనీసం మనకైనా మిగుల్చకుండా**

**అందరిదీ ఆ మహా మంత్రే పీలుస్తున్నాడు గదా**

**అంది తల్లి దోమ"** **(జీవితమే ఒక కవిత, పుట – 129)**

"నిలువు దోపిడి" కవితలో చెరుకుగడల్లాంటి ప్రజల్ని తమ కుతంత్రాల పళ్ళ చక్రాల మధ్య క్రష్ చేసి పిప్పిగా చేసి నిలువు దోపిడీ చేస్తున్నానని శక్తివంతంగా చెప్పారు కవి.

**"మరి ఎందుకుండదూ**

**చెరుకు రసం**

**మీకు తీయగా మధురంగా**

**మీ కుతంత్రాల పళ్ళ చక్రాల మధ్య**

**ఒకటికి రెండు సార్లు దాని బతుకును పిప్పి చేశాక"**

**(జీవితమే ఒక కవిత, పుట – 130)**

"బాలచేష్ట" కవితలో చిన్నపిల్లలు తొడుక్కున్న చెడ్డీని మల మూత్రాలతో పాడు చేస్తే తల్లి కొత్త చెడ్డీ తొడిగితే వారు దానిని కూడా అలాగే పాడు చేసుకుంటారు. రాజకీయవేత్తల కూడా పార్టీలు మారుస్తూ ఇటువంటి బాలచేష్టలే చేస్తారు అని అంటాడు కవి.

**"శుభ్రమైన చెడ్డీలో**
**ప్యాన్ పోసుకుని, దొడ్డికి కూచుని**
**ఉన్న పార్టీని నానా కంగారుగా చేసిపెట్టి**
**మరో కొత్త పార్టీ చెడ్డీ లేసుకుని**
**మళ్ళీ అందులో కూడా**
**ఆ పనులే చేస్తూ ఉండకపోతే**
**నేడు – రాజకీయ నాయకులే కారు"**

**(జీవితమే ఒక కవిత, పుట – 131)**

"ఒట్టు" కవితలో రాజకీయవేత్తలు ఊసరవెల్లులు వారు చెప్పే ప్రతి తియ్యటి మాటలు నమ్మితే నిన్ను నువ్వు చంపుకు తిన్నట్టే అని ఒట్టు పెడతాడు కవి.

**"ఈ కన్నీటి చుక్కను జీవితం అను**
**ఈ ఆకలి మంటను అనుభవం అను**
**ఈ అసమర్థతను ఓపిక అను**
**ప్రమాదం లేదు, కాని...**
**ఊసరవెల్లుల అబద్ధాల్ని ఉపన్యాసాలనో**
**ఉపన్యాసాల్ని సందేశాలనో**
**సందేశాల్లో తియ్యటి మాటలు తప్ప**
**కడుపు నింపే అన్నం దొరుకుతుందనో**
**అనుకుంటే**
**నిన్ను నువ్వు చంపుకు తిన్నట్టే"**

**(జీవితమే ఒక కవిత, పుట – 151)**

"గాయపడ్డ ఉదయం" కవితలో రాజకీయం వివిధ రూపాలలో విశ్వమంతా వ్యాపించిందని, మతం, కులం, ఆస్తి, అంతస్తు, అవకాశం, అధికారం, చదువు, ఉద్యోగం, కళలు, కలలు – ఈ అన్నింటి కింద రాజకీయం ఉందని వాపోతున్నాడు కవి.

**“చీకటి చచ్చిన సంతోషంతో ఉదయమే లేచి**
**తలుపులు తెరవగానే – జువ్వుమని,**
**రాజకీయం నరాలు పిండుతుంది**
**వివిధ రూపాలతో విశ్వమంతా విస్తరించినట్లు**
**మతం కింద రాజకీయం, కులాల కింద రాజకీయం**
**ఆస్తి కింద, అంతస్తు కింద, అవకాశం కింద**
**అధికారం కింద, చదువుల కింద, ఉద్యోగం కింద**
**కళల కింద, కలల కింద**
**“బాలచిచ్చ” పండితుల రాజకీయం!**
**గల్లీ నుండి ఢిల్లీ దాకా రాజకీయం**
**ఉదయం లేవక ముందే**
**రాజకీయపు కుష్టు వ్యాధితో బాధపడుతున్న**
**ఈ దేశం ఫోటోలతో సహా పత్రికలుదయిస్తాయి!**
**..... ..... ..... ..... ..... ..... .....**
**న్యూస్ ప్రింట్ మీద కనిపించే ప్రతి అక్షరం...**
**పోలీస్ ఫైరింగ్లో చచ్చి – వంకర్లు తిరిగిన**
**గిరిజనుడి శవంలా కనిపిస్తుంది”**

**(గాయపడ్డ ఉదయం, పుట – 92)**

రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం జరిపే అల్లర్లు, హింసా కాండ వలన సామాన్య ప్రజలు పడే బాధలు ఈ కవితలో చూడవచ్చు.

రాజకీయ నాయకులు స్వార్థంలో, స్వలాభంలో ప్రతిపక్ష నాయకులకే కాదు, తమ పార్టీలోని వారికి కూడా హాని తలపెట్టడానికి వెనుకాడరు. అంతేగాక పార్టీలు అధికారంలోకి రావడం కోసం ధనంతో ఓటర్లను కొని గెలవడం ఒక పద్ధతైతే, ఎన్నికల్లో పోటీ చేసిన ప్రత్యర్థిని చంపడం అనేది మరో పద్ధతి. అధికార దాహం ఎలా వెర్రితలలు వేస్తుందో నేటి రాజకీయ నాయకుల స్వార్థ బుద్ధిని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు రచయిత.

### 3.5.10. స్త్రీవాదం:

స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో వచ్చిన వాదాల్లో స్త్రీవాదం ఒకటి. దీన్ని ఆంగ్లంలో 'ఫెమినిజం' అంటారు. దీనికి సమానార్థకంగా స్త్రీ విముక్తి, స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం, స్త్రీ విమోచనోద్యమం అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. కానీ వీటి తర్వాత వచ్చిన "స్త్రీవాదం" అన్న పదమే ఈనాడు ప్రచారంలో ఉంది. "సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడీకి సంబంధించిన అవగాహన కలిగి ఉండి, ఈ పరిస్థితి మార్చడానికి స్త్రీలు, పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమం"[26] అని స్త్రీవాదాన్ని ఫెమినిస్టు స్టడీ సర్కిల్ వారు నిర్వచించారు.

స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలగిపోవాలని, స్త్రీలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయంగా సమాన అవకాశాలు రావాలని రాసే కవిత్వం స్త్రీవాద కవిత్వం.

దేవరాజు మహారాజు రచనల్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అక్కడక్కడ స్త్రీ చైతన్య దృక్పథం కనబడుతుంది. సమాజ మనుగడకు స్త్రీలు పెట్టని కోటలాంటివారు. వీరి అస్తిత్వం లేనిది ఏ సమాజం ఉన్నతిని సాధించలేదనేది నిర్వివాదాంశం. ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని పెద్దల మాట. సామ్రాజ్య ఉత్థాన పతనాలకు స్త్రీలు దోహదం చేసినట్లు చరిత్ర చెబుతుంది. "ప్రతి మగాడి వెనక ఒక స్త్రీ" అనే నానుడి అందరూ చెప్పిన మాట. కాబట్టి స్త్రీకి పూర్వం నుండి సమాజం అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చిందన్నది అక్షర సత్యం. అదే స్థాయిలో స్త్రీని ఒక భోగపు వస్తువుగా చూసే సందర్భాలు కూడా ఎక్కువే. ఇటువంటి ఔన్నత్యాన్ని దేవరాజు మహారాజు వీలు దొరికినప్పుడల్లా తమ రచనల్లో ప్రస్తావించారు.

దేవరాజు మహారాజు వరకట్నం, గృహహింస, అత్యాచారం మొదలైన స్త్రీల సమస్యలను, స్త్రీల దయనీయ స్థితిని ప్రధాన వస్తువుగా తీసుకొని తన ప్రతిభని, ఆ సమస్యల తీవ్రతని వ్యక్తపరిచేలా శక్తివంతంగా కవితలు రాశారు.

వరకట్నం ఒక సాంఘిక దురాచారం. ఇది మన సమాజంలో ప్రబలంగా ఉంది. కట్నకానుకలు చాలక భర్త, అత్తామామలు ఏవో కానుకలు తెమ్మంటూ రాక్షసంగా వేధించడమే కాకుండా నిర్దాక్షిణ్యంగా సజీవ దహనం చేస్తున్నారు. అత్తామామలు పెట్టే చిత్రహింసలు భరించలేని స్త్రీలు తమ బాధలు తల్లిదండ్రులకు, ఇతరులకు చెప్పుకోలేక, పుట్టింటికి భారం కాలేక, అత్తింట్లో ఉండలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

---

[26] తెలుగులో కవితోద్యమాలు, తెలుగు అకాడమీ, పుట–185.

ఈ రోజుల్లో ఏ పత్రిక తీసుకున్నప్పటికి ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు ఇద్దరూ కట్నాలు పూర్తిగా తేలేదనో, అదనపు కట్నం కోసం స్త్రీలను చంపినట్లు వార్తలు కనబడుతున్నాయి.

"పారాణి" కవితలో ఈ సమాజంలో యువతి భవిష్యత్తు ఎంత ప్రమాద భరితంగా ఉందో తెలియజేశాడు.

**"భయం భయం అంతటా భయం**
**పావడాలు, పట్టు పరికిణీలు**
**ఏది చూసినా నాకెందుకో**
**లోతైన బావి లాంటి భయం**
**తేలిన శవం లాంటి భయం**
**భయం భయం నాకు అంతటా భయం**
**నాను ఒడ్డాణం, పట్టా గొలుసులు, పుస్తెలతాడు**
**ఏది చూసినా భయమే**
**అర్థరాత్రి ఒంటరితనంలో ఉరేసుకున్న**
**అందం లాంటి భయం**
..... ..... ..... ..... ..... .....
**కిరాణ కొట్లో అగ్గి పెట్టెన్నా భయమే!**
**రేషన్ షాపులో కిరోసినన్నా భయమే!!**

**(జీవితమే ఒక కవిత, పుట – 179)**

ఈ కవిత వరకట్న చావుల్ని దృష్టిలో పెట్టుకొని రచింపబడింది. నేటి పరిస్థితులను ఆవిష్కరించేదిగా ఉంది. నడిచిపోయే అమ్మాయి జరగబోయే అగ్ని ప్రమాదంలా అనిపించడంలోనూ, కిరాణా కొట్లో అగ్గిపెట్టె అన్నా, రేషన్షాపులో కిరోసిన్ అన్నా, ఈ కవి భయపడడంలోనూ, అతని హృదయంలో ఎంత వేదన ఉందో, ఎంత క్షోభ ఉందో పాఠకుడు సులభంగా గ్రహిస్తాడు.

"నీరు" కవితలో "స్త్రీ" నీరులాగ ఎన్నో రకాలుగా రూపాంతరం చెందుతుందని చెప్పబడింది.

**"అనురాగ మవుతుంది**
**కన్నీరవుతుంది**

**శాసనమవుతుంది**

**జీవితాంతం వేగినా**

**నువ్వు దారిలో పడనందుకు**

**మౌనమవుతుంది**

**చెయిన్ స్మోకింగ్లో పొగయి**

**సుళ్ళు తిరుగుతుంది**

**చివరకు, నీలో – ఒక శూన్యమవుతుంది!**

**ప్రకృతిలో మిళితమై**

**జ్ఞాపక మవుతుంది"**

**(జీవితమే ఒక కవిత, పుట – 177)**

"షకీలా" కవితలో రేప్కు ప్రతి క్రియగా ప్రజలు పోలీస్ స్టేషన్ను ముట్టడించడం అనే ఫెమినిజం అంశం గురించి చెప్పడం జరిగింది.

**"కోపోద్రేకంతో**

**పోలీస్టేషన్ల మీద**

**ఈ జనం ముట్టడి**

**నువ్వు అసహాయంగా**

**రాక్షస రతిలో**

**మూసిన పిడికిలి"** **(గాయపడ్డ ఉదయం, పుట – 40)**

"భారతనారి" కవితలో భార్యగా స్త్రీ చేసే త్యాగాన్ని ప్రశంసించడం జరిగింది.

**"నూతనోత్సాహంతో**

**సాగర గర్భంలోంచి బయటపడి**

**దినమంతా సంసారపు**

**చెలియలి కట్టకు కొట్టుకుని**

**విసిగి వెనక్కి తిరిగి రాత్రికి**

**పతిదేవుని సాగర హృదయ గర్భంలోకి**

**చేరుకుంటున్న కెరటం"** **(జీవితమే ఒక కవిత, పుట – 176)**

ఈ విధంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల్ని, వారి త్యాగశీలతను వస్తువుగా తీసుకొని అతి సహజమైన, వాస్తవ సంఘటనలను భిన్న కోణాల్లోంచి దర్శింపచేసి పాఠకులలో ఆలోచనలు రేకెత్తించారు.

### 3.5.11. మానవతావాదం:

మానవతావాదాన్ని ఆంగ్లంలో 'Humanism' అంటారు. ఈ పదం లాటిన్ భాషలోని 'Humanitas' అనే పదం నుండి వచ్చింది. "మానవుడే అన్నింటికీ మూలం (Man is measure of all things) అని క్రీ.పూ.5వ శతాబ్దంలోనే పశ్చిమ యూరప్లో ప్రతిపాదించిన గ్రీక్ దార్శనికుడు ప్రోటాగొరాస్ (Protagoras) మానవతావాదానికి మొట్టమొదటి ప్రవర్తకుడు"[27].

"Homomensura (హోమోమెన్సుర) అనే సిద్ధాంతం మానవుడే అన్నింటికీ మూలమని చెబుతుంది. ఆక్స్ఫర్డ్కి చెందిన F.C.N. షిల్లర్ (1750–1805) మొదటిసారిగా మానవతావాదం (Humanism) అనే పదాన్ని చెప్పారు"[28].

"మానవుడి సర్వశక్తిమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని పరమ ప్రమాణంగా భావిస్తూ, అతని ధార్మిక, వైజ్ఞానిక, కళాత్మక, ఆధ్యాత్మికరంగ వికాసానికి, మానవాభ్యుదయానికి, సంఘ శ్రేయస్సుకు మానవ సామర్థ్యాన్నే మూలంగా ప్రతిపాదించే వాదం మానవతావాదం"[29].

"మౌలికంగా మానవుడే అన్నింటికి ప్రమాణం అనేది మానవతావాదం. మానవుని ప్రాథమిక సమస్యలతో వ్యవహరించే తత్వమే మానవతావాదమని, మానవ సంక్షేమాన్ని కోరేవారిని మానవునిగా గుర్తిస్తామని, ఏ వ్యక్తి మానవ శ్రేయస్సును ఆశిస్తాడో, ఏ వ్యక్తి ఈ భూమిపైనే మానవునిగా సంక్షేమాన్ని అపేక్షిస్తాడో, ఏ వ్యక్తి ప్రస్తుత మానవుని అభ్యుదయానికి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాడో అతడే నిజమైన మానవతావాది"[30].

ఆధునిక మానవతావాద కవులలో రాయప్రోలు సుబ్బారావు (కష్ట కమల), గుర్రం జాషువా (గబ్బిలం), దాశరథి (అగ్నిధార), బాలగంగాధర్ తిలక్ (అమృతం కురిసిన రాత్రి), జ్ఞానసంద కవి (పాంచజన్యం), కుందుర్తి (నగరంలో వాన), శ్రీ శ్రీ (మహాప్రస్థానం), సినారె (విశ్వంభర), శేషేంద్ర శర్మ (నా దేశం నా ప్రజలు), N. గోపి (చిత్రదీపాలు), శీలా వీర్రాజు (ఎర్రడబ్బా రైలు),

[27] రావికంటి వసునందన్, ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతా వాదం–విశ్వంభర విలక్షణత, పుట–06.

[28] గొట్ల రవికుమార్, గోపి కవిత–మానవత, పుట–05.

[29] రావికంటి వసునందన్, ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతా వాదం–విశ్వంభర విలక్షణత, పుట–16.

[30] జి. అరుణకుమారి, ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతా వాదం, పుట–01.

ఎల్లూరి శివారెడ్డి (ఆమె ఎవరైతే మాత్రం) మొదలైన కవులు మానవతావాద కవులలో ప్రధానంగా కనిపిస్తారు.

స్పందన మానవత్వ లక్షణం, మానవత్వం కవి యొక్క లక్షణం. మానవీయ దృక్పథం లేనిదే ఏ వ్యక్తి అయిన కవి కాలేడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులకు, పరిసరాలకు, ప్రభావాలకు అనుక్షణం స్పందించడం కవి యొక్క మానవతా దృక్పథం. మానవీయ దృక్పథాన్ని కవి నుండి వేరు చేసి చూడలేనంతగా మానవీయ దృక్పథం కవిలో అణువణువున మమేకమై ఉండటం సహజం. దేవరాజు మహారాజు కవిత్వంలో ఈ అంశాలన్నీ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

'గ్రేట్ ఫాల్, కలర్ ఫుల్ బ్రౌన్ షుగర్', అనే రెండు కవితలు ఈ భావాంశంలో రాయబడ్డాయి.

"గ్రేట్ఫాల్" అనే కవితలో

**"గ్రేట్వాల్ రాళ్ళలో ప్రతిధ్వనించిన**
**ఆఖరి ఆక్రందనల్ని అరెస్టు చేయ్యండి**
**అమాయక యువక రక్త బిందువుల్ని**
**జెండా మీద అరుణ తారల్లా కుట్టించుకోండి**
**హ్యూమనిజం లేని క్రూర కమ్యునిజమా**
**నీకో నమస్కారం"** **(జీవితమే ఒక కవిత, పుట–192)**

బీజింగ్ తియాన్మెన్ స్క్వేర్లో 1989 జూన్ 3, 4 సంఘటనలో నిరహారదీక్షలో ఉన్న వేల మంది విద్యార్థుల్ని డెంగ్ ప్రభుత్వం కాల్చి చంపింది.

దేవరాజు మహారాజు గారికి కమ్యూనిజం కావాలి. కాని అందులో హింస ఉండకూడదు. మానవతావాదం మాత్రం ఉండాలి. మార్క్సిజం ప్రధానమైన అభ్యుదయాన్ని కాకుండా, మానవతావాద ప్రధానమైన అభ్యుదయాన్ని కాంక్షిస్తున్నాడని "గ్రేట్ఫాల్" అనే కవితను బట్టి తెలుస్తుంది. ప్రస్తుత వ్యవస్థను మార్చడం కోసం విప్లవాన్ని ఆహ్వానించే ఈ కవి, సమసమాజాన్ని స్థాపించుకున్న విప్లవ చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడానికి, అమెరికాతో కలిసి కుట్ర పన్నని విద్యార్థుల్ని డెంగ్ ప్రభుత్వం కాల్చి చంపడాన్ని వ్యతిరేకించారు.

"కలర్ఫుల్ బ్రౌన్ షుగర్" అనే కవితలో

**"పొద్దునెప్పుడో కాలిన పక్క ఫ్లాట్ సంగతి**
**సాయంత్రం వార్తల్లో తప్ప తెలియదు**

**భార్య తప్పి పోయిందని ప్రకటించి**
**నువ్వు విడిచిపెట్టిన సంగతి కప్పిపుచ్చుకుంటావు**
**నీ బతుకు మీద నవ్వేందుకు**
**అఖిల భారత హాస్య కవి సమ్మేళనం ఏర్పాటవుతుంది"**

**(జీవితమే ఒక కవిత, పుట–194)**

బ్రౌన్ షుగర్ ప్రమాదకరమైన మాదక పదార్థం అని దాని మత్తులో పడి ప్రపంచంలోని యువతరం అంతా నిస్సత్తువగా తయారవతుందని, టి.వి. మత్తు కూడా అలాంటిదేనని చెబుతాడు కవి. జీవితంలో దొరకినవి అన్ని దొరికే టి.వి. తెర అని టి.వి. సంస్కృతిని తూర్పారబడతారు.

**"కాలానికి, ప్రకృతికి, సమాజానికి ఒక ధ్యేయానికి**
**తనను తాను అర్పించుకునేవాడు మాత్రమే**
**తనను తాను అంకితం చేసుకునేవాడు మాత్రమే**
**అజేయంగా నిలబడతాడు!**
**మానవత్వానికి ఉదాహరణ అవుతాడు**

**(జీవితమే ఒక కవిత, పుట – 92)**

మానవతావాదం కవికుండె గొప్ప లక్షణం. ఆ లక్షణాన్ని నిండుగా కలిగిన కవి దేవరాజు మహారాజు. మానవతావాదంతో తొణికిసలాడే ఈ కవితలు విశ్వశాంతిని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని మనసార కోరుకుంటాయి. నిద్రాణమై ఉన్న సమాజాన్ని తట్టి లేపుతాయి. గతి తప్పిన సమాజానికి మార్గ నిర్దేశం చేస్తాయి.

**3.6. కథ:**

"సామాన్యవ్యవహారంలో, అన్ని రకాల కథలను కథలనడమే తెలుగువాళ్లకు అలవాటు. కథకు కాళ్ళుండాలనీ అనగా అది ఊహాలోకాలలో గాకుండా నేలపైనే నడవాలని ఒక ఇంగితం మానవుడి ఆలోచనాప్రస్థానంలో కొత్తగా తిష్టవేసింది. కథను నేలపైన నడిపించాలన్న ఆ ప్రయత్నంలోనుంచి ఈనాడు మనం కథ, చిన్నకథ, కథానిక అన్న పర్యాయ పదాలలో వ్యవహరిస్తున్న short story అన్న సాహిత్యప్రక్రియ ఉద్భవించింది"[31].

"ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధునిక వచన రచనా విశేషం కథానిక. మామూలు కథ కంటే అది సునిశితం. సూక్ష్మతరం. ప్రతి కథానిక ఒక కథే. కానీ ప్రతికథ కథానిక

[31] మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ (సం.) తెలుగు కథలు – రీతులు, పుట–vi.

కాదు. కథ విషయం ప్రదానమైతే కథానిక శిల్పప్రధానం. రచయిత ఏం చెప్పాదన్నది రెండింటికి వర్తిస్తుంది. కథముడి వజ్రం. కథానిక సానబెట్టిన వజ్రం. దీని అందం దానికి లేదు. దీని పనితనం దాంట్లో లేదు"[32].

కథ – కథానిక నిర్వచనాల ప్రకారం కథానిక: Short Story అనే ఆంగ్ల పారిభాషిక పదానికి 'కథ' story అనే పారిభాషిక పదానికి సమానార్థకంగా ప్రయోగంలో ఉందని తెలుస్తుంది. కథ –కథానిక అనేవి పర్యాయ పదాలుగా వాడుకలో ఉన్నప్పటికీ మన ప్రాచీన సాహిత్యంలో ప్రయోగించిన కథ–కథానిక అనే పారిభాషిక పదానికి ఆధునిక సాహిత్యంలో వాడుకలో ఉన్న పదాలకి చాలా వ్యత్యాసం కూడా కనిపిస్తుంది. గద్య పద్య కావ్యాల్లో కథలు ఉన్నా, కథానిక ఉన్నా, ఆధునిక కథ మాత్రం పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే తెలుగు సాహిత్యంతో వచ్చిన కథానికనే తొలి తెలుగు కథానికగా పరిగణించడం కూడా మన సాహిత్యంలో సాంప్రదాయంగా మారి గురజాడ అప్పారావుగారు వ్రాసిన దిద్దుబాటు కథానికనే మొట్ట మొదటి ఆధునిక తెలుగు కథానికగా మన సాహితీవేత్తలు గుర్తిస్తున్నారు.

పూర్వం నుంచి మనకు పురాణ గాథలు, పంచ తంత్రం, కాశీ మజిలీ కథల్లాంటివి ఉన్నా, నాయనమ్మలు చెప్పే జానపదకథలు ఉన్నా, కథానిక ప్రక్రియ మాత్రం నిస్సందేహంగా పాశ్చాత్య సాహిత్య సంపర్కంలో రూపుదిద్దుకున్నదే. లియో టాల్స్టాయ్, విలియం సారోయన్, ఆస్కార్ వైల్డ్, సోమర్సెట్ మామ్, మాక్జిమ్ గోర్కి వంటి ఎందరెందరో మహానుభావుల చేతుల్లో కథానిక ప్రక్రియ ఒక సంపూర్ణతను, ఒక సమగ్రతను సంపాదించుకుంది. పందొమ్మిది, ఇరవై శతాబ్దాలలో వారి వారి దేశ కాల పరిస్థితులను బట్టి ఆ ప్రక్రియకు ఒక రూపాన్నిస్తూ వచ్చారు. The short story is a product of modern age. అడ్గార్ ఎలన్పో మొదలు అనేక మంది విశ్వ రచయితలు ఈ ప్రక్రియకు వైవిధ్యాన్ని సంతరిస్తూ వచ్చారు.

అన్ని ప్రక్రియల కన్నా కథానిక ప్రపంచ వ్యాప్తంగా ఎందుకు ప్రజాదరణ పొందింది అంటే అది మానవ ప్రకృతికి చాలా దగ్గరగా ఉండే ప్రక్రియ కాబట్టి. సామాన్యంగా ఏ కథానిక అయినా ఒక పాత్రపైన లేదా సంఘటనపైన లేదా ఒక భావం మీద ఆధారపడి ఉంటుంది. సంక్లిష్టమైన, బహుముఖమైన జీవితంలోంచి, ఒక ముఖ్య ఘట్టాన్ని, కథానిక పాఠకుల ముందు పెడుతుంది. వారి వారి జీవితాల్ని తనలో చూసుకోమంటుంది కూడా! అందులో ఉద్యమాలు, పోరాటాలు,

32 పోరంకి దక్షిణామూర్తి, కథానిక స్వరూప స్వభావాలు, పుట–131.

అల్లకల్లోలాలే కాదు, ప్రేమలు, అపార్థాలు, స్వీట్నథింగ్స్తోపాటు కఠినమైన జీవన వాస్తవాలు కూడా ఉంటాయి.

కథ అనగా కొంత సత్యాంశతో కూడిన కల్పిత గద్య గ్రంథం. కథ అనే పదం "కథ్" అనే ధాతువు నుండి పుట్టింది. దీనికి సంభాషించుట, చెప్పుట అనే అర్థాలున్నాయి. ఈనాడు తెలుగులో "కథ", "కథానిక" అనే పదాలు సమానార్థకంగా వాడబడుతున్నాయి. 19వ శతాబ్దిలో కథానిక ప్రక్రియ ఆంగ్లం నుండి తెలుగులోకి ప్రవేశించింది.

కాలక్రమంలో దండగా కుచ్చిన సంఘటనల వరుసను కథగా పేర్కొనవచ్చును. ఈ సంఘటనలు ఒకదానితో మరొకటి సంబంధం కలిగినవిగా ఒకదానిలో నుంచి మరొకటి పుట్టినవిగా ఉంటాయి. కథ వాస్తవిక జీవితాన్ని ఆలంబనంగా కలిగి ఉంటుంది. లేదా కనీసం వాస్తవిక జీవితాన్ని స్ఫురింప జేస్తుంది.

1. "సాధారణంగా నాతి విస్తృత క్షేత్రము కలిగి, ఒకానొక సంవేదనముతో కూడి, స్వయం సంపూర్ణమై, దానిలోని విభిన్న తత్త్వములను ఏకోన్ముఖముగా చూపు ఇతివృత్తాత్మక గద్య కవిత శిల్పఖండమును కథానిక అనవచ్చును" (బొడ్డపాటి కుటుంబ రాయశర్మ).
2. "ఒకానొక ఎత్తుగడ, నడక తీరు, ముగింపు, పరిమిత పాత్రలు, ఆ పాత్రలకు తగు పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఒక జీవిత సత్యమును ప్రతిపాదించుట, అన్నింటిని మించి – వస్త్వైక్యము నుండి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించ గల చిన్న కథ కథానిక".
3. "ఒక కథను చదివిన తరువాత మనసు చలించాలి. మళ్ళీ చదివింప జేయాలి. ఈ కథ బాగుంది అని పది మందికి చెప్పించగలగాలి. మళ్ళీ పదేళ్ళలో, ఇరవై ఏళ్ళో పోయిన తరువాత చదివినా అదే అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది".
4. "కథానికకు శిల్పమే ప్రాణం" – శీలా వీర్రాజు.
5. "సహజమనిపించే అసహజమే కథ" – మల్లాది రామకృష్ణశాస్త్రి.

### 3.7. కథా వస్తువు:

ఒక వ్యక్తి జీవితాన్ని ముందుగా నిర్దేశించేది కుటుంబం. ఆ తర్వాత సమాజం. రచయిత కూడా సమాజంలో ఒక వ్యక్తే కనుక అతను ఎన్నుకునే వస్తువు ప్రకృతి నుండి లేదా సమాజం నుండే గ్రహించబడుతుంది. ఎటువంటి వస్తువు గ్రహిస్తాడు అనేది రచయిత దృక్పథంపై ఆధారపడుతుంది. అలా ఎన్నుకోబడిన వస్తువు మనిషి మనుగడను, మనిషి మనిషికి మధ్య గల సంబంధాన్ని,

సమాజానికి మనిషికి మధ్య గల సంబంధాన్ని వివరిస్తుంది, విశ్లేషిస్తుంది. వాస్తవికతకు అద్దం పడుతుంది.

ప్రాచీన, అర్వాచీన కథా వస్తు స్వభావాలను వివరిస్తూ "ఆధునిక కథలు పురాణ కథల్లాగా అవాస్తవమైనవి కావు. నీతి కథలులాగా అభూత కల్పనలు కావు. ఇవి కల్పిత వాస్తవిక కథలు. స్వరూపాన్ని బట్టి ఈ కథల్లో వాస్తవికత నూటికి నూరుపాళ్ళూ ఉండవలసిందే గత్యంతరం లేదు. ఈ వాస్తవికత కథనంలో పాత్ర చిత్రణలో, సంభాషణలో ఉండి తీరాలి. వీటిలో మనస్తత్వానికి చాలా ప్రాముఖ్యం ఉంది. ఇవి పురాణ కథలలాగా ఒక ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని దృష్టాంతం కింద చెప్పుకునేవి కావు. నీతి కథలలో లాగా వీటిలో ఒక స్పష్టమైన నీతి కూడా ఉండదు. వీటిలో జీవిత ఖండాలు ప్రతిబింబిస్తాయి"[33] అని కొడవటిగంటి కుటుంబరావు కథా సాహిత్యంలో వాస్తవికతకు గల ప్రాముఖ్యాన్ని వివరించారు.

"నిత్యం మనం చూసే సంఘటనలు, పొందే అనుభూతులూ, జరిగే వింతలు, సామాజిక సమస్యలు, పరిణామాలు, ప్రకృతి దృశ్యాలు, ఆర్థిక అసమానత్వ ఫలితాలు, రాజకీయపుటెత్తులు, రాగద్వేషాల దాగుడుమూతలు, మానవ స్వభావపు లోతులు, నాగరికపు నాజూకులు, శారీరక ఉన్మత్తాలు, అపరాధ పరిశోధనలు, హాస్య రస ఘట్టాలు, మంచికి, చెడుకి మధ్య సంఘర్షణలు, పత్రికలలో పడే వార్తలు విన్నవి, కన్నవి మొదలైనవెన్నో కథావస్తువులు..."[34] అని శార్వరి వివరించారు.

కథకు వస్తువు, వస్తువుకు సమాజం కేంద్ర బిందువులు. కథకు ముఖ్యమైన బలం వస్తువు. ప్రతీ వస్తువు ఉత్తమ కథగా రూపుదిద్దుకోలేదు. కథా వస్తువు సమాజం నుండి స్వీకరించబడిందే. అయినప్పటికీ రచయిత స్థలకాలాలు, కుల, వర్గ, మత, దృక్పథం, సమర్థత వంటి పరిమితులకు లోనవుతుంది.

దేవరాజు మహారాజు రాసిన కథల్లో వస్తు వైవిధ్యం పుష్కలంగా ఉంది. ఆయన జీవిత పరిణామాల్లోని సంఘటనలే కథలుగా రూపొందిన క్రమానికి, ఆయా కథల్లోని కథా వస్తువులకు ఎంతో గాఢమైన సంబంధం గలదని వస్తు విశ్లేషణ వల్ల తెలుస్తుంది. 1980–90 దశాబ్దానికి తెలంగాణ ప్రాంత ప్రజల జీవన స్థితులను ఎంతో సమర్థవంతంగా దేవరాజు మహారాజు కథల్లోకి చిత్రించారని తెలుస్తుంది. సమాజంలో సమకాలీన సమస్యలు, రాజకీయ, ఆర్థిక దోపిడీ,

---

[33] కొడవటిగంటి కుటుంబరావు, సాహిత్య ప్రయోజనం, పుట–141.

[34] శార్వరి, కథలెలా రాస్తారు, పుట–86.

పేదవానివిత చిత్రణ, చైతన్యం, గురువు, విద్యార్థి, స్త్రీల జీవన గాథలు, కుంటుపడుతున్న మానవత్వ విలువలు మొదలైనవి వీరి రచనల్లో కనిపించే వస్తువులు.

### 3.8. ఎత్తుగడ:

పువ్వు పుట్టగానే పరిమళించినట్లే కథా పరిమళం పాఠకుడికి ఎత్తుగడతోనే అందుతుంది. అప్పుడే ఆ పాఠకుడు ఆ కథ వెంట పరుగెడతాడు అంటారు విమర్శకులు. "మొదటి వాక్యంతోనే చదివేవాళ్ళకు ఉచ్చు వెయ్యాలి. తొలి పేరాతోనే పాఠకులలో ఉత్కంఠను మేలుకొలపాలి. నిజమే కథ ఎలా ఆరంభించాలి అంటే ఇదే జవాబు"[35] అని ఎత్తుగడను వివరించారు కాళీపట్నం రామారావుగారు.

రచయిత తన ఆలోచనలకు ఒక క్రమాన్ని ఏర్పరచుకుని కథను ప్రారంభిస్తాడు. ఆ ప్రారంభంలో చిత్రీకరించే ముఖ్యాంశాన్ని 'ఎత్తుగడ' లేదా 'ఆరంభం' అంటారు. "మనస్సులో ఏర్పరచుకున్న ఇతివృత్తాన్ని ఆవిష్కరించే ప్రక్రియలో రచయిత (లేదా కథకుడు) మొట్ట మొదట ఏ అంశాన్ని ఎత్తుకుంటాడో ఆ రచన (కథ)లో అదే ఎత్తుగడ"[36].

### 3.9. కథలు – వస్తు విశ్లేషణ:

### 3.9.1. విద్యారంగం:

'పొడవని పొద్దు, కూడలి, కిస్సా కాపికా, బతుకు ఫ్యాను' మొదలైన కథలు విద్యారంగానికి సంబంధించినవి.

దేవరాజు మహారాజు కథలన్నీ తెలంగాణ మాండలికంలో మాట్లాడతాయి. ప్రాథమిక విద్యా సౌకర్యాలు కల్పించినా, వాటిని ఉపయోగించుకోలేని దయనీయ స్థితిలో ఉన్నవారు చాలామంది ఉన్నారు. 'పొడవని పొద్దు' కథ ఈ వాస్తవాన్ని తెలియజేస్తుంది. "సద్వులు సద్వి రాజ్యాలేలే రాతలు మనకు ఏడివి బిడ్డ, కూటికి లేనోళ్ళం, కూడు, గుడ్డ ఉన్నోళ్ళకు ఆ సద్వులు. మనకేడైతది కొడ్కా"[37] అంటూ పోశిగాడి తల్లి కండ్లొత్తుకున్నప్పుడు మనకు కళ్ళు చెమరుస్తాయి.

కోట్లాది మంది భారతదేశ గ్రామీణ బాలబాలికల జీవితంలో ఇంకా పొద్దు పొడవలేదు. ఒక పశువులు కాసే పనివాని ఆంక్షలను, ఆశలను అద్భుతంగా చిత్రిస్తూ బాలుని స్వగతంలా కనపడే 'పొడవని పొద్దు' కథ పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో కొనసాగుతుంది. కొందరికి జీవితం వడ్డించిన విస్తరి. మరి కొందరికి ముండ్ల కిరీటం. పేదరికం ముండ్ల కిరీటంగా మారిన

---

[35] కాళీపట్నం రామారావు, కారా రచనలు, పుట–43.

[36] పోరంకి దక్షిణామూర్తి, కథానిక స్వరూప–స్వభావాలు, పుట–289.

[37] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–148.

శయ్యకుచదువుకోవడం అనేది సుదూర స్వప్నం. అది ఆ బాలునికి జీవితం నేర్పని పాఠాలతో అర్థమవుతుంది.

ప్రభుత్వం వెట్టిచాకిరిని నిషేధిస్తూ ఎన్ని చట్టాలు చేసిన మారుమూల పల్లెల్లో ఇది ఇంకా కొనసాగుతూనే ఉంది. వెట్టి అని పేరు కాకపోతే మరో పేరుతో చలామణి అయ్యే చాకిరిని నిర్మూలించే ప్రభుత్వ యంత్రాంగం ఉన్నా, ఇంత చిన్న విషయాలు పట్టించుకోని అమలుపరిచేంత తీరిక మన ప్రభుత్వ యంత్రాంగానికి లేదు. ప్రభుత్వం ఒక శాసనం చేసిందంటే దేశంలోని ఏ మారుమూల ప్రాంతంలోనైన అది పటిష్టంగా అమలైతే తప్ప వాటికి విలువ ఉండదు. "ప్రజాస్వామ్యంలో చట్టం ముందు నిలబడినవారు సామాన్యుడైనా, ప్రధానమంత్రైనా ఒక్కటే" అని రాసుకున్నంత మాత్రాన సరిపోదు. అది అమలు అవ్వాలి. ఆచరణలో లేని చట్టాలు ప్రజల విశ్వాసాన్ని చూడలేవు. పొడవని పొద్దు కథలోని పోశాలు, పేరులేని కథలోని మల్లేశు మన వ్యవస్థ తీర్చిన బాల దాస్యులుగా దర్శనమిస్తారు.

'పొడవని పొద్దు' కథ "బళ్ళో చదువుకునే చదువు కన్న బతుకు నేర్పే చదువు గొప్పదని వాడికి కొద్ది కొద్దిగా అర్థమవుతుంది" అన్న వాక్యంతో కథ ముగుస్తుంది.

కాపీ కొట్టే కళను అవపోసన పట్టిన కాపీ బ్రహ్మల గురించి "కిస్సా కాపీకా" కథలో సున్నితంగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో పరిశోధకుల నుండి పరీక్షలు రాసే విద్యార్థుల దాకా కాపీలు కొట్టడం మామూలైపోయింది. విద్యా విధానం కుళ్ళిపోతూ వస్తున్న మార్పులను వివరించే కథ "కిస్సా కాపీకా".

ఒక సామాన్య మానవుని జీవితాన్ని ఆవిష్కరిస్తూ, నిర్మాణాత్మక ప్రయోగంగా రాసిన కథ 'బతుకు ఫ్యాను'. ఈ కథ సహజంగా, మధ్య తరగతి జీవితానికి అతి దగ్గరగా ఉంది.

యూనివర్సిటీ చదువులు బతుకు పోరాటంలో ఏ మాత్రం ఉపయోగపడలేక కేవలం డిగ్రీ పట్టా కాగితాలుగా మిగిలిపోతున్న స్థితికి నిరసనగా రాసిన కథ 'కూడలి'.

### 3.9.2. రాజకీయం:

"కిటుకు, ఓటు విలువ, శ్రద్ధాంజలి, ఓటరు శరణం గచ్ఛామి, అమృతం, తోసేయ్ తోసేయ్, పాతగోడ, కోళ్ళ పందెం" వంటి కథలు ఈ కోవకు చెందినవిగా చెప్పవచ్చు.

భారతదేశంలోని పౌరులు సగం సగం జీవితాలు బ్రతుకుతూ సగం సగమే ప్రగతిని సాధించడానికి వెనుక గల కారణాన్ని రాజకీయ నాయకులు అవలంబించి ఆచరించే సగం సగం వాగ్దానాల రహస్యాన్ని 'కిటుకు' కథ చిత్రిస్తుంది. దేశంలో ఎక్కడ చూసిన సగం సగం బ్రతుకులే!

అభిరుచులు, ప్రయత్నాలు, నిజాయితీలు అన్నీ సగం సగమే. పూర్ణ ప్రయత్నం లేకుండా సగం బతికే దేశానిదని వ్యంగ్యాత్మకంగా విమర్శించారు.

'ఓటు విలువ' కథలో పేదరికంలో మగ్గిపోయి కుంగి కృశించిన ఒక వృద్ధుణ్ణి ఓటు వేయించడానికి తరలించి ఓటు వేసిన తర్వాత ఎవరు పట్టించుకోరు. ఉన్నవాళ్లకు ఒక నీతి, పేదవాళ్లకు ఒక నీతి ప్రదర్శించే రాజకీయ నాయకుల బ్యూరోక్రటిక్ నైజానికి ఈ కథ ఓ మచ్చు తునక.

'శ్రద్ధాంజలి' కథలో నేటి సాహిత్య కార్యక్రమాలలోని కృత్రిమత్వాన్ని రచయిత పట్ల చూపే అబద్ధపు అభిమానాన్ని వ్యంగ్యంగా చిత్రించారు. నేటి స్థితిపై తన అక్కసును తీర్చుకోవడానికి ఒక పాత్రను ఆధారం చేసుకోవటం ఈ కథలో ప్రధానంగా ఉంది. ఈ కథ బహుశా రచయిత అనుభవంలోనిది అయి ఉండవచ్చు. ఈ కథ చదివినప్పుడు చెరబండరాజు గుర్తుకు రాక తప్పదు. బతికి ఉన్నన్నాళ్ళు ఎవరు పట్టించుకోని ఓ రచయిత విషయంలో ఆయన చనిపోగానే శ్రద్ధాంజలి పేరుతో సభలు, సమావేశాలు పెట్టి నానా చెత్త వాగుతారు. రచయితలు, కవుల ఆత్మ వంచన, వ్యవస్థీకృతమైన నిర్లక్ష్యాన్ని ఈ కథ వేలెత్తి చూపుతుంది.

'అమృతం' కథ ఒక ఊహా చిత్రం. నిజంగా అమృతాన్నే కనిపెడితే పంపిణీలో, పంచేవారిలో, ప్రజల్లో ఎలాంటి అలజడి వస్తుందో చిత్రించారు. ప్రపంచానికి ఆకలిని జయించే అమృతం కాదు. స్వార్థాన్ని జయించే మానవత్వం కావాలి. మానవత్వం ఫార్ములా ఏమిటి అని ప్రశ్నించుకుంటుంది పాత్ర. దేవరాజు మహారాజు తనదైన నేపథ్యంలోంచి 'అమృతం' అనే కథను రాశారు. అదే లైఫ్ టానిక్ నాటికగా మారి ఆకాశవాణి జాతీయ పోటీలకు వెళ్ళింది. ప్రముఖ జీవ రసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు మానవాళిని మృత్యువు నుండి తప్పించే అమోఘమైన ఔషధం "అమృతం"ని కనుగొంటాడు. స్వార్థంతో, సంకుచిత తత్వంతో కొట్టుకుపోతున్న జనాన్ని చూసి "ఈ ప్రపంచానికి ఆకలిని జయించే అమృతం కాదు, స్వార్థాన్ని జయించే మానవత్వం కావాలి" అని ప్రొఫెసర్ రంగారావు నిర్ధారించుకుంటాడు.

సోవియట్ రష్యాలో గొర్బచేవ్ ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యంలోంచి రాసిన కథ 'తోసేయ్ తోసేయ్'.

కూలీల మధ్య తగాదాలు సృష్టించి వాళ్ళు కొట్టుకుంటూ ఉంటే చూసి ఆనందించే పెత్తందార్లు ప్రాణం పోతుందన్నా వినిపించుకోక, తమ కారు మురికి అవుతుందని వెళ్ళిపోయే రాజకీయ నాయకుల గురించి 'పాతగోడ' కథలో చూడవచ్చు.

### 3.9.3. కుటుంబ వ్యవస్థ:

'అంతరం, చర్విత చరణం, బెటర్ హాఫ్, పాలు ఎర్రబడ్డాయి, కొత్తఅల్లుడు వంటి కథలు కుటుంబ వ్యవస్థకు సంబంధించినవి.

అన్నదమ్ముల మధ్య గొడవలపై రాసిన కథ 'అంతరం'. రామలక్ష్మణుల వలె ఉండే తన కొడుకులిద్దరూ ఎందుకు విడిపోయారో రాములమ్మకు అర్థం కాదు. నేటి లోకం 'రీతివాయి' ఇంతేనా అని ప్రశ్నించుకుంటుంది. తరానికి తరానికి అంతరం ఉండటం సర్వ సామాన్యమే అయినా, తెలంగాణ ప్రాంతంలోని దారిద్ర్యరేఖను అంటుకుని ఉన్న కుటుంబ పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు చూపుతూ, నిన్నటి తరం వర్తమానంలోకి పరివర్తనం చెందే వైనాన్ని చూపుతుంది 'అంతరం' కథ. ఈ కథ చదువుతున్న కొద్ది ఒక్కసారి నలభై యేళ్ళ తెలంగాణ గతంలోకి వెళ్ళిపోతాం. "పిల్లలు పటేలింటికాడ పెదనాయినను జూశి ఎంత సంబ్రపడ్డరు – పొయ్యేటప్పుడైనా ఇంటికొస్తడేమోనని... ఎంత ఎదురు జూశినం" – వంటి వాక్యాలు గుండెను గొంతుకలోకి తెస్తాయి.

'చర్విత చరణం' అనే కథలో భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని గురించి చెప్పారు. ఈ కథలో "అమ్మాయి చక్కగా ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అని అందరూ అన్నారంటూ ఆమె జీవితం ఎంత విషాదంగా ముగిసిందో ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎంతటి అన్యాయ జరుగుతుందో అతి తక్కువ మాటలలో అర్థవంతంగా చెప్పారు.

### 3.9.4. పర్యావరణ కథలు:

'ప్రకృతి, మార్నింగ్వాక్' వంటి కథలు పర్యావరణానికి సంబంధించిన కథలు.

ప్రకృతిని ఏదో ప్రయోగం పేరిట మనిషి విధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతిని జయించాలనే తపనతో తన సమాధికి తానే గొయ్యి తవ్వుకుంటున్నాడు. 'మానవ జీవితాలు భయానకం చేసుకుంటున్నది. ప్రకృతిని చిత్రహింసలు పెట్టి బీభత్సం చేస్తున్నది, భూమి చుట్టు ఉన్న స్ట్రాటో ఆవరణలోని ఓజోన్ పొరను కావాల్సిన చోట తగ్గించి, శత్రు దేశాల వాతావరణంలో హానికరమైన మార్పులు చేయడానికి కూడా వెనకాడనిది మానవుడే. ప్రకృతి విలువల్ని వైజ్ఞానికంగా ఆలోచింపజేసే విధంగా ప్రకృతి కథ రాశారు.

పర్యావరణాన్ని నాశనం చేసుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుందో చూపుతారు "మార్నింగ్ వాక్" కథలో. ఇది రేపటి కథ. నేడు వ్యాపార ధోరణి కొంతైన వదిలి పర్యావరణం, కుటుంబం,

సామాజిక భద్రత, బాధ్యతల గురించి ఆలోచిస్తే రేపటి తరంలో పర్యావరణపరంగా, పిల్లలపరంగా మంచి చేసిన వారమవుతామని చిన్న హెచ్చరిక చేస్తారు.

### 3.9.5. ఆర్థిక సంబంధ కథలు:

సమాజంలో ధనానికున్న ప్రాధాన్యం మరేదానికి లేదని చెప్పవచ్చు. అన్ని రంగాలలో ధనమే రాజ్యమేలుతుంది. వ్యాపార ప్రకటనలు కావచ్చు, కరెన్సీ కావచ్చు, నల్లధనం కావచ్చు ఇలా ఒకటేమిటి ధనంతో సంబంధించిన ప్రతిదీ ఆర్థికంగా గుర్తించవచ్చు.

డబ్బు తప్ప మనిషికి విలువలేని సమాజంలో డబ్బే సర్వసత్తాక అధికారులను హస్తగతం చేసుకుంటుంది. రాజకీయ గాయకులను తన పాదాక్రాంతం చేసుకుంటుంది. డబ్బుతో ముడిపడిన మానవ విలువల్ని "కింగ్మేకర్" కథలో రచయిత చాలా చక్కగా చెప్పారు.

### 3.9.6. మానవ సంబంధ కథలు:

మనిషికి మనిషికి మధ్య ఉన్న సంబంధమే మానవ సంబంధం. మనిషి అంటే శరీరం, మనస్సు, బుద్ధి వాని సంక్లిష్ట సమ్మేళనంలో ప్రకాశించే ఆత్మ అని భారతీయ సిద్ధాంతం చెబుతుంది.

"మనిషి స్వభావంపై మిక్కిలి ప్రభావం చూపేది, మనిషి తాను జన్మించడంతోనే తనకు తెలియకుండానే ప్రకృతిలో, తాను నివసించేబోయే సమాజంలో సంబంధాన్ని కలిగి ఉంటున్నాడు. మనిషి ప్రకృతితో తోటి వ్యక్తిలో, తన వ్యక్తిత్వంలో, తన సంస్కృతితో క్రమంగా సంబంధంలోకి వస్తున్నాడు"[38].

అంటే మానవుని స్వభావంలో మార్పు రావడానికి, సమగ్ర వ్యక్తిత్వం గల మనిషిగా గుర్తింపు పొందడానికి చుట్టూ ఉన్న పరిసరాలు, సమాజం, సంస్కృతి దోహదం చేస్తాయి.

మానవుడు తనకు ఊహ తెలిసినప్పటి నుండి తన, పర అనే భేదాలు తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఉన్నాయని తెలుసుకుంటాడు. తరతరాలుగా వచ్చే సంప్రదాయాలు, సంస్కృతులు, కట్టుబాట్లతో జీవనాన్ని కొనసాగిస్తాడు. సమాజంలో మనిషి బ్రతికే క్రమంలో తమ తోటి మనుషులతో పరస్పర సంబంధాలు ఏర్పడతాయి. ఈ సంబంధాలు మనిషికి పుట్టుకతో ప్రారంభమవుతాయి.

మానవుడు సంఘజీవి. సంఘంలో ఒక సభ్యుడు. సంఘంలో ఒంటరిగా బ్రతకడం అనేది జరగదు. సంఘం ముఖ్య లక్షణం పరస్పర సహకార భావం. సుఖవంతమైన జీవనాన్ని గడపడానికి

[38] వెంకటేశ్వరరెడ్డి అన్నపురెడ్డి, 1991, పుట–1.

మానవుడు తన చుట్టూ ఉన్న వివిధ వ్యక్తులతో సంబంధాన్ని ఏర్పరచుకొని జీవిస్తాడు. రక్త సంబంధాలను దాటి స్నేహ సంబంధాలు, ప్రేమ బంధాలు ఎన్నో ఏర్పడతాయి.

సమాజం మానవుని ప్రభావితం చేస్తుంది. తద్వారా వివిధ రకాలుగా మారడానికి అవకాశం ఉంటుంది. దీని వలన మానవునికి ఉన్న సంబంధాలలో కూడా మార్పులు సహజంగా సంభవిస్తాయి.

'అజ్ఞానోదయం, ఈగ, పేరులేని కథ' వంటి కథలు మానవ సంబంధానికి సంబంధించిన కథలు.

మనిషి తనెవరో మరిచిపోయేంతగా మనుషుల్లో అంతరించిన మానవత్వాన్ని 'అజ్ఞానోదయం' కథలో వివరించారు. ఎందర్ని ప్రశ్నించినా 'నువ్వోక మనిషివి' అన్న స్పృహ అతనికి కలుగజేయరు. రాజకీయ నాయకుడికి ఓటరుగా, క్రికెట్ ఆటగానికి అభిమానిగా, విజ్ఞాన శాస్త్రవేత్తకు బి పాజిటివ్ బ్లడ్ గ్రూప్గా అనిపిస్తాడు.

'ఈగ' కథలో పేరు మరచిన ఈగ తన పేరు కనుక్కోవటం కోసం తిరిగినట్లుగా మనిషి తిరుగుతాడు. ఒక కవి నువ్వు మానవత్వం గల 'మనిషి' వంటూ గుర్తు చేస్తాడు. ఆ మానవతా విలువల్ని పెంచడానికి తాను తన రచనల ద్వారా చేస్తున్న ప్రయత్నంలో భాగం కావాలంటూ కవి కోరతాడు. అంత అవస్థపడి మనిషిని తెలుసుకున్నాక కూడా, 'మానవత్వం మంట గలిపెద, తోటి మనిషి తాట ఒలిచెద' అంటూ మనిషి అరుస్తాడు. మానవునిలో కనుమరుగైన మానవత్వం ఎంత దూరం ఎక్కి ప్రయాణించిందో దేవరాజు మహారాజు ఈ కథలో సుస్పష్టం చేశారు.

బాధ్యతలేని మన వ్యవస్థలో పసిపిల్లల బతుకులను పట్టించుకోని సమాజ స్థితిని చూసి రాసిన కథ 'పేరులేని కథ'.

### 3.9.7. అవినీతి కథ:

పోలీసు వ్యవస్థలోని అరాచకత్వాన్ని, అవినీతిని బట్టబయలు చేసే కథ 'సోదా'. పోలీసులు సోదా చేయాలనే నెపంతో జరిపే దుశ్చర్యలకు కళ్ళకు కట్టినట్లుగా దేవరాజు మహారాజు ఈ కథలో చిత్రీకరించారు. పోలీసులు అమాయకుల పైన అక్రమ కేసులు బనాయింపుకు ఎలాంటి పద్ధతులను అవలంబిస్తారో, వ్యభిచారం కేసుల్లో, నక్సలైటు కేసుల్లో, ఎన్కౌంటర్లలో ఎలాంటి నీచమైన ఎత్తుగడలను పన్నుతారో వివరించిన గొప్ప కథ 'సోదా'.

## 3.10. నవలా వస్తువిశ్లేషణ:

"నవల మానవ జీవిత చిత్రణ అనుకొన్నప్పుడు అందులో మానవ జీవితములో సంఘటనలు, భావనలు, ఆదర్శాలు, సమస్యలు వీటన్నిటి చిత్రణ ఉండాలి. ఇతివృత్తమునకు ఇవే ముఖ్యమైన కథా వస్తువులు. ఏ కథయైన మూడు విభిన్నమైన భాగాల కలయిక అని గ్రహించవచ్చును. 1) స్వీకరించబడ్డ విషయము లేక కార్యము, 2) దాన్ని వ్యక్తీకరించడానికి గ్రహించే సాధనము, 3) వ్యక్తీకరించే పద్ధతి. ఈ మూడింటి కలయిక వల్ల కథా సాహిత్య సృష్టి జరుగుతున్నది"[39].

"నవలకు ఉచితమైన ఇతివృత్తము ప్రధానముగా సాంఘికము లేదా చారిత్రకం. సాంఘికమైనప్పుడు సంఘ జీవితమునుకును, చారిత్రకమైనప్పుడు దేశ చరిత్ర భాగమునకు సాక్షాత్ ప్రతిబింబముగా నుండునే గాని సంఘటనమునకు చరిత్రను దూరము తొలిగిపోదు. అందుచేత నవల ఇంచుమించు సమకాలిక సాంఘిక కథను వస్తువుగా స్వీకరించును" అందుకే దేవరాజు సాంఘికాంశాలనే కథా వస్తువులుగా స్వీకరించి, తద్వారా వాటికొక సమగ్ర రూపాన్నిచ్చి, వివిధ పాత్రచిత్రణలను సన్నివేశ రూపకల్పనలను చేశారు.

### 3.10.1. మంచి ముత్యం:

ప్రఖ్యాత అమెరికా రచయిత జాన్ స్టెయిన్బెక్ (John Steinbeck) రచించిన "ద పెరల్" (*The Pearl*) నవలకు అనువాదమే "మంచి ముత్యం" నవల. అనువాదమైనా ఆ ఛాయలు ఎక్కడా కనిపించవు. మొదటి నుండి చివరి వరకు తెలుగువారి జానపద కథలా సాగిపోతుంది.

చేపలు పట్టే కీనో అనే వ్యక్తి, అతని భార్య జుఆనా, కొడుకు కొయొటిటోలతో తనకున్న దానితో హాయిగా జీవిస్తుంటాడు. అయితే అనుకోకుండా అతనికి అరుదైన, అద్భుతమైన "మంచి ముత్యం" దొరుకుతుంది.

తేలు కుట్టిన పిల్లవాడికి మందుకోసం వైద్యుడి దగ్గరికి వెళితే పేదవారని చెప్పి ఇంటి బయటికైనా రాడు వైద్యుడు. అలాంటిది కీనో నీటిలో మునిగి మంచిముత్యం సంపాదించాడన్న వార్త అందగానే స్వయంగా జుఆనా, కీనోల గుడిసె ముందు నిలబడతాడు. రోగి బంధువుల్ని హడలగొట్టే ఈ నాటి కార్పోరేట్ వైద్య సంస్థలకి ప్రతీకగా వైద్యుడు తేలు విషం తన మందు ద్వారానే తగ్గుతుందని, లేకపోతే పిల్లవాడు బతకడని బెదిరించి ముత్యాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తాడు. కీనో ముత్యం అమ్మిన తర్వాత ఫీజు ఇస్తానని చెప్పడంతో వెనుదిరిగినా, ముత్యాన్ని దొంగిలించడానికి

---

[39] మొదలి నాగభూషణ శర్మ, తెలుగు నవలా వికాసం, పుట–09.

మనిషిని పంపుతాడు. ముత్యం వచ్చిన తర్వాత పరిస్థితులు కీనూ కుటుంబాన్ని అతలాకుతలం చేయడం జరిగింది.

'మంచిముత్యం'ను పట్టణంలో అమ్మడానికి ప్రయత్నిస్తే ప్రస్తుత వ్యవస్థలో కాంట్రాక్టర్లు 'రింగు'గా ఏర్పడినట్టు మొదటి వ్యాపారి వెయ్యి కాసులిస్తానంటే రెండోవాడు ఏభై కాసుల కన్నా విలువ లేదని మూడోవాడు కొనడం దండగనీ నాటకమాడతారు. విసుగుచెందిన కీనో ఇంకా పెద్ద పట్టణంలో అమ్మి కొడుకుని చదివించాలని వీలైతే ఒక రైఫిల్ కొనుక్కోవాలని ఆశ పెట్టుకుంటాడు. ముత్యం ఉన్న కాలంలో జరిగిన హత్యాప్రయత్నాలు జుఆనా మనసుని కలవరపెట్టి, ముత్యాన్ని నదిలోకి విసిరేద్దామని ప్రయత్నించినా ప్రయత్నం విఫలమవుతుంది.

కీనో, జుఆనా, కీనో అన్న కుటుంబం, వారి చుట్టుపక్కల జనాభా, సగటు మనుషుల జీవనం, మనస్తత్వాలకు ప్రతీకలు కాగా, డాక్టర్ మంచి ముత్యం కొనాలనుకుంటే వ్యాపారస్థులు సమాజంలో ధనానికి హోదాకు విలువనిస్తూ స్వలాభం కోసం సగటు మనుషులను మోసం చేసే వ్యక్తుల మనస్తత్వాలకు ప్రతీకలుగా చెప్పుకోవచ్చు.

### 3.11. నాటకం – వస్తు విశ్లేషణ:

"కవి ఆశించిన అన్ని కార్యాలను నిబంధించేది కథావస్తువు" అంటాడు ఆరిస్టాటిల్. అంటే కథను ఎలా నడిపించాలి, ఇతివృత్తంలో ఫలానా సంఘటనలకు ప్రాధాన్యం ఉండాలి. వాటిని ఇలా ముగించాలి అనే ఒక ప్రధాన సమన్వయ సూత్రం కథా వస్తువు.

### 3.11.1. మూఢ నమ్మకాల్ని వదిలిద్దాం:

ఏది మంచో, ఏది చెడో, ఏది మూఢ విశ్వాసమో, దేన్ని వదిలేస్తే బతుకు బాగుపడుతుందో నిగ్గుదేల్చే నాటికల సంపుటియే దేవరాజు మహారాజుగారి 'మూఢనమ్మకాల్ని వదిలిద్దాం'. ఈ నాటికల సంపుటి నాలుగుసార్లు ముద్రించబడటం విశేషం. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఇందులోని నాటికలున్నాయి. తన వంతు బాధ్యతగా 'జన విజ్ఞాన వేదిక' ఈ నాటికల సంపుటిని నాల్గవ ముద్రణ (అక్టోబరు, 2009)గా ప్రచురించడం హర్షింపతగ్గ విషయం.

ఇందులో మొత్తం పదకొండు నాటికలున్నాయి. ప్రతీ నాటికలోనూ నేటి సమాజంలో నాటుకుపోయిన మూఢనమ్మకాలను మన కళ్ళముందుంచారు రచయిత. ఆయా మూఢనమ్మకాలను నిర్మూలింపచేయాలన్న తపన, పట్టుదల, ఆలోచన మొదలైనవి అన్ని

నాటికలలోనూ సహజంగా కనిపించే గుణాలు. ఒక్కో నాటికలోని విశేషాంశాలను గూర్చి తెలియజేయబడును.

**మొదటి నాటిక**:

లేడీ టీచర్, డ్రైవర్, డాక్టర్, మ్యూజియం కీపర్, వెంకట్, పాప మొదలైనవారు ఈ నాటికలో కనిపించే పాత్రలు. వీరితోపాటు ఇతర విద్యార్థుల గొంతులు, పాము గొంతు ఇందులో గలవు.

ఈ నాటికలో ప్రధానంగా పాముల గురించి చర్చింపబడింది. పాము కరిస్తే మంత్రం వేయించడం కాకుండా డాక్టర్కు చూపించాలని టీచర్ పాత్ర చేత చెప్పించాడు రచయిత. ప్రతి పాము విషపూరితమైనది కాదు. మనకు తెలిసిన రెండు వందల రకాల్లో 50 రకాల పాములే ప్రమాదమైనవి. అందులో 4,5 ప్రాణాంతకమైనవని డాక్టర్ పాత్ర చేత సూచించాడు. ఉదాహరణకు ఓఫియోషాగస్ హన్నా అనే కింగ్ కోబ్రా – ఒక కాటుకు 200 మి.గ్రా. విషాన్ని వదులుతుందట. ఆ విషంతో ఏనుగులాంటి పెద్ద శరీరం గల జంతువే చనిపోతుంది. మనిషి చావడానికి 2 మిల్లి గ్రాములు విషం చాలు. 12 మిల్లిగ్రాములతో చచ్చే మనిషి శరీరంలో –200 మి.గ్రా. విషం చేరితే... చికిత్స ఎంత త్వరగా, ఎంత జాగ్రత్తగా... ఎంత పెద్ద ఎత్తున జరగాలో... ఆలోచించండి అంటూ చికిత్స ఆవశ్యకతను టీచర్ పాత్ర చేత చెప్పించాడు.

పాములు పగబడతాయా? వాటి తలపై మణులుంటాయా? వాటికి చెవులుంటాయా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఈ నాటికలో దొరుకుతాయి. పాములను గూర్చి గల మూఢనమ్మకాలలో ప్రధానమైనవి ఇవి. కాబట్టి వీటికి సంబంధించిన విషయాలను గూర్చి సందర్భోచితంగా ఆయా పాత్రల చేత తెలియజేశాడు రచయిత.

నిజానికి పాములు చాలా పిరికివి. వెంటాడి వేటాడి కాటేసే గుణం వాటికి లేదు. పామును కొట్టినా, చంపినా అది లైంగిక ఉత్ప్రేరకాన్ని అంటే మస్క్ను విడుదల చేస్తుంది. ఆ వాసన పసిగట్టి, దాంతో జతకట్టడానికి మరో పాము అక్కడి కొస్తుంది. అంతే పగబట్టడం అనేది అక్కడ లేదు. మనకు పాములన్నీ ఒకేలా అనిపిస్తాయి. కాబట్టి పొద్దున తప్పించుకుపోయిన పామే పగబట్టి మళ్ళీ వచ్చింది అని అనుకుంటాం.

పాములు కుబుసం విడుస్తాయని అందరికీ తెలుసు. ఆ కుబుసమే ఎండకు మెరుస్తూ ఉంటుంది. పాము పాకుతున్నప్పుడు భూమి రాపిడికి కుబుసం ఎక్కడో ఓ చోట పడిపోతుంది. కాని తలమీది భాగం ఏ రాపిడికీ గురికాదు. కాబట్టి అక్కడి కుబుసం బిళ్ళలాగా కొంతకాలం అలాగే

ఉండిపోతుంది. దాన్నే జనం 'మణి' అని భ్రమించారు. ఇటువంటి ఆసక్తికర విషయాలను మ్యూజియం కీపర్ పాత్రచేత చెప్పించాడు రచయిత.

ఈ నాటికలో వెంకట్, పాప మొదలైన విద్యార్థులతో పాటు డ్రైవర్ మూఢనమ్మకాలకు ప్రతినిధులుగా కనబడతారు. టీచర్, డాక్టర్, మ్యూజియం కీపర్ మొదలైన పాత్రలను శాస్త్రీయ ఆలోచనలకు ప్రతినిధులుగా చిత్రించాడు రచయిత.

ఈ నాటికలో అక్కడక్కడ సున్నితమైన హాస్యం కూడా లేకపోలేదు. ఉదాహరణకు వెంకట్ను పాము కరచిందని తెలియగానే డ్రైవర్ "అమ్మా! పాముల నర్సయ్యా ఫోను నెంబరు మీ దగ్గర లేదా? ఆయన ఫోను మీద మంత్రమేస్తే పిల్లాడు చిటుక్కున లేచి కూచునే వాడే..." అని టీచర్తో పల్కిన మాటలు మనకు నవ్వు తెప్పించును. ఇదే డ్రైవర్ పాముల మణులను గూర్చి "పాముల్తోటి మణులు దొరికితే... సయిభీ – పాములోల్లంతా కోటీశ్వరులయ్యేటోళ్ళు" అన్న మాటలు నవ్వు తెప్పించును.

**రెండవ నాటిక**:

ఆరోగ్యం బాగాలేకపోతే డాక్టరుకు చూపించు కోవడానికి బదులు దేవతలకు మొక్కుకోవడం ఈ నాటికలో చూస్తాం. మేళతాళాలతో గణము (శివం) పూనడం, రొట్టెల పూజ వంటి ఆచారాలను దుయ్యబట్టడం ఈ నాటికలో చూడవచ్చు. గుమ్మడి తీగను నాగేంద్రుడుగా పూజించేవారుంటారు ఈ నాటికలో. ఇన్స్పెక్టరు గారి భార్య ఇటువంటి పూజ చేయడం ఇందులోని విశేషం. ఈమెతో పాటు ముత్తి, కామాక్షి వంటి పాత్రలు మూఢనమ్మకాలు గలవారిగా చిత్రించాడు రచయిత. నిర్మల, రాహుల్ పాత్రలు ఇందుకు విరుద్ధం.

గుమ్మడి తీగ – నాగేంద్రుడు ఎన్నటికీ కాదు. గుమ్మడి పాదు చివర పురుగు కొట్టివేస్తే అప్పుడప్పుడు అటువంటి వెర్రితలలు వేస్తుంది. "ఆకలి, దారిద్ర్యం, విద్య ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక సమస్యలన్నింటినీ పక్కకునెట్టి – ఎక్కడో వెర్రితలలు వేసిన గుమ్మడి పాదు గురించి ఇంత ఆలోచిస్తున్నామంటే మనశక్తి ఎంత దుర్వినియోగమవుతుందో ఆలోచించండి"[40] అంటూ రాహుల్ పాత్ర ద్వారా మనల్ని ఆలోచింప చేస్తాడు రచయిత.

**మూడవ నాటిక**:

కొన్ని వేల సంవత్సరాల నుండి ప్రతి ప్రాణికి ఆత్మ ఉందని దానికి చావులేదని, మోక్షం లభించేదాకా అది జన్మ లెత్తుతూనే ఉంటుందని నమ్మే సమాజం మనది. దీనిని ఆధారం చేసుకుని

[40] దేవరాజు మహారాజు, మూఢనమ్మకాల్ని వదిలిద్దాం, పుట–19.

సాగుతుంది ఈ నాటిక. ఒక అమ్మాయికి తన పూర్వజన్మ జ్ఞాపకాలు గుర్తుకు రావడం ఈ నాటికలో చూస్తాం.

పునర్జన్మకు సంబంధించిన ఆసక్తికరమైన అంశాలెన్నింటినో సందర్భానుసారంగా తెలియచేశారు రచయిత. దీనిపై పరిశోధన చేసినవారి గురించి శిరీష, సంపత్ అనే పాత్రల చేత చెప్పించాడు. రచయిత అధ్యయన శీలతకు ఇది నిదర్శనం.

కెనడాకు చెందిన సర్ విలియం ఓస్లర్ ఇలాంటి అనుభవాలు కొన్నింటిని గ్రంథస్థం చేశాడు. హెన్రీన్జ్ ఫేజల్స్ అనే ఫిజిసిస్ట్ 1982 "కాస్మిక్ కోడ్" అనే పుస్తకం ప్రకటించాడు. 1990లో కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'సేన్డిగ్' కొన్ని పరిశోధనల్ని చేశాడు. మరణం తర్వాత కూడా జీవితం ఉందని నమ్మేవారి అనుభవాల్ని వీరు గ్రంధస్థం చేశారు. పదులూ వందలూ కాదు, కొన్ని లక్షల మంది అనుభవాలు సేకరించామని చెప్పుకున్నారు. అది ఎంతవరకు నిజమో మనకు తెలియదని శిరీష పాత్ర చేత చెప్పించాడు రచయిత.

పుట్టిన పాపాయి మెదడులో గతజన్మకు సంబంధించిన ఇంప్రెషన్స్ ఉంటాయని భారతీయ తత్త్వవేత్తల్లో సంఖ్యావాదులు చెబుతున్నారు. కాని ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదు. ఆకలి, దాహం, బాధ, సంతోషంలాగా పునర్జన్మగానీ, మానవాతీత శక్తులుగానీ, ఎక్స్ట్రా సెన్సరీ పర్సెప్షన్ (Extra Sensory Perception) గానీ ఉంటే అవి అందరి అనుభవంలోకి రావాలి కదా? అని శిరీష పాత్ర చేత అలోచింపచేస్తాడు రచయిత. ఇలా ఈ నాటికలో శాస్త్రీయ ఆలోచనలెన్నో ఉన్నాయి.

**నాలుగవ నాటిక**:

శ్రీశైలంలో నందికేశ్వరుడు రంకె వేశాడనీ, వినాయకుడు పాలు తాగాడనీ, కుక్కకు మేక పిల్ల పుట్టిందని, మనిషికి పాముపిల్ల పుట్టిందని వంటి పుకారులెన్నో నేటి సమాజంలో సర్వ సాధారణం. ఇలాంటి వార్తలు పత్రికల్లో రావడం కూడా కొత్తేమీ కాదు. కానీ సరైన విషయాలు సేకరించి, శాస్త్రీయంగా విశ్లేషించి వార్తలు రాస్తే జనానికి ఎక్కువ మేలు జరుగుతుంది. మహిమలు – మహత్యాలు అంటూ వారు మూఢనమ్మకాలలో కొట్టుకుపోరు అని జర్నలిస్టు పాత్ర చేతనే చెప్పించడం ఈ నాటిక ప్రత్యేకత.

మహిమలనేవి ఎప్పుడు ఎక్కడ ఏ కాలంలోనూ జరగలేదు. జరిగాయని భ్రమపడితే అది మన అవగాహనా రాహిత్యమే! అని స్కాలర్ పాత్ర చేత చెప్పించి మనల్ని ఆలోచింపచేస్తాడు రచయిత.

**ఐదవ నాటిక**:

జండాలకు, విగ్రహాలకు మహిమలుండవని తెలియచేశారు ఈ నాటికలో రచయిత. దైవ భావం ఏర్పడిన తొలిరోజుల్లో జనం దేవుడికి మహిమలు – మహత్తులు ఆపాదించారు. ఆ తరువాత కొంతమంది మనుషులు తామ దైవదూతలమని, దైవ సంకల్పం వల్ల మహిమలు, మహత్తులూ వచ్చాయని ఆపాదించారు. ఇలా తరతరాలుగా ఈ మహిమల వలయం, జనాన్ని చుట్టేస్తూనే ఉంది. ఇందుకు గల కారణం – మనలో చాలామంది నలుగురితో నారాయణ అన్నట్లు ఒక అస్తిత్వవాద ప్రవాహంలో కొట్టుకుపోవడమని జర్నలిస్టు పాత్ర చేత తెలియచేశాడు రచయిత.

మెజీషియన్కు, భగవాన్ (దొంగ బాబా)కు మధ్యగల వ్యత్యాసాన్ని తెలియచేయడం ఈ నాటిక ప్రత్యేకత. "మేజిక్ ఒక కళ! ఒక కళాకారుడిగా నాకు లభించే గౌరవం నాకెంతో సంతృప్తినిస్తుంది. ఈ భగవాన్లాగా ఆత్మద్రోహం చేసుకోవాల్సిన పని నాకు లేదు. భగవాన్ చాలా మంచి మెజీషియన్ అని ఒప్పుకుంటున్నాను. తనను తాను భగవంతుడిగా ప్రకటించుకొని, జనాన్ని మోసం చేస్తున్న ఈ భగవాన్ని ఏం చెయ్యాలన్నది జనమే నిర్ణయించుకోవాలి"[41] అని మెజీషియన్ పలికిన మాటలు ఆలోచింపచేస్తాయి.

**ఆరవ నాటిక**:

ఈ నాటికలో జాతరలప్పుడు అగ్నిగుండంలో నడపటం, మహిమలు చూపటం, దిష్టి తీయటం వంటి మూఢనమ్మకాలను గూర్చి ప్రస్తావించారు రచయిత. ఉదాహరణకు – పసుపూ సున్నం కలిపితే ఎర్రని పారాణి తయారవుతుంది. దానిలో కొంచెం నిమ్మ పులుసు పిండితే సున్నం గుణం విరిగిపోయి మామూలు పసుపు అవుతుంది. మళ్ళా సున్నం కలిపితే మళ్ళా ఎర్రనవుతుంది. అలా ఎన్నిసార్లయినా చేసి చూసుకోవచ్చు. ఇందులో ఎటువంటి మహిమలేదనేశాస్త్రీయ అవగాహనను జర్నలిస్ట్ పాత్ర చేత తెలియజేశాడు రచయిత.

**ఏడవ నాటిక**:

ప్రజలలో నాటుకుపోయిన మూఢనమ్మకాల వల్ల అనవసరమైన పుకార్లు ఎటువంటి భయాందోళనలకు గురిచేస్తాయో చక్కగా తెలియజేశాడు రచయిత ఈ నాటికలో. ఉదాహరణకు 1940లో నెల్లూరు ప్రాంతంలో, వర్షం ఆధారంగా దొంగలు పుట్టించిన పుకారుకు ఊరు ఊరంతా బలైంది. ఉప్పెన రాలేదు కాని, ఆస్తిపాస్తులన్నీ ఊడ్చుకుపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధం నాటి రోజుల్లో – 1942వ సంవత్సరం ఏప్రిల్ నెలలో అటు విశాఖలోను, ఇటు కాకినాడలోను బాంబులు

41 దేవరాజు మహారాజు, మూఢనమ్మకాల్ని వదిలిద్దాం, పుట – 50.

పడ్డాయి. వీటి ఆధారంగా ఆ తర్వాత పుకార్లు చెలరేగాయి. "విమానాలు మళ్ళీ వస్తాయి. బాంబులు మళ్ళీ పడతాయి" – అనే పుకారు వల్ల జనం ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి పారిపోయారు. అలాగే 1970లో మూసీనది ఉప్పొంగిందని, 1980లో స్కైలాబ్ కూలిపోతుందన్న పుకారు ప్రజల్ని ఎలా భయభ్రాంతుల్ని చేసిందో నాటకీయంగా మలిచి ఈ నాటికలో చూపించారు రచయిత.

**ఎనిమిదవ నాటిక**:

ఈ నాటిక కూడా పుకార్లపై వ్యంగ్యాస్త్రమని చెప్పవచ్చు. పుకార్లు పుట్టించడంలో, వ్యాప్తి చేయడంలో అమాయకత్వం, అజ్ఞానం, అవగాహనారాహిత్యం మాత్రమే కారణాలు కావు. కొందరి స్వార్థం కూడా ప్రధాన కారణం. స్వార్థపరుల ఆట కట్టించడానికి అందరూ పూనుకోవాలని హితబోధ చేశారు రచయిత నాటిక చివరలో.

**తొమ్మిదవ నాటిక**:

మిగతా నాటికలతో పోలిస్తే ఈ నాటిక కొంత వైవిధ్యభరితమైనది. జీవహింస మహాపాపమని మనమంతా బలంగా విశ్వసిస్తాం. కాని సృష్టిలో ప్రతి పాణి ఇతర ప్రాణులను తన స్వార్థం కోసం హింసిస్తుందని ఈ నాటికలో తెలియజెప్పారు రచయిత. ఫుడ్ చైన్స్ (ఆహార శృంఖలాలు) ప్రస్తావన కూడా ఈ నాటికలో గలదు.

ఆవుల క్లోమాల నుండి, పందుల క్లోమాల నుండి "ఇన్సులిన్" తీస్తున్నారు. అనేక రకాల జంతువుల కాలేయాల నుండి "బి–కాంప్లెక్స్" తయారవుతుంది. జలగల నుండి తీసిన పదార్థం "హిరుడిన్". రక్తం గడ్డకట్టకుండా చేయడం దీని పని. ఎద్దుల పైత్యరసంతో తయారైన 'ఫెలోబోలియం' జీర్ణ సంబంధమైన వ్యాధులకు వాడుతారట. ఇటువంటి శాస్త్ర సంబంధమైన చర్చలు ఆయా పాత్రల ముఖతా తెలియజేశారు రచయిత.

శుద్ధ శాఖాహారులు అంటూ ఎవరూ ఉండరు. 'జీవహింస చేయం' అనే మాటల్లోనూ అర్థం లేదని తాత పాత్రచేత చెప్పించాడు రచయిత. ఇటువంటి విశేషాలెన్నో ఈ నాటికలో ఉన్నాయి. ఇక చివరగా 'సర్వేజనా సుఖినోభవంతుః' అంటూ నాటిక ముగియడం మరో విశేషం.

**పదవ నాటిక**:

జ్యోతిషం, శుభ–అశుభ శకునాల ప్రస్తావన ఈ నాటిక ప్రత్యేకత. తుమ్మడం, విడిచిన బట్టల మూటేసుకుని ఎదురు రావడం, పిల్లి ఎదురవడం వంటి మూఢనమ్మకాలను గూర్చి తెలియజేశారు రచయిత ఇందులో. అర్థరాత్రి కుక్క ఏడిస్తే అశుభం. తీతువు పిట్ట అరిస్తే అశుభం. బల్లి మీదపడితే పంచాంగం చూపించుకోవాలి వంటి విషయాలను నిర్మొహమాటంగా ఖండించారు

రచయిత ఆయా పాత్రల ద్వారా. ఉదాహరణకు – మరిగే నీళ్ళలోగాని, ఆహార పదార్థాలలోగానీ బల్లి పడితే విషమవుతుంది. అప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వాటి గ్రంథుల్లో ఉండే రసాలు ఆహారంతో పాటు ఉడికి విషమవుతుంది. అంతే గానీ ఇలా ఊరికే చొక్కా మీద బల్లి పడి పారిపోతే జరిగే నష్టమేమీ లేదని తాతయ్య పాత్రచేత చెప్పించాడు రచయిత.

**పదకొండవ నాటిక**:

సారధి (శాస్త్రవేత్త), నిహాల్, సమీర్, మాధురి మొదలైన పాత్రల సంభాషణల సమాహారం – ఈ నాటిక. 'నమ్మకాలుండొచ్చు. మూఢనమ్మకాలుండకూడదు' అనునది ఈ నాటిక సారాంశం.

నమ్మకం అనేది ఎల్లవేళలా నిర్ధారణకు నిలబడుతుంది. మూఢనమ్మకం నిలబడదు. నమ్మకాల్ని విజ్ఞానం, మూఢనమ్మకాన్ని అజ్ఞానం, అవినీతి పోషిస్తున్నాయని సారధి పాత్రచేత చెప్పించిన మాటలు అక్షరాక్షర సత్యాలని చెప్పవచ్చు. అలాగే మనం మూఢనమ్మకాల్ని వ్యతిరేకిస్తున్నామంటే – మరోసారి ఆలోచించండయ్యా బాబూ అని సవినయంగా ప్రాధేయపడుతున్నామన్నమాట! మనం ఎవరినీ కించపరచడం లేదు. ఎవరి నమ్మకాల్ని తప్పుపట్టడం లేదు. కానీ, సత్య నిర్ధారణ చెయ్యమని మాత్రం తప్పకుండా కోరుతున్నాం అని సారధిచే పలికించిన మాటలు ఈ నాటికకే కాదు ఈ సంపుటిలోని అన్ని నాటికలకూ వర్తిస్తాయి.

ఈ విధంగా ఈ సంపుటిలోని ప్రతీ నాటిక మూఢనమ్మకాలను వదిలించుకోవడమే ధ్యేయంగా సాగిందని నిస్సంశయంగా చెప్పవచ్చు. అన్నింటిలోనూ సత్య నిర్ధారణ, శాస్త్రీయ వివరణలు ప్రాణభూతంగా ఉన్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

### 3.11.2. లైఫ్ టానిక్ విశ్లేషణ:

ఎవరైనా అమృతం తయారుచేస్తే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో ఊహిస్తూ చమత్కారంగా రాసిన నాటకం లైఫ్ టానిక్.

"ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే భారతదేశంలో అన్ని భాషల్లోని అన్ని వార్తాపత్రికలు ఈ వార్త ప్రకటించాయి. ఆశ్చర్యంలో ఆనందంలో ప్రపంచం మునిగిపోయింది. అన్ని రకాల దేవాలయాలు కూలిపోతున్న దృశ్యాలు కనబడసాగాయి. దేవుళ్ళందరికీ హార్ట్ ఎటాక్ వచ్చేసింది. భూగోళాన్ని అరచేతిలో పెట్టుకుని, తలెత్తుకుని నిలబడ్డట్టు మనిషికి తనపై నమ్మకం పెరిగింది." నాటిక ఇలా మొదలవుతుంది.

ప్రఖ్యాత భారత జీవ రసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు పరిశోధన విజయవంతం. ఆపై ప్రపంచమంతటా అమృతం పంపకం.

ఆ తర్వాత సంఘటనలు చకచకా సాగిపోయాయి. స్వగృహం చేరుకున్నాడు ప్రొఫెసర్ రంగారావు. మనుమడు శ్యాంసుందర్, విదేశాల్లో పెరిగి శాస్త్రవేత్త అయ్యి వచ్చాడు. రంగారావు కొడుకు ప్రముఖ పారిశ్రామికవేత్త. ఇప్పుడు ప్రభుత్వాన్ని పడగొట్టడం, నిలబెట్టడం అతనికి చిటికెలో పని. తండ్రి చేస్తున్న వ్యాపారం అంతా అక్రమం అని తెలిసింది శ్యాంసుందర్కి. తాతకి చెప్పాడు. అమృతం విషయం తెలిసిపోయింది కదా ప్రపంచానికి! జన ప్రవాహం మొదలైంది. కోలాహలం, వర్గాలు, బృందాలు, గుంపులు, ఎవరి హక్కు వారిది.

'కేవలం హిందువులకే ఇవ్వాలి', 'ముస్లింల కివ్వడమే న్యాయం', 'క్రైస్తవుల కివ్వండి', 'సిక్కులందర్నీ చూడండి', 'ధనిక వర్గానికందాలి', 'వెనుకబడిన జాతులకు' 'తెగలకు పంచండి – ప్రతినిధుల వాదం', అమృతాన్ని అండర్ గ్రౌండ్కి పంపాలి', 'శ్రీలంక శాంతిసేన', 'కాశ్మీర్ ఉద్రేకవాదులు', 'జార్కండ్...' 'పోలీసుల లాఠీ చార్జీ', 'బాష్ప వాయువు.'

జనం జనం అమృతం కోసం. వరదలో కొట్టుకొచ్చిన వాళ్ళలాగా, దారి తప్పిపోయిన వాళ్ళలాగా, బయట జరుగుతున్న దానికన్నా కొన్ని రేట్లు అధికంగా రంగారావులో మానసిక ఆందోళన, సంచలనం, సంక్షోభం, భ్రమ పగిలిన చప్పుడు, రెప్పలు చీలిన చప్పుడు, భయం భయం, గుండె నొప్పి, ఆయాసం. అందరూ గాభరా పడ్డారు. కొడుకు మనస్సులో కోటి ఆలోచనలు.

రంగారావు గారిలో సహనం పదునెక్కింది. ఉక్రోషంతో వెళ్ళి జాడీని బాల్కనీ లోకి దొర్లించాడు. అమాంతం మూడో అంతస్తు నుండి అమృతభాండం కింది కాంపౌండులో పడిపోయింది. అంతా నిశ్శబ్దం. జీవం చచ్చిన చప్పుడు, తెల్ల టోపీలన్నీ భూమిని కరుచుకున్నాయి. కొట్లాడుకుంటున్నాయి. కుమ్ముకుంటున్నాయి. అందులో టోపీ లేని తల ఒకటే. అది రంగారావు కొడుకుది.

ఈ దేశానికి, ఈ ప్రపంచానికి ఆకలిని జయించే అమృతం కాదు, స్వార్థాన్ని జయించే మానవత్వం కావాలి. ఫార్ములా ఏమిటి? అది సాధించడం ఎలా? రంగారావు మస్తిష్కంలో జవాబు లేని ప్రశ్నలు. ఇలాంటి వాళ్ళున్నాక దేశమాత ఎక్కడుంటుంది? ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడున్నది శవం మాత్రమే. శవాన్ని పీక్కుతింటున్నట్లు మట్టి గతుకుతూ వాళ్లు కాంపౌండ్ లోపల వాళ్ళు కొద్దిమందే. ఇలా ముగుస్తుంది నాటిక.

ప్రజల జీవన మూలాల్ని విచ్ఛిన్నం చేస్తున్నది ఏమిటి? అని ప్రశ్నించుకుంటే వచ్చే జవాబు – సమాధానం చెప్పే మనిషి ప్రాపంచిక దృక్పథం మీద జీవన తాత్వికత మీద, అతని పెరిడిటీ, పెరిగిన వాతావరణం మీద ఆధారపడి ఉంటుంది. శాస్త్రీయమైన అవగాహన కలిగినవారు

అనుకునేవారు చాలామంది 'డబ్బు' అంటూ ఉంటారు కాని, డబ్బు ఒక్కటే కారణం అనే సాధారణీకరణ మాత్రం చెల్లదని కాల పరిణామం చెప్తోంది. స్వార్థం, స్వప్రయోజనం ముందు నిలుస్తున్నాయి. కనుక ఇప్పుడు జీవన మూలాలు పరిరక్షణకు కావలసినది స్వార్థాన్ని జయించే మానవత్వం. ఇది ఆశయంలా, నైరూప్య భావనలా, డొల్ల ఆలోచనగా బయటికి తోచవచ్చు. కాని ప్రతి మనిషి ఈ భావనని గుండెలో నింపుకుని సమాజ శ్రేయోదాయకమైన కార్యాచరణలో పడితే, దాని 'పాజిటివ్ ఎఫెక్ట్' సర్వవ్యాపకమవుతుంది. ఇదీ నాటక పరమార్థంగా వాచ్యం చేయబడిన అంశం.

వాంఛనీయమైన ఒక మార్పుని దర్శించాడు రచయిత. దాన్ని పది మందికి చెప్పటానికి నాటకాన్ని వాహికగా ఎన్నుకున్నాడు. ఇతివృత్తం స్పష్టంగా ఉంది. సన్నివేశ కల్పనలో తన అమోఘమైన ప్రతిభని కనపరచాడు. అమృతం పంపకం అనే వినూత్న భావం రచయిత మనసులో నుండి దుమకటమే ఒక 'మానిషాద' శ్లోకం వంటి సందర్భం.

ఒక కొత్త కోణాన్ని పట్టుకుని, మనిషి బతుకులోని బలహీనతల్ని అలవోకగా మలచే శక్తి ఉన్న రచయిత దేవరాజు మహారాజు.

## 3.12. మూఢ నమ్మకాలు – సైన్స్, విశ్లేషణ:

సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను పారదోలడం తోపాటు శాస్త్రీయ జిజ్ఞాసను పెంచే వ్యాసాల సంకలనమే "మూఢ నమ్మకాలు – సైన్స్."

ప్రయోగ ఫలితాలను శాస్త్రవేత్తలు తెలియజెప్పినా, అవి సామాన్యులకు అందుబాటులో ఉండవు. సాంకేతిక పదాలు అర్థం కావు. శాస్త్రీయ విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందుతున్న, విద్యావంతులు సైతం మూఢనమ్మకాలకు దాసోహం అంటూ చేతి గీతలను, జాతకాలను నమ్మేస్తున్నారు. తేలు కుట్టినా, పాము కాటేసినా మంత్రాలు వేసేవారిని ఆశ్రయిస్తున్నారు. ఒకవైపు శాస్త్ర విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందుతుందో తెలుసుకుంటూనే, మరో వైపు మూఢ నమ్మకాలను విస్మరించడానికి వెనుకంజ వేస్తున్నారు.

ఆదిమానవుల అడుగులపై పరిశోధన విశ్లేషణ తోపాటు, పక్షిగీతం, పక్షుల సేకరణ, జంతు ప్రపంచంలో జరుగుతున్న చిత్రవిచిత్రాలు ఇందులో ఉన్నాయి. అలాగే వాతావరణ కాలుష్యం, అంతరిస్తున్న అమాయక ప్రాణుల వివరాల చిట్టాల తోపాటు, మానవులకు సంక్రమించే వ్యాధుల వివరాలు, జాగ్రత్తలు కూడా ఉన్నాయి.

అంటార్కిటిక పరిశోధనల తోపాటు, టెలిఫోన్, కంప్యూటర్ విషయాలే కాకుండా శాస్త్ర పరిశోధనల వివరాలు కూడా ఇందులో పొందుపరిచారు. వృక్ష శాస్త్రంలో నెమటోడ్ పరాన్నజీవుల గురించి చెబుతూ మానవుడే ఒక పరాన్నజీవి అన్నారు. వివిధ రకాల మాంసాహారాన్ని సేవించడంలో ఆయా దేశాలవారు ఎలా మక్కువ చూపుతున్నారనే విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

పరాన్న జీవులతో సంక్రమించే వ్యాధులలో – మనిషి రక్త ప్రసారంలోకి గుట్టు చప్పుడు కాకుండా ప్రవేశించే పరాన్నజీవుల విషయాలు గమనిస్తే, వైజ్ఞానిక పరిశోధనలో మానవుడు ఎంత ముందుకు వెళ్ళినా, సామాన్యులకు ఈ విషయాలు తెలియకుండా పోతున్నాయనే వ్యథ కలుగుతుంది.

పరాన్నజీవులు ఆతిథేయుల మీద జీవిస్తూ వాటి ఆహారాన్ని, ధాతువులను, రక్తాన్ని పీలుస్తాయి. ఇలా ప్రాణాలు పోయే ప్రమాదం నుంచి నివారణ కోసం హోటళ్ళలో, దుకాణాలలో వైద్య పర్యవేక్షణ ఉండాలనీ, అలాగే విద్యాలయాల్లో, ఆఫీసుల్లో, తరుచు వైద్య పరీక్షలు జరుగుతూ ఉండాలి.

బిస్కట్లు, స్వీట్ బ్రెడ్లు రుచించడానికి కృత్రిమ పదార్థాలను కలుపుతున్నారు. వీటి మోతాదు పెరిగితే అనర్థాలు కూడా లేకపోలేదు. దుష్ట ఫలితాలు నివారణకు ఏ ఏ పాళ్ళు ఎంతెంత కలుపాలో కేంద్ర ఆహార పరిశోధన సంస్థ క్రమబద్ధం చేసింది. అలాగే ట్రాఫిక్ లైట్లపై కూడా విస్తృత పరిశోధన జరిగింది. ప్రస్తుతం రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ సిగ్నల్స్ వల్ల జరిగే ఇబ్బందులను అధిగమించేందుకు అత్యాధునికంగా రూపొందించిన ట్రాఫిక్ లైట్ల వివరణ కూడా ఇందులో ఉంది. ట్రాఫిక్ లేకపోయిన నియమిత కాలంలో గ్రీన్ సిగ్నల్స్ వెలగడమే కొత్త సిగ్నల్స్ చేసే పని. ఇలాగే బ్యాటరీ కార్లపై, విమానాలు, హెలికాప్టర్స్, మంచువల్ల ఎదుర్కొనే ఇబ్బందులు, నివారణోపాయలు, బుల్లెట్ చెట్టు ద్వారా రబ్బరుకు ప్రత్యామ్నాయ పదార్థం. ఇటువంటి ఆసక్తి కలిగించే విషయాలు మరెన్నో ఉన్నాయి.

### 3.13. మానవ వాదం జీవన నినాదం – విశ్లేషణ:

దైవ భ్రాంతి, దైవ చింతన, దైవ భక్తి లేదా దేవుడంటే భయపడే జనాభా ప్రపంచంలో అధికంగా ఉంది. మనిషి సృష్టించుకున్న అతి భయంకరమైన భావన ఏమిటంటే అది దేవుడే. అందులోంచి బయట పడాల్సింది మనిషే. ఖండాంతరాలను అధిగమించిన మానవుడు,

పర్వతాలను దాటిన మానవుడు, సముద్రాలను దాటిన మానవుడు రోదసిని జయించిన మానవుడు తన మూఢనమ్మకాలను తనే వదిలించుకోక పోవడం విచారకరం.

ఒకప్పుడు దైవ భావనకు మహిమలు ఆపాదించినట్టే ఇప్పుడు వ్యాపార సినిమా హీరోలకి సాహసాలు ఆపాదించి జనం ఆనందిస్తున్నారు. ఊహలు, అబద్ధాలు జనాన్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి. నిజాలు, వాస్తవాలు కటువుగానే ఉంటాయి. మనకు తెలుసు వాస్తవానికి నటీనటులు సాహసవంతులు కారు. సామాన్యులు చేయగలిగే పనులు కూడా వారు చేయలేరు.

సమాజంలో వైజ్ఞానిక స్పృహ పెరుగుతున్న కొద్దీ మత విశ్వాసాలు తగ్గుముఖం పడుతున్నాయి. భారతదేశం మూఢనమ్మకాల విషయంలో చిక్కుకుని పైకి తేరుకోలేని స్థితిలో ఉంది. బాబాలని, జ్యోతిష్యాలని, వాస్తులని, స్వామిజీలని నమ్మి ఈ దేశం ముందుకు నడుస్తున్నాననుకుంటోంది. కష్టించి పని చేయలేని కొందరు రాసిన కొన్ని కథలను మూర్ఖంగా నమ్ముతూ, స్వతహాగా ఆలోచించే శక్తిని కోల్పోయి అజ్ఞానంతో బతకడానికి సిద్ధపడుతూ ఉంది. "చదువు రాని నిరక్షరాస్యుల కంటే చదువుకుని అజ్ఞానంతో బతుకుతున్న మూర్ఖులతోనే ఈ దేశానికి చాలా ప్రమాదం" అని బాధ్యత గల మేధావులంతా ఆవేదన చెందుతున్నారు.

నాలుగు వేల యేళ్ళుగా మతాలు నీకు పునర్జన్మ ఉందని చెబుతున్నాయి. కాని ఉన్న జీవితాన్ని ఒక్క క్షణకాలం కూడా పెంచలేకపోయాయి. మరి సైన్సు రంగ ప్రవేశం చేసిన తర్వాత, మనిషి జీవితాన్ని రెండింతలు చేసింది. ఎన్నో రోగాలు అదుపులోకి వచ్చాయి. కొత్త కొత్త రోగాలు వస్తున్నా వాటికి కూడా మనిషి కొత్త కొత్త మందులు కనుగొంటునే ఉన్నాడు. అంటే ఏమిటీ? మతం చెప్పిన ఒక ఊహజనీతమైన విషయాన్ని సైన్సు నిజం చేసింది. ఇంకా ఏదో లోకంలో జీవితం ఉందని మతం చెబితే దాన్ని సైన్సు ఈ లోకంలోనే నిజం చేసి చూపింది. ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. పైగా జన్మరాహిత్యం కోసం ప్రయత్నించే మత విశ్వాసకులకు సైన్సు గట్టిగానే సమాధానం చెప్పింది.

"నీకు ఉనది ఒకటే జన్మ! దాన్ని అందంగా ఆనందంగా జీవిస్తూ తోటివారికి ఉపయోగపడుతూ, మానవత్వంతో మసలుకొమ్మని చెబుతుంది సైన్సు." ఎందుకంటే సైన్సు ప్రకారం మనిషికి పునర్జన్మంటూ ఏదీ లేదు. ఈ మట్టిలో, ఈ ప్రకృతిలో భాగమైపోవడం తప్ప — ప్రకృతిలోంచి పుట్టిన జీవి మళ్ళీ ప్రకృతిలో కలిసిపోతుంది. అంతే! దీనిలో మతం, దేవుడు, పునర్జన్మల ప్రసక్తి లేనే లేదు. అన్ని మనిషి కల్పించుకున్నవే తప్ప నిజంగా ఉన్నవి కావు.

సైన్సు గురించి చెప్పుకోవాల్సిన మంచి విషయం ఏమిటంటే – ఎవరు నమ్మినా నమ్మకపోయినా దాని అస్తిత్వం దానికి ఉంటుంది. అది కూడా వాస్తవంలో, సత్యంలో ఒక భాగంగా ఉంటుంది. మతం పరిస్థితి దీనికి భిన్నం. జనం నమ్మితేనే దాని అస్తిత్వం ఉంటుంది. జనం నమ్మకపోతే అది ఉండదు. అందువల్ల ఎక్కువ మందిని తన పరిధిలోకి లాక్కోవడానికి అది నిరంతరం ప్రచారం చేసుకుంటూ ఉంటుంది. వీలైతే ఆశ చూపిస్తుంది. వీలు కాకపోతే పీక నొక్కేస్తుంది. వైజ్ఞానిక చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా అలాంటి సంఘటనలు లేవు. మనుషుల్ని విడదీయకుండా అందరికి మేలు చేసేది సైన్సు, మేలు జరుగుతుందని మాయమాటలు చెబుతూ జనాన్ని విడగొట్టేది మతం. సైన్సుకు సరిహద్దులే లేవు. కొత్త ఆలోచనలతో నిరంతరం తనని తాను మార్చుకుంటూ, ప్రపంచాన్ని మార్చుకుంటూ పురోగమనంలోకి దూసుకెళ్ళేది సైన్సు. మతం మారదు. మారనివ్వదు. దానిదెప్పుడూ తిరోగమనమే. జ్ఞానం పేరుతో విస్తరించిన "మూఢత్వం" సమాజానికి ప్రమాద హేతువయ్యింది తప్ప నిరక్షరాస్యత, అమాయకత్వం, అజ్ఞానం సమాజాన్ని ఎప్పుడూ దెబ్బతీయలేదు. అందుకే సమాజంలోని నిరక్షరాస్యత, అమాయకత్వం, అజ్ఞానం తగ్గించడానికి, మూఢత్వాన్ని ఛేధించడానికి వైజ్ఞానిక స్పృహ అవసరమవుతుంది! అవసరం అవుతూనే ఉంటుంది.

సంవత్సరంలో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత ఆధారంగా ఆ యా రోజులను మనం ప్రకటించుకున్నాం. అలాంటిదే "సైన్స్ ఫిక్షన్ డే." సైన్స్ ఫిక్షన్ డే అమెరికాలో సహా పలు ప్రపంచ దేశాలు జరుపుకుంటున్నాయి. ప్రభుత్వాలేవి అధికారికంగా ప్రకటించి సెలవు ఇవ్వడం లేదు. ప్రపంచ దేశాల్లో ఈ రోజును తొలిసారి 2012లో జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 02ను "సైన్స్ ఫిక్షన్ డే"గా ప్రకటించడానికి ఒక కారణముంది. ఆ రోజు ఐజాక్ అసిమోవ్ పుట్టిన రోజు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహా రచయిత ఏజాక్ అసిమోవ్. వైజ్ఞానిక సృజన – సాహిత్య రంగంలో అత్యున్నత శిఖరం అధిరోహించినవాడు అసిమోవ్.

సైన్స్ వల్లనే గతాన్ని దాటి వచ్చాం. సైన్స వల్లనే భవిష్యత్తులోకి దూసుకుపోతాం. సైన్స్ లేనిది ఏది లేదు. సైన్స్ లేనిది సంగీతం లేదు, కళలూ లేవు. వైజ్ఞానిక దృక్పథంతో వచ్చే కళలు సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. సైన్స్ కవిత్వంలో ప్రవేశిస్తే ఎలా ఉంటుందో కొన్ని రచయిత (దేవరాజు మహారాజు) కవితా చరణాలు. ఉదాహరణ:

విత్తనం – భూమిలో పాతిపెట్టె పుస్తకం

పుస్తకం — మస్తకంలో దాచిపెట్టె విత్తనం. ఒక శుక్ర కణం అండాన్ని గుర్తించకపోతే ప్రాణి లేదు, ప్రపంచం లేదు. నిన్న కనిపించని బిందువు నేడు కనిపించే వాటన్నిటికీ – కేంద్రకం.

"నా కొంచెం నమ్మకమివ్వు" అన్నాడు కవి ఆలూరి బైరాగి. ఇక్కడ నమ్మకం ఆత్మవిశ్వాసానికి పర్యాయపదం. మూఢనమ్మకానికి కాదు. నమ్మకం, విశ్వాసం అనేవి చాలా బలమైనవి. మనిషి అన్నవాడికి తనమీద తనకు నమ్మకముండాలి. తోటివాడి మీద నమ్మకముండాలి. ప్రేమ, దయ, జాలి, గౌరవం, మర్యాద లాంటి వాటిపై నమ్మకముండాలి. వెరసి మానవత్వంపై నమ్మకముండాలి. అంతేకానీ భ్రమల మీద, ఊహల మీద, కనిపించని శక్తుల మీద, నిజనిర్ధారణకు నిలబడని పిట్టకథల మీద, పురాణ గాథలమీద, దైవ లీలల మీద నమ్మకం పెంచుకుని అసంబద్ధమైన జీవితం గడపడం వృథా. మనకు హేతుబద్ధమైన నమ్మకం ఉండాలి. అది ఎంత బలంగా ఉంటే మన జీవితం అంత ఆరోగ్యంగా ఉంటుంది. మన చుట్టు జరుగుతున్న సంఘటనల నుండే మనం స్ఫూర్తిని పొందవచ్చు.

తెలుగు రచయితలు జాతకాలని, జ్యోతిషాన్ని నిరసించినవారున్నారు. "పెళ్ళిళ్లలో చూపించే ఒక్క జాతకము నిజం కాదు" అని కుండబద్దలు కొట్టాడు మన గురజాడ అప్పారావు. "దేవుని భయంతో పాటించే నీతినియమాలు నిజమైనవి కానే కావు. దేవుడు, కర్మ భావాలు పోతే మనిషి మతస్తుడిగా కాకుండా మానవతావాదిగా మిగులుతాడు. సమాజంలో సోదరభావం పెరుగుతుంది" అని చెప్పాడు. ప్రఖ్యాత నాస్తికవాది గోరా. కాలక్రమంలో జరిగిన ఒక దుర్మార్గమైన పరిణామం ఏమంటే 'శాస్త్రీయ దృక్పథం – హేతువాదం', 'దేవుడు లేడు' అని చెప్పే చిన్న మాటలుగా కుదించబడ్డాయి. దైవ భావనను జ్యోతిషాన్ని, మూఢ నమ్మకాల్ని నమ్మి ప్రోత్సహించే జనాభాయే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు కాబట్టి శాస్త్రీయ దృక్పథం – హేతువాదాల్ని తక్కువ చేసి, అల్పమైనవిగా చూపించాలని అలా కుదించారు. నిజానికి అవి విశ్వమంత విశాలమైనవి. అర్థం చేసుకోలేని కుంచిత స్వభావులు తమని తాము కొంచెం విశాలం చేసుకుని చూస్తే అర్థమవుతాయి. మన తెలుగు రచయితలు ఎంతో మంది హేతువాదాన్ని బలపరుస్తూ వచ్చారు. వేమన, కందుకూరి, సరస్వతి, గోరా, త్రిపురనేని రామస్వామి చౌదరి, గోపీచంద్, తాపి ధర్మారావు, నార్ల లాంటివారు ఎంతోమంది ఉన్నారు. తెలుగు సమాజం మీద కోవూర్, పెరియార్ల ప్రభావం బాగానే ఉంది.

## 3.14. సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ – విశ్లేషణ:

సైన్స్ ప్రమేయం లేకుండా ఈ విశాల విశ్వంలో ఏదీ లేదు. ఏ విషయం తీసుకున్నా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అది సైన్స్‌తో సంబంధం కలుపుకోవాల్సిందే. ఇన్ని కోట్ల మంది యాత్రికులు బస్సుల్లో, రైళ్ళలో, విమానాలలో పుణ్యక్షేత్రాలకు, ధార్మిక కేంద్రాలకు వెళ్ళి వస్తున్నారంటే, కంప్యూటర్ ద్వారా రిజర్వేషన్లు జరుగుతున్నాయంటే, దేవుడి వ్యవహారాలన్నీ ఆన్లైన్లో జరుగుతున్నాయంటే అందుకు సైన్స్ కారణం. సైన్సుకు దేవుడి అవసరం లేకపోయినా, దేవుడి భావన నిలవడానికి మాత్రం సైన్స్ అవసరం ఉందన్నది ప్రత్యక్షంగా కనిపిస్తున్న సత్యం. మీరు ఏ స్వామీజీనో, సన్యాసినో, మాతాజీనో ప్రత్యక్షంగానో, టి.వి. తెరమీద పరోక్షంగానో చూడండి. వాళ్ళంతా ధవళ వస్త్రాలు ధరిస్తారు. అవి సైన్స్ వల్ల లభించినవి. ముందు ఐదారు మైకులుంటాయి. అవి సైన్స్ వల్ల లభించినవే. విద్యుత్ దీపాల కాంతి చల్లగా తెల్లగా వెలుగులు ప్రసరిస్తూ ఉంటుంది. అవి సైన్స్ వల్ల లభించినవే.

జరుగుతున్న ఘోరమేమంటే ప్రతివాడు సైన్సును ఉపయోగించుకుంటాడు. కాని దాని గూర్చి ఒక్క మాట కూడా మాట్లాడడు. నమ్మకాల్లో మూఢ విశ్వాసాలలో బతకడం అలవాటు పడినవారికి వాస్తవాలు రుచించవు. రుచికరమైన చిరు తిండికి అలవాటు పడ్డవాడు సాత్వికమైన పౌష్టికాహారం ఇష్టపడడు. అలాంటి వాడికి అసలు వాస్తవాల్ని గ్రహిద్దామన్న స్పృహ కూడా ఉండదు.

ఈ రోజు బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, జెనెటిక్ ఇంజనీరింగ్, హ్యూమన్ జీనోమ్, జీన్ థెరపీ, క్లోనింగ్, చంద్రయాన్ ప్రాజెక్ట్, నానో టెక్నాలజీ, ఫార్మస్యూటికల్ రీసెర్చ్ వంటి అనేక విషయాలపై పరిశోధన ఉధృతంగా జరుగుతున్నాయి. మూల కణాలపై జరిగే పరిశోధనలు విజయవంతమవుతే ఒక మనిషికి పెరిగిన తర్వాత రాబోయే రోగాలు అతను పిండ దశలో ఉన్నప్పుడే, జన్యువుల్లోనే నివారించొచ్చు. విశ్వ విజ్ఞానం ఎంతగా పెరిగిపోయిందంటే విభిన్న రంగాలకు చెందిన శాస్త్రవేత్తలందరూ మనస్ఫూర్తిగా తమ తమ అహాల్ని వదులుకుని కృషి చేస్తే, నూతన సృష్టికి రూపకల్పన చేయగలరు. అంతటి విజ్ఞానం మనకు ఉంది. అంతటి ప్రజ్ఞా పాటవాలు మనకు ఉన్నాయి.

సైన్సుకు జీవంతో సంబంధంలేదని, జీవాన్ని ఏదో ఒక శక్తి సృష్టించిందని 19వ శతాబ్దం దాకా అందరూ నమ్మారు. 1828 నుండి టెస్ట్ ట్యూబ్ ప్రయోగాలు ప్రారంభమైనప్పటి నుండి ఈ వాదన బలహీనపడుతూ వస్తోంది. ఇప్పటికి అత్యధిక సంఖ్యాకులు జీవాన్ని దేవుడు సృష్టించాడని నమ్మేవారే ఎక్కువ. కాని శాస్త్ర పరిశోధనలు వారి అభిప్రాయాన్ని తప్పక మారుస్తాయి. వాస్తవాల్ని

జీర్ణించుకోవడానికి, తమ నమ్మకాల్ని వదులుకోవడానికి ప్రజలకు కొంత సమయం పడుతుంది. ఎందుకంటే త్వరిత గతిన సాగుతున్న పరిశోధనల వల్ల శాస్త్రజ్ఞులు మానవుడి జన్యువులను కూడా కృత్రిమంగా తయారుచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీని వల్ల మస్కులర్ డిస్ట్రోఫీ, సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటి రోగాలకు చికిత్స సాధ్యమవుతుంది.

ఈ విధంగా విజ్ఞాన శాస్త్రం ఏ ఏ మూలలకు వ్యాపిస్తోందో, ఆయా మూలాల నుండి దేవుడు మాయమవుతున్నాడు. ఒకనాడు స్మాల్పాక్స్ వస్తే "అమ్మవారు" అని భయపడ్డారు. దాన్ని దైవానికి అంటగట్టారు. ఇప్పుడది వ్యాధి మాత్రమేనని తేలిపోయింది. దాని నివారణ కూడా జరిగింది. నమ్మకాలు, మూఢ నమ్మకాలు బాగా ప్రబలుతున్న చోట దైవభావం బలంగా ఉంటుంది. విజ్ఞాన శాస్త్రం ఒక జ్యోతిలా వెలుగులు అందిస్తున్న కొద్ది, నమ్మకాల్లో మార్పు వస్తుంది. మూఢనమ్మకాలు సడలుతున్నాయి. అయితే ఎప్పటికప్పుడు కొత్త కొత్త మూఢనమ్మకాలు సమాజంలో చోటు చేసుకుంటున్నాయి. వాటిని తొలిగించాల్సిన బాధ్యత విద్యావంతులందరిది. విశ్వ విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు జనానికి అందించేవారు ఎక్కువ సంఖ్యలో కావాలి. నిరక్షరాస్యుల కన్నా అక్షరాస్యుల్లో కొంత మంది హేతుబద్ధంగా ఆలోచించకపోవడం, అంధ విశ్వాసాలలో తాము కొట్టుకుపోతూ, తమ చుట్టూ ఉన్నవారిని సైతం భయపెట్టడం జరుగుతుంది. ఇలాంటి వారి వల్ల మన సమాజం వైజ్ఞానిక సమాజంగా రూపాంతరం చెందలేకపోతుంది.

తమ వృత్తులతో వ్యాపారం చేసుకునే సినీనటులు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు మొదలైన వారిని పక్కనపెట్టి నిస్వార్థంగా, సమాజ పురోగతికి పాల్పడే శాస్త్రవేత్తల్ని, సామాజిక శాస్త్రవేత్తల్ని, అధ్యాపకుల్ని, దార్శనికుల్ని గౌరవించుకున్న నాడు సమాజం బాగుపడుతుంది. వ్యవసాయదారుడు, కూలీ, ఉద్యోగి, కార్మికుడు వంటి వారి శ్రమకు సరైన విలువ లభించినప్పుడు సమాజం విలువ పెరుగుతుంది.

భారత్ స్వాంతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత ఆంధ్రదేశంలో వైజ్ఞానిక ప్రగతికి కృషి చేసిన పరిశోధకులు, సైన్స్ రచయితలు కొంతమంది ఉన్నారు. పావులూరి మల్లన్న, కొమర్రాజు లక్ష్మణరాజు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, కాళీపట్నం కొండయ్య, రావి వెంకటాద్రి, వసంతరావు, విస్సా అప్పారావు, కంచి శేషగిరి రావు, డా॥ జి. గోపాలరావు, గోటేటి జోగిరాజు, జమ్మ కోనేటిరావు, నండూరి రామమోహనరావు, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, అయ్యగారి వీరభద్రరావు, మహీధర నళినీ మోహనరావు, కందుల నాగభూషణం మొదలైన వారంతా సరళ విజ్ఞాన శాస్త్ర ప్రచారానికి ఎనలేని సేవలు చేశారు. అలాగే ప్రముఖ సాహితీవేత్తలు త్రిపురనేని

రామస్వామి చౌదరి, తాపీ ధర్మారావు, కొడవటిగంటి కుటుంబరావు, నార్ల, గోరా, డా॥ మిత్ర, హేమలతా లవణం, ఈశ్వర ప్రభు మొదలైన వాళ్లంతా సాహిత్యరంగంలో ఉండి కూడా సమాజంలో వైజ్ఞానిక స్పృహ పెంపొందించడానికి కృషి చేశారు.

★★★

# అధ్యాయం – 4

# దేవరాజు మహారాజు రచనలు – శిల్పం

# అధ్యాయం – 4

# దేవరాజు మహారాజు రచనలు – శిల్పం

## 4.1. శిల్పం:

ఆంగ్లంలో "టెక్నిక్" మాటకు సమానార్థకంగా "శిల్పం" అనే మాటను తెలుగులో వాడుతున్నాం. నేటి ఆధునిక కథానికకు శిల్పమే ప్రధానం. శిల్పాన్ని బట్టి రచయిత ప్రతిభను అంచనా వేయవచ్చు. శిల్పం అనేది పూర్తిగా వ్యక్తిగతమైనది. వైయక్తిక భేదాలను బట్టి మారుతూ ఉంటుంది. కథా కథనంలోనో, వర్ణనలోనో, పాత్ర చిత్రణలోనో, ఎత్తుగడలోనో, లేక ముగింపులోనో ఇలా ఏదో ఒక విభాగంలో రచయిత తనదైన ముద్రను చూపుతూ తన శైలిని ప్రతిఫలిస్తాడు. ఈ శిల్పంలోని భాగాలను ఎంత నేర్పుతో అమరిస్తే అంత గొప్ప శిల్ప విశేషం కథలో వెల్లివిరుస్తుంది.

శిల్పం గురించి అనేక మంది రచయితలు, విమర్శకులు అనేక రకాలుగా అభిప్రాయపడ్డారు. వాటిలో కొన్నింటిని పరిశీలించినట్లయితే శిల్పంపై కొంత అవగాహన కలుగుతుంది.

"ఉలికి ఉండాల్సిన ఏకాగ్రత కథా శిల్పాన్ని కాపాడటంలో కలానికి ఉండాలి. శరీరానికి ప్రాణం వంటిది కథకు ప్రయోజ నం. ఆ ప్రయోజనాన్ని సాధించేది శిల్పం. శిల్పం పటిష్టంగా ఉంటే కథ ద్వారా తాను ఆశించిన ప్రయోజనాన్ని పొందగలుగుతాడు రచయిత"[42]. దీన్ని బట్టి రచయిత శిల్పివలే కథా నిర్మాణంలో ఎంత జాగ్రత్త వహించాలో తెలుస్తుంది.

శిల్ప ప్రాధాన్యాన్ని తెలుపుతూ వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు "కథా రూపాన్ని పాత్రలు, ప్లాట్ (Plot), వాతావరణం (Setting), దృష్టికోణం (Point of view), కంఠస్వరం (Tone), కథన పద్ధతి (Mode for narration) అన్న ఆరు అంశాలుగా విభజించి అర్థం చేసుకోవచ్చు. ఈ ఆరు అంశాలను కలిపి స్థూలంగా శిల్పం అంటారు"[43] అని వివరించారు.

"వస్తువు ఉన్నంత మాత్రం చేత కథ కాదు. రాతిని చెక్కితేనే కదా శిల్పం అయ్యేది. ఒకే రాయి అద్భుతమైన కళాఖండం కావచ్చు. అది శిల్పి చేతి పనితనం మీద ఆధారపడి ఉంటుంది. కథకు మూలమైనది వస్తువైనా దాన్ని కథగా మార్చే పనితనమే ముఖ్యమైనది. ఇదే నిర్మాణ శిల్పం. కథకైనా, నవలకైనా మరింకే ప్రక్రియకైనా ఇది అవసరమే"[44] అని శీలా వీర్రాజు పేర్కొన్నారు.

---

[42] శార్వరి, కథలెలా రాస్తారు, పుట–241.

[43] వల్లంపాటి వెంకటసుబ్బయ్య, అనుశీలన–సాహిత్య వ్యాసాలు, పుట–37.

[44] శీలా వీర్రాజు, కలానికి అటుఇటు, పుట–52.

శిల్పాన్ని నిర్వచిస్తూ "ఏ పనిలోనైనా కళానైపుణ్యాన్ని చూపే పద్ధతినే శిల్పమనవచ్చు"[45] అని పోరంకి దక్షిణామూర్తి శిల్పాన్ని నిర్వచించారు. "లోకంలో జీవితానికి రచయిత తన విచక్షణతో కొంత కొంతను తీసి దాన్నంతా ఒక్కటే నప్పించేటట్లుగా ఫ్రేమ్ చేసి ఒక విశిష్ట ఖండంగా చూపెడతారు. దీన్నే ఇంగ్లీషులో ఫార్మ్ అని అన్నారు. ఫార్మ్ అన్నది కేవలం రచయిత సృష్టే. అది రచయిత యొక్క సొంతం. నిర్మాణం లేక స్ట్రక్చర్ అన్నది కూడా దీన్లో ఒక భాగమే. రచనలోని భిన్నాంశాలకు ఏకతను కలిగించడానికి రచయిత తాను ఎన్నుకున్న వస్తువుతో తపస్సు చేయాల్సి ఉంటుంది. రచయిత వస్తువుతో చేసే తపస్సునే శిల్పం అన్నారు"[46] అని ముదిగొండ వీరభద్రయ్య శిల్పం గురించి వివరించారు.

'శిల్పం' అనే మాటను ప్రాచీన కవులు కానీ, ఆలంకారికులు కానీ వాడినట్లు ఎక్కడ కనిపించదు. తెలుగులో తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో తన సామర్థ్యాన్ని గూర్చి తెలుపుతూ ఈ పదాన్ని ఉపయోగించారు.

ఆంగ్లంలో "Technique" అనే పదానికి సమానార్థకంగా తెలుగులో శిల్పం అని వ్యవహరిస్తున్నారు. శిల్పం అంటే "రాతితో చెక్కబడిన బొమ్మ" అని అర్థం. రచయిత ప్రతిభ, అనుభవం, శైలి మొదలైనవి శిల్పంలో వ్యక్తమవుతాయి.

పై నిర్వచనాల వల్ల 'శిల్పం' పట్ల ఒక అవగాహనకు రావడం సాధ్యమవుతుంది.

'శిల్పం' శబ్ద కవిత్వంలో కంటే నిత్య వ్యవహారంలో ఎక్కువగా ప్రయోగింపబడుతుంది. నిత్య వ్యవహారంలో విగ్రహ శిల్పానికి సంబంధించి 'శిల్ప' శబ్దం రూఢియై పోయింది. విగ్రహాలను తయారుచేసే వారికి 'శిల్పి' అన్న పదం జన వ్యవహారంలో ఉంది. ఇంకా ఇతర వృత్తులు చేసే వారిని కూడా వారి పని నైపుణ్యాన్ని బట్టి శిల్పులనడం జరిగింది. సాహిత్యంలో రచయిత ప్రదర్శించే రీతికి పర్యాయపదంగా 'శిల్ప' శబ్దం వాడబడుతుంది.

'టెక్నిక్', 'స్టయిల్', 'ఆర్ట్' అనే ఆంగ్ల పదాలకి పర్యాయపదంగా నేటికిని మన విమర్శకులు 'శిల్పం' అనే మాటను వాడుతున్నారు. 'టెక్నిక్' అనే పదానికి 'కార్యసూక్ష్మత' అనే అర్థం ఉంది. కళాత్మకంగా ఒక కార్యాన్ని నెరవేర్చడాన్ని 'టెక్నిక్' అని వ్యవహరిస్తూ ఉన్నాం.

'స్టయిల్' అనే పదం రాసే విధానాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ పదం ముందుగా కవి రాసే ఘంటానికి వాడబడినట్లు ఉంది. తర్వాత రాసే తీరుకు స్థిరపడిపోయింది.

---

[45] పోరంకి దక్షిణామూర్తి, కథానిక స్వరూప–స్వభావాలు, పుట–397.

[46] వీరభద్రయ్య, ముదిగొండ. నవల–నవలా విమర్శకులు. పుట–33.

'ఆర్ట్' అనే పదం 'నేర్పరితనం' అనే అర్థాన్ని సూచిస్తుంది. విస్తృతార్థంలో ఇది సృజనాత్మకమైన అన్ని విషయాల్ని వ్యక్తం చేస్తుంది. ఇలా 'టెక్నిక్, స్టయిల్, ఆర్ట్' అనే పదాల స్థాయిలో ఈ శిల్ప శబ్దం వాడబడుతూ విస్తృతార్థాన్ని కలిగి ఉంది.

ఏ సాహిత్యాన్ని పరిశీలించిన అందులో రెండు ప్రధానమైన అంశాలు కనిపిస్తాయి. ఒకటి వస్తువు. రెండవది రూపం. ఈ రెండింటిలో రూపానికే విమర్శకులు శిల్పం విషయంలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రెండింటికి విడదీయరాని అవినాభావ సంబంధం ఉంది. ఒక సాహిత్య ప్రక్రియను తీసుకుంటే అందులో రూపం విషయానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో, అంతే ప్రాధాన్యం వస్తువు విషయంలోనూ ఉంటుంది. వస్తువు లేనిదే రూపం లేదు. కాబట్టి శిల్పం విషయంలో వస్తువుకు రూపానికి ఒకే రకమైన ప్రాధాన్యాన్ని ఇవ్వవల్సిన అవసరం ఉంది.

### 4.2. కవితా శిల్పం:

కవితా శిల్పాన్ని రెండు విభాగాలుగా విభజించుకోవచ్చు. ఒకటి వస్తు శిల్పం, రెండవది రూప శిల్పం. రూప శిల్పానికి నేడు అనేక పర్యాయపదాలు వాడుకలో ఉన్నాయి. రూప శిల్పాన్నే శైలీ అని, రీతి అని, రచనా పద్ధతి అని, భావాన్ని వ్యక్తం చేసే తీరు అని మనం వ్యవహరిస్తున్నాం. కావ్యాలల్లో, కావ్య ఖండికల్లో ఇతివృత్తానికి సంబంధించిన శిల్పం వస్తు శిల్పం.

ఈ వస్తు శిల్పంలో ముఖ్యంగా రెండు రకాలైన శిల్పాలు మనకు కనిపిస్తాయి. ఒకటి కేవలం వస్తువుకు సంబంధించినది. రెండవది వస్తు సంబంధమైన భావానికి సంబంధించినది. దీన్నే మనం భావ శిల్పం అని అంటున్నాం.

రూపానికి సంబంధించిన శిల్పాన్ని మనం నాలుగు విభాగాలుగా విభజించు కోవడానికి అవకాశం ఉంది. అవి 1) అక్షర శిల్పం, 2) ఛందః శిల్పం, 3) అలంకార శిల్పం, 4) వర్ణనా శిల్పం. వీటన్నింటిని కలిపి 'శైలి, రీతి' అనే పదాలు వ్యవహార రూపంలో అధికంగా ప్రచారంలో ఉన్నాయి.

"ఏ వస్తువు ఏ రూపంలో వ్యక్తమవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. ప్రక్రియ, భావ ప్రతిమలు భాషాశిల్పంలో ముఖ్యమైన భాగాలు. వీటిని శిల్పం"[47] అంటారు.

శిల్పం అంటే రాతితో చేసిన విగ్రహం. కేవలం రాయియే అయితే మనం దానికి నమస్కరించాల్సిన పనిలేదు. ఆ రాతి విగ్రహం మనలో ఏదో ఒక మంచి భావనను స్ఫురింపజేస్తుంది. ఆ భావన ఏదో ఒక శక్తికి ప్రతీకగా నిలిపి మనల్ని ఆ శిల్పం ముందు

[47] త్రిపురనేని మధుసూదనరావు, సాహిత్యంలో వస్తు శిల్పాలు, పుట–27.

మోకరిల్లేట్లుగా చేస్తుంది. భాషా విషయంలో కూడా అలాగే జరుగుతుంది. "సాహిత్యం అనగానే అక్షరాలు, పదాలు, వాక్యాల సమ్మేళనమే కాదు. ఇవన్నీ కలిసి ఒక భావనను స్ఫురింపజేయాలి. ఆ భావన పాఠకుణ్ణి మరో ఉన్నత స్థితికి తీసుకుపోవాలని, అంతటి సాహిత్యాన్ని మనం గౌరవిస్తాం. అట్లా మన చేత గౌరవింపబడే సాహిత్యం అంతర్ స్థితే శిల్పం"[48] అనబడుతుంది.

దేవరాజు మహారాజు కవితలో శైలి సారళ్యం కనిపిస్తుంది. వీరి కవితలు సులభ శైలిని కలిగి అందరికి అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడం కనిపిస్తుంది. జీవితంలోని ఆనంద విషాదాల మూలాలను తన కవిత్వం ద్వారా అందరికి తెలియజేయాలనుకుంటాడు ఈ కవి.

"కలం – గుండె" అను కవితలో –

**"..... ..... ..... ..... .....**
**పుస్తకంలా**
**జీవితం తెరిచి వున్నా**
**గుండె జలంగా మారి,**
**కళ్ళలోంచి రాలిపోబోతున్న తరుణంలో**
**సమస్యల భాష తెలిసిందే అయినా,**
**అర్థం కాకుండా వున్న – వాక్యాలు**
**ఊహల్లోని ఎలక్ట్రిక్ దీపం ఆశ**
**కోడిగుడ్డు దీపం – నిజంలోకి మారి**
**నావేదననంతా తన పొగగా చేసుకుని**
**నాముందే, నా ప్రతి రూపంగా**
**టేబుల్పై కూర్చొన్న – దీపం"**

**(గాయపడ్డ ఉదయం, పుట – 63)**

ఇక్కడ 'ఊహల్లోని ఎలక్ట్రిక్ దీపం ఆశ' అనేది దేవరాజు మహారాజుగారి శైలిని సూచిస్తుంది. ఆ చెప్పే రీతి చాలా బాగుంది.

"గురవేనమః" అనే కవితలో –

**"దేవరవారు క్షమించాలి!**

48 వి. త్రివేణి, ముదిగంటి సుజాతారెడ్డి రచనలు–సమగ్ర పరిశీలన, పుట–204.

**ఈ నెల్రోజుల్నుండే కాదండి**
**నేనీ ఉద్యోగంలో చేరిన్నాటి నుండి**
**మా యింట్లో రిలే నిరాహార దీక్షలే సార్**
**వారం రోజులా పది రోజులా అని**
**లెక్కలేస్తున్నారు గానీ...**
**జీతాలొస్తాయో లేదో – వస్తే**
**ఎప్పుడొస్తాయో ఏమో తెలియని అయోమయంలో**
**ప్రతి నెలా మావి ఆమరణ నిరాహార దీక్షలే గదా సార్?"**

**(గాయపడ్డ ఉదయం, పుట – 14)**

ఈ కవితలో తను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తనకు ఎదురైన కష్టాలను చాలా బాగా వివరించడం జరిగింది.

### 4.2.1. భావ వైచిత్రి కవితలు:

'ఇమేజరీ' అనే ఆంగ్ల పదానికి భావచిత్రం అనే అర్థం వాడుతున్నాం. ఇరవయ్యో శతాబ్దంలో ఆంగ్లదేశంలో వ్యవహారిక భాషను కవిత్వంలోకి తెచ్చి, నిర్దిష్ట పదచిత్రణలతో కవిత్వం రాసి ఈ 'Imagist' కవిత్వోద్యమాన్ని తీసుకొచ్చినవారు ఎజ్రా పౌండ్.

"రచయిత చిత్రించదలుచుకున్న సమస్యను శక్తివంతంగా, సంగ్రహంగా, ధ్వనిమయంగా చెప్పడానికి తోడ్పడే శిల్ప సాధనం భావచిత్రం"49.

ఒక వస్తువు లక్షణాన్ని, స్వభావాన్ని చెప్పడానికి వాటిలో పోలికలున్న లేదా దగ్గరి సంబంధమున్న మరో వస్తువును వర్ణించడం లేదా సూచించడాన్ని 'భావచిత్రం' అంటారు.

చాలామంది తెలుగు కవులు ఈ ధోరణిని స్వీకరించారు. శ్రీరంగం నారాయణ బాబు మొదలుకొని అనుభూతి కవులైన ఇస్మాయిల్, మో, విప్లవ కవులైన శేషేంద్ర, శివారెడ్డి, శివసాగర్, దళిత కవుల్లో శిఖామణి మొదలైనవారు ఈ భావ చిత్రాల్ని తమ కవిత్వంలో సమర్థవంతంగా ప్రయోగించారు.

వస్తు శిల్పంలోనే వస్తువు కన్నా కొంత ప్రాముఖ్యాన్ని కలిగి ఉండేది భావం. ఈ భావాన్ని వ్యక్తికరించే తీరునే భావ చలనం అని, భావ వైచిత్రి అని పేర్కొంటూ ఉన్నాం. ఒక వస్తువును చూసినప్పుడు మానసిక సంచలం కలిగి ఒక విధమైన భావం మనలో మొదలవుతుంది. ఆలంకారిక

49 జి.వి. సుబ్రహ్మణ్యం, సాహిత్యంలో చర్చనీయాంశాలు, పుట–590.

పరిభాషలో ఈ భావాన్ని ప్రతిభ యొక్క వ్యాపారంగా పేర్కొన్నారు. కావ్య ఉత్పాదనలో ఇది కవి మానసిక వ్యాపారం అవుతుంది. ఈ భావనా వ్యాపారం చేతనే కవి మనసులో కావ్య సృష్టి జరుగుతుంది. అటుపైన్నే పాఠకుల కోసం వారి మెప్పు కోసం వాగ్రూపంలో ఈ భావం ఒక రూపం తీసుకొని బయటి ప్రపంచంలోకి వెలువడుతుంది.

ఒక వస్తువును చూసినప్పుడు కవి హృదయం స్పందిస్తుంది. ఆ స్పందన వల్ల కవి హృదయంలో పలురకాలైన భావాలు స్ఫురిస్తాయి. ఇవి వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. అందుకే వివిధ కవులు వేర్వేరు భావాల్ని తమ కావ్యంలో వ్యక్తం చేస్తూ ఉంటారు. ఈ విధమైన రకరకాల భావాల్ని కవులు తమ కావ్యాలలో ఆవిష్కరించడాన్నే భావ చలనం లేక భావ వైచిత్రి అని వ్యవహరిస్తున్నారు. ఇలాంటి భావ వైచిత్రిలో పరిపక్వాన్ని పొందిన భావ సముదాయాల్నే ఆంగ్లంలో "ఇమేజరీస్" అని అంటున్నారు. వీటినే తెలుగులో "పదచిత్రాలు"గా వ్యవహరిస్తున్నారు.

ఆధునికుడికి ఆదర్శం మీద కంటె ప్రత్యక్ష నిదర్శనం మీద నిష్ఠ ఎక్కువ. జగత్తును భౌతికంగా చూసి చూడనట్టు భావించలేడు. బ్రతుకులో కనబడే పరమ సత్యాలే అతని పరిశీలన క్షేత్రాలు. కళ్ళు తెరిస్తే అతడికి కనబడేది మానవ సమాజం. మనిషిలో మానవత్వాన్ని దర్శించడం ఆధునిక కవి లక్ష్యం. మానవత్వానికి బదులు హీనత్వం కనబడితే దుయ్యబట్టడం అతని నైజం. "విశ్వశక్తి, మెలకువ, అడుగుల కింద, హెలికాప్టర్ చూపు" మొదలైనవి భావవైచిత్రికి సంబంధించిన కవితలు.

దేవరాజు మహారాజు "విశ్వశక్తి" కవితలో అక్షరాలతో ఎలా మాట్లాడిస్తున్నాడో పరిశీలిస్తే...

**"అక్షరాలన్నింటితో అబద్ధాలు చెప్పించలేవు**
**అక్షరాలన్నింటితో పంచరత్నాలు రాయించుకోలేవు**
**అక్షరాలన్నీ నీ సన్మాన పత్రంలో చేరవు**
**పోస్టు ముద్రలకు, సెన్సార్లకు ఆకారాలు మారినా**
**నీకు అనుగుణంగా మారి నిన్ను పొగడవు**
**బలవంతంగా కొన్ని అక్షరాలతో**
**ఆర్డినెన్స్ల రాతి గోడలు కట్టినా**
**తిరగబడి ప్రవహిస్తున్న**
**లక్షల అక్షర ప్రవాహానికి అవి ఆగవు**
**నువ్వు వెళ్ళిన చోటల్లా**

**అక్షరాలు బ్యానర్లెక్కి ఆహ్వానించాలనుకుంటావు పాపం**
**కాని అప్పటికే అవి కర పత్రాల నిండా విస్తరించి**
**నీ వెధవ్వేషాలు అందరికి చాటుతయ్"**

**(జీవితమే ఒక కవిత, పుట – 106)**

ఎంతటి ఉక్తి వైచిత్రి, ఇక్కడ 'అవి ఆగవు' అన్న విషయం గమనించాలి. అవి ఏమిటి? అబద్ధాలు, పొగడ్తలు. మనుష్యులందరితో అబద్ధాలు చెప్పించలేవు. మనుష్యులందరితో పొగడ్తల వర్షం కురిపించుకోలేవని పరోక్షంగా చెప్పాడు. అంటే పొగడ్తల కోసం పరితపించే మానవనైజం ఇందులో గమనించవచ్చు. సైన్స్ ప్రకారం చర్యకు ప్రతిచర్య ఉంటుంది. ఇదే విషయాన్ని కవి పై కవితలో ప్రతిబింబింప చేశారని చెప్పవచ్చు. ఆర్డినెన్స్ల రాతిగోడలు, అక్షర ప్రవాహాలు అనునవి ఈ కవితలోని బలమైన పదచిత్రాలు. ప్రవాహం వల్ల గోడ కూలిపోయే అవకాశం కదా!'ఆర్డినెన్స్ల రాతిగోడలు' మనిషిలి అహంకారానికి, అధికార దర్పానికి సంకేతాలయితే, 'అక్షర ప్రవాహాలు' నిజానికి, విమర్శలకు సంకేతాలని చెప్పవచ్చు.

"మెలకువ" అనే కవితలో నాయకుల పాత ఉపన్యాసాలు కొత్తగా ప్రారంభమై ఓటర్లను కొత్త ఎరతో కొత్త గాలం వేసి వేట ప్రారంభిస్తున్నారని చెప్పాడు కవి.

**"నాయకుల పాత ఉపన్యాసాలు**
**కొత్తగా మొదలవుతున్నాయి**
**కొత్త ఎరతో కొత్త గాలం వేయబడింది**
**వేట ప్రారంభమైంది"** **(జీవితమే ఒక కవిత, పుట – 109)**

**"శవాలు తేలుతున్న నీటిలో**
**మృత్యువు బతికున్న దృశ్యం**
**మృత్యువు చచ్చిన కోనల్లో**
**శవాలు బతికున్న దృశ్యం"** **(గాయపడ్డ ఉదయం, పుట – 26)**

వరదల్లో చిక్కిన ప్రజలు శవాలుగా తేలే వరకు ప్రభుత్వ సహాయం అందదు. రాజకీయవేత్తలు హెలికాప్టర్ చూపులతో చూస్తూ, ఫుడ్ ప్యాకెట్లు దొర్లించమంటారు. అవి కాలుతున్న శవాల మంటలో పడతాయి అని చెప్పడం జరిగింది.

### 4.2.2. ప్రతీక వైచిత్రి కవితలు:

19వ శతాబ్దంలో వచ్చిన అనేక తాత్త్విక సిద్ధాంతాలు ప్రపంచానికి కొత్త ఆలోచనల్ని అందించాయి. ఈ శతాబ్దంలో వచ్చిన రాజకీయ విప్లవాలు, శాస్త్ర సాంకేతిక ప్రగతి, సాంఘిక సిద్ధాంతాలు ప్రపంచానికి నూతన దిశానిర్దేశం చేశాయి. అస్తవ్యస్తంగా ఉన్న భౌతిక జీవనానికి కొత్త ఊపిరినిచ్చే విధంగా ఈ సిద్ధాంతాలు మార్గం చూపాయి. ఈ మార్పులన్నీ ఆనాటి సాహిత్యంపై ప్రత్యక్ష ప్రభావం చేశాయి. సరిగ్గా ఈ కాలంలోనే అంటే 19వ శతాబ్దపు చివరిలో ఫ్రాన్స్లో ఈ ప్రతీకోద్యమం ఆవిర్భవించింది.

"సత్యం శాస్త్ర లక్షణం అని, సత్యాన్ని యథాతథంగా వ్యక్తీకరిస్తే స్వభావోక్తి కావచ్చు. కానీ స్వభావోక్తియే సాహిత్య ధర్మంకాదని, సత్యానికి అభివ్యక్తి సౌందర్యం తోడైనప్పుడే కవిత అనబడుతుందని భావించారు ప్రతీకవాదులు"[50].

ఫ్రాన్స్లో మొలకెత్తిన ఈ వాదాన్ని బోద్లెర్, వెర్లేన్, మలార్మే మొదలగు కవులు నడిపించారు. "భావ ప్రకటనము చేయుట కవిత్వ ధర్మం కాదని, భావ సూచనయే దాని లక్ష్యము కావలెనని మలార్మే ప్రకటించెను"[51].

ఇంగ్లీషులో ఈ వాదాన్ని 'Symbolism' అంటారు. Symbol అనే పదానికి తెలుగులో చిహ్నం, గుర్తు, సంకేతం లేదా ప్రతీక అనే పదాలు వాడుతున్నారు. అయితే సాహిత్య లోకంలో వాడుకలో ఉన్న ప్రతీక అనే శబ్దాన్ని సింబల్కు, ప్రతీకవాదాన్ని Symbolismకు సమానార్థకాలుగా వాడుతున్నాం.

"ప్రతీకవాదులు సాంఘిక, ధార్మిక వస్తువుని నిరసించారు. ఎందుకంటే వాళ్ళ ప్రకారం కళ సౌందర్య అనుభూతుల్నే అనుసరిస్తుంది. కానీ సాంఘిక, నైతిక బాధ్యతలని మోసుకోదు"[52].

"తత్త్వ దర్శనం ప్రతీక స్వభావం. అర్థాంతర స్ఫూర్తి ధ్వని లక్షణం. వస్తువు యొక్క భౌతిక తాత్విక రూపాలను దర్శించి ఆదర్శజన్యమైన అనుభూతిని తదనుగుణమైన ప్రతీకలలో వ్యక్తీకరించడం ప్రతీక లక్ష్యం"[53].

---

[50] పెన్నా శివరామకృష్ణ, ప్రతీక పరిశీలన, భారతి, ఏప్రిల్, 1989.

[51] సినారె, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు – ప్రయోగములు, పుట–494.

[52] పెన్నా శివరామకృష్ణ, ప్రతీక పరిశీలన, భారతి, ఏప్రిల్, 1989.

[53] ఆర్వియార్, సాహిత్య తత్వం, పుట–131.

"ఆధునిక కవిత్వానికి గొప్ప అభివ్యక్తి శిల్పంగా ప్రతీక రాణించింది. మనిషిలోని మౌలిక చైతన్యం సమగ్రతనందుకోవడానికి అనుభూతి తీవ్రతను పారదర్శకం చేయడానికి ప్రతీక గొప్ప సాధనమవుతుంది"[54].

కవి చెప్పదలచుకున్న అంశాన్ని ఒక సంకేతం ద్వారా సూచించడాన్ని ప్రతీక అంటారు. కవి ఒక వస్తువును చూసి అనుభూతి చెంది దాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పడాన్ని ప్రతీక అంటారు. వివరణలతో పని లేకుండా అనుభూతి చెందినదాన్ని చెందినట్లుగానే వ్యక్తీకరించడానికి ప్రతీక ఉపకరిస్తుంది. తెలుగులో ప్రతీకల్ని తాము ఎంచుకున్న వస్తువును, భావాన్ని పాఠకుడికి చేరవేయడంలో సమర్థవంతంగా వాడుకున్న వారిలో శ్రీశ్రీ, ఆరుద్రలు ఉన్నారు.

"దర్శన, క్షుద్ర సంస్కృతి, ప్రతి అక్షరం ఒక వీరుడు, మేఘం, అంతర్వాహిని" మొదలైనవి ప్రతీక వైచిత్రికి సంబంధించిన కవితలుగా చెప్పవచ్చు.

"దర్శన" అనే కవితలో –

**"నిశ్శబ్దంలో**
**సమాధుల మధ్య కూచున్నట్లుంది**
**ఈ లైబ్రరీలో**
**పుస్తకాల మధ్య కూచుంటే"** **(జీవితమే ఒక కవిత, పుట – 102)**

లైబ్రరీ ఒక సమాజం. అందులో నుంచి ఒక్కొక్క పుస్తకం బయటికి తీయడం అంటే పేరుకుపోయిన సమాజంలో నుంచి ఒక్కొక్క రచయితను బయటికి తీయడమేనని ఉత్ప్రేక్షించడం చాలా గొప్పగా ఉంది.

"క్షుద్ర సంస్కృతి" అనే కవితలో –

**"సమస్యల చితుల మీద సజీవంగా కాలిపోతున్న**
**శవాల మధ్య నుండి నడుస్తున్నట్లుగా ఉంది**
**..... ..... ..... ..... ..... .....**
**చట్టాల నిప్పుల మీద లేనివాడి మాంసం**
**కాల్చుకు తింటున్న భయంకర రాక్షస సంస్కృతి**
**మాంసం కుదవబెట్టుకుని**
**ప్రాణం అప్పు తెచ్చుకుంటోంది**

---

54 లంకా వెంకటేశ్వర్లు, సమకాలీన కవిత్వంలో ప్రతీకలు – భావచిత్రాలు, పుట–23.

**చెమట మట్టిలో పోసుకొని**
**నోట్లో మట్టి కొట్టుకుంటోంది"** **(జీవితమే ఒక కవిత, పుట – 119)**

సమసమాజ చిత్రణ, రాజకీయాలు, విప్లవం అని మూడు భావాంశాలు కలిసి ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది విప్లవం. ఈ క్షుద్ర సంస్కృతిని నాశనం చేయడానికి ఈ జీవన స్తబ్ధతతో సంఘర్షించడానికి విప్లవం తప్ప మరే మార్గం లేదంటారు ఈ కవి. సాహిత్య విప్లవం ప్రబోధం చేయాలి. అప్పుడు ప్రతి అక్షరం ఒక వీరుడవుతుంది. వీరుడికి మరణం లేదు. అతడు సూర్యుడు లాంటివాడు. అందుకే సూర్యుడు చావలేదన్నట్లుగా, మళ్ళీ తెల్లవారింది అని చెప్పడం జరిగింది. నిరంతరం బీభత్సం సృష్టిస్తున్న క్షుద్ర సాహిత్య విషతాండవంలో దేశం హృదయ దౌర్బల్యంతో కొట్టుమిట్టాడుతుంది. నిర్జీవపు పెంట మీద మొలచిన మొక్క నిర్జీవి కాదు. క్షుద్ర సమాజంలో పెరుగుతున్నంత మాత్రాన జనమంతా క్షుద్రమైపోదు వంటి ఆశావహ సత్యాలెన్నింటినో అందించాడు ఈ కవి.

"అంతర్వాహిని" అనే కవితలో –

**"అక్షరాల్ని ఆహ్వానిస్తున్న కళ్ళు**
**జ్ఞాన రసాన్ని గ్రోలుతున్న మేధస్సుకు ద్వారాలు**
**ఒక్క అక్షరం ముక్క**
**బీకర్లోంచి గోడంతా పాకిన అందమైన మొక్కలాగా**
**మనోదౌర్బల్యంలోంచి పెరుగుతున్న విజ్ఞానం"**

**(జీవితమే ఒక కవిత, పుట – 156)**

"మనోదౌర్బల్యంలోంచి పెరుగుతున్న విజ్ఞానం ప్రయోజన శూన్యమని" ఈ కవితలో రచయిత ఆవేదన చెందడం జరిగింది.

దేవరాజు మహారాజు తన జీవితంలో వివిధ దశల్లో, పలు సందర్భాలలో ఎదురైన సంఘటనలను, తనను ప్రభావితం చేసిన, అబ్బురపరచిన, విస్మయపరచిన కొన్ని సంఘటనలను తీసుకొని కవితలను కవితీకరించడం జరిగింది. అంటే తన జీవితంతో ముడిపడిన సంఘటనలే ఈ కవిత్వంలో ప్రధాన వస్తువు.

### 4.2.3. వ్యక్తీకరణ వైచిత్రి కవితలు:

"చెప్పదలచుకున్న విషయమును భావనాబలముతో గాక, ఊహాలంబనముతో చెప్పుట ఆ చెప్పేడి రీతి సూటిగా హృదయమునకు హత్తుకొనునట్లు గాక మేధస్సుకు గిలిగింతలు పెట్టినట్లుండుట అతినవ్యులు సాధించిన ప్రత్యేకత. దీనినే వ్యక్తీకరణ వైచిత్రి అనవచ్చు"[55].

"శిక్ష, ప్రగతి, మెలకువ, కలం–గుండె" వంటి కవిత్వాలను ప్రధాన వస్తువుగా తీసుకొని కవిత్వీకరించడం ఇందులో ప్రధానమైన అంశం.

"శిక్ష" కవిత్వంలో –

**"..... ..... ..... ..... .....**
**గుచ్చుతూనే ఉంది**
**ఒక్కోక్షణం ఒక్కో సూది**
**ఒక్కో సూది ఒక్కో క్షణం**
**ఆ తొందరలో ఆ కోపంలో**
**ఆ అన్ను మిన్ను కానకపోవడంలో**
**అదును చూసి**
**'క్షణం' తిరగ బడింది"** **(గాయపడ్డ ఉదయం, పుట –38)**

ఈ కవితలో "క్షణం తిరగబడింది" అనే స్థానంలో "తిరగ" శబ్దాన్ని నిజంగా తిరగవేసి ముద్రించడం ఈ కవి ముద్రణ శిల్పానికి మచ్చుతునకలు అని చెప్పవచ్చు.

ఇటువంటి ప్రయోగాలు శ్రీ శ్రీ "మహాప్రస్థానం"లోని "కేక" కవితలోని –

**"నా గదిలో చీకటిలో**
**చీకటిలో నాగదిలో"** ను స్ఫురింపజేస్తాయి.

మిని కవిత యగు "ప్రగతి" అనే కవితలో –

**"బస్సులు పాకని**
**గొంద్రాలు**
**ఈ రోడ్డు**
**ఈ బల్బు బతుక్కి**
**కనెక్షన్లన్నీ ఉన్నాయ్**

[55] సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు ప్రయోగాలు, పుట–610.

**కరెంటు లేదు"** **(జీవితమే ఒక కవిత, పుట – 137)**

దేశ ప్రగతి గురించి "బస్సులు పోకని గొడ్రాలు – ఈ రోడ్డు" ఈ బల్బు బతుక్కి కనెక్షన్లన్నీ ఉన్నాయి కరెంటు లేదు అంటూ విమర్శించాడు.

'పాద ముద్రలు' అనే కవిత శీర్షికకు తగినట్లుగా రూపుదిద్దుకుంది.

**"చెమట కాలవల్లాంటి**
**నొసటి మీది గీట్లు**
**నిర్దాక్షిణ్యంగా కాలం**
**రక్కిన గాట్లు**
**పండిన అనుభవాల**
**పొలానికి గట్లు**
**మోసిన బతుకు బరువుల్ని**
**తూకం వేసే బాట్లు**
**బతుకంతా ఎక్క తొక్కి**
**ఎవడో వదిలేసిపోయిన**
**ని**
**చ్చె**
**న**
**మె**
**ట్లు"**

**(గాయపడ్డ ఉదయం, పుట –60)**

కట్టి పఠాభి, ఆరుద్రలను తలపింప చేస్తాడు.

### 4.2.4. శబ్ద వైచిత్రి కవితలు:

తెలుగులో శబ్దముల ద్వారా గారడీలు చేసిన నవ్యకవులలో పఠాభి ప్రథముడు. "హైహీలుయాన" వంటి కొత్త సమాసములను సృష్టించినాతడు. ఇంగ్లీషు పదములను విచ్చలవిడిగా గ్రుమ్మరించిన తొలి కవి ఇతడే. ఇంగ్లీషు మాటలకు, తెలుగు మాటలకు సంధికార్యము నిర్వర్తించినదితడే. పఠాభి చేసిన శబ్దచమత్కారములకు "ఫిడేలు రాగం" అను గేయము చక్కని నిదర్శనము. ఇందులో మామూలు వర్ణక్రమమును మార్చి రాసెను. ప్రేమికులు

అనుటకు "ప్ రేమికులు" అని, అన్యోన్యము అనుటకు "అన్ యోన్ య"మని, ప్రశ్నించినది అనుటకు "ప్ రశ్ నిన్ చినది" అని అక్షరములను చీలదీసి ప్రయోగించెను.

"స్తబ్ధత" కవితలో –

**బద్ధకపు ఒంటరితనాన్ని**
**ఆ**
**గి**
**న**
**గడియారం**
**భయపెడుతోంది –**
**బతుకు ఆ**
  **గిం**
  **ద**
  **న్న**
  **ట్లు** **(జీవితమే ఒక కవిత, పుట – 181)**

వంటి ప్రయోగాలు చేశాడు ఈ కవి.

"చిన్న కదలికే" అను కవితలో –

**"ఓపిక మంచు**
**కరిగి కదిలి**
**జనం గుండెల**
**కొండల కొనల్లోంచి**
**ప్రవహించి పరిగెత్తి**
**ప్రతీకార జలపాతంలా**
**దూ**
 **కు**
  **తుం**
   **ది!"** **(జీవితమే ఒక కవిత, పుట – 130)**

అని నిచ్చెన మెట్లు కడుతూ పఠాభి, ఆరుద్ర, కేశవరావులను తలపింపచేస్తాడు.

ఈ కవి అపారమైన అనుభవశాలి. అభినవ తాత్వికుడు, కర్మయోగి, దార్శనికుడు, సంస్కర్త, శ్రేయోభిలాషి. కవి ఎంచుకున్న వస్తువును పరిశీలిస్తే కవిలో ఉన్న ఈ ముఖాలన్నీ దర్శింపవచ్చు.

### 4.2.5. ఆత్మాశ్రయ రీతి కవితలు:

ఆత్మాశ్రయ రీతిగా కవిత్వాన్ని రాయటం, అభివ్యక్తీకరించడం భావ కవిత్వపు లక్షణాలలో ఒకటి. కావ్యంలో, ఖండ కావ్యంలో, గీతంలో అన్నిటిలో కర్త (Actor), నాయకుడు (Hero), కవే. ఈ కవి అహం (Ego) అన్ని సందర్భాలలో, విషయాలలో ప్రబలమైన నేను (Dominate I) గా, మిగిలిన లోకం – సమాజం అందులోని వస్తువులు (Objects), ఇతరులు (the others)గా వ్యక్తీకరించబడతాయి. అందుకే అన్ని విషయాలలోను తన ఆత్మను దూర్చి ఆ స్థాయికి చేరుకుంటాడు.

కవి తాను దర్శించిన సత్యమును, శివమును, సౌందర్యమును ప్రకటించుటకు రెండు మార్గములు ఉన్నాయి. ఒకటి వస్త్వాశ్రయ కవితారీతి. రెండవది ఆత్మాశ్రయ కవితారీతి. వీనినే క్రమంగా Objective Poetry అని, Subjective Poetry ని పాశ్చాత్య విమర్శకులు వింగడించారు. ఈ విభాగము తెలుగు కవిత్వంలో ఆంగ్ల సంప్రదాయ ప్రకారం వచ్చింది.

దోపిడికి గురైన సగటు మనిషిని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లితే డాక్టర్ అతనికి రాస్తున్న "ప్రిస్క్రిప్షన్".

"ప్రిస్క్రిప్షన్" అనే కవితలో –

"..... ..... ..... ..... .....
**గుండె దెబ్బలు చెవుల్లోకి విన్నాడు**
..... ..... ..... ..... .....
**నిట్టూర్పుల్ని చప్పరించకు**
**పాయిజెనెస్, కాని**
**ఆశల బిళ్ళన్ని పగలగొట్టి**
**పూటకు సగం వేసుకో**
**ఆరోగ్యం కుదుట పడుతుంది**
**రోజూ రెండు కలల్ని తిను**
**ఉత్సాహం రెండు చెంచాలు తాగు**
**అన్నం తిన్నాక, తినక ముందు అన్నాడు**

..... ..... ..... ..... .....

**నీ అంగి తీయ్ 'కడుపు' చూపు అన్నాడు**

**చూపేందుకేడుంది? ఎవరో "కొట్టారు"**అన్నాను.

**(గాయపడ్డ ఉదయం, పుట – 60)**

ఈ కవిత చాలా వ్యంగ్య ధోరణిలో కడుపు కొట్టబడిన బీద రోగి గురించి సానుభూతి కలిగించే విధంగా చెప్పడం జరిగింది.

ఇలా సామాన్యుడికి అర్థమయ్యేలా సరళ పదాలతో "అల్పాక్షరాల అనల్పార్థ" రచనలా ఉంటుంది. వీరి రచనా శైలి భావాన్ని వ్యక్తం చేసే విధానం "కడుపు చూపి", "కొట్టారు" అను రెండు 'Inverted Commas' చెబుతున్నాడంటే అతని బాధ తీవ్రతను తెలియజేస్తుంది. ఈ కవి ఆత్మాశ్రయ రీతిగా చెప్పడం జరిగింది.

### 4.2.6. చైతన్య ప్రబోధ కవితలు:

"చిత్ అనే ధాతువు నుంచి వచ్చిందే చైతన్యం. చైతన్యం అనే మాటకు ప్రాణం, జీవం, జ్ఞానం, తెలివి, ప్రకృతి అనే అర్థాలనిపిస్తుంది. సూర్యరాయాంధ్ర నిఘంటువు ఇక్కడ చైతన్యం కలిగించడం అంటే జ్ఞానాన్ని కలిగించడం, వివేకవంతులను చేయడం అన్న అర్థాలను తీసుకోవచ్చు"[56].

"వర్గ సంఘర్షణను పటిష్టంగా చిత్రీకరిస్తూ శ్రామిక వర్గ నియంతృత్వ సాధనకు, పీడిత వర్గం వైపు నిలబడే రచయితను సామాజిక చైతన్యం కలిగినవాడని చెప్పవచ్చు"[57].

"వెలుగు కోసం వీటి తపస్సు, గడియారం, పుట్టుక" అనే కవితలలో చైతన్య ప్రబోధం కనబడుతుంది. ఇది ఒక రకంగా విప్లవానికి దగ్గర భావాంశమే. విప్లవాన్ని నమ్మే కవికి 'చైతన్యం' అంటే విప్లవ చైతన్యమే.

"వెలుగు కోసం వీటి తపసు" అనే కవితలో

**"వాతావరణంతో రణమొస్తే సైతం కలియబడతాయి**

**పచ్చగా తలూపుతూ చైతన్యానికి సంకేతంలా నిలబడతాయి**

**ఈ వృక్షాలకు మనుషుల్లా**

**తాము పడుతూ కక్షకొద్దీ ఇతరుల ఇళ్ళు**

**పడగొడదామన్న ప్రసక్తే లేదు**

---

[56] విజయ్ కుమార్, 2005, పుట–26.

[57] శివరామకృష్ణ పెన్నా, భారతి, 1987 అక్టోబర్, పుట–46.

**తాము నిలబడుతూ నలుగురి ఇళ్ళు**
**నిలబెడదామన్న ఆలోచన, ఆసక్తీ తప్పు" (జీవితమే ఒక కవిత, పుట–175)**

చెట్లు త్యాగమూర్తులు. వెలుగు కోసం తపస్సు చేసే మహా మునులు. అయినా వాతావరణంతో రణమొస్తే మాత్రం కలబడతాయి. "పచ్చగా తలూపుతూ చైతన్యానికి సంకేతంలా నిలబడతాయి." ఈ చెట్లను ఆదర్శంగా తీసుకొని మానవులు చైతన్యవంతులు కావాలి అనేది వెలుగు కోసం వీటి తపసు కవితలోని ప్రబోధం. ఇది ఇస్మాయిల్ గారి "చెట్టు నా ఆదర్శం", "చిలుకలు వాలిన చెట్టు" అనే కవితల్ని జ్ఞప్తికి తెస్తుంది.

"గడియారం" అనే కవితలో

**"గడియారం డయల్ గుండ్రని ప్రపంచంగా అనిపిస్తుంది**
**రాత్రింబవళ్ళు అంకెల్ని మైలు రాళ్ళుగా వెనక్కి నెట్టేస్తూ**
**కలుస్తూ విడిపోతూ కలవడానికి తహతహలాడుతూ**
**కలుస్తూ విడిపోతూ... నిరంతర ప్రేమికులుగా**
**భవిష్యత్తులోకి పోయే నిరంతర ప్రయాణికులుగా**
**జీవిత కాలాన్ని పంచుకునే భాగస్వాములుగా**
**అది మనల్ని అయిపొమ్మన్నట్లు – అనిపిస్తుంది**
**నీకది వట్టి కాల సూచికగానే కనిపించొచ్చు**
**నాకు మాత్రం ఒక జీవితంలాగా అనిపిస్తుంది" (జీవితమే ఒక కవిత, పుట:180)**

గడియారం కాలానికే కాదు. కవి హృదయానికి, జీవితానికి ప్రతీకే. గడియారాన్ని కాలానికి ప్రతీకగా గ్రహించి, దానిని జీవితంతో పోల్చి చెప్పి చైతన్య ప్రబోధం చేశారు.

"పుట్టుక" అనే కవితలో

**"వెల్లికిలా తెరిచిన పుస్తకమ్మీద**
**బోరగిలా పడేసిన మరో పుస్తకం**
**తెరిచిన విజ్ఞానంలోకి**
**చదువుతూ చదువుతూ**
**చొచ్చుకు పోతూ మెదడు**
**లోనికి చదవుతూ**
**బయటికి ఆలోచిస్తూ**

**చదువుతూ ఆలోచిస్తూ**

**కొంత కాలంలో**

**మరో పుస్తకం పుడుతుంది"** **(జీవితమే ఒక కవిత, పుట–164)**

'అనుభూతి వాదానికి దండాలు' అని అంటాడు కవి.

### 4.2.7. రూపవాద కవితలు:

రూపాన్ని ఆంగ్లంలో 'Form' అంటారు. వ్యక్తీకరణ విధానమే రూపం. వస్తు, రూపాలను సంఘర్షణ ఉంటుంది. సాహిత్య రూపాన్ని నిర్వచిస్తున్నాం కాబట్టి దీన్ని సాహిత్య రూపం (Literary Form) అంటారు. ఒక రచన యొక్క అంతర్గత సమీకరణ (Inter-organization), సుస్థిర నిర్మాణం (Structure) సాహిత్య రూపం అవుతుంది.

"రూపం, వస్తువులలో రూపం కంటే వస్తువుకే ప్రాధాన్యం. వస్తువుని ఆకర్షకంగా బలమైన ముద్ర వేసేట్టు, ఆకట్టుకునేట్టు చెప్పేంత వరకే రూపానికి ప్రాధాన్యత"[58]. వస్తువుకీ, రూపానికీ నేర్పుతో అనుసంధానం చేయగల కవి ఉత్తమ కవి. ఈ రూపం వస్తువుకు ప్రత్యేక వ్యక్తీకరణ సాధనాల ద్వారా వెలిబుచ్చుతుంది.

"విషయాన్ని లేదా వస్తువుకు కళాత్మకంగా వ్యక్తం చేసే విధానమే రూపం"[59].

వస్తువును ఆశ్రయించుకొని రూపం, రూపాన్ని ఆశ్రయించుకొని వస్తువు ఉంటుంది.

రెండూ అవిభాజ్యమైన సంబంధం కలిగి వైవిధ్య స్థితిలో ఉండి, ఒకదానిపై ఒకటి ఆధిక్యతను కలిగి ఉంటాయి.

రూపాన్ని బట్టి వస్తువు కొన్ని సార్లు, వస్తువుని బట్టి రూపం మరికొన్ని సార్లు పాఠకుల ఆకర్షణకు గురవుతుంది.

రూపం కొన్ని సార్లు ప్రక్రియగా పిలువబడుతుంది. కానీ ప్రక్రియ రూపంగా కొన్నిసార్లు మాత్రమే అంగీకరించ బడుతుంది.

"పారాణి, ప్రెస్ రిపోర్ట్, కలర్ ఫుల్ బ్రౌన్ షుగర్" వంటి కవితలు రూపవాదానికి సంబంధించిన కవితలు.

"పారాణి" అనే కవితలో ఈ విధంగా భయపడతాడు కవి.

**"ఏది చూసినా నాకెందుకో**

**లోతైన బావి లాంటి భయం**

---

[58] కె.కె. రంగనాథాచార్యులు, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట–222.

[59] ముదిగొండ వీరభద్రయ్య, ఆధునిక సాహిత్యం వస్తు రూప వివేచన, పుట–11.

**తేలిన శవం లాంటి భయం**

**..... ..... ..... .....**

**ముగ్గురక్క చెల్లెళ్ళ**

**మూకుమ్మడి ఆత్మహత్యలూ**

**దినపత్రికలో పతాక శీర్షికలై**

**ఎవరికీ పట్టక**

**దుకాణాల్లో ఉప్పు, పప్పు పొట్లాలు చూట్టేస్తూ ఉంటే**

**భయం భయం, అంతటా భయం**

**నడచిపోయే అమ్మాయి**

**జరగబోయే అగ్నిప్రమాదంలా అనిపిస్తుంటే**

**ఇప్పుడు నాకు**

**కిరాణా కొట్లో అగ్గి పెట్టెన్నా భయమే!**

**రేషన్ షాపులో కిరోసినన్నా భయమే!"**

**(గాయపడ్డ ఉదయం, పుట – 74)**

ఈ సమాజంలో యువతి భవిష్యత్తు ఎంత ప్రమాద భరితంగా ఉందో తలచుకొని కవి పడిన బాధ ముఖ్యంగా ఆడపిల్లల్ని, కన్న తల్లిదండ్రుల్ని బోరున ఏడ్పిస్తుంది.

వరకట్నం చావుల్ని దృష్టిలో పెట్టుకొని నడిచిపోయే అమ్మాయి జరగబోయే అగ్ని ప్రమాదంలోను, కిరాణ కొట్లో అగ్గిపెట్టె అన్నా, రేషన్ షాపులో కిరోసిన్ అన్నా ఈ కవి భయపెడుతుండడంలోను, అతని హృదయంలో ఎంత వేదన ఉందో తెలుసుకోవచ్చు. ఎవరికి పట్టక... అభివ్యక్తీకరింపలేనంత నిరాశ, దుఃఖం ఈ భయాలన్నీ భయపెట్టి పారదోలాలన్న భయం. ఇది రూపవాదం క్రిందికి వస్తుంది. "కవిత సంవిధానం క్లిష్టత తొలగించి చెప్పదల్చుకున్నది స్పష్టంగా చెప్పగలగడం, చేపట్టిన కవితా వస్తువుకి మరే వేషాలు తగిలించకుండా ప్రగతివాదాన్ని మాత్రమే జోడించడం నేటి కవి కర్తవ్యం" దీనికి మరొక ఉదాహరణ.

"ప్రెస్ రిపోర్ట్" కవితలో –

**"ఎల్లడలా గాలి వీస్తూంది**

**..... ..... ..... .....**

**గాలి, నీరు, ఆహారమే కాదు**

**మనసు, మమత, రాగం, అనురాగం**

**అన్నీ కల్తీ అవుతున్నాయి**

..... ..... ..... .....

**ఇవి కవిత్వం కాదు, యథార్థం!**

**కళలన్నీ కుంటుతున్నాయి**

**సంగీతం చెవులు బద్దలు కొడుతోంది**

**సాహిత్యం మరీ సన్నబడి పోతుంది**

**గ్రంథ చౌర్యం సజావుగా సాగుతోంది**

**పాత రచనల్ని ఖూనీ చేసి**

**కొత్తవి మేకప్ చేసుకుంటున్నాయి**

..... ..... ..... ..... .....

**కాసు కనబడ్డప్పుడల్లా నిచ్చెన లేసుకునే**

**వ్యాపార నవలా మేస్త్రీలే ఎక్కువైనారు**

..... ..... ..... ..... .....

**ఇది కవిత్వం కాదు, యథార్థం"** **(జీవితమే ఒక కవిత, పుట – 190)**

అంటూ నానాటికి సంఘంలో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం, కల్తీ సమస్యలు, దిగజారిపోతున్న ప్రమాణాలు కళ్ళకు కట్టినట్లు చెప్పాడు రచయిత.

"కలర్ ఫుల్ బ్రౌన్ షుగర్" అనే కవిత టెలివిజన్కు సంబంధించిన కవిత.

**"జీవితంలో దొరకని వన్నీ**

**దొరికే కల – టీవి తెర**

..... ..... ..... .....

**గొంతెత్తి ప్రతిరోజూ ప్రధానమంత్రి**

**స్వయానా – నీ చెవిలో ఇల్లు కట్టుకుంటాడు**

**ఎంతటి హీరోయిన్ అయినా సరే**

**నీ బెడ్ రూంలో అందాలు ఒలక బోసి వెళ్తుంది**

..... ..... ..... ..... ..... .....

**శనివారాలు బిర్లా టెంపుల్ మెట్లెక్కే పని ఉండదు**

**ఆదివారం పొద్దున్నే త్రేతాయుగంలోంచి హుటాహుటిన**
**శ్రీ సీతారాములే దిగివస్తారు**
**నీ వానర సైన్యాన్ని చూడ్డానికి**
**మధ్య మధ్య వ్యాపార సౌఖ్యాల ప్రకటనలు**
**నీ జీతం రాళ్ళతో దోబూచులాడతాయి**

**..... ..... ..... ..... ..... .....**

**పొద్దునెప్పుడో కాలిన పక్క ఫ్లాట్ సంగతి**
**సాయంత్రం వార్తల్లో తప్ప తెలియదు**

**..... ..... ..... ..... ..... .....**

**నిజమనిపించే అబద్ధపు పాటైనా సరే**
**లిప్తకాలం పాటు జో కొట్టాలనుకున్నావు కదూ**
**అంతే! ఈ వ్యవస్థకు కావల్సింది అదే!**

**(గాయపడ్డ ఉదయం, పుట – 89)**

బ్రౌన్ షుగర్ ప్రమాదకరమైన మాదక పదార్థం. దాని మత్తులో పడి ప్రపంచంలోని యువతరం అంత నిస్సత్తువగా తయారవుతోంది. T.V. మత్తు కూడా అలాంటిదేనని రచయిత చాలా బాగా చెప్పడం జరిగింది.

సమాజంలో మృగ్యం అవుతున్న మానవతా విలువలు "సాయంత్రం వార్తల్లో తప్ప తెలియదు", "జీతం రాళ్ళతో దోబుచులాడతాయి". ఇది వీరి శైలి. తిలక్ గారి కవిత్వం లాగా "ఎవ్వరికి తెలియని విషయాన్ని తెలియజెప్పటం సులువు, అందరికీ తెలిసిన విషయాన్ని అందరికి అర్థమయ్యేలా వివరించడం బరువు" అన్న కవితా గుణం దేవరాజు మహారాజుగారిలో మెండుగా ఉంది.

**4.2.8. అలంకార ప్రయోగం**:

తాను చెప్పదలుచుకున్న అంశాన్ని, వస్తువును పాఠకుడికి అనుభూతమయ్యేటట్లు చెప్పడానికి, అందించడానికి, స్పష్టంగా బోధించడానికి కవి కొన్ని కవిత సామాగ్రుల సహాయం తప్పనిసరిగా తీసుకుంటాడు. అలంకారాలుగా మనం చెప్పుకునే ఈ పద్ధతులు కూడా దేవరాజు మహారాజు చాలా చోట్ల వాడుకున్నారు.

దేవరాజు మహారాజుగారు తన మనోగత భావాల్ని చాలాచోట్ల ఆలంకారిక శైలిలోనే వ్యక్తం చేశాడు. కవితా శిల్పంలో అంతరమైన వస్తు, భావాలతో పాటు, బాహ్యమైన ఆలంకారిక, రూపం కూడా ముఖ్యమైందే. కాబట్టి దేవరాజు మహారాజు తన రచనల్లో ఆలంకారిక శైలిని కూడా ప్రదర్శించాడు. తన మనసులో నడయాడే భావాల్ని సైతం కొన్ని సందర్భాల్లో ఆలంకారిక శైలిలో చెప్పాడు.

'జీవితమే ఒక కవిత' అనే కవితా సంపుటిలో ఆలంకారిక శైలిలో ఉన్న ఉల్లేఖనాలు ఆయన భావపటిమను, అతని సున్నితమైన మనస్తత్వాన్ని వెల్లడిస్తాయి. దేవరాజు మహారాజులో ఉన్న నిరంతర పరిశీలనా శక్తిని, తార్కిక చింతనని ఆయన ఉల్లేఖనాలుగా తీసుకున్న విషయాలే స్పష్టీకరిస్తాయి. ఈయన కవిత్వంలో సామాన్యమైన అలంకారాలే చోటు చేసుకున్నాయనిపిస్తుంది. ఉల్లేఖాలంకారాలు, స్వభావోక్తి అలంకారాలు, రూపక అలంకారాలు ఈయన కవితా మూర్తికి శిరోభూషణాలై అలరారుతున్నాయి.

"విశ్వశక్తి" అనే కవితలో 'ఉల్లేఖ' అలంకారం కలదు.

**లక్షణం**:

**"బహుభిః బహుదోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే"**

"ఒక్క వస్తువే ఒక్కొక్కరికి ఒక్కొక్కటిగా కన్పడటం ఉల్లేఖాలంకారం".

ఈ కవితలో "అక్షరం" అనేక విధాలుగా వర్ణించడం జరిగింది.

**"కలం కాగితాన్ని**
**పెట్టుకున్న ముద్దు — అక్షరం**
**ఆ రెండింటి దాంపత్యపు ప్రేమ ఫలితం**
**కాదంటావు**
**విజ్ఞానాంధకారపు కాంచన మహల్లోకి**
**నిన్ను లాక్కెళ్ళే చేతబడి —**
**అది కాదంటావు... శహభాష్!**
**అయితే నీకు అక్షరం గూర్చి తెలును!**
**అక్షరం**
**ఈ నాగరిక ప్రపంచంలో వీస్తున్న గాలి**
**ఒక జీవిత సత్యాన్ని చెప్పడానికి**

**బాదుకునే గుండె**

**..... ..... ..... ..... .....**

**అక్షరం మండుతున్న ఇనుప ముక్క**

**నిషేధాజ్ఞల సమ్మెట పోట్లు పడుతున్న కొద్దీ**

**పదునెక్కుతున్న ఆయుధం**

**(గాయపడ్డ ఉదయం, పుట – 04)**

పై కవితలో అక్షరాన్ని దాంపత్యపు ప్రేమ, చేతబడి, గాలి, గుండె, ఇనుప ముక్క ఆయుధాలుగా పోల్చడం గమనించవచ్చు.

'నీరు' అనే కవితలో స్త్రీని వివిధ రూపాలుగా వర్ణించుటలోను ఉల్లేఖాలంకారం గలదు.

'కాక్టైల్'లో...

**"కాక్ టైల్లా బొలబొలా గ్లాసు నిండుతుంది**

**చల్లని మంచు ముక్కలా తేలియాడుతుంది**

**వెచ్చని ఆవిర్లు పుట్టించి**

**మత్తై గమ్మత్తవుతుంది**

**..... ..... ..... ..... .....**

**చిటికెన వేలవుతుంది**

**మెత్తని రొమ్మవుతుంది**

**చిగురుల వొడి అవుతుంది**

**..... ..... ..... ..... .....**

**శాసనమవుతుంది**

**జీవితాంతం వేగినా**

**నువ్వు దారిలో పడనందుకు**

**మౌనమవుతుంది**

**..... ..... ..... ..... .....**

**(గాయపడ్డ ఉదయం, పుట – 72)**

"మెలకువ" అనే కవితలో స్వభావోక్తి అలంకారం కలదు.

**లక్షణం**:

**"స్వభావోక్తిః స్వభావస్య జాత్యాది స్థస్య వర్ణనమే"**

జాతి, గుణ క్రియాదుల చేత దాని స్వరూపాన్ని వర్ణించిన యెడల అది స్వభావోక్తి అలంకారం.

**"మున్సిపాలిటీ స్వీపర్**
**రోడ్డు పాచిపండ్లు తోముతోంది**
**..... ..... ..... ..... .....**
**పడిపోబోయె ప్రాణ భవనాలకు**
**టాబ్లెట్ల ఊత స్తంభాలు కట్టబడుతున్నాయి**
**నరికి బకెట్లో వేసిన కాలు**
**ఆ ఉదయం**
**ఒకడి ఆయుస్సు పెంచింది"** **(జీవితమే ఒక కవిత, పుట – 108)**

**లక్షణం**:

**"విషయ్య భేద తాద్రూప్య రంజనం విషయస్యయత్"**

"ఉపమేయమునకు ఉపమానం తోటి అభేదాన్ని గాని, సాదృష్యాన్ని గాని వర్ణించటం రూపకం".

**"జన సముద్రంలోని**
**సమస్యల ఆవిర్లను పోగు చేసుకుని**
**నల్లబడి, చల్లబడి, విశ్లేషించుకుని**
**తన జీవితంలో పత్రహరితం మొలిపించడానికి**
**జనం ఆలోచనల పంట పండించడానికి**
**ఎంతో తపనతో, వేదనతో, బాధ్యతతో**
**పరిష్కారాల వర్షం కురిపిస్తున్నాడు**
**రచయిత –**
**భూమి మీద నీటి చుక్క వలె**
**ప్రతి మెదడులోనూ యింకి పోతున్నవాడు"** **(జీవితమే ఒక కవిత, పుట – 111)**

ఇందులో "జన సముద్రం, సమస్యల ఆవిర్లు, ఆలోచనల పంట, పరిష్కారాల వర్షం" అనేవి రూపకాలంకారానికి సంబంధించినవి.

ఈ విధంగా దేవరాజు మహారాజు తన కవితలో ఉల్లేఖాలంకారం, స్వభావోక్తి అలంకారం, రూపకాలంకారాలని వాడటం జరిగింది.

### 4.2.9. పద ప్రయోగం:

దేవరాజు మహారాజుగారి 'జీవితమే ఒక కవిత' అనే కవితా సంపుటిలో భావావిష్కరణకు అనుకూలమైన పదప్రయోగమే గూడు గట్టుకుంది. సహజత, స్పష్టత, సరళత ప్రధాన గుణాలుగా గల రచనా విన్యాసం ఈయన కవితలో ఉండటం మూలంగా సరళమైన పదాల్ని తన కవిత్వానికి అలంకార సామాగ్రిగా ఎన్నుకొని రచనలు చేసినట్లు కన్పిస్తుంది.

దేవరాజు మహారాజు తన కవిత్వంలో సంస్కృత పదాధిక్యత, ఆంగ్ల భాష పదాడంబరాలు అక్కడక్కడ కొన్నిచోట్ల ఉన్న వాటి ప్రభావం అంతగా కన్పించదు. అలతి అలతి తెలుగు పదాల పొందికనే తన కవితల్లో ప్రదర్శించాడు. అందునా దేశీయత మూర్తీభవించేలా తెలుగు నుడికారపు సొంపులో కూడుకున్న పదాల్ని, పదబంధాల్ని తన కవితలో ఎల్లెడలా విస్తరింపజేశాడు.

"లైట్ హౌజ్" అనే కవితలో –

**"..... ..... ..... ..... .....**
**కార్మికులు, కర్షకులు, గుమాస్తాలు, అధికార్లు, కళాకారులు**
**హృదయ సంకేతాల పరిశీలకులు**
**వాస్తు సాంకేతిక పరిశోధకులు**
**అంతా అతని చేతి వేలు పుచ్చుకుని నడిచిన వారే!**
**పాలరాతి భవనాల నునుపును స్పృశించే యాత్రికులు**

పునాది రాళ్ళ గూర్చి చర్చించారు. పునాది రాళ్ళెప్పుడు మట్టిలోనే సమాధి అవుతుంటాయి.

**అయితే దాన్ని 'సమాధి' – అనరు**
**అందంగా గురుతరమైన బాధ్యత అంటారు"** **(జీవితమే ఒక కవిత, పుట–112)**

అని సరళమైన పదాలతో గురువు గొప్పతనాన్ని వర్ణించాడు. ఇక్కడ దేవరాజు మహారాజు అనల్పమైన భావాల్ని చిన్న చిన్న పదాల్లో ప్రదర్శించే తీరు వ్యక్తం అవుతూ ఉంది.

దేవరాజు మహారాజుగారు తన రచనలలో ప్రయోగించిన పదాలు.

"అక్షరం, కలం, కాగితం, లైబ్రరీ, సమాధి, తుపాకీ, ఇంద్రధనస్సు, విద్యుత్తు, చేతబడి, ఇనుపముక్క, ఆయుధం, లాఠీ, సెక్రటేరియట్, రోడ్డు, మున్సిపాలిటీ, రాకెట్, స్టాఫ్ నర్స్, వేట, ఇంజక్షన్, టాబ్లెట్లు, పోలీస్ స్టేషన్, న్యాయ స్థానం, మ్యూజియం, నిరాహార దీక్ష బ్యానర్లు,

కరపత్రాలు, విలీన దేశాలు, దద్దమ్మ, జేబు, సముద్రం, పత్రహరితం, భూమి, మెదడు మొబైల్, లాల్చీ, రిఫరెన్స్, కార్మికులు, కర్షకులు, గుమాస్తాలు, అధికార్లు, కళాకారులు, కూలీ, తోరణం, దేశం, తలలు, మొండాలు, కుర్చీ, దర్శకత్వం, పరకట్నం, శవం, పరిశీలకులు, పరిశోధకులు, ఎలక్షన్ డ్యూటీ, టీచరు, డిగ్రీ, యూనివర్సిటీ, గురువు, సార్, కుటుంబం, సంప్రదాయం, టాయిలెట్, గుడిసెలు, పెంకుటిళ్ళు, విషసర్పాలు, క్రూరమృగాలు, రక్తనాళం, పర్వతాలు, నాయకత్వం, బీభత్సం, తప్పెట, తాళం, డప్పు, లాటరీ, లారీ, ఊదుబత్తి, రైలు, గడియారం, మంగళసూత్రం, కొండ, తిండి, శత్రువు, పోరాట వీరుడు, ఎర్రటోపి, ఖాకీటోపి, తెల్ల లారీ, రైఫిల్లు, ఎర్ర సిరా, దినపత్రిక, ఆత్మహత్య, సూర్యుడు, ఆకాశం, విస్కి, గ్లాసు, లంజా కొడకా, చెప్పు దెబ్బ, మెరుపు, యుద్ధం, బిస్కెట్, స్వేదం, రాజకీయం, ఆటలు, సినిమా, ఏక్సిడెంట్. చావుకేక, వెదవ, ఫుడ్ ప్యాకెట్స్, నమస్కారం, ఖైదీ, తల్లి, దోమ, చెరుకు రసం, పిచ్చివాడు, క్యాలెండరు, హత్య, బాంబు, అడవి, ఆఫీసు, ఫ్యాక్టరీ, బంగ్లా, కొలను, తమాషా, మడుగు, గొర్రెలు, బల్బు, కరెంటు, కిరీటం, విద్యార్థి, ఎలక్షన్, విత్తనం, ఆరోగ్యం, పాయిజెనెస్, సూదులు, అహంకారం, అత్యాశ, బల్ల, బెల్, రక్తం, రతి, నృత్యం, సంగీతం, చీకటి, జీవితం, ఖైరియత్, ఆదావరిసే, జాతకం, ఆకలి, ప్రమాదం, ఊసరవెల్లి, ఉపన్యాసం, థియేటర్, ఇంజనీర్, డాక్టర్, ఉల్లిగడ్డ, అగ్గిపుల్ల, చెమట, మెతుకు, గూర్ఖా, దారిద్ర్యం, కుళాయి, జలపాతం, సారా, గుండె, గొడుగు, చెప్పులు, ఎర్త్, ఏరియల్, రాచరికం, రాళ్ళు, రప్పలు, మత్త, కొమ్మలు, వృక్షాలు, మల్లెపూవు, జీవం, ఆవిరి, స్త్రీ, బావి, భయం, వడ్డాణం, పుస్తెరి తాడు, దుకాణం, ఉప్పు, పప్పు, కిరోసిన్, ప్రేమికులు, సైకిల్, నిరుద్యోగం, డబ్బు, అమాయకత్వం, ప్రొఫెసర్, ముత్తయిదువు, దొంగ, విప్లవం, శంఖం, ఆసుపత్రి, కసాయి, ఖూనీ, కాసు, పావురం, జెండా, నమస్కారం, ఫకీరు, రాజు, హీరోయిన్, చుట్టరికం, కులం, రోజు, బాతు మొదలైన పదాలను ఉపయోగించారు.

దేవరాజు మహారాజుగారి కవిత్వంలో కనిపించే ఆంగ్ల పదాలు, పదబంధాలన్నీ ప్రయోగం కోసం చేసిన పదజాలంగా కాకుండా ప్రజల్లో జీర్ణించిపోయిన ఆంగ్ల భాష పద భాండాగారంలోంచి వచ్చి చేరినవిగా ఉంటూ దేవరాజు మహారాజు రచనా కాలం నాటి తెలుగు భాషా స్థితిని పట్టించేవిగా ఉంటున్నాయి. ఇలాంటి పదప్రయోగం చాతుర్యాన్ని ఈయన ఒప్పుకొని రచనల్లోకి ఆహ్వానించాడు.

### 4.2.9.1. ఆంగ్ల పదాలు:

రోడ్డు, మున్సిపాలిటీ, సెక్రటేరియట్, ఇంజక్షన్, డిగ్రీ, ట్యాబెలెట్లు, మొబైల్, టీచరు, గ్లాసు, యూనివర్సిటీ, ఆఫీసు, ఎలక్షన్, సినిమా, ఇంజనీర్, ప్రొఫెసర్, హీరోయిన్, పోలీస్ స్టేషన్, ఎలక్షన్ డ్యూటి.

**4.2.9.2. ఉర్దూ పదాలు**:

కలం, కాగితం, తమాషా, ఖైదు.

**4.2.9.3. పోర్చుగీసు పదాలు**:

బిస్కత్తు, బాతు.

**4.2.9.4. తుర్కి పదాలు**:

కుర్చీ, సిరా.

**4.2.9.5. పారసిక పదాలు**:

రోజు, ఖునీ.

**4.2.9.6. పర్శియన్, అరబిక్ పదాలు**:

లాల్చి, తుపాకీ.

**4.2.10. ప్రాసల ప్రాభవం**:

కవిత్వానికి ప్రాణం పదం. అత్యంత ఆవశ్యకం అయిన ప్రాస ప్రాభవం దేవరాజు మహారాజుగారి కవిత్వంలో ఆధిక్యాన్ని కలిగి ఉంది. కవితా శిల్పంలో శైలి, అలంకారాలు, పదప్రయోగం చాతుర్యం ప్రదర్శించిన దేవరాజు మహారాజు ప్రాసల ప్రాభవాన్ని కూడా ప్రదర్శించాడు.

దేవరాజు మహారాజుగారు తన కవిత్వంలో నిర్వహణలో ఒక తూగు, ఒక లయను నిర్వహించడం కోసం ఆది, అంత్య ప్రాసల్ని వాడుకొన్నాడు.

"క్షుద్ర సంస్కృతి" గురించి మాట్లాడుతూ –

**"..... ..... ..... ..... .....**
**దేశం నిండా ప్రశాంతత**
**దేశంలో మానవతా విలువలకు ఉరిశిక్షలు**
**దేశంలో దేశభక్తులపై కాల్పులు**
**దేశం నిండా శారీరక దోపిడీలు**
**దేశం నిండా వరకట్న పిశాచం**

..... ..... ..... ..... ....." **(జీవితమే ఒక కవిత, పుట–119)**

అని అంటూ ఆది ప్రాసను పాటించి తన కవితా నిర్వహణ కావించాడు. "ఎలిజీ" అనే కవితలో ఆది ప్రాసను ప్రదర్శించాడు.

**"కేలండరు మీద పీనుగుల్ని**
**కేలండరు మీద రక్త ప్రవాహాల్ని**
**కేలండరు మీదే**
**ఆ కళ్ళు, హత్యలు, శారీరక దోపిడీలు**
**..... ..... ..... ..... ....."** **(జీవితమే ఒక కవిత, పుట–133)**

"జీవం" అనే కవితలో –

**"నీ డొక్కు కిరీటం నెత్తిన పెట్టుకోలేదని**
**నీ చెక్క పాదాలు సాగిలబడి మొక్కలేదని**
**..... ..... ..... ..... ..... .....**
**నీ అధికారం**
**నీ మర మనుషులు**
**నీ రంగుల గుడ్డా**
**నీ చచ్చిన ఎండు కట్టె**
**ఛ ఛ ఎందుకు పనికొస్తాయి చెప్పు**
**విత్తంటే నీకు తెలీకపోవచ్చు**
**విత్తంటే ఒరలో కత్తి**
**విత్తంటే టైం బాంబు**
**విత్తంటేనే మహావృక్షం"** **(జీవితమే ఒక కవిత, పుట–138)**

అంటూ ఆది ప్రాసల ప్రయోగాన్ని ప్రదర్శించాడు.

"విత్తనాలు" అనే కవితలో –

**"..... ..... ..... ..... .....**
**డిగ్రీని అలంకరించుకోబోయే తలలు**
**డిగ్రీల చిప్పలతో వరకట్నాలు అడుక్కోబోయే తలలు**
**డిగ్రీల చెప్పులరిగేదాక ఆఫీసుల మెట్లెక్కి దిగబోయే తలలు**

**డిగ్రీ అద్దం చుట్టుకొని తట్టలు మోయాల్సి వచ్చే తలలు**

**..... ..... ..... ..... ..... ....." (జీవితమే ఒక కవిత, పుట–153)**

అని అంటూ ఆది, అంత్య ప్రాసలను ప్రదర్శించడం జరిగింది.

"ప్రెస్ రిపోర్టు" అనే కవితలో

**"..... ..... ..... ..... .....**

**మానవుడి రక్తాన్ని మానవుడే రుచి చూస్తున్నాడు**

**మానవుడి విజయాన్ని మానవుడే దెబ్బ తీస్తున్నాడు**

**..... ..... ..... ..... ....." (జీవితమే ఒక కవిత, పుట–190)**

'మానవుడి, మానవుడి' అని పట్టి చూపించే తీరులో కూడా ఆది ప్రాసల్ని వినియోగించుకునే విధానం కన్పిస్తూ ఉంది.

దేవరాజు మహారాజు గారి కవిత్వంలో అంత్యప్రాసలు కూడా ఆది ప్రాసలంతటి విస్తృతిని కలిగి ఉండేవిగా ఉంటున్నాయి.

"మూగి" అనే కవితలో –

**"..... ..... ..... .....**

**ఈ కొండ మేధస్సు వలే**

**ఈ సంద్రం హృదయం వలే**

**నేను – నా జనం వలే**

**..... ..... ..... ....." (జీవితమే ఒక కవిత, పుట–121)**

అని అనటంలో దేవరాజు మహారాజు అంత్య ప్రాసల ఉపయోగాన్ని సద్వినియోగం చేసుకొన్నాడనిపిస్తుంది.

"తెల్లవారాక" అనే కవితలో –

**"రాజకీయాలు**

**ప్రణాళికలు**

**మంత్రుల ప్రయాణాలు**

**ప్రకటనలు – ఖండనలు**

**ఏక్సిడెంట్లు, ఆటలు, సినిమాలు**

**అదృష్ట జాతకాలు**

**చురుకుగా చాలా తేలికగా**
**ప్రసారం చేసే**
**పత్రికల నిండా**
**ఆ రాత్రి తుఫాను తర్వాత**
**బాగా నాని ఉబ్బిన**
**అక్షరాల శవాలు"** **(జీవితమే ఒక కవిత, పుట–125)**

అని అంటూ "రాజకీయాలు, ప్రణాళికలు, ప్రయాణాలు, ఖండనలు, సినిమాలు, జాతకాలు" వంటి పదాలతో అంత్యప్రాసను ఘటించాడు.

"అడుగుల కింద" అనే కవితలో –

**"వాళ్ళ బాల్యాన్ని**
**బ్రేక్ఫాస్ట్గా తీసుకుని**
**వాళ్ళ యవ్వనపు రక్తాన్ని**
**లంచ్ ఆరగించి**
**..... ..... ..... ....."**

**(గాయపడ్డ ఉదయం, పుట – 33)**

"చర్య" అనే కవితలో –

**"..... ..... ..... .....**
**ఈ మెలకువలో ఎంత చైతన్యం**
**రాత్రంతా వెలుగుతూ బతకడం**
**ఈ విత్తనం మొలకెత్తడం**
**విచ్చుకుంటున్న పొరల్ని – వినడం**
**శబ్దాల్ని – గమనించడం**
**ఉదయానికిది తెల్లని మొలకైతే**
**దీన్నే కవిత్వమనడం**
**ఈ మెలకువలో ఎంత చైతన్యం**
**రాత్రిలో కూడా రగులుతూ ఎదగడం"** **(జీవితమే ఒక కవిత, పుట–155)**

అని అనటంలో "ఏకాక్షర" ఘటిత అంత్యప్రాస పాటింపబడింది. "అడుగుల కింద" కవితలో, "న్ని, ని", 'మొక్క' కవితలో "దం"ను తీసుకొని 'ఏకాక్షర' అంత్యప్రాసను పాటించడం జరిగింది.

"ప్రిస్క్రిప్షన్" అనే కవితలో –

**"ఊపిరి గట్టిగా పీల్చి వదలమన్నాడు**
**గుండె దెబ్బలు చెవుల్లోకి విన్నాడు**
**లైటు వేసి నోరంతా గాలించాడు**
**కనురెప్పలు విప్పి చూశాడు**
**నాడి చూశాడు వేడి చూశాడు**
**ప్రిస్క్రిప్షన్ రాస్తూ**
**..... ..... ..... ..... ....."**

**(గాయపడ్డ ఉదయం, పుట–37)**

అని అంటూ అంత్యప్రాస ప్రాధాన్యంగా గాయపడ్డ ఉదయం కవితను నడిపించాడు.

"ప్రణాళిక" అనే కవితలో

**"థియేటర్లో సినిమాలు మారుతున్నాయి**
**తెరమీద దృశ్యాలు మారుతున్నాయి**
**దేశంలో ప్రభుత్వాలు మారుతున్నాయి**
**రోజులు, నెలలు, సంవత్సరాలు మారుతున్నాయి"**

**(జీవితమే ఒక కవిత, పుట–152)**

అని అంటూ అంత్యప్రాసను పాటించి కవిత నిర్వహణ కావించాడు.

"నాలో ఒక రాత్రి" అనే కవితలో –

**"పగలు రాత్రిలో మునిగిపోయింది**
**వీధంతా వర్షంలో నిద్రపోయింది**
**మూలలు కనబడని గదికి**
**ఒక ఆకారం లేకుండా పోయింది"** **(జీవితమే ఒక కవిత, పుట–158)**

"ఒట్టు" అనే కవితలో –

**"ఈ కన్నీటి చుక్కను జీవితం అను**
**ఈ ఆకలి మంటను అనుభవం అను**

**ఈ అసమర్థతను ఓపిక అను**

**ప్రమాదం లేదు, కానీ...**

**..... ..... ..... ..... ....."** **(జీవితమే ఒక కవిత, పుట–151)**

అని అంటూ అంత్యప్రాసనే వాడుకొన్నాడు ఈ కవి.

"నీరు" అనే కవితలో –

**"..... ..... ..... ..... .....**

**జలజలా పారుతుంది**

**ఘనీభవిస్తుంది**

**ఆవిరై గాలిలా అదృశ్యమౌతుంది**

**మళ్ళీ భోరున వాన కురుస్తూంది**

**పత్రహరితపు చిగురవుతుంది**

**విరగ కాచి ధాన్యమవుతుంది**

**అన్నమవుతుంది**

**స్త్రీ ఎన్నో రకాలుగా రూపాంతరం చెందుతుంది**

**..... ..... ..... ..... ..... ....."** **(జీవితమే ఒక కవిత, పుట–177)**

అంటూ అంత్యప్రాస ప్రయోగాన్ని ప్రదర్శించాడు. కొన్నిచోట్ల దేవరాజు మహారాజుగారు తన కవితలో చమత్కారమైన అంత్యప్రాసల్ని చూపెట్టడం జరిగింది.

"మేఘం" అనే కవితలో –

**"జన సముద్రంలోని**

**సమస్యల ఆవిర్లను పోగుచేసుకుని**

**నల్లబడి, చల్లబడి, విశ్లేషించుకుని**

**..... ..... ..... ..... .....**

**రచయిత**

**భూమిమీద నీటి చుక్క వలే**

**ప్రతి మెదడులోను యింకిపోతున్నాడు"**

**(గాయపడ్డ ఉదయం, పుట–10)**

అంటూ ప్రతి పాదం చివర 'ని' ను ఆవృతిని చేస్తూ 'సముద్రంలోని, పోగుచేసుకుని, విశ్లేషించుకుని', అనే పదాల్ని చమత్కారంగా ప్రయోగించాడు దేవరాజు మహారాజు.

దేవరాజు మహారాజు కొన్ని సందర్భాలలో అంత్యప్రాసను రూఢ్యర్థిక అవ్యయంలో ప్రయోగించాడు.

"మూగి" అనే కవితలో –

**"..... ..... ..... .....**
**మౌనంగా మాట్లాడుకోగలవాణ్ణి**
**నాకు నేను, నేను నాకే**
**మౌనంగా మాట్లాడ గలవాణ్ణి**
**ఒకేసారి విడివిడిగా**
**కోట్ల మనషుల్తో కోట్ల మనషుల్లా**
**మాట్లాడగలవాణ్ణి**
**..... ..... ..... ....."** **(జీవితమే ఒక కవిత, పుట–121)**

అని అంటూ ఒక పాదం వదిలి మరొక పాదాంతంలో 'మాట్లాడ గలవాణ్ణి' అంటూ అంత్యప్రాసను పాటించాడు దేవరాజు మహారాజు.

దేవరాజు మహారాజుగారి కవిత్వంలో ఇలా ఆది, అంత్యప్రాసల వినియోగం కవితా నిర్వహణలో రమణీయమైన శైలి కోసం కల్పించబడిందిగా కనిపిస్తుంది. సరళతను, స్పష్టతను, నిరాడంబరతను నింపుకొన్న దేవరాజు మహారాజు కవిత్వం ఆలంకారికంగా, మరొక సందర్భంలో స్వభావోక్తిలో కొనసాగినది. ఆయా సందర్భానుసారంగా ప్రాసల ప్రాభవంలో కొంత ఊపును సంతరించుకుంది.

ఈ తీరులో కొనసాగిన దేవరాజు మహారాజుగారి కవిత్వం పదప్రయోగ చాతుర్యంలోనూ, అలంకారాలతోనూ, శైలిలోనూ, ప్రాసల ప్రాభవంలోనూ అలరారింది.

ఇదే దేవరాజు మహారాజుగారు తన కవిత్వంలో ప్రదర్శించిన శైలీ శిల్పం.

### 4.2.11. మాండలిక పదాలు:

భాషకు మార్పు సహజం. మారుతున్న కాలాన్ని బట్టి భాషలో మార్పు వస్తుంది. ప్రజల వ్యవహారంలో నియమనిబంధనలు లేని సులభమైన సువ్యక్తమైన వాగ్రూప వ్యవహార లక్షణం కలిగించేదే మాండలిక భాష. దేవరాజు మహారాజుగారి రచనలలో వ్యవహారిక భాష ప్రధానంగా

కనిపించినప్పటికి అక్కడక్కడ నల్లగొండ జిల్లా మాండలిక భాషాపదాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే దేవరాజు మహారాజు నల్లగొండ జిల్లా ప్రాంత వాస్తవ్యుడు కాబట్టి.

| | | | | |
|---|---|---|---|---|
| 1. | అర్ర | = | గది | (జీవితమే ఒక కవిత, పుట–231) |
| 2. | ఆసన | = | వాసన | (జీవితమే ఒక కవిత, పుట–217) |
| 3. | కమస్కం | = | కనీసం | (జీవితమే ఒక కవిత, పుట–241) |
| 4. | కుతిక | = | గొంతు | (జీవితమే ఒక కవిత, పుట–219) |
| 5. | కోసరం | = | కోసం అనే అర్థంలో వాడబడే చతుర్థీ విభక్తి | (జీవితమే ఒక కవిత, పుట–238) |
| 6. | గోరీలు | = | సమాధులు | (జీవితమే ఒక కవిత, పుట–222) |
| 7. | జాగ | = | స్థలం, చోటు | (జీవితమే ఒక కవిత, పుట–222) |
| 8. | జెర్ర | = | కాసేపు | (జీవితమే ఒక కవిత, పుట–247) |
| 9. | తెర్లు | = | ఆగం, నాశనం | (జీవితమే ఒక కవిత, పుట–220) |
| 10. | దవాఖానా | = | ఆసుపత్రి | (కడుపు కోత, పుట–01) |
| 11. | దూప | = | దప్పిక, దాహం | (జీవితమే ఒక కవిత, పుట–224) |
| 12. | నిమ్మలంగ | = | నిదానంగా | (జీవితమే ఒక కవిత, పుట–222) |
| 13. | పసురం | = | పశువు | (జీవితమే ఒక కవిత, పుట–222) |
| 14. | పనాలిక | = | ప్రణాళిక | (జీవితమే ఒక కవిత, పుట–234) |
| 15. | పీన్గ | = | శవం | (జీవితమే ఒక కవిత, పుట–220) |
| 16. | పొక్క | = | రంధ్రం | (జీవితమే ఒక కవిత, పుట–243) |
| 17. | పొంటి | = | వెంట | (జీవితమే ఒక కవిత, పుట–232) |
| 18. | బువ్వ | = | అన్నం | (జీవితమే ఒక కవిత, పుట–221) |
| 19. | మునుపు | = | పూర్వం | (జీవితమే ఒక కవిత, పుట–219) |
| 20. | యాది | = | గుర్తు, మది | (జీవితమే ఒక కవిత, పుట–223) |
| 21. | రగతం | = | రక్తం, నెత్తురు | (జీవితమే ఒక కవిత, పుట–224) |
| 22. | రొచ్చు | = | బురద | (జీవితమే ఒక కవిత, పుట–223) |
| 23. | రేజరు పత్తులు | = | బ్లేడు | (జీవితమే ఒక కవిత, పుట–233) |

24. సొటుంగ = చాటుగ (జీవితమే ఒక కవిత, పుట–223)

25. సెల = చెరువుల (జీవితమే ఒక కవిత, పుట–227)

### 4.3. కథా శిల్పం:

#### 4.3.1. దేవరాజు మహారాజు కథలు – పాత్రచిత్రణ:

ఒక వ్యక్తి జీవితంలోని ఏదో ఒక సంఘటనను సహజంగా పాత్రల ద్వారా వ్యక్తం చేయడమే పాత్రచిత్రణ అని తెలుస్తుంది. వస్తు నిర్వహణకు ప్రాణం తెచ్చి జీవం పోసేది పాత్రచిత్రణ. వస్తువుని పాఠకుడికి అందించడానికి దోహదం చేసేది పాత్రచిత్రణ. వాస్తవిక సంఘటననే కథలుగా రూపొందించిన దేవరాజు మహారాజు కథల్లో పాత్రల వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవిక జీవితంలోని పాత్రలకు కల్పనలు జోడించి కథలను వాస్తవికంగా, కళాత్మకంగా చిత్రించే ప్రయత్నం చేశారు. ఈయన కథల్లో పాత్రలు సామాన్యుల జీవిత పాత్రలు, దొరల పాత్రలు, స్త్రీల పాత్రలు కనిపిస్తాయి. పాత్రలన్నీ సహజంగా, పాత్రోచితమైన భాషా ప్రయోగాలతో సంఘటనానుకూలంగా చిత్రించబడ్డాయి.

#### 4.3.2. పాత్ర చిత్రణ – నిర్వచనాలు:

ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క మానసిక స్వభావం, విశిష్టమైన వ్యక్తిత్వం, ఆలోచనా ధోరణులు ఉంటాయి. అవి ఎదుటివారికి నచ్చేలా ఉండొచ్చు. ఉండకపోవచ్చు. వారి ప్రవర్తన, ఆలోచనల ఆధారంగా వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తాం. కథల్లో రకరకాల పాత్రలు చిత్రిస్తుంటారు. సమాజంలో భిన్న వ్యక్తుల స్వభావాలను చూసి ఆ పాత్రలను కథల్లో ప్రవేశపెడతారు అనిపిస్తుంది. సమకాలీన సమాజాన్ని అందులోని వ్యక్తుల జీవితాలను కథా వస్తువులుగా స్వీకరించినప్పుడు ఆయా కథల్లోని పాత్రలు అత్యంత సహజంగా వాస్తవిక జీవితానికి దగ్గరగా ఉన్నట్లు చిత్రించబడతాయి. రచయిత చెప్పాల్సిన విషయాన్ని పాత్రలపై ఆరోపించి ఆ పాత్రల ప్రవర్తనల ద్వారా పాఠకుడికి చేరవేయడం జరుగుతుంది.

“కథను నడిపించేవారు, కథా వస్తువును భరించేవారు, కథాంశాన్ని సూచించే వారు పాత్రలు”[60] అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య వివరించారు.

కథలో రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని పాత్రల ద్వారా వ్యక్తపరుస్తాడు. కథల్లో పాత్రలు కథాగమనానికి, రచయిత అందించాల్సిన విషయానికి తగ్గట్టుగా ప్రవర్తిస్తుంటాయి. ఒక సంఘటన, ఒక సన్నివేశంలో పాత్ర ఏయే సంఘర్షణలకు గురి కావాలో ఆయా సంఘర్షణలకు

[60] వల్లంపాటి వెంకటసుబ్బయ, కథా శిల్పం, పుట–25.

గురవుతుంటుంది. సంఘర్షణలకు గురి కాని పాత్రలు, సాధారణ జీవితాన్ని ఆశించే పాత్రలు కథలో ఉండి కూడా లాభం లేనట్లే అవుతుంది. కాబట్టి కథకుడు చెప్పదలచుకున్న విషయానికి అనుగుణమైన పాత్రలు ఉండాలి. ఆ పాత్ర లక్షణాలు, ప్రవర్తనలు కథాంశాన్ని పట్టించేలా ఉండాలి. అప్పుడే ఆ కథకు తగ్గ పాత్రను రచయిత ఎన్నుకున్నట్లు అవుతుంది. పాత్రను గురించి పోరంకి దక్షిణామూర్తి ఈ కింది విధంగా అన్నారు.

"ఒక రచనలో తన స్వాభావిక లక్షణాలను మాటల్లోగాని, చేతలతోగాని వ్యక్తం చేయు వ్యక్తిని పాత్ర అంటారు"[61].

రచనలో చిత్రించబడే వ్యక్తి తన భావ ప్రకటనను హావభావాలతో వ్యక్తం చేయాలి. ఆ వ్యక్తి మాటలు, చేష్టలు అతని లక్షణాన్ని పట్టించే విధంగా రచయిత పాత్రలను చిత్రించాలి.

**4.3.3. పాత్రలు**:

1) రాములమ్మ, 2) వెంకట్రాములు, 3) మల్లేశు, 4) పోశాలు, 5) యాదవరెడ్డి, 6) విశ్వనాథం, 7) సిద్ధార్థ, 8) మల్లమ్మ.

**4.3.3.1. రాములమ్మ (అంతరం కథ):**

వ్యక్తులు, కుటుంబాల స్థాయి నుంచి అంతరాలు ఉండడం, సంఘర్షణ ఆ స్థాయిలో కొనసాగడం అనివార్యం. ఆ సంఘర్షణ ఒక రూపం తీసుకోవడమనేది కూడా అనివార్యమే. అదే ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమైతే అన్నదమ్ముల మధ్య, తండ్రీ కొడుకుల మధ్య సంఘర్షణ నిరంతరం ఏదో ఒక స్థాయిలో కొనసాగుతూనే ఉంటుంది. నిన్నలా నేడుండదు. నేటిలా రేపుండదనే తాత్వికమైన ఆలోచనాధారకు సజీవ రూపమే అంతరం కథ. తన కన్న కొడుకుల మధ్య, ఆ కొడుకు కొడుకుల మధ్య పెరుగుతున్న అగాధాలపై రాములమ్మ అనే వృద్ధ మహిళ వేదనాభరితమైన జీవితమే ఈ కథ ఇతివృత్తం.

అంతరం కథలో పెద్దులు తల్లి రాములమ్మ. ఈమె వారి వంశకర్త్రి, కథానాయిక కూడా! ముందు మూడు తరాలకు రాములమ్మ వంశవృక్షపు కాండం లాంటిది. ఈమె గమనించిన తరాల స్వభావాలే ఈ కథలో వ్యాఖ్యానించబడతాయి. కుటుంబ సభ్యుల మధ్య మమతానుబంధాలు సన్నగిల్లడం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం ఈ విషయాలను ప్రస్తావిస్తుంది.

"తన అత్తమామల స్థానంలో తను ఉంది, రేపు తన స్థానంలో కొడుకైన వెంకటేశ్ వస్తాడు" అనుకుంటుంది రాములమ్మ కోడలు యాదమ్మ. అప్పుడు కాలచక్రం ఇరుసులో పడి "తరం"

[61] పోరంకి దక్షిణామూర్తి, కథానిక స్వరూప స్వభావాలు, పుట–246.

తర్వాత "తరం" నలిగిపోతున్నట్లనిపిస్తుంది. ఆ కుటుంబం రెక్కాడితే గాని డొక్కాడని దారిద్ర్య రేఖకు కింది స్థాయిలోనిదే. మొండి గోడల పై నుండి లోనికి వచ్చిన మనుమరాలు సరోజన – నాయనమ్మ రాములమ్మను లేపి, మెల్లగా నడిపించుకుంటూ వచ్చి, చింత చెట్టు మొదట్లో కూర్చోబెడుతుంది. ఇది మనకు ప్రతీకాత్మకంగానే అనిపిస్తుంది. "రాతెండి సర్వతో నీళ్ళు పెట్టింది. 'చాయ' తాగమంటుంది.

"రాములమ్మ నిటారుగా ఉన్నా కాండానికి ఆనుకుని, తలెత్తి చూచింది. కొమ్మలు రెమ్మలుగా అల్లుకొంది. నేలలోని వేర్లు అంతే. ఆ చెట్టు తనే అనుకుంటుంది. తన వెనకటి తరాల తాత ముత్తాతలకు, ముందు తరాల మనుమలు ముని మనుమలకు మధ్య వారధి తానే"[62] అన్నట్లు భావిస్తుంది. రాములమ్మలోనుంచి ఉబికిన భావాలు, జీవితాన్ని తరాల స్వభావాలను రచయిత చక్కగా అన్వయించారు.

ఎక్కడి కక్కడ కుటుంబాలు, కుటుంబాలుగా విడిపోతున్నాయి. మనిషికి మనిషికి మధ్య అంతరపు గోడలు లేస్తున్నాయి. ప్రేమలు, ఆప్యాయతలు సమూలంగా నాశనమవుతున్నాయి. ఈ పరిణామాన్ని వివరిస్తూ "ఒక చేతి వేళ్ళలాగా పుట్టి పెరిగారు. చివరకు వేళ్ళూడిపోయిన కుష్టివాడి అర చేయిలాగా చేశారు సంసారాన్ని. చివరకు కుండ బద్దలయ్యింది. కుర్రాళ్లు విడిపోయాయి. తడికలతో, అడ్డుగోడలతో ఇల్లు ఇరుకయ్యింది. బయట పొలం ముక్కలయింది. ఎంతైనా ఒక రక్తం నాయినా, పాశిపోవద్దు. కలిసిమెలిసి ఒక్క పట్టుండాలే"[63] అనే రాములమ్మను కుటుంబపు చెట్టు కాండంగా, కొడుకుల్ని వారి సంతానాన్ని కొమ్మలుగా, రెమ్మలుగా పోల్చి, చివరగా కొమ్మల్ని నరుకుతున్న గొడ్డళ్ళ చప్పుళ్ళు రాములమ్మకు వినిపిస్తున్నట్టు – చెప్తారు. ఇలా అంతరం కథను సున్నితంగా ఒక సన్నని తీగపై నడుపుతూ ముగిస్తారు.

### 4.3.3.2. వెంకట్రాములు (ఓటు విలువ కథ):

మనిషి జీవితంలో ఎదురయ్యే సంఘటనలకు, పరిణామాలకు విపరీతంగా స్పందించే ప్రభావం ఏమేరకు ఉందో 'ఓటు విలువ' కథ చెబుతుంది. స్వార్థ రాజకీయ శక్తులు, స్వప్రయోజనాభిలాషులు, సామాన్య జీవితాలతో ఆడుకుంటున్న ఆటలను, వాళ్ళకు తోటివాని బతుకు పై పేరుకుపోయిన నిర్లక్ష్య వైఖరులను తెలిపే ఒక విషాద ఘటన ఇది. "ఓటు కోసం సచ్చే ముసలోన్ని లేపొక్చినారు. ఈడుమల్ల ఆని బాయికాడికి ఎట్లా జెరాలే ఏం కత"[64] ఆ ముసలి

[62] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–195.

[63] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–181.

[64] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–182.

రైతును మళ్ళీ అతని బావి దగ్గర గుడిసెకు చేర్చే పట్టింపు ఎవ్వరికీ ఉండదు. "వెంకట్రాములు ప్రాణంలాగా నేల మీద నీళ్ళు ఇంకిపోతుంటాయి. బతుకులాగా భూమంతా తడిసి పచ్చి ముద్దవుతుంది"[65] వెంకట్రాములును ఓటు వేయడానకి బలవంతంగా తీసుకొచ్చి శిలువ ఎక్కినట్లు అనిపిస్తుంది.

అనారోగ్యంతో ఉన్న ముసలి బీదవాణ్ణి రప్పించి ఓటు వేయించుకున్న పెత్తందారు మరి పట్టించుకోడు. వెంకట్రాములు వానకు, చలికి తట్టుకోలేక ఆ రాత్రి పోలింగ్ బూతులోనే కడతేరుతాడు. అతడు చనిపోతేనేం తనకు వేసిన ఓటు బతికి ఉంది అన్నది కఠోర వ్యంగ్యం.

### 4.3.3.3. మల్లేశు (పేరులేని కథ):

చిన్న టీ కొట్టులో పనిచేసే మల్లేశు అతి పెద్దైన ఐదు నక్షత్రాల "హోటల్ ఆకాశ్"ను చూడాలనుకుంటాడు. హోటల్ పై నుంచి చూస్తే కింద వెళ్ళే కార్లు బొమ్మ కార్లలాగా కనబడటం, పట్టణమంతా అద్భుత దృశ్యంగా కనబడుతుందని కిష్టయ్య చెప్పడంతో ఆ కోరిక తీర్చుకోవాలనుకుంటాడు. కిష్టయ్య సాయంతోనే హోటల్ పై అంతస్థుకు చేరుకుంటాడు మల్లేశు.

ఒక జంట తమ కూతుర్ని నడిపించుకుంటూ వస్తుంటే పాప జారి కింద పడబోతుంది. మల్లేశు అయ్యో అనుకునేంతలోనే పాప అమ్మా నాన్న చెరో చెయ్యి పట్టుకుని ఎత్తేస్తారు. ప్రమాదం తప్పిన పాప హాయిగా నవ్వేస్తుంది. అమ్మా నాన్నలేని మల్లేశు తనక్కూడా "గసోటోల్లుంటే ఎట్లుండేదో" అనుకుంటాడు కామాంధుల చేతిలో మోసపోయిన అమ్మాయిలు గత్యంతరం లేక, ఏ రోడ్డు పక్కో చెత్త కుండిలోనో పడేసిన అనాథ బాలలు వీధి కుక్కల బారి పడకుండా, దిక్కు దివాణం లేక చిన్న చిన్న రెక్కలతోనే పెద్ద పెద్ద పనులు చేస్తూ పొట్ట పోసుకునే దృశ్యం కనిపించని పట్టణం ఉండదేమో!

సృష్టిలో ఏ ప్రాణి తన జీవితాంతం మరో ప్రాణిపై ఆధారపడదు. కాని ఒక్క మనిషికి మాత్రమే జీవితాంతం మరొకరి పైన ఆధారపడే మనస్తత్వం అలవడింది. మనిషి బుద్ధి జీవి కావడమే అందుకు కారణమై ఉంటుంది. హోటల్ ఆకాశ్లో గుర్కా మొదలుకొని బాయ్లు వరకు నమస్కారాలు పెట్టి డబ్బులు కళ్ళచూడ్డంతో తనుకూడా టీ కొట్టు వదిలేసి, మంచి హోటల్ వెతుక్కొని ఎక్కువ డబ్బులు సంపాదించాలని మంచిగా బతకాలనే ఆశ మల్లేశులో కలుగుతుంది. ఆ ఆశను బతికించుకునేందుకు నకనకలాడే ఆకలి – కడుపులో తిప్పుతున్నా, నీరసం ముంచుకొస్తున్నా హోటల్ ఆకాశ్ను చూడటం మాత్రం ఆపలేదు. మేడ పైన అడ్డదిడ్డంగా పడ్డ

---

65 దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–182.

కరెంట్ తీగలు యమపాశాల్లా మల్లేశు కాళ్లను బంధించి పడేస్తాయి. తన కలల సౌధం నుండి జారిపడిన మల్లేశు, చివరికి రక్త మాంసాల ముద్దలా మారతాడు.

### 4.3.3.4. పోశాలు (పొడవని పొద్దు కథ):

పోశిగా అని అందరూ పిలిచే పోశయ్యకు ఎనిమిదేళ్లు నిండాయి. నల్లగా, పీలగా ఉంటాడు. వాడికి ఊరు, ఊర్లోని మనుషులన్నా, అడవిలోని పశువులు చేన్లు బాగా పరిచయం. ఇలాంటి పోశయ్యలు మన దేశంలోని గ్రామాల్లో చాలా మందే ఉంటారు. పసిప్రాయంలోనే చదువు సంధ్యలు లేకుండా బానిసత్వంలో మగ్గిపోతూ, జీవితాన్ని తోడుకునే వాళ్ళ గూర్చి చెబుతూ రచయిత వారి గుండెల్లో డప్పు మోగిస్తారు. చదువుకోవాలనుకునే తపనను ప్రేరేపిస్తారు. అందువల్ల చివరకు పోశయ్య "పొడిచే పొద్దు" కోసం ఎదురు చూస్తాడు. బళ్ళో చదువుకునే చదువు కన్నా బతుకు నేర్పే చదువు గొప్పదని వాడికి అర్థమవుతుంది.

బర్లు గాసే పోరనికి బడికి బోవాలనే ఆరాటం ఎట్లాంటుందో దాని కోసం వాడు పడే తిప్పలు వర్ణించబడ్డ కథ "పొడవని పొద్దు." ఆ ఆలోచన రావడమే తప్పనుకునే తల్లిని, తాతను మెప్పించ లేకపోయిన, వాడిలో (పోశాలు) ఆ ఆలోచన అంకురించడం ఇందులో ముఖ్యం. ఇందులో పల్లెటూరి వాతావరణం కళ్లకు కట్టినట్లు చూపించాడు రచయిత.

### 4.3.3.5. విశ్వనాథం (బతుకు ఫ్యాను కథ):

విశ్వనాథం ప్రైవేట్ స్కూల్లో టీచరుగా పని చేస్తుంటాడు. వాళ్ళు నాలుగు వందల రూపాయలు పైన సంతకం చేయించుకుని రెండు వందల రూపాయలు అతనికిస్తారు. రెండేళ్ల నుంచి అదే ఉద్యోగం చేస్తున్నా, ఎదుగూబొదుగూ లేని జీతం, చాలీ చాలని జీతంతో రోజులు వెళ్ళదిస్తుంటాడు. టేబుల్ ఫ్యానుతో తన జీవితాన్ని పోల్చి చూసుకొంటూంటే కొంత సేపటికి అది ఆగిపోతుంది. ఫ్యాను సమ్మె చేసిందని భావిస్తాడు. ఏదో సందేశం ఫ్యాను తనకు అందించినట్లుగా దృఢ మనస్కుడవుతాడు.

తన లాంటి పరిస్థితి తనొక్కడికే కాదు. తన లాగా చాలామంది టీచర్లు ఆఫీసు గుమాస్తాలు, ప్యూన్లు, స్వీపర్లు ఆ స్కూల్లో పనిచేసే అందరి పరిస్థితి అలాగే ఉంది. అలాంటప్పుడు పాఠశాల యాజమాన్యం పైన సిబ్బంది అంతా ఐక్యమత్యంగా కలిసి తిరగబడినప్పుడు యాజమాన్యం తమ డిమాండ్లను పట్టించుకోక తప్పదనే అవగాహన కలుగుతుంది. యంత్రమే పని చేయనంటూ నిలిచి పొగలు గక్కుతున్నప్పుడు మెదడు ఉండి ఆలోచించగలిగిన తమకు సమ్మె చేసే శక్తి తప్పక ఉందని

గ్రహిస్తాడు. బాధపడుతూ కూర్చోవడం కంటే సమ్మె చేయాలనే సంకల్పంతో ముందుకు అడుగేస్తాడు.

### 4.3.3.6. యాదవరెడ్డి (జీవిత పోరాటం కథ):

యాదవరెడ్డి అంతరంగ మధనంలో తనలోని బలహీనతల్ని జయించి, అతలాకుతలం అవుతున్న సమాజం చేస్తున్న జీవన పోరాటంలో భాగస్వామి కావడం "జీవిత పోరాటం" ఇతివృత్తం.

యాదవరెడ్డి పత్రికాఫీసులో విలేకరిగా పని చేస్తుంటాడు. ఉద్యోగ ధర్మం అంటూ పత్రికలు చిత్తశుద్ధి లేకుండా ఎవరేం చెబితే వాటిని ప్రచురించే దాక పత్రికలుగా కాకుండా, ప్రజలకు నిజాలను వెల్లడించే నిజమైన పత్రికలాగా ఉండాలన్న సంకల్పంతో ఆత్మస్థైర్యంతో కర్తవ్య నిర్వహణ కోసం ముందు అడుగేస్తాడు.

జర్నలిస్ట్ యాదవరెడ్డి బస్సుకు వేలాడుతుంటాడు. బతుకు వేలాడుతున్నట్టు! ఆయనకు బద్ధకంగా కూర్చొని లంచాలు నెమరేస్తున్న ఒక ఆఫీసు, రోగుల్ని పట్టించుకుని పీక్కుతింటున్న ఆసుపత్రులు, మేధావులు ప్రశ్నలు వేయకుండా కూచోబెట్టి వేల జీతాలిచ్చే యూనివర్శిటీలు కనిపిస్తుంటాయి. పత్రిక ఆఫీసు ఉద్యోగం ఆయనకు జైల్లో బంధించినట్టు అనిపిస్తుంది. కాలం కడుపు మీద పెట్టబడుతున్న చురకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జనానికి నిజాల్ని చూపాలి. అయితే తనూ తనలాంటి వాళ్ళు నిజాల్లోకి దిగకుండా, అడ్డుకునే అద్దాల దగ్గర, కిటికీల దగ్గర ఆగిపోకూడదు అని అనుకుంటాడు.

పత్రికాఫీసు ఉద్యోగంలో అబద్దాలకు పాలిష్ కొట్టి అమ్ముకునే పత్రికలకు విరుద్ధంగా జనానికి సరైన అవగాహన కలిగించే విధంగా, తను, తన తోటివాళ్లు ప్రయత్నించడం కనీస కర్తవ్యంగా యాదవరెడ్డి భావిస్తాడు.

### 4.3.3.7. సిద్ధార్థ (ఓటరు శరణం గచ్ఛామి కథ):

సిద్ధార్థుడు శ్రీమతి యశోధరను కాన్వెంటులో చేరిన రాహుల్ను విడిచి, ఒకనాటి అర్థరాత్రి ఇల్లు విడిచి అడవుల్లోకి వెళ్లాడు. ముక్తి కోసం కాదు. పీడిత జన విముక్తి కోసం. సన్యసించటానికి కాదు, సంఘర్షించటానికి అని కథను ముగించబోతూ సిద్ధార్థుడు తిరిగి వచ్చి ఓట్లు అడుక్కుంటూ దేశం నలుమూలలా తిరుగుతాడు.

సిద్ధార్థుని కథను ఆధునిక రాజకీయ వ్యంగ్య చిత్రంగా మలిచారు.

### 4.3.3.8. మల్లమ్మ (పాలు ఎర్రబడ్డాయి):

ఈ కథలో కథా నాయిక మల్లమ్మ. కుటుంబ పోషణ కోసం పడరాని కష్టాలు పడుతుంది. కుటుంబం గడవడం కష్టంగా మారిన సమయంలో తన కూతుళ్లు పనిచేసే ఇంటి యజమానురాలు చంటి పిల్లాడి కోసం తన చంటిదాన్ని పాలివ్వకుండా డబ్బుల కోసం పాలివ్వడానికి ఒప్పుకుంటుంది. వచ్చిన డబ్బుతో తన ఇద్దరి బిడ్డల పెళ్లిళ్లు, కిట్టుగాడికి చదువు, తన భర్తకు మందులు తీసుకోవచ్చు అని అనుకుంటుంది. ఆమె దగ్గర పాలెన్ని ఉన్నాయో అంతకు పది రెట్లు కన్నీళ్లు ఉన్నాయి. ఈ కథలో పేదవారు ఏ విధంగా కష్టాలు పడ్డారో, వారికి ఎదురయ్యే సంఘటనల గురించి చాలా చక్కగా వివరించారు రచయిత.

## 4.4. నవలా శిల్పం:

'నవల'కు అలంకార శాస్త్రం లేదు. అలంకార శాస్త్రం లేకపోవడం సాహిత్య ప్రక్రియగా నవలకున్న గొప్పదనంగా కూడా భావించవచ్చు. భారతీయ అలంకార శాస్త్రం ఏర్పడి నియమాలను ఉల్లంఘించడానికి వీలులేని సూత్రాల సంపుటిగా తయారయ్యాక సాహిత్యానికి ఎంత అపకారం జరిగిందో మన సాహిత్య చరిత్ర చెబుతుంది. కావ్య వస్తువు, నిర్మాణం, శిల్పం, నాయకులు, నాయికలు చివరకు దూతికలు, వర్ణనలు మొదలైన అన్ని అంశాలలోనూ అలంకార శాస్త్రం ఉల్లంఘించడానికి వీలులేని సూత్రాలను రూపొందించింది"[66] అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య నవలకు అలంకార శాస్త్రంలో పనిలేదని, నవలా ప్రధానాంకాలలో అలంకార శాస్త్రం ఉల్లంఘించబడిందని తెలిపారు.

పింగళి లక్ష్మీకాంతం నవలావిర్భావాన్ని గూర్చి తెలుపుతూ "ప్రపంచమున ఈ నవల యొక్క ఆవిర్భావము అధునాతనముగానే కానవచ్చుచున్నను, దాని ఇప్పటి రూప పరిణతికి పూర్వము అనేక దశలు గడిచినవి"[67] అని అన్నారు.

### 4.4.1. నవల పద ఆవిర్భావం:

'నావెల్' అనే పదానికి కొత్తదనే అర్థం. సంస్కృతంలోని 'నవ' అనే పదానికి సమానార్థకంగా తెలుస్తుంది. "నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవల"[68] అన్న వ్యుత్పత్తి అర్థాన్ని నావెల్ నవల పదానికి సాధించి కాశీభట్ట బ్రహ్మయశాస్త్రిగారు 1897లో రాజశేఖర చరిత్ర విమర్శ గ్రంథం పీఠికలో చెప్పారు".

[66] వల్లంపాటి వెంకటసుబ్బయ్య, నవలా శిల్పం, పుట–08.

[67] పింగళి లక్ష్మీకాంతం, సాహిత్య శిల్ప సమీక్ష, పుట–09.

[68] కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, రాజశేఖర చరిత్ర విమర్శ – పీఠిక, పుట–04.

తెలుగు సాహిత్యంలో 1872లో మొదటి నవల, 1878లో రెండవ నవల రాయబడ్డాయి. ఆ తరువాత మూడవ నవల రావడానికి 15 సంవత్సరాలు పట్టింది. ఇలాంటి సందర్భంలో పత్రికల్లో పోటీలు పెట్టి ప్రోత్సహించడం వల్ల విరివిగా నవలా రచనలు వచ్చాయి. అయినా పై విషయాన్ని 1928లో కె. వెంకట నారాయణరావు "సాహిత్య విమర్శకులకు ఈ నవలా ప్రక్రియ సాహిత్య లోకంలో నిలుస్తుందో లేదో అని సంశయం ఉన్నట్లుంది"[69] అని తెలిపాడు.

### 4.4.2. నవల నిర్వచనం:

'నవల' అనే పదం 'Novel' అనే ఆంగ్ల పదం నుండి తెలుగులోకి వచ్చింది. Novel అనే ఆంగ్ల పదం 'Novelle' అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. సంస్కృతంలో 'నవలా' అని, మరాఠీ, కన్నడంలో 'కాదంబరి' అని, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, ఒరియా, హిందీ భాషల్లో 'ఉపన్యాస్' అని, ఉర్దూలో 'నవల' అని, గుజరాత్లో 'నవల్ కథా' అని, తమిళంలో 'వుదినం, కావల్' అని అంటారు. తెలుగులో మొదటగా 'వచన ప్రబంధం' అని పిలిచేవారు. తర్వాత నవలగా స్థిరపడింది.

నవలకు నిర్వచనాలు విమర్శకులు చాలానే ఇచ్చారు.

"నవల ఇలాగే ఉండాలి – ఇలా ఉండకూడదు అని చెప్పే నిర్దేశిక సూత్రాలు అదృష్టవశాత్తు నవలకు లేవు. కాబట్టి నవలను వర్ణనాత్మక సూత్రాలతో మాత్రమే విశ్లేషించవలసి ఉంటుంది"[70].

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం 'నవల' అని నిర్వచించవచ్చు"[71].

"మనోరంజకమునతి విచిత్రమునైన జీవిత చిత్రణం నవల యనుట పండితార్థము"[72].

"నవల అంటే మనోరంజకత, అతి విచిత్రత, వాస్తవికత అను త్రిగుణములను కలిగి యుండి యదార్థ జీవిత చిత్రణము వలన మనో నేత్రములకు గోచరించునట్లు భాసింపజేసేడి గద్య కావ్య ఖండికయే నవలగా సాహిత్యలోకముచే నిర్వచింపబడుచున్నదని భావించవలసియుండును"[73].

### 4.4.3. సాహిత్యం – నవల:

[69] కె. వెంకట నారాయణరావు, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహం, పుట–14.

[70] వల్లంపాటి వెంకట సుబ్బయ్య, నవలా శిల్పం, పుట–09.

[71] మొదలి నాగభూషణ శర్మ, తెలుగు నవలా వికాసం, పుట–20.

[72] బొడ్డపాటి వెంకట కుటుంబరావు, ఆంధ్ర నవలా పరిణామము, పుట–10.

[73] పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు, తెలుగు నవలా సాహిత్య వికాసం, పుట–48.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబింపజేస్తుంది. సమాజం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈనాడు మనం సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని రెండు రకాలుగా చెప్పుకుంటున్నాం. క్రీ.శ.11వ శతాబ్దం నుండి తెలుగు సాహిత్యం ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ.శ.11వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం పూర్వార్థం వరకు వెలువడిన సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యం అంటున్నాం. ప్రాచీన సాహిత్యంలో ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, రూపకాలు, శతకాలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు. 19వ శతాబ్దం ఉత్తరార్థం నుండి నేటి వరకు ఆధునిక  సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యంలో నవల, నాటకం, కథ, కవిత్వం, గేయం, విమర్శ, వ్యాసం, స్వీయ జీవిత చరిత్రలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు.

### 4.4.4. నవల పాత్రచిత్రణ నిర్వచనాలు:

ఆర్.యస్. సుదర్శనంగారు పాత్రచిత్రణ గురించి ఈ విధంగా అన్నారు. "జీవితమంటే సుఖదుఃఖాలు, ఒక మనిషికి అవి ఎలా సంప్రాప్తిస్తున్నవి, ఆయా సందర్భాల్లో ఆ మనిషి ఎలా ప్రవర్తిస్తున్నాడు ఈ రెండు విషయాల్ని బట్టి మనిషిలో వ్యక్తి వైశిష్ట్యం గోచరమవుతుంది. జీవితాన్ని కథగా మలిచే ప్రక్రియైన నవలలో అవి నిరూపింపబడే వైశిష్ట్యాన్ని పాత్రచిత్రణ అంటారు".

సాధారణ జీవితంలో ఉండే పాత్రలకు, కథలో సంఘర్షణలతో కూడిన పాత్రలకు వైవిధ్యం ఉంటుంది. జీవితంలో కష్టసుఖాలు వచ్చినప్పుడు ఆ మానసిక స్థితిని, శారీరక మార్పులను రచయిత తన రచనలో సమర్థవంతంగా చిత్రించడమే పాత్రచిత్రణ అవుతుంది. అలాంటి పాత్రలను రచయిత తన కథల్లో చిత్రించడం, పాఠకులను మెప్పించడం కొంచెం కష్టసాధ్యమైన పని. కొన్ని పాత్రలు మాత్రమే పాఠకులను మారుస్తాయి. అలాంటి పాత్రలు బాగా గుర్తుండి పోతాయి.

రచయిత ఎన్నుకున్న కథా వస్తువు పాఠకులకు చేరవేయడానికి సహకరించేవి, ఉపకరించేవి పాత్రలు. ఈ పాత్రలు సాధారణమైన జీవితానికి సంబంధించినవి కాకుండా విలక్షణమైన మానసిక వ్యక్తిత్వం విభిన్నమైన భావాలు కలిగిన దృక్పథంతో కూడినవి అయి ఉండాలి. అప్పుడే రచయిత వస్తు వైవిధ్యాన్ని అనుసరించి పాత్ర వైవిధ్యాన్ని ప్రదర్శించగలడు. భిన్నమైన పాత్రలు భిన్న పరిస్థితుల్లో భిన్న రకాలుగా ప్రవర్తించినప్పుడు పాఠకులకు విభిన్న ఆలోచనలను రేకెత్తిస్తాయి. రచయిత చెప్పదలుచుకున్న విషయాన్ని నేరుగా చెప్పకుండా పాత్రల ద్వారా తన భావాన్ని వ్యక్తపరుస్తాడు. ఇదంతా నిగూఢంగా, కళాత్మకంగా పాత్రల అంతరంగ ప్రపంచం ద్వారా

వ్యక్తపరుస్తాడు. పాత్రలు అర్థరహితంగా కాకుండా అర్థవంతంగా, పాఠకుడు అర్థం చేసుకునే రీతిలో పాత్రచిత్రణ ఉండాలి.

### 4.4.5. మంచి ముత్యం:

నవలా మూలం దాదాపు ఆరు దశాబ్దాల క్రితంది. ప్రాంతం వేరే. అయినా ఏ తీర ప్రాంతంలోని జాలర్ల వృత్తుల వారికి అన్వయించినా ఇప్పటికి (బహుశా ఎప్పటికీ) అక్షరాలా వర్తిస్తుంది. వారి జీవనంలో మనిషిలోని మౌలిక భావోద్వేగాలలో మార్పు ఉన్నంతవరకూ మనిషి జీవన పోరాటంలో ఎదుర్కొనే ఆటుపోట్లలో అందులోని శక్తి బలహీనతలు ఆయా సందర్భాలలో ప్రతిస్పందనలు అద్భుతంగా ఆవిష్కరింపబడినాయి.

అదే సమయంలో మనిషి నిజ శ్రమను గుర్తిస్తూ, తమ మధ్యలోని ఒక సాధారణమైన వాడు అసాధారణంగా ఎదగడం ఇష్టపడకపోవడం, వర్గ వ్యత్యాసాల్లో కొందరి ఘోర, క్రూర, కిరాతక, దుర్మార్గ, దురాగత ప్రవర్తన తీరుతెన్నులను, విద్య, సంపద వెనుక గల దానవత్వ కల్మషాన్ని కళ్ళకు కట్టించారు. ఇవి అన్ని చోట్లా ఉన్నవే. అవకాశం ఉన్నవారు, అందలాల్లోని వారు ప్రతిచోట అట్టడుగు వారిని ఎంతగా కుట్రలు, కుతంత్రాలతో నీచాతినీచంగా హింసిస్తారో ఈ నవలలో వివరించారు.

ఈ అద్భుతమైన చిన్న నవలను సాహిత్యాభిమానులు ఎర్నెస్ట్ హెమింగ్వే "ద ఓల్డ్ మాన్ అండ్ ద సీ" తో పోలుస్తారు.

ఈ నవల ఆధారంగా 1947లో "లా పెర్లా" అనే స్పానిష్ సినిమా కూడా వచ్చింది.

### 4.4.6. పాత్రలు

#### 4.4.6.1. కినో:

తాత ముత్తాతల మాదిరిగానే 'కీనో' ముత్యాల అన్వేషకుడు. వారిలాగానే చాలా సామాన్యమైన జీవనం, బలమైన వర్గాల కనుసన్నల్లో నడవాల్సిన పరిస్థితి. తాత తండ్రులకూ, కీనోకు తరాల తేడానే తప్ప అభివృద్ధిలో ఒక్కటంటే ఒక్క ముందడుగు కూడా పడదు. సముద్ర గర్భంలోనికి ఈదుకుంటూ ప్రవేశించి ముత్యపు చిప్పలను సేకరించడం, మన జాలర్లు చేపలమ్మినట్టుగా వాటిని ఏరోజుకారోజు అమ్ముకుని బతకడం, అదే అతని జీవనోపాధి. తరతరాల అనుభవాలు, అనుభూతులను పదాలుగా పేర్చుకొని, పాటలుగా కట్టుకుని ఆనందించడం, భార్య జుఆనా, నెలల పసికందు కొయెటిటో, తాముంటున్న గ్రామం అంతే కీనూ ప్రపంచం.

## 4.5. నాటక శిల్పం:

రచనా విధానం (ముఖ్యంగా భాషా ప్రయోగం, సంభాషణా రీతి, శైలి, పద్య రచన వంటివి) సంస్కృత రచనలను అనుసరించినా, నాటక శిల్పంలో ముఖ్యంగా ఇతివృత్త నిర్మాణంలో అటు పాశ్చాత్య నాటకాల, ఇటు భారతీయ నాటకాల రచనా విధాన సమన్వయం కనిపిస్తుంది.

'నాటకం' జనులందరినీ ఆకర్షించే ఉత్తమ సాహిత్య ప్రక్రియ. అందువల్ల "కావ్యేషు నాటకం రమ్యమ్" అని అన్నారు. కావ్యాలలో నాటకం కమనీయమైనదని, రంజింపదగినదని ఈ వాక్యం అర్థం.

"నట్" సంస్కృత ధాతువు నుండి నటనం, నటి, నటుడు అనే పదాలు పుట్టాయి.

సంస్కృతంలో రాయబడిన 'నాట్య శాస్త్రం' తెలుగు నాటక రచనకు ఆధారమైంది. రూపక ప్రదర్శనములకు సంబంధించిన అన్ని విషయాలు ఇందులో ఉన్నాయి.

సాహిత్య పరంగానూ, ప్రదర్శన పరంగానూ పాశ్చాత్య నాటక ప్రభావం తెలుగు నాటక రంగంపై ఉంది. ఆ తర్వాత మమైకమైపోయింది.

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య రూపకం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకున్న ప్రక్రియ. 16వ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అని పిలుస్తారు.

"నాటకాంతం హి సాహిత్యం" అన్నాడు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకం అని అర్థం.

### 4.5.1. నాటకం నిర్వచనాలు:

1. "చాక్షుషమైన క్రతువు" నాటకం – కాళిదాసు.
2. "రమ్యం జుగుప్సిత మందార యథాపీచనీయముగ్రం" – ధనంజయుడు.
3. "మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని హితాని, శాస్త్రాన్ని ప్రధంతే" – పతంజలి.
4. "అవస్థాను కృతిర్నాట్యం రూపం దృశ్యతయోచ్యతే" – ధనంజయుడు.

### 4.5.2. లైఫ్టానిక్:

ప్రఖ్యాత భారత జీవ రసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు పరిశోధన విజయవంతం. ఆ పై ప్రపంచమంతా అమృతం పంపకం.

ప్రముఖ జీవ రసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు మానవాళిని మృత్యువు నుండి తప్పించే అమోఘమైన ఔషధం "అమృత్–90" ని కనుగొన్నారు. దేశాన్ని వదిలి అమెరికాలో

స్థిరపడ్డ డా॥ రావ్, సుమారు ఇరవై ఏళ్ళుగా ఈ పరిశోధన కొనసాగించారు. ఆయన "అమృతం"తో భారతదేశం చేరుకుంటారు. తెలుగు రాష్ట్ర రాజధానిలోని తమ స్వగృహంలో బంధుమిత్రులతో గడుపుతారు. ఆ తర్వాత కేంద్రానికి వెళతారు. అక్కడ నుండే అన్ని రాష్ట్రాల ప్రజలకు అమృతం అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారు.

అది తాగితే ఇక ఎప్పుడూ తిండి అక్కర్లేదు. సమస్యలుండవు. సంఘర్షణలు ఉండవు. అంతా క్షేమం. అంతా శాంతి.

స్వంత ఇంటికి చేరుకున్న కొద్ది సేపట్లోనే ప్రముఖ దేశ నాయకుల నుంచి టెలిగ్రాం అందుతూనే ఉన్నాయి. నాయకులందరూ ఒక్కొక్కరు వచ్చి కలుస్తున్నారు. అమృతం ఎంత తెచ్చారని అడుగుతున్నారు. పెద్దగా నవ్వుతున్నారు.

కొద్ది కొద్దిగా జన ప్రవాహం చుట్టు ముట్టింది. అమృతం తమకే కావాలంటూ కేకలు, నినాదాలు, మెమొరాండాలు. జనాన్ని అదుపులో పెట్టడానికి పోలీసులు వచ్చారు.

"ఇది హిందూ దేశం కనుక అమృతం కేవలం హిందువులకే ఇవ్వాలి. రామజన్మ భూమి నుండి ఈ పంపకం ప్రారంభం కావాలి."

"ఈ దేశాన్ని వేల సంవత్సరాలు ముస్లింలు పాలించారు. కనుక ముస్లింలకు ఇవ్వడమే న్యాయం. దీనితో బాబ్రి మసీదు గొడువలు చల్లబడతాయి."

"హిందూ ముస్లింల మధ్య సామరస్యం లేదు కనుక అందరితో స్నేహం పెంచుకునే మా క్రైస్తవులకు ఇవ్వండి."

"ఒక దశాబ్దంగా పంజాబ్ మండిపోతుంది. దాన్ని ఇప్పటికైనా ఈ అమృతంతో చల్లార్చండి. ఈ దేశంలో సిక్కులు అందరిని అమృత్సర్కు ఆహ్వానించండి."

"లేదు లేదు ఎవరికి ఇవ్వొద్దు. కూలి జనమంతా మా పెట్టుబడితో బతుకుతోంది. మేం బతికితే వాళ్ళు బతుకుతారు. గనుక కేవలం మాకివ్వడం సబబు" అని ధనిక వర్గం వాదన.

"అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మాకు రిజర్వేషన్లు కల్పించాలని రాసినప్పటి నుండి మాకు అన్నిట్లో ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. ఈ విషయం అందరికి తెలుసు" వెనకబడిన జాతులు, తెగలకు సంబంధించిన ప్రతినిధుల ప్రతిపాదన.

మతం ఏదైతేనేం అమృతం ఎవరికి పంచబడుతుందో అదే మా మతం అనేవాళ్ళు గుంపు మరోవైపు.

విషయం కేంద్రానికి తెలిసింది. CRPF ఏ క్షణంలోనైనా రావచ్చు. అంతదాక పరిస్థితి అదుపులో పెట్టాలి. మా తండ్రితో చెప్పి అందరికి, అన్ని వర్గాల వారికి అమృతం సమానంగా ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామి ఇస్తున్నాడు వ్యాపారవేత్త, రంగారావు గారి కుమారుడు.

ప్రజల్లో ఎంతో అలజడి కలిగించే పదార్థం తయారుచేశాడు. శాంతిభద్రతలకు భంగం కలిగించాడు. కనుక 'అమృతాన్ని' వశపర్చుకుని ప్రొఫెసర్ రంగారావును కస్టడీలోకి తీసుకోవాలంటూ మరో వార్త వ్యాపించింది.

బయట కేకలుగా గొంతులు చించుకుంటున్న రాజకీయాలను భరించ లేకపోయాడు రంగారావు. తన దేశ ప్రజలు, తన దేశం? ఇందు కోసమేనా జీవితాంతం శ్రమించింది? మేధస్సునంతా ధారపోసింది? రంగారావు గారిలో సహనం పదునెక్కింది. కోపంతో అమృతం జాడీని బాల్కనీలోకి దొర్లించాడు. అప్పటినుండి వంగి వంగి దండాలు పెడుతూ శాంతిని గురించి ప్రబోధించే తెల్ల టోపీలన్నీ భూమిని కరుచుకున్నాయి. జాడీ పగిలిన చోట కొట్లాడుకుంటున్నాయి. అందులో టోపీ లేకుండా ఒకే ఒక తల ఉంది. అది తన కొడుకుదే. మనవడు శ్యాంసుందర్ ముఖం మండిపోతుంది. తన తండ్రి చేస్తున్న పనికి ఆవేశంతో ఊగిపోయాడు.

మట్టిలో కలిశాక అమృతం పనిచేయదు అని శ్యాంసుందర్తో చెప్పి మెల్లగా లోనికి కదలాడు రంగారావు. అతనిలో పశ్చాత్తాపం. ఈ దేశానికి, ఈ ప్రపంచానికి ఆకలిని జయించే అమృతం కాదు. స్వార్థాన్ని జయించే మానవత్వం కావాలి అంటు బాధపడతాడు రంగారావు.

### 4.5.3. నాటకం పాత్ర చిత్రణ:

ఒక కథలో గాని, నాటకంలో గాని ఉన్న ఒక వ్యక్తి లక్షణాలని, ప్రవర్తనని నిర్దేశించే పదం పాత్ర. ఇంగ్లీషులో character అంటాం. పురాతన కాలంలో రాతియుగంలో రాళ్ళమీద గుర్తుల్ని చెక్కడానికి ఉపయోగించే 'ఉలి'ని character అనేవాళ్ళు. ఆ తరువాత చెక్కబడిన ఆ 'గుర్తు'ను character అనేవాళ్ళు. అవి గుర్తుల నుంచి అక్షరాల వరకు ఎదిగినప్పుడు కూడా అవి characters గానే పిలువబడ్డాయి. అందుకే వర్ణమాలలో ఉన్న అక్షరాలను ఆంగ్లంలో characters అంటారు. ప్రతి అక్షరము ప్రత్యేకమైన స్వరూపం కలిగి ఉంటుంది. కనుక కొన్ని ప్రత్యేక స్వరూప స్వభావాలు కలిగిన ఏ గుర్తునైనా character అని పిలిచేవారు. ఇదే భావాన్ని మనుష్యులకు వర్తింపచేస్తే ఇవాళ character అంటే మనం సామాన్యంగా అనుకునే అర్థం

వస్తుంది. "ఒక వ్యక్తిని మిగిలిన వారి నుంచి వేరుచేసే ఆ వ్యక్తిలోని స్వరూప స్వభావ చేష్టాదులను వ్యక్తీకరించే లక్షణాల సంపుటీకరణ పాత్ర"[74].

నాట్యశాస్త్రంలో పాత్ర అంటే "నటుడు తన నట బుద్ధిని మరుగున ఉంచి నాటక పాత్రగా భావించబడుతున్నవాడు"[75] అని వివరించబడ్డది. నటుడు (Actor) నాటక పాత్రతో మమేకం అయినప్పుడు అతడు పాత్ర. అతడు ధరిస్తున్న నాటకంలోని పాత్రను 'ప్రకృతి' అంటుంది నాట్యశాస్త్రం. మనం ఇవాళ రూఢ్యర్థంలో వాడుతున్న పాత్ర, పాత్రధారణ, పాత్రచిత్రణ అనే పదాలు నాట్యశాస్త్రంలో 'నటుడు' అన్న పదం కన్న character అనే ఆంగ్ల పదానికే దగ్గరగా ఉన్నాయనిపిస్తుంది. స్థూలంగా చూస్తే నటుడు తన వ్యక్తిత్వాన్ని మరిచిపోయి నాటకంలోని ఒక వ్యక్తిగా మార్పు చెందినప్పుడు అతని నూతన వ్యక్తిత్వాన్ని నిర్వచించే లక్షణ సముదాయాన్ని పాత్ర అంటున్నాం.

### 4.5.4. పాత్రలు:

### 4.5.4.1. రంగారావు (లైఫ్టానిక్):

మనిషికి చావు లేకుండా సైంటిస్ట్ రంగారావు కనిపెట్టిన ఔషధం పేరు 'అమృత్—ఇండియా'. దాన్ని మన భారతదేశం తీసుకొచ్చినప్పుడు మతకలహాలు, కుల కొట్లాటలు, రాజకీయ ద్వేషాలు పెట్రేగిపోతాయి. అది కేవలం మా కులం వాళ్ళకే కావాలని కొందరు, మా మతం వారికి మాత్రమే ప్రత్యేకంగా ఉండాలని మరికొందరూ దెబ్బలాడుకుంటారు. అప్పుడు అవన్నీ చూసిన శాస్త్రవేత్త రంగారావును మనసు వికలమైపోతుంది. చాలా బాధపడి "దీనిని అనవసరంగా కనిపెట్టాను. బతుకు పొడిగించే లైఫ్టానిక్ కాదు, మనిషి స్వార్థాన్ని జయించే టానిక్ ఏదైనా కనిపెట్టాల్సింది"[76] అని అనుకొని బాధపడతాడు..

## 4.6. అనువాద శిల్పం:

అనువాదం అంటే ఒక భాషలో ఉన్న విషయాన్ని మరోక భాషలోకి మార్చడం. మార్చడం అంటే మరొక భాషలో చెప్పడం కావచ్చు, రాయడము కావచ్చు. అనువాదాన్ని 'తర్జుమా, భాషాంతరీకరణం' అని కూడా అంటారు. అనువాదకుని ఆంగ్లంలో 'Translator' అంటారు.

---

[74] మొదలి నాగభూషణ శర్మ, నాటక శిల్పం, పుట– 75.

[75] మొదలి నాగభూషణ శర్మ, నాటక శిల్పం, పుట–75.

[76] దేవరాజు మహారాజు, ఆవరణం, పుట–177.

అనువాదం అంటే మూల భాషలో ఉన్న విషయాన్ని లక్ష్య భాషలోకి మార్చడం. మొదటి భాషను మూల భాష అని, రెండవ భాషను లక్ష్య భాష అని అంటారు. ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదిస్తే ఇంగ్లీషు మూల భాష అవుతుంది. తెలుగు లక్ష్య భాష అవుతుంది.

సంస్కృతంలో 'చెప్పు' అనే అర్థంలో ఉన్న 'వద్' ధాతువుకు 'అను' అన్న ఉపసర్గ చేరి అనువాదం అన్న పదం ఏర్పడింది. ఒకప్పుడు సంస్కృతంలో అనువాదం అన్న పదానికి 'మళ్ళీ చెప్పడం, పునః కథనం' అని అర్థం. ఒకరు చెప్పిన దానిని మళ్ళీ అలాగే తిరిగి చెప్పడమే అనువాదం అనే దానికి ప్రాచీనార్థం. గురువు చెప్పిన దాన్ని శిష్యుడు అదే రూపంలో తిరిగి చెప్పడం, విన్నదాన్ని తెలిసినదాన్ని తిరిగి చెప్పటం, ఆవృత్తి మొదలైన అర్థాలు అనువాద పదానికి ఉన్నాయి. ఆధునిక కాలంలో అనువాదం అంటే "ఒక భాషలో చెప్పినదాన్ని మరొక భాషలో మళ్ళీ చెప్పడం" అని అర్థం.

అనువాదం అనే సాంకేతిక పదానికి 'భాషాంతరీకరణ, తర్జుమా' అనే పర్యాయపదాలు వాడుకలో ఉన్నాయి. సంప్రదాయ వ్యాకరణాలు పేర్కొనే 'అనుకరణం, అనుకృతి' అనేవి కూడా ఒక విధంగా అనువాద శబ్దానికి సన్నిహితమైన పదాలని చెప్పవచ్చు.

ఒకరు చెప్పిన మాటను లేదా మరొక భాషలోని విషయాన్ని ఇంకో భాషలోకి మార్చటాన్ని అనువాదం అంటాం. ఒక భాషలో ఉన్న విషయాన్ని భాషాంతరంలోకి అంటే మరో భాషలోకి మార్చడాన్ని భాషాంతరీకరణం అంటారు. ఒక భాషలోని విషయాన్ని ఉన్నదున్నట్లుగా మరో భాషలో వాడటాన్ని అనుకరణం అని, అనుకృతి అని పిలుస్తారు. ఒక భాషలోని విషయాన్ని మరో భాషలోకి మార్చటాన్ని సూచించే ఉర్దూ పదం 'తర్జుమా'. ఇన్ని పదాల్లోను ఈ కాలంలో ఎక్కువ వాడుకలో ఉన్న మాట అనువాదమే. అనువాదం చేసే వ్యక్తి అనువాదకుడు.

ఆధునిక కాలంలో 'అనువాదం' అనే పదానికి 'తర్జుమా, Translation' అనే అర్థాలు రూఢమైపోయాయి. అంటే ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరో భాషలో చెప్పడం అనేదే అనువాదం అనే పదానికి రూఢార్థమైంది.

ఇంగ్లీషులో ఉన్న Translation అనే మాట trans, lation అనే పదాల కూడికతో ఏర్పడింది. 'trans' అంటే అవతలి ఒడ్డు. 'lation' అంటే తీసుకొని వెళ్ళే పని. అంటే ఈ ఒడ్డు నుంచి ఆవలి (అవతలి) ఒడ్డుకు తీసుకొని వెళ్ళడం అని అర్థం.

మూల భాషలోని విషయాన్ని లక్ష్యభాషలో వీలయినంతమటుకు సమానంగా, సహజంగానూ ఉండేట్లు అభివ్యక్తీకరించడమే అనువాదం.

అనువాద ప్రక్రియ ఒక రకంగా పరకాయ ప్రవేశం లాంటిది అని చెప్పవచ్చు. భావం, విషయం (content, matter) ఆత్మలాంటిది అయితే అభివ్యక్తి శైలి (manner) శరీరం లాంటిది. అనువాదం అంటే ఒక భాషలోని ఆత్మను ఇంకో భాషలోకి ప్రవేశపెట్టడం, ఆత్మ మూల భాషదైతే శరీరం లక్ష్య భాషది.

**4.6.1. అనువాద యుగం**:

ఆధునిక యుగాన్ని అనువాద యుగం అనవచ్చు. ప్రపంచ సాహిత్యం భిన్న భాషలలోకి అనూదితం అవుతూ ఉంది. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక శాస్త్రం అపారంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆలోచనలు, భావాలు, అనుభవాలు, సిద్ధాంతాలు, తంత్రాలు కొత్తవి ప్రవేశిస్తున్నాయి, విస్తరిస్తున్నాయి. ప్రపంచంలో ఏ మారుమూలనో జరిగిన సంఘటనలు, పరిణామాలు వెంటనే ప్రపంచంలో వివిధ భాషల ద్వారా లోకానికి తెలుస్తున్నాయి. అవి వెంటనే వివిధ భాషలలోకి అనువాదం అయి విభిన్న భాషా వ్యవహర్తలకు అందుతున్నాయి.

"మూల భాష మాతృభాషగా గలవానికి మూల రచనలోని సారాంశం ఎంత స్పష్టంగా అర్థమై, ఎంత గాఢమైన అనుభూతిని కలిగిస్తుందో లక్ష్య భాష మాతృభాషగా గలవానికి అనువాదంలోని సారాంశం అంత స్పష్టంగానూ అర్థమై, అంత గాఢమైన అనుభూతిని కలిగిస్తే అది మంచి అనువాదం అవుతుంది"[77] అని రాచమల్లు రామచంద్రారెడ్డి అన్నారు.

"ఒక భాషలో అభివ్యక్తీకరించిన భావాలను, అభిప్రాయాలను వీలైనంతమటుకు సమానంగానూ, లక్ష్య భాష స్వభావానికి అనుకూలంగానూ అభివ్యక్తీకరించే ప్రయత్నమే అనువాదం"[78] అని ఇ.ఎ. నైడా నిర్వచించాడు.

"విషయాన్ని, శైలినీ ఎప్పుడు వేరు చేయలేమనే విషయాన్ని మనస్సులో ఉంచుకొని ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరో భాషలోకి మార్చడమే అనువాదం"[79] అని సి.యస్. ఫారెస్టర్ అభిప్రాయం.

"మూల భాషలోని పాఠకులను ప్రభావితం చేసిన విధంగానే అనువాదం కూడా లక్ష్య భాషలోని పాఠకులను ప్రభావితం చేస్తుంది"[80] అని మెథ్యూ ఆర్నాల్డ్ అభిప్రాయం. **4.6.2.**

---

[77] రాచమల్లు రామచంద్రరెడ్డి, అనువాద సమస్యలు, పుట–71.

[78] అనువాద శాస్త్రం, తెలుగు అకాడమీ, పుట–02.

[79] అనువాద శాస్త్రం, తెలుగు అకాడమీ, పుట–05.

[80] అనువాద శాస్త్రం, తెలుగు అకాడమీ, పుట–06.

### 4.6.2. అనువాద ప్రపంచంలో కవిత్వానువాదం:

ఏ అనువాదానికైనా స్ఫూర్తి మానవతా విలువలే. ప్రపంచవ్యాప్తంగా భాషలు, సాహిత్యాలు వేరు వేరు కావచ్చు. కానీ వాటిలో ఉన్న మానవతా విలువలు ఒక్కటే. వాటిని తెలుసుకోవడానికి మరొకరికి తెలపడానికి అనువాదాలు అవసరమవుతున్నాయి. అనువాదమయ్యే ప్రపంచ వార్తలు మనకు అందుతున్నాయి. అనువాదమయ్యే చాలా పత్రికల్లో, టి.వి. చానళ్ళలో సీరియల్స్ నడుస్తున్నాయి, అనువాదమయ్యే సినిమాలు మనకు ప్రదర్శితమవుతున్నాయి. అసలు ఇది 'అనువాద ప్రపంచం' అని అనడానికి సందేహమే లేదు.

అనువాద ప్రక్రియ లేకపోతే రామాయణ మహాభారతాలు మనకు అందేవి కావు. ప్రపంచ సాహిత్యంతో మనకు పరిచయమే ఉండేది కాదు. యూరోపియన్ రచనలన్నీ ఇంగ్లీషులోకి అనువాదమయ్యాకే మనకు అందాయి. ఇంగ్లీషు కూడా చదవలేని మన కోట్లాది పాఠకులకు తెలుగు అనువాదం తప్పనిసరి.

అనువాదకుడికి గ్రామ్య దృష్టి, జాతీయ దృష్టి మాత్రమే సరిపోదు. అవి ఉంటూనే విశ్వదృష్టి కూడా ఉండాలి. విశ్వమంతా నాది అనే భావనకు ఎదిగినవాడే అనువాదానికి పూనుకుంటాడు. ప్రపంచ పౌరులంతా నా వాళ్ళు, ప్రపంచ సాహిత్యం అంతా నాది అనే భావన అనువాదానికి తప్పనిసరి. కవిత్వం, కథ, నవల మొదలైన సృజనాత్మక ప్రక్రియలన్నీ ఎగిసిపడ్డ మనిషి చైతన్యానికి ప్రతీకలు. దాన్ని నిలుపుకోవాలనుకునే వారే అనువాదాల వైపు ఆకర్షితులవుతారు. అనువాదం రెండు భాషల మధ్య జరుగుతుంది. కవిత, కథ, నవల, నాటకం, వ్యాసం వంటి ఏ ప్రక్రియ అయినా ఒక భాషలోంచి మరో భాషలోకి అనువాదం అవుతుంది. అంటే ఉద్దేశించిన పాఠకులెవరో నిర్ధారణ జరిగిన తరువాత, మూల భాషలోంచి ఉద్దేశించిన భాషలోకి అనువాదం జరుగుతుంది. ఉద్దేశించిన పాఠకులు వేరు వేరు భాషలలో ఉన్నప్పుడు అనువాదం కూడా వేరు వేరు భాషల్లో జరుగుతుంది. మూలం ఒకటే. అనువాదాలు అనేకం. అనేక అనువాదాల్లో అనేక ఛాయలు. మూలానికీ అనువాదానికీ మధ్య ఎన్నో ఛాయలు కదిలిపోతుంటాయి.

ఒక భాషలో ఉన్న మాటలను మరో భాషలోకి మార్చడమే అనువాదం కాదు. మాటల్లో అంతర్గతంగా దాగిన స్పర్శను, స్పృహను, స్ఫూర్తిని, ఆర్తిని, అనుభూతిని మార్చగలగాలి. మూల కవి, మూల రచయితలాగా అనువాదకుడు కూడా కవో, రచయితో అయి ఉండాలి. అతనికి మూల రచనలోని ఔన్నత్యాన్ని గుర్తించగలిగే నిజాయితీ ఉండాలి. ఆ ఔన్నత్యం దెబ్బతినకుండా పరిరక్షించగల సృజనా శక్తి కూడా ఉండాలి.

అనువాద రచన మూల రచనకు ఏమాత్రం తక్కువది కాదు. ఒక రకంగా అది సమాంతర సృజనాత్మకత. విభిన్న సంస్కృతుల మధ్య అనువాదకుడు సంధానకర్త అవుతాడు. Globalizaion of Culturesకు దారులు వేస్తాడు. ఇంత చేస్తే ఏ అనువాదం పరిపూర్ణం కాదు. కానీ మంచి అనువాదాల కోసం నిరంతరం పరితపిస్తూ ఉండాలి. ఒక్కోసారి అసలు అనువాదమే లేని దాని కన్నా ఏదో ఒక మామూలు అనువాదం రావడం కొంత మేలు.

అనువాద కవితలు మూల కవి కవితలాగే ఉండాలి. మరొకరి కవితలాగా ఉండకూడదు. మూల కవితలో ఉన్న సహజత్వం కొంతలో కొంత అనువాదంలో తప్పిపోతుంది లేదా అనువాదకుడు చేర్చిన కొత్తదనంతో కవిత మరింత నూతనత్వాన్ని సంతరించుకుంటుంది. దాన్ని స్వేచ్ఛానువాదం లేదా అనుసృజన అంటున్నాం. అనువాదకుడు స్వయంగా కవి అయినప్పుడు అనువాదం బాగా రావడానికి ఆస్కారముంది.

మూల కవిత ఎలా ఉంటే దేవరాజు మహారాజు అనువాదం లాగే చేశారు. కవి శైలి, పదాల విరుపు, పోయెటిక్ మూడ్ అన్ని జీర్ణించుకుని అనువదించారు. నారాయణ్ సుర్వే, వామన్ నింబాళ్కర్ వంటి మరాఠీ కవుల కవితలు ప్రజల భాషలో ఉంటే దేవరాజు మహారాజు వాటిని తెలంగాణ ప్రజల భాషలోకి మార్చారు. ఉదాహరణకు –

**"అరేయ్ శిండె పైకి సూడురా**
**చంద్రుని తునక గాలిబ్ గజలోలె సతాయిస్తందిలే**
**ఈ బికారి బత్కు, ఇస్మ్లా గాణ్ణి పనికి రానోణ్ణి చేసింది.**
**కని, లేకుంటెనా, నీయవ్వ... ఇస్మ్లాగాడు కూడ**
**ఒగప్పుడు మనిషే ఉండె గాదుర?**
**ఈన్కి భీ ఇష్కు గిష్కు ప్యార్ గిర్ అన్ని తెలుస్తుండె"**

అంటూ సాగుతుంది. 'పోస్టర్' అనే సుర్వే కవిత.

శివరామ్ దీప్ డోగ్రీ గజల్ ఇలా వచ్చింది.

**"తొడుగు చేయువాని ముఖము నెవడోగాని,**
**తొడుగు ముఖము కప్పి కుట్టినాడు**
**మంచి ముఖము చూడ తొడుగేమో అనిపించె**
**తొడుగు ముఖము చూడ మంచిగుండె"**

గుజరాతీ కవి స్నేహరశ్మి హైకు అదే సంప్రదాయాన్ని అనుసరించి దేవరాజు మహారాజు తెలుగులోకి ఇలా అనువదించాడు.

**"కటిక చీకటి**
**ఆ చిన్ని నగరం**
**విద్యుద్దీపాల**
**తెప్ప మీద తేలుతోంది"**

ఈ విధంగా భారతీయ కవిత్వంలోని అన్ని రకాల కవితలు, అన్ని రకాల పోకడలు తెలుగులోకి అనువాదం చేశారు దేవరాజు మహారాజు.

బ్రిటీష్ వ్యతిరేకతను, భారతీయుడి ఆత్మబలాన్ని ఎంతో ఉద్రేకంగా వ్యక్తీకరించిన ఈ కింది కవితను కుసుమాగ్రజ్ 1940లో దండం జైలులో రాశారు. ఆ భావం తీసుకుని వచన కవిత రాస్తే చాలా పేలవంగా ఉండేది. కాని దేవరాజు మహారాజు ఎంతో శ్రమించి అదే లయలో, అదే ఉద్రేకంతో తెలుగు అనువాదం చేశారు.

**"గర్దా జైజై కార్ క్రాంతి సా!**
**గర్దా జైజై కార్"**

అంటూ సాగిన కవితను

**"జయ జయ ధ్వానాల్ చెయ్యండి**
**ఇక క్రాంతి నినాదాలివ్వండి"**

అంటూ తెలుగు చేశారు దేవరాజు మహారాజు.

**"కోపం కడుపులో సుళ్ళు తిరగనియ్**
**పేగులు సాగిన తీగెలు కానీయ్**
**రక్తం — నీళ్ళు, నీళ్ళైపోనీయ్**
**జైళ్ళన్నీ మా ఇళ్ళే కానీయ్**
**స్వాతంత్రం సాధిస్తామ్మేమని**
**జయ జయ ధ్వానాల్ చెయ్యండి"**

ఇది అచ్చయినప్పుడు షిర్వాద్కర్ కవిత స్ఫూర్తి నూటికి నూరు పాళ్ళు ఇందులో వచ్చిందని తెలుగు తెలిసిన (తెలుగు భాష వచ్చిన) మరాఠీ రచయితలు దేవరాజు మహారాజును అభినందించారు.

"మరోకడు" శీర్షికలో దేవరాజు మహారాజు తెలుగు చేసిన మెక్సికన్ సాహిత్య నోబెల్ గ్రహీత అక్టావియా పాజ్ (Octavia Paz) వచన కవిత పరిశీలించండి.

**"అతడు తన కోసం తాను**
**ఒక ముఖాన్ని కనుగొన్నాడు**
**దాని వెనక**
**జీవించాడు మరణించాడు**
**చాలా సార్లు పునరుత్థానం చెందాడు**
**ఈ రోజు అతడి ముఖంలో**
**కనిపించే ముడతలు ఆ ముఖానిదే!**
**అయితే ఇప్పుడతడి ముడతలకు మాత్రం**
**ముఖం లేదు"**

మూల కవిత చదువుతున్నప్పుడు భాష తెలియకపోయినా శైలి, ధోరణి అర్థమవుతాయి. వాటి ఆధారంగా అనువాదాన్ని అంచనా వేయవచ్చు. ప్రతి అనువాదం ఒక కొత్త కిటికీ అయి, ఒక కొత్త గాలీ, ఒక కొత్త వెలుతురూ ప్రసరింపచేస్తే ఏ భాషా సాహిత్యమైనా పరిపుష్టి చెందుతుంది.

అనువాదం గురించి దేవరాజు మహారాజుగారి మాటల్లో

**"ఆలోచన అక్షర భాషలోకి రావడమే ఒక అనువాదం**
**అది శబ్దరూపంగా, దృశ్యమయంగా మారడం**
**అనువాదానికి చేసిన అనువాదం**
**జంత్ర వాద్య సమ్మేళనమంతా**
**నరాల మీద నర్తించే హృదయానువాదం**
**అనువాదం – రెండు ముఖాలున్న నాణెం!"** **(జీవితమే ఒక కవిత, పుట–32)**

అనువాదం కేవలం సాహిత్య రంగానికి మాత్రమే సంబంధించిన మాట కాదు. అది సామాజికపరమైన మాట కూడా!

**"మాటలన్నీ మరణించాక**
**మిగిలి ఉండేదే ప్రేమ**
**పదాలన్నీ విఫలమైన తరువాత కూడా**
**మిగిలి ఉండేదే కవిత్వం"**

అని అంటాడు ఒరియా మహాకవి సీతాకాంత్ మహాపాత్ర.

### 4.6.3. నీకు నాకు మధ్య ఒక రంగుల నది (2009):

ఏ అనువాదానికైనా, స్ఫూర్తి మానవతా విలువలే. ప్రపంచ వ్యాప్తంగా భాషలు, సాహిత్యాలు వేరు వేరు కావచ్చు. కాని వాటిలో ఉన్న మానవతా విలువలు ఒక్కటే. వాటిని తెలుసుకోవడానికి, మరొకరికి తెల్పడానికి అనువాదాలు అవసరం అవుతున్నాయి.

అనువాద యుగం తెలుగు సాహిత్య చరిత్రలో మొదటి యుగం. కవిత్రయ భారతానికి అనుసృజన వ్యాస భారతమే. రవీంద్రనాథ్ సాహిత్యం, శరత్, ప్రేమ్చంద్ల సాహిత్యం తెలుగు ప్రజలకి అందించింది అనువాదమే.

పాశ్చాత్య సాహిత్యం పాఠకులకు పరిచయమైంది అనువాదం వల్లనే. అందుకే ప్రపంచ ప్రజలంతా నావాళ్ళు, ప్రపంచ సాహిత్యమంతా నాది అనే భావన అనువాదానికి తప్పనిసరి అని స్పష్టంగా తెలిపి "నీకూ నాకూ మధ్య ఓ రంగుల నది" అనే కవితా ప్రపంచాన్ని అనుసృజనగా వెలువరించారు దేవరాజు మహారాజు. దీనిలో ఆరు ఖండాలలోని కవుల్ని, భారతదేశ కవుల్ని, కవయిత్రుల్ని ఎన్నుకుని వారి వారి కవితల్ని అనుసృజనగా తెలుగులోకి తెచ్చారు.

**"ఆకాశం నిశ్శబ్దం**
**నేను రాయలేని ఒక కవిత**
**నిశ్శబ్దాన్ని సాధించాలంటే**
**మాటలతోనే సాధించాలి"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–14)**

అని అంటాడు జపనీయ కవితలో. ఆయన ఇంకా ఇట్లా అంటాడు.

**"మనసులో భావించిందే దర్శింప గలిగినప్పుడు**
**ఒక మెరుపు మెరుస్తుంది**
**మెరుపుల మీద అనుకున్నది దర్శింపగలిగినప్పుడు**
**అది నమ్మకంగా నమోదు చేయబడ్డప్పుడు**
**కాలం ఆగిపోతుంది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–14)**

మనసుకు తోచిన ఒక లోతైన, గాఢమైన అనుభవం ఒక భావనగా మారి అక్షరాలలోకి ఒదిగి, ఇతర భాషల మీదుగా ప్రయాణించి, ఇక్కడ మనకు మన తెలుగులో అదే భావన, అదే అనుభూతిని

ఇస్తున్నప్పుడు ఏమనిపిస్తుంది? అనువాదం ఒక అనుసంధానకర్త అనిపిస్తుంది. భాషల మధ్య, దేశాల మధ్య, సంస్కృతుల మధ్య, సమాజాల మధ్య ఒక సాహిత్య రాయబారిగా పనిచేస్తుందనిపిస్తుంది.

**"కవితల్లో నేను**
**పదాల బారికేడ్ల వెనుక**
**దాక్కుంటాను!**
**అంతకన్నా మరో పద్ధతి**
**లేనివాణ్ణి గనుక"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–15)**

అంటూ తన యుద్ధ 'వ్యూహాన్ని' ప్రకటించాడు. ఇది చదివినప్పుడు దక్షిణ కొరియాలో కవిత్వపు పరిస్థితి గుర్తుకొస్తుంది. దక్షిణ కొరియా ప్రభుత్వంలో పోరాడదలిచినవారు కొందరు గాసోలిన్ బాంబులతో పోరాడితే మరికొందరు పద్యాలు విసురుతారట! అక్కడ "Poetry is the Song of History". తమాషా ఏమిటంటే డిటెక్టివ్ నవలల కన్నా కవిత సంకలనాలు ఎక్కువ అమ్ముడవుతాయట. కవిత్వం పట్ల ఆ దేశవాసులకున్న అపారమైన ప్రేమ, గౌరవం మనమిక్కడ అర్థం చేసుకోవాలి. అందుకే ఆ దేశపు సుప్రసిద్ధ కవి చోంగ్ హ్యాన్ – జోంగ్ రాసిన కవితను తెలుగులో ఈ విధంగా అనువదించాడు కవి.

**"నువ్వు మృత్యువును మృత్యువుతో ప్రేమించకపోతే**
**జీవితాన్ని జీవితంతో ప్రేమించకపోతే**
**దుఃఖాన్ని దుఃఖంతో దుఃఖించకపోతే**
**కవిత్వాన్ని కవిత్వంతో ప్రేమించకపోతే**
**ఇక నువ్వు కవిత్వంతో దేన్ని ప్రేమించగలవ్?"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–15)**

ఈ దక్షిణ కొరియా కవి చోంగ్ హ్యాన్ – జోంగ్ కవితా శక్తి ఎంత తీవ్రమైందో అంత లలితంగా అంత సుకుమారంగా అక్షరాలలో ఒదుగుతుంది. మరో కవితలో వృక్ష శక్తి ఎంతటిదో

**"ఉధృతంగా వీచే ఆకుపచ్చని**
**వాయుబలం కొమ్మల్ని రెమ్మల్ని ఊపినప్పుడు**
**వృక్షం తన శక్తిని స్వప్నిస్తుంది**

**ఆకులపై ప్రవహించి**

**సూర్య కాంతిని ముద్దాడుతుంది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–15)**

కవిత్వమంటే మరేదో కాదు, ఇలాంటి నాజూకైన భావనే. దీన్నే మనం కవిత్వానువాదాలకు అన్వయించుకుని ఇలా తిరగరాసుకోవచ్చు.

**"కవిత్వం తన శక్తిని స్వప్నిస్తుంది**

**భాషలపై ప్రవహించి**

**రసహృదయులను ముద్దాడుతుంది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–15)**

అని! కవి ఏ దేశపువాడైనా, ఏ ప్రాంతపువాడైనా, ఏ భాషలో రాసినా అతని జీవిత నేపథ్యం, దృక్పథం తప్పనిసరిగా అతని కవిత్వంలో ప్రతిఫలిస్తుంది.

**"భూమి సుగంధం నాకొస్తుంది**

**భూమి చుట్టూ ఉన్న**

**అదే మట్టి సుగంధం"**

అని ప్రకటించుకున్న దక్షిణాఫ్రికా ఇంగ్లీషు కవి డెన్నిస్ బ్రూటస్ కవితను తెలుగులో ఇలా అనువదించారు.

**"ప్రతి సంవత్సరం ఈ రోజు**

**వాళ్ళు తమ పద ధ్వనులతో భూమి మద్దెల మోగిస్తారు**

**మంత్రాల గర్జనలతో రక్తపు వాసనల్ని నిద్రలేపుతారు**

**ఆబగా ఆ వాసనల కోసమే ముక్కు లెగరేస్తారు"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–16)**

"తమ పద ధ్వనులతో భూమి మద్దెల మోగిస్తారు" అన్న వాక్యాలతో మనకు ఆఫ్రికనుల నృత్యాలు, సంగీతం, ఆ వాతావరణమంతా కళ్ళ ముందు కదలాడుతుంది.

మట్టి సుగంధాన్ని కోరుకున్న డెన్నిస్ బ్రూటస్, జాతి వివక్షపై అలుపెరుగని పోరాటం చేశాడు. ఫలితంగా ఆయన కలం, గళం అన్నీ నిషేధానికి గురయ్యాయి. అయినా ఆయన నిషేధాన్ని లెక్కచేయలేదు. రాయకుండా, సభల్లో మాట్లాడకుండా పుస్తకాలు ప్రకటించకుండా ఉండలేకపోయాడు. అందుకే ఒక కవితలో ఇలా అంటాడు –

**"నేనొక గొంతుకను**
**అనంతమైన ఈ నిశీధిలో అరుస్తూ అరుస్తూ**
**ఎప్పటికీ ఓదార్చబడని శోకపు కేకను"**

పోలెండ్ కవి, కథా రచయిత, నాటక కర్త తడౌజ్ రోజేవిక్ కవిత ఒకింత లయబద్ధంగా సాగుతుంది. పాత తరం కవుల గురించి చెప్పిన ఖండికను తెలుగులో ఇలా అనువదించారు.

**"పాత తరం కవులు**
**ఎంతో భాగ్యవంతులు**
**చెట్టు కింద నర్తించే**
**వాళ్ళంతా పసిపిల్లలు**
**కాలి కూలి భస్మమైన**
**పాడలేని తరువు ఇది**
**ఎదలో ఉత్సాహం ఉన్నా**
**ఊగలేని కరువు మాది**
**ఇవ్వాళటి మా వృక్షం**
**రాత్రే విరిగిపోయింది**
**వేలాడిన బరువు శవం**
**నిస్పృహలో ఒరిగింది"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–17)**

అని అంటాడు. ఈ కవిలో ఎందుకింత నిస్పృహ అని అతని నేపథ్యంలోకి తొంగి చూస్తే ఆయన పోలాండ్ యుద్ధ సమయపు విషాదభరితమైన చేదు అనుభవాలు పుష్కలంగా ఉన్న కవి. జీవితంలో ఆయన ఎదుర్కొన్న విషాదం, తరువాత కాలంలో ఆయన కవితాక్షరాలలో ఒదిగింది. ప్రకృతిలో పుట్టి, పెరిగి, ప్రకృతి కవిత్వం రాసుకుంటూ పసిపిల్లల్లా గడిపిన ముందు తరం కవుల గూర్చి ఆయన అలా అనడం సబబే కదా!

**"పాత తరం కవులు**
**ఎంతో భాగ్యవంతులు**
**చెట్టు కింద నర్తించే**
**వాళ్ళంతా పసిపిల్లలు"**

అని అనడంలో కొత్తదనం ఉంది. మెత్తదనం ఉంది. బాల్యంలోని నిలువెత్తు సున్నితత్వాన్ని అలాగే అతి సుకుమారంగా తనలో నిలుపుకున్నవాడే అసలు సిసలైన కవి.

ముఖం గూర్చి, ముఖం మీద ముడతల గూర్చి మెక్సికో కవి ఆక్టేవియో పాజ్ చెప్పిన కవితను తెలుగులో ఇలా అనువదించారు కవి.

**"అతను తన కోసం తాను**
**ఒక ముఖాన్ని కనుగొన్నాడు**
**దాని వెనక జీవించాడు, మరణించాడు**
**చాలా సార్లు పునరుత్థానం చెందాడు**
**ఈ రోజు అతడి ముఖంలో**
**కనిపించే ముడతలు ఆ ముఖానివే!**
**అయితే అతని ముడుతలకు మాత్రం**
**ముఖం లేదు"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–56)**

1962 నుండి 1968 దాకా మన దేశంలో మెక్సికో రాయబారిగా ఉన్న ఆక్టేవియో పాజ్(Octavio Paz) మన వైదిక, బౌద్ధ సంప్రదాయాలలోని అభ్యుదయ ధోరణులను అవగాహన చేసుకున్నాడు. పాబ్లో నెరుడ (Pablo Neruda), జీన్ పాల్ సార్త్రే (JeanPaul Sartre) వంటి మహాకవులు సహేతుకమైన కారణాల్ని చూపించి నోబెల్ బహుమానాన్ని తిరస్కరించారు. వారికి వారసుడైన ఆక్టేవియో పాజ్ ఆ పురస్కారాన్ని స్వీకరించాడు. అయితే మానవ జాతిపై సామ్రాజ్యవాదులు తలపెట్టిన దురాక్రమణను తీవ్రంగానే నిరసించాడు.

ఆక్టేవియో పాజ్ లాగా అదే 'ముఖం' అనే విషయం తీసుకుని మన భారతీయ కవి డోగ్రీ భాషలో ఒక గజల్ చెప్పాడు. అది తెలుగులోకి ఎలా వచ్చిందో చూడండి.

**"తొడుగు చేయువాని ముఖము నెవడొ గాని**
**తొడుగు ముఖము కప్పి కుట్టినాడు**
**మంచి ముఖము చూడ తొడుగేమో అనిపించె**
**తొడుగు ముఖము చూడ మంచి గుండె"**

**(కవిత్వంలో సమాంతర రేఖలు – సంక్షోభాలు, పుట–57)**

కవులు విశ్వమానవులు. ఏ దేశంలో ఏ ప్రాంతంలో ఏ కవి ఏ మంచి విషయం చెప్పినా దాన్ని ప్రపంచ పౌరులందరూ గ్రహించాలి. అయితే భాష అడ్డుగోడ కాకూడదు గనుక అనువాదకులు నిరంతర కృషి చేస్తూనే ఉండాలి. ప్రతిసారి ప్రతి చోటా ఒక సృజనకర్తను ఒక అనుసృజనకర్త అనుసరిస్తూనే ఉండాలి.

### 4.6.4. విశ్వకథా సాహితి:

విశ్వకథా సాహితిలో మొత్తం 32 కథలు కలవు. ఈ కథా సంపుటిలో అమెరికన్, ఫ్రెంచ్, రష్యా, జర్మన్, ఇటాలియన్, పాలస్తీనా, ఆఫ్రికన్, జపనీస్ మొదలగు దేశాల కథలు కలవు.

చిన్న పిల్లల నిష్కల్మష ప్రేమ గురించి, స్నేహం గురించి రాసిన చిన్న కథ 'పిల్లలే నయం'. ఈ కథలో ఎప్పుడో బాల్యాన్ని వదిలేసిన పెద్దలు, తమలోని కలిమిడితనాన్ని కూడా ఎప్పుడో వదిలేశారని ఎద్దేవా చేశారు రచయిత. ఇది రష్యన్ కథానిక.

'జైలు లోపల' కథ సాదాసీదాగా కనిపించే ప్రేమకథే అయినా ప్రత్యేకమైన కథ. ఇద్దరి ప్రేమికుల మధ్య శారీరకంగా ఎక్కువ దూరం లేకపోయినా, వ్యవస్థ వారిని కొన్ని యోజనాల దూరం లాగేస్తోంది. ఎదురెదురుగా ఉన్న ప్రేమికుల్ని ఒక్కమాటంటే ఒక్కమాట మనస్ఫూర్తిగా మాట్లాడుకోనివ్వని న్యాయ వ్యవస్థలో న్యాయమెంత? అని రచయిత ప్రశ్నిస్తారు. మనుషుల్ని మనుషులుగా చూడని జైలు అధికారులను, పోలీసులను రచయిత ఇందులో తీవ్రంగా దుయ్యబట్టారు. జీవితంపై ఆశలేని తన ప్రేమికుణ్ణి ఓదార్చి, ధైర్యం చెప్పి భవిష్యత్తులోకి చూడమని సూచించిన ఒక స్త్రీ (ప్రేమికురాలు) మనోబలాన్ని రచయిత అత్యద్భుతంగా చిత్రీకరించారు. ఇది ఫ్రెంచ్ కథానిక.

నెపోలియన్ సార్వభౌమాధికారం కోసం ప్రయత్నిస్తూ మాస్కో నుండి తన సైన్యాన్ని వెనక్కి తీసుకుపోతున్న రోజుల్లో జరిగిన యదార్థ సంఘటన 'ఒక సైనికుడి కథ'. యుద్ధంలో చెయ్యిని పోగొట్టుకున్న ఒక సైనికుడు 1812లో చెప్పిన విషయాల ఆధారంగా ఈ కథ రూపొందింది. ఇది ఫ్రెంచ్ కథానిక.

మిలటరీ స్టాఫ్ కాలేజీలో శిక్షణ పొందుతున్న ఒక అధికారి అగచాట్లు 'గన్నేరు పొదలు' కథలో వర్ణించబడ్డాయి. అజాగ్రత్త వల్ల జరిగిన ఒక చిన్న తప్పిదంలోంచి బయటపడడానికి ఒక అబద్ధాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఎంత శ్రమించాల్సి వచ్చిందో అనుకూలవతియైన భార్య సహకారం అతనికి ఎంతగా ఉపయోగపడిందో ఈ కథ వివరిస్తుంది. ఇది రష్యన్ కథానిక.

ఒక భాషకు ఒక ప్రాంతానికి పరిమితమైపోకుండా మొత్తానికి మొత్తంగా మానవ నైజం చుట్టూ చిత్రంగా, అద్భుతంగా అల్లిన కథ 'అద్దం'. సున్నిత హాస్యంతో సాగిన ఈ కథలో లోతుగా తరచిచూస్తే మానవ వ్యక్తిత్వం గురించి అనేక విషయాలు అవగతమవుతాయి. మనిషీ – ప్రతిబింబం రెండు ముఖ్యమైనవే. ప్రతిబింబమంటే బహుశా వ్యక్తిత్వం కావొచ్చు. మనిషి కనబడతాడు. వ్యక్తిత్వం కనబడదు. మనిషి కనబడతాడు. అతని నీడ – ప్రతిబింబం కనబడదు. మనిషిని చూసి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఒక్కోసారి మనిషి కదలకుండానే అతని వ్యక్తిత్వం ఎన్నో మంచి పనులు చేయిస్తుంది. ప్రతిబింబం పడని మనుషులంటే వ్యక్తిత్వం కోల్పోయిన మనుషులని రచయిత సుతిమెత్తగా చెబుతున్నాడేమో అని ఆలోచించాలి. ఇది ఇటాలియన్ కథానిక.

తొలి దశలో రచయితలు ఎన్ని అవస్థలకు గురవుతారన్న విషయాన్ని 'స్ఫూర్తి' కథ చిత్రించింది. ప్రతి రచననూ మళ్ళీ మళ్ళీ చదివి నిగ్గు తేల్చాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. సృజనాత్మక ప్రక్రియల్లో సాధించిన దానికన్నా, సాధించాల్సిందే ఎప్పుడూ ఎక్కువగా ఉంటుందన్న విషయం తేల్చి చెప్పింది. మిష్క, శష్కా అనే ఇద్దరు మిత్రుల మధ్య జరిగిన సంభాషణ రచయితలందరి అనుభవంలోదే! కథలో ఏం చెప్పామన్నదే కాక ఎలా చెప్పామన్నది కూడా చాలా ముఖ్యం అన్న విషయాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు. ఇది రష్యన్ కథానిక.

'ఉద్యమం' అనే కథ రైతు కూలీల ఊరేగింపును, ఉద్యమ స్ఫూర్తిని చిత్రించింది. ఇది జర్మన్ కథానిక.

"సీతాకోక చిలుక" కథ కాస్సిడి అనే పసిబాలుడి మానసిక స్థితిని వర్ణించింది. ఇందులో కాస్సిడి ప్రేయర్ బెల్ వినిపించుకోకుండా చెట్ల వెంట సీతాకోక చిలుకల వెంట పరుగెడుతూ ప్రకృతి ఒడిలో గడుపుతాడు. అదే విషయం నిజాయితీగా బ్రదర్ టిమోతికి విన్నవించుకుంటాడు. కానీ అతను నమ్మకుండా కాస్సిడి అబద్ధాలు చెబుతున్నాడని భావించి, రెండు రోజుల పాటు గదిలో ఖైదు చేసి శిక్షిస్తాడు. కాస్సిడి మాత్రం గొంగళి పురుగును చూస్తూ ఎంతో నిబ్బరంగా గడిపేస్తాడు. కథాంతంలో ప్రకృతిని – జీవిని గౌరవించే కాస్సిడి కన్నీళ్ళతో పాఠకుల మనస్సులో మహోన్నతంగా నిలుస్తాడు . బాలుడి మనస్సు అర్థం చేసుకోలేని బ్రదర్ జరిపించే ప్రార్థనలకు ఏం విలువ ఉంటుంది? జీవిని, జీవితాన్ని ప్రేమించడం తెలియని బ్రదర్ ఎన్ని ప్రేయర్లు జరిపించినా ఏం ప్రయోజనం? ఇక్కడ మరోక విషయం సీతాకోక చిలుకగా రూపాంతరం చెందబోయే గొంగళిపురుగును బ్రదర్ టిమోతి బలవంతంగా చంపేస్తాడు. అంటే పూర్ణ మానవుడిగా అద్భుత

ప్రపంచంలోకి ఎగురబోయే పసివాడి హృదయం అనే సంకేతం కూడా ఉంది ఆలోచిస్తే.ఇది బ్రిటీష్ కథానిక.

అరబ్బుల అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని వినియోగించుకుని యూదులు వారి పొలాలను, ఇండ్లను, ఆస్తులను ఎలా ఆక్రమించుకున్నారో తెలిపే కథ ప్రతిఘటన. నిజానికి ఇది ఒక వాస్తవ గాథ. ఇది పాలస్తీనా కథానిక.

బాల్యంలోనే సమాజం గురించి బాధ్యతగా ఆలోచించే ఒక బాలుడి కథ 'గుండ్రని చిక్కుళ్ళు'. తన పథకానికి అడ్డుపడుతుందన్నప్పుడు ప్రేమించే తల్లితోనైనా విభేదించాడు. తల్లి పసివాణ్ణి పసివాడిగానే, తన కొడుకుగా మాత్రమే చూడగలుగుతుంది. కానీ ఆ బాలుడు క్రాంతి దర్శి అనే విషయం కాలక్రమంలో ఎప్పటికో గాని ఆమె తెలుసుకోలేదు. ఇది చైనీస్ కథానిక.

'సరైన ఎన్నిక' కథలో శ్రీమతి షా అనే ధనిక గృహిణి అతిథిగా వచ్చిన ఓ యువ చిత్రకారుడితో పిచ్చపాటి మాట్లాడుతూ ఉంటుంది. అదృష్టం మీద తనకు నమ్మకం లేదని, తను తీసుకున్న సరైన నిర్ణయమే తనకు ఇలాంటి ప్రశాంతమైన, విలాసవంతమైన, సుఖమయమైన జీవితం లభించడానికి కారణం అయిందని చెబుతుంది. కథ చివరలో ఆమె తీసుకున్న నిర్ణయం సరైనదేనని రచయిత చాలా బాగా చెప్పారు. ఇది బ్రిటీష్ కథానిక.

'అరణ్య భవనం' కథలో 'నేను' అనే ప్రధాన పాత్రలో మనల్ని మనం చూసుకోవచ్చు. కుక్కను తీసుకుని ఉదయం వేళలో వాహ్యాళికెళ్ళడంలోని అనుభవాల్ని కథ చదువుతున్నంతసేపూ మనమూ అనుభవిస్తాం. వాస్తవం, కల్పన దట్టమైన అడవిలోని వెలుగునీడల్లా కదిలిపోతుంటాయి. చిత్ర విచిత్రాలుగా ఉంటుంది కథ. పాఠకుల్ని ఆసక్తిగా చదివింపజేస్తాయి. ఇది జపనీస్ కథానిక.

ఆటవిక వ్యవస్థ పరిఢవిల్లుతున్న చోట కూడా ఒక రకమైన న్యాయబద్ధమైన తీర్పులు ఉంటాయని చెబుతోంది 'తీర్పు' కథ. క్షణికావేశాలతో జీవితం ఎంత దుర్భరమైపోతుందో వివరించారు రచయిత. ఇది పాకిస్థానీ కథానిక.

గొప్ప నటుడిగా పేరున్న కళాకారుడు తన కొత్త నాటకానికి మానసికంగా సంసిద్ధం కావడమే 'అభినయం' కథలోని ఇతివృత్తం. వేయబోయే నాటకంలోని చరమాంకంలో ప్రదర్శించాల్సిన ఒక అభినయం గురించి, ఒక వ్యక్తీకరణ గురించి నటుడు తపించిపోవడమే ఈ కథ. అనూహ్యంగా ఎదురైన ఒకానొక సంఘటన వల్ల అతను అభినయించాల్సిన అంశం అతనికి లభిస్తుంది. అన్వేషణ పూర్తవుతుంది. సరదాగా హాయిగా సాగే 'అభినయం' అనే కథలో నాటకరంగ వాతావరణం కనిపిస్తుంది. ఇది స్పానిష్ కథానిక.

ఎదుటివారి ప్రతిభను గుర్తించలేని మనిషి ఎప్పుడో ఒకసారి దెబ్బతినక మానడు అనే విషయాన్ని స్పష్టంగా చెప్పిన కథ "ప్రతీకారం". ఇది మాంట్రియల్ నేపథ్యంలో నుంచి వచ్చిన కెనెడియన్ కథ. తన ప్రదర్శన అభాసుపాలవుచున్నా సంయమనంతో హుందాగా వ్యవహరించి, తన ప్రత్యర్థిపై ప్రతీకారం తీర్చుకున్న ఇంద్రజాలికుడి ఆత్మవిశ్వాసం మనకు ఈ కథలో కన్పిస్తుంది.

### 4.6.5. భారతీయ కథా ప్రతిబింబం:

దేవరాజు మహారాజు 2014లో అనువదించిన 34 కథల సంకలనం ఈ భారతీయ కథలు. వివిధ భారతీయ భాషల్లో వచ్చిన కథా ధోరణుల్ని అర్థం చేసుకోవడానికి ఇవి సరిపోవు. కాని కొన్ని విషయాలు మాత్రం తెలుస్తాయి.

ఈ కథ సంకలనంలో బెంగాలీ నుండి మూడు కథలను, ఇంగ్లీషు నుండి ఏడు కథలను, గుజరాతీ నుండి ఒక కథను, హిందీ నుండి ఏడు కథలను, కన్నడం నుండి రెండు కథలను, మళయాళం నుండి నాలుగు కథలను, పంజాబీ నుండి ఒక కథను, సింధీ నుండి ఒక కథను, తమిళం నుండి ఐదు కథలను, ఉర్దూ నుండి మూడు కథలను ఇందులో చోటు చేసుకున్నాయి.

ఈ అనువాద కథల్లో గమనించాల్సిందేమంటే కథ నిడివి. అన్నీ చిన్న కథలే. అంతేకాదు తక్కువ నిడివిలోనే మనిషిలోని స్వార్థాన్ని, కుటిలత్వాన్ని, ప్రభుత్వ వంచనను మానవీయ కోణంలో ఘాటుగా ప్రశ్నించే కథలు ఇవి.

మన కోసం మనం బతకడం కన్నా ఇతరుల కోసం బతకడం గొప్ప అన్న విషయం 'గడ్డి పరక' కథలో ఉంది. రమాబాయికి చర్విత చర్వణంలా సాగే జీవితం మీద విసుగు పుట్టదు. భర్తను చూసుకోవడంలో అతని కోసం ఎదురుచూడడంలో ఆనందం పొందుతుంది. రమాబాయికి గడ్డి పరకకూ మధ్య పోలికను చెప్పారు రచయిత. ఇది మరాఠీ కథ.

'ఉప్పు' కథ ముండా జాతి ఆదివాసుల సమస్యపైనే ఆధారపడి ఉంది. జీవశాస్త్ర ప్రకారం ప్రకృతిలో ఒక ఆహార శృంఖలం కొనసాగుతూ ఉంది. దీనిలో ఎవరికి దొరకాల్సిన ఆహారం వారికి, దేనికి అందాల్సిన తిండి దానికి అందుతూ ఉండాలి. అదే ప్రకృతి ధర్మం. ఒకవేళ ఈ శృంఖలం దెబ్బ తింటే, దాని చెడు ప్రభావాలు వేరే వాటిపై విపరీతంగా ఉంటాయి. ఈ కథలో ఈ అంశం చాలా స్పష్టంగా ఉంది. అశ్రద్ధ చేయబడుతూ, అలక్ష్యానికి గురవుతూ ఉన్న ఆదివాసులకు – ఉప్పు వంటి కనీసావసరం కూడా దొరకడం లేదని బాహ్యంగా చెబుతూ, అంతర్గతంగా విచలితమవుతూ ఉన్న ప్రకృతిని, మానవ ప్రకృతిని రచయిత ప్రతిభావంతంగా చిత్రీకరించారు. ఇది బెంగాలీ కథ.

చనిపోయిన ఒక మనిషి నీడకు కొడుకు ఒక విధంగా, భార్య మరో విధంగా స్పందించడం 'నీడ' కథలో చూడవచ్చు. మనిషి మాయమైనా, మనిషి తాలూకు జ్ఞాపకాలు వదలవు కదా! ఒకే సంఘటనకు రెండు భిన్నమైన ప్రతిస్పందనల్ని చూపించారు రచయిత. ఇది ఇంగ్లీషు కథ.

పరాయీకరణకు గురైన ఒక దళితుడి ఆత్మ క్షోభను 'అంటరానివాడు' కథలో వర్ణించారు. దళితుల గూర్చి, దళిత సాహిత్యం గూర్చి ఆంధ్రదేశంలో విస్తృతమైన చర్చలు జరుగుతున్న నేపథ్యంలోంచి వచ్చిన కథ అంటరానివాడు. ఇది ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదం.

చావు బతుకుల్ని తాత్త్విక కోణంలోంచి చూపే కథ 'అతని ఆకాశం'. వృద్ధాప్యంలో మంచాన పడిన వారి ఆలోచనలకు రూపం ఇచ్చిన కథ ఇది. అది చావు కాదు బతుకూ కాదు. ఇది హిందీ కథ.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తొలి రోజులలో పరాయికరణకు అలవాటుపడిన ఓ బారిస్టర్ జీవిత కథ 'కర్మ'.

'పరమాన్నం' అనే కథలో రచయిత ఒక మహా విషాదాన్ని ఒక చిన్న సంకేతంలో అర్థవంతంగా చెప్పి ముగించడం ఈ కథలోని ప్రత్యేకత.

దేవుడికి, నాస్తికుడికి మధ్య స్నేహాన్ని గురించి చెప్పిన కథ 'దేవుడితనం'. ఈ కథలో దేవుడు మనిషిగా మారి నాస్తికుడితో స్నేహం చేయటం జరుగుతుంది.

బలవంతుడికి, బలహీనుడికి మధ్య జరిగిన సంఘర్షణను గూర్చి తెలిపే కథ 'చీమబలుడు'. చీమకు, ఒక యోగికి మధ్య జరిగిన సంఘర్షణ.

మనిషికి, కోతికి మధ్య జరిగిన సంభాషణల గురించి తెలిపే కథ వా–నరావ'తారం'. ఈ కథలో కోతి మనిషిగా, మనిషి కోతిగా మారుతారు.

### 4.6.6. భారతీయ భాషల్లో స్త్రీవాద కథలు:

ఆధునిక భారతీయ సాహిత్య రంగంలో తమదైన గొంతు వినిపిస్తున్న కవయిత్రులు, రచయిత్రులు ఎంతో మంది ఉన్నారు. అటు సాంప్రదాయక విలువల్ని గౌరవిస్తూనే, ఇటు ప్రగతిశీల దృక్పథాల్ని వ్యక్తపరిచారు. సహజీవనంలోని సుఖశాంతుల్ని, కుటుంబ వ్యవస్థలోని ఆనందోత్సాహాల్ని చూపగలిగినవారు కొందరైతే, స్త్రీ దృక్కోణంలోంచి సూటిగా సమాజాన్ని ప్రశ్నించినవారు కొందరు. భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు వేరైనా, అందరూ కొన్ని మౌలిక సూత్రాలను అనుసరించి రచనలు చేసినవారే. ఇందులో అన్ని వర్గాలకు సంబంధించిన

కథలున్నాయి. ఈ కథా సంపుటిలో "సూర్యాస్తమయం, జడివాన, ఆమె, మన ఇల్లు, యోగి, ఎడబాటు, జీవిత ఖైదీ, హాస్త్రీ మొదలైన కథలు ఉన్నాయి.

**సూర్యాస్తమయం (కన్నడ కథ) – కళ్యాణమ్మ:**

కళ్యాణమ్మ రచనల్లో ఒక ప్రత్యేకత ఉంది. స్త్రీ దృక్కోణంలోంచి రచనలు చేసినా అవి జాతీయ సమైక్యతను కాపాడడానికి, దేశభక్తిని పెంపొందించడానికి ఉపయోగపడ్డాయి.

'సూర్యాస్తమయం' కథ 1540–97 మధ్య కాలాన్ని ప్రతిబింబించింది. రాజపుత్ర సోదరులకు ద్రోహం తలపెట్టి, తన స్వార్థం కోసం, అధికార దాహంతో మాన్సింగ్, అక్బర్ వంచన చేశాడని జోధాబాయి తీవ్రంగా నిరసిస్తుంది.

**మన ఇల్లు (హిందీ కథ) – హోమవతి దేవి:**

'మన ఇల్లు' కథలో ఉమ ప్రధాన పాత్రధారి. ఆమెను అటు మెట్టింటివారు, ఇటు పుట్టింటివారు ఎలా హింసించారన్నది ఈ కథలో చూడవచ్చు. ప్రతి స్త్రీకి తనకంటూ ఒక వ్యక్తిత్వం, తనకంటూ కొంత ఆస్తి ఉండడం ఎంత అవసరమో ఆలోచించడం మంచిదని రచయిత్రి అభిప్రాయం.

**యోగి (కన్నడ కథ) – సరస్వతీబాయి రజ్వాడే:**

'యోగి' కథను 1930–40 మధ్య కాలంలో రాశారు. మన దేశంలో దొంగ బాబాలు, స్వాములు పెరిగిపోక ముందే, ఆశ్రమాల్లో హత్యలు జరగడం ప్రారంభం కాకముందే, అబల సబలగా మారిన వైనాన్ని ఈ కథలో చిత్రించారు రచయిత్రి.

**ఎడబాటు (గుజరాతీ కథ) – ధీరూబెన్ పటేల్:**

ఈ కథలో కథానాయికా నాయకులు విమల్ – రానా. ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. అయినా వారి మధ్య దూరం పెరిగింది. దంపతుల మధ్య మానసిక, లైంగిక, సామాజిక బంధాలెన్నో ఉంటాయి. ఎందులో ఎక్కడ ఏ పొరపాటు జరిగినా బాంధవ్యం తెగిపోతుంది. ఒకటిగా ఉన్నప్పుడున్న ఆత్మవిశ్వాసం, భద్రత, గౌరవం ఒంటరిగా మిగిలిపోయినప్పుడు ఉండవు. ఈ కథలో ఇల్లు విడిచి వెళ్లిన రానా చివరకు భర్తను కలుసుకుంటుంది. స్త్రీ పురుష సంబంధాల మీద మంచి అవగాహనతో ఈ కథ రాశారు.

**జీవిత ఖైదీ (ఉర్దూ కథ) — హజీరా షకూం:**

ఈ కథలో వరకట్న దురాచారాన్ని ఎత్తి చూపుతూనే స్త్రీకి కావాల్సిన సమానత్వాన్ని, ఆదరణని వర్ణించారు రచయిత్రి. ఇందులో స్త్రీ ఉద్యమ స్ఫూర్తి లేదు. కాని దాన్ని మించిన హృదయ స్ఫూర్తి ఉంది. అయితే కథానాయిక జానకి భారతీయ గృహిణులందరికీ ప్రాతినిధ్యం వహిస్తుందనడంలో సందేహం లేదు.

**జడివాన (మరాఠీ కథ) — క్రిష్ణాబాయి:**

ఆమె ఒక పెద్ద కాలేజీలో మాథమాటిక్స్ లెక్చరర్. అధ్యాపక వృత్తితో సమాజంలో మంచి గుర్తింపు పొందినా ఆమెకు సంతృప్తి కలగలేదు. భావితరాలకు తన మేధా సంపత్తిని అందిద్దామనుకుని ఓ బృహత్ గ్రంథం రాయాలని సంకల్పించారు. ఆమెతో కలిసి పనిచేసే ముగ్గురు సహాధ్యాయులు ఆమెను ప్రేమించారు. ఆమెను తమదానిగా చేసుకోవాలని ఆరాటపడ్డారు. విడివిడిగా ఎవరికి వారు ప్రయత్నించారు. అందరి ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు ఆమె పూర్తి చేయాల్సిన గ్రంథం పూర్తిచేశారు. ఈ కథలో గణిత శాస్త్ర అధ్యాపకురాలైన కథానాయిక ఆలోచనలు పరోక్షంగా రచయిత్రి ఆలోచనలే అని చెప్పవచ్చు.

★★★

# అధ్యాయం – 5

# భారతీయ సినిమా విశ్లేషణ

# అధ్యాయం – 5

## భారతీయ సినిమా విశ్లేషణ

దేవరాజు మహారాజు అనువదించిన పథేర్ పాంచాలి, ప్రయోజన సినిమా అను వ్యాసాలను నా పరిశోధన దృష్ట్యా పరిశీలిస్తున్నాను.

### 5.1. సినిమా పరిచయం:

చలన చిత్రానికి ఆంగ్లంలో 'సినిమా, మూవీ, ఫిల్మ్' అనే పదాలు వాడుతూ ఉంటారు. నిజానికి మొదటి రెండు (సినిమా, మూవీ) తీయబడిన చిత్రాలకి సంబంధించిన పర్యాయపదాలైతే, ఫిల్మ్ అనేది చలనచిత్రం తీయడానికి ఉపయోగించే ముడిసరుకు కొరకు ఉపయోగించే పదం.

'మూవీ' అనే పదం 'మూవింగ్ ఇమేజస్' నుండి వచ్చింది. దానికి సమానార్థకంగా చలిస్తున్న చిత్రాలతో కూడినది కాబట్టి చలనచిత్రం అనే పదం పుట్టింది. ఒక సెకనుకి ఇరవై నాలుగు బొమ్మలు (ఫ్రేములు) కదులుతుంటే ఈనాడు జనం చూస్తున్న సినిమా అవుతుంది. అంతకంటే తక్కువ ఫ్రేములైతే కదలిక అసహజంగా ఉంటుంది. చార్లీ చాప్లిన్ సినిమాలు, ఇప్పుడు చూస్తే స్వాతంత్ర్యోద్యమం తాలూకు డాక్యుమెంటరీలు పద్దెనిమిది ఫ్రేముల చొప్పున కదలబట్టే గాంధీగారు చాలా వేగంగా నడుస్తున్నట్టు కనిపిస్తుంది.

అదే నలభై ఎనిమిది, తొంభైయారు అలా ఎక్కువ ఫ్రేములు నడిస్తే స్లోమోషన్ అంటారు. కొన్ని చిత్రాలు ఒక పద్ధతిలో నడుస్తున్నప్పుడు ఆ కదలిక వెండితెర మీద సజీవమై కనిపించటమే సినిమా.

ఈనాడు ప్రపంచంలో ఉన్న సుమారు ఏడు వందల కోట్ల ప్రజలకు వినోదాన్ని అందిస్తున్న ఏకైక ప్రక్రియ చలనచిత్ర ప్రక్రియ. అదే సినిమా.

**పుట్టుక**:

సినిమాని ఎవరూ కనిపెట్టలేదు. ఒక విమానంలాగా, ఆకాశవాణిలాగా, రైలు ఇంజన్లాగా (పొగబండిలాగ). అది ఒక వ్యక్తి చేత ఒకరోజు కనిపెట్టబడిన వస్తువు కాదు. కొన్ని వందల సంవత్సరాల పాటు రూపాంతరం పొందుతూ వచ్చిన దృశ్యకావ్య ప్రక్రియ.

మన తెలుగునాట దృశ్య, శబ్ద, సంగీత సమ్మిళితమైన వినోద ప్రదర్శన ప్రారంభమయ్యింది కురవంజితో. మహారాజులు వేట కోసం వచ్చి, మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకునే సందర్భంలో, విందుకుడుస్తూ వినోదాన్ని ఆకాంక్షించే నేపథ్యంలో, ఆటవికులు, ప్రభువులను

ప్రసన్నం చేసుకోవటం కోసం, ఆడుతూ పాడుతూ, మృగాల వలే నర్తిస్తూ, డప్పులు, కొమ్ము బూరలతో వాయిద్యాలు వాయిస్తూ, గానం చేస్తూ అడుగులు వేసే ప్రక్రియ కురవంజి.

## 5.2. గ్రామీణ జీవిత చిత్రాలు:

మన భారతదేశంలోని గ్రామాలు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా కనిపిస్తాయి. రాజకీయ నాయకులకు బ్యాలెట్ బాక్సుల్లా కనిపిస్తే, శాస్త్రవేత్తలకు అనాగరిక వాసాలుగా, మేధావులకు నిరక్షర రూపాలుగా, సంప్రదాయవాదులకు జన్మజన్మల పాపకూపాలుగా కనిపిస్తూ ఉండొచ్చు. ఎవరెవరి దృష్టి కోణాన్ని బట్టి, పల్లెలు వారికి అలా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కష్టజీవుల నిలయాలుగా, నైతిక విలువల ఆలయాలుగా, కవులు, కథకులు, చిత్రకారులు, చలనచిత్ర దర్శకులు గ్రామీణ భారతాన్ని చిత్రిస్తూ వస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పల్లెలకు అవినాభావ సంబంధం ఉందని ఆర్థికవేత్తలు గ్రహించారు. మూఢనమ్మకాలకు పల్లెలు ఆటపట్టులని, వాటిని సంస్కరించాల్సిన అవసరం ఉందని సాంఘిక కార్యకర్తలు తీర్మానించారు. స్థూలంగా చూస్తే భారతదేశపు ఆత్మ ఇంకా పల్లెల్లోనే ఉందని అందరూ అంగీకరిస్తారు.

నేటి పారిశ్రామిక ప్రగతి, వైజ్ఞానిక పురోగమనం, సంకీర్ణ సామాజిక వ్యవస్థల నేపథ్యంలోంచి గ్రామీణ భారతం వైపు దృష్టి సారిస్తూ, మన భారతీయ చలన చిత్ర దర్శకులు మహోన్నతమైన చిత్రాల్ని రూపొందించారు.

సత్యజిత్ రే 'పథేర్ పాంచాలి', శ్యాం బెనగల్ 'అంకుర్', గిరీష్ కర్నాడ్ 'సంస్కార', బి. నర్సింగరావు 'మట్టి–మనుషులు', గౌతమ్ ఘోష్ల 'మా భూమి' వంటి చిత్రాలు 20వ శతాబ్దపు అంచున నిలబడి, గతంలోకి దృష్టి సారించి, గ్రామీణ భారతాన్ని సమీక్షించినవే.

భారతీయ గ్రామీణ జీవితానికి అనేక ప్రత్యేకతలున్నాయి. అందువల్ల ఆ జీవితాన్ని చిత్తశుద్ధితో చిత్రించే చిత్రాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. ఉత్తమ చిత్రాలుగా ఎన్నికైన ఏ భారతీయ భాష చలన చిత్రాన్నైనా నిశితంగా పరిశీలిస్తే అది తప్పకుండా గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించేదే అయి ఉంటుంది. సమాంతర సినిమా నిజాయితీతో, చిత్తశుద్ధితో గ్రామీణ జీవితంలోని మౌలిక విలువల్ని, సున్నితత్వాన్ని, అమాయకత్వాన్ని, సంపదను, సహనాన్ని అతి చాకచక్యంగా వెండి తెరపై అందిస్తోంది.

భారతీయ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. భాషాపరమైన రాష్ట్రాలు ఏర్పడి ఉండడం వల్ల, దేశంలోనే సుమారు పదహారు భాషల్లో చలనచిత్రాలు తయారవుతున్నాయి. అన్ని రాష్ట్రాలలో సినిమా ఉద్యమం కొద్దో గొప్పో కొనసాగింది. అందువల్ల ప్రజల జీవిత విధానాల్ని, సమస్యల్ని,

ఆచారవ్యవహారాల్ని, నమ్మకాల్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని, విభిన్న ఆలోచనా ధోరణుల్ని ప్రతిబింబించే సినిమాలు అన్ని భాషలలోనూ వెలువడ్డాయి.

అన్ని భాషల్లోని సినిమా దర్శక నిర్మాతలు ప్రధానంగా గ్రామీణ జీవితం పైనే దృష్టి సారించారు. "పథేర్ పాంచాలి" (బెంగాలీ) నుంచి మన "మట్టి మనుషులు" (తెలుగు) దాకా గమనిస్తే అన్ని సినిమాల్లోను మనకు పల్లె జనమే కనిపిస్తారు.

దర్శక నిర్మాతలు నగర నాగరిక జీవితానికి అలవాటు పడ్డవారు కావచ్చు. కాని వారు సినిమా తీయాలనుకున్నప్పుడు మాత్రం ముడిసరుకుగా గ్రామాల్నే వాడుకుంటున్నారు. సంప్రదాయ సిద్ధంగా వస్తున్న జానపద కళ నశించి పోకూడదని వారు కోరుకుంటున్నారు. అందుకే ఇలాంటి సినిమాల్లో ఏదో ఒక సందర్భంలో జానపద కళా ప్రక్రియల్ని దర్శకులు తప్పనిసరిగా వాడుకుంటున్నారు. పల్లెటూరి వారిని ఏమీ తెలియని 'బైతు'లుగా సృష్టించి వ్యాపార సినిమా హాస్యాన్ని సృష్టిస్తే అందుకు భిన్నంగా వారినే ముఖ్య పాత్రధారులుగా (హీరో)గా మలిచి, సమాంతర సినిమా వారి జీవితాన్ని దర్శింపజేస్తోంది. ఈ బాధ్యతను భారతీయ సినిమా దర్శకులంతా చిత్తశుద్ధితో చేశారు.

## 5.3. ఫిలిం సొసైటీ ఉద్యమం:

భారతదేశంలో ఫిలిం సొసైటీలు ఆవిర్భవించకపోతే, మనకు మంచి సినిమాలు మచ్చుకైనా మిగిలేవి కావు. సగర్వంగా చెప్పుకోవడానికి మంచి దర్శకుల పేర్లు ఓ నాలుగైనా ఉండేవి కావు. నిజానికి సత్యజిత్ రే, మృణాల్సేన్ వంటి దర్శకులు మారుమూల పల్లె ప్రజలకు కూడా అది ఫిల్మ్ సొసైటీల కృషి ఫలితమే. అయితే సొసైటీల పునాదికి, విస్తరణకు పరిచయం అయ్యారు అంటే సినిమా దర్శకులే మూల కారణం. ఆ అవసరాన్ని వారు గుర్తించి అందుకు ఎంతో కృషి చేశారు. ఈ విషయంలో మొట్ట మొదట మలయాళ చిత్ర దర్శకుడు ఆదూరు గోపాలకృష్ణన్ కృషి చెప్పుకోవాలి. FTII నుండి దర్శకత్వంలో పట్టభద్రుడైనతర్వాత అన్న ఆదూరు, భాస్కరన్ నాయర్తో కలిశాడు. భాస్కరన్ నాయర్ జర్నలిజం చేసి ఖాళీగా ఉన్న రోజులవి. వీరిద్దరూ 1965లో త్రివేండ్రంలో 'చిత్రలేఖ' ఫిల్మ్ సొసైటీ ప్రారంభించారు. కళాత్మక విలువలు గల చిత్రాలను ప్రజలకు చూపించడం, అర్థం చేయించడం, అందుకు కావాల్సిన కరపత్రాలు, పత్రికలు ముద్రించడం సొసైటీ కార్యకలాపాలుగా ఉండేవి. చిత్రలేఖ బ్యానర్లోనే 1972లో ఆదూర్ 'స్వయంవరం' సినిమాను రూపొందించాడు. అది ఆ సంవత్సరం రాష్ట్రపతి బంగారు పతకం సాధించింది. దేశంలో ఇతర ప్రాంతాలలో ఫిల్మ్ సొసైటీలు ఆవిర్భవించడానికి అది స్ఫూర్తినిచ్చింది.

చిత్రలేఖ ఫిల్మ్ సొసైటీ అడుగుజాడల్లో కలకత్తా ఫిల్మా సొసైటీ ఏర్పడింది. సొసైటీ చేయాల్సిన పనులన్నీ చేస్తూనే, చిదానంద్ దాస్ గుప్తా దర్శకత్వంలో "A Portrait of a City" రూపొందించింది. ఫిలిమ్స్ డివిజన్ ఆ చిత్రాన్ని దేశమంతా పంపిణీ చేసి ప్రదర్శించింది. సినీ సెంట్రల్ అనబడే మరో సొసైటీ కూడా కలకత్తాలో చిత్ర నిర్మాణం చేపట్టింది. ఫిలిం సొసైటీల ప్రాముఖ్యం, మెల్లమెల్లగా దేశమంతా తెలిసొచ్చింది. మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు ముందుకు వచ్చారు. చలనచిత్ర రంగానికి చెందిన ఎంతోమంది ప్రముఖులు సొసైటీల నిర్మాణంలో పాలుపంచుకున్నారు. రాజకీయాలపై కార్టూన్లు వేసే బాసు ఛటర్జీ, కార్టూనిస్టుగా, పెయింటర్గా ప్రసిద్ధుడైన జి. అరవిందన్, వ్యాపార ప్రకటనల చిత్రాలు నిర్మించే శ్యాంబెనగల్ ఒక్కొరొక్కరు ఫిలిం సొసైటీ ఉద్యమంలోకి దిగివచ్చారు. మంచి కళాత్మక విలువలు గల సినిమాలు తీయదల్చుకుంటే, ముందు అలాంటి చిత్రాలు చూసి ప్రశంసించగల ప్రేక్షకుల్ని తయారు చేసుకోవాల్సిన అవసరాన్ని వీరందరూ గుర్తించారు. వారి వారి ప్రాంతాల్లో, వారి వారి స్థాయిల్లో వారు కృషి చేశారు. ఫిలిం సొసైటీలు వేళ్ళు తన్నుకుని నిలబడి, జనంలో ఒక జాగృతిని కలిగించాలన్నదే వారి అభిమతం. అటూ కలకత్తా నుండి సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్లు, కర్ణాటక నుండి గిరీష్ కర్నాడ్, మహారాష్ట్ర నుండి గోవింద్ నిహలనీ, జబ్బార్ పటేల్ మొదలైన వారంతా ఫిలిం సొసైటీల అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసినవారే. విచిత్రం ఏమిటంటే వీటన్నిటి మధ్యలో ఉన్న హైదరాబాద్లో కూడా సృజనాత్మకతకు నిలువ నీడ లేకుండా పోయింది. ప్రయోగశీలత అంతకంటే లేదు. తెలుగు నిర్మాతలు, దర్శకులు, కవులు, రచయితలు మూసలో పోసినట్టు అదే పాత వ్యాపార ప్రవాహంలో పడి కొట్టుకుపోయారే గాని, కొత్త ఆలోచనలతో కొత్త ప్రయత్నాలు మొదలు పెట్టలేకపోయారు. ఎడారిలో పచ్చని మొక్కలాగా, ఒక బి. నర్సింగరావు ఆశ కల్పించాడు. చెప్పుకోదగ్గ సినిమాలు తీసి చూపాడు. మరోవైపు సికింద్రాబాద్ ఫిలిం క్లబ్ స్థాపించి కొంతకాలం విజయవంతంగా నడిపించాడు. హైదరాబాద్ ఫిలిం క్లబ్ మాక్స్ముల్లర్ భవన్ వాళ్ళతో కలిసి ఈ ఉద్యమంలో తన వంతు కృషి చేశాడు.

### 5.4. సినిమాకు అంకితమైన రిత్విక్ ఘటక్:

సినిమా హాల్లో లైట్లన్నీ ఆరిపోతాయి. వెండి తెర మీద సినిమా మొదలవుతుంది. వివిధ స్థలాల నుండి వచ్చిన ప్రేక్షకులు, వివిధ తరగతులలో కూర్చొన్న ప్రేక్షకులు, వివిధ మనస్తత్వాలు కలిగిన ప్రేక్షకులు అంతా ఒక్కటవుతారు. సినిమా చూడడంలో పూర్తిగా నిమగ్నమైపోతారు. ఆ స్థాయిలో అక్కడ తేడాల్లేవు. సినిమా దాదాపు అందరికి ఒకేలాగా అర్థమవుతుంది. అంటే ఇక్కడ ఒక

విషయం గ్రహించాలి. సినిమా అందరిపై ప్రభావం చూపిందన్నమాట. సినిమాను మించిన బలమైన మాధ్యమం మరొకటి లేదన్నమాట. ఖచ్చితంగా అదే అభిప్రాయంతో ప్రింట్ మీడియాను వదిలి, సినీ మీడియాకు వచ్చిన మహావ్యక్తి రిత్విక్ ఘటక్. బెంగాలీ కథా రచయితగా, నవలాకారుడిగా ప్రసిద్ధుడైన రిత్విక్, తన భావ వ్యక్తీకరణకు రచనల కంటే అనువైనది సినిమా అని గ్రహించాడు. అది జనానికి అతివేగంగా అందగలదని కూడా తెలుసుకున్నాడు. సినిమా కేవలం వినోదం కోసమే కాదని, దానికొక బాధ్యత కూడా ఉందని తెలియ చెప్తూ, భారతీయ సినిమాకు పునాదులు వేశాడు రిత్విక్. ఇతని "నాగరిక్" చిత్రం 1952లో పూర్తి అయితే సత్యజిత్ రే "పథేర్ పాంచాలి" 1955లో వెలువడింది.

సినిమా అనగానే భారతదేశంలో ఆద్యుడు సత్యజిత్ రే కదా అని చాలామందికి అనుమానం కలుగుతుంది. కాని రే కంటే ముందే "నాగరిక్", "అజంత్రిక్" చిత్రాల నిర్మాణంలో రిత్విక్ రంగంలో ఉన్నాడు. నిజానికి అంతకు ముందే "బెదిని" అనే చిత్రం కూడా తీశాడు. ఏ కారణాల వల్లనో అది వెలుగు చూడలేదు. "నాగరిక్" రిత్విక్ తీసిన రెండో సినిమా. కాని అది అతని మరణానంతరం 1978లో విడుదలైంది. సమాంతర సినిమా రిత్విక్ ఘటక్తో మొదలైందన్న నిజం వెలుగులోకి వచ్చింది. రిత్విక్కు దక్కాల్సిన ఘనత, సత్యజిత్రేకు దక్కడమేమిటన్న వాదన తీవ్రమయ్యింది. స్వయంగా సత్యజిత్రే నే రిత్విక్ను నియోరియలిస్ట్గా ఒప్పుకున్నాడు. బెంగాల్ జీవితాన్ని తనకంటే కూడా ఎక్కువ సమర్థవంతంగా చిత్రించింది ఆయనేనని ప్రకటించాడు.

కథా రచయితగా లేదా చలనచిత్ర దర్శకుడిగా కాక, నాటక రంగంలో కార్యకర్తగా రిత్విక్ అమోఘమైన కృషి చేశాడు. అఖిల భారత ప్రజానాట్యమండలి (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్-IPTA) కి నాటకాలు రాశాడు, నటించాడు, దర్శకత్వం వహించాడు. ఆ రకంగా నాటకోద్యమానికి ఎనలేని కృషి చేశాడు. బెంగాల్ విభజింపబడక ముందు యుద్ధపు రోజుల అనుభవాల్ని, స్వాతంత్రోద్యమ చివరి దశను, ఆయన నాటకాల్లోను, సినిమాల్లోను చిత్రించాడు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు డెబ్బయి అయిదేళ్లు (75) నిండిన సందర్భంగా దూరదర్శన్ వారు "నాగరిక్", "కోమల్ గాంధార్" ప్రసారం చేశారు. ఈ తరానికి రిత్విక్ను తెలుసుకునే ఒక మంచి అవకాశం కలిగించారు. రిత్విక్ సినిమాలు చూసి, ఇటీవలి సినిమాలు చూస్తే సహజత్వం నుండి చిత్ర పరిశ్రమ అసహజత్వంలోకి ఎలా కూలిపోయిందో అర్థమవుతుంది.

బెంగాల్ ప్రాంతీయత, మధ్య తరగతి జీవన సంఘర్షణ రిత్విక్ కుమార్ ఘటక్ సినిమాల్లో సాధించిన విజయం. మానవ సంబంధాలు అందులోని సున్నితత్వం అతి సహజంగా ఆయన

చూపించారు. భారతీయ సంప్రదాయం పట్ల ఆయనకు అతీతమైన విశ్వాసం ఉంది. కొన్ని సినిమాల నేపథ్యంలో వాడుకున్న వేద పఠనం దాన్ని వెల్లడి చేస్తుంది. తాగినవాడి పాత్రో, పిచ్చివాడి పాత్రో, పిల్లవాడి పాత్రో ఆయన చిత్రాలలో తప్పకుండా ఉంటుంది. అవి దర్శకుడి స్వంత అభిప్రాయాలను వెల్లడిస్తూ ఉంటాయి. భారతీయత అంటే పులకించిపోయి, భారతీయులు తలెత్తి చెప్పుకోగలిగే మహా స్వాప్నికుడు, మహా దర్శకుడు, పద్మశ్రీ రిత్విక్ కుమార్ ఘటక్.

## 5.5. సత్యజిత్ రే:

భారతరత్న, ఆస్కార్ విజేత, చిత్రకారుడు, కథా రచయిత, మానవతావాది సత్యజిత్ రే (1921–1992). భారతీయ సమాజపు నలుపుతెలుపుల్ని కళాత్మకంగా ప్రపంచానికి అందించాడు. జీవిత కాలంలో చేసిన నిర్విరామ కృషికి ఆయనకు 1992లో "ప్రత్యేక ఆస్కార్ అవార్డు" లభించింది. ప్రత్యేక ఆస్కార్ అవార్డు ఇంతవరకు ఐదారుగురికి మాత్రమే లభించింది. కారీ గ్రాంట్ (1969), చార్లీ చాప్లిన్ (1972), అకిరా కురసోవా (1989), గ్రేట్ గార్బో (1995), జేమ్స్ స్టువర్ట్. ఇది మామూలుగా లభించే ఆస్కార్ లాంటిది కాదు. దాని కంటే ఎన్నో రేట్లు విలువైంది. ఒకరకంగా చలనచిత్ర పరిశ్రమలో ఇదొక నోబెల్ బహుమతి లాంటిది. దీనికంటే ఉన్నతమైన బహుమతి ప్రపంచంలోనే లేదు.

రే తొలి చిత్రాలతో పోలిస్తే, చివరి రోజుల్లో తీసినవి భిన్నంగానే ఉన్నాయి. ఏ కళాకారుడైనా జీవితాంతం ఒకే పద్ధతికి అలవాటు పడి పని చేయాలని కూడా ఎక్కడా లేదు. అయితే అన్ని వేళలా కళాత్మక విలువలు నిలబెట్టడం చాలా అవసరం. ఆ పనిని ఆయన జీవితాంతం కొనసాగిస్తూ వచ్చాడు. "పథేర్ పాంచాలి"తో మొదలుకొని "ఆగంతక్" (Agantuk) దాక సుదీర్ఘమైన ప్రయాణంలో ఆయన ఎన్నడు అలసిపోలేదు. ప్రత్యేక ఆస్కార్ అందిన తర్వాత కూడా సినిమాలు తీయడం తనకు అత్యంత ప్రీతిపాత్రమైన విషయమని, పైగా అన్ని పనులు తనే చూసుకుంటూ ఉండడంలో గొప్ప సంతృప్తి ఉందని ఆనందంగా ప్రకటించుకున్నాడు. జీవిత కాలంలో తన చిత్రాలకు తానే స్క్రిప్టు రాసుకున్నాడు. సంగీతం సమకూర్చుకున్నాడు. కాస్ట్యూమ్స్ డిజైన్ చేసుకున్నాడు. ఇతరుల పై ఆధారపడటం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ప్రతి చిన్న విషయాన్ని కాగితం పై రాసుకుని, స్కెచ్లు గీసుకుని షూటింగ్ ప్రారంభించే దర్శకులు బహుశా ప్రపంచంలోనే ఒకరిద్దరున్నారు. ఈ విషయంలో జపాన్ చలన చిత్ర దర్శకుడు అకిరా కురసోవాకు సత్యజిత్ రే చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి.

సత్యజిత్ రే అనగానే దారిద్ర్యాన్ని భూతద్దాల్లో చూపించే దర్శకుడని కొందరు అభిప్రాయపడుతుంటారు. 'భారతీయ సమాజాన్ని' కేంద్రకంగా తీసుకున్నప్పుడు అందులోని అన్ని విషయాలు వాటంతటవే చోటు చేసుకుంటాయి. నిజానికి 'పథేర్ పాంచాలి' తర్వాత ఒకటి రెండు తప్ప, దారిద్ర్యాన్ని ప్రత్యేకంగా చూపిన సినిమాలు లేవు. అలాగే ఉన్నత కుటుంబాల గూర్చి, వారి సమస్యల గూర్చి తీసిన "జల్సాఘర్" లాంటి సినిమాలు కూడా ఉన్నాయి.

1992 ఏప్రిల్ 23న కలకత్తాలోని ఒక నర్సింగ్ హోంలో సత్యజిత్ రే కన్ను మూశాడు. భారతదేశమే కాదు, చలనచిత్ర ప్రపంచం యావత్తు ఒక కళాస్రష్టను కోల్పోయింది. ఠాగూర్ లేని లోటు ఎంతటిదో, సత్యజిత్ రే లేని లోటు అంతటిదే. పుంఖానుపుంఖాలుగా వెలువడిన రే సినిమాలు, స్క్రిప్టులు, కథానికలు, వ్యాసాలు ఏవీ తెలుగు పాఠకులకు అందుబాటులో లేవు.

**5.6. పథేర్ పాంచాలి**:

ప్రముఖ బెంగాలీ నవలా రచయిత బిబూతి భూషణ్ బెనర్జీ నవలను (1929) సత్యజిత్ రే కథాచిత్రంగా రూపొందించి 1955లో ఆధునిక భారతీయ వాస్తవిక చలన చిత్రోద్యమానికి నాంది పలికాడు. చిత్రం రూపొందించడానికి ముందు, ఆ తర్వాత ఆయనకు ఎవరి నుండి ఏ ప్రోత్సాహమూ లభించలేదు. భార్య నగలతో సహా ఆయన తన ఆస్తులన్నీ అమ్ముకుని, తన మొదటి సినిమా తను అనుకున్న విధంగా తీయాలని సంకల్పించుకున్నాడు. ప్రొఫెషనల్ నటీనటుల్ని కాదని, చిత్రీకరణ నాలుగు గోడల మధ్య వేసుకునే సెట్టింగుల్లో కాదని సత్యజిత్ రే ఒక విప్లవాత్మకమైన మార్పుకు పునాదులు వేశాడు. నటనలో ఏ మాత్రం అనుభవం లేని సాధారణ వ్యక్తుల్ని నటీనటులుగా ఎన్నుకున్నాడు. షూటింగ్ అంతా అవుట్ డోర్లో జరిపి వాస్తవికతకు అద్దం పట్టాడు. పాశ్చాత్య దేశాల్లో "పథేర్ పాంచాలి" విజయఢంకా మోగించిన తర్వాత, భారతీయ ప్రేక్షకులు ఆలస్యంగా దాని గొప్పతనాన్ని గుర్తించారు.

చారిత్రకంగా "పథేర్ పాంచాలి" సినిమాలో 1910–1920 నాటి గ్రామీణ పరిస్థితులు చిత్రమయ్యాయి. బెంగాల్లోని ఒక మారుమూల గ్రామం నిశ్చిందిపూర్. తరతరాలుగా ఆ ఊళ్ళో ప్రజలు తమ ప్రపంచంలో తాము బతుకుతూ ఉంటారు. దేశంలో వస్తున్న సామాజిక, ఆర్థిక సాంకేతిక మార్పులు వారికి అంతగా తెలియవు.

హరిహర్ రే, భార్య సర్బోజయ, కూతురు దుర్గ, కొడుకు అపూర్బా (అపూ). ఇవీ ఇందులోని నాలుగు ముఖ్యమైన పాత్రలు. ఇందిర్ అనే వృద్ధ విధవరాలు (పిషి) హరిహర్ రే కు దూరపు

చుట్టం. పూర్వం నుండి వస్తున్న కొన్ని సంప్రదాయ సిద్ధమైన కట్టుబాట్ల మూలంగా ఆమె ఈ కుటుంబం పైనే ఆధారపడి ఉంటుంది. ఇంతకన్నా దగ్గరి బంధువులు ఆమెకు ఎవరు ఉండరు.

హరిహర్ ఒక బ్రాహ్మణ పండితుడు. వంశపారంపర్యంగా ధర్మకర్తృత్వం నెరపే కుటుంబం లోంచి వచ్చినవాడు. రాను రాను మారుతున్న కాలానికి, మతపరమైన వృత్తికి పొత్తు కుదరక అతను ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తాడు. ఒక పెద్ద ధనవంతుడి దగ్గర జమాఖర్చులు చూడడానికి చేరతాడు. అతనిలో కొన్ని గొప్ప కోర్కెలుంటాయి. కవిత్వం రాయాలని, నాటకాలు రాయాలని – వగైరా.

'పథేర్ పాంచాలి'లో మనకు మానవ సంబంధాలు కనిపిస్తాయి. హరిహర్ రే కుటుంబ సభ్యుల మధ్య, వారికి సమాజంలో ఇతర వ్యక్తులకు మధ్య గల సంబంధ బాంధవ్యాల స్వరూపం ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. జీవితమే ఇందులోని హీరో... జీవితమే ఇందులోని హీరోయిన్, జీవితమే విలన్, జీవితమే కమెడియన్. హరిహర్ రే ఇంటికి రెండే రెండు పొరుగిళ్ళు ఉంటాయి. ఒకటి ముఖర్జీ కుటుంబం, రెండు నీలమణి కుటుంబం. ముఖర్జీలది సిరిసంపదలు గల కుటుంబం. వీరు హరిహర్ రే కు రక్త సంబంధీకులు. పూర్వం హరిహర్ తాతగారు ముఖర్జీల దగ్గర మూడు వందలు అప్పుతీసుకున్నాడు. తరాలు మారినా ఆ అప్పు తీరదు. ఇంటి పక్కన గల తోటను అప్పజెప్పి, హరిహర్ తాతల నాటి బాకీ తీర్చేస్తాడు. సినిమాలో కనిపించే ముఖర్జీ కుటుంబ సభ్యులు: శెజ్బో, రానూ, టును, ఇంటి యజమానురాలు శెజ్బో పెద్దావిడ. మధ్యవయస్కురాలు. రాను, టునులు ఆమె కూతుర్లు (దుర్గతో ఆడుకుంటూ ఉంటారు దాదాపు అదే వయసు వాళ్ళు). వీరితో సూడో అనే అబ్బాయి ఇంకా ఇతర పిల్లలు ఆడుకుంటూ ఉంటారు.

నీలమణి కుటుంబంలో అతనూ, అతని భార్య, కూతురు బిని ఉంటారు. హరిహర్ రే ఇల్లు పాతబడి వంగిపోయి ఉంటుంది. ముఖ ద్వారంలో అడుగు పెట్టగానే లోపల విశాలమైన వాకిలి (ఆవరణ) ఉంటుంది. ఆవరణ మధ్యలో తులసికోట ఉంటుంది. ఎదురుగా వరండా, రెండు గదులు ఉంటాయి. అదే హరిహర్ రే ఇల్లు. పక్కన పిషి (ఇందిర్) గది, గుడ్ల చావిడి ఉంటాయి. లోపలి ఆవరణలో హరిహర్ ఇంటికి ఎదురుగా పాడుబడ్డ గుడిసెలు ఉంటాయి. బయట ముఖ ద్వారానికి ఎదురుగా చిన్న కొలను ఉంటుంది. దాని చుట్టూ గట్టుమీద పెద్ద పెద్ద వృక్షాలు, లోపలి వైపు వెదురు చెట్లు ఉంటాయి. హరిహర్ ఇంటికి మరోవైపు, వాళ్ళు బాకీ కింద వదిలేసిన పెద్ద తోట ఉంటుంది. మరోవైపు మంచినీళ్ళ బావి ఉంటుంది. దగ్గరలోనే మరోచోట నీలమణి ఇల్లు ఉంటుంది. కొద్ది దూరంలో రాజు ఇల్లు ఉంటుంది. పిషి, సర్బోజయతో పోట్లాడినప్పుడల్లా కొద్ది రోజులపాటు రాజు

కుటుంబాన్నే ఆశ్రయిస్తూ ఉంటుంది. ఆ వీధి దాటి కొంత దూరం పోతే, ప్రసన్న తాటాకుల గుడిసె కనిపిస్తుంది. ప్రసన్న అసలైతే దుకాణదారుడు. అయితే మరోవైపు పిల్లలకు చదువు కూడా చెబుతుంటాడు. ఇక ఆ ఊరికి అదే బడి.

గ్రామంలో వీధులు సరిగా ఉండవు. అన్నీ పిల్లబాటలే. బాటల పక్కన దట్టమైన పొదలు పెరిగి ఉంటాయి. తీగలు పాకి ఉంటాయి. భారీ వర్షాలు ఆ ప్రాంతంలో అతి సహజం. అవి మట్టిలో కొత్త ప్రాణాల్ని కుమ్మరిస్తాయి. అయితే ఒక్కోసారి మనుషుల ప్రాణాల్ని తీస్తాయి.

ఊరికి కొద్ది దూరంలోనే పంట పొలాలు ఉన్నాయి. పొలాలలో టెలిఫోన్ స్తంభాలు వాటి మీదుగా నగరాలకు దూసుకుపోయే టెలిఫోన్ వైర్లు. వాటి నుండి వచ్చే ధ్వనులు పిల్లలకు అద్భుతంగా అనిపిస్తుంటాయి. పొలాలకు ఇంకా పై నుండి రైల్వే లైను ఉంటుంది. రైళ్ల రాకపోకలు నిశ్శబ్దపు రాత్రిలో హరిహర్ ఇంటి దాకా వినిపిస్తుంటాయి. సినిమాలో వేరు వేరు సన్నివేశాలలో అనేక మంది గ్రామస్థులు కనిపిస్తుంటారు.

మజుందార్ – గ్రామంలోని ఒక పెత్తందారు. దుర్గ పూజా ఉత్సవ కార్యనిర్వాహకుడు. చక్రవర్తి చేపలు పట్టడంలో మంచి దిట్ట. అందుకే ఎప్పుడు చేతిలో గాలం పట్టుకుని తిరుగుతుంటాడు. మిఠాయిలు అమ్మే చిన్ని బాస్ ఊళ్ళోకి తరచుగా వస్తుంటాడు. దుర్గ అనారోగ్యంతో ఉన్నప్పుడు డాక్టర్ వచ్చి చూసి వెళతాడు. ఉత్సవం జరుగుతున్నప్పుడు జానపద కళారూపం జాతర ప్రదర్శన జరుగుతున్నప్పుడు ఎంతో మంది వాయిద్యకారులు కనిపిస్తారు. ముఖర్జీ వాళ్ల ఇంట్లో పెళ్ళి జరుగుతున్నప్పుడు ఇంగ్లీషు వాళ్ల బృందం యూనిఫామ్స్ వేసుకుని ఊళ్ళోకి వస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారి మార్చింగ్ సాంగ్ శైలిలో వాళ్లు, బ్యాగ్పైప్లు ఊదుతూ ఉంటారు.

'కాశీపట్నం చూడర బాబూ' లాంటి పాట పాడుతూ పిల్లలకు బయోస్కోపు పెట్టెలో బొమ్మల్ని చూపే వాడొకడు ఊళ్ళోకి వచ్చి పోతుంటాడు. కొద్దిపాటి డబ్బులు తీసుకొని దేశంలోని వివిధ ప్రాంతాల ఫోటోలు బయోస్కోపులో చూపెడుతూ ఉంటాడు. ఢిల్లీ, ఆగ్రా, బొంబాయి, మద్రాసు, కలకత్తా లాంటి ప్రాంతాలు బయోస్కోపు (పిక్చర్ బాక్స్)లో చూస్తూ, నిశ్చిందిపూర్లోని "అపూ" లాంటి పిల్లలు ఎంతో ఉత్తేజితులు అవుతుంటారు. మారుమూల గ్రామమైన నిశ్చిందిపూర్లోని పిల్లలకు మారుతున్న ఆధునిక భారతదేశ స్వరూపం తెలిసే అవకాశం అంతకన్నా లేదు. ఇది నిశ్చిందిపూర్ గ్రామంలోని చిన్ని ప్రపంచం. నిశ్చిందిపూర్ నుండి కొద్ది దూరంలో దాస్ఘరా, రాణాహట్ అనే రెండు పట్టణాలున్నాయి. హరిహర్ ఉద్యోగం కోసం ఈ ఊళ్ళు

తిరుగుతుంటాడు. హరిహర్ భార్య (సర్బోజయ) లాంటి గృహిణులకు ఇవి ఎక్కడో చాలా దూరంగా ఉన్న స్థలాలు. భర్త దూరప్రాంతాలకు వెళ్ళినప్పుడు సర్బోజయ భర్త నుండి అప్పుడప్పుడు పోస్టుకార్డ్ అందుకుంటూ ఉంటుంది.

దాస్ఘరా, రాణాహాట్ పట్టణాలకు ఇంకా పైన బనారస్ నగరం ఉంది. సినిమా మొదలయ్యే నాటికి 'హరిహర్' ఒకసారి బనారస్ వెళ్లోస్తాడు. అయితే తన తండ్రి తాతల వారసత్వంలో లభించిన నిశ్చిందిపూర్ ఇంట్లో స్థిరపడతాడు. చిత్రం ముగింపులో హరిహర్ ఇల్లు వాకిలీ అంతా దానిమానాన దాన్ని వదిలేసి, ఒక కొత్త జీవితం ప్రారంభించడం కోసం తన కుటుంబంతో సహా నిశ్చిందిపూర్ వదిలి బనారస్ వెళ్లిపోతాడు.

## 5.7. భారతదేశంలో తొలి సినీ స్టూడియోలు:

ప్రభాత్ ఫిలిం కంపెనీ, న్యూ థియేటర్స్, బాంబే టాకీస్ ఈ మూడు కంపెనీలు రూపొందించిన చిత్రాలు భారతీయ సినిమా సువర్ణ యుగానికి మచ్చుతునకలు. వీటిలో మొదటి రెండు మొదలై 1980కి యాభై ఏళ్లు అయితే, చివరి బాంబే టాకీస్ మొదలై 1983కి యాభై ఏళ్లు అయింది. అయితే ఇప్పటి వరకు నిలదొక్కుకొని ఉండగలిగిన ఫిలిం కంపెనీ ఈ మూడింటిలో ఏదీ లేదు. 1929లో బాబురావు పెయింటర్ మహారాష్ట్ర ఫిలిం కంపెనీ నుండి నలుగురు యువకులు అసంతృప్తితో, అసహనంతో బయటపడ్డారు. వీరు వి.శాంతారాం, యస్. పతేలాల్, వి.జి. దామ్లే, కె.ఆర్. దౌబర్. వీరికి ఆర్థిక వనరులు సమకూర్చి పెట్టిన భాగస్వామి యస్.బి. కులకర్ణి. కొల్హాపూర్లో వీరు ప్రభాత్ ఫిలిం కంపెనీ స్థాపించారు. అప్పట్లో కేవలం 3000 రూపాయలతో వారి మొదటి మూకీ చిత్రం "గోపాలక్రిష్ణ" రూపొందించారు. 1933 నాటికి పూనాశివార్లలో, స్వంత ఎస్టేట్లో స్టూడియో నిర్మించుకోగలిగారు. సుమారు అదే కాలంలో బి.యన్. సర్కార్ కలకత్తాలో న్యూ థియేటర్స్ ఏర్పరిచాడు. గ్లాస్గోవ్ నుండి ఇంజనీరింగ్తో తిరిగి వచ్చాడు. వాస్తు శాస్త్రవేత్తగా స్థిరపడాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో మొట్టమొదట ఒక సినిమా హాలు కట్టవలసి వచ్చింది. దాంతో క్రమంగా అతని మనసు సినిమాల వైపు మళ్లింది. "చోరెకాంత", "చాసర్", "మయి" అనే మూడు చిత్రాలు రూపొందించాడు. అన్ని అధునాతన పరికరాలతో ఒక మంచి స్టూడియో, లాబొరేటరీ నిర్మించాడు. న్యూ థియేటర్ స్థాపించి 'మొహబ్బత్ కే ఆసు' చిత్రం రూపొందిచాడు. అందులో అఖ్తారి, సైగల్, కాశ్మీరి మొదలైన వాళ్లు నటించారు. ఆ సైగలే తరువాత కాలంలో భారతదేశ అత్యుత్తమ గాయకుడిగా, నటుడిగా ప్రఖ్యాతి గాంచాడు. 1933లో ప్రభాత్ ఫిలిం

కంపెనీ కొల్హాపూర్ నుండి పూనాకు మార్చబడినప్పుడు, బొంబాయిలో మరో ఫిలిం కంపెనీ స్థాపించబడింది. దీని స్థాపకులు హిమాంసు రాయ్, దేవికారాణి. వీరిద్దిరూ భార్యాభర్తలు.

1933లో భారతీయ చలనచిత్ర రంగం ధ్వని వైపు దృష్టి మరల్చింది. మూకీ చిత్రాలకు స్వస్తి చెప్పి, టాకీ చిత్రాల నిర్మాణానికి అనేకమంది ప్రయత్నించారు. టాకీ నిర్మించడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని గనుక, చాలామంది ప్రయత్నాలు మానుకోవడమూ, లేక చిత్ర రంగాన్ని వదిలి వెళ్లడమో చేశారు. మరికొంత మంది డబ్బు ఖర్చు పెట్టగలిగిన వాళ్లు మాత్రం నిలబడి, నిలదొక్కుకొని చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. అప్పట్లో స్టూడియోనే ఒక సూపర్ స్టార్. నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు అందరూ జీతం తీసుకొని పనిచేసే ఉద్యోగులు మాత్రమే. జీవితాన్ని విభిన్న రీతులలో చూసినవాళ్లు, భిన్నాభిప్రాయాలతో ఉన్నవాళ్లు అయినప్పటికీ అందరూ కుటుంబ సభ్యుల్లాగా కలిసిమెలిసి స్టూడియోల్లో పనిచేసేవారు. ఎంతో బాధ్యతతో, నిజాయితీతో చిత్రాలు రూపొందించేవారు. స్టూడియో అధినేతలు, సినిమా పట్ల క్షుణ్ణమైన పరిజ్ఞానం గల మేధావులు. కొత్త ప్రయోగాల్ని ప్రోత్సహిస్తూ ఉండేవారు. కళాకారులలో తపన, ఏకాగ్రత, సినిమా పట్ల అపారమైన ప్రేమ ఉండేది. నిర్మాతలకు లాభాలు గడించాలన్న ఆశ ఉన్నా, మంచి చిత్రాలు నిర్మించాలన్న ధ్యేయం ఉండేది. దేశం నలుమూలలలో ఉన్న మంచి కళాకారుల్ని ఈ స్టూడియోలు ఆకర్షించేవి.

హిమాంసు రాయ్, ఫ్రాంజ్ జస్టన్ వంటి దర్శకులు, అశోక్ కుమార్, దేవికారాణి, లీలా చిట్నీస్ వంటి తారలు బాంబే టాకీస్కు గర్వకారణంగా ఉండేవారు. ప్రభాత్ ఫిలిం కంపెనీలో వి. శాంతారాం, కె. నారాయణ కాలె, దాగులే, ఫతేలాల్ వంటి దర్శకులు, శాంతా ఆప్టే, దుర్గాకోటె, కేశవరావ్, గజానన్ జాగిర్దార్ వంటి వాళ్లు ఉండేవారు. న్యూ థియేటర్స్లో పి.సి. బారువా, దేవకీ బోస్, నితిన్ బోస్ వంటి దర్శకులు, కె.యల్. సెగల్, పంకజ్ మల్లిక్, కాననేవి, కె.సి. డే మొదలైన కళాకారులు ఉండేవారు. ఈ మూడు కంపెనీలు మనదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా ఎంతో పేరు గడించుకున్నాయి. హిమాంసు రాయ్ తన చిత్రాల ద్వారా యూరప్ను ఆకట్టుకున్నాడు. న్యూ థియేటర్ వారి "సీత" 1934లో వెనిస్ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడింది. ప్రభాత్ ఫిలిం కంపెనీవారి 'సంత్ తుకారాం' 1937లో అదే చలన చిత్రోత్సవంలో బహుమతి గెలుచుకుంది.

ఈ మూడు ఫిలిం కంపెనీలే కాకుండా అప్పట్లో ఇంకా చాలా ఉండేవి. భారతదేశంలో మొట్టమొదటి టాకీ చిత్రం 'అలం అరా' రూపొందించిన అర్దెషేర్ ఇరానీ (Ardeshir Irani),

ఇంపీరియల్ ఫిలిం కంపెనీ ఉండేది. చిమన్లాలా దేశాయ్, ది సాగర్ మూవీటోన్ ఉండేది. దక్షిణ భారతదేశంలో వాహిని పిక్చర్స్, మద్రాస్ యునైటెడ్ ఆర్టిస్ట్స్ కార్పోరేషన్ వంటివి ఉండేవి.

**5.8. ప్రాంతీయ చలన చిత్రాలు**:

భారతీయ జీవన విధానంలోని మౌలికమైన అంశాల్ని, సమస్యల్ని తీసుకుని కొందరు యువ నిర్మాతలు ఒకే చిత్రాన్ని రెండు భాషల్లో నిర్మిస్తున్నారు. పెద్ద పెట్టుబడి (ప్రాంతీయ) చిత్రాలు బాగా బలం పుంజుకుంటున్నాయి. పూనా, కలకత్తా, బెంగుళూరు, హైదరాబాద్, తిరువనంతపురం, అహ్మదాబాద్లలో ప్రాంతీయ సినిమా అభివృద్ధి చెందుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో బహుమతులు కూడా విరివిగా గెలుచుకుంటున్నాయి. ప్రాంతీయ సినిమాయే జీవిత ధ్యేయంగా రూపొందిస్తున్న సత్యజిత్ రే, మృణాల్సేన్ వంటివారు తమ రాష్ట్రంలోని ప్రేక్షకులతోను, జాతీయ, అంతర్జాతీయ అవార్డులతోను సంతృప్తి పడ్డారు. కాని ఇప్పుడు పరిస్థితి కొంత మారింది. ఇప్పుడు వస్తున్న ప్రాంతీయ సినిమాలు దేశమంతటా ప్రదర్శింపబడితే గాని వాటి ధ్యేయం నిజంగా పూర్తి కాదు.

మహారాష్ట్రలో జబ్బార్ పటేల్, బెంగాల్లో అపర్ణాసేన్ లాంటివారు, తమ ప్రాంతీయ భాషలో చలన చిత్రాన్ని నిర్మిస్తూ, అదే సమయంలో హిందీ/ఇంగ్లీషు భాషలలో కూడా విడుదల చేస్తున్నారు. ద్విభాషా చిత్రాల వల్ల తమ రాష్ట్రంలోని ప్రేక్షకులనే కాక, ఇతర రాష్ట్రాలలోని ప్రేక్షకులను కూడా చేర్చవచ్చని, ప్రాంతీయంగా ఉన్న అడ్డంకుల్ని అధిగమించవచ్చని వారి అభిప్రాయం.

జబ్బార్ పటేల్ విద్యార్థి దశ నుండే నాటక, సినిమా రంగాలపై మంచి అభిరుచి ఉన్నవాడు. పూనా మెడికల్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకొని బయటపడగానే "గసీరాం కోత్వాల్" అనే నాటకానికి దర్శకత్వం వహించాడు. అది బాగా విజయవంతమైంది. సినిమా తీసిపెట్టమని ఒక నిర్మాత ముందుకొచ్చాడు. 1975లో "సామ్నా" అనే సినిమా తీశాడు. అతని మూడవ చిత్ర "సింహాసన్"తో అతనికి మంచి గుర్తింపు వచ్చింది. "సింహాసన్" చిత్రం రంగులు మారుతున్న రాజకీయాల మధ్య ఒక పత్రికా ప్రతినిధి పాత్రను విశ్లేషించింది.

సినిమా తీసే వారేవరు తమ చిత్రం కేన్స్లోనో, బెర్లిన్లోనో మేధావుల ముందు ప్రదర్శింపబడి అవార్డులు సంపాదించి పెట్టాలని కోరుకోరు. బజారునపోయే ప్రతివాడు తమ చిత్రం చూడాలని, అర్థం చేసుకోవాలని తీస్తారు. అందువల్ల సినిమా పూర్తిగా వ్యాపారమే! దానిమీద చేసిన ఖర్చు తిరిగి రాకపోతే లోపం ఎక్కడో జరిగిందని అర్థం చేసుకోవాలి అని దర్శకుడు జబ్బార్ అభిప్రాయం. గిరీష్ కర్నాడ్, స్మితా పాటిల్ వంటి నటీనటులతో, దళిత్ థియేటర్ కళాకారులతో అతడు తీసిన

"ఉంబర్థ" విజయవంతమైంది. రెండు భాషలు తెలిసిన నటీనటులుంటే ద్విభాషా చిత్రాలు రూపొందించడం చాలా సులభం.

అన్ని వైపుల నుండి, అన్ని రకాలుగా భద్రత గల ఒక సంపన్న కుటుంబంలోని గృహిణి కథ ఉంబర్థ. వ్యక్తిత్వం లేని తన బ్రతుకులోని వెలితిని భర్తీ చేసుకోవడానికి ఆమె తన భర్తను ఒప్పిస్తుంది. మహిళా సంక్షేమ సంస్థకు సూపరింటెండెంట్గా ఉద్యోగంలో చేరుతుంది. ఉమ్మడి కుటుంబం నుండి విడిపోయి ఇంటికి కొన్ని వందల మైళ్ల దూరంలో గడుపుతుంది. ఆమె పనిచేసే సంస్థలో చెడగొట్టబడినవారు, వదిలి వేయబడినవారు, ఏ భద్రత లేని అబాగినులు ఉంటారు. ఆమె వారి జీవితాల్ని అర్థం చేసుకుంటుంది. దుర్భరమైన వారి జీవితాలకు ఒక అర్థం, పరమార్థం కల్పించాలని నిరంతరం కృషి చేస్తుంది. కొత్త జీవితానికి, ఉమ్మడి కుటుంబంలోని పాత జీవితానికి మధ్య ఆమె వ్యక్తిత్వ సంఘర్షణ "ఉంబర్థ"లో చిత్రీకరించబడ్డాయి.

ద్విభాషా చిత్రాలు విజయవంతం అవుతాయని జబ్బార్ పటేల్ నిరూపించాడు. హిందీ మాట్లాడేవారి సంఖ్య ఉత్తర భారతదేశంలో ఎక్కువ కాబట్టి, ఒకే చిత్రం మరాఠీ, హిందీ భాషలలో విజయవంతమైంది. దక్షిణ భారతదేశంలో అది సాధ్యం కాదని ఆదూర్ గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డాడు. కాని పట్టాభి రామిరెడ్డి సాధ్యమేనని చేసి చూపాడు. "పేపర్ బోట్స్" (కాగితపు పడవలు) మూడు భాషల్లో తీశాడు. "చంద మారుత" (ప్రచండమైన గాలి) అనే కన్నడ చిత్రాన్ని 'సుఖా'గా హిందీలో విడుదల చేశాడు. అమోల్ పాలేకర్, చంద్రశేఖర్లు కలిసి 'ప్రశాంతి' అనే చిత్రాన్ని కన్నడంలోను, హిందీలోను పూర్తి చేశారు. 'సాంప్రదాయకమైన తన మలయాళీ పాత్రలు ఆ వాతావరణంలో హిందీ మాట్లాడడం ఊహించలేనని' ఆదూర్ చెప్పారు. నిజానికి గొప్ప ప్రాంతీయ సినిమా తీయాలంటే పాత్రలు, ఆ ప్రాంతం, వేష, భాషలలో సజీవంగా ఉండాలి తప్పితే కృత్రిమంగా ఉండకూడదు. సినిమాలోని కథాంశాన్ని ప్రేక్షకులకు కావాల్సిన భాషలో అనువదించి అందించాలి. ఇలాంటి ప్రయత్నాలు ఇప్పటికే జరుగుతున్నాయి. కాని ఇంకా ఉధృతంగా కొనసాగించాలి.

### 5.9. ఇండియన్ షార్ట్ ఫిలిం:

ప్రపంచంలో అత్యధిక కథాచిత్రాల్ని నిర్మించే దేశాల్లోను, ఎక్కువ షార్ట్ ఫిలిమ్స్ నిర్మించే దేశాల్లోను భారతదేశమే ముఖ్యమైంది. ఇక్కడ 2000 సంవత్సరాల నాటికి 1500 కథా చిత్రాలు, వెయ్యి చిన్న నిడివి చిత్రాలు (షార్ట్ ఫిలిమ్స్) నిర్మాణమయ్యేవి. ఈ సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తూనే ఉంది. ఈ చిన్న నిడివి చిత్రాలలో ఒక నిమిషానికి సరిపడే వ్యాపార ప్రచార

చిత్రాలు, విద్యాబోధక చిత్రాలు, ఇతర డాక్యుమెంటరీ చిత్రాలు ఉన్నాయి. ఇందులో ఫిలిమ్స్ డివిజన్, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు నిర్మించిన చిత్రాలు కొన్ని. స్వచ్ఛందంగా కొందరు నిర్మాతలు నిర్మించినవి కొన్ని. అత్యధిక సంఖ్యలో తయారవడమే కాకుండా, భారతీయ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్టమైన పేరు ప్రఖ్యాతులు గడించుకుంటున్నాయి.

ఈ షార్ట్ ఫిలిమ్స్ పదిహేను భాషల్లోకి అనువాదం (Dubbing) చేయబడి సుమారు పదివేల సినిమా హాళ్లకు పంపిణీ చేయబడుతున్నాయి. ఇవి ప్రతి కథా చిత్రానికి ముందు పదిహేను ఇరవై నిమిషాల సేపు ప్రదర్శించబడుతున్నాయి. అంతే కాదు డైరెక్టరేట్ ఆఫ్ ఫీల్డ్ పబ్లిసిటీ వారు సంచార ఫిలిం యూనిట్లకు గ్రామాల్లోకి పంపి వీటిని ప్రదర్శిస్తున్నారు. దూరదర్శన్ కేంద్రాలు టెలివిజన్లో చూపెడుతున్నాయి. విద్యా సంస్థల్లో, ఫిలిం సొసైటీల్లో కూడా విరివిగా ప్రదర్శింపబడుతున్నాయి. భారత ప్రభుత్వ రేడియో, సమాచార మంత్రిత్వ శాఖ చలన చిత్ర విభాగం ఈ చిత్రాల్ని సుమారు నూటాఇరవై దేశాలకు పంపుతుంది. 1896 జూలై 7వ తేదీన బొంబాయి వాట్సన్ హోటల్లో తొలిసారిగా షార్ట్ ఫిలిం ప్రదర్శించబడింది.

మొట్టమొదట మూవీ కెమెరాను సంపాదించి, ఉపయోగించి చిన్న వార్తా చిత్రాల్ని నిర్మించినవాడు హరిశ్చంద్ర శఖారాం భట్ వాడేకర్. అతన్ని అతని అనుచరులంతా "సావేదాదా" అని పిలుచుకునేవారు. అతనికి "ఫాదర్ ఆఫ్ ద ఇండియన్ షార్ట్ ఫిలిం" అనే గుర్తింపు ఉంది. డా॥ ఆర్.పి. పరంజపేకి జరిగిన ఆహ్వాన మహోత్సవాన్ని (1901) సావేదాదా చిత్రీకరించి, వార్తా చిత్రంగా విడుదల చేసి సంచలనం సృష్టించాడు. డా॥ ఆర్.పి. పరంజపే, సాయి పరంజపేకి తాతగారు. ఆయన కేంబ్రిడ్జ్లో మొట్టమొదటి భారతీయ విద్యార్థిగా చదువు ముగించుకుని, అప్పట్లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. అంతకు ముందే సావేదాదా అలనాటి మల్లయోధుల మల్లయుద్ధాన్ని 1899లో ఒక లఘు వార్తాచిత్రంగా రూపొందించాడు. సావేదాదా ఢిల్లీలో ఏడవ ఎడ్వర్డ్ దర్బార్ కూడా చిత్రీకరించాడు. అదే సమయంలో బెంగాలీ చిత్ర నిర్మాత హీరాలాల్ సేన్ రంగంలోకి దిగాడు. పటన్కర్ సోదరులు, చికాగో రేడియోకు చెందిన నానిక్మోట్ వాసి, డా॥ పి.వి. వతి ఇంకా అనేకమంది షార్ట్ ఫిలిమ్స్ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన ఎ.కె. చెట్టియార్ గాంధీజీ ఇతర దేశాలలో ఉన్నప్పుడు న్యూస్ రీల్ తీశాడు.

1930లో డాక్టర్ వతి, బర్జోర్, యం. టాటా ఇంకా జె.బి.హెచ్. వాడియాలు కలిసి ఒక బృందంగా తయారయ్యారు. భారతదేశం స్వంత వార్తా చిత్రాలు నిర్మించగలగాలని కృషి చేశారు.

దానికి "ఇండియన్ స్క్రీన్ గెజిట్" అని పేరు పెట్టారు. ఈ పేరుతో కేవలం ఆరు చిత్రాలు మాత్రమే తెరకెక్కాయి.

కథా చిత్రాల నిర్మాణమే కాదు, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన కూడా 1930లలోనే వచ్చింది. దానికి కూడా ముఖ్య కారకులు ముగ్గురే. డా॥ వతి, కె.యస్. హిర్లేకర్, డి.జి. టెండూల్కర్, డా॥ వతి సొరబాన్నె విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ తీసుకొని, పారిస్లోని I.D.H.E.C.లో సినిమాటోగ్రఫీలో శిక్షణ పొందాడు. విద్యాబోధనా చిత్రాలు, జర్మన్ కలర్ చిత్రాలు ఉపయోగించుకోవడంలో కొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్టాడు. డి.జి. టెండూల్కర్ మాస్కో చలనచిత్రాల గూర్చి క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు. ఎడిటింగ్ మాంటేజ్లో కొత్త పద్దతుల్ని అవలంబించాడు. ఈ ముగ్గురు వారి ఆలోచనా విధానమే కలిగి ఉన్న మరికొంత మంది బ్రిటీష్ పౌరులతో కలిశారు. ఫలితంగా బొంబాయిలో రెండు సంస్థలు ప్రారంభించబడ్డాయి. ఒకటి అమెచ్యూర్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా (Amateur Film Society of India), ప్రజల్ని వివేకవంతుల్ని చేయడానికి ప్రభుత్వం వీలైనన్ని ఎడ్యుకేషనల్ ఫిలిమ్స్ రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. M.P.S.I. హిర్లేకర్ సంపాదకత్వంలో మోషన్ పిక్చర్స్ సొసైటీ మాగజైన్ ప్రచురించింది. మద్రాసులో ఆర్. వెంకయ్య, కలకత్తాలో అరోరా పిక్చర్స్ కార్పోరేషన్ వారు కొన్ని మంచి షార్ట్ ఫిలిమ్స్ తీశారు.

## 5.10. తెలుగు సినిమా రంగం:

### 5.10.1. తెరకెక్కిన తెలంగాణ:

1946కి పూర్వం తెలంగాణలో ప్రజలకు మాట్లాడే హక్కు లేదు. సరిగా బ్రతికే హక్కులేదు. దొరలు, జాగీర్దార్లు నిజాం అడుగులకు మడుగులొత్తుతూ, ప్రజల్ని బెదిరించుకుని బతికేవారు. వాళ్ల ఖర్చులు ప్రజల చెమటమీద, కన్నీళ్ళ మీద వెళ్లదీసుకునేవారు. వందల మందితో గడీల్లో వెట్టి చాకిరి చేయించుకునేవారు. పశువుల్ని కచ్చడానికి కట్టి పరిగెత్తించినట్లుగానే, కచ్చడం ముందు (పోయినంత దూరం) జీతగాళ్ళను పరుగెత్తించేవారు. చెప్పులు తొడుక్కుని ఎవర్ని తమ ముందుకు రానిచ్చేవారు కాదు. ఉమ్మడానికి ఎవడి బొచ్చ వాడే మెడకు వేళాడేసుకుని తిరిగేట్లు చేశారు. కన్ను పడితే చాలు ఎలాంటి మహిళనైనా సరే బలవంతంగా ఆ రాత్రికి తమ గడీకి చేరవేసుకునేవారు. శారీరకంగా, మానసికంగా, నైతికంగా, ఆర్థికంగా అన్ని రకాలుగా ప్రజల్ని దెబ్బతీశారు. పీల్చి పిప్పి చేశారు. అందుకే అసహనం ఎదురు తిరిగింది. "అయ్యా బాంచెను" అని ఏళ్ళకేళ్ళుగా బతుకీడ్చిన తెలంగాణ ప్రజలు ఎదురుతిరిగి బందూకుల్తో ముందుకురికారు. దొరల్ని, దేశ్ముఖుల్ని మట్టుబెట్టి "ప్రజారాజ్యం" స్థాపించారు. అంతస్సూత్రంగా పోరాటమే ప్రధాన భాగమైన ఇక్కడి జీవితం

స్థానికంగానే కాదు దేశవ్యాప్తంగా కూడా ఎందరినో కదిలించింది. పోరాట జీవితాల్ని, పోరాటం తరువాతి జీవితాన్ని నాటకరంగం గానీ, సినిమా రంగం గానీ అంతగా పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో నటుడు, దర్శకుడు బి. నర్సింగరావు "మా భూమి" చిత్ర నిర్మాణానికి పూనుకున్నాడు. అయితే అంతకు కొద్ది సంవత్సరాలకు ముందే "చిల్లర దేవుళ్ళు" వచ్చింది. శ్యాం బెనగల్ "అంకుర్", "నిషాంత్" హిందీ చలన చిత్రాలు వచ్చాయి. ప్రాంతీయ సమస్యలతో ప్రాంతీయ సినిమా తీయడం సత్యజిత్ రే, మృణాల్సేన్ వంటి వాళ్లు సాధించారు. ప్రాంతీయ సినిమాను 'హిందీ – ఉర్దూ'లో తీసి దానికి జాతీయ స్థాయిని సమకూర్చాడు బెనగల్.

### 5.10.2. చిల్లర దేవుళ్ళు:

దాశరథి రంగాచార్య నవల 'చిల్లర దేవుళ్ళు'. అదే పేరుతో దర్శకుడు మాధవరావు ఒక చలన చిత్రం రూపొందించాడు. తెలంగాణ జీవితాన్ని, భాషను, యాసను సైతం వదిలేయకుండా చిత్రీకరించిన మొట్టమొదటి సినిమా ఇది. అప్పటికది తొలి ప్రయత్నమే అయినా, గొప్ప సాహసం అనే చెప్పాలి. అనేక లోపాల వల్ల డబ్బు చేసుకోలేకపోయినా, ఒక మోస్తరు మంచి చిత్రంగా మిగిలింది. జాతీయ స్థాయిలో సినీ విమర్శకుల మన్ననలను అందుకుంది. ఇక్కడి జీవితాన్ని కొత్త ఒరవడిలో చూపించవచ్చన్న ఆశ, యువ దర్శకులకు కలిగించింది. కేవలం చింతకాయల దొంగతనానికి చింత బరికెలు ఎలా విరిగేవో, నిజాం ప్రభావంలో గడీలలో సైతం దొరసాన్ల ఘోషాలు ఎలా ఉండేవో, కరణం, పటేళ్ళు కలిసి ఎలా తలలు మార్చేవారో, చివరికి దొరల దొరతనం క్షీణించి క్రమంగా ఎలా మామూలు వారయ్యారోనన్నది చిత్రంలో వివరంగా ఉంది. దొరలకు క్రూరత్వం వంశపారంపర్యంగా వచ్చిన, వారిలో కొందరికి హృదయం ఉండేదని, కళల్ని, కళాకారుల్ని పోషించేవారని చిల్లర దేవుళ్ల నుండి ఒక ఉదాహరణవ్వొచ్చు. బతకడానికి వచ్చిన సారంగపాణికి దొర ఆశ్రయమివ్వడం ఇందులో ఉంది.

### 5.10.3. శ్యాం బెనగళ్: అంకుర్ – నిషాంత్:

గురుతరమైన బాధ్యతతో ఎక్కడా రాజీపడకుండా రూపొందించిన అంకుర్, తెలంగాణ ప్రజల బతుకుల కింద గడ్డకట్టుకొని ఉన్న జీవిత సత్యాల్ని బట్టబయలు చేసింది. శక్తివంతమైన గ్రామ్యదృక్కుతో, ఏళ్ళ తరబడి అడ్వర్టైజ్ ఫిల్మ్లో అణిగి ఉన్న శ్యాం బెనగళ్ సినిమాటిక్ విజన్లో 'అంకుర్' ఒక గొప్ప చిత్రమయ్యింది. ఆయన తన మొదటి కథాచిత్రం 'అంకుర్'తో ఈ వ్యవస్థ మీద రాయి రువ్వాడు. జమీందారు అద్దాల మేడ గాజు కిటికీ పగల కొట్టించాడు. అంకుర్ చిత్రంలోని జమీందారు జీతగాడి భార్యను చేరుస్తాడు. భార్యలాగా వాడుకుంటాడు. ఆ తరువాత పరిణామాలు,

ప్రజల్లోని ఉద్రిక్తత, ఆవేశం, అసహాయత అన్నీ కలిసి తిరుగుబాటు బీజాలు అంకురించడం కళాత్మకంగా చూపించిన చిత్రం అంకుర్. ఇందులో జమీందార్ది నైతికంగా పతనమైన పాత్ర. హైదరాబాద్ పరిసరాల్లోని అల్వాల్లో పుట్టి పెరిగిన శ్యాం బెనగళ్కు సహజంగానే ఇక్కడి సామాజిక పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. తెలుపు నలుపు వర్ణాలలో కొట్టుమిట్టాడుతున్న నైతిక విలువల్ని ఛాయాగ్రాహకుడు గోవింద్ నిహలనీ అద్భుతమైన రంగుల్లోకి మార్చాడు. తెలంగాణ జీవితాల్ని పరిస్థితులను, వాతావరణాన్ని పచ్చని పైర్లను తన కెమెరాలోకి గ్రహించాడు. లోగడ "భువన్ షోం" చిత్రంలో ప్రతిభా పాటవాల్ని చూపించిన సాధూ మెహర్ మరోసారి ఈ చిత్రంలో మూగ మొగుడిగా, తాగుబోతుగా, బానిస జీతగాడిగా గొప్పగా నటించాడు. జమీందారు కిటికీ అద్దాన్ని కుర్రవాడొకడు రాయి విసిరి పగుల గొట్టడంతో అంకుర్ చిత్రం ముగుస్తుంది. భావగర్భితమైన ఆ ముగింపు జనానికి ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది.

నిశాంత్ చిత్రం ప్రజాపీడనాన్ని ఇంకా స్పష్టంగా ప్రతిబింబించింది. పెట్టుబడిదారీ విధానం అంతం చేసేందుకు మొదలైన సంఘర్షణలోని మొదటి రాత్రితో చిత్రం ముగుస్తుంది. క్రూరమైన, క్లిష్టమైన హావభావాలను అతి సులభంగా ప్రదర్శించగల కాకలు తీరిన హిందీ రంగస్థల నటుడు అమ్రిష్పూరి గ్రామంలోని పెత్తందారు పాత్ర పోషించాడు. పెత్తందారు సోదరులు పోకిరి వెధవలు. వారసత్వంగా వచ్చిన అహంకారంతో ప్రజల్ని భయపెడుతుంటారు. ఆ ఊరి ఉపాధ్యాయుడు ఊళ్ళోకి తన భార్యను తీసుకొస్తాడు. ఆమెను పెత్తందారు తమ్ముడు ఎత్తుకుపోయి మానభంగం చేస్తాడు. అదే సమయంలో పెత్తందారు నిశ్శబ్దంగా, గంభీరంగా కూర్చుని తుపాకీ తూడ్చుకుంటూ ఉంటాడు. అతనికి చీమ కుట్టినట్టు కూడా ఉండదు. ఈ సంఘటనతో గ్రామంలో సంచలనం బయలుదేరుతుంది. తిరుగుబాటు మొదలవుతుంది. చిత్రం చివరలో వందలాది జనం జమీందారు (పెత్తందారు) గడి గోడను చుట్టుముట్టి సర్వనాశనం చేస్తారు. తరతరాల నుండి అణగదొక్కబడ్డ వర్గం చైతన్యవంతమవుతుంది. కొత్త సమాజం పుట్టడానికి ముందు సమాజ పురోగతిని అడ్డుకునే వారి రక్తంతో జనం అభిషేకం చేస్తారు.

అయితే 'అంకుర్' చిత్రం ఉన్నంత స్పష్టంగా నిశాంత్ లేదు. విమర్శకులు ఎన్నో అభ్యంతరాలు వెలిబుచ్చారు. శ్యాం బెనగల్ ఒకే కోణంలో దృష్టి నిలిపి చిత్రం రూపొందించాడని, సమస్యలకు సరైన పరిష్కారం చూపించలేదని అభిప్రాయపడ్డారు. ఎన్నుకున్న విషయంలో స్పష్టత లోపించినందువల్ల అనేకులు అనేక విధాలుగా వాదించడానికి వీలు చిక్కింది. కాని తెలుగు జానపద గీతాలు, ప్రజా ప్రక్రియలు దర్శకుడు ఇందులో చాలా చక్కగా వాడుకున్నాడు. ఈ రెండు సినిమాల్లో

వనరాజ్ భాటియా నేపథ్య సంగీతం, తిరగబడ్డ ఉడుకు రక్తపు ఉద్రేకాన్ని, జీవితంలోని సంఘర్షణను వినిపించింది.

### 5.10.4. మా భూమి:

తెలంగాణలో రైతుల సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితుల్ని, ఆ తర్వాత జరిగిన ప్రతిఘటనని "మా భూమి" సినిమా కొంతవరకు చూపించగలిగింది. ఈ ఇతివృత్తం మీద వచ్చిన ఒకే ఒక్క సినిమా ఇదే గనుక, దీని ప్రత్యేకత దీనికి ఎప్పటికి ఉంటుంది. భూమిపై రైతులకు గల హక్కును లాక్కునే నిజాం నిరంకుశత్వాన్ని ఈ చిత్రం బాగా చూపించగలిగింది. కిషన్ చందర్ నవల "జబ్ ఖేత్ జాగే" నవల ఆధారంగా గ్రామాల్లో చలామణి అవుతున్న అప్పటి జ్ఞాపకాల – కథల ఆధారంగా ఈ చిత్రానికి స్క్రిప్టు తయారైంది. వాస్తవ సంఘటనలపై సినిమా అల్లబడింది గనుక గద్దర్, సంధ్యల పాటలు జనాన్ని విశేషంగా ఆకర్షించాయి. వ్యాపారపరంగా కూడా ఇది విజయవంతమైంది. నేటి మేటి దర్శకులలో ఒకరైన గౌతమ్ ఘోష్కు కథా చిత్రానికి దర్శకత్వ బాధ్యతను, అవకాశాన్ని ఇచ్చింది తెలంగాణయే. జన నాట్య మండలి బి. నర్సింగరావు నటనలోని మెళకువల్ని దర్శకత్వంలోని సాధకబాధకాల్ని మొట్టమొదట నేర్చుకున్నది "మా భూమి" ద్వారానే. ప్రఖ్యాత తెలుగు కథకుడు గోపీచంద్ కొడుకు సాయిచంద్ నటుడుగా వెండితెరకు పరిచయమైంది కూడా ఈ చిత్రంతోనే.

### 5.10.5. మా భూమి – గౌతమ్ ఘోష్:

గౌతమ్ ఘోష్ తెలుగు ప్రేక్షకులకు కొత్తవాడు కాదు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని "మా భూమి" చలనచిత్రంగా మలచడానికి ఆనాడు తెలుగు దర్శకులు కరువైనందువల్ల బెంగాలీవాడైన గౌతమ్ ఘోష్ను ఆహ్వానించాల్సి వచ్చింది. నిర్మాతగా బి. నర్సింగరావు తీసుకున్న ఆ నిర్ణయం సరైనది. ప్రతిభగల యువ దర్శకుడికి అవకాశం ఇచ్చి, అతను అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి దోహదం చేసినట్టయ్యింది. తెలుగు సినిమా రంగానికి ఒక మంచి చిత్రాన్ని అందించినట్టయింది. అంతేకాదు, ప్రపంచ పోరాటాల్లోనే ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ తెలంగాణ సాయుధ పోరాటాన్ని తెరకెక్కించి ఒక చారిత్రక సత్యాన్ని ముందు తరాల వారి కోసం భద్రపరచడం జరిగింది.

"మా భూమి" తర్వాత గౌతమ్ ఘోష్ చాలా సినిమాలు తీశాడు. దఖల్, పార్, అంతర్జలి జాత్రా లాంటివి. వాటిలో ఆయనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందాయి. కాని నిజం చెప్పుకోవాలంటే ఆయన రూపొందించిన చిత్రాలలో అత్యున్నతమైనది "మా భూమి" చిత్రమేనని బెంగాలీ చిత్ర దర్శకుడు బుద్దదేవ్ దాస్ గుప్తా అభిప్రాయపడ్డాడు. తెలంగాణ పోరాటం

కల్పన కాకపోవడం బహుశా అందుకు ఒక కారణమై ఉంటుంది. ఆ చిత్రం విడుదలైన సమయానికి నిర్మాత, దర్శకుడు, నటీనటులు ఎవరు సినీ రంగంలో పేరు ప్రఖ్యాతులున్న వాళ్లు కారు. అయినా తెలుగు ప్రేక్షకులు ఆ చారిత్రక నేపథ్యానికి నీరాజనాలు పలికి చిత్రాన్ని విజయవంతం చేశారు.

గౌతమ్ ఘోష్లో చెప్పుకోవాల్సిన ముఖ్య లక్షణం నిబద్ధత. రాజీపడకుండా వాస్తవాన్ని కళాత్మకంగా ప్రదర్శించగల నేర్పు, రైతుల పోరాటం (మా భూమి), అన్యాయాలకు గురై అత్యంత దయనీయమైన స్థితికి చేరుకున్న బీహార్ ఆదివాసులు (పార్), అగ్ర వర్ణాల మూర్ఖత్వం (అంతర్జలి జాత్రా), బెంగాల్ కరువు (హంగ్రీ ఆటమన్) లాంటి ఇతివృత్తాలు మాత్రమే ఆయనలోని సృజనాత్మక శక్తిని మేల్కోల్పాయి. సంగీత పరిజ్ఞానం, పాడగల నేర్పు గల గౌతమ్ ఘోష్ దర్శకత్వం చేపట్టక ముందు బుద్ధదేవ్ దాస్ గుప్తా చిత్రంలో (గృహయుద్ధ) నటించాడు. తీసేవి కథాచిత్రాలే అయినా, ఒక్కోచోట డాక్యుమెంటరీ శైలి ఉండడం గౌతమ్ ఘోష్ ప్రత్యేకత. భారతీయ చలనచిత్ర రంగం సగర్వంగా చెప్పుకోగలిగే కొద్ది మంది దర్శకుల పేర్లలో గౌతమ్ ఘోష్ పేరు తప్పకుండా ఉంటుంది.

### 5.10.6. జోగినులు:

తెలంగాణలో స్త్రీ హింస అధికం. ఇక్కడ శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్న జోగినుల వ్యవస్థ సమాజ వికృతరూపానికి సజీవమైన ఉదాహరణ. సంస్కరణోద్యమాలు ఎన్ని వచ్చినా, ఇది నిరాఘాటంగా కొనసాగుతూ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దేవుడికి నైవేద్యం పెట్టి ఫలహారం భోంచేసినట్లు, దేవుడికి వదిలి పెట్టిన జోగిని స్త్రీ ఊరి వారందరికీ ఉమ్మడి ఆస్తి. ఆమె ఇష్టాలతో ఎవరికీ పనిలేదు. అందరికీ అందుతుండాలి. అందరినీ అలరిస్తూ ఉండాలి. అట్లని ఆమెను వ్యభిచారిణి అని అనకూడదు. ఆమె నిత్య సుమంగళి. సంతానం ఎవరి వల్ల కలిగినా ఆమె స్వంత సంతానంగానే వ్యవహరిస్తారు. తండ్రి పేరు పెట్టే ప్రసక్తి లేదు. 1987 లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో సుమారు పది వేలకు పైగా జోగినులు ఉండేవారు. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఉన్నారని తెలిసింది.

1979లో స్వైరీ ఫిలింస్ అరసపల్లి నిజామాబాద్ జిల్లావారు జోగినుల సమస్య మీద "ప్రత్యూష" అనే కథా చిత్రాన్ని రూపొందించారు. సమాజంలోని ఒక దురాచారాన్ని ఎలుగెత్తి చెప్పడానికి వారు చేసిన చిత్తశుద్ధి గల ప్రయత్నం ఎంతో ధైర్యవంతమైంది. 1987లో రాష్ట్ర గవర్నర్ రాజ్భవన్లో కొందరు జోగినుల వివాహాలు జరిపించారు. ఒక రకమైన కట్టు బానిసల్లా బతుకీడుస్తున్న

వారికి స్వేచ్ఛను ప్రసాదించారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కలిసి సమిష్టిగా కృషి చేయడానికి పూనుకున్నాయి.

ఒక గ్రామంలో పోసాని అనే జోగిని స్త్రీ ఉంటుంది. ఆమెకు పెళ్ళికి ఎదిగి వచ్చిన కూతురు ఉంటుంది. కూతురుకు మామూలుగా వివాహం జరిపించి సంసారం చేయించాలని తల్లి అభిలాష. అందుకు పరిస్థితులు అనుకూలించవు. ఊరు ఊరంతా ఆ పిల్లను జోగు చేసి వదిలిపెట్టమని పట్టుబడతారు. గ్రామ పెద్దలు పంచాయితీ కీడుస్తారు. జరిమానా విధిస్తారు. వెలి వేస్తారు. అన్నిటినీ ఓపికగా తట్టుకుంటుంది జోగు పోసాని. దేవుడి పేరు మీద వదిలి వేయబడ్డ దున్నపోతుకు ఇచ్చే విలువ కూడా జోగుకు ఇవ్వకపోవడం, డాక్టరు ఉన్నా సింగం పూనే (శక్తి పూనడం) మనిషికి ప్రాముఖ్యత ఇవ్వడంలో సమాజ వికృతరూపాన్ని స్పష్టం చేయడం జరిగింది. అయితే ఈ చిత్రం ముగింపు వివాదాస్పదమైందిగా ఉంది. తన కూతురు జోగిని కావడం ఇష్టపడని తల్లి ఒక రోజు తెల్లవారక ముందే కూతురును ఊరి బయటకు తీసుకునిపోయి, నరికి చంపేస్తుంది. అయితే ఆ ఘటనను ప్రత్యక్షంగా కాకుండా సూచనప్రాయంగా చూపడం జరిగింది. ఊరిలోని వాడవాడల నుండి జనమంతా పోసాని దగ్గరికి పరుగెత్తి, చచ్చిపడి ఉన్న పిల్లను చూడడంతో చిత్రం ముగుస్తుంది.

### 5.10.7. మట్టి మనుషులు:

తెలుగు వాళ్లు గర్వంగా చెప్పుకోదగ్గ మరో సినిమా మట్టి మనుషులు. దర్శకుడు బి. నర్సింగరావు రూపొందించిన "మట్టి మనుషులు" చలనచిత్రం ఆ రోజుల్లోనే ఇండియన్ పనోరమాకు వెళ్లింది. మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి మట్టైపోయే మనుషులపై దర్శకుడు దృష్టి పెట్టడం గొప్ప విషయం.

**"కన్నీళ్ళు కవిత్వమైతే**
**పాషాణాలు కూడా కరుగుతాయి**
**మట్టిలో రాలి మట్టయిన కన్నీళ్ళు**
**పచ్చగడ్డికి తిండి గింజలు మొలిపిస్తాయి**
**మట్టిలో రాలి 'మట్టి కన్నీళ్ళు' శోధించేవి**
**చరిత్ర పుటల్ని దాటవేసినట్లు**
**మట్టి పొరల్లో పోరాటాల్ని స్మృతికి తెస్తాయి"** **(ప్రయోజన సినిమా, పుట–204)**

పోరాటమంటే ఈ చిత్రంలో సాయుధ పోరాటం కాదు. జీవిత పోరాటం. కరువు ప్రాంతమైన పాలమూరు కూలీల జీవితం ఆధారంగా రూపు దిద్దుకున్న ఈ చిత్రంలో వారి ఆశలు, నిరాశలు, నమ్మకాలు, సంప్రదాయాలు, మానవ సంబంధాలు, నగరానికి వలసపోవడం, అక్కడ ఎదురైన నూతన సమాజంలో ఇమడక పోవడం వంటివి చిత్రీకరించబడినవి. పరిస్థితుల ప్రభావానికి తలవొంచి కడుపు చేత పట్టుకుని ఎలాగో తంటాలు పడి, నగరానికి చేరడం సులువే. కాని నగర క్రూరత్వంలోని యాంత్రికతకు వారు అలవాటు పడటం మామూలు విషయం కాదు. గుడిసెల్లో, ఫుట్పాత్లపైన బతుకుల్ని బతికించు కోవడం కొంతవరకు సులువే. కాని తమదైన భూమి చెక్కను తలచుకుంటూ తమ ఊరి గాలిని, తమ మనుషుల మంచితనాన్ని నెమరు వేసుకుంటూ కుమిలిపోతూ, రగిలిపోతూ బతకడం అంత సులభం కాదు.

**"తన చివరి ఊపిరి, అర ఎకరపు భూమి చెక్కను**
**బిస్కెట్లా ముంచుకు తిన్నప్పుడైనా**
**పిడికిళ్ళు బిగించడం తెలిస్తేగా**
**ఎత్తిన చేతుల ప్రశ్నల్ని సమకూరిస్తేగా**
**స్వేద ప్రవాహంలో వాణ్ణి ముంచేస్తేగా**
**కష్టపడడం ఎందుకో తెలీకుండా కష్టపడి**
**కర్మ సిద్ధాంతపు నిశ్శబ్ద దుఃఖంలో కుళ్ళిపోతే**
**బలహీనతల దుఃఖపు వర్షంలో నానిపోతే**
**బతుకు – నగరపు చెత్తకుండీల వైపు ఈడ్చుకుపోయినప్పుడు"**

**(ప్రయోజన సినిమా, పుట–205)**

పరిస్థితులు ఎంత విషమించినా ఎదుర్కొంటూ ఈ మట్టి మనుషులకు మౌనయుద్ధం చేయక తప్పదు. నగరంలో ఏ మూలనైనా చూడండి. ఆకాశాన్నంటే ఎత్తైన భవనాలు నానాటికి పెరుగుతున్నాయి. వాటిని కట్టేది కూలీలే.

దర్శకుడు బి. నర్సింగరావును కూలీల జీవితాల్లోని ఈ విషాదపు జీవితాలపై దృష్టి సారించాడు. అర్చన, నీనాగుప్త, మొయిన్ అలీ బేగ్ల నటనతో "మట్టి మనుషుల్ని" పూరించాడు. జాతీయ స్థాయిలో ఉత్తమ నటీ అవార్డులు అందుకున్న తెలుగమ్మాయి అర్చన గురించి అందరికీ తెలిసిందే. శ్యాం బెనగల్ చిత్రాలలో, టి.వి. సీరియల్స్లో తరచూ కనిపించే నటి నీనాగుప్త కూడా అందరికీ తెలిసిందే. కాని ఇంగ్లీషు నాటక రంగానికి అంకితమై సృజనాత్మక కార్యక్రమాల్ని

రూపొందిస్తున్న హైద్రాబాదీయుడు మొయిన్ అలీ బేగ్ తెలుగు చిత్రరంగానికి కొత్త. అయితేనేం చిత్తశుద్ధితో ఆయన చేసిన కృషి వృధాగా పోలేదు. తర్వాతి కాలంలో ఈ రంగస్థల నటుడికి పద్మశ్రీ లభించింది.

## 5.11. తమిళ సినిమారంగం:

### 5.11.1. శివాజీ గణేశన్:

ఫ్రెంచ్ ప్రభుత్వం నుండి అత్యున్నత పురస్కారం 'చెవలియార్' బిరుదు 1955 ఏప్రిల్ 23న అందుకున్నాడు. నటులలో 'తిలకం' వంటివాడని "నడిగర తిలకం" బిరుదు తమిళ ప్రజలు ఇచ్చారు. 1966లో ఈయనకు భారత ప్రభుత్వం "పద్మశ్రీ" ఇచ్చింది. మూడవ తరగతితో చదువు మానేసి, ఇంట్లోంచి పారిపోయిన కుర్రవాడు ఒక మహానటుడు అవుతాడని ఎవరు ఊహించని విషయం. ద్రవిడ మున్నేట కజగం పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా పనిచేస్తూ, రంగస్థలం మీద మంచి నటుడుగా పేరు తెచ్చుకుంటూ 1952లో సినిమారంగ ప్రవేశం చేసిన శివాజీ గణేశన్ తనదైన ఒక విశిష్టమైన శైలిని ప్రవేశపెడతాడని ఎవరూ ఊహించలేదు. అయితే 1966లోనే శివాజీలో గొప్ప కళాకారుడు ఉన్నాడని ఫాల్కే అవార్డు గ్రహీత బి.ఎన్. రెడ్డి ప్రకటించారు.

విల్లిపురం చిన్నయ్యా గణేశన్ 1927 అక్టోబర్ 01 తంజావూరులో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. ఆ తర్వాత ఆ కుటుంబం విల్లిపురంలో స్థిరపడింది. గణేషన్ తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. ఆ రోజుల్లో నాటక సమాజాలు ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తూ ఉండేవి. ఓసారి విల్లిపురానికి ఒక నాటక సమాజం వచ్చింది. "వీరపాండ్య కట్టబ్రహ్మన" నాటకానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్య భూమికలు పోషించడానికి ఆ నాటక సమాజంలో ముగ్గురు, నలుగురు నటులు మాత్రమే ఉన్నారు. మిగతా భూమికలు పోషించడానికి ఔత్సాహికులైన గ్రామస్తుల్ని ఆహ్వానించారు. చిన్నయ్యా కూడా వెళ్లి బ్రిటీష్ సైనికుడి వేషం వేశాడు. అది చూసి చిన్నయ్యా తండ్రి మండిపడ్డాడు. చదువును అశ్రద్ధ చేసి నాటకాల వెంట తిరగడం, ఒక తక్కువ స్థాయి నాటకంలో పాల్గొనడం, అందులో తెల్లవాడి పాత్ర పోషించడం, స్వాతంత్ర్య సమరయోధుడైన ఆ తండ్రి హృదయం భగ్గుమంది. చిన్నయ్యాను చితకబాదాడు. అంతే, చిన్నయ్యా ఇల్లు విడిచి పారిపోయాడు. కొంతకాలం కమ్మరి కొలిమిలో పనిచేశాడు. అక్కడ బతుకుదెరువు చూసుకుంటూ 'యధారత్నం పొన్నుస్వామి అండ్ కో' అనే నాటక సమాజం వారిని కలిసి, తన జాలి కథను వినిపించి వారితో చేరిపోయాడు. అలా చాలాకాలం ఆ కళాకారుణ్ణి నాటకరంగం తీర్చిదిద్దింది. ఆ రోజుల్లోనే భరతనాట్యం, కథాకళి, మణిపూరి వంటి నాట్యాలు నేర్చుకున్నాడు.

"పరాశక్తి" సినిమాతో రంగప్రవేశం చేసిన శివాజీ గణేశన్, మళ్లీ ఎన్నడు వెనక్కి తిరిగి చూడలేదు. విజయ పరంపరలు సాధిస్తూ సాగిపోతూ వచ్చాడు. "మనోహర" అనే సినిమా తమిళ, తెలుగు, హిందీ భాషలలో విజయం సాధించింది. భారత్ విలాస్, పల్లీ కళ్యాణం, పాపమన్నప్ప, కర్ణన్, అంబికాపతి వంటివి ఎన్నో ఎన్నెన్నోమంచి సినిమాల్లో కథానాయకుడిగా పాత్రలు పోషించాడు. అవి తెలుగులోకి అనువాదం అయినప్పుడు తెలుగు నటుడు కొంగర జగ్గయ్య తెలుగు అనువాదం చెప్పేవాడు. దానితో ఇద్దరికి పేరు వచ్చింది.

అమోఘమైన నాటకీయత ప్రదర్శిస్తూ, సింహగర్జన గుర్తుకు తెచ్చే సంభాషణా సరళిని కొనసాగిస్తూ సాగే పాత్రలు తర్వాత కాలంలో శివాజీ గణేశన్ పోషించలేదు. సముద్రపు అగాధాన్ని తలపించే లోతైన పాత్రలో, నెమ్మదితనంలోనే ఎనలేని ఒత్తిడిని, ఉద్వేగాన్ని ప్రదర్శించే పాత్రలు చేశాడు. "ముదల్ మరియాదతై", "నాయకన్" వంటి చిత్రాలు చూసినప్పుడు ఈ మార్పును గమనించగలం.

చాలాకాలం సింగపూర్, ఫ్రాన్స్లో వైద్యం చేయించుకుని, మృత్యువుతో ఏళ్లకేళ్లు పోరాడి విజయుడై తిరిగి రావడం, లోగడ మహా దర్శకుడు సత్యజిత్ రే వంటి దర్శకుడికి దక్కిన ఫ్రెంచ్ పురస్కారం మళ్లీ శివాజీ గణేశన్ స్వీకరించడం ఎంతో ఆనందించదగ్గ విషయం. భారతీయ కళారంగం గర్వించదగ్గ అంశం.

**5.11.2. ప్రభుదేవా**:

కొందరి జీవితాలు చాలా విచిత్రంగా ఉంటాయి. హైస్కూల్లో చదువు మానేసి, జులాయి తిరుగుళ్లు తిరుగుతూ, తన తండ్రిలాగా సినిమా రంగంలో డాన్స్ మాస్టర్ కావాలని కలలుగన్న ప్రభుదేవా ఆ తర్వాత ఒక పెద్ద తమిళ చిత్ర కథానాయకుడు అయ్యాడు. దేదీప్యమానంగా వెలిగిన సినీ సితార. జాతీయ స్థాయిలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న డాన్సర్. భారతదేశపు మైఖేల్ జాక్సన్. చిత్ర రంగానికి విలువైన ముడి సరుకు. పిల్లల్ని, యువకుల్ని ఉర్రూతలూగించిన సమ్మోహన మంత్రం. భారతీయ శాస్త్రీయ నృత్యాన్ని, పాశ్చాత్య నృత్యాన్ని కలగలిపి, తనదైన ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న కొరియోగ్రాఫర్. అతి తక్కువ సమయంలో భారతీయ సినీ ప్రేక్షకుల్ని తన నృత్య మాయాజాలంతో వశపరచుకున్న మాంత్రికుడు. కొంత కృషి, మరింత అదృష్టం కలగలుపుకుని ఎదిగినవాడు. కొన్ని సినిమాల్లో అతను కొరియోగ్రఫీ చేసి, అతనే నటించిన ఒకటి రెండు పాటల్ని గుర్తు చేసుకుంటే చాలు, అతని డాన్స్ కోసం దేశం ఎలా వెర్రులెత్తి

పోయిందో తెలుస్తుంది. "చుక్ చుక్ బుక్ రైలే", "టేక్ ఇట్ ఈజీ పాలసీ", "ముక్కాలా ముక్కాబులా లైలా" వంటివి.

తనకు హీరో వేషాలు వేయడం కన్నా డాన్స్ మాస్టర్గా ఉంటూ, కొరియోగ్రఫీ చేయడంలోనే ఆనందం ఉందని చెప్పుకునే ప్రభుదేవాలో భేషజాలు లేవు. తనకు డైలాగులు పలుకుతూ సీరియస్గా యాక్షన్ చేయడం ఎంతో కష్టంగా ఉంటుందని చెప్పుకునే ఈ నటుడు హిందీ చిత్రరంగం ఇచ్చే ఆహ్వానాల్ని మర్యాదగా తిరస్కరించాడు. జెంటిల్మన్, ప్రతాప్, ఇజైజాత్తి, కాదలన్ (ప్రేమికుడు) లాంటి ఎన్నో చిత్రాలలో డాన్స్ చేసినా "ప్రేమికుడు" చిత్రంలో హీరోగా స్థిరపడ్డాడు.

ప్రభుదేవా తెలుగు, తమిళం కలిపి సుమారు వంద సినిమాలకు కొరియోగ్రాఫర్గా పనిచేశాడు. జగదేకవీరుడు అతిలోకసుందరి, దళపతి, మైఖేల్ మదన కామరాజు, భరతన్, అన్నామలై వంటి ఎన్నో చిత్రాలలో ముఖ్య భూమికలు పోషించిన కమల్ హాసన్, శ్రీదేవి, రజనీకాంత్, చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, మోహన్బాబు, రాజశేఖర్, మమ్ముట్టి, విజయకాంత్, సత్యరాజ్ మొదలైన తెలుగు, తమిళ కళాకారులతో డాన్స్ చేయించాడు.

ప్రభుదేవా తండ్రి ఎం. సుందరం  ఒక డాన్స్ మాస్టర్. ఆయన తంగప్పన్కు మొదటి అసిస్టెంట్గా ఉండేవాడు (తంగప్పన్ అంటే నగేష్తో చాలా చిత్రాలు చేసినవాడు) ఆ రకంగా డాన్స్ వాతావరణంలోంచి వచ్చినవాడు ప్రభుదేవా. చిన్నప్పుడు తన సోదరులతో కలిసి థామరాజ్ మాస్టర్ దగ్గర ఉడిపి లక్ష్మీనారాయణన్ దగ్గర భరత నాట్యం నేర్చుకున్నాడు. మరోవైపు ఇంట్లో పాశ్చాత్య నాట్యం ప్రాక్టీసు చేసేవాడు. సెలవుల్లో తండ్రితో పాటు అవుట్డోర్ షూటింగ్లకు వెళ్ళే ప్రభుదేవా, ఒక్కోసారి తండ్రికి అసిస్టెంట్గా సహకరించేవాడు. అనుకోకుండా ఒకసారి "మౌనరాగం"లో చిన్న బిట్ చేయడానికి అవకాశం ఇచ్చాడు తండ్రి సుందరం. దాన్ని అద్భుతంగా నిర్వహించాడు ప్రభుదేవా.  అది చూసిన వారు  అందరూ ప్రశంసించారు.

నేపథ్య సంగీతంతో ఇళయరాజా, ఎ.ఆర్. రెహమాన్లు ఎలాగైతే సంచలనం సృష్టించారో, నాట్యంలో కొరియోగ్రాఫర్గా ప్రభుదేవా అంతే సంచలనం సృష్టించాడు. స్వయంగా తెర మీద హీరో అయి మరింత అలజడి కలిగించాడు. అవే పాత ఫార్ములాలు, మూసలో పోసిన ఇతివృత్తాలతో సినిమాలు బోరుగా తయారైన తరుణంలో ఒకవైపు రెహమాన్ సంగీతం, మరోవైపు ప్రభుదేవా నాట్యం భారతీయ ప్రేక్షకులకు ఒక కొత్తదనాన్ని ఇచ్చాయి.

ప్రభుదేవా బిజీ హీరో అయ్యాక నటి రోజాతో కలిసి "రసియా" పూర్తి చేశాడు. "లవ్ బర్డ్స్"కు నగ్మాతో కలిసి విదేశాల్లో షూట్ చేశాడు. శిల్పాశెట్టితో "మిస్టర్ రోమియో"గా మారాడు.

పైగా ఆ చిత్రంలో ద్విపాత్రాభినయం కూడా చేశాడు. కాలపు వేగంతో కొట్టుకుని వస్తూ అనేక పాత్రలు పోషిస్తున్నా, తనకు తాను హీరోగా భావించనని, నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సవినయంగా చెప్పుకుంటాడు.

## 5.12. కన్నడ సినిమారంగం:

### 5.12.1. బి.వి. కారంత్ – చోమనదుడి:

అణచి వేయబడ్డవాడి కులం, వర్గం, జీవితం ఇతివృత్తంగా బి.వి. కారంత్ 'చోమనదుడి' (చోమడి డప్పు) అనే చిత్రం రూపొందించాడు. ఎప్పుడో అప్పు తీసుకున్న ఇరవై రూపాయలకు జీవితాంతం చెమటతో వడ్డీ కడుతూ, బానిస కూలీగా మారిపోయిన హరిజనుడి కథ ఇది. బాకీ తీర్చేసి, తన భూమిని తాను స్వంతం చేసుకోవాలనుకుంటాడు చోమ. కానీ అదృశ్య హస్తాల మధ్య నలిగి పిప్పి చేయబడతాడు. అనేకమైన  దుర్ఘటనలతో కుటుంబం సర్వనాశనమైపోతుంది. చోమ ముగ్గురు కొడుకుల్ని పోగొట్టుకుంటాడు. ఒకడు నదిలో పడితే మరొకడు క్రైస్తవ మతంలో కలుస్తాడు. క్రైస్తవ మతాధికారి చోమకు రెండు ఎకరాల భూమి ఆశ చూపించి క్రైస్తవుడిగా మార్చడానికి ప్రయత్నిస్తాడు. చోమ అందుకు సిద్ధమవుతాడు. కానీ మళ్ళీ మనస్సు మార్చుకొని, మొదటి నుండి నమ్ముకున్న భూతాలనే కొలుస్తుంటాడు. కూతురు బెల్లి అరటి తోటల పర్యవేక్షకుడికి (ఓవర్ సీర్) శీలాన్ని అర్పించి తాము ఇవ్వాల్సిన అప్పు నుండి విమోచన సాధిస్తుంది. ఆమె తిరిగి రావడం చోమకు సంతోషం కలుగుతుంది. కాని ఆమె తరుచు ఓవర్సీర్తో కనిపించడంతో అతడి భ్రమలన్నీ పటాపంచలవుతాయి. బాధలు భరించలేక చివరకు చోమ మరణిస్తాడు.

విషయమంతటినీ కారంత్ పటిష్టమైన సంకేతాల ద్వారా చూపిస్తాడు. ఇందులో భూస్వామి తల్లి గడ్డకట్టుకు పోయిన విలువలకు ప్రతినిధి. స్వలాభం కోసం ఎదుటివాళ్లను ఉపయోగించుకునే వారికి అరటి తోటల ఓవర్సీర్ ప్రతినిధి. దీనిలోకి ఒక ఆంగ్లేయుడ్ని ప్రవేశింపజేయడంలో అట్టడుగు బతుకుల్ని అణగదొక్కబడిన విధానం ఇంకా స్పష్టంగా బట్టబయలు చేయబడింది. ఇక డప్పు చోమడి ఆత్మ. వాడు తన దుఃఖాన్ని, సంతోషాన్ని, కోపాన్ని డప్పు వాయించడం ద్వారా వెల్లగక్కుతుంటాడు. చోమ మరణించిన తర్వాత కూడా వాడి డప్పు వినిపిస్తూనే ఉంటుంది. అంటే ఎక్కడైతే చోమ విఫలుడైనాడో అక్కడ వేరేవాళ్లు విజయం సాధించాలని సూచించడం కావచ్చు. అట్టడుగు బతుకులు బాగుపడలేదని, వారి సమస్యలు అనంతంగా కొనసాగుతూనే ఉన్నాయని తెలియజేయడం కావచ్చు. విడివిడిగా వ్యక్తులు మంచివారే! కాని ఒక గుంపుగా ఈ సాంఘిక వ్యవస్థలోకి వచ్చేసరికి, వారి ముఖాలు మానవాకృతిని కోల్పోతున్నాయి. ఇది ఒక చిన్న సంఘటన

ద్వారా చూపించబడింది. చోమ కొడుకు నదిలో మునిగిపోతున్నప్పుడు రక్షించడానికి ఒక బ్రాహ్మణుడు తక్షణం నదిలోకి దూకుతాడు. నదిలో మునిగిపోతున్నవాడు అంటరానివాడని గుర్తించి ఇతర బ్రాహ్మణులు అతన్ని వెనక్కి పిలుస్తారు. రక్షించే వాళ్లు లేక చోమ కొడుకు చనిపోతాడు. మొత్తం మీద చిత్రం సాంకేతికంగా కూడా ఉన్నతస్థాయిలో ఉంది. కూలీలు కొండల మధ్య నుండి పోతున్నప్పుడు దర్శకుడు బి.వి. కారంత్ వాడుకున్న జానపద గీతాలు, సంగీతం బాగుంటాయి.

అడవిలో వేరుచేయబడ్డ రెండు గ్రామాలలో పంతాలు, పట్టింపులు ఎలా హింసాత్మక చర్యలకు దారితీస్తాయో వర్ణించి చూపుతుంది 'కాడు' (అడవి) చిత్రం. వ్యక్తుల మధ్య చిన్నగా రగిలిన మనస్పర్థ నుండి మొత్తం గ్రామాన్నే నాశనం చేస్తుంది. నగరం నుండి పోలీసులు వచ్చి జోక్యం చేసుకోవడంతో చిత్రం ముగుస్తుంది. ప్రముఖ రచయిత శ్రీకృష్ణ ఆలహనహళ్ళి నవలకు, గిరీష్ కర్నాడ్ రూపకల్పన ఇది. ఈ నవలను శ్రీకంఠమూర్తి తెలుగులోకి అనువదించారు.

గౌడ ఆ ఊరికి పెద్ద. ప్రేమించే అందమైన భార్యను వదిలి ప్రతి రాత్రి అతడు పక్క గ్రామానికి పోతుంటాడు. తన భర్త తనకు దక్కాలనే ప్రయత్నంలో ఆమె దేవతలను ఆరాధిస్తుంది. మెడ నరకగా చనిపోతున్న కోడి రక్తంతో ఆమె బొట్టు పెట్టుకుంటున్నప్పుడు ఈ చిత్రం మొదలవుతుంది.

ఒక వివాహిత స్త్రీ మరొక పురుషుడితో అడవిలో సంభోగిస్తుంది. వారిద్దరూ అడవితో వేరు చేయబడ్డ వేర్వేరు గ్రామాలకు చెందినవారు. ఆ విషయం రెండు గ్రామాల ప్రజలకు తెలుస్తుంది. రెండు గ్రామాలకు చెందిన ప్రజలు కోపంతో మండిపోతారు. "ఒకుల్లి" పండుగ (హోలీ పండుగ లాంటిది) రోజున హింసకు దిగుతారు. పగ, క్రౌర్యం వీరవిహారం చేస్తుంది. ఒకరినొకరు గాయపరచుకోవడానికి, చంపుకోవడానికి వెనుకాడరు. ఈ కొట్లాట చిత్రంలో అత్యుత్తమంగా చిత్రీకరించబడింది. ఆ కల్లోలంలో ఊరి పెద్ద గౌడ భార్య మానభంగం చేయబడి చంపబడుతుంది. గౌడ హంతకులను వేటాడి వారి రక్తంతో తన భార్య శవానికి తిలకం దిద్దుతాడు. గ్రామం చావడిలో చెప్పే తీర్పులు కట్టుబాట్లు నిలవవు. వాటి స్థానంలో ఉద్రేకాలు, కక్షలు చోటు చేసుకుంటాయి.

సినిమా అంతా కిట్టూ అనే పదేళ్ల అబ్బాయి (గౌడ అల్లుడు) చూపులోంచి చిత్రీకరించబడింది. అందుకే సన్నివేశాలన్నీ తాజాగా కనిపిస్తాయి. హింసాత్మక విష వలయంలో చిక్కుకున్న కిట్టూ చుట్టూ జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలు, సరదాగా నవ్వు తెప్పిస్తాయి. వెను వెంటనే మానవత్వపు లోతుల్ని తరచి చూస్తాయి.

### 5.12.2. తబరన కథె:

మైసూరు సమీపంలో "పదుగెరె" మున్సిపాలిటీలో తబరది కాఫీ తోటల వారివద్ద పన్నులు వసూలు చేసే ఉద్యోగం. స్వాతంత్ర్య సమరం కొనసాగుతున్న రోజుల్లో గాంధీజీ అనుచరులకు నచ్చజెప్పి పన్నులు కట్టించాడని బ్రిటీష్వారు అతని ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తారు. ఇంతలో స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వ, ప్రతిపక్ష రాజకీయాలు తబరకు అర్థం కావు. కాఫీ తోటల వారి నుండి పన్నులు కూడా వసూలు కావు. రసీదు రాసిన తర్వాత కూడా వారు పన్నులు కట్టడానికి నిరాకరిస్తారు. ఆ విషయం తబర పై అధికారులకు విన్నవించుకుని విసిగిపోతాడే తప్ప వారేమీ చర్య తీసుకోరు. చివరకు పన్నులు వసూలు చేయలేదన్న నింద మాత్రం తబర పైనే పడుతుంది. పన్నులు ఎగవేసిన వారి డబ్బు అంతా అధికారులు తబర పెన్షన్లో కోస్తామంటారు. అలా అయితే పదవీ విరమణ తర్వాత అతడికి పైసా కూడా మిగలదు.

తబర భార్య పేరు అప్పి. వారికి సంతానం లేకపోవడం వల్ల 'బాబు' అనే కుర్రవాణ్ణి దత్తత తీసుకొని పెంచుకుంటారు. విలాసాలకు అలవాటు పడిన దత్త పుత్రుడు పనికిరానివాడు అవుతాడు. భార్య అప్పికి డయాబెటిస్ ఉండడం వల్ల కాలికి అయిన వ్రణం మానదు. నిస్సహాయుడైన తబర ఆమె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించ లేకపోతాడు. ఆమె మృత్యువుతో పోరాడి ఓడి పోతుంది. తబర ఒంటరివాడు అవుతాడు. దత్త పుత్రుడు తప్పించుకుని వెళ్ళిపోతాడు. ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల భర్తగా, తండ్రిగా తబర తన బాధ్యతలు నిర్వర్తించ లేకపోతాడు.

రాజకీయ నాయకులు తబరను అనేక విధాలుగా వాడుకోవాలని చూస్తారు. అన్ని చోట్ల మోసగించబడ్డ తబరను స్వంత ఊర్లోనే "పిచ్చివాడు – ఉన్మాదుడు" అని అంటారు. చివరకు ఎలాగో తహశీల్దారు, అతడికి కొంత పెన్షన్ డబ్బు ఇప్పించాలని ప్రయత్నిస్తాడు. ఈలోగా స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా పెన్షన్ తీసుకుంటున్న వారి నుండి ప్రభుత్వం చందాలు వసూలు చేయమంటుంది. చావుతప్పి కన్నులొట్టబోయిన విధంగా ఏదో కొద్ది మొత్తం పెన్షన్ తీసుకుందామని వెళ్లిన తబరను ఆఫీసు వారు చందా అడగడంతో రెచ్చిపోయి కేకలేస్తాడు. తబర పిచ్చివాడు అని ఫైలు మీద రాసి అధికారులు అతడిని బైటికి గెంటిస్తారు. ఈ విధంగా నీతికి, నిజాయితీకి ప్రతినిధిగా నిలబడ్డ ఒక చిన్న ఉద్యోగి జీవితాన్ని అత్యుత్తమంగా చిత్రీకరించాడు దర్శకుడు గిరీష్ కాసరవెల్లి.

కథను కూర్చింది పూర్ణచంద్ర తేజస్వి అయితే ముఖ్య పాత్రలు పోషించింది చారుహాసన్, నళినామూర్తి, సత్యసంధ మాధవరావులు. ఇరవై ఏడేళ్ల యువకుడిగా 1978లో "ఘటశ్రాద్ధ"

చిత్రంతో జాతీయ స్థాయిలో స్వర్ణకమలం సంపాదించిన గిరీష్ కాసరవెల్లి మళ్లీ 1987లో “తబరన కథె”తో రెండవ సారి సాధించాడు. ‘ఆక్రమణ’, ‘మూడు దారిగుళు’ వంటి చిత్రాలు రూపొందించిన గిరీష్ బెంగుళూరులోని ఆదర్శ ఫిలిం ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్గా ఉన్నాడు. ఈ చిత్రంలో తబరగా నటించిన చారుహాసన్కు ఉత్తమ నటుడిగా బహుమతి లభించింది. 1986లో చారుహాసన్ కుమార్తె సుహాసినికి ఉత్తమ నటి బహుమతి లభించినప్పుడు ఆయన ఈ “తబరన కథె” షూటింగ్లో తీరిక లేకుండా ఉండేవాడు. ‘అందులో ఆశ్చర్యం ఏమీలేదని, వచ్చే సంవత్సరం తన చిత్రంతోనే చారుహాసన్కు ఉత్తమ నటుడిగా బహుమతి వస్తుందని’ సరదాగా జోస్యం చెప్పిన గిరీష్ కాసరవెల్లి మాట అక్షరాలు నిజమైంది. సుహాసిని కన్నా ముందు ఆమె బాబాయి, చారుహాసన్ తమ్ముడు కమల్హాసన్కు ఉత్తమ నటుడి బహుమతి దక్కింది. జాతీయ స్థాయిలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు వరుసగా బహుమతులు అందుకోవడం ఒక విశేషం. ఈ చిత్రంలో మరో విశేషమేమిటంటే దర్శకుడు గిరీష్ కాసరవెల్లి భార్య వైశాలి కూడా ఒక ముఖ్య భూమికను పోషించింది.

1987లో జాతీయ స్థాయిలో ఉత్తమ నటి బహుమతి అందుకున్నది ఒక పదహారేళ్ల అమ్మాయి. బెంగుళూరులో పదవ తరగతి చదువుతున్న ఆ అమ్మాయి పేరు మోనీషా. హరిహరన్ దర్శకత్వం వహించిన “నఖక్షతంగళ్” సినిమాలో ఒక ఉదాత్తమైన పాత్రను పోషించింది. దీని కంటే ముందు ఆమెకు నాటకాల్లో గాని, టి.వి.లో గాని అనుభవం లేదు. కేవలం మొట్ట మొదటి పాత్రతోనే జాతీయ స్థాయికి ఎదగడం హర్షించదగ్గ విషయం. అయితే సినిమాలో ఆమె పోషించిన పాత్ర వయస్సు, నిజ జీవితంలో ఆమె వయసు ఒకటీ కావడంవల్ల, సహజంగా నటించడానికి ఆస్కారం కలిగిందేమో. భరత నాట్యంలో శిక్షణ పొందడంతో ఆమె హావభావాలు సులువుగా ప్రదర్శించి ఉండవచ్చు.

### 5.13. మలయాళ సినిమారంగం:

### 5.13.1. పి.ఎ. బేకర్ – మునిముజహక్కం:

ఈ దేశంలో ఏ మతం నుండి ఏ మతంలోకైనా మారవచ్చు. కాని మారితే ఒరిగేదేమిటి, ఇంతటి సువిశాలమైన దేశంలో విశాల దృక్పథం కరువైనప్పుడు, జీవన ప్రమాణాలు మెరుగవకుండా, పై పై మెరుగుల కోసం పరుగెడుతున్నప్పుడు ఈ విషయాన్ని పరోక్షంగా ఒక వ్యక్తి జీవితాన్ని తెలియజేసిన మలయాళ చిత్రం మునిముజహక్కం. నిజాం కాలంలో తెలంగాణలో చాలామందికి బలవంతంగా ముస్లిం మతం ఇప్పించారు. ఏవో కొన్ని ప్రయోజనాలకు ఆశపడి 1984–85లలో తమిళనాడులో వందల మంది క్రైస్తవ మతం పుచ్చుకున్నారు. కాలక్రమేణా

అడపాదడపా పత్రికల్లో మత మార్పిడి ప్రసక్తి వస్తూనే ఉంది. సంకుచితత్వానికి మతం ప్రతీకగా నిలబడుతోందన్న ఉద్దేశాన్ని దర్శకుడు తేటతెల్లం చేశాడు ఈ చిత్రంలో.

మునిముజహక్కం (ఘంటానాదం) దర్శకుడు పి.ఎ. బేకర్ అతి తక్కువ పరిధిలో అసమాన మేధోసంపత్తితో ఆయన కథను మలుచుకోవడం ఈ చిత్రంలోని ప్రత్యేకత. జోస్పాల్ ఒక యువకుడు. అతడు రోమన్ కాథలిక్ శరణాలయంలో పెరిగి పెద్దవాడవుతాడు. తరువాత తన పూర్వపు హిందూ కుటుంబంలోకి మార్చబడి, అక్కడతను హిందూ మత సాంప్రదాయాలకు కట్టివేయబడతాడు. జోస్పాల్ తన వ్యక్తిత్వాన్ని తాను నిలుపుకోవాలనుకొని ఎన్నో వైరుధ్యాల మధ్య గడిపిన జీవిత పోరాటమే ఈ మునిముజహక్కం.

జోస్పాల్ వందల కొద్ది అనాథ పిల్లల మధ్య పెరుగుతాడు. అదొక చిన్న ప్రపంచం. స్కూలు పరీక్షల్లో అత్యుత్తమంగా ఉత్తీర్ణుడవుతాడు. ఫాదర్ ఫ్రాన్సిస్ దయతో, ప్రేమాభిమానాలతో కాలేజీలో చేరతాడు. అప్పుడే మొట్ట మొదటిసారి ఈ విశాల ప్రపంచంలో అడుగు పెడతాడు. మొదట్లో కళాశాల అతనికి దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఆ వాతావరణం తబ్బిబ్బులు చేస్తుంది. కాని ఒక ధనవంతుల అమ్మాయి పరిచయమయ్యాక అతనికి కొంత ధైర్యం వస్తుంది. అతని మీద అతనికి నమ్మకం పెరుగుతుంది. కాని అనాథ శరణాలయంలో పెరిగాడని తెలిసిన మరుక్షణమే ఆ అమ్మాయి అతణ్ణి ఒంటరిని చేస్తుంది. అతని హృదయం విలవిలలాడుతుంది. మనస్సు ముక్కలవుతుంది. అనాథ శరణాలయానికి తిరిగి వచ్చేస్తాడు. సుపరిచితమైన వాతావరణంలో రోజులు గడుస్తుంటాయి.

అతని పూర్వపు కుటుంబంలోని పినతండ్రి వెతుక్కుంటూ వచ్చి జోస్ తమవాడని గుర్తించి ఇంటికి తీసుకుపోతాడు. దాంతో జోస్పాల్ మరొక కొత్త ప్రపంచంలోకి అడుగు పెడతాడు. పినతండ్రి ధనవంతుడైనందువల్ల భోగభాగ్యాలకు కొదువ లేదు. కుటుంబ సభ్యులనుండి మమతానురాగాలకు లోటులేదు. కాని చిన్నప్పటి నుండి తనలో పెరిగిన క్రైస్తవ నమ్మకాలను వదులు కొమ్మని వాళ్లు నెమ్మదిగా ఒత్తిడి చేస్తుంటారు. అప్పటికే ఆ ఇంట్లో అతని పేరు 'జోస్—రాజన్'గా మారుతుంది. ఆ కుటుంబానికి సన్నిహితుడైన ఒక పెద్ద మనిషి కూతురు వాళ్లింటికి తరచూ వస్తుంటుంది. ఆమెతో రాజన్కు మంచి పరిచయం ఏర్పడుతుంది. చాలా దగ్గరి వాళ్ళైపోతారు. కాని అతను క్రైస్తవ మతాచారాల ప్రకారం పెరిగాడని తెలియగానే ఆ హిందువుల అమ్మాయి అతణ్ణి, అతని స్నేహాన్ని తిరస్కరిస్తుంది.

ప్రతి చోట వంచించబడి బతుకుదెరువు కోసం మద్రాసు చేరుకుంటాడు. అక్కడ అతను మళ్లీ జోస్గా గుర్తించబడతాడు. అతనితో పనిచేసే క్రైస్తవ మిత్రుడొకడు సదాభిప్రాయం వెలిబుచ్చి తన చెల్లను ఇచ్చి పెళ్ళి చేయడానికి సిద్ధమవుతాడు. కాని జోస్ మూడవసారి కూడా దురదృష్టవంతుడే. పేరు జోస్ అయినప్పటికీ, క్రైస్తవ మత నమ్మకాలు ఉన్నప్పటికీ అతని పూర్వులు హిందువులని ఆ స్నేహితుడికి తెలియగానే అతను ప్రయత్నం మానుకొని చెల్లెలిని ఇవ్వడానికి నిరాకరిస్తాడు. జోస్ తనకు తానుగా గుర్తించబడాలని, సమాజంలో ఒక స్థానం సంపాదించాలని చేస్తున్న ప్రయత్నం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. చలనచిత్రం ముగుస్తుంది.

**5.13.2. మోహనన్ – పురుషార్థం**:

మలయాళ చిత్ర దర్శకుడు కె.ఆర్. మోహనన్ రూపొందించిన చిత్రాలు పురుషార్థం (1987), అశ్వథామ (1978), స్వరూపం (1992) ఆయనకు బాగా పేరు తెచ్చిన చిత్రాలు.

హైందవ మతానుసారం మానవుడు ఒక్కొక్క దశను దాటి ఒక పరిపూర్ణతను సాధించుకోవాల్సి ఉంటుంది. ఆ పరిపూర్ణమైన తత్వానికే 'పురుషార్థం' అని పేరు. ఏమీ తెలియని అమాయకత్వం లోంచి అన్ని తెలుసుకున్న జీవితానుభవంలోకి ప్రయాణించగలగడమే పురుషార్థంలోని పరమార్థం. దర్శకుడు విచిత్రంగా ఈ చిత్రంలో ఒక మరణించిన వ్యక్తిని ముఖ్యపాత్రగా నిలబెట్టాడు. అతని మరణం తర్వాత అతని భార్య, కొడుకు, బంధువులు మొదలైన వాళ్లంతా ఎలా ప్రతిస్పందిస్తారు, ఎలాంటి మానసిక ఒత్తిడులకు గురవుతారు అనే విషయాన్ని ఎత్తి చూపాడు. ఇందులో చనిపోయిన వ్యక్తి భార్య పేరు భద్ర. ఏడేళ్ల కొడుకు వినిత్. శ్రీమతి భద్రా వాసుదేవ్ ఒక పెద్ద పారిశ్రామికవేత్త. ఆమె చనిపోయిన భర్త స్వగ్రామానికి వెళ్లి, అక్కడ కొడుకు వినిత్తో అష్ట మాంగల్య ప్రసన్నం పూజ చేయిస్తుంది. అలా చేస్తే తన కొడుకుకి మేలు జరుగుతుందని, తండ్రి లేడన్న విషయాన్ని గ్రహించి కొంత ఉపశమనం పొందుతాడని ఆమె ఆలోచన. కాని ఆ పల్లెలో మురికి మనుషులు, మురికి వాతావరణంలో ఇమడలేక పోతుంది. చనిపోయిన భర్త తాలూకు భయంకరమైన ఆలోచనలొకవైపు, భర్తను చంపినదానిగా బంధువులు ఏహ్యాభావంతో చూడడం ఒకవైపు, భద్రా వాసుదేవ్ ఒక చిత్రమైన మానసిక సంఘర్షణకు లోనవుతుంది. పూజ జరిపించడానికి వచ్చిన పూజారులు సైతం వాసుదేవ్ మరణం సహజమైంది కాదని చెవులు కొరుక్కుంటారు. అది సహించలేని భద్ర నిజంగానే భద్రకాళి అవుతుంది. పూజల్ని మధ్యలోనే ఆపేయించి, పూజారుల్ని బయటికి పంపించేస్తుంది. పాప పరిహారానికి హోమం చేయించి, రామేశ్వరంలో బలి ఇవ్వాలని వాళ్లు ఉపదేశించి వెళ్తారు. మానసిక ఒత్తిడులకు ఆ

తర్వాత ఆమె బలి చేయిస్తుంది. బలి కార్యక్రమం జరుగుతున్న సమయంలో వినిత్ వరి అన్నాన్ని తన తల్లి ప్రేమికుడి పైకి విసిరేస్తాడు. అతడి మీద లోలోపల పేరుకుపోయిన అసహ్యాన్ని ఆ విధంగా వ్యక్తం చేస్తాడు.

భర్త మరణానికి భద్ర నిజంగానే కారకురాలా కాదా అన్నది దర్శకుడు విడమర్చి చెప్పాడు. మంచి హాస్పిటల్ సౌకర్యం గల స్థలానికి దగ్గరలో ఉండి, గ్యారేజ్లో రెండు కార్లు ఉంచుకుని, అరగంటలో హాస్పిటల్ చేరుకోగలిగే దూరంలో ఉండి కూడా భద్ర భర్తను ఎందుకు హాస్పిటల్కు తరలించదో అర్థం చేసుకోవచ్చు. భద్ర, ఆమె ప్రేమికుడు, కొడుకు వినిత్ ఈ ముగ్గురూ ఒక త్రిభుజాకారంలో నిలిచిన మూడు పాత్రలు. వీరి అంతర్మథనమే ఈ చిత్రానికి మూలం. చిత్రంలో ముఖ్య పాత్ర అయిన భద్రను ఒక స్త్రీగా చూపకుండా, ఉన్నత వర్గానికి ప్రతినిధిగా చూపడం ఇందులోని ప్రత్యేకత. వివిధ సమయాల్లో కనిపించే వివిధ కార్లు వర్గ భేదాన్ని స్పష్టం చేశాయి. భద్ర ఉపయోగించే బెంజ్ కారు ఉన్నత వర్గానికి, స్కూలు పిల్లల్ని దింపి వెళ్ళే టాక్సీ మధ్య తరగతికి, గుడిసెల్లో పిల్లలు ఆడుకునే డొక్కు బొమ్మకారు కింది తరగతికి ప్రాతినిధ్యం వహించాయి.

కథకు అంతస్సూత్రం వినిత్ పాత్ర. అతనికి ఏమీ తెలియని దశలో తండ్రి చనిపోతాడు. కొంత ఊహ తెలిసిన తర్వాత తండ్రి విషయాలు తెలయడం, తండ్రి ఇల్లు, బంధువులు, పరిసరాలు తెలియకుండానే కట్టి పడేస్తాయి. అమాయకత్వంలోంచి ఒక అనుభవంలోకి ప్రయాణించిన తీరును చిత్రీకరించడమే దర్శకుని ప్రతిభకు తార్కాణమైంది. భద్రగా సుజాతా మెహతా, కొడుకుగా బాల నటుడు జాబిన్ జార్జ్ అద్భుతంగా నటించారు. ప్రాముఖ్యం లేని ఒక మామూలు పాత్ర పోషించి అసాధారణ ప్రతిభ కనబరిచిన నటి నంది. మానసిక సంక్షోభంలోంచి వర్గ సంఘర్షణను చూపించగలిగిన దర్శకుడు కె.ఆర్. మోహనన్.

## 5.14. హిందీ సినిమారంగం:

### 5.14.1. గోవింద్ నిహలానీ – ఆదివాసుల 'ఆక్రోశ్':

ఆదివాసుల జీవితం ఏ విధంగా ఉపయోగించుకోబడుతుందో చిత్రించిన చిత్రం ఆక్రోశ్. ఇందులో లహన్యా భికు (ఓంపురి) ఒక ఆదివాసి. అతడు తన భార్యను హత్య చేశాడన్న నేరం మీద అరెస్ట్ అవుతాడు. అతని పక్షాన వాదించడానికి కోర్టు, డిఫెన్స్ లాయరుగా భాస్కర్ కులకర్ణి (నసీరుద్దీన్ షా)ని నియమిస్తుంది. తన భార్య మరణాన్ని గూర్చి ఎవరెన్ని ప్రశ్నలు వేసినా లహన్యా జవాబు చెప్పడు. చివరికి తనవైపు వాదించే భాస్కర్ కులకర్ణి ముందు కూడా నోరు విప్పడు. అతని మౌనం అతన్ని ఉరిశిక్ష వైపు లాగుతూ ఉంటుంది. అతను నోరు విప్పి నిజం చెప్పినా ఎవరు

నమ్మరని అతని అభిప్రాయం. నిజం చెబితే తన ముసలి తండ్రి, వయస్సులో ఉన్న చెల్లెలి బతుకులకు ప్రమాదమని భావించి కోర్టులో గాని, జైల్లో గాని ఎక్కడ పెదవి కదిపే ప్రయత్నమే చేయడు. విసిగి పోయిన న్యాయవాది భాస్కర్ కులకర్ణి తనకు తానై నిజానిజాలు తెలుసుకోవడానికి పూనుకుంటాడు. ఆదివాసుల గుడిసెల వద్దకు వెళ్ళి వివరాలు అడుగుతూ ఉంటాడు. ఆ ప్రయత్నంలో ఒక సాంఘిక కార్యకర్త (మహేష్ యెల్కుంచ్ వార్)తో పరిచయం ఏర్పడుతుంది. అతడొక వామపక్ష కార్యకర్త. ఆదివాసులతో కలిసిపోయి వారిలో ఒకడిగా వారిని 'ఎడ్యుకేట్' చేసే గొప్ప బాధ్యతను నిర్వహిస్తుంటాడు. అతడు కిరాయి గుండాలతో చంపివేయబడక ముందు భాస్కర్ కులకర్ణికి కేసు గురించి కొన్ని అతి ముఖ్యమైన విషయాలు చెబుతాడు. లహన్యా భికు తన భార్య నాగి (స్మితాపాటిల్)ని చంపలేదని ఆమెను ఆ ప్రాంతంలో ఒక ముఠాగా ఏర్పడ్డ రాజకీయ నాయకులు, అధికారులు కలిసి ఫారెస్ట్ బంగళాలో బలాత్కారం చేసి చంపేశారని, పోలీసు సహకారంతో చట్టం నుంచి తప్పించుకొని అమాయకుడైన లహన్యాను కేసులో ఇరికించారని చెబుతాడు.

భాస్కర్ కులకర్ణి చేపట్టిన మొట్టమొదటి కేసు ఇది. మొదట్లో కొంతకాలం ఉద్యోగ నిర్వహణ నిజాయితీతో చేస్తాడు. కాని చుట్టు ఉన్న పరిస్థితులు, తెలిసిన నిజాలు అతనిలో మార్పును తెస్తాయి. అందుకే మరొక అడుగు ముందుకేసి ఆదివాసుల ఉద్ధరణ ఒక బాధ్యతగా స్వీకరిస్తాడు. అధికారులు, రాజకీయ నాయకులు కలిసి ఏర్పడ్డ ముఠా ఇతనికి శత్రు వర్గం అవుతుంది. వారి నుంచి అనేక ప్రమాదాలను కూడా ఎదుర్కొంటాడు. పోలీస్ ఎస్కార్ట్తో తిరుగుతూ ఉంటాడు. ఒకప్పుడు తన సీనియర్ అయిన దుస్సాని (అమ్రిశ్ పూరి) పబ్లిక్ ప్రాసిక్యూటర్తో అభిప్రాయ భేదాలు ఏర్పడతాయి. వృద్ధుడైన లహన్యా తండ్రి మరణిస్తాడు. అంత్యక్రియలు చేయడానికి లహన్యాకు భాస్కర్ కోర్టు నుండి అనుమతి ఇప్పిస్తాడు. లహన్యా గట్టి పోలీసు బందోబస్తుతో తండ్రి అంత్యక్రియలు చేయడానికి వస్తాడు. కర్మకాండ పూర్తి చేస్తూనే ఆ అంత్యక్రియలకు హాజరైన వాళ్లలో దిక్కులేని పక్షిలా విలవిలలాడుతూ రోదిస్తున్న తన చెల్లెల్ని చూస్తాడు. తన భార్యకు పట్టిన గతి చెల్లెలికి కూడా పడుతుందని భావించి అక్కడ ఎవరి చేతిలోనో ఉన్న ఆయుధం లాక్కుని చెల్లెల్ని చంపేస్తాడు. భయకంపితులైన పోలీసులు అతి కష్టం మీద అతన్ని అదుపులోకి తీసుకుంటారు. ఆ ఉద్రేకంలో లహన్యా పెద్దగా ఆక్రోశిస్తాడు.

అందరి ముందూ చెల్లెల్ని చంపడంతో లహన్యా కేసు మరింత క్లిష్టంగా తయారవుతుంది. ఆదివాసుల జీవితాల్లోకి చాలా లోతుగా తెరచి చూసిన న్యాయవాది భాస్కర్ కులకర్ణి తన ప్రాణానికి

ముప్పు రావచ్చునని తెలిసి కూడా, వారి జీవితాలతో ఆడుతున్న చెలగాటం బట్టబయలు చేయడానికి లహన్యా పక్షాన వాదించి న్యాయం చేకూర్చడమే తన జీవిత ధ్యేయంగా భావిస్తాడు. ఈ సాంఘిక వ్యవస్థలో తేవాల్సిన మార్పుకు తన కృషి, త్యాగం ఎంతో అవసరమని దృఢంగా విశ్వసిస్తాడు.

న్యాయవాద వృత్తిని కొత్తగా స్వీకరించిన యువకుడు భాస్కర్ కులకర్ణి పాత్రను నసీరుద్దీన్ షా చాలా చక్కగా పోషించాడు. ఇతనికి వృత్తిలో వ్రేళ్లు తన్నుకుపోయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుస్సానికి జీవిత విధానంలో, ఆలోచనా ధోరణిలో గల విభేదాలను దర్శకుడు చాలా చక్కగా స్పష్టం చేశాడు.

'ఆక్రోశ్' దర్శకుడు గోవింద్ నిహలానీ రూపొందించిన మొట్టమొదటి కథాచిత్రం. ఆయన యస్.జె. పాలిటెక్నిక్, బెంగుళూరులో సినిమాటోగ్రఫీలో డిప్లొమా పొందాడు. బొంబాయిలో ప్రముఖ ఛాయాచిత్ర గ్రాహకుడు వి.కె. మూర్తితో కలిసి పదేళ్లు పనిచేశాడు. ప్రమోద్ చక్రవర్తికి అసిస్టెంట్ కెమెరామెన్గా కూడా పనిచేశాడు. శ్యాం బెనగల్ "అంకుర్" చిత్రం ద్వారా మంచి కెమెరామెన్గా నిగ్గుదేరాడు. ఆ తరువాత బెనగల్ అన్ని చిత్రాలకు అలాగే రిచర్డ్ అటెన్బరో "గాంధీ" చిత్రానికి పనిచేశాడు. ఆదివాసుల పట్ల నిత్యం జరుగుతున్న అన్యాయాలు గోవింద్ నిహలానీని ఈ చిత్రం రూపొందించడానికి ప్రేరేపించాయి. వాస్తవంగా జరిగిన సంఘటనలతో "ఆక్రోశ్" కథా నిర్మాణం జరిగింది. చిత్రంలో న్యాయవాది భాస్కర్ కులకర్ణి మధ్య తరగతి మనస్తత్వానికి ప్రతినిధి. ఆ పాత్ర ద్వారా దర్శకుడు తన ఆలోచనలు, ఉద్దేశాలు ప్రేక్షకుల ముందుంచి ఆలోచింపజేస్తాడు.

### 5.14.2. తమస్ – మత కలహాల చీకటి:

అజ్ఞానం ముందు వంగి లేచేది మతం. అజ్ఞానం చుట్టూ ప్రదక్షిణలు చేసేది మతం. సంకుచితతత్వం, దురహంకారం, రాజకీయాలతో కలగలపి చరిత్రను మానవ రక్తంతో గడ్డ కట్టించింది మతం. ఏ కాలమైనా మతం సృష్టించింది చీకటే. చీకటికి పర్యాయపదమే మతం. మతకలహాల విశ్వరూపాన్ని దర్శింపజేయడమే 'తమస్' ఉద్దేశం. తమస్ – ప్రముఖ హిందీ నవలా రచయిత భీష్మ సహాని నవల తమస్. అదే పేరుతో గోవింద్ నిహలానీ రూపొందించిందే హిందీ టెలీ ఫిలిం.

చీకటి రోజుల్లో కళలు, కవిత్వాలు ఉంటాయా అని ప్రశ్నించాడు జర్మన్ మహాకవి బెర్తోల్డ్ బ్రెహ్ట్. "ఉంటాయి! అయితే అవి చీకటి రోజుల గురించి మాత్రమే ఉంటాయి" అని ఆయనే సమాధానం కూడా చెప్పాడు.

1947 ఆగస్టు దేశ విభజనకు ముందు జలాలాబాద్లో జరిగిన సంఘటనల ఆధారంగా భీష్మ సహనీ నవల రూపుదిద్దుకుంది. అటు సింధ్ ఇటు పంజాబ్ల మధ్య, అటు ముస్లింలు, ఇటు హిందువుల మధ్య, అటు ముస్లిం లీగ్ ఇటు కాంగ్రెస్ రాజకీయాల మధ్య ఐదు లక్షల మంది అశువులు కోల్పోయారు. పదిహేను మిలియన్ల మంది గూడునీడ లేక నిరాశ్రయులైన వారు పాకిస్థాన్లోకి, భారతదేశంలోకి వలస వెళ్లారు. తప్పులు ఇరుపక్షాల వారివి ఉన్నాయి. కాబట్టి జరిగిన నరమేధం వెనుక – లోపించిన మానవ విలువల్ని, అప్పటి హీనమైన సమయాన్ని ఈ చిత్రం బేరీజు వేస్తుంది. ఇందులోని సంఘటనలు ఆ కాలానికే పరిమితం కాదు. అహ్మదాబాద్, భీవండి, మీరట్, మొహదాబాద్, హైదరాబాద్లలో అప్పుడప్పుడు జరుగుతూ వస్తున్న హిందూ ముస్లింల కొట్లాటల వల్ల ఈ కథ ఈ కాలానికే అని సాక్ష్యం పలుకుతుంది. హిందూ రాజ్యం, ఖలిస్తాన్ల కోసం జరుగుతున్న రక్తపాతాలు అందుకు వంతపాడుతున్నాయి. అంతే కాదు, కరాచీ వీధులలో మొహాజిర్, నాన్–మొహాజిర్ల మధ్య జరుగుతున్న ఘర్షణలు 'తమస్'లో చూడవచ్చు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జరిగిన ఆంధ్రా, తెలంగాణ ఉద్యమాలలో వందలాది మంది అమాయకుల బలి గుర్తుకు తెచ్చుకోవచ్చు. కొద్దిపాటి తేడాలతో విభజనకు సంబంధించిన ఏ అల్లర్లలోనైనా నష్టపోయేది ప్రజలే. ఈ విశ్వజననీయమైన నిజాన్ని మనకు దర్శింపజేయడానికి దర్శకుడు చేసిన తపస్సే 'తమస్'. మానవ సంబంధాల్ని మరింత మెరుగుపరచడానికి మతాల్ని, రాజకీయాల్ని దూరంగా తరిమి వేయడానికి నిజమైన విశ్వశాంతిని కాంక్షించడానికి తప్పదు అని దర్శకుడు 'తమస్'లో చెప్పడానికి ప్రయత్నించాడు.

'తమస్' కథ వివిధ స్థాయిలలో నడుస్తుంది. ఒకవైపు బక్షిజీ (ఎ.కె. హంగల్) నిజాయితీపరుడు, గాంధేయవాది, కాంగ్రెస్ నాయకుడు. అతని అనుచరులంతా ఉన్నత కులాలకు చెందిన వాళ్లు. వారు చెప్పేవి వారే ఆచరించరు. మరోవైపు ప్రతిపక్ష నాయకుడు ముస్లీంలీగ్కు చెందిన హకీమ్ హయత్బక్ష్ (మనోహర్ సింగ్) "ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్తాన్ సాధించి తీరుతానని మంకుపట్టు పట్టినవాడు". "తన శరీరం రెండు ముక్కలయ్యేదాక ఈ దేశం ముక్కలు కావడానికి వీల్లేదని" – అరిచే పిచ్చి దేశభక్తుడు, జర్నైల్సింగ్ (వీరేంద్ర సక్సేనా) ఈ ఇరువర్గాల మధ్య బ్రిటీష్ అధికారి డిప్యూటీ కమీషనర్ రిచర్డ్ హామిల్టన్ (బెర్రిజాన్), అందరి మధ్య నలిగే సామాన్యుడు నాథూ (ఓంపురి) అతని భార్య కర్మో (దీపాసాహి). ఇవి ఈ చిత్రంలో ముఖ్య భూమికలు. రచయిత భీష్మ సహనీ సర్దార్ హర్నామ్సింగ్ భూమికను పోషించాడు.

ఎవరో ధనవంతులైన హిందువులు అర్ధరాత్రి నాథూ ఇంటికి వస్తారు. డబ్బులిచ్చి ఒక పందిని చంపమంటారు. తను చంపిన పంది ఉదయానికి మసీదు ముందుకు చేరుతుందని, దానితో పట్టణంలోని హిందూ, ముస్లింల మధ్య అపార్థాలు ఎక్కువై తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయని నాథూ ఊహించడు. కాంగ్రెస్ వాళ్ల ప్రభాతభేరి కార్యక్రమం అర్ధాంతరంగా ముగుస్తుంది. మరోపక్క "అల్లహో అక్బర్" నినాదాన్ని తొక్కేయడానికి "హరహర మహాదేవ" బృందం బయలుదేరుతుంది. కత్తులు, కర్రలు తిప్ప గలిగే ఖాకీ నిక్కరల్ల యువకులు "హిందూ సభ"గా విజృంభించారు. వీరందరి మధ్య నాథూ పాత్ర ఎంతో ఉదాత్తమైంది. మత రాజకీయాల్లో చిక్కుకొని, బలైపోయే లక్షలాది సామాన్యులకు ప్రాతినిధ్యం వహించే పాత్ర. "ఇంతగా కుళ్లిపోయిన ఈ సమాజంలోకి మన కొడుకును ఎందుకు రానివ్వాలి" అని నాథూ గర్భవతి అయిన భార్యను ప్రశ్నిస్తాడు. "వాడి పుట్టుకను ఆపడానికి మనమెవ్వరం". వాడికి కావాల్సిన సమాజం కోసం వాడే సంఘర్షిస్తాడు" అని ఆమె జవాబు చెప్తుంది. ఇక్కడ కొడుకు పుట్టడానికి భారత స్వాతంత్రోద్యమానికి అన్వయిస్తాడు దర్శకుడు.

నవలలో లేని కొన్ని కొత్త విషయాలు కూడా దర్శకుడు చిత్రంలో చేర్చుకున్నాడు. ఒకసారి ముస్లింలతో కొట్లాడి సిక్కులు మరణించారని వార్త తెలుస్తుంది. వారికి సంబంధించిన సిక్కు స్త్రీలందరూ పిల్లలతో సహా ఊరి బావిలో దూకుతారు. పంజాబ్లోని ఒక గ్రామంలో జరిగిన ఈ "ఖుర్బానీ" చిత్రంలో ఒక ముఖ్యమైన అంశం.

గోవింద్ నిహలానీ బాల్యం కరాచీలో గడిచింది. "డాన్" వార్తాపత్రిక కార్యాలయం ఎదురుగా మేడ మీద ఉండేవాడు. వారి ఇంటి కింద ఒక పాన్షాపు ఉండేది. పాన్షాపు యజమాని ఆందోళనకారులకు భయపడి, పైకి నిహలానీ వాళ్లింటికి వచ్చాడు. ఆ రోజు సంపాదన నిహలానీ తండ్రికి అప్పగించాడు. తప్పించుకొని పారిపోదామని కిందికి వెళ్లాడు. అంతే ఆందోళనకారులు అతన్ని కాల్చేశారు. ఇదంతా బాలుడిగా నిహలానీ చూశాడు. మత కల్లోలాల భయంకర స్వరూపం ఆనాడే పసి హృదయంలో చెరగని ముద్ర వేసింది. ఆ అనుభవం అతన్ని ఊర్కోనివ్వలేదు. చిత్రసీమలో ప్రవేశించిన తర్వాత, మత కల్లోలాల పై సినిమా తీయాలన్న కోరిక బలపడింది. రిత్విక్ ఘటక్ – నాస్తిక్, ఎం.ఎస్. సత్యు గరమ్హవా తప్ప "దేశ విభజన – మతకలహాలు" ఇతివృత్తంగా సీరియస్ సినిమా ఏదీ రాలేదు. సాదత్ హసన్ మంటో కథ ఆధారంగా తారీఖ్ అలీ, కెన్మలెన్లు "పార్టిషన్" అనే పేరుతో బ్రిటీష్ టి.వి. కోసం ఒక టెలీఫిలిం రూపొందించారు. అయితే అది మనకిక్కడ మనదేశంలో ప్రసారమయ్యే అవకాశాలు లేవు. 'తమస్' గోవిందా నిహలానీ మొదటి

టెలీఫిలిం. తర్వాత అది చలనచిత్రంగా థియేటర్లలో కూడా విడుదలైంది. జాతిని ఆలోచింపచేసే ఈ 'తమస్' "తమసోమా జ్యోతిర్గమయా" ఉద్దేశాన్ని నిజం చేసింది.

### 5.14.3. ఆనంద్ పట్వర్ధన్ – హమారా షహర్:

చలనచిత్ర దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ బొంబాయి మురికివాడలపై ఒక మంచి డాక్యుమెంటరీ రూపొందించాడు. సినిమా పేరు "హమారా షహర్". 1985లో దీనికి రాష్ట్రపతి బంగారు పతకం లభించింది. 1986లో ప్యారిస్లో జరిగిన "సినిమా డ్యు రియల్ ఫెస్టివల్"లో స్పెషల్ జ్యూరీ బహుమతి లభించింది. స్వీడన్లో జరిగిన భారతీయ ఉత్సవాల సందర్భంగా ప్రదర్శించారు. మానవీయ విలువల్ని కించపరిచేదిగా భారతీయ సంస్కృతిని వక్రీకరించే విధంగా లేదని తెలుస్తూ ఉంది. మరి ఏ కారణాల వల్ల దూరదర్శన్ వారు ప్రసారానికి అనర్హమైందని నిర్ధారించారో తెలియదు. రాష్ట్రపతి అవార్డు అందుకున్నా, దూరదర్శన్లో మాత్రం మామూలు ప్రసారానికి ఎన్నిక కాలేదు. "హమారా షహర్" డాక్యుమెంటరీ దూరదర్శన్లో ప్రసారం చేయడం కోసం 1986లో చిత్ర దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ వారికి ఒక నివేదిక సమర్పించాడు. 1987లో దూరదర్శన్ వారి నుండి నిరుత్సాహకరమైన ఉత్తర్వు లభించింది. అందులో ప్రసారానికి పనికిరాదని స్పష్టం చేశారు. కాని ఎందువల్ల పనికిరాదో అనే కారణం స్పష్టంగా ఇవ్వలేదు. విసిగిపోయిన ఆనంద్ పట్వర్ధన్ లీగల్ నోటీసులు పంపి, తర్వాత హైకోర్టులో రిట్ వేశాడు. తన డాక్యుమెంటరీ ఎందువల్ల ప్రసార యోగ్యం కాదో తేల్చమన్నాడు.

చిత్రం 60 నిమిషాల కన్నా ఎక్కువ నిడివి గలదని, చిత్రంలో చిత్రీకరించిన పరిస్థితులు ప్రస్తుతం లేవని దూరదర్శన్ అధికారులు వాదించారు. అయితే వారి వాదనలు నిలువ లేదు. "హమారా షహర్" ప్రసార యోగ్యత కలదని బొంబాయి హైకోర్టు తీర్పు చెప్పింది. దర్శకుడికి కోర్టు ఖర్చులు ఇప్పించింది. చిత్రం 60 నిమిషాల కంటే ఎక్కువ నిడివి గలదైతే, సీరియల్గా ప్రసారం చెయ్యవచ్చునని, డాక్యుమెంటరీ ఇంతే ఉండాలన్న నియమ నిబంధనలు ఏమీ లేవని హైకోర్టు సూచించింది. మతపరమైన, రాజకీయపరమైన, నైతిక, సాంఘిక, సామాజికపరమైన విభేదాల్ని ఈ చిత్రం రెచ్చగొట్టేట్టుగా లేదని హైకోర్టు తీర్పు చెప్పింది.

బొంబాయిలోని మురికి వాడల్లోని దుర్భర పరిస్థితుల్ని యథాతథంగా చిత్రీకరించిన ఈ చిత్రంలోని ఇతివృత్తం. జీవితం అంతా ఇప్పటికీ ఉందని, రాబోయే దశాబ్దాలలో కూడా అది అలాగే ఉంటుందని, అందువల్ల ప్రదర్శనకు అన్ని విధాలా అనువైందని హైకోర్టు తీర్పు చెప్పింది. మన రాజ్యాంగంలోని 19 (1) (A) నిబంధన ప్రకారం, చిత్ర నిర్మాతల స్వేచ్ఛను ఈ తీర్పు

పరిరక్షించింది. సెక్స్, క్రైం వంటి తక్కువ స్థాయి మసాలా గల సినిమాలు ప్రసారం చేసే దూరదర్శన్ సమస్యాత్మకమైన ఒక మంచి చిత్రాన్ని ఎందుకు తోసిపుచ్చిందో తెలియదు.

"బాంబే అవర్ సిటీ" కావడానికి డాక్యుమెంటరీయే. కాని, ఏ కథా చిత్రానికి తీసిపోదు. తీసుకున్న విషయం పకడ్బందీగా, స్పష్టంగా, సూటిగా ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను పరోక్షంగా ఎత్తి చూపినా, ప్రత్యక్షంగా కుండ బద్దలు కొట్టినట్టు ఉంది. సన్నివేశాలను ఒక క్రమబద్ధమైన సీక్వెన్స్లో ఏర్పరచుకోవడం వాటిని కలుపుకుంటూ, మహా నగరంలోని మురికివాడల్లో పాడుకునే పాటల్ని జత చేయడం జరిగింది.

ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా ప్రభుత్వ స్థలాల్లో మురికివాడలు పెరిగిపోవడాన్ని నగర మున్సిపల్ కమీషనర్ తీవ్రంగా నిరసించాడు. ఈ జనమంతా వారి వారి గ్రామాలకు వెళ్లిపోతే సమస్య తీరుతుంది అని సలహా కూడా ఇచ్చాడు. "మహా నగరాల్లో ఆకాశహర్మ్యాలు నిర్మాణమవుతున్నాయి కదా! మరి అవి కట్టడానికి కూలి జనాల్ని ఎక్కడి నుండి తెస్తారు"? అని అడిగిన ప్రశ్నకు మున్సిపల్ కమీషనర్ ఓ క్షణం తడబడి ఆ తర్వాత చెప్పారు. కూలి కోసం ఆ మురికివాడల్లోని జనమే తమకు అవసరమవుతారని, కాని పని అయిపోగానే వారు నగరం వదిలి వెళ్లాలని, ఇంట్లో అంట్లు తోమడం దగ్గర నుండి, చెత్త ఎత్తి పోయడం, మరుగుదొడ్లు శుభ్రంచేయడం, మురికి కాలువలు ఎత్తిపోయడం వంటి పనులన్నీ ఈ మురికివాడల్లోని మురికి మనుషులే చెయ్యాలి.  కాని వారు తలదాచు కోవడానికి ప్రత్యామ్నాయమైన ఏర్పాటు ఏ ప్రభుత్వం చేయడం లేదన్నమాట! ఊళ్ళల్లో పెత్తందార్లు, జమీందార్లు, దొరలు కాల్చుకు తినగా భరించలేక పారిపోయి నగరాలకు వస్తే, ఇక్కడ కనీసం ఓ పూట తిండి దొరకక, పడుకోవడానికి ఫుట్పాత్ దొరకక అలమటిస్తున్న జనం సమస్యల్ని దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ ఇందులో రికార్డు చేశారు.

మున్సిపాలిటీ వాళ్లు మురికివాడల్లోని గుడిసెల్ని, టెంట్లను కూలగొట్టి వెళతారు. జనమంతా కోడిపిల్లలా చెల్లాచెదురైపోతారు. మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు వారి పాలిటి గద్దలు! ఉన్న చెంబు తపాలా ఎప్పుడొచ్చి ఎగరేసుకుపోతారో తెలియదు. సీసాలు కడిగే బ్రష్లు తయారుచేసే ఒకతను చెబుతాడు. తన కత్తెర తీసుకుపోవడంవల్ల, తనకు రెక్కలు విరిగినంత పనైందట! తిండికే లేకపోతే ఇక కొత్త కత్తెర ఏం కొంటాడు? విదేశీ యాత్రికుల్ని విశేషంగా ఆకర్షించడానికి నగరాన్ని నందనవనం చేద్దామని అనుకునే ప్రభుత్వ యంత్రాంగం – నిర్దాక్షిణ్యంగా వీరిని తన్ని తగిలేయడం వల్ల ప్రయోజనం లేదు. బంతిలా ఒకచోట తంతే మరోచోట పడతారు. అక్కడ మరొక మురికివాడ తలెత్తుతుంది. ఒక పోలీసు అధికారి మురికివాడలోని ఒక స్త్రీని "ఎందుకు కన్నావ్ ఇంత మంది

పిల్లల్ని?" అని దబాయించాడు. అందుకు ఆమె "నువ్వెట్లా పుట్టావయ్యా?" "చదువు చెప్పిస్తే మా పిల్లవాడు కూడా నీకంటే పెద్ద అధికారే అవుతాడు" — అని సమాధానమిచ్చింది. దురదృష్టవశాత్తు జరుగుతున్నదేమంటే — ఇంటి నెంబరు ఉన్నవాళ్లకే రేషన్ కార్డు, పోస్టు, విద్యా సౌకర్యం ఉంది. పుట్పాత్లపై ఉండేవారి పిల్లల్ని ఏ విద్యా సంస్థ చేర్చుకోదు. ఇల్లు అనేది లేకపోతే జంతువుకు మనిషికి తేడా ఏది? అని విశ్లేషించాడు ఆనంద్ పట్వర్ధన్.

★★★

# ముగింపు

# ముగింపు

సమాజం ఎన్నో వైరుధ్యాలను, సంఘర్షణలను కలిగియున్న సంక్లిష్టమైన రూపం. సమాజ ప్రతిబింబమే సాహిత్యమైనప్పుడు సమాజానికీ, సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉన్నప్పుడు సామాజిక చైతన్యాన్ని కల్గించడమే సాహిత్యం యొక్క ప్రధాన లక్ష్యం అవుతుంది. కవులు, రచయితలు తమకు కావాల్సిన వస్తువును సమాజం నుండే తీసుకుంటారు. తిరిగి ఆ సమాజాన్నే చైతన్యపరుస్తారు. ప్రతి రచయితకు తనకంటూ ఒక దృక్పథం ఉంటుంది. అది ఏర్పడడానికి ఏదో ఒక బలమైన కారణం ఉండి తీరుతుంది.

నల్లగొండ ప్రాంతంలో పుట్టిన రచయిత దేవరాజు మహారాజుగారు వివిధ రకాల సాహిత్య ప్రక్రియల్లో రచనా వ్యాసంగాలను పండించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రచనలు కాలక్షేపం కోసం రాసినవి కాదని, ఒక లక్ష్యం, ఒక ప్రయోజనం కోసం రాసినవని తెలుస్తుంది. ఆయన రచనలన్నీ జీవితానుభవాల నుండి పుట్టడమే గాక ఒక సామాజిక స్పృహను కలిగి రాయబడ్డాయి. అట్టడుగు బతుకుజీవుల వ్యథలను, కథలను, పేదవారి సమస్యలను వస్తువులుగా స్వీకరించారు.

మానవత్వానికి మించిన మతం లేదని మనిషి పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యతతో భవిష్యత్ ప్రపంచాన్ని మార్చడమే సాహిత్య లక్షణం. సమాజంలోని వ్యక్తుల ఆర్తి, ఆవేదన, ఆక్రోశాలు, సంఘర్షణలు, వ్యధలు, బాధలు, కష్టాలు, కన్నీళ్ళు, పల్లె పదాలు, మట్టి మనుషులపై ఉన్న ప్రేమ, అమాయకత్వం, తిరగబడలేని స్త్రీ వ్యవస్థ, భూస్వాముల దౌర్జన్యాలు, స్త్రీ పురుష సంబంధాలు, గ్రామాలలో ఉండే రాజకీయాలు, పట్టుదలలు, మనుషుల మీద ఉన్న నమ్మకం మొదలైన వాటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఆవేదనతో, ఆర్ద్రతతో రాసిన సాహిత్యం వీరి రచనల్లో కనిపిస్తుంది.

సమాజంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి ప్రతిస్పందించి కవిత్వంతోనే చైతన్యాన్ని తీసుకురావడం కోసం పరితపించిన వ్యక్తి దేవరాజు మహారాజు. వేగంగా మారిపోతున్న సామాజిక సందర్భాన్ని కవిత్వంలోకి తీసుకురావడంలో ముందున్నాడు.

నేటి సమాజంలో ఎందరో మహానుభావులు, శాస్త్రజ్ఞులు, రచయితలు, వారి జీవిత కోణం నుండి ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించారు. కొందరు వృత్తికి ప్రాధాన్యతనిస్తే మరికొందరు ప్రవృత్తిని అభిమానించారు. కానీ దేవరాజు మహారాజుగారు వృత్తిని ప్రేమిస్తూ ప్రవృత్తిని అభిమానిస్తారు. సాహిత్యంలో కానీ, సమాజంలో కానీ కొన్ని రిక్త స్థానాలు ఉంటాయి. వాటిని భర్తీ

చేసినప్పుడే సమాజం, సాహిత్యం సర్వసమగ్రం అవుతాయి. కవి తాను రాసిన కవిత్వంపై సమకాలీన సమాజ ప్రభావం తప్పక ఉంటుంది. అదేవిధంగా దేవరాజు మహారాజు తన రచనల్లో సామాజికాంశాలను చర్చించి తనదైన ధోరణిలో సమాజానికి సందేశాన్నిచ్చారు. సమాజంలో ఉండే సామాన్య విషయాలను వస్తువుగా మలిచి తనదైన శైలిలో వ్యక్తీకరించారు. కవిత్వమే కాకుండా అనువాదాలు చేస్తూ ఇతర భాషలలోని సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించాడు.

కవిత్వం, కథ, నవల, నాటకం, అనువాదం ప్రక్రియ ఏదైనా మొత్తంగా అతని వాక్యం అణచివేయబడ్డ ప్రజల వైపు, ప్రాంతం వైపు నిలిచింది. ప్రాంతీయ స్పృహ, అభ్యుదయ దృక్పథం, మానవతా దృష్టి కలగలిపి వీరి సాహిత్యంగా ఒదిగింది. దేవరాజు మహారాజు ఒకే విషయాన్ని కాకుండా పలు విషయాలను వివిధ కోణాల నుండి చిత్రించి తదనుగుణంగా సాహిత్యాన్ని సృజించారు.

ఆధునిక తెలుగు కథా సాహిత్యానికి ప్రముఖ స్థానం ఉంది. ఆధునిక తెలుగు కథకు అంత ప్రాధాన్యం రావడానికి మానవ జీవితాన్ని వాస్తవికంగా చిత్రించడమే అని చెప్పవచ్చు. కథా శిల్పం ఆకట్టుకున్న తీరు కూడా మరో కారణం. వాస్తవిక జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రిస్తూ రావడం వల్ల పలువురి మన్ననలను పొందింది. అలాంటి క్రమంలో తెలంగాణ ప్రజల సామాజిక జీవిత పరిణామాలను చిత్రించడానికి కృషి చేసిన వారిలో దేవరాజు మహారాజు ముఖ్యులు. తానెరిగిన జీవితాన్ని కథలుగా మలిచి అలుపెరగని కష్టాల మధ్యలో బతుకుతూనే కథా సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన అరుదైన వ్యక్తి దేవరాజు మహారాజు. దేవరాజు లాంటి సామాజిక బాధ్యత గల రచయిత కథల వల్ల ఒక కాల, ప్రాంత చరిత్రను అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి.

ఈయన రచనల ఆధారంగా వీరి ఔన్నత్యాన్ని అంచనా వేయడం జరిగింది. వీటితో పాటు సమాజంలో మానవుడు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి ప్రతిస్పందనగా వ్యక్తం చేసిన సానుభూతి మొదలగువాటిని వివరించడం జరిగింది. పరిస్థితుల ప్రభావం వలన సరియైన మార్గదర్శకత్వం లేక తప్పుదారిలో నడుస్తూ జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటున్న మనిషి యొక్క మానసిక దౌర్బల్యాన్ని పోగొట్టే వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన కవిగా దేవరాజు మహారాజుగారిని పేర్కొనడం జరిగింది.

దేవరాజు మహారాజు మానవతావాది, సామాజికుడు, సహృదయుడు. ఏవో ఊహా సౌధాలలో పేకమేడలలో కూర్చొని కలలు కనే కవి కాదు. ఈ కవి వాస్తవికుడు. వీరి రచనలు చదువుతుంటే ఈ కవి స్పృశించని అంశం ఏదైనా మిగిలి ఉందా అన్న ఆశ్చర్యం కలుగుతుంది.

ప్రతీ సూక్ష్మాంశములో కూడా ఎన్నో విశేషాలను చూడగల పరిశీలనా దృష్టి, వివేచనా ధోరణులు ఈ కవిలో కోకొల్లలు.

ప్రేమతో, సహనంతో సూటిగా సామాన్యంగా చెప్తూ అసామాన్యమైన ఆప్యాయతను అందిస్తాడు ఈ కవి. ఈయన కవిత్వం ఆయన హృదయ స్పందనలో నుండి పెల్లుబికివచ్చినటువంటిది. జీవితానుభవసారాన్ని విప్పి చెప్పడంలో విసుగు చెందని ఆసక్తి గల వ్యక్తి. తన జీవితానికి ఒక ఆదర్శమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, తను చేస్తున్న పనిని నిరంతరంగా బేరీజు వేసుకుంటున్న విశిష్ట వ్యక్తి దేవరాజు మహారాజు.

ఎవరైనా ఒక మంచి మాట మాట్లాడినా ఏదైనా ఒక దృశ్యాన్ని చూసినా, ఎక్కడైనా ఒక మంచి పంక్తి చదివినా వెంటనే స్పందించడం దేవరాజు మహారాజు స్వభావం. అదే వారి ఆలోచనలకు రూపుదిద్దింది. వారి రచనకు అదే బలం. అదే ఊపిరి.

★★★

# పరిశోధన ఫలితాంశాలు

**పరిశోధన ఫలితాంశాలు**:

1. దేవరాజు మహారాజు బహుముఖ ప్రజ్ఞాశీలి కవిత్వంతోపాటు నఖచిత్రాలు, హిందీ గజల్స్‌లోను అభినివేశం కలవారు.
2. దేవరాజు మహారాజు రచనలవల్ల ఎన్నో విశేషాంశాలు బోధపడతాయి.
3. దేవరాజు మహారాజుగారి రచనలు చదివితే వారి భావం, వస్తువులు బాగా అవగాహనకు వస్తాయి.
4. దేవరాజు మహారాజుగారి భాషాశైలిఉదాత్తమైనదిగా ఉంటుంది.
5. దేవరాజు మహారాజుగారి అనుభవాలు నేటి విద్యార్థి లోకానికి ఎంతో ఉపయోగకరంగా, ఆదర్శనీయంగా ఉంటాయని విశ్వసిస్తున్నాను.
6 దేవరాజు మహారాజు రచనలను చదివినప్పుడు సూక్ష్మ పరిశీలన, లోతైన అవగాహన, బాధ్యతాయుతమైన ఆలోచన కలిగిన వ్యక్తిగా రచయిత కనబడతారు.
7. చిన్న చిన్న అంశాలను కూడా చక్కటి కథలుగా మలిచారు.
8. సమాజంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కథల రూపాన్నిచ్చారు.
9. పాత్రల స్వభావాన్ని, వాటి మనస్తత్వాలను గ్రహించి పాత్రోచిత భాషను ఉపయోగించారు.
10. కవిత్వంలో విస్తృతమైన వస్తు వైవిధ్యం కన్పిస్తుంది.
11. కథల్లో తేలికైన భాషను ఉపయోగించారు.
12. ప్రతి కవిత సమాజంలో ఉండే రుగ్మతలను రూపుమాపడం కోసం రాసినట్లుగా ఉంది.
13. తాను చూసిన, తాను అర్థం చేసుకున్న సమాజాన్ని చిత్రించడంలో రచయిత విజయాన్ని సాధించారు.
14. ఈయన రచనల్లో తాను అర్థం చేసుకున్న వ్యవస్థలోని డొల్లను, కుళ్ళును ఎత్తిచూపే ప్రయత్నం చేశారు.
15. ప్రతి వస్తువు, ప్రతి పాత్ర సమాజాన్ని గురించి ఆయన మనసులో ఏర్పరచుకున్న ఆవేదనకు, బాధకు అద్దం పడతాయి.
16. పాలు ఎర్రబడ్డాయి కథలో బిడ్డ ఆకలి కోసం పరితపించే తల్లి మనకు కనబడుతుంది.
17. దేవరాజు మహారాజు రచనల్లో అభ్యుదయ భావజాలం, హేతువాద దృష్టి కనిపిస్తుంది.
18. కొన్ని కలాలు – కొన్ని సమయాలు అనే రచనలో దాశరథిని "వీణ" కవి అని తెలియజేశారు రచయిత.

19. దేవరాజు మహారాజుపై దాశరథి, శ్రీశ్రీల ప్రభావం ఎక్కువగా ఉంది చెప్పవచ్చు.

20. భాషా ప్రయోగంలోను కవి చాలా శ్రద్ధను చూపించారు. అలంకార ప్రయోగం, పద ప్రయోగ కౌశలం, ప్రాసల ప్రాభావం, మాండలిక పద ప్రయోగాలు వంటివి వీరి రచనల్లో మెండుగా ఉన్నాయి.

★★★

# అనుబంధం – 1

# తెలంగాణ కథా సాహిత్యంలో

# దేవరాజు మహారాజు స్థానం

# అనుబంధం – 1

## తెలంగాణ కథా సాహిత్యంలో దేవరాజు మహారాజు స్థానం

దేవరాజు మహారాజు సాహిత్య రంగంలో అడుగుపెట్టే నాటికి సమాజంలో ఎన్నో వైషమ్యాలు, అన్యాయాలు, అధర్మాలు, అవినీతి స్పష్టంగా ఆయన కళ ముందు కనిపించినవి. వాటిని సృజించడం ఆ కాలం నాటి రచయితలకున్న సామాజిక బాధ్యత. అలా సహజంగా పుట్టి పెరిగిన వాతావరణం దేవరాజు మహారాజుని సాహిత్య రచనకు ప్రేరేపించాయి. అప్పట్లో ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో భయంకర ఉద్యమాలు లేవనెత్తిన కాలం. అరసం, విరసం కవులు, రచయితలు విపరీతంగా సాహిత్య రచన చేసేవారు. అలాంటి రచయితలను మనం చూసినట్లయితే దాశరథి, కా.రా. వరవరరావు, శివారెడ్డి, జ్వాలాముఖి, శివసాగర్, అల్లం రాజయ్య మొదలగు కవులు, రచయితలు సమాజంలో గల వైరుధ్యాలను తమ కలాలలో ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నిలిపే ప్రయత్నం చేశారు. అలా వారి ప్రభావం వల్ల కొంత, తన జీవన స్థితిగతుల నుండి కొంత ప్రేరణ పొంది సామాజిక బాధ్యత కలిగిన వాస్తవిక రచయితగా ఎదిగినవారు దేవరాజు మహారాజు.

నాటి తెలంగాణ సమాజాన్ని, రాజకీయ రంగాన్ని మాత్రమే కాదు. పేదవారి జీవితాలను, వారి కష్టనష్టాలను, కుటుంబ సంబంధాలను కళ్ళకు కట్టించేలా కథలు రాశారు. దేవరాజును ఒక వ్యక్తిగా నిలబెట్టినవి ఆయన కథలే అని చెప్పాలి. దేవరాజు ఒక్కో కథ రాయడానికి ఎంతో వ్యవధిని తీసుకునేవారు. దేవరాజుది ఏ రచయితలలో ఇమడని నూతన కథన పద్ధతి అని చెప్పాలి. దీనికి అతని కథల్లో వర్ణనలు తార్కాణాలు. సామాజిక, రాజకీయ, వైయక్తిక స్థితిగతులను అవగాహనలో సమకాలీన జనజీవితాల వంటి ఇతివృత్తాలు ఎన్నుకొని సజీవమైన పాత్రల్ని సృష్టించి, సజీవనమైన భాషతో పలికిస్తూ కథన శిల్పంలో అనేక మెళకువలు చూపిస్తూ సుమారు 5 దశాబ్దాలు కథాసాహిత్య రంగంలో ఎనిమిది కథా సంపుటాలతో ఎక్కువ పేరును, కీర్తిని గడించారు. అంటే వారి కథల్లో సారమేమిటో, గాఢతెంతో మనకు అవగతమవుతుంది. జీవితాన్ని అర్థం చేసుకునే క్రమంలో మానవ జీవనాడిని పట్టుకొని వాస్తవికతకు దూరంగా వెళ్ళకుండా సమకాలీన సామాజిక సమస్యలనే కథావస్తువుగా ఎన్నుకొని, భాషలోనూ, భావంలోనూ, తెలంగాణ మాండలిక శక్తిని యుక్తితో ప్రయోగిస్తూ తెలంగాణ కథాసాహిత్యంలో గొప్ప కథలు అందించిన వాస్తవిక కథా రచయిత దేవరాజు మహారాజు.

దేవరాజు మహారాజు తన చుట్టూ ఉన్న జీవితాలను గమనిస్తూ వాటిలో ఏదైతే విలక్షణంగా తన మానసిక ప్రపంచాన్ని కుదిపేసేలా ఆలోచింపచేస్తుందో వాటికి మాత్రమే పరిమితమైన కథలు రాశారు. భౌతికాంశాలను వాస్తవిక దృష్టితో చూసి శాస్త్రీయ దృక్పథంతో రచనా సాహిత్యాన్ని సృజించారు. మొదటిగా రాసిన రచనల్లో సామాన్య ప్రజానీకాలపైన, పేద ప్రజలపైన ప్రభుత్వ పరిపాలన విధానంలో చితికిపోతున్న రైతుల పరిస్థితిని వివరిస్తూ కథలు రాశారు.

తెలుగు సాహిత్య ప్రపంచానికి ఎంతో మంది రచయితలు అమోఘమైన సేవలు అందించారు. అలాంటి ప్రతిభావంతుల్లో దేవరాజు మహారాజు పేర్కొనదగినవారు.

# అనుబంధం – 2
# రచయితతో పరిశోధక విద్యార్థి ముఖాముఖి

## అనుబంధం – 2

## రచయితతో పరిశోధక విద్యార్థి ముఖాముఖి

**1 ప్ర: సాహితీ ప్రక్రియలన్నింటిలోకి మీకు నచ్చిన ప్రక్రియ ఏది?**

**జవాబు:**సాహితీ ప్రక్రియలన్నింటిలో నాకు నచ్చిన ప్రక్రియ కవిత్వం.

**2 ప్ర: మీ తొలి కవితా సంపుటి "గుడిసె గుండె" కదా! మీకు అలాంటి శీర్షిక ఎందుకు, ఎలా తోచింది?**

**జవాబు:**అలాంటి శీర్షిక ఎందుకు తోచింది అంటే నేను ప్రగతిశీల దృక్పథంలో రచనలు చేస్తున్నవాణ్ణి గనుక, అణచివేతను నిరసించిన వాణ్ణి గనుక అలాంటి శీర్షిక ఎన్నుకోగలిగాను. అధికారికంగా నేను ఏ సంఘంలో సభ్యుణ్ణి కాకపోయినప్పటికి, వామపక్ష ధోరణిలో నడిచిన అభ్యుదయ, సృజన, అరుణతార, ప్రజాసాహితీ వంటి పత్రికలన్నీ నా రచనలను విరివిగా ప్రచురించాయి. ఓ రోజు కె. శివారెడ్డి గారు, నేను కలిసి ఖైరతాబాద్, బషీర్బాగ్, గన్ఫౌండ్రి అంతా తిరిగాం, కాళ్ళు నొప్పి పెట్టి, రాత్రి ఏడు గంటలకు ఓ అరుగు చూసుకుని కూలబడ్డాం. "నాన్న! నీ కవితలు శీర్షికలు చెప్పు" అన్నారు శివారెడ్డి. నేనో పది చెప్పాను. "గుడిసె గుండె" అని చెప్పే సరికి చాలు! ప్రాబ్లం తీరిపోయింది నాన్నా! నీ సంపుటికి అదే పేరు "గుడిసె గుండె" సింబాలిక్గా బావుంది! అన్నారు.

**3 ప్ర: కవిగా, కథకుడుగా, కాలమిస్టుగా, అనువాదకుడుగా, పాపులర్ సైన్స్ రచయితగా, రేడియో నాటక కర్తగా, వ్యాసకర్తగా లబ్ధ ప్రతిష్టులైన మీరు, మీ తొలి రచనానుభవాలను వివరిస్తారా?**

**జవాబు:** బాల్యంలో చందమామ, బాలమిత్ర పత్రికల్లోని గేయాలు నన్ను ఎక్కువగా ఆకర్షిస్తూ ఉండేవి. అలా రాయగలగాలని నాకు తెలియకుండానే ప్రయత్నిస్తూ ఉండేవాడిని. రాసి పడేసిన కాగితాలను మా అమ్మ ఇల్లు ఊడ్చేటప్పుడు తీసి జాగ్రత్త చేసేది. నల్లగొండ జిల్లా చాద గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో అక్కడి ఉపాధ్యాయులు శ్రీయుతులు యం. ప్రభాకరరావు, టి. స్వామినాథన్, టి. శ్రీనివాస్, బి. మల్లికార్జునరావుల ప్రోత్సాహం వల్ల 1965లోనే హైస్కూల్ గోడ పత్రికకు సంపాదకుడినయ్యాను. నారాయణగూడ, హైదరాబాద్ న్యూసైన్స్ కాలేజీలో పి.యు.సి.లో చేరినప్పుడు శ్రీయుతులు మంజుశ్రీ, పోరంకి దక్షిణామూర్తి, అరిపిరాల విశ్వంల ప్రోత్సాహం లభించింది. నా పదహారవయేట కళాశాల వార్షిక సంచిక "విజ్ఞాన్"లో మొదటి కవిత్వం అచ్చయింది. పద్దెనిమిదవ యేట ఆకాశవాణి కేంద్రం నుంచి తొలిసారి స్వీయ కవితా కథనం

ప్రసారమైంది. ఆ తర్వాతి సంవత్సరమే "ఆంధ్రప్రభ" వారపత్రికలో నా మొదటి కథ "గడ్డిపూవు" ప్రచురింపబడింది. ఇరవయ్యవయేట "భారతి" పత్రికలో వ్యాసాలు అచ్చయ్యాయి. ఇరవై రెండవ యేట "ఆంధ్రజ్యోతి" వీక్లీ కథల పోటీలో బహుమతి వచ్చింది. ఇరవై మూడవ యేట తెలంగాణ జీవద్భాషలో "గుడిసె గుండె" మొదటి కవితా సంపుటి వెలువరించగలిగాను.

**4 ప్ర: సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఎన్నో రచనలు చేసిన మీకు నచ్చిన రచనలు, మీకు పేరు తెచ్చిన రచనలు ఏవి?**

**జవాబు:**నచ్చిన రచనలు ఎన్నిక చేసి చెప్పడం కష్టం. అయితే మంచి గుర్తింపునిచ్చిన రచనలు కొన్ని ఉన్నాయి. అవన్నీ నాకు నచ్చినవే! తొలి దశలో "ఊల్లెకు గాదొచ్చింది, ఉర్కిరాంౠడి ఉర్కరాంౠడి" అనే కవిత, "పాలు ఎర్రబడ్డాయి" కథ, భారతి సాహిత్య పత్రికలో జానపద సాహిత్యంపై వెలువడ్డ వ్యాసాలు చెప్పుకోవచ్చు. ఆ తర్వాత "గాయపడ్డ ఉదయం", "కవితా భారతి" సంపుటాలకు మంచి ఆదరణ లభించింది. తెలంగాణ ప్రజల భాషలో రాసిన "బయిరూపులోల్లం" కవిత అనేక భారతీయ భాషల్లోకి వెళ్ళింది. ఇవన్నీ నాకు మంచి పేరు తెచ్చినవే!

**5 ప్ర: ఏ సాహిత్య ప్రయోజనమైనా ప్రజల హితం కోసమే అయినప్పుడు ఇన్ని ఉద్యమాలు, వాదాలు ఎందుకు?**

**జవాబు:**ఒక గమ్యాన్ని చేరడానికి అనేక మార్గాల్లో అనేక వాహనాల్లో ప్రయాణిస్తారు కదా! ఇది అంతే. ఆలోచన ధోరణులు వేరైనప్పుడు వేర్వేరు వాదాలు తప్పవు. దేనిలో ఎంత మంచి ఉంది అనేది కాలం నిర్ణయిస్తుంది.

**6 ప్ర: తెలంగాణ మాండలికంలో మీరు కథలు, కవితలు రాయడానికి గల కారణాలు ఏమిటి? మాండలికంలో రాయడం అసలైన భాషను వక్రీకరించినట్టు కాదా?**

**జవాబు:**తెలంగాణ మాండలికంలో కవితలు, కథలు రాయడానికి, తొలి సంపుటాలు తేవడానికి కారణం ఏమిటంటే నేను తెలంగాణలో పుట్టి పెరిగిన వాణ్ణి కాబట్టి మాండలికంలో రాయడం భాషను వక్రీకరించడం ఎంత మాత్రం కాదు. ఏ మాండలిక రచన అయినా ఓ పట్టాన అనువాదానికి లొంగదు. జీవద్భాషను గురించిన ప్రసక్తి వచ్చింది గనుక, ఈ సందర్భంగా ఒక విషయం చెప్పాలి. వ్యాపార సినిమాలలో తక్కువ స్థాయి పాత్రలలో తెలంగాణ మాండలికం మాట్లాడించి, నాసిరకం హాస్యం పండిస్తున్న సినీ నిర్మాత, దర్శకుల ప్రయత్నాల్ని నేను తీవ్రంగా నిరసిస్తున్నాను. అలాంటి ప్రయత్నాల వల్ల తెలంగాణ ఔన్నత్యాన్ని తగ్గించలేరు.

**7 ప్ర: తెలుగు వచన కవిత్వంలో తెలంగాణ మాండలికం ప్రవేశపెట్టి, దానికి విస్తృత ప్రచారం తెచ్చిన కవిగా మీకు గుర్తింపు ఉంది. అసలు ప్రజల భాషలో కవిత్వం రాయడం ఎప్పుడు, ఎలా ప్రారంభమైంది?**

**జవాబు:**బి.యస్.సి. విద్యార్థిగా కాలేజీ మెట్లు ఎక్కి దిగుతున్న రోజుల్లో అంటే చదువు అశ్రద్ధ చేసి, బుద్ధిగా కవిత్వం రాయడం ప్రారంభించిన రోజుల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం (1960–70) ఏర్పడింది. అప్పటికే ఆంధ్రప్రభలో నా కథలు అచ్చయ్యాయి. ఆకాశవాణిలో కవితలు ప్రసారమయ్యాయి. అందువల్ల విరసం కార్యదర్శి అడపా రామారావు నన్నో యువకవి సమ్మేళనానికి తీసుకుపోయారు. అక్కడ శశాంక, రావూరి భరద్వాజ, యువకవులు సుధామ, రఘుశ్రీ, ఉమాకాంత్, చిత్రపు శాంత, కె.బి. లక్ష్మి ఇంకా చాలామంది పరిచయమయ్యారు. ఆ సమ్మేళనంలో నేను బితుకు బితుకుగా చదివిన "బతుకు కొస" అనే కవిత ఎన్నో ప్రశంసలందుకుంది.

**8 ప్ర: టీనేజ్లో మాండలిక కవితలు రాయడం ప్రారంభించారు కదా! దానికి ఆనాటి ప్రముఖ కవులు, రచయితలు ఎలా స్పందించారు? ఎలా ప్రోత్సహించారు? ఎవరైనా విమర్శించారా?**

**జవాబు:**వచన కవిత తెలంగాణ భాషలో కూడా రాయడం కుందుర్తి గారికి, శీలా వీర్రాజు గారికి సంతోషం కలిగించింది. ఆ రోజుల్లో ప్రతి ఆదివారం ఏదో ఒక చోటు సాహితీ సంస్థలు సమావేశాలు ఏర్పాటు చేసేవి. దాదాపు అన్నింటిలో నేను పాల్గొంటూ ఉండేవాణ్ణి. విరసం వార్షిక సంచిక పాలకోడేటి సత్యనారాయణరావు నేతృత్వంలో వెలువడ్డ "జ్యోత్స్న" (1970–71)లో నా కవిత "ఉగాదుర్కొచ్చింది" అచ్చయింది. ప్రథమ వార్షిక సమావేశాల సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్లో నేను చదివిన ఆ కవిత సాహితీప్రియులకు బాగా నచ్చింది. ఆ తర్వాత నేను ఏ కవి సమ్మేళనంలో పాల్గొన్నా ఆ కవిత (ఉగాదుర్కొచ్చింది) కవిత కావాలని శ్రోతలు అడిగేవారు. ఒక ప్రామిసింగ్ పొయెట్ కనిపిస్తున్నాడని అభినందించారు ఆరుద్ర.

మాండలిక కవిత రాయమని ప్రోత్సహిస్తూ రాజమండ్రి నుండి ప్రముఖ కవి రంధి సోమరాజుగారు ఉత్తరాలు రాస్తుండేవారు. ఆయన కవితా సంపుటి "ఎదగండి" పంపారు. అది చూసిన తర్వాత నాకు కూడా పుస్తకం వేయాలనిపించింది. తెలంగాణ ప్రజల భాషలో వచన కవితా సంకలనం రాశారు కాబట్టి వెంటనే వేయడం మంచిదని కవి మిత్రులు కె. శివారెడ్డిగారు సూచించారు.

**9 ప్ర: సాహితీ రంగంలో బహుముఖ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శిస్తున్న మీకు లభించిన సన్మానాలు, సత్కారాల వల్ల తృప్తి పడుతున్నారా?**

**జవాబు:**నా కృషి నేను చేసుకుంటూ పోతున్నాను. ఎవరి నుంచి ఏమీ ఆశించడం లేదు. అయితే నిరంతరం సమాజం గురించి ఆలోచించే రచయితలకు సమాజం ఇచ్చే గుర్తింపు కూడా అవసరం. అవార్డుల వల్ల, సత్కారాల వల్ల నాకు తృప్తి కలగదు. అసంతృప్తి రెట్టింపవుతుంది. బాధ్యతతో చెయ్యాల్సినంత సాహిత్య కృషి చేస్తున్నానా అనే ప్రశ్న మొలకెత్తుతుంది.

**10 ప్ర: అనువాద రంగంలో విస్తృతంగా కృషి చేసిన మీరు, ఈ రంగంలో ఎంత దూరం వచ్చారని అనుకుంటున్నారు?**

**జవాబు:**ఎంత దూరం అంటే చెప్పడం కష్టం. ఎంతటి సాహితీ ప్రముఖులకైనా ప్రతి రచన, ప్రతి అనువాదం (ప్రతి అనువాద రచన) తొలి అడుగు లాంటిదేనని నా భావన. నాకు కూడా అంతే. అయితే ప్రతి అనువాదం ఒక కొత్త కిటికీ అయి, ఒక కొత్త గాలి, కొత్త వెలుతురు ప్రసరింపజేస్తే ఏ భాషా సాహిత్యమైనా పరిపుష్టి చెందుతుందనే ప్రగాఢ విశ్వాసంతో ఉన్నవాణ్ణి.

**11 ప్ర: మీరు అనువాదం చేయడానికి స్ఫూర్తి ఏది?**

**జవాబు:**మానవతా విలువలు ప్రపంచ వ్యాప్తంగా భాషలు, సాహిత్యాలు వేరు వేరు కావచ్చు కాని వాటిలో ఉన్న మానవతా విలువలు ఒక్కటే. వాటిని తెలుసుకోవడానికి, మరొకరికి తెలపడానికి అనువాదాలు అవసరమవుతున్నాయి. అనువాదమయ్యే ప్రపంచ వార్తలు మనకు చేరుతున్నాయి. అనువాదమయ్యే పత్రికల్లో, టీవీ ఛానళ్లలో సీరియళ్ళు నడుస్తున్నాయి.

అనువాదమయ్యే సినిమాలు మనకు అందుతున్నాయి. అసలు ఇది అనువాద ప్రపంచం అనడంలో సందేహమే లేదు.

**12 ప్ర: గద్యం కన్నా పద్యం అనువదించడం చాలా కష్టం అని చెబుతారు. అందులో కవిత్వం ఎన్నో రకాలుగా ఉంటుంది. పద్యం, వచన కవిత, గేయం, గజల్, హైకు వంటివి. మీ అనువాదంలో వాటిని ఎలా తెలుగు చేశారు?**

**జవాబు:**మూల కవితలో ఎలా ఉంటే అలాగే చేశాను. శైలి, పదాల విరుపు, పొయెటిక్ మూడ్ అన్ని జీర్ణించుకునే అనువదించాను. మరాఠీ కవితలు కొన్ని మాండలికంలో ఉంటే నేను వాటిని కూడా నాకు తెలిసిన తెలంగాణ మాండలికంలోకి మార్చాను. మూల కవిత సంభాషణ రూపంలో ఉంటే నేను అలాగే చేశాను. మీరన్నట్లు గద్యం కన్నా పద్యం అనువదించడం కష్టమే. చాలెంజ్గా ఉంటుంది.

**13 ప్ర: డాక్టర్ పరుచూరి రాజారాం పేరు మీద అవార్డు అందుకున్నారు కదా! రాజారాంగారితో మీకు పరిచయం ఉందా? ఈ అవార్డు తీసుకోవడం మీకు ఎలా అనిపించింది?**

**జవాబు:**ప్రతి గుర్తింపు కొంత సంతృప్తినిస్తుంది. రాజారాం సాహితీ సత్కారం అందుకోవడం గొప్ప సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చింది. రాజారాంగారు వృత్తిరీత్యా ఎంతో నిజాయితీ గల వైద్యులు, రచయితగా కూడా అంతే నిబద్ధత గలవారు. ఇటు సృజనాత్మక రచనలు, అటు సైన్స్ రచనలు సమానంగా చేసినవారు. కాకినాడ, భీమవరం సాహిత్య సభల్లో (1980) నాకు ఆయనతో కలిసి పాల్గొనే అవకాశం కలిగింది. ఆయన "అవయవాల ఆత్మకథ" పుస్తకంపై ఒక దినపత్రికలో నేను సుదీర్ఘమైన సమీక్ష రాశాను. దానిపై ఆయన స్పందన కూడా నాకు తెలియజేశారు. రాజారాంగారి మరణానంతరం వారి కూతుళ్లు పూనుకొని ఆయన పేరు మీద అవార్డు నెలకొల్పడం స్మారకోపన్యాసం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం.

**14 ప్ర: సాహిత్య రంగం, వైజ్ఞానిక రంగం రెండు వేరు వేరు కదా! ఈ రెండింటిని మీరు ఎలా కలుపుకుపోతున్నారు?**

**జవాబు:**పైపైన చూసేవారికి రెండు వేరు వేరు రంగాలని అనిపిస్తాయి. కానీ లోతుగా పరిశీలిస్తే రెండు మనిషి మనుగడకు అవసరమైనవే. వృత్తిరీత్యా అధ్యాపకుణ్ణి, ప్రవృత్తిరీత్యా కవిని, రచయితను. ఈ రెండు సమాజాన్ని మంచి వైపు నడిపించగలిగేవి. రెండింటి బాధ్యత ఒక్కటే. ఆ అంతస్సూత్రాన్ని అర్థం చేసుకోవడం ఇవి రెండు భిన్నమైన రంగాలని అనిపించవు. మనిషి మనిషిగా నిలబెట్టేందుకు వైజ్ఞానిక రంగం దోహదపడుతుంది. మనిషిలో మంచితనాన్ని నిలబెట్టేందుకు సాహిత్య కళారంగాలు పూనుకుంటాయి. మనిషి చంద్రుడి మీద కాలు మోపక ముందే, సాహిత్యకారులు ఆ విషయాన్ని ఊహించి రచనలు చేశారు. "Love's Labour's Last" నాటకంలో షెక్స్పియర్ చీడ పట్టిన గింజ మొలకెత్తదు అన్నాడు. ఆ మాట ఆధారంగా జీవశాస్త్రవేత్తలు వృక్షపరాన్నజీవుల అన్వేషణలో ప్రారంభించారు. ఈ విధంగా ఒకదాని మీద ఒకటి ఆధారపడ్డవే. దేనితోను సంబంధం లేకుండా ఏ రంగం ఉండవు.

**15 ప్ర: మీ సాహిత్య కృషికి తగిన గుర్తింపు లభించిందనే భావిస్తున్నారా?**

**జవాబు:**కొద్దిపాటి పరిచయాల్ని కూడా అద్భుతంగా తమకు అనువుగా మలచుకొని, ప్రతి దానికి ప్రయత్నాలు చేసుకుంటున్న సమకాలీన సమాజంలో అలాంటి వాటికి దూరంగా బతికే నా తోటి వాడికి ఈ మాత్రమైనా గుర్తింపు లభించిందంటే అది చాలా ఎక్కువ అని భావిస్తున్నాను.

నమస్కారం.

ఇంటర్వ్యూ,

21/08/2018.

# ఉపయుక్త గ్రంథసూచి

**ఉపయుక్త గ్రంథసూచి**


1. అరుణ కుమారి, జి. 1987. ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం – *విభిన్న ధోరణులు*. ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్. హైదరాబాద్.
2. కులశేఖరరావు & కుసుమాబాయి. 2001. సాహిత్య పరిశోధన పద్ధతులు. నవయుగ ప్రచురణలు. హైదరాబాద్.
3. కృష్ణమూర్తి, భద్రిరాజు (సం.). 1985. తెలుగు భాషా చరిత్ర. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.
4. గంగాధర్, ఎం. 1994. ఆధునిక తెలుగు కవిత్వ విప్లవ ధోరణులు – *ఒక విశ్లేషణ.*
5. చంద్రశేఖర్, ఎస్జీడి. 1985. వచన కవిత్వం – *కుందుర్తి పాత్ర.* ఎస్జీడి పబ్లికేషన్స్. తిరుపతి.
6. జయప్రకాశ్, ఎస్. 2018. పరిశోధన విధానం. నవచేతన పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్.
7. తిరుమల, ఆచార్య (సం.). 1981. ఆధునిక కవిత – అభిప్రాయ వేదిక. కిన్నెర పబ్లికేషన్స్. హైదరాబాద్.
8. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. 2016. తెలుగు అకాడమీ. హైదరాబాద్.
9. తెలుగు కథా రచయితలు. 1982. సాహిత్య అకాడమీ. హైదరాబాద్.
10. త్రివేణి, వి. 2012. ముదిగంటిసుజాతారెడ్డి రచనలు – *సమగ్ర పరిశీలన*. కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్. హైదరాబాద్.
11. దక్షిణామూర్తి, పోరంకి. 1988. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాద్.
12. ద్వానా శాస్త్రి. 2015. తెలంగాణ సాహిత్య రత్నాల వీణ. నీల్కమల్ పబ్లికేషన్స్. హైదరాబాద్.
13. నరసింహం, కె.వి.ఆర్. 1978. ఆధునికాంధ్ర కవితా సమీక్ష. గంగాధర పబ్లికేషన్స్. విజయవాడ.
14. నరసింహం, కె.వి.ఆర్. 1985. సాహిత్య దర్శనం. గంగాధర పబ్లికేషన్స్, రామ మందిరం వీధి. విజయవాడ.
15. నాగభూషణ శర్మ, మొదలి. 1971. తెలుగు నవలా వికాసం. నాట్య కళా ప్రెస్. హైదరాబాద్.
16. నాగయ్య, జి. 2004. తెలుగు సాహిత్య సమీక్ష. 1.2 సంపుటాలు. నవ్య ప్రచురణలు. తిరుపతి.

17. నారాయణరావు, వెల్చేరు. 1978. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. విశాలాంధ్ర పబ్లికేషన్స్. విజయవాడ.
18. నారాయణరెడ్డి, సింగిరెడ్డి. 2011. ఆధునికాంధ్ర కవిత్వం – *సంప్రదాయాలు, ప్రయోగాలు.* విశాలాంధ్ర పబ్లికేషన్స్. హైదరాబాద్.
19. పాపారావు, జయంతి. 2013. రావిశాస్త్రి కథానిక యాత్ర – *తత్వ దర్శనం.* తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.
20. ప్రజా సాహితీ, సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక. 2013. ఫిబ్రవరి.
21. ప్రజా సాహితీ, సాహిత్య సాంస్కృతికోద్యం మాసపత్రిక. 2013. మే.
22. ప్రజా సాహితీ, సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక. 2014. జనవరి.
23. ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. తెలంగాణ సాహిత్య అకాడమీ. హైదరాబాద్.
24. ప్రతాపరెడ్డి, సురవరం. 1996. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. ఓరియంటల్ లాఙ్మన్ లిమిటెడ్. హైదరాబాద్.
25. ప్రభాకర్, ఏ.కె. 2002. తెలుగులో మాండలిక కథా సాహిత్యం. విశాలాంధ్ర ప్రచురణలు. హైదరాబాద్.
26. భీంసేన్ నిర్మల ఆచార్య. 2012. అనువాద శాస్త్రం. తెలుగు అకాడమీ. హైదరాబాద్.
27. మంజులత, ఆవుల (సం.). 2012. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు – ధోరణులు. తెలుగు అకాడమీ. హైదరాబాద్.
28. మహారాజు, దేవరాజు. 1990. గాయపడ్డ ఉదయం. శ్రీ బాలాజీ ఆర్ట్ ప్రింటర్స్, చిక్కడపల్లి. హైదరాబాద్.
29. మహారాజు, దేవరాజు. 2011. ఆవరణం. విశాలాంధ్ర పబ్లికేషన్స్. హైదరాబాద్.
30. మహారాజు, దేవరాజు. 2011. జీవితమే ఒక కవిత. విశాలాంధ్ర పబ్లికేషన్స్. హైదరాబాద్.
31. మహారాజు, దేవరాజు. 2017. ప్రయోజన సినిమా. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. విజయవాడ.
32. మహారాజు, దేవరాజు. 1974. గుడిసె గుండె. జీవన ప్రచురణలు. హైదరాబాద్.
33. మహారాజు, దేవరాజు. 1977. కడుపు కోత. చైతన్య ఆర్గనైజర్స్. హైదరాబాద్.
34. మహారాజు, దేవరాజు. 1993. పాలు ఎర్రబడ్డాయి. జీవన ప్రచురణలు. హైదరాబాద్.

35. మహారాజు, దేవరాజు. 2008. మంచి ముత్యం. జీవన ప్రచురణలు. హైదరాబాద్.

36. మహారాజు, దేవరాజు. 2009. మూఢనమ్మకాల్ని వదిలిద్దాం. జనవిజ్ఞాన వేదిక. హైదరాబాద్.

37. మహారాజు, దేవరాజు. 2014. కవిత్వంలో సమాంతర రేఖల – *సంక్షోభాలు.* జీవన ప్రచురణలు. హైదరాబాద్.

38. మహారాజు, దేవరాజు. 2014. భారతీయ కథా ప్రతిబింబం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్.

39. మహారాజు, దేవరాజు. 2017. మానవవాదం – *జీవన నినాదం.* నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్.

40. మహారాజు, దేవరాజు. 2018. విశ్వకథా సాహితి. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. విజయవాడ.

41. మహారాజు, దేవరాజు. 2018. ఆరుబయట ఆకాశం కోసం. జీవన ప్రచురణలు. హైదరాబాద్.

42. మహారాజు, దేవరాజు. 1991. కవితా భారతి. జీవన ప్రచురణలు. హైదరాబాద్.

43. మహారాజు, దేవరాజు. 1993. దేవరాజు మహారాజు కథలు. జీవన ప్రచురణలు. హైదరాబాద్.

44. రంగానాథాచార్యులు, కె.కె. 2005. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.

45. రమణయ్య, కడప (సం.). 2011. తెలుగు కరదీపిక. ద్రావిడ విశ్వవిద్యాలయం. కుప్పం.

46. రమణాచారి, కె.వి. 2009. పద్య కవిత్వం*:* వస్తు వైవిధ్యం, సాయి లిఖిత ప్రింటర్స్. హైదరాబాద్.

47. రవీందర్, పసునూరి. 2016. తెలంగాణ ఉద్యమ పాట ప్రాదేశిక విమర్శ. తేనా పబ్లికేషన్స్. హైదరాబాద్.

48. రామకృష్ణ, మిరియాల. 1960. శ్రీశ్రీ కవిత్వం – *వస్తువు సంవిధానం.* లక్ష్మీదేవి నగర్. కాకినాడ.

49. రామచంద్రారెడ్డి, రాచమల్లు. 1987.అనువాద సమస్యలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్. హైదరాబాద్.

50. రామమోహనరావు, అద్దేపల్లి. 1980. కుందుర్తి కవితా వైభవం. యువభారతి సాంస్కృతిక సంస్థ. సికింద్రాబాద్.
51. రామమోహన్ రాయ్, కడియాల. 1982. తెలుగు కవితా వికాసం. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ. హైదరాబాద్.
52. రామానుజరావు, దేవులపల్లి. 1978. నా సాహిత్యోపన్యాసాలు. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.
53. రామారావు, ఎస్వీ. 1999. తెలుగులో సాహిత్య విమర్శ. పసిడి ప్రచురణలు. హైదరాబాద్.
54. రామారావు, ఎస్వీ. 2015. తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం. చిత్రలిపి ప్రింటర్స్. హైదరాబాద్.
55. రామారావు, కాళీపట్నం. 1990. కథాకథనం. విజయవాడ.
56. లక్ష్మీకాంతం, పింగళి. 1976. ఆంధ్ర సాహిత్య చరిత్ర. మాధవి బుక్ సెంటర్. హైదరాబాద్.
57. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017. సాహిత్య పరిశోధన కళఃవిధానం. హిమాలయ గ్రాఫిక్స్. హైదరాబాద్.
58. వసునందన్, రావికంటి. 1990. ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం – *విశ్వంభర విలక్షణత.* జగ్గమాంబపబ్లికేషన్స్. హైదరాబాద్.
59. వెంకటరామారావు, జి. 1989. తెలంగాణలో విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర. గాయత్రీ పబ్లిషర్స్. హైదరాబాద్.
60. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994. కథా శిల్పం. విశాలాంధ్ర ప్రచురణలు. హైదరాబాద్.
61. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలా శిల్పం. విశాలాంధ్ర ప్రచురణలు. హైదరాబాద్.
62. వెంకటేశ్వరరావు, దార్ల. 2007. మల్లవరపు జాన్ కవిత్వంలో మాధుర్యం. సాహిత్య కౌముది.
63. వేంకటావధాని, దివాకర్ల. 2000. సాహిత్య సోపానములు. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.
64. వేంకటావధాని, దివాకర్ల. 2001. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.

65. వేంకటేశ్వర్లు, ఉన్నం. 2015. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర. ఉన్నం బ్రదర్స్ పబ్లికేషన్స్. హైదరాబాద్.
66. వేంకటేశ్వర్లు, బూదాటి. 2012. తెలుగు సాహిత్య ప్రక్రియలు – *ధోరణులు.* హిమకర్ పబ్లికేషన్స్. హైదరాబాద్.
67. వేణుగోపాల్, ఎస్. 2000. కథా సందర్భం. స్వేచ్ఛా సాహిత్య పబ్లికేషన్స్. హైదరాబాద్.
68. శరత్ జ్యోత్స్నారాణి, యస్. 1994. డా॥యస్.టి. జ్ఞానానంద కవి జీవితం. వాఙ్మయ సూచి. స్వంత ప్రచురణలు. హైదరాబాద్.
69. శారద, అవధానం. 1990. తిలక్ అమృతం కురిసిన రాత్రి శైలీ పరిశీలన (అముద్రిత వ్యాసం). హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
70. శార్వరి. 1992. కథలెలా రాస్తారు. హైదరాబాద్.
71. శ్రీకాంత శర్మ, ఇంద్రగంటి. 1978. సాహిత్య పరిచయాలు. నవోదయపబ్లికేషన్స్. ఏలూర్ రోడ్. విజయవాడ.
72. శ్రీకాంత శర్మ, ఇంద్రగంటి. 1978. సాహిత్య పరిచయాలు. నవోదయపబ్లికేషన్స్. ఏలూరు రోడ్. విజయవాడ.
73. శ్రీనివాసరావు, జి. 2005. బి.ఎన్.రెడ్డి కవిత్వం – *మానవతావాదం* (అముద్రిత వ్యాసం). హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
74. శ్రీహరి, రవ్వా. 2015. తెలంగాణ మాండలికాలు కావ్య ప్రయోగాలు. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.
75. సమాలోచనం (ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలపై సమీక్ష). 1980. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ. సైఫాబాద్. హైదరాబాద్.
76. సాంబమూర్తి, దహగాం. 2018. భాషా విద్య. తెలుగు అకాడమీ. హైదరాబాద్.
77. సుజాతారెడ్డి, ముదిగంటి. 2015. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.
78. సుదర్శనం, ఆర్.ఎస్. సాహిత్యంలో దృక్పథాలు. నవోదయపబ్లికేషన్స్. ఏలూరు రోడ్. విజయవాడ.
79. సుబ్రహ్మణ్యం, జి.వి. 1996. ఆంధ్ర సాహితీ సమాలోచనం. షష్టిపూర్తి ప్రచురణలు. హైదరాబాద్.

# ప్రచురితమైన పరిశోధన పత్రాలు

RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

**Journal of Telugu Literary, Culture & Language Study**

Vol : 16 Issue No. 11(1) Monthly November 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500






మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 11(1) - November 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. శాసనాలు - అధ్యయనం (మొదటి భాగం) | - ఆచార్య జి. అరుణ కుమారి | 6 |
| 2. క్రీడాభిరామంలో మంచన శర్మ - శ్రీనాథుని రేఖాచిత్రం | - డా॥. వి. పళని | 12 |
| 3. గుర్రం జాషువా 'నేతాజీ' | - డా. కె.ఎన్. సుందరేశ్వరరావు | 17 |
| 4. రావూరి కథలు పరిశీలన | - డా. ఇ. వాసు | 23 |
| 5. అక్కినేని కుటుంబరావు నవలా సాహిత్యం - వస్తువైవిధ్యం | - డా॥. బి. ఉపేంద్ర | 28 |
| 6. అలపర్తి రామకృష్ణ నవలలు - సాంస్కృతికాంశాలు | - సి. విజయలక్ష్మి | 30 |
| 7. తెలుగులో 'దళిత స్త్రీ' వాద సాహిత్యం | - డా॥. పి. ఎ. సత్యనారాయణ | 33 |
| 8. శరత్ నవలల - చలన చిత్రాలు - రస దృక్పథం | - భవానీ శంకర్ | 35 |
| 9. వేకువరాగం - హేమలత మౌనరాగం | - వెంకటేశ్వరరావు కట్టూరి | 37 |
| 10. దేవులపల్లి విశ్వనాథం ఖండకావ్యాలు - సామాజిక స్పృహ | - సూరె శ్రీనివాసులు | 40 |
| 11. కందుకూరి వీరేశలింగం సాహిత్యం - సాంఘీక దృక్పథం | - వి. వెంకటేశన్ | 43 |
| 12. పత్రికా (గోల్కొండ) ప్రావీణ్యుడు - ప్రతాపరెడ్డి | - జె. విజేందర్ | 46 |
| 13. బండి నారాయణస్వామి జీవితం, సాహిత్యం | - ఎ. సుబ్రమణ్యం | 48 |
| 14. "బంజారా పండుగలు - మానవ సంబంధాలు" | - బానోత్ స్వామి | 53 |
| 15. 'చిత్తూరు కథ' సంకలనం - రైతుల సమస్యల చిత్రణ | - డా॥ పి. జయచంద్రుడు | 56 |
| 16. దేవరాజు మహారాజు "కడుపు కోత" కథా సంపుటి విశ్లేషణ | - ధీరావత్ లక్ష్మణ్ | 60 |
| 17. ఆత్రేయ నాటకాల్లో శిల్ప విన్యాసం | - వై. దివ్య | 62 |
| 18. దళిత దృక్కోణంలో "స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్" కావ్యం | - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 66 |
| 19. మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వెలువడిన చారిత్రక గ్రంథాలు | - కె. జనార్దన్ | 72 |
| 20. జాషువా - 'శిల్పి' | - డాక్టర్ ఎం.మునిరత్నం | 76 |
| 21. 'భావన' - వస్తువిశ్లేషణ | - నూకల విజయలక్ష్మి | 80 |
| 22. మారిషస్ దేశంలో శిక్షణోపాధ్యాయుల లిఖిత దోషాలు.... | - ప్రవాసీ చిన్నయ్య | 83 |
| 23. డా॥ టి.జి.ఆర్. ప్రసాద్ గారి కథలు - మానవీయ విలువలు | - యస్. రాధిక & డా॥. పి. శ్రీనివాసులు | 91 |
| 24. అభ్యుదయ కవి - దాశరథి | - గుర్జకుంట స్వరాజ్ | 94 |
| 25. అవమానాలను ఎదిరించి నిలిచిన సత్యవాడ సోదరీమణుల 'అమ్మమ్మ ఆశయం' | - యద్దనపూడి దీప్తి | 97 |
| 26. కాకతీయుల కాలపు ఆర్థిక వ్యవస్థ | - డా॥ గంగు కిషన్ ప్రసాద్ | 102 |
| 27. పాలేరు నాటకం - సామాజిక చైతన్యం | - డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 108 |
| 28. తెలంగాణా కథ - వలస కుటుంబ కష్టాలు | - జి. అశోక్ | 112 |
| 29. Importance of Human Element in Machine Translation | - Dr. Bolugadde Anil Kumar | 114 |

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# దేవరాజు మహారాజు "కడుపు కోత" కథా సంపుటి విశ్లేషణ

- ధీరావత్ లక్ష్మణ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నాటక కర్త, అనువాద కుడు, కాలమిస్ట్ అన్నిటినీ మించి పాపులర్ సైన్స్ రచయిత. కవిగా అర్ధ శతాబ్ది (1960-2010) పూర్తి చేసుకున్న నిత్యకృషీవలుడు.

దేవరాజు మహారాజు 21 ఫిబ్రవరి 1951న వరంగల్లు జిల్లా, కోడూరు గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1975లో యం.యస్‌సి, 1979లో పిహెచ్.డి. తీసుకొని, వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేస్తూ, చేయిస్తూ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు జువాలజి ప్రొఫెసర్‌గా ముప్పయేళ్ళు మార్గదర్శనం చేశారు. పరాన్న జీవశాస్త్రం లోంచి సామాజిక పరాన్నజీవుల పైకి దృష్టి సారించడం, ఒక తాత్విక భూమికను రూపొందించుకుని రెండిటి మధ్య ఒక వారధిలా నిలబడగలగడం ఈయన ప్రత్యేకత.

తెలంగాణ ప్రజల భాషలో కవిత, కథ చెప్పి, మెప్పించి, కవిగా, కథకుడుగా స్థిరపడ్డారు. భారతీయ భాషల కవిత్వాన్ని, కథల్ని తెలుగులోకి అనువదించి, తెలుగు కళ్ళకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సమాంతర సినిమాను విశ్లేషించారు.

"కడుపకోత" కథా సంపుటిలోని కథలను విశ్లేషించడం ఈ వ్యాసరచన ఉద్దేశం.

"కడుపుకోత" కథ తెలంగాణ మాండలికంలో రాయబడినది. తెలుగు సాహిత్యంలో మాండలికాన్ని మొదట ప్రవేశపెట్టింది గురజాడ అప్పారావు. తొలిసారిగా మాండలికంలో కథలు రాసిన వారు మాధవపెద్ది గోఖలే. తెలంగాణ మాండలికంలో కథలు రాయడానికి పూనుకున్న తొలి రచయిత వట్టికోట ఆళ్వార్‌స్వామి. ఆకాలంలో గూడూరు సీతారాం, సురమౌళి, యశోదారెడ్డి మొదలైన వారు తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ఆ భాషలో కథలు రాశారు. తర్వాత అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.ఎస్.రాములు, రఘోత్తమ రెడ్డి, పడాల రాములు మొదలైన వారు ఈకోవలోకి వస్తారు.

'కడుపుకోత' కథ ఈవిధంగా మొదలవుతుంది. "కమలమ్మను దావాఖాన్ల శరీకు జేశింద్రు. దానికి కడుపు నొప్పి. ఇయ్యాల్లనా, నిన్ననా ఎన్నొద్దుల్నించి అగోరిస్తాంది. మంత్రాలు, తాయిత్తులు ఎన్ని గట్టినా తక్వగాలే. ఎందరి వైద్యులతాన మందు దిన్నా తక్వగాలె. అకాడికి అల్లుడు మంచోడు. నా బిడ్డ ఆగమ్మ పక్లోలే తల్లడిల్లుతుంటే కొంటవోయి ఉస్మానియాల ఏశిండు. పెద్ద డాక్టర్లు జూసి ఆపరేషను జెయ్యాలన్నారు." ఈరకంగా కథంతా ఒక ముసలవ్వ అనుభవంలోంచి ఆమె మాటల్లోనే సాగిపోతుంది. బిడ్డ ఆపరేషను గురించి మొదటిసారిగా హాస్పిటల్‌కు వచ్చిన ముసలవ్వ అక్కడి అన్యాయాల్ని అసహ్యించుకుంటుంది. ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటపడ్డ ఆమె కూతురు కమలమ్మ మెళ్ళో పుస్తెలతాడు మాయమవడం ఇందులోని ఇతివృత్తం.

కడుపుకోత కథ మహానగరంలోని ఆసుపత్రి వాతావరణంలో చిత్రిస్తే, "కండ్లు దెరిశిన నెత్తురు" కథ తాలూకా స్థాయిలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకుంటున్న ఫేక్ డాక్టర్స్ దొంగవైద్యుల మోసాల్ని వెల్లడించింది. "మంత్రం, చీకటి పడుతుంది" కథలు గ్రామ స్థాయిలో వైద్య విధానపు స్వరూప స్వభావాల్ని తెలియజేస్తాయి. అమాయక ప్రజలు మందుల ఖర్చులు భరించలేక మంత్రాలకుపోతే, మంత్రగాడు అంతకంటే ఎక్కువ అడుగుతాడు. వైద్యం చేసే బడిపంతులు ఫీజుగా డబ్బులు అడగడు. ఎప్పటి నుండో కన్నేసి ఉంచిన సోములు భార్యను కోరుకుంటాడు. ఈవిధంగా సమాజ రుగ్మతల్ని సరైన పంథాలో డయగ్నోజ్ చేశారు రచయిత.

"కోళ్ళపందెం" కథలో దొరలు తమ రైతు కూలీలను కోళ్ళుగా భావించి, వారి మధ్య పోటీ పెట్టి ఆనందించడం

జరుగుతుంది. కోళ్ళతో ఆడుకునేది సంవత్సరానికి ఒకసారయితే, వీరితో సంవత్సరం పొడుగునా ఆడు కుంటారు. ఊరి సర్పంచ్, కరణం రాజకీయాల మధ్య గ్రామంలోని మామూలు పేదజనం ఎలా నశించి పోతున్నారనేది వర్ణించబడింది.

నిజాం నీడలో, గ్రామాల్లో సాగిన భూస్వాముల ఆగ డాలు మనకు చిల్లరదేవుళ్ళు వంటి నవలల్లో కనిపిస్తాయి. నిజాం పరిపాలన అంతమైపోయి, స్వాతంత్ర్యం లభించిన తర్వాత కూడా పల్లెలలో, పెత్తందారుల జులుం నశించి పోలేదు. వెనకటిలా దొరలమని విర్రవీగలేరు. అట్లని మామూలు ప్రజలతో కలిసిపోనూ లేరు. అట్లాంటి క్లిష్ట పరిస్థితిని "పాతగోడ" కథలో చూడవచ్చు.

దొర బంగళాకు, ఇతర గ్రామస్తులు ఇళ్ళకు మధ్య ఎత్తుగా నిలబడి ఉన్న గడిగోడ కూలిపోవడం "పాతగోడ" కథలోని ఇతివృత్తం. దొరతనం కూలిపోయిందన్న అర్థం స్ఫురించేలా రాయబడ్డ ఈ కథలో - గ్రామస్తులు రాత్రికి రాత్రే వర్షానికి తడిసి ఉన్న గడిగోడను గడిలోకి పడగొడ తారు. అంటే దొరతనాన్ని పడగొట్టారని అర్థం.

జానపద వ్యక్తీకరణ గొప్పగా ఉన్న మరో కథ "యెలుగు మింగిన శీకటి". ఇందులో ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోతే, గ్రామంలోని పటేలు ఇండ్లు కాలిన వారి దగ్గర చందాలు వసూలు చేసి ఫైరింజన్ వారికి మామూళ్ళు ఇవ్వదలచుకుంటాడు. "మూగమోసం" ఒక ప్రత్యేకమైన కథ. ఈ కథంతా రైలుబోగిలో నడుస్తుంది. రైలుబోగి సమాజానికి సంక్షిప్త స్వరూపం. సమాజంలో మోసం చెయ్యనిది ఎవరు? అందరూ ఎవరినో ఒకరిని ఏదో ఒకరకంగా మోసం చేస్తున్నవారే. జరుగుతున్న మోసాల్ని చూసి, తమకు పట్టనట్లు ఊరుకున్న వారు కూడా ఒక రకంగా మోసగాళ్ళే. ఈవిధంగా రచయిత కళ్ళెదుట ఉన్న సమాజంలోని అవకతవకల్ని తనదైన పద్ధతిలో కళాత్మకంగా చెప్పారు.

**ఆధార గ్రంథాలు :**

1. దేవరాజు మహారాజు, ఆవరణం, జీవన ప్రచురణలు, హైదరాబాద్, 2011.
2. దేవరాజు మహారాజు, కడుపుకోత, చైతన్య ఆర్గనైజర్స్, హైదరాబాద్, 1977.

RNI No. APTEL/2003/12253

# భావవీణ

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 1(1) Monthly January 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35



## సావిత్రి భాయి ఫూలే




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Literary, Culture & Language Study

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 1(1) - January 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,

4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. కాళోజి యుద్ధ కవిత్వం | - అగపాటి రాజకుమార్ | 6 |
| 2. దేవరాజు మహారాజు "మనిషి కథలు" విశ్లేషణ | - ధీరావత్ లక్ష్మణ్ | 8 |
| 3. అన్నాబాపూసాఠే కథలు - దళిత జీవితం | - డా॥ ఏటూరు జ్యోతి | 10 |
| 4. సామాజిక చైతన్యపాటలు - బతుకమ్మ పాటలు | - డా॥ బి.ఉపేంద్ర | 15 |
| 5. ఎమ్వీయల్ నవలలు - ఒక పరిచయం | - డాక్టర్ చాట్ల కిశోర్ | 18 |
| 6. సినారె కవిత్వ వీక్షణం | - డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి | 24 |
| 7. ధూర్జటి కవితా దృక్పథం | - డాక్టర్ ఇ.వాసు | 28 |
| 8. అసమర్థుడు | - డాక్టర్ జి. వెంకటరమణ | 31 |
| 9. ఆవిష్కరణ పరిధిలో సృజన, పరిశోధన, విమర్శ! | - డా॥పి.ఎ.సత్యనారాయణ | 40 |
| 10. మనుచరిత్రము సామాజిక స్పృహ - చారిత్రక నైపథ్యము | - జె. శ్యామలాదేవి | 43 |
| 11. అంతులేని వ్యథలెన్నో 'అబలా' కవిత్వంలో | - డా॥ వి. శివనాగార్జున రెడ్డి | 47 |
| 12. జీవనానుభూతుల కలబోత - అంతరంగ తరంగాలు | - డాక్టర్ వై. శ్రీలత | 50 |
| 13. జానపద సాహిత్యంలో స్త్రీ | - దుండె రాజేశ్వరి | 53 |
| 14. వట్టికోట జైలు లోపల కథలు - ప్రజా రాజకీయాలు | - కల్లెబోయిన కుమారస్వామి | 56 |
| 15. ఆదూరి సత్యవతీ దేవి కవిత్వంలోని మధుర భక్తి | - మార్కాపురపు నిర్మల కుమారి | 60 |
| 16. రాయలసీమ ఆధునిక కావ్యాలు - పరిశీలన | - ఎమ్. రంగస్వామి & డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 61 |
| 17. అడిగోపుల వెంకట రత్నం వచన కవిత్వం - మిథోపాయిల చిత్రణ | - ఎన్. వి. పద్మకుమారి | 69 |
| 18. అన్నమయ్య సంకీర్తనలు - సమకాలీన సమాజం | - డా॥. ఎస్. యజ్ఞశేఖర్ | 73 |
| 19. 19 వ శతాబ్ది తెలంగాణాలోని సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు | - డా॥. జి. కిషన్ ప్రసాద్ | 77 |
| 20. 'స్త్రీ' విద్యను కాంక్షించిన నవయుగ కవిచక్రవర్తి జాషువ | - డా॥ సంగుల సునీల్ కుమార్ | 81 |
| 21. కవిత్వంలో జీవిత విలువలు | - కె. వెంకట రమణ | 84 |
| 22. గాంధీమార్గం - ఖద్దరు ధారణ | - డా॥. వై.వి.సిహెచ్. లీల పద్మజ | 88 |
| 23. జానపద కళలు - మాతంగి సాంప్రదాయం | - పి. ఉషారాణి | 92 |
| 24. సాంస్కృతిక వైతాళికుడు - కందుకూరి | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 95 |
| 25. విశ్వనాథ నవలల్లో 'యోగం - సామాజిక స్పృహ' | - ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) | 100 |
| 26. ఆంధ్రమహాభారతంలో ధర్మవ్యాధుని ధర్మోపదేశం | - డా॥ నూనావత్ రాంబాబు & డా॥ లింగాల మంగమ్మ | 102 |
| 27. నేను తోలు మల్లయ్య కొడుకుని కథ ... ఒక పరిశీలన | - నోముల రాజు | 109 |
| 28. చిత్తూరు జిల్లా కథా సాహిత్యం - పీడిత కులదోపిడి | - యం. రాజేష్‌బాబు | 114 |

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# దేవరాజు మహారాజు "మనిషి కథలు" విశ్లేషణ

– **ధీరావత్ లక్ష్మణ్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైద్రాబాద్ విశ్వవిద్యాలయం, హైద్రాబాద్, తెలంగాణ.

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నాటక కర్త, హేతువాది, అనువాదకుడు అన్నిటినీ మించి పాపులర్ సైన్స్ రచయిత, కవిగా అర్ధశతాబ్ది (1960-2010) పూర్తిచేసుకున్న నిత్యకృషీవలుడు డా॥దేవరాజు మహారాజు.

దేవరాజు మహారాజు 21 ఫిబ్రవరి 1951న వరంగల్లు జిల్లా కోడూరు గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1975లో యం.యస్సి., 1979లో పిహెచ్.డి తీసుకొని, వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేస్తూ, చేయిస్తూ పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు జువాలజి ప్రొఫెసర్‌గా ముప్పయేళ్ళు మార్గదర్శనం చేశారు.

సాహిత్యం, సమాజ చైతన్యం, అధ్యాపకత్వం, శాస్త్రీయ దృక్పథం ఇలా ఏ రంగంలో చూసినా బహుముఖ సృజన శీలి. విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే ప్రతిభాశాలి. అధ్యాపక వృత్తిరీత్యా జీవశాస్త్రవేత్త, ప్రవృత్తి రీత్యా సాహిత్యవేత్త. రెండింటికి సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయ దృక్పథాన్ని అక్షరాల్లో ఒంపి సమాజంలో ఆలోచనల్ని పంచుతున్న మానవతా సృజనకారుడు దేవరాజు మహారాజు. ఎప్పుడు ఫ్రెంచి గడ్డంతో విలక్షణంగా కనిపించడం ఈయన ప్రత్యేకత.

సామాజిక స్వరూపాన్ని శాస్త్రీయ దృక్పథంలో విశ్లేషించి తెలంగాణ మాండలిక జీవద్భాషతో కదం తొక్కిస్తూ, కవితా పద స్పందనల్ని మన ముందుంచిన బాధ్యతెరిగిన కవి, వాస్తవికతావాది.

"దేవరాజు మహారాజు కథా సంపుటి"లోని మనిషి కథలను విశ్లేషించడం ఈ వ్యాసరచన ఉద్దేశం.

విభిన్న ప్రక్రియలలో రచనలు చేసి సాహితీ స్వర్ణోత్సవం జరుపుకున్న దేవరాజు మహారాజు గారి రచనల్లో విభిన్నత రాజసంలా కనిపిస్తుంది. భిన్నమైన ఆలోచనలతో రచించిన కథల సంపుటే "మనిషి కథలు". మనిషిలోని భిన్న కోణాలను, ఆలోచనలను, సామాజిక సమస్యలను సరికొత్తరీతిలో అందించారు. సమస్యలతో పాటు దాన్ని చెప్పే క్రమంలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని జోడించారు.

మనిషి కథలు అన్నింటికి శతకపద్యానికి మకుటంలా ఓ ముగింపు వాక్యం వుంటుంది. "మనిషి దేనికోసమో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతున్నాడు". అయితే ఈ మకుటానికి, ఆ మకుటానికి తేడా ఏమిటంటే, శతక మకుటము సంబోధన వరకే పరిమితం అయితే, ఇది కథకు ప్రతిపాదకంగా నిలుస్తుంది. మనిషి కథలన్నీ మానవ స్వభావాల చిత్రణలుగా రూపొందిన కథలు.

మనిషి కథలలో ఒక స్పష్టమైన ప్రత్యేకత కనిపిస్తుంది. శతక పద్యాలకు ఒక మకుటం వున్నట్లు, కథలను కూడా మకుటం లాంటి వాక్యంలో ముగించడం వీటిలో కనిపించే కొత్త గుణం. కథను కొంత వ్యంగ్యం, మరికొంత హాస్యం, ఇంకొంత కార్టూనిజం అన్నీ కలిపి వచన పాకాన్ని కథా మకుటంతో వడ్డించారు. ఈ కథల నాయకుడు ఎవరో ఒక పాత్రకాదు. సాధారణీకరించబడ్డ మనిషి. అందుకే మనిషి కథలు అని పేరు పెట్టారు.

మనిషి కథలుగా పేర్కొన్న కథలు గల్పికలు లాంటి రచనలు. కింగ్‌మేకర్, శుభోదయం, చర్వితచరణం, మార్నింగ్‌వాక్, లేతగడ్డి, కిస్సాకాపిక, తోసెయ్‌తోసెయ్, సయోధ్య రాముడేడి మొదలైన కథలు ఈ సంపుటిలో కలవు. "శుభోదయం" కథలో ఇల్లు ఒక అద్భుతమైతే, కిటికి పరమాద్భుతం, అది తెరిస్తే కన్ను తెరిచినట్టు ప్రపంచమంతా కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది అంటారు. నిజమే! కిటికి రేపటి ఆశల్ని, సందేహాల్ని, సమస్యల్ని, ఆలోచనల్ని, ఆనందాన్ని మనసులో కలిగించేలా చేసే చిన్న ద్వారం లాంటిది. ఉదయం లేచింది మొదలు ఆఫీసుకు వెళ్ళేలోపు జరిగిన, మెదిలిన ఆలోచనలకు మేళవింపు ఈ కథ. ఇందులో బ్రష్ చేసుకోవడానికి బాత్‌రూమ్‌కి వెళ్ళి, వాడుకుంటున్న నీళ్ళను చూసి ఎక్కడో వుండే నీళ్ళు మన అవసరాలకు పంపులోకి రావడం వంటి

సౌకర్యాల గురించి, కొడుకు రిమోట్‌తో టి.వి. ఆన్ చేయడం, రేడియోలో షహనాలు వింటూ అనుభూతిని కొలిచే సాధనం లేదనడం వంటి వాటి గురించి ఆసక్తికర అంశాలు క్లుప్తతలోనే విస్తృత సందేహాలను కలిగించి సమాధానమిస్తారు. ఇవి మనిషికి ఉపయోగపడుతున్న వైనాన్ని చెబుతూ, మనిషి కథల్లో ఎన్నో మలుపులు, విజయాలు అంటూ ముగిస్తారు.

"చర్వితచరణం" కథలో భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. పెండ్లినాడు ఆ జంట గురించి పెద్దలన్న మాటలకు భర్తలోని మరో మనిషి బయటకు వస్తాడు. అది భార్యపై ఆధిపత్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఆఫీసు మొదలు అన్నింటా బయటమాటలు, అవమానాలు, ఏమీచేయలేని భర్తలోని మరో మనిషి భార్యపై ప్రతాపం చూపిస్తారు. ఫలితం పెండ్లి నాడు "అమ్మాయి చక్కగా ఉంటుంది, చిదిమి దీపం పెట్టు కోవచ్చు" అన్న పెద్దల మాటలే నిజమౌతాయి. దీపమే మిగులుతుంది. ఈ చిరుకథలో భార్యాభర్తల మధ్య అనుబంధాన్ని చెబుతారు. ఎదుట మనిషిని అంటూ ఆనందించే మనుషులను చూపుతారు.

పర్యావరణాన్ని నాశనం చేసుకుంటే, భవిష్యత్తు ఎలా ఉంటుందో చూపుతారు "మార్నింగ్‌వాక్" కథలో. ఇది రేపటి కథ. విదేశాల నుంచి హైదరాబాదుకు వచ్చిన మనవడు తాత, బామ్మలతో మార్నింగ్‌వాక్ చేస్తుంటాడు. నాటిరోజులను తలచుకుంటూ, ట్యాంక్‌బండ్ మీద కూర్చొని, నీళ్ళలోకి చూస్తూ మాట్లాడుకునే వారి మాటలకు మనవడు ట్యాంక్‌బండ్ ఎక్కడ అని అంటాడు, కనిపిస్తున్న ప్లే గ్రౌండ్‌ను చూస్తూ. దాన్ని మేమే పూడ్చేశాములే. వినాయక విగ్రహాలు వేసివేసి, హుస్సేన్ సాగర్‌ను పూడ్చేసి, వినాయకసాగర్ చేశామని వ్యంగ్యంగా మాట్లాడిన, నేడు సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో జరిగేది అదేనని సుతారంగా హెచ్చరిస్తారు ఈ కథలో. అంతేకాదు, మనవడు వాకింగ్ గ్రౌండ్స్‌లో సిటీ అపార్ట్ మెంట్స్ కడితే, హాట్‌కేక్స్‌లా అమ్ముడుపోతాయి అంటూ తన ఐడియా కూడా చెబుతాడు. నేడు మనిషి వ్యాపార ధోరణి కొంతైనా వదిలి, పర్యావరణం, కుటుంబం, సామాజిక భద్రత, బాధ్యతల గురించి ఆలోచిస్తే, రేపటి తరంలో పర్యావరణ పరంగా, పిల్లల పరంగా మంచి చేసినవారమౌతామని చిన్న హెచ్చరిక చేస్తారు.

"లేతగడ్డి" కథలో పెద్ద తలకాయను చూసి, చిన్న తలకాయ గడ్డి కరవడం మొదలుపెడుతుంది. అంటే మనిషి ఎప్పుడూ దేనినో అనుకరిస్తూనే ఉన్నాడన్న సామాజిక వాస్తవాన్ని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో పరిశోధకుల నుండి పరీక్షలు రాసే విద్యార్థుల దాకా కాపీలు కొట్టడం మామూలైపోయింది. విద్యా విధానం కుళ్లిపోతూ, వస్తున్న మార్పులను వివరించే కథ "కిస్సా కాపిక". సంక్షోభం నుంచి సంక్షోభానికి సాగుతున్న రష్యా ప్రస్థానంలో అక్కడి ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యం లోంచి రాసిన కథ "తోసెయ్‌తోసెయ్".

"దేవుడి పేరు మీద ఒకరినొకరు పొడుచుకోవడం కొనసాగింది. శివాలయం కూలి మసీదైంది. మసీదు కూలి రామాలయమైంది. కరసేవలు, పాదసేవలు, అర్చనలు, భజనలు, ప్రేయర్లు, గుళ్ళో లేని దేవుణ్ని నిలబెట్టడానికి లక్షన్నర ఉపాయాలు! మనిషి తనను తానే కూలకొట్టుగొనే యత్నాలు!" అంటూ భారతదేశం తలవంచుకునే విధంగా 1992 డిశంబర్ 6 నాటి సంఘటన నుండి "సయోధ్య రాముడేడి" అనే కథకు రూపకల్పన చేశారు దేవరాజు మహారాజు. ఇలా సమకాలీన సమస్యలకు స్పందించిన తీరు మనిషి కథలులో స్పష్టంగా కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. దేవరాజు మహారాజు, "ఆవరణం", జీవన ప్రచురణలు, హైదరాబాద్, 2011.
2. దేవరాజు మహారాజు, "దేవరాజు మహారాజు కథలు",జీవన ప్రచురణలు, హైదరాబాద్, 1992.
3. విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, 03, ఏప్రిల్, 2016.

# జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువ పత్రాలు

బద్రుకా కామర్స్ & ఆర్ట్స్ కళాశాల, తెలంగాణ సాహిత్య అకాడమి సంయుక్త నిర్వహణలో

# ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం - వస్తు రూప వికాసాలు

# జాతీయ సదస్సు

తేది: 29, ఫిబ్రవరి 2020, ఆడిటోరియం, బద్రుకా కళాశాల, కాచిగూడ, హైదరాబాద్-27.

## ధ్రువీకరణ పత్రం

శ్రీ / శ్రీమతి / డా. ధీరావత్ లక్ష్మణ్

బద్రుకా కళాశాల, తెలుగుశాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త నిర్వహణలో "ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం - వస్తురూప వికాసాలు" జాతీయ సదస్సులో పాల్గొని / పాల్గొన్నారు. దేవరాజు మహారాజు కథలు - వస్తు విశ్లేషణ అనే అంశంపై పత్రసమర్పణ చేశారు.

సంచాలకులు
డా॥ కదిరిపండి మమత
అసిస్టెంట్ ప్రొఫెసర్, బద్రుకా కళాశాల

సహ సంచాలకులు
శ్రీమతి కె.హెచ్. నాగలక్ష్మి
అసిస్టెంట్ ప్రొఫెసర్, బద్రుకా కళాశాల

ప్రధాన సంచాలకులు
డా॥ కె. సోమేశ్వర రావు
ప్రిన్సిపాల్, బద్రుకా కళాశాల

# ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - తెలుగు & ప్రాచ్య భాషా విభాగం

యు.జి.సి. సౌజన్యంతో జాతీయ సదస్సు 13,14 మార్చి 2020

## "ఆధునిక తెలుగు, సంస్కృత వచన కవితా రూపాలు"

## ప్రమాణ పత్రం

శ్రీ / శ్రీమతి / కుమారి / డా॥ / ఆచార్య ధీరావత్ లక్ష్మణ్

కళాశాల / విశ్వవిద్యాలయం HCU ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

తెలుగు & ప్రాచ్య భాషా విభాగం నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని

దేవరాజు మహారాజు కవిత్వం - మానవతావాదం అనే అంశంపై పత్రసమర్పణ చేశారు.

తేది : 14 - 03-2020
నాగార్జున నగర్

ఆచార్య ఎన్.వి. కృష్ణారావు
సదస్సు సంచాలకులు